# HISTORY OF MODERN EUROPE (1789-1960A.D)
# (DAHIS31)
# (BA-HISTORY)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

పాఠం - 1

# 1789 వరకు ఐరోపా పరిస్థితులు

## 1.0 లక్ష్యం :

క్రీ.శ. 1789 వరకు ఐరోపా స్థితిగతుల గురించి వివరించుట ఈ పాఠం లక్ష్యం.

## విషయసూచిక :


1.1. ఉపోద్ఘాతం
1.2 భూగోళాన్వేషణలు
1.3 స్వాతంత్ర్య పునరుజ్జీవనం
1.3.1 సాహిత్యం
1.3.2 లలిత కళలు
1.3.3 వైజ్ఞానిక పరిశోధనలు
1.4 మత సంస్కరణోద్యమం
1.5 జాతీయ రాజ్యాలు
1.5.1 ఇంగ్లండ్
1.5.2 ఫ్రాన్స్
1.5.3 స్పెయిన్
1.5.4 పోర్చుగల్
1.5.5 స్కాండినేవియా రాజ్యాలు
1.5.6 రష్యా
1.6 నమూనా ప్రశ్నలు
1.7 చదువదగిన గ్రంథాలు


## 1.1 ఉపోద్ఘాతం :

ఫ్రెంచి విప్లవం ఐరోపాలోనేగాక, క్రమంగా యావత్ ప్రపంచంలోనే ఆధునిక యుగాన్ని తెచ్చిపెట్టినట్లు కనిపిస్తున్నప్పటికీ, అంతకు పూర్వమే అంటే క్రీ. శ. 1453లో తురుష్కులు కాన్‌స్టాంటినోపుల్‌ను ఆక్రమించడం, ఐరోపావాసులు భూగోళాన్వేషణలు జరపడం, సాంస్కృతిక పునరుజ్జీవనం, మతసంస్కరణోద్యమం మొదలైన సంఘటనల ప్రభావ ఫలితంగా ఐరోపా చరిత్రలో ఆధునిక యుగానికి తెరతీయడం జరిగిందని చెప్పవచ్చు.

## 1.2 భూగోళాన్వేషణలు, పరిశోధనలు :

క్రీ.శ. 1453లో తురుష్కులు కాన్‌స్టాంటినోపుల్‌ను ఆక్రమించడంతో ఐరోపా దేశాలకు ఆసియాతోగల భూ,జలమార్గాలు ముఖ్యంగా మధ్యధరా సముద్రం మూసివేయబడింది. అందువల్ల ఐరోపా దేశస్థులు ఇండియా, చైనా, సింహళం మొదలైన తూర్పు దేశాలతో వర్తక వాణిజ్యాలను కొనసాగించడానికి నూతన సముద్రమార్గాలను అన్వేషించవలసి వచ్చింది. అదీగాక క్రీ.శ. 13వ

శతాబ్దికి చెందిన వెనీసు (ఇటలీ) యాత్రికుడైన మార్కోపోలో తూర్పుదేశాల్లో పర్యటించి, అక్కడి ఐశ్వర్యాన్ని గురించి వివరిస్తూ ఆ దేశాలతో వ్యాపారం చేస్తే అపారమైన లాభాలు గడించవచ్చుని తన రచన "ట్రావెల్స్" ద్వారా తెలియజేశాడు. సరిగ్గా ఆ సమయంలోనే అలెగ్జాండ్రియా విశ్వవిద్యాలయం వారు భూమి గుండ్రంగా వుందని తమ పరిశోధనల ద్వారా నిరూపించారు. అందువల్ల పశ్చిమంగా పయనించి తూర్పుదిశగా ఉన్న చైనా, భారత్ దేశాలను జలమార్గం ద్వారా చేరుకోవచ్చునని ఔత్సాహికులైన నావికులు, వర్తకులు భావించారు. దీనికితోడు ఆనాటి శాస్త్రపరిశోధనలు, సుదూరు ప్రాంతాల్లో క్రైస్తవమతం ప్రచారం చేయాలనే తహతహ కూడా భూగోళాన్వేషణలపై ఆసక్తిని రేకెత్తించాయి.

నూతన జలమార్గాల అన్వేషణలో ముందంజవేసినవారు పోర్చుగీసువారు. పోర్చుగల్ యువరాజు డామ్‌హెన్రీ (1394 - 1460) తూర్పుదేశాలు చేరడానికి 75 సంవత్సరాలపాటు నిరంతరంగా తన కృషిని కొనసాగించాడు. ఆయన ప్రప్రథమంగా ఒక నౌకాదళ శిక్షణ పాఠశాలను స్థాపించాడు. అది అప్పటికి అత్యాధునికమైన విజ్ఞానశాస్త్రాన్ని బోధించింది. సముద్రాలపై విజయాలు సాధించడానికి సాహసించగల యువకులను సమీకరించి ఈ పాఠశాలలో శిక్షణనిచ్చేవారు. బార్తలోముడయస్ (Bartholomew Dias) తొలిసారిగా 1487లో ఆఫ్రికా దక్షిణతీరం చేరి, అక్కడ తుఫానులు ఎక్కువగా ఉండటంచేత దానికి "కేప్ ఆఫ్ గుడ్ స్టారమ్స్ (Cafe of good storms), అని పేరుపెట్టి స్వదేశానికి తిరిగి వచ్చాడు. కాని ఈ అగ్రం తూర్పుదేశాల మార్గాన్వేషణకు ఆశ కల్గించడం చేత పోర్చుగల్ రాజైన రెండోజాన్ దీనికి 'కేప్ ఆఫ్ గుడ్‌హోప్ (Cape of Good Hope) అని పేరు పెట్టాడు. తర్వాత 1497 జులై 9న వాస్కోడిగామా నాయకత్వంలో నాలుగుపెద్ద తెరచాపలున్న నౌకలు బయలుదేరాయి. వాస్కోడిగామా నవంబరు 22న గుడ్‌హోప్ చుట్టూ తిరిగి ఉత్తరదిశగా పయనించాడు. మొజాంబిక్, మొంబాసా, మలింది (కెన్యా) తదితర వాణిజ్యకేంద్రాల వద్ద ఆగాడు. ఆగ్రహించిన అరబ్బు వర్తకులు, నౌకలను వశపరచుకోవటానికి ప్రయత్నించారు. కాని మలింది రాజు స్నేహపూర్వకంగా వ్యవహరించి భారతదేశం వరకు వెళ్ళడానికి ఒక గైడ్‌ను ఏర్పాటుచేశాడు. 1498 మే నెల 27న వాస్కోడిగామా కేరళ తీరంలో కాలికట్ (కోజికాడ్) వద్ద తన నౌకలను నిలిపాడు. ఆ రోజుల్లో కాలికట్ దక్షిణభారతదేశంలో అతిముఖ్యమైన వర్తక కేంద్రం. కాలికట్ హిందూరాజైన జమోరిన్ పోర్చుగీసు నావికుడైన వాస్కోడిగామాకు స్వాగతం పలికాడు. ఆ విధంగా ఐరోపా-ఆసియాల మధ్య ప్రప్రథమ సముద్ర ప్రయాణం జరిగింది. అప్పటిదాకా తూర్పుదేశాలను ఆవరించిఉన్న పరదాలు ఒక్కసారిగా తొలగిపోయాయి.

భూగోళాన్వేషణలో పోర్చుగల్‌తో పోటీపడింది స్పెయిన్. కొలంబస్‌కు అన్నివిధాల సహాయసహకారాలనందించి అతని సాహసయాత్ర ద్వారా ఒక నూతన ప్రపంచాన్ని ఆవిష్కరించింది స్పెయిన్. ఒక పేద నేత కార్మికుని కుమారుడైన క్రిష్టఫర్ కొలంబస్ 1451లో ఇటలీలోని జెనోవా అనే నగరంలో జన్మించాడు. అతడు తన పేదరికాన్ని, విద్యావిహీనతను అధిగమించి 'సీ కెప్టెన్"గా అగ్రశ్రేణి 'జియోగ్రాఫర్"గా రూపొందాడు. అట్లాంటిక్ మహాసముద్రంలో పశ్చిమంగా ప్రయాణిస్తే జపాన్, భారతదేశాలను చేరుకోవచ్చునని గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్, గ్రీకు జియోగ్రాఫర్ స్ట్రాబో వ్రాసినట్లు తెలుసుకున్న కొలంబస్ అటువంటి సాగరయానానికై మూడు నౌకలను సమకూర్చవలసినదిగా స్పెయిన్ రాజు ఫెర్డినాండ్, రాణి ఇసిబెలాలకు విజ్ఞప్తి చేశాడు. అనేక తర్జనభర్జనల అనంతరం కొలంబస్ కోరికను మన్నించి స్పెయిన్ రాజదంపతులు అతను కోరినవన్నీ ఇవ్వడానికి అంగీకరించారు. 1492 ఆగస్టు 3న కొలంబస్ తొలిప్రయాణం ఆరంభమైనది. మొత్తం 80 మంది భుజం భుజం కలిపి నౌకలను నడిపిస్తుంటే రెండు నెలల తొమ్మిది రోజులపాటు అహర్నిశలూ అట్లాంటిక్ అలలమీద ఆగని ప్రయాణం చేశాడు. అక్టోబరు 12 నాటికి కొలంబస్ నౌక తీరాన్ని తాకింది. బహామా దీవుల వద్ద లంగరు వేసి కొలంబస్, క్రొత్త ప్రపంచానికి వాకిళ్ళు తెరచాడు. అయితే అదే ఇండీస్ అని భావించి కొలంబస్ ఆ దీవులను "వెస్ట్ ఇండీస్"గా వ్యవహరించాడు. అక్కడవారిని ఇండియన్స్ అన్నాడు. కానీ అది అమెరికా అని ఆ తర్వాత గానీ అందరికీ అర్థంకాలేదు. 1499, 1501లలో ఇటలీకి చెందిన అమెరిగో వెస్‌పూసీ అనేకమార్లు అఖండజలరాసుల మధ్య

పయనించి నూతన ప్రపంచాన్ని గురించిన విశేషాలను వెలువరించాడు. అతని పేరుమీదగానే అమెరికా ఖండాలకా పేరు వచ్చింది.

ఇంగ్లండ్ రాజైన ఏడవహెన్రీ జలమార్గాల ద్వారా కొత్త కొత్త ప్రాంతాలను చేరుకోవాలని ఉవ్విళ్లూరేవాడు. సముద్రమన్న, సముద్ర తీరాలన్న మహా ఆసక్తి ప్రదర్శించేవాడు. అతని ప్రోత్సాహంతోనే జినోవాకు చెందిన జాన్‌కాబట్ అనే నావికుడు తన నౌకలతో 1497లో ఉత్తర అమెరికాలోని న్యూఫాండ్‌లాండ్ ప్రాంతాన్ని చుట్టుముట్టి తిరిగివచ్చాడు. ఆ విధంగానే పోర్చుగీసువారి తరపున షెడ్రోకాబ్రాల్ 1500లో దక్షిణ అమెరికాలోని బ్రెజిల్‌ను కనుగొనగా, బాల్బా అనే స్పెయిన్ దేశస్థుడు పనామా జలసంధి మీదుగా ప్రయాణం చేసి ఈనాటి పసిఫిక్ మహాసముద్రాన్ని ప్రపంచానికి పరిచయం చేశాడు. ఇటువంటి సాహసకృత్యాలన్నింటిలో వాసికెక్కింది మెజెల్లన్ అనే అతను 1519లో భూమి చుట్టూ ప్రదక్షిణం చేయుటం.

భూగోళాన్వేషణల ఫలితంగానే వలస రాజ్యాలస్థాపన జరిగింది. ఇటువంటి వలసల స్థాపనలో పోర్చుగల్ ముందంజవేసి భారత్, ఆఫ్రికా, బ్రెజిల్ దేశాలలో వలసలను స్థాపించగలిగింది. "సముద్ర మార్గం ద్వారా తూర్పుదేశాలతో పోర్చుగీసు వర్తకవాణిజ్యాలు దాదాపు శతాబ్దికాలంపాటు విరజిల్లి ఆ తర్వాత క్రమంగా కనుమరుగైపోయినప్పటికీ వారి ప్రభావం మొరాకో నుంచి మలక్కా దాకా ఇప్పటికీ కనిపిస్తూనే ఉందని" మెర్లీ సెవేరీ అభిప్రాయపడ్డాడు. ఆ తర్వాత స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, హాలెండ్, ఉత్తర జర్మనీల వారు కూడా వలసరాజ్యాల స్థాపన పట్ల తమ దృష్టిని కేంద్రీకరించారు.

నూతన సముద్ర మార్గాల అన్వేషణలో ఐరోపా వారి ముఖ్యోద్దేశ్యం వర్తకవ్యాపార అభివృద్ధే కనుక వారి ఆశయం పూర్తిగా నెరవేరింది. వీరు తూర్పుదేశాలతో చేసిన సుగంధ ద్రవ్యాల వ్యాపారం బంగారం పండించింది. వాస్కోడిగామా మొదటిసారి వచ్చినప్పుడు కాలికట్ పట్టణంలో రెండుమాసాలుండి, తిరిగి వెళ్లేటప్పుడు మలబార్ ప్రాంతం నుండి కొన్ని సుగంధద్రవ్యాలను ఐరోపాకు తీసుకువెళ్ళి, వాటిని అక్కడ అమ్ముకొనగా, తనకు రానుపోను అయిన ప్రయాణఖర్చులకు అరవైరెట్లు లాభం వచ్చిందట. తూర్పుపడమరల వ్యాపారం ఎంత లాభసాటో దీనినిబట్టి తెలుస్తుంది. తాము వ్యాపారం చేస్తున్న దేశాలలో ప్రజలు క్రైస్తవమతం పుచ్చుకుండేటట్లు ప్రచారం చేశారు. అచిరకాలంలోనే అమెరికా ఐరోపావారి వలసరాజ్యం కావడమే కాకుండా క్రైస్తవమతాన్ని సంపూర్ణంగా అనుసరించింది.

వర్తక వాణిజ్యాల ద్వారా ఐరోపాలో మధ్యతరగతి వర్గం ఆర్థికంగా నిలదొక్కుకొని రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ప్రముఖపాత్ర నిర్వహించసాగింది. తమ ప్రయోజనాలను పరిరక్షించుకొనేందుకు పటిష్టమైన, శక్తివంతమైన ప్రభుత్వం అవసరమని భావించిన ఈ వర్గం నిరంకుశ రాజరికాలను బలపరిచింది. భూస్వామ్యవర్గ ప్రాబల్యం పూర్తిగా సడలింది. ఇటువంటి అనుకూలమైన పరిస్థితులలో నిరంకుశ రాజరికాలు వృద్ధిచెందాయి.

మాతృదేశ ఔన్నత్యం కోసం వ్యాపారం (Mercantalism), వలసరాజ్యాల స్థాపన మొదలైన విషయాల్లో ఐరోపాదేశాల మధ్య పోటీ తీవ్రతరం కావడంతో, ఆ దేశాల్లో జాతీయతాభావం బలపడి వేళ్ళూనింది. జాత్యాహంకారంతో తమ తమ జాతీయాధిక్యతను నిరూపించుకునే ప్రయత్నంలో భాగంగా ఆయా రాజ్యాలు సంఘర్షణకు దిగడంతో అంతర్జాతీయ యుద్ధాలయుగం ఆరంభమైంది. తత్ఫలితంగా అంతర్జాతీయ రాజకీయాల్లో "తుల్యప్రాబల్య సిద్ధాంతం" (Principal of Balance of Power) ప్రాముఖ్యత సంతరించుకుంది. భూగోళ పరిశోధనల ఫలితంగా అంతర్జాతీయ అవగాహన జనించటమేగాక పాశ్చాత్యసంస్కృతి వ్యాప్తి చెందింది. ఆధునికయుగ లక్షణాలలో ప్రధానమైనది పాశ్చాత్య సంస్కృతి. ఐరోపా సంస్కృతి, రాజకీయాధికారం, క్రైస్తవ మతం ప్రపంచమంతటా వ్యాప్తి చెందాయి.

## 1.3 సాంస్కృతిక పునరుజ్జీవనం (Renaissance) :

మధ్యయుగంనాటి వ్యవస్థలపైన, మూఢనమ్మకాలపై ఆధారపడిన సిద్ధాంతాలపైన, సంస్కృతిపైన ధ్వజమెత్తి, ప్రాచీనయుగంనాటి వ్యవస్థలను, సంస్కృతిని, సాహిత్యాన్ని ఐరోపావాసులు సాదరంగా ఆహ్వానించడమే - సాంస్కృతిక పునరుజ్జీవనం లేదా పునర్వికాసం. ఐరోపాలో క్రైస్తవమతం వ్యాప్తిచేయడం కోసం ఆ మతానికి అనుగుణంగా సారసత్వ, లలితకళలు సృష్టించి అభివృద్ధి చేయడం జరిగింది. ఇవన్నీ ఈ తరహాలో క్రీ.శ. 5వ శతాబ్ది నుంచి 13, 14 శతాబ్దాల దాకా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ఎటువంటి శాస్త్రీయత లేకుండా కేవలం నమ్మకాల మీద ఆధారపడిన క్రైస్తవ సిద్ధాంతాలతో విసుగుచెందిన ఆనాటి శాస్త్రకారులు హేతుబద్ధమైన ప్రాచీన గ్రీకు - రోమన్ సంస్కృతిపట్ల తమ మక్కువను ప్రదర్శించారు. ప్రాచీన గ్రీకు రోమ్ సామ్రాజ్యాల కాలంలో వర్ధిల్లిన సంస్కృతి పునరుద్ధరణ పట్ల ఆసక్తిని ప్రదర్శించి దానిని ఒక ఉద్యమంగా నిర్వహించడమే సాంస్కృతిక పునరుజ్జీవనం. ఈ సాంస్కృతిక పరిణామం ఫలితంగా మానవుడు మూఢ విశ్వాసాలను విడనాడి, అజ్ఞానం అనే అంధకారం నుండి వెలుగులోకి వచ్చి, మతగురువులపై ఆధారపడకుండా స్వతంత్రంగా హేతుబద్ధంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. వీటన్నిటికీ మించి శాంతియుతంగా జీవించడం, మానవతా విలువలను పెంపొందించడం, జీవిత మాధుర్యాన్ని ఆస్వాదించాలనే ఆకాంక్ష ఆత్మవిశ్వాసం అలవరచుకున్నాడు. దీనితో ఐరోపాలో రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాల్లో నూతన వికాసం కలిగింది. కనుకనే ఐరోపాచరిత్రలో పునరుజ్జీవ ఉద్యమంతో అంధకార యుగం అవతరించి ఆధునికయుగం ఆరంభమైందని పేర్కొంటారు.

14వ శతాబ్ది రెండో అర్థభాగం నుంచి 16వ శతాబ్ది వరకు సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమకాలంగా భావిస్తారు. తొలుత ఫ్లారెన్స్ వాణిజ్యవేత్తల ఆదరణతో ఇటలీలో వర్ధిల్లిన ఈ ఉద్యమం క్రమక్రమంగా ఇతరవర్గాల ఆదరణను పొందడమేగాక ఇతర ఐరోపా దేశాలకు కూడా వ్యాపించింది. ఐదోనికోలస్, పదోలియో వంటి పోప్‌లు, ఇంగ్లండు, స్పెయిన్, ఫ్రాన్సు వంటి దేశాల అధిపతులు ఈ ఉద్యమానికి చేయూతనిచ్చారు. ఏదైనా ఒక సంస్కృతి అభివృద్ధి చెందాలంటే దానికి ప్రజల్లోని వివిధ వర్గాల ఆదరణ అవసరం. పునరుజ్జీవ ఉద్యమానికి తొలిదశలో ఫ్లారెన్స్ నగరంలోని వాణిజ్యవర్గాలు ప్రోత్సాహమిస్తాయి. మధ్యయుగ భూస్వామ్య సమాజంలో శాంతికి, మానవత్వానికి, ప్రజల్లో అన్నివర్గాలు జీవితసుఖాన్ని చవిచూడాలనే భావనకు తావులేదు. మతాధికార వర్గం కూడా భూస్వామ్య వర్గాలకే అండగా నిలచింది. ఈ ధోరణులు వాణిజ్యాభివృద్ధికి పెద్ద అడ్డంకిగా తయారయ్యాయి. కనుక, వాణిజ్యం నూతన విలువలను వ్యాపింపజేసే సంస్కృతిని ప్రోత్సహించింది. అందువల్లనే ఫ్లారెన్స్ నగర వాణిజ్య వర్గాలు ఈ ఉద్యమానికి అండగా నిలచాయి. ఆ నగరం సంపదకు నిలయం కాబట్టి పునరుజ్జీవ ఉద్యమవ్యాప్తికి ఆర్థిక కొరత ఏర్పడలేదు.

### 1.3.1 సాహిత్యం :

ముద్రణా యంత్రం ఆవిర్భవించడంతో పునరుజ్జీవ ఉద్యమ సాహిత్యం విద్యాధికులందరికీ అందుబాటులోనికి వచ్చి ఆ ఉద్యమవ్యాప్తికి మరింత దోహదం చేసింది. పునరుజ్జీవ సాహిత్యవేత్తలు ప్రాంతీయభాషలో తమ గ్రంథాలను రచించారు. ప్రజల భాషలో గ్రంథాలు వెలువడినందువల్ల ఈ ఉద్యమం ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. సాహిత్యరంగానికి సంబంధించినంత వరకు డాన్‌టే (1265 - 1321), పెట్రార్క్ (1304 - 1374), బొకాషియో మొదలైనవారు ఈ యుగప్రసిద్ధ రచయితలు. ప్రాచీన సారస్వతంలోని విశేషాలను తమ రచనల ద్వారా ప్రజలకు తెలియజేసి, వాటిని ఆకలింపు చేసుకోవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డాన్‌టేను ఇటలీ కవితా సాహిత్యపితామహుడుగా వర్ణిస్తారు. ఆయన వ్రాసిన 'డివైన్ కామెడీ' చాలా ప్రసిద్ధి చెందిన కావ్యం. పెట్రార్క్ ప్రాచీనగ్రీకు, రోమన్ సాహిత్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. బొకాషియో పెట్రార్క్ శిష్యుడు. ఆయన వ్రాసిన 'డికామెరోన్' ప్రణయగాథల సంకలనం చాలా ప్రసిద్ధి చెందిన గ్రంథం. డాన్‌టే కవిత్వం, బొకాషియో గాథలు ఐరోపా అంతటినీ ఆకర్షించాయి. హాలాండ్ సాహితీరంగంలో ఎరాస్‌మస్ అగ్రగణ్యుడు. ఆయన "ప్రయిజ్ ఆఫ్ ఫాలీ" అనే

గ్రంథాన్ని చక్కని శైలిలో వ్రాసి మూఢవిశ్వాసాలను, మతాచారాలను అవహేళన చేసాడు. ఇంకా ఈయన గ్రీకుభాషలో ఉన్న "న్యూటెస్టమెంట్"ను లాటిన్ భాషలోనికి అనువదించాడు. దీనితో లాటిన్ నేర్చుకున్న విద్యావంతులందరికీ బైబిల్‌లో ఉన్న అసలు విషయం అవగాహనలోనికి వచ్చింది. తొలుత గ్రీకు గ్రంథాల వ్రాతప్రతులను ఇంగ్లండుకు తీసుకొనివచ్చినవాడు విలియం సెల్లింగ్. ఆయన శిష్యుడైన థామస్‌లునాక్రే ఫ్లోరెన్స్‌కి వెళ్ళి ప్రముఖ వైద్యశాస్త్రాన్ని అభ్యసించాడు. ఏడోహెన్రీ తల్లి మార్గరెట్ బ్యూఫోర్డ్ ఆధునిక విద్యావ్యాప్తి కోసం కేంబ్రిడ్జిలో రెండు విద్యాలయాలను స్థాపించింది. "కేంటర్‌బరీటేల్స్" గ్రంథకర్త ఛాసర్, 'ఊటోపియా" రచయిత థామస్‌మూర్, 'ఫెయిర్‌క్వీన్" రచయిత ఎడ్మండ్ స్పెన్సర్, వివిధ తాత్త్విక, శాస్త్రవిజ్ఞాన అంశాలపై రచనలు చేసిన ఫ్రాన్సిస్ బేకన్ ఆనాటి ఇంగ్లీషు రచయితలలో ప్రముఖులు. స్పానిష్ సాహిత్యరంగంలో సెర్వాంటిస్, లోపడవాగా, ఇగ్నేషియస్ లయోలాకు విశిష్ఠ స్థానముంది. ఫ్రెంచి పునరుజ్జీవ ఉద్యమ సాహిత్యానికి మాంటెయిన్ ఆద్యుడని చెప్పవచ్చు. ఆయన తన వ్యాసాలలో మధ్యయుగ విలువల మీద, కాలం చెల్లిన విద్యాభ్యాసం మీద చేసిన విమర్శలు ఫ్రెంచి మధ్యతరగతిపై ప్రగాఢ ప్రభావాన్ని చూపాయి. మధ్యయుగ విశ్వాసాలను, కట్టుబాట్లను అవహేళన చేయడానికి ఫ్రెంచి రచయితలు వ్యంగ్య నాటికా రూపాన్ని ఒక సాధనంగా ఉపయోగించారు. ఇటువంటి రచయితలకు ఫ్రాంకోమ్ రెబితే ఆద్యుడు.

పై రచనల్లో గ్రీకు సంస్కృతిలో ప్రస్ఫుటించిన మానవతావాదానికి అత్యంత ప్రాచుర్యం లభించింది. మానవతావాదులు సనాతనమైన మతవిద్యలను నిరసించి, శాస్త్రీయమైన పద్ధతిలో విద్యలను అభ్యసించాలని, విద్యయొక్క ముఖ్య లక్ష్యం వ్యక్తిత్వాన్ని పెంపొందించడమేనని చాటిచెప్పారు. వీరి బోధనల ఫలితంగా ప్రజల్లో మూఢవిశ్వాసాలు తొలగిపోయి, విజ్ఞానవికాసం, విమర్శనాబుద్ధి పెంపొందుతాయి. మానవతాదృష్టిని పరలోకం నుంచి ఇహలోకం వైపు మళ్ళించాయి.

### 1.1.3.2 లలిత కళలు :

పునరుజ్జీవ ఉద్యమకాలంలో ఇటలీ, ఇతర ఐరోపా దేశాలలో లలితకళలు అత్యున్నత దశకు చేరుకున్నాయి. ముఖ్యంగా ఇటలీలోని ఫ్లోరెన్స్ మొదలైన నగరాలు సుప్రసిద్ధ కళాక్షేత్రాలయ్యాయి. పునరుజ్జీవ వాస్తు కళాకారులు అంతవరకు ప్రాచుర్యంలో ఉన్న గోథిక్ వాస్తుకళను ఆదరించలేదు. ప్రాచీన రోమ్ వాస్తుకళను పునరుద్ధరించారు. రోమ్ నగరంలో వాస్తుకళకు అత్యంత ప్రసిద్ధిచెందిన సెయింట్‌పీటర్స్ చర్చి గుమ్మటానికి రూపకల్పన చేసింది మోజెస్ డేవిడ్. ఇతను శిల్పీకరించిన శిల్పాలు అద్భుత కళాఖండాలు. సెయింట్ పీటర్స్ చర్చి నూతన కళారీతిలోనే నిర్మితమైంది. దీని గుమ్మటం భూమికి 400 అడుగుల ఎత్తున ఉండి 8000 మంది భక్తులకు ఆశ్రయమిస్తుంది. వెనీస్ నగరంలోని సెయింట్‌మార్క్ చర్చిని కూడా ఈ వాస్తుశైలిలోనే నిర్మించారు.

ఆనాటి శిల్పుల్లో డొనాటెల్లో ప్రముఖుడు. ఇతను ఫ్లోరెన్స్ నగరంలో రూపుదిద్దిన సెయింట్ జార్జి విగ్రహం పునరుజ్జీవ ఉద్యమ శిల్పకళకు చక్కటి ప్రతీక. లుకడెల్లా రొబ్బియా అనే శిల్పకారుడు ఫ్లోరెన్స్ నగరాధిపతి అయిన లోరెంజోడిమెడిసికి చెందిన ఉద్యానవనాన్ని నునుపుతేలిన మట్టిపలకలతో చేసిన విగ్రహాలతో శోభాయమానంగా చేశాడు.

వాస్తుశిల్పకళ కంటే పునరుజ్జీవ ఉద్యమం నాటి చిత్రకళ ఎక్కువ ప్రాముఖ్యత సంతరించుకున్నది. ఆనాటి చిత్రకారులలో లియనార్డో డావిన్సీ (1452 - 1519), మైఖేలేంజిలో (1475 - 1564), టిటియస్ (1477 - 1576) రాఫెల్ సాంజియో (1483 - 1520) ముఖ్యులు. లియనార్డో డావిన్సీ గొప్ప చరిత్రకారుడే కాక శిల్పి, గణితశాస్త్రజ్ఞుడు, సాంకేతిక నిపుణుడు కూడా. ఇతను వేసిన "మోనాలిసా", "ది లాస్ట్ సప్పర్" అనే వర్ణచిత్రాలు ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. మైఖేలేంజిలో చిత్రీకరించిన "ది లాస్ట్ జడ్జిమెంట్" జగత్ప్రసిద్ధం. రాఫెల్ వేసిన చిత్రాలలో సెయింట్ పీటర్స్ చర్చిలోని "సిస్టైన్ మెడొన్నా" చిత్రం చాలా గొప్పది. ఒక వస్తువుకు ఉండే మూడు పరిణామాలను తన చిత్రాలలో వ్యక్తం చేయగలిగిన శక్తి రాఫెల్‌కు ఉంది. వెనీస్ నగరానికి చెందిన టిటియస్ 700 చిత్రాలకు కర్త. చిత్రకళా రంగానికి సంబంధించినంతవరకు ఇటలీ తర్వాత స్పెయిన్, జర్మనీ, హాలెండ్‌లు

ప్రముఖస్థానమాక్రమించాయి. స్పెయిన్ చిత్రలేఖనానికి వన్నెతెచ్చిన వారిలో ఎల్‌గ్రేకో ముఖ్యుడు. జర్మన్ చిత్రకారులలో ఆల్బర్ట్ డ్యూరర్, హాన్స్ హోల్బిన్ సుప్రసిద్ధులు. డ్యూరర్ వేసిన "ఎడోరేషన్ ఆఫ్‌మాగి" హోల్బిన్ వేసిన "వర్జిన్ అండ్ ది చైల్డ్" అపురూప కళాఖండాలుగా ప్రసిద్ధిచెందాయి. హాలెండ్ చిత్రకారులలో రెమ్‌బ్రాంట్ వేసిన "ది నైట్‌వాచ్" ఒక గొప్ప కళాఖండం. మనుషుల మనస్తత్వాలను, వారి ఆలోచనా ధోరణులను పూర్తిగా ఆకలింపు చేసుకొని ఇతను "నైట్‌వాచ్" పెయింటింగ్‌ను సృష్టించాడు. సగటు మనుషుల నైజానికి అద్దంపట్టే ఈ పెయింటింగ్‌ను లక్షలు పోసి సొంతం చేసుకుంటామని ఎందరో కోటీశ్వరులు ముందుకు వచ్చినా దాన్ని అమ్మడానికి రెమ్‌బ్రాంట్ ఒప్పుకోలేదు.

పునరుజ్జీవ ప్రభావం సంగీతంపై కూడా ప్రసరించింది. గీతాలలో మానవత వస్తువుగా ఉండేది. వాయులీనం వంటి కొన్ని కొత్త వాయిద్యాలు వాడుకలోకి వచ్చాయి. పాలస్త్రీనా అనే వాగ్గేయకారుడిని ఆధునిక పాశ్చాత్య సంగీతానికి ఆద్యుడుగా భావిస్తారు.

## 1.3.3 వైజ్ఞానిక పరిశోధనలు :

పునరుజ్జీవ ఉద్యమం ఆనాటి మానవునిలో జిజ్ఞాసను రేకెత్తించి శాస్త్రవిజ్ఞాన పరిశోధనలకు చేయూతనిచ్చింది. అయితే ఆనాటి వైజ్ఞానిక పరిశోధకులు ప్రాచీన గ్రీకు, రోమన్ విజ్ఞాన సంపద నుంచి స్ఫూర్తి పొందినప్పటికీ అది తిరుగులేని యదార్థమని, ప్రామాణికమని వారు భావించలేదు. వారు అందులోని నిజనిజాలను తెలుసుకునేందుకు, ఆధునిక యుగానికి ఉపయోగపడే విజ్ఞానాన్ని సృష్టించేందుకు తీవ్రంగా పరిశోధనలు జరిపారు.

ప్రాచీన గ్రీకు ఖగోళశాస్త్రజ్ఞుడైన టోలమీ విశ్వానికంతటికీ ఈ భూమే కేంద్రమని నిర్ధారించాడు. ఐరోపావారు సుమారొక వెయ్యిసంవత్సరాల కాలంపాటు ఈ అభిప్రాయాన్నే విశ్వసిస్తూ వచ్చారు. అయితే పోలెండు దేశస్థుడైన నికోలస్ కోపర్నికస్ (1473 - 1545) తాను ఇటలీలో నివశిస్తున్న దశలో ఈ విశ్వాసం సరియైనది కాదని భూమి, చంద్రుడు తదితర గ్రహాలు సూర్యునిచుట్టూ పరిభ్రమిస్తున్నాయని తాను రచించిన "అంతరిక్ష గ్రహాల పరిణామాలు" అనే గ్రంథంలో వివరించాడు. ఇటలీకి చెందిన గలీలియో (1554 - 1642) ఈ సిద్ధాంతాన్ని బలపరిచాడు. ఇతను తాను కనిపెట్టిన దూరదర్శిని ద్వారా అంతరిక్ష వస్తుసముదాయాన్ని జాగ్రత్తగా పరిశీలించి, ఈ నిర్ణయానికి వచ్చాడు. గ్రహకూటమి గురించి తొలుత ఆయన సవివరమైన సమాచారాన్ని అందించాడు. కాని ఆనాటి క్రైస్తవ మతాధికారులు ఈ నూతన ఖగోళ సిద్ధాంతాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. తన సిద్ధాంతమంతా తప్పు అనీ, తాను తప్పుడు అభిప్రాయాలను వెల్లడించానని ఒప్పుకొని, గలీలియో బతికి బయటపడ్డాడు. కెప్లర్ అనే మరొక ఖగోళ శాస్త్రజ్ఞుడు గ్రహాలు వృత్తాకార కక్ష్యలలో కాక దీర్ఘవృత్తాకార కక్ష్యలలో పరిభ్రమిస్తున్నాయని గణితశాస్త్ర లెక్కల ఆధారంగా నిరూపించాడు. ఐజాక్‌న్యూటన్ (1642 - 1727) మరింత ముందుకుపోయి తన "లా ఆఫ్ యూనివర్సిల్ గ్రావిటేషన్" అనే గ్రంథంలో అంతరిక్ష వస్తువులన్నీ గురుత్వాకర్షణ శక్తిని అనుసరించే కదులుతూ ఉంటాయని వివరించాడు.

రసాయన, వైద్య, భౌతిక, జంతు, వృక్ష శాస్త్రాలలో సైతం పరిశోధనలు జరిగాయి. ఆధునిక రసాయనశాస్త్రం వైద్యరంగం నుంచి ఆవిర్భవించింది. శరీరంలో సంభవించే క్రియలన్నింటికీ అందులో జరిగే రసాయన మార్పులే కారణమని పరాసెల్సాస్ (1493-1541) అనే శాస్త్రజ్ఞుడు నిర్ధారించాడు. దీనితో ఔషధాలలో రసాయనాలను వాడాలనే ధోరణి ప్రబలింది. ఇది రసాయన శాస్త్రంలో పరిశోధనలకు ప్రోత్సాహకారి అయింది. అంతేకాక విజ్ఞానశాస్త్రవేత్తల దృష్టి జీవశాస్త్రం వైపు మళ్లింది. హాలెండ్ దేశస్థుడైన ఆండ్రియా వెసాలియస్ (1514 - 1564) అనేక పరిశోధనలు జరిపి "మానవ శరీర నిర్మాణం" (ట్రియటైస్ ఆన్ అనాటమీ) అనే గ్రంథాన్ని వ్రాసి ఆధునిక వైద్యపద్ధతులకు పునాదులు వేశాడు. ఇంగ్లండు దేశానికి చెందిన విలియం హార్వే శరీరంలో రక్తప్రసరణం జరుగుతుందని చెప్పి వైద్యశాస్త్రంలో విప్లవాత్మకమైన మార్పును తెచ్చాడు. సెర్విటస్, ఆంబ్రాయిజ్ అనే

శాస్త్రజ్ఞుల పరిశోధనలు ఆధునిక శాస్త్రచికిత్సకు పునాది వేశాయి. విలియం టన్నర్ జంతు శాస్త్రంలోను, కానార్డోగెన్నార్ వృక్షశాస్త్రంలోను ఆధునిక పరిశోధనలకు పునాదులు వేశారు.

శాస్త్రవిజ్ఞాన రంగంలో పైన వివరించిన అభివృద్ధి ఒక ఎత్తు అయితే ముద్రణా రంగంలో వచ్చిన మార్పులు మరొక ఎత్తు. మధ్యయుగాలలో కర్ర లేదా లోహంతో చేసిన పలకలపై అక్షరాలు చెక్కి వాటిని కాగితంపై అచ్చొత్తేవారు. ఈ పద్ధతిని చైనా నుంచి ఐరోపావారు తెలుసుకున్నారు. అయితే క్రీ.శ. 1454లో జర్మనీలోని మెయిన్జ్ నగరానికి చెందిన గుటెన్‌బర్గ్ ముద్రణా యంత్రాన్ని కనిపెట్టి లాటిన్ భాషలో తన మొదటి గ్రంథాన్ని ముద్రించాడు. లోహంతో అక్షరాలను పోతపోయడం నుంచి అదే లోహంతో అచ్చు యంత్రాన్ని రూపొందించేటంతవరకు గుటెన్‌బర్గ్ ఆలోచనలు క్రియాశీలంగా సాగాయి. అతనికి గొప్ప చదువు లేకపోయినా అచ్చుయంత్ర నిర్మాణం, ఇతర ముద్రణా పద్ధతుల గురించి విపులంగా తెలుసుకున్నాడు. కొరియా, చైనా దేశస్థులు ముద్రణారంగంలో చేసిన ప్రయోగాలు, పరిశీలనలు అవగాహన చేసుకొని ఎట్టకేలకు అచ్చుయంత్రాన్ని రూపొందించాడు గుటెన్‌బర్గ్. ఆ తరువాత దశలో త్వరితగతిన ప్రతులను ముద్రించే యంత్రం వాడుకలోనికి వచ్చింది. దీనివలన వైజ్ఞానిక పరిశోధన ఫలితాలు విద్యాధికులందరికీ అందుబాటులోనికి వచ్చాయి. ఇదే సమయంలో దిక్సూచిని కూడా కనిపెట్టటం జరిగింది. దీనివల్ల నౌకాయానం సులభతరమై భూగోళాన్వేషణలకు తోడ్పడింది.

## 1.4 మత సంస్కరణోద్యమం (Reformation) :

మధ్యయుగం చివర్లో క్రైస్తవ మతంలో ప్రబలిన దౌష్ట్యాలను ప్రక్షాళనం చేసి, ఆ మతాన్ని సంస్కరించాలనే ధ్యేయంతో ఆనాటి తాత్వికులు, రచయితలు తమ రచనల ద్వారా ఐరోపావాసులను ఉత్తేజపరచి మతయుద్ధాల వంటి మహోద్యమాలను సృష్టించారు. ఇటువంటి మతసంస్కరణ ఆశయంతో ఆరంభమైనదే మతసంస్కరణోద్యమం. పవిత్ర రోమన్ సామ్రాజ్యం పతనావస్థ దశకు చేరుకోగా సహజంగానే పోప్ మతాధికారం దెబ్బతిన్నది. నైతికంగా దిగజారి, భోగపరాయణుడైన పోప్‌పై ఐరోపావాసులు తిరుగుబాటు చేశారు. ఆ తిరుగుబాటు ఫలితంగా ఐరోపాలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో కొత్త కొత్త మతశాఖలు పుట్టుకొచ్చాయి.

రోమన్ చర్చిపై ప్రజల్లో అసంతృప్తి ప్రబలడానికి ముఖ్యకారణం ఆ మతాచార్యులు కొనసాగించిన దుశ్చర్యలే. ఉదాహరణకు పోప్ నాల్గవ సిక్స్‌టస్ చర్చి మాన్యాలను తన స్వప్రయోజనాలకు వాడుకొన్నాడు. పోప్ ఆరవ అలెగ్జాండర్ తన అసమర్థులైన చట్ట వ్యతిరేకంగా కన్న కుమారులకు అక్రమంగా స్థిరాస్థులను సంపాదించి పెట్టటానికే కాలాన్ని వెల్లబుచ్చాడు. మరో పోప్ రెండో జూలియస్ మతసంస్కరణల కంటే రాజ్యవిస్తరణలోనే శ్రద్ధాశక్తులు కనపరచాడు. చర్చి మందిరాల్లో జరిగే ప్రార్థనలు, పూజలు ఏదో మొక్కుబడి తంతుగా జరిగేవి. పాపపరిహారం జరుగుతుందని ప్రజలను నమ్మించి "పాపపరిహారపత్రాల"ను విచ్చలవిడిగా అమ్మి విశేషంగా అక్రమ ధనార్జన చేశారు. సంప్రదాయవాదులైన కొందరు క్రైస్తవులు ఇటువంటి పరిస్థితులను గాంచి నిరాశ చెందగా, సాహసవంతులైన క్రైస్తవులు మతంలో ప్రవేశించిన ఈ దుశ్చర్యలను బాహాటంగానే ఖండించసాగేరు. జాన్‌విక్లిఫ్ అనే ఆంగ్లేయుడు పోప్ భగవంతుని ప్రతినిధికాదని, అతను క్రీస్తు వ్యతిరేకి అని తీవ్రంగా విమర్శించాడు. క్రైస్తవ మతాభిమానులంతా పవిత్ర మత గ్రంథాన్ని మాత్రమే అనుసరించాలని నొక్కివక్కాణించాడు. ఇంగ్లండులో రాజకీయ నాయకులు, సామాన్యులు అనేకులు అతని అనుచరులయ్యారు. బొహిమియా దేశస్థుడు జాన్‌హస్, ఇటలీవాసి సావన్‌రోలా కూడా క్రైస్తవ మతంలో సంభవించే దుష్పరిణామాలను పోపుల అధికారాన్ని నిరసించి, మతానికి కొత్తరూపు ఇవ్వాలనే తపనతో తుది వరకు పోరాటం సాగించారు. క్రైస్తవులు పవిత్రమార్గంలో నడవటానికి అవసరమయ్యే అభ్యుదయశక్తి కోసం పోపులపై ధ్వజమెత్తారు. తమ మతానికి పూర్వపు ఔన్నత్యాన్ని, సరళతను తీసుకొచ్చే ప్రయత్నంలో చర్చిల చేత ధృవీకరించబడిన క్షమాపత్రాల అమ్మకాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే పోప్ అధికారాన్ని ధిక్కరించారు. తత్ఫలితంగా క్రైస్తవ పెద్దలు వీరిని సజీవదహనం చేశారు.

16వ శతాబ్ది నాటకి పైన చెప్పిన కారణాల మూలంగా మతసంస్కరణలకు మార్గం సుగమం అయింది. క్రీ.శ. 1520-70 సంవత్సరాల మధ్యకాలంలో కాథలిక్ మతంపై అనేక తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాటుదార్లనే "ప్రొటెస్టాంట్స్" అని అంటారు. ప్రొటెస్టెంట్ అనే ఆంగ్లపదానికి అసమ్మతి తెలపడం అని అర్థం. అలాంటి ప్రొటెస్టాంట్స్ ఉద్యమాలలో లూథరినిజమ్ మొదటిది.

పోప్‌లు సాగిస్తున్న దుష్కృత్యాలను తీవ్రంగా ఖండించిన వారిలో జర్మనీకి చెందిన మార్టిన్‌లూథర్ అగ్రగణ్యుడు. ఈయన జర్మనీలోని ఎసలిబెన్ అనే గ్రామంలో ఒక రైతు కుటుంబంలో 1483లో జన్మించాడు. ఎర్‌ఫెర్డ్ విశ్వవిద్యాలయంలో విద్య పూర్తి చేశాక 1508లో విటెన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో వేదాంత శాస్త్రాచార్యుడుగా నియమితుడయ్యాడు. రోమన్‌చర్చి అభిప్రాయాలు నచ్చక లూథర్ చర్చి చేపట్టిన మతసంస్కరణలపై ధ్వజమెత్తాడు. చర్చిలచేత ధృవీకరింపబడిన పాపపరిహారపత్రాల అమ్మకాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ పత్రాలు కొనటంవలన పాపాలు హరించడమనేది బూటకమేనని, ఇవి మానవునిలో నిజమైన హృదయ పరివర్తనను తీసుకురావని, దేవునిపై అకుంఠిత విశ్వాసం, భక్తి ముఖ్యమని లూథర్ ప్రచారం చేయసాగాడు. ధనాశపరులైన పోప్‌లు పాపపరిహార పత్రాలను బేషరుతుగా కన్పించిన ప్రతివారికి అంటగట్టేవారు. జుగుప్సాకరమైన ఈ పద్ధతి ద్వారా పేదలు, అమాయకులు, మతం పేరుతో మోసగించబడటం చూచిన లూథర్ ఆవేశాన్ని అణచుకోలేక కాథలిక్ మతంలోని లోపాలను, వివాదాంశాలను తొంభై అయిదుతో పట్టికను తయారుచేసి విటెన్‌బర్గ్ చర్చి ద్వారంపై అంటించాడు. ఈ విషయాల్లో ఎవరైనా తనతో వాదానికి రావచ్చని సవాలు విసిరాడు. క్రీ.శ. 1520లో లూథర్ కాథలిక్ చర్చితో పూర్తిగా తెగత్రెంపులు చేసుకొని చర్చి అధికారాన్ని సవాలు చేస్తూ కరపత్రాలను ప్రచురించాడు. వెంటనే అప్పటి పోప్ 10వ లియో ఇతణ్ణి మత బహిష్కరణకు గురిచేశాడు. పార్లమెంటు కూడా లూథర్‌ను చట్టవ్యతిరేకంగా ప్రకటించింది. శాక్షనీ ప్రభువు ఆశ్రయం పొంది లూథర్ కొంతకాలం వార్ట్‌బర్గ్‌కోటలో తలదాచుకొన్నాడు. ఈ కోటలు వున్నప్పుడు తన అభిప్రాయాలను కరపత్రాల రూపంలో ప్రచురించి జర్మన్‌లకు ఆరాధ్య జాతీయ నాయకుడయ్యాడు. ఆ కోటలో ఉన్నప్పుడే బైబిల్ కొత్తనిబంధనను జర్మన్ భాషలోనికి అనువదించాడు.

లూథర్ బోధనలచేత ప్రభావితులైన దక్షిణ జర్మనీ ఇతరులు తమ ప్రభువులపై తిరుగుబాటు చేశారు. 1524 నాటికి ఈ తిరుగుబాటు హింసాత్మకంగా మారి అనేకమంది భూస్వాములు వధింపబడ్డారు. ఈ రైతుల తిరుగుబాటు తన మతవ్యాప్తికి పెద్ద అవరోధంగా మారగలదని భావించిన లూథర్ ఈ తిరుగుబాటును అణచివేయవలసిందిగా ప్రభువులనుకోరాడు. ఈ అణచివేత సందర్భంగా 50 వేల మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. దీనివల్ల దక్షిణ జర్మనీరైతులు, లూథర్ మీదగల వ్యతిరేకతతో కాథలిక్ మతాన్నే అంటిపెట్టుకున్నారు. కాగా ఉత్తర జర్మనీయులు లూథర్‌కు అనుయాయులు అయ్యారు.

1529లో పవిత్ర రోమన్ చక్రవర్తి ఐదవ ఛార్లెస్ కాథలిక్ మతేతరులని శిక్షించాలని, చర్చి నుంచి వచ్చే ధనాన్ని కాథలిక్ మతంపైనే ఖర్చు పెట్టాలని, ఇతర శాఖలపైన ఖర్చు పెట్టకూడదని జర్మన్ ప్రభువులకు ఆదేశాలు జారీచేశాడు. లూథర్ అనుచర ప్రభుగణం దీనికి అభ్యంతరం (Project) తెలిపారు. అప్పటినుంచి లూథర్ అనుయాయులు ప్రొటెస్టాంట్‌లయ్యారు. క్రమంగా డెన్మార్క్, నార్వే, స్వీడన్‌లు ప్రొటెస్టాంట్ మతాన్ని స్వీకరించాయి. కానీ జర్మనీలో లూథరన్‌లకు, కాథలిక్‌లకు సామరస్యం పొగసక అంతర్యుద్ధానికి దారితీసి చివరకు క్రీ.శ. 1555లో ఆగ్స్‌బర్గ్ సంధితో సమాప్తమయింది. ఈ సంధి ప్రకారం లూథరన్ మతం తప్ప ఏ ఇతర ప్రొటెస్టెంట్ మతం చట్టబద్ధంకాదు. జర్మనీలో ప్రతిరాజు తన ఇష్టం వచ్చిన మతాన్ని అవలంబించవచ్చు. ఆ దేశ ప్రజలు కూడా అదే మతాన్ని అవలంబించి తీరాలి.

ఈ విధంగా ప్రొటెస్టెంట్ మతం ఆవిర్భవించింది. నాటి నుంచి పశ్చిమ ఐరోపాలో క్రైస్తవం రెండు ప్రధాన శాఖలుగా (కాథలిక్, ప్రొటెస్టాంట్) చీలిపోయారు. తిరిగి ప్రొటెస్టాంట్‌లు అనేక శాఖలుగా చీలిపోయారు. రోమ్ చర్చిపై జరిగిన ఈ విప్లవానికే రిఫర్మేషన్ (Reformation) అనిపేరు. ఈ మతసంస్కరణోద్యమం ఒక్కొక్క దేశంలో ఒక్కో విధంగా సాగింది.

## 1.5 జాతీయ రాజ్యాలు :

తొలుత ఫ్లారెన్స్ వాణిజ్యవేత్తల ఆదరణతో ఇటలీలో వర్థిల్లిన పునరుజ్జీవ ఉద్యమం క్రమక్రమంగా ఇతరవర్గాల ఆదరణను పొందడమే గాక ఇతర ఐరోపా దేశాలకు కూడా వ్యాపించింది. ఐదో నికోలస్, పదో లియో వంటి పోప్‌లు, స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, డెన్మార్క్ వంటి దేశాల అధిపతులు ఈ ఉద్యమానికి చేయూతనిచ్చారు. ఈ దేశాలలో పునరుజ్జీవ ఉద్యమం వలన సంభవించిన తొలి ఫలితం ప్రాంతీయ భాషల అభివృద్ధి 16వ శతాబ్దిలో ఇటాలియన్, ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్, డచ్ భాషలలో నిఘంటువులు వెలువడ్డాయి. ప్రాంతీయభాషల అభివృద్ధి వలన సామాన్య విద్యాధికునిలో విజ్ఞానం, చైతన్యం, జాతీయభావాలు పెంపొందాయి. జాతీయ సంస్కృతులు రూపొందాయి. ఈ పరిణామం జాతీయరాజ్యాలు ఏర్పడి బలపడడానికి దోహదం చేసింది. దీనిఫలితంగా పవిత్ర రోమన్ సామ్రాజ్యం క్షీణించింది. భూస్వామ్యవ్యవస్థ బలహీనపడింది. భూస్వాములు అత్యంత వ్యయంతో కూడిన శతఘ్ని దళాన్ని పెంపొందించుకోలేకపోయారు. రాజులు అప్పుడే వాడుకలోకి వచ్చిన తుపాకి మందుతో కూడిన శతఘ్ని దళాన్ని సమకూర్చుకున్నారు. అందువల్ల భూస్వాముల సైనిక ప్రాముఖ్యత తగ్గి రాజులే బలవంతులయ్యారు. ఈ సమయంలోనే చర్చిపలుకుబడి క్షీణించటమేకాక కొన్ని రాజ్యాలలో అది ప్రభుత్వానికి తోడ్పడింది. మాకియవెల్లి "ది ప్రిన్స్' అనే గ్రంథంలో భూస్వామ్య సామంతులను అదుపులో వుంచి తమ ఆధిపత్యాన్ని దృఢతరం చేసుకోవాలని కాంక్షిస్తున్న రాజులకు ఆయన ఈ గ్రంథంలో అనేక అవకాశవాద, నీతిబాహ్యమైన మార్గాలను సూచించాడు. రాజు "ఒకే తరుణంలో మనిషిగా, సింహం, గుంటనక్క వంటి మృగాలుగా వ్యవహరించడం తెలుసుకోవాలి". "నిజాయితీగా ఉండడం అరిష్టదాయకం, కాని సచ్ఛీలుడుగా కనపడడం కంటే శ్రేయస్కరమైనది మరొకటి లేదు". బూటకమైనదని తాను విశ్వసించిన మతాన్ని ఆదరించడం పాలకుని విధి". ప్రజలను అదుపాజ్ఞలలో ఉంచడానికి ఈ చర్య అవసరం", నిజమైన మతాన్ని ఆదరిస్తే దానిలోని ఉదాత్తమైన విలువలను ప్రజలు అవగతం చేసుకొని వాటిని పాటించని పాలకుని మీదే తిరుగుబాటు చేయవచ్చు. కనుక ఆ పని చేయవద్దని రాజులకు సలహా ఇచ్చాడు. అధికారంలో నిలదొక్కుకొని నిరాంకుశాధికారాలను చేబట్టదలచుకొన్న ఐరోపా రాజులందరూ "ది ప్రిన్స్" గ్రంథంలోని సూత్రాలను అనుసరించారు. వలస సామ్రాజ్యాలను నిర్మించిన ఐరోపా దేశాల ప్రభుత్వాలు కూడా ఈ సూత్రాలనే పాటించాయి. అది సంప్రదాయంగా మారడంతో ఈనాటికీ ప్రపంచమంతా అనేక రాజకీయవర్గాలు ఈ సూత్రాలను పాటిస్తూనే ఉన్నాయి. పునరుజ్జీవ ఉద్యమం ప్రపంచానికందించిన ఒకేఒక దుష్ఫలితమిది. మాకియావెల్లీ రచించిన గ్రంథంలోని అంశాలను చర్చి ఖండించినప్పటికీ అధికార కాంక్ష ఉన్న రాజులు ఈ సూత్రాలను అమలుపరచడంతో క్రీ.శ. 1500 నాటికి ఐరోపాలో జాతీయరాజ్యాలు ఏర్పడ్డాయి. వీటిలో ఇంగ్లండు, ఫ్రాన్స్, స్పెయిన్, స్కాండినేవియన్ రాజ్యాలు ముఖ్యమైనవి.

### 1.5.1 ఇంగ్లండు :

ప్రపంచ చరిత్రలోనే ఇంగ్లండును మొట్టమొదటి జాతి రాజ్యంగా పరిగణించవచ్చు. భూస్వామ్య వ్యవస్థ బలహీనపడడం, ఇంగ్లీషు భాషా సంస్కృతులు అభివృద్ధికావడం, జాతీయ భావాలను ప్రోత్సహించే వాణిజ్యవర్గాలు బలపడటం మొదలైన సార్వత్రిక కారణాలతోపాటు ఆధునిక యుగారంభంలో ఆ దేశాన్ని పరిపాలించిన ట్యూడర్ వంశ రాజులు కూడా దీనికి ఎక్కువగా దోహదం చేశారు. ట్యూడర్ వంశ స్థాపకుడైన ఏడవ హెన్రీ (1485 - 1509)ఈ ప్రక్రియకు ఆద్యుడని చెప్పవచ్చు. అసలు గులాబీల యుద్ధాల వలన చితికిపోయి ఉన్న భూస్వామ్య ప్రభువర్గంమీద ఆయన అధికపన్నులు విధించి మరింత కుంగదీసాడు. ఈ చర్యలకు నిరసన తెలిపిన భూస్వామ్య ప్రభువులను 'స్టార్ ఛాంబర్‌కోర్టు" అనే ప్రత్యేక న్యాయస్థానంలో విచారించి ఉరితీయించేవాడు. ఒక పక్క భూస్వామ్యవర్గాన్ని అణచివేస్తూనే మరొకపక్క వాణిజ్యవర్గాన్ని, ధనిక రైతువర్గాన్ని ఈ రెండు వర్గాల నుంచి ఉద్భవించిన విద్యాధిక మధ్యతరగతి వర్గాన్ని ఆదరించేవాడు. "వాణిజ్యం బలహీనపడడాన్ని ఆయన సహించలేకపోయేవాడ"ని ఆయన జీవిత

చరిత్ర వ్రాసిన ఫ్రాన్సిస్‌బేకన్ తెలిపాడు. ఉన్ని ఉత్పత్తిని, దాని ఎగుమతిని,దానికి అవసరమైన నౌకల నిర్మాణాన్ని ఆయన ప్రోత్సహించాడు. ఇంగ్లండుకు రవాణా అయ్యే సరుకులను ఇంగ్లీషు నౌకలలోనే తీసుకురావాలని చట్టం జారీచేసాడు. లిథూనియా, డెన్మార్క్‌లతో సంధి చేసుకొని అంతవరకు బాల్టిక్ సముద్ర నౌకాయానంపై జర్మన్ రాజ్యాలకు చెందిన "హాన్సెటిక్ లీగ్"కు ఉన్న గుత్తాధిపత్యాన్ని అంతం చేసాడు. ఇటాలియన్ రాజ్యాలతో ఇంగ్లీష్ విదేశీవర్తకాన్ని అభివృద్ధిచేశాడు. దిగుమతులను తగ్గించుకొని, ఎగుమతులను ఎక్కువ చేసుకొనడం ద్వారా లాభాలను గడించే మెర్కెంటైల్ విధానాన్ని ఏడో హెన్రీయే ప్రారంభించాడని భావించవచ్చును.

విదేశీ వ్యవహారాలలో కూడా ఆయన తన దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చాడు. భవిష్యత్తులో స్కాట్లండు, ఇంగ్లండులో కలిసే అవకాశాలను మెరుగుపరిచే నిమిత్తం తన కుమార్తె అయిన మార్గరెట్‌ను స్కాట్లాండు రాజైన నాలుగో జేమ్స్‌కిచ్చి వివాహం చేశాడు. అదేవిధంగా స్పెయిన్ రాజకుమార్తె అయిన కేథరిన్‌ను తన పెద్ద కుమారుడైన ఆర్థర్ కిచ్చి వివాహం జరిపించాడు. దురదృష్టవశాత్తు వివాహం జరిగిన ఐదునెలలలోనే ఆర్థర్ మరణించాడు. ఆనాటి ఆచారం ప్రకారం హెన్రీ తాను తీసుకున్న కట్నం తిరిగి స్పెయిన్ రాజు కుటుంబానికి ఇవ్వాల్సి ఉంది. దీనికిష్టంలేని హెన్రీ పోప్ అనుమతి తీసుకొని కాథరిన్‌ను తన రెండో కుమారుడైన ఎనిమిదో హెన్రీ కిచ్చి వివాహం చేశాడు.

ఇంగ్లండులో క్రీ.శ. 1558లో అధికారంలోకి వచ్చిన మొదటి ఎలిజబెత్ (1558 - 1603) గొప్ప పరిపాలనాదక్షురాలు. సిసలైన జాతీయవాది. ఆంగ్లికన్ మతాభిమాని. ఆమె అంతకుముందు మేరీ జారీ చేసిన ఆదేశాలన్నింటినీ రద్దుచేసి ఆంగ్లికన్ మతాన్ని పునరుద్ధరించి సుస్థిరం చేసింది. జాతీయ ప్రయోజనాలను పరిరక్షించటంలో ఆమె నీతినియమాలను పాటించలేదు. సర్‌వాల్టర్ రాలీ, జాన్‌హాకిన్స్, ఫ్రాన్సిస్ డ్రేక్ వంటి నావికా సాహసికులను ప్రోత్సహించి దక్షిణ అమెరికా నుంచి వెండి, బంగార నిధులను వజ్రాలను తెచ్చే స్పానిష్ ఓడలను కొల్లకొట్టించేది. దీనికాగ్రహించిన స్పెయిన్ రాజు రెండో ఫిలిప్ పంపిన భారీనౌకాదళాన్ని డ్రేక్, హకిన్స్‌లు ధ్వంసం చేశారు. హాకిన్స్ బానిస వ్యాపారం ద్వారా ధనరాసులను ఆర్జించి ఇంగ్లండ్‌కి తెచ్చేవాడు. ఎలిజిబెత్ పరిపాలనా కాలంలోనే 1600లో ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ స్థాపితమై భారతదేశంతో వాణిజ్యం ప్రారంభించింది. ఆమె పరిపాలనా కాలంలోనే ఇంగ్లీషుసాహిత్యం కీర్తి ప్రతిష్ఠలనందుకొంది. ఈ దశలోనే ఇంగ్లండు జాతీయరాజ్యంగా సుస్థిరమైంది. అందుకనే ఇంగ్లీషువారు ఆ దశను స్వర్ణయుగంగా భావిస్తారు.

## 1.5.2 ఫ్రాన్స్ :

ఆధునిక యుగారంభంలో ఫ్రెంచి విప్లవం నాటికి గొప్ప నౌకాబలం కల్గి సముద్రాధిపత్యం కల్గిన రాజ్యంగా ఆవిర్భవించింది ఇంగ్లండ్. ఆనాడు హనోవర్ వంశస్థుడైన మూడోజార్జి (1760 - 1820) ఇంగ్లండ్‌ను పాలించేవాడు. పారిశ్రామిక విప్లవం ద్వారా ఉత్పత్తులు పెరిగినందువలన, విదేశీవర్తకం ద్వారా ఇతర దేశాల నుంచి ధనరాసులు తరలివచ్చినందున ఇంగ్లండ్ ఆర్థికంగా బలపడింది. 1721లో ఇంగ్లండ్‌లో పార్లమెంటరీ విధానం ప్రవేశపెట్టడం జరిగింది. మూడో జార్జి పాలనా కాలంలో జార్జి గ్రాన్విల్ విలియం పిట్ (Elder), లార్ట్‌నార్త్ (Earl of Shalburne) విలియం పిట్ (Younger) ప్రధానమంత్రులుగా కొనసాగారు. పారిశ్రామికంగా అభివృద్ధిచెంది ఆఫ్రికా, ఆసియా ఖండాలలో వలసలను ఏర్పరచుకొని వాటిని తమ పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకుల సరఫరాకు, తాము ఉత్పత్తి చేసిన సరుకుల విడుదలకు అవసరమైన మార్కెట్లుగా వినియోగించుకొని, ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేసిన దేశం ఇంగ్లండ్. జాతి రాజ్యంగా రూపొందిన మరొక ఐరోపారాజ్యం ఫ్రాన్స్, షార్లిమన్ చక్రవర్తి మరణానంతరం ఆ దేశం అనేక చిన్నరాజ్యాలుగా విడబడిపోయింది. వీటిలో ఒకరాజ్యానికి అధిపతి అయిన "హ్యూకేపెట్" మిగతా రాజ్యాలను జయించి దేశ సమైక్యతకు పునాది వేయగా అతని వంశస్థులు దానిని కొనసాగించారు. తొమ్మిదోలూయీ

ఏకరీతి కరెన్సీని ప్రవేశపెట్టాడు. ఇది ద్రవ్యరంగంలో దేశసమైక్యతకు తోడ్పడింది. 1285 నుంచి 1314 వరకు పరిపాలన సాగించిన నాలుగో ఫిలిప్ క్రైస్తవ మతాలయాల ఆస్తులపై పన్ను విధించాడు. దీనికి నిరసన తెలిపిన పోప్ ఆదేశాలను లెక్కచేయలేదు. 1309లో పోప్‌ను తన దేశంలోని "అవిగ్నాన్"కు మార్చాడు. తన చర్యకు తన దేశ ప్రజల మద్దతు సంపాదించేవరకు మతాధికారుల, భూస్వామ్య ప్రభువుల సాధారణ ప్రజల ప్రతినిధులతో "ఎస్టేట్స్ జనరల్"ను ఏర్పరిచాడు. ఆయన మరణానంతరం ఇంగ్లండు రాజైన మూడో ఎడ్వర్డ్ ఉత్తర ఫ్రాన్స్ ప్రాంతాలను తిరిగి ఆక్రమించే ఉద్దేశ్యంతో 1337లో ఫ్రాన్స్‌పై యుద్ధం ప్రారంభించాడు. ఈ యుద్ధం 1453 వరకు సాగింది. యుద్ధ తొలిదశలో ఫ్రెంచి సైన్యాలు ఓడిపోయాయి. ఆ స్థితిలో "జోన్ ఆఫ్ ఆర్క్" అనే సామాన్య యువతి ఫ్రెంచి సైన్యాలకు నాయకత్వం వహించి అనేక విజయాలను సాధించింది. 1430లో ఏడోఛార్లెస్‌ను రీమ్స్ నగరంలో ఫ్రెంచ్ రాజుగా అభిషిక్తుణ్ణి చేసింది. అదే సంవత్సరం ఆంగ్లేయులు ఆమెను పట్టుకొని బహిరంగంగా దహనం చేశారు. కాని ఆమె త్యాగం వలన జాతీయభావ స్ఫూర్తి పొందిన ఫ్రెంచ్ ప్రజలు కెలే మినహా మిగతా ప్రాంతాల నుంచి ఆంగ్లేయులను తరిమివేయగలిగారు.

16వ శతాబ్ది రెండో అర్థభాగంలో అధికారంకోసం కేపట్, గైజ్ బూర్బన్ వంశాలకు చెందిన ముగ్గురు హెన్రీల మధ్య అంతర్యుద్ధం జరిగింది. చివరకు బూర్బన్ వంశానికి చెందిన హెన్రీ ఇందులో విజయం సాధించి సింహాసనం అధిష్టించాడు. ఈయన తొలుత హ్యూజినెట్ (ప్రొటెస్టెంట్) శాఖాభిమాని. దేశప్రజలలో అధిక సంఖ్యాకులు కేథలిక్‌లు. కనుక మత ప్రాతిపదికపై తనకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు జరగకుండా నివారించే నిమిత్తం తాను కేథలిక్ మతాన్ని స్వీకరించాడు. హ్యూజినాట్ల అసంతృప్తి చెందకుండా ఉండేందుకు 1598లో నాన్ట్స్ (Edict of Nantes) ఆదేశాన్ని జారీచేసి వారికి మతస్వాతంత్ర్యమిచ్చాడు. ఈ విధమైన మతసహన విధానాన్ని అనుసరించి జాతిభావ ప్రాతిపదికపై ప్రజలను సమైక్యం చేశాడు. ఫ్రెంచి వాణిజ్యం, పరిశ్రమల అభివృద్ధికోసం కెనడాలో ఫ్రెంచి వలసల స్థాపన కోసం అతను కృషిచేశాడు. ఈ విషయంలో అతని ప్రధానమంత్రి అయిన డ్యూక్ ఆఫ్ సల్లీ చేసిన కృషి ప్రశంసనీయమైనది. 1610 నుంచి 1643 వరకు పరిపాలించిన 13వ లూయి కింద కార్టినల్ రిష్లూ 1624 నుంచి 1642 వరకు ప్రధానమంత్రిగా పనిచేశాడు. ఇతను కేథలిక్ మతాధికార వర్గానికి చెందినవాడు. హ్యూజినాట్లను నిర్ధాక్షిణ్యంగా అణచివేసి దేశంలో శాంతిభద్రతలను కాపాడాడు. అయితే జర్మనీకి చెందిన కేథలిక్ ప్రొటెస్టెంట్ రాజ్యాల మధ్య 1618లో ప్రారంభమైన 30 సంవత్సరాల యుద్ధంలో ప్రొటెస్టెంట్ కూటమిని బలపరచి కేథలిక్ కూటమి, పవిత్ర రోమన్ సామ్రాజ్యం బలహీనపడడానికి కారణభూతుడయ్యాడు. ఇక్కడ మత ప్రయోజనం కాక ఫ్రెంచి జాతి ప్రయోజనం ఆయన విధానానికి మార్గదర్శకమైంది.

1643లో 13వ లూయీ మరణించగా అతని కుమారుడు 14వ లూయీ (1643 - 1715) అధికారంలోకి వచ్చాడు. అతను పిన్నవయస్కుడైనందువల్ల అతని ప్రధానమంత్రి అయిన కార్డినల్ మాజరిన్ (1642 - 61) పరిపాలన బాధ్యతను నిర్వహించాడు. రిష్లూ మరణించడం, చక్రవర్తి పిన్నవయస్కుడుకావడం అవకాశంగా తీసుకొని కొందరు భూస్వామ్య ప్రభువులు, పారిస్ పాలక సమితి తిరుగుబాట్లు చేశారు. కాని కార్డినల్ మాజరిన్ ఈ తిరుగుబాట్లను అణచివేయగలిగాడు. విదేశాంగ విధానంలో 30 సంవత్సరాల యుద్ధాన్ని కొనసాగించి జర్మన్ కేథలిక్ కూటమి పరాజయం చెందడానికి దోహదం చేశాడు. యుద్ధానంతరం 1648లో వెస్ట్‌ఫేలియా వద్ద జరిగిన శాంతిసంధి మాజరిన్ దౌత్యవిజయానికి నిదర్శనం. ఈ సంధి వలన జర్మనీ పశ్చిమభాగంలోగల అల్సాస్ లొరైయిన్ ప్రాంతాలను ఫ్రాన్స్‌కి దఖలు పరచుకొనడమే కాక ప్రొటెస్టెంట్ రాజ్యాలైన నెదర్లాండ్, స్విట్జర్లాండ్, బ్రాండెన్‌బర్గ్ (ప్రష్యా) రాజ్యాల స్వాతంత్ర్యానికి ఇతర ఐరోపా రాజ్యాల గుర్తింపు లభించేటట్లు చేశాడు.

కార్డినల్ మాజరిన్ మరణానంతరం 1661లో 14వ లూయీ తానే స్వయంగా పరిపాలనా బాధ్యతలను స్వీకరించాడు. రిష్లూ, మాజరిన్‌లు అనుసరించిన విధానాలవల్ల ఫ్రాన్స్ ఐరోపాలో అత్యంత శక్తివంతమైన రాజ్యంగా ఆవిర్భవించింది. దీనికితోడు

లూయీ ఆర్థికమంత్రి అయిన కోల్బర్ట్ చేపట్టిన సంస్కరణ వల్ల ఆ దేశం ఆర్థికంగా బలం పుంజుకుంది. ఫ్రెంచి ఈస్టిండియా కంపెనీ స్థాపించి భారతదేశంలో వర్తకాన్ని వృద్ధిచేశాడు. ఆఫ్రికా, కెనడా, వెస్టిండీస్, భారతదేశం, చైనాలో ఫ్రెంచ్ వర్తక స్థావరాలను, వలస ప్రాంతాలను నెలకొల్పాడు. దీనివలన ఫ్రాన్స్ ఆర్థికస్థోమత బాగా పెరిగింది. విదేశాంగ వ్యవహారాలలోను, ఆర్థిక రంగంలోను ఫ్రాన్స్ సాధించిన ప్రగతి లూయీలో తనకు, తనదేశానికి మరింతగా కీర్తిప్రతిష్ఠలు తేవాలనే కాంక్షను రగిలించింది. ఈ లక్ష్యసాధన కోసం ఆయన ప్రతిదేశానికి సహజ సరిహద్దులుండాలనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించి అటువంటి సరిహద్దులను తన దేశానికి ఏర్పరచడానికి అతను పొరుగుదేశాలతో నాలుగుయుద్ధాలు చేశాడు. అవి 1) ఆస్తి సంక్రమణ యుద్ధం (1667 - 68), 2) డచ్ యుద్ధం (1672 - 78), 3) ఆగ్స్‌బర్గ్‌లీగ్ యుద్ధం (1689 - 97), 4) స్పెయిన్ వారసత్వ యుద్ధం (1702 - 1713) ఈ యుద్ధాలలో స్పెయిన్, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, బ్రాండెన్‌బర్గ్ (ప్రష్యా) తదితర జర్మన్ రాజ్యాలూ, ఇంగ్లండ్ వివిధ దశలలో ఫ్రాన్స్‌కి వ్యతిరేకంగా పోరాడాయి. మొత్తం మీద ఫ్రాన్స్ ఏకాకి అయి అనేక విధాలుగా నష్టపోయింది.

ఇంగ్లండ్ పరిపాలకుడైన 8వ హెన్రీలా తానుకూడా ఫ్రాన్స్‌ను పోప్ ఆధిపత్యంనుంచి బయటపడ వేసేందుకు లూయీ 1681లో గాలికన్ చర్చిని స్థాపించాడు. కాని పోప్ పదకొండు ఇన్నోసెంట్ అతణ్ణి క్రైస్తవమతం నుంచి బహిష్కరిస్తానని బెదిరించడంతో మిగతా రాజ్యాలు పోప్‌కి అండగా నిలవడంతో 1693లో గాలికన్ చర్చి రద్దు చేసుకొని పోప్‌కు విశ్వాసపాత్రునిగా మారాడు. అంతేగాక అతడు అంతక్రితమే 1685లో నాన్ట్స్ ఆదేశాన్ని రద్దుచేసాడు. దీనితో ప్రగతిశీల భావాలు గల హ్యూజినాట్లు ఇంగ్లండుకి, ప్రష్యాకు, హాలండ్‌కు తరలి పోయారు. హ్యూజినాట్ల వలస వలన ఫ్రాన్స్ అమితంగా నష్టపోయింది. ముఖ్యంగా ఫ్రాన్స్ పారిశ్రామికాభివృద్ధి కుంటుపడింది. లూయీ భూస్వామ్య వ్యవస్థను బలహీనపరచడానికి గట్టి చర్యలు తీసుకోలేదు. విదేశీ వాణిజ్యాన్ని ప్రోత్సహించలేదు. వలస సామ్రాజ్య నిర్మాణాల గురించి పట్టించుకోలేదు. పైగా ప్రజలపై పన్ను భారం పెంచి తద్వారా వచ్చిన ఆదాయాన్ని యుద్ధాలకు వెర్సే (Versailles) వద్ద నిర్మించిన నూతన రాజధాని భవనాలకు వెచ్చించాడు.

"నేను రాజ్యాన్ని" (Iam the State) అని ప్రకటించి తన నిరంకుశ చర్యల ద్వారా ప్రజలను అనేక విధాల బాధలు పెట్టాడు. చివరిరోజులలో తన విధానాలవల్ల దేశపరిస్థితి ఎంత దిగజారిందో, ప్రజలు తనపట్ల ఎంతగా ఆగ్రహావేశాలు ప్రదర్శిస్తున్నారో గ్రహించి నిరాశ నిస్పృహలతో 1715లో మరణించాడు.

14వ లూయీ అనంతరం సింహాసనమధిష్టించిన 15వ లూయీ సుఖభోగాలలో మునిగితేలుతూ సప్తవర్ష సంగ్రామంలో ఫ్రాన్స్‌ను ఆస్ట్రియా పక్షం వహించేటట్లు చేశాడు. పైగా ఇతని అసమర్థతవల్ల భారతదేశంలోని తమ వలసలను ఫ్రాన్స్ కోల్పోయింది. ఇతని తర్వాత రాజ్యానికి వచ్చిన 16వ లూయీ (1744 - 1792) సప్తవర్ష సంగ్రామంలో ఘోరంగా ఓడిపోయి ఫ్రాన్స్ ప్రతిష్టను మంటగలిపాడు. ఫ్రాన్స్ ఆర్థికపరిస్థితిని చక్కబరచడంలో ఫ్రెంచి రాజులు విఫలం కావడంతో ఫ్రాన్స్‌లో విప్లవం అనివార్యమైంది.

## 1.5.3 స్పెయిన్ :

ఫ్రాన్స్‌కు నైరుతిదిశగా ఉన్న ఐబీరియన్ ద్వీపకల్పంలో 13వ శతాబ్ది నాటికే ఐదురాజ్యాలు నెలకొన్నాయి. అరగాన్, కాస్టీల్, పోర్చుగల్, నవారీ, గ్రనడా అని పిలవబడే ఈ రాజ్యాలలో గ్రనడా ముస్లింరాజ్యంకాగా, మిగిలిన నాలుగు క్రైస్తవరాజ్యాలు. 1500 నాటికి ఈ రాజ్యాలు విలీనం చెంది స్పెయిన్, పోర్చుగల్ అనే రెండు ముఖ్యరాజ్యాలుగా ఆవిర్భవించాయి.

15వ శతాబ్దిలో ప్రసిద్ధిచెందిన రాజ్యాలలో స్పెయిన్ ఒకటి. అరగాన్, కాస్టీల్ అనే రెండు ముఖ్యరాజ్యాల సమ్మేళనమే స్పెయిన్. అరగాన్ చక్రవర్తి ఫెర్డినాండ్, కాస్టీల్ మహారాణి ఇసబెల్లాను 1479లో పరిణయమాడటంవల్ల ఈ రెండు రాజ్యాలు కలిసిపోయి స్పెయిన్ రాజ్యంగా ఏర్పడ్డాయి. కాని ఇవి స్పెయిన్ రాజ్యంగా ఏర్పడినప్పటికీ రెండు వందల సంవత్సరాల వరకు ఇవి

ప్రత్యేక రాష్ట్రాలుగా ఉండిపోయాయి. వీటికి ప్రత్యేక శాసనసభలు, ప్రత్యేక ప్రభుత్వాలు ఉండేవి. వాటి సంస్కృతులు సైతం ప్రత్యేకంగానే ఉండేవి. అందువల్ల స్పెయిన్ రాజ్యాన్ని మిగతా జాతీయరాజ్యాలతో పోల్చలేము.

1492లో ఫెర్డినాండ్ ముస్లిం రాజ్యమైన గ్రనేడాపై దండెత్తి అక్కడి మూర్‌లపై విజయం సాధించి ఆ రాష్ట్రాన్ని స్పెయిన్‌లో విలీనం చేశాడు. తర్వాత 1512లో నవారీపై దాడిచేసి దానిని కూడా ఆక్రమించి స్పెయిన్‌లో కలిపివేశాడు. దీనితో స్పెయిన్ సమైక్యత పూర్తికావడమేగాక, స్పెయిన్ ప్రజల్లో జాతీయభావం అంకురించింది.

ఫెర్డినాండ్, ఇసబెల్లాలు తమ తమ ప్రభుత్వాలను, శాసనసభలను, సంస్కృతులను గౌరవిస్తూనే దేశసమైక్యత కోసం కృషిచేశారు. రాజ్యాధికారాన్ని బలపరచడానికి గట్టి చర్యలు తీసుకున్నారు. భూస్వామ్య ప్రభువులను బలహీనపరచడానికి మధ్యతరగతి ప్రజల సహకారం పొందారు. మొదటగా చర్చిని తమ అదుపులోకి తీసుకున్నారు. శాసనసభలను, రాయల్ కమీషన్‌లను విస్మరించి పరిపాలనా వ్యవహారాల్లో ప్రభుత్వోద్యోగులకు పూర్తి స్వాతంత్ర్యమిచ్చారు. పాలనలో నగరాలకు ఉన్న ప్రత్యేక హక్కులను రద్దు చేశారు. రాజే సర్వసైన్యాధిపతి అయ్యాడు. ప్రభుత్వ కోశాధికారం పూర్తిగా రాజు అదుపులోకి వచ్చింది. పోప్ అనుమతి పొంది ఇన్‌క్విజిషన్ (Inquisition) అనే మతపరమైన న్యాయస్థానాన్ని పునరుద్ధరించి, దీనిద్వారా తమ తమ రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొన్నారు. కొలంబస్ భూగోళాన్వేషణ పథకాన్ని గొంతెమ్మ కోరికని కొందరు కొట్టివేస్తే, మరికొందరు అంత పెట్టుబడి పెట్టాల్సిన పథకం కాదంటూ దాన్ని తోసిపుచ్చేవారు. ఆఖరికి పోర్చుగల్‌రాజు రెండో జాన్ కూడా ఇదంతా జరిగేపనికాదని కొలంబస్‌ని నిరుత్సాహపరిచాడు. అటువంటి పరిస్థితుల్లో స్పెయిన్ రాజు దంపతులు కొలంబస్‌కు ఆర్థికంగా సహాయపడి భూగోళాన్వేషణకు ప్రోత్సహించారు. కొలంబస్ అమెరికాను కనుక్కోవడంతో స్పెయిన్‌కు అత్యధికంగా ధనం లభించింది. కొలంబస్ నౌక అమెరికా తీరాన్ని తాకడంతో స్పెయిన్ ప్రతిష్ఠ ఐరోపాలో అంబరాన్ని అంటింది.

ఐరోపాలో స్పెయిన్ ప్రతష్ఠను ఇనుమడింపజేయడం కోసం ఫెర్డినాండ్ ఇసబెల్లాలు సుప్రసిద్ధ రాజ్యవంశాలతో వివాహసంబంధాలు పెట్టుకున్నారు. తమ ముప్పురు కుమార్తెలలో ఒకరైన ఇసబెల్లాను పోర్చుగీసు రాజుకిచ్చి వివాహం చేశారు. మరొకరైన జోనాను మాక్జిమిలియన్ ఏకైకపుత్రుడైన ఫిలిప్‌కిచ్చి వివాహం జరిపించాడు. ఇంకొక కుమార్తె అయిన కాథరిన్‌ను ఇంగ్లండ్ రాజైన ఏడోహెన్రీ కుమారుడైన ఎనిమిదో హెన్రీకిచ్చి వివాహం చేశారు. అదేవిధంగా తమ ఏకైకకుమారుడైన జాన్‌కు చక్రవర్తి మాక్జిమిలియన్ కుమార్తె మార్గరెట్‌తో వివాహం జరిపించాడు. ఇటువంటి వైవాహిక సంబంధాల ద్వారా ఐరోపాలో స్పెయిన్‌కు విశేషంగా ప్రాచుర్యం లభించింది. పైగా స్పెయిన్‌రాజు ఫెర్టినాండ్ ఇటలీ యుద్ధంలో జోక్యం చేసుకొని ఫ్రెంచిరాజైన పన్నెండో లూయీని ఓడించి నేపుల్స్‌ను ఆక్రమించాడు. 1504 నాటికి నేపుల్స్, సిసిలీ, సార్డీనియాలు స్పెయిన్ ఆధీనంలోకి వచ్చేశాయి. దీంతో ఇటలీ రాజకీయాలలో సైతం స్పెయిన్ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

## 1.5.4 పోర్చుగల్ :

పోర్చుగల్ స్పెయిన్ కంటె విస్తీర్ణంలో చిన్నదే అయినా సారవంతమైన భూములు, అనువైన వాతావరణం నెలకొన్న కారణంగా ఈ దేశం త్వరలోనే అభివృద్ధి చెందింది. క్రీ.శ. 1498లో వాస్కోడిగామా సముద్రమార్గం ద్వారా భారతదేశం చేరడంలో పోర్చుగీసు ప్రభ మరింత వెలిగింది. అంతవరకు అరబ్, వెనిస్ వర్తకుల చేతులలో ఉన్న భారతదేశ సముద్రవ్యాపారమంతా పోర్చుగీస్‌లు కైవసం చేసుకున్నారు. భారతదేశంలో పోర్చుగీసు గవర్నర్‌గా ఉన్న ఆల్‌బుకర్క్ ఈ పనిని సమర్థవంతముగా నిర్వహించాడు. 1511లో దూరప్రాచ్యయంలోని మలక్కాను, 1515లో పర్షియన్ గల్ఫ్‌లోని ఆర్మజ్‌ను పోర్చుగీసువారు స్వాధీనం చేసుకొని అరబ్బులకక్కడ నిలువనీడలేకుండా చేశారు. మరి రెండు సంవత్సరాల లోపే పోర్చుగీసు నావికులు చైనాలోని కాంటన్ రేవును

చేరి మకావోలో వారి స్థావరాన్ని ఏర్పరచుకొన్నారు. ఈ విధంగా హిందూ మహాసముద్రంపై పోర్చుగీసువారి పెత్తనం కొనసాగి, డచ్‌వారిని ఎదిరించారు.

పోర్చుగల్‌రాజు రెండోజాన్ (1481 - 95) తిరుగుబాటు చేస్తున్న ప్రభువులను కఠినంగా శిక్షించాడు. వారి ఆస్తులను, అధికారాలను చాలావరకు తగ్గించాడు. శాసనసభ అధికారాలను సైతం తగ్గించి, నిరంకుశ రాజరిక విధానానికి పునాదులు వేశాడు. అతని తర్వాత రాజ్యానికి వచ్చిన అతని వారసులు కూడా నిరంకుశ రాజరిక విధానాన్నే సమర్థించారు. సమర్థులైన రాజులు ఆ దేశానికి లభించడంచేత ఆ దేశం విశిష్టమైన ప్రగతి సాధించి, బలీయమైన జాతీయరాజ్యంగా రూపొందింది.

## 1.5.5. స్కాండినేవియా రాజ్యాలు :

ఐరోపా వాయవ్య సరిహద్దుల్లో ఉన్న డెన్మార్క్, నార్వే, స్వీడన్‌లను స్కాండినేవియా రాజ్యాలని అంటారు. స్వీడన్, డెన్మార్క్‌లలో రాజు మరణానంతరం రాజును ఎన్నుకునే సంప్రదాయం ఉండగా, నార్వేలో మాత్రం రాజరికం వంశపారంపర్యం. ఈ మూడురాజ్యాలు 1397లో డెన్మార్క్‌లో విలీనం చెందాయి. కాని స్వీడన్‌లో ఈ విలీనానికి ప్రజాభిప్రాయం అనుకూలంగా లేకపోవడంతో 16వ శతాబ్ది నాటికి స్వీడన్ తిరిగి స్వతంత్ర రాజ్యమైంది. నార్వే డెన్మార్క్‌లు మాత్రం కలిసే ఉన్నాయి. డెన్మార్క్ స్వీడన్ దేశాల రాజులు ప్రభువుల, శాసనసభల అధికారాలను తగ్గించి, చర్చిని ప్రభుత్వపరం చేశారు. ఆ విధంగా వారు తమ రాజ్యాలలో ఇంగ్లండ్, స్పెయిన్, ఫ్రాన్సుల వలె నిరంకుశ రాజరికాలను నెలకొల్పారు.

## 1.5.6 రష్యా :

ఆటోమన్‌రాజ్యం, లిథూనియాలకు ఆవల ఈశాన్యదిశగా ఉన్న భూభాగంలో అనాదిగా స్లావిక్ రష్యన్లు నివసించేవారు. కొన్ని తెగలుగా ఏర్పడిన వీరు పరస్పరం కలహించుకొనేవారు. దీనికితోడు పశ్చిమదిశ నుండి స్కాండినేవియన్‌లు, తూర్పుదక్షిణ దిశల నుండి మంగోలులు వీరిపై తరచుగా దాడులు జరిపేవారు. మిగతా ఐరోపాదేశాలతో పోలిస్తే ఈ ప్రాంతం చాలా వెనుకబడి ఉండేది. 16వ శతాబ్ది ఆరంభంలో మాస్కో పాలకుడైన మూడో ఇవాన్ మంగోలుల దాడుల నరికట్టి, తెగలన్నింటిని జయించి ఉత్తరాన ఆర్కిటిక్ మహాసముద్రం వరకు, తూర్పున యూరల్‌పర్వతాల వరకు మాస్కో రాజ్యాన్ని విస్తరింపజేశాడు. బైజాంటైన్ సామ్రాజ్యాధినేత అయిన కాన్‌స్టాంటయిన్‌తో వివాహసంబంధాలు ఏర్పరచుకొని, అక్కడి పరిస్థితులను తన రాజ్యంలో ప్రవేశపెట్టాడు. తర్వాత నాలుగో ఇవాన్‌రాజు రష్యన్ చక్రవర్తిగా “జార్” (Czar) అనే బిరుదాన్ని స్వీకరించి, రష్యాలో నిరంకుశమైన రాజరికానికి పునాదులు వేశాడు. ఈవిధంగా రష్యా ఒక నిరంకుశమైన, బలవత్తరమైన, స్వతంత్రమైన జాతీయరాజ్యంగా ఆవిర్భవించింది.

రష్యాను అభివృద్ధిపరిచిన వారిలో ముఖ్యులు - కాథరిన్ మహారాణి (1762 - 1796) ఈమె భర్తను చంపి అధికారం చేజిక్కించుకుంది. సమర్థవంతమైన విదేశాంగ విధానాన్ని అనుసరించి ఐరోపాలో రష్యాను అగ్రరాజ్యంగా తీర్చిదిద్దింది. పోలెండ్‌ను మూడుసార్లు పంపకంచేసి (1782, 1793, 1795) ప్రష్యా, ఆస్ట్రియా, రష్యాలు తమలోతాము పంచుకొని ఐరోపా రాజకీయపటంలో దాని నామరూపాలు లేకుండా చేశారు. ఈ పంపకాల్లో అత్యధిక భూభాగాన్ని కేథరిన్ కైవసం చేసుకోగల్గింది. టర్కీపై దండెత్తి తురుష్కుల నోడించి కుఛక్ కైనర్జీ (1774) సంధి ద్వారా నల్లసముద్రంపై స్వేచ్ఛగా విహరించే హక్కు పొందింది. అంతేగాక టర్కీ సుల్తాను ఏలుబడిలోని సదాచార క్రైస్తవుల ఆధ్యాత్మిక పోషకత్వం రష్యాకు లభించింది. అందుచేత రష్యా సమీప ప్రాచ్యానికి (Near East) విస్తరించడం ప్రారంభమై 19వ శతాబ్దిలో ప్రాచ్యసమస్యకు కారణమైంది.

ఈ విధంగా 17వ శతాబ్ది ఆరంభం నాటికి ఐరోపాలో జాతీయరాజ్యాలు బలపడ్డాయి. ఈ రాజ్యాలలో గోచరించే కొన్ని ముఖ్యమైన లక్షణాలు - రాజాధికారం బలపడి, నిరంకుశత్వంగా రూపొందింది. భూస్వాముల రాజకీయ అధికారాలన్నింటిని రాజులు కైవసం చేసుకోవడంతో భూస్వామ్య వ్యవస్థ బలహీనపడిపోయింది. జాతీయ రాజ్యాల ఆవిర్భావంతో మధ్యయుగాల్లోని మతానికి సంబంధించి సర్వాధికారి అయిన పోప్ అధికారాలు, పవిత్రరోమన్ చక్రవర్తి అధికారాలు క్షీణించడం మొదలైంది. జాతీయ రాజ్యాలు ఏర్పడటం వల్లనే ఈ రాజ్యాలు త్వరితగతిన అభివృద్ధి చెందసాగేయి.

## 1.6 నమూనా ప్రశ్నలు :

1. క్రీ.శ. 18వ శతాబ్దివరకు ఐరోపా స్థితిగతులను గురించి చర్చించండి.
2. సాంస్కృతిక పునరుజ్జీవనం (Renaissance), మతసంస్కరణోద్యమాల (Reformation) ఆవిర్భావం, వ్యాప్తిని గురించి వివరించండి.
3. జాతీయ రాజ్యాలు ఏర్పడి, బలపడిన వైనం గురించి పేర్కొనండి.
4. 1789 నాటి ప్రసిద్ధ ఐరోపా రాజ్యాలు, వాటి స్థితిగతులను వర్ణించండి.

## 1.7 చదువదగిన గ్రంథాలు :


1. Kettelebey C.D.M. : A History of Modern Europe
2. Rose Halland : The Revolutionary and Napoleonic Era
3. Hazen, C.D. : A History of Modern Europe (1789 - 1945)


- డా॥ వి.వి. సుబ్బారెడ్డి

పాఠం - 2

# ఫ్రెంచి విప్లవం - కారణాలు, గమనము, ఫలితాలు

## ఫ్రాన్స్ రాజ్యాంగ పరిషత్, నేషనల్ కన్వెన్షన్, డైరెక్టరీ

**2.0 లక్ష్యం :**

ఫ్రెంచి విప్లవం, ఫ్రాన్స్ రాజ్యాంగ పరిషత్, నేషనల్ కన్వెన్షన్, డైరెక్టరీ గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయసూచిక :**


2.1. ఫ్రెంచి విప్లవ కారణాలు
- 2.1.1 రాజకీయ కారణాలు
- 2.1.2 సాంఘిక కారణాలు
- 2.1.3 ఆర్థిక పరిస్థితులు
- 2.1.4 వైజ్ఞానిక కారణాలు
- 2.1.5 అమెరికా స్వాతంత్ర్యసంగ్రామ ప్రభావం
- 2.1.6 బాస్టిల్ పతనం

2.2 ఫ్రెంచి విప్లవ ఘట్టాలు
- 2.2.1 టెన్నిస్‌కోర్టు ప్రతిజ్ఞ
- 2.2.2 బాస్టిల్ పతనం
- 2.2.3 పారిస్ స్త్రీల సంరంభం
- 2.2.4 జాతీయ రాజ్యాంగ పరిషత్
  - 2.2.4.1 భూస్వామ్య వ్యవస్థ రద్దు
  - 2.2.4.2 మానవ హక్కుల ప్రకటన
  - 2.2.4.3 రాజ్యాంగ సంస్కరణలు
  - 2.2.4.4 ఆర్థిక సంస్కరణలు
  - 2.2.4.5 నూతన రాజ్యాంగం
- 2.2.5 ఫ్రెంచి శాసనసభ
- 2.2.6 విదేశాల జోక్యం
  - 2.2.6.1 వాల్మీ యుద్ధం
- 2.2.7 భీతావహపాలన
- 2.2.8 నూతన రాజ్యాంగం
- 2.2.9 డైరెక్టరీ

2.3 విప్లవ ఫలితాలు లేక ప్రాముఖ్యత

2.4 ఫ్రెంచి విప్లవ కాలంనాటి ప్రముఖులు

2.5 నమూనా ప్రశ్నలు

2.6 చదువదగిన గ్రంథాలు

## 2.1 ఫ్రెంచి విప్లవానికి గల కారణాలు లేక ఎందువలన ఫ్రెంచి విప్లవం (1789) అనివార్యమైనది ?

ఫ్రెంచి విప్లవం ఆధునిక ఐరోపా చరిత్రలోనేకాక, విశ్వమానవ చరిత్రలోనే సామాన్య ప్రజానీకం చేసిన విప్లవాలలో మొట్టమొదటిదిగా పేర్కొనవచ్చు. అనేక శతాబ్దాలుగా అణగారి ఉన్న సామాన్య ప్రజానీకం తమదేశ రాజకీయ,సాంఘిక, ఆర్థిక వ్యవస్థల పట్ల అత్యంత జాగురూకత కలిగి వ్యవస్థలోని సమస్యలను సమిష్ఠిగా, జాతీయ భావచైతన్యంతో ఎదిరించి జరిపిన తిరుగుబాటు ఇది. ఈ తిరుగుబాటును చూసి ఐరోపాలోని రాజులు, భూస్వాములు, మతాధికారులు హడలిపోయారని చెప్పడం అతిశయోక్తి కాదు. అమెరికా వలసల్లోని ప్రజలు బ్రిటిష్‌వారి ఆధిపత్యాన్ని ఎదిరించి స్వాతంత్ర పోరాటం చేసిన ఆరు సంవత్సరాలకే అంటే 1789లో ఫ్రెంచి విప్లవం ప్రారంభమైనది. అనాదిగా కొనసాగుతున్న నిరంకుశ రాజరిక వ్యవస్థను నిర్మూలించి, ప్రజాసార్వభౌమత్వం అనే నూతన శకానికి ఈ విప్లవం నాంది పలికింది. ఇది ఒక్క ఫ్రాన్సు దేశానికేకాక, యావత్తు ప్రపంచానికే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మహోన్నతమైన భావాలను అందించింది. శాసనసభ, జాతీయకన్వెన్షన్, డైరెక్టరీ అనే విప్లవ సంస్థలు ఏర్పడి రాజరిక స్థానంలో ప్రజాతంత్ర ప్రభుత్వం ఏర్పడడానికి వీలుకల్పించాయి. నెపోలియన్ అన్నట్లు ఈ విప్లవం "ప్రత్యేక సౌకర్యాలు గల వర్గాల మీద ఒక జాతి నడిపిన సామూహిక ఉద్యమం". 18వ శతాబ్ది నాటి ఐరోపాలో అన్ని దేశాల్లోనూ ఇంచుమించుగా ఒకేమాదిరి పరిస్థితులు నెలకొన్నా కొన్ని ప్రత్యేక కారణాల వల్ల విప్లవం ఫ్రాన్సులోనే చెలరేగింది.

### 2.1.1 రాజకీయ కారణాలు :

ఫ్రెంచి విప్లవానికి గల కారణాలలో ప్రముఖంగా చెప్పదగ్గవి రాజకీయకారణాలు. ఇంగ్లండ్‌ను పాలించిన స్టువర్ట్ వంశీయుల వలె ఫ్రాన్సును పరిపాలించిన బూర్బన్ వంశీయులు కూడా తమకుగల నిరంకుశాధికారాలను దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉపయోగించి రాజ్యభ్రష్టులయ్యారు. వాస్తవానికి బూర్బన్ వంశానికి చెందిన రాజులందరూ వ్యక్తిగతంగా నిరంకుశాధికారాలను చెలాయించలేదు. ఈ వంశపాలనను స్థాపించిన నాలుగో హెన్రీ స్వయంగా నిర్ణయాలు చేసి అమలుజరుపగల సమర్థుడైనప్పటికీ ఎక్కువగా తన ప్రధానమంత్రి అయిన "డ్యూక్ ఆఫ్ సల్లీ" మీద ఆధారపడేవాడు. ఆయన తర్వాత అధికారంలోకి వచ్చిన పదమూడో లూయీ తన ప్రధానమంత్రులైన కార్డినల్ రిష్లూ, కార్డినల్ మేజరిన్ చేతులలో కీలుబొమ్మగా వ్యవహరించేవాడు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన 14వ లూయీ (1643 - 1715) ఫ్రెంచ్ రాజరిక నిరంకుశ వ్యవస్థకు నిజమైన ప్రతీక. వాస్తవానికి నాలుగో హెన్రీ కాలంలో అధికార కేంద్రీకరణ ప్రారంభమై 14వ లూయీ నాటికి రాజరిక నిరంకుశత్వం పరాకాష్ఠనందుకుంది.
14వ లూయీ తన కీర్తిప్రతిష్ఠలను విస్తరింపచేసేందుకు అనేక యుద్ధాలు చేసి తన రెండో రాజధాని నగరమైన వర్సేల్స్‌లో కళాఖండాలతో అలరారే అనేక సుందరభవనాలు ఉద్యానవనాలు, వినోద ప్రదర్శనశాలలు, క్రీడాస్థలాలను నిర్మించాడు. ఇతనికి "గ్రాండ్ మోనార్క్" అనే బిరుదు ఉంది. వర్సేల్స్ రాజ అంతఃపురంలోనే 16000 మంది సేవకులుండేవారు. రాజుగారి అశ్వశాలకు సంవత్సరానికి రెండుకోట్ల రూపాయలు ఖర్చు అయ్యేది. ఈ విధంగా రాజవైభోగాలకు, యుద్ధాలకు ధనమంతా వ్యయమైపోతుంది. ఇంకా ఈయన భూస్వామ్య, మతాధికార వర్గ ప్రయోజనాలను పరిరక్షించడానికే పరిమితమయ్యాడు. రాజ్య ప్రయోజనాలనుకాని, ప్రజాసంక్షేమం గురించి కాని పట్టించుకోలేదు. రాజు కార్యకలాపాలను అదుపులోపెట్టే పారిస్‌పార్లిమా (Paris Parlema) నిరుపయోగమైంది. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే ఎస్టేట్స్ జనరల్‌ను ఫ్రెంచి రాజులు క్రీ.శ. 1614 నుంచి సమావేశపరచనేలేదు. ప్రజాభిప్రాయాన్ని సేకరించే ప్రయత్నమే చేయలేదు. పన్నుల నిర్ణయాలు, శాసనాలు రాజఉత్తర్వుల ద్వారా జరిగిపోయేవి. పరిపాలనా అస్తవ్యస్థంగా తయారైంది. ఇది గ్రహించిన 14వ లూయీ తాను చనిపోయేముందు తన వారసుడైన 15వ లూయీని పిలిచి "నన్ను అనుకరించి యుద్ధాలు చేయకు, పొరుగు రాజ్యాలతో శాంతియుత సంబంధాలను నెలకొల్పుకో. చాలా ధనం దుర్వినియోగం చేయవద్దు. సాధ్యమైనంతగా ప్రజాసంక్షేమం గురించి పట్టించుకో. ఇవన్నీ నేను చేయలేకపోయాను. కాని నీవు చేసి చూపెట్టు" అని ఉద్బోధించాడు. కాని దాదాపు 72 సంవత్సరాలపాటు ఆయన తీర్చిదిద్దిన వరవడి నుంచి 15వ లూయీ

(1715 - 1774) కాని, ఆయన తదనంతరం సింహాసనమధిష్ఠించిన 16వ లూయీ (1774 - 1789) కాని బయటపడలేకపోయారు. 14వ లూయీ కాలంలో అస్తవ్యస్తమైన వ్యవస్థను, పరిపాలనా పద్ధతులను చక్కదిద్ది నూతన వ్యవస్థలను నిర్మించాలంటే వారు ఆయన కంటే సమర్థులై ఉండాలి. కాని వారంత సమర్థులుకారు. వారిద్దరికి రాబోయే ప్రళయం గురించి తెలుసు. కాని తామేమీ చెయ్యలేమనే నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు.

15వ లూయీ కాలం నుంచి న్యాయస్థానాలు (పార్లిమాలు) సైతం అవినీతిమయమయ్యాయి. దేశంలో పలురకాల శిక్షాస్మృతులుండటంవల్ల ప్రజలకు న్యాయం జరిగేది కాదు. పలుకుబడి ఉన్న వ్యక్తి తలచుకుంటే ప్రత్యర్థికి ఎంతకాలమైనా జైలుపడేటట్లు చేయవచ్చు. 15వ లూయీకి రాజ్యపాలనపట్ల ఏమాత్రం శ్రద్ధలేదు. భోగలాలసుడై అంతఃపురంలోనే కాలం గడిపేవాడు. ఆయనపట్ల ప్రజలకు ద్వేషం పెరిగింది. అది గమనించే ఆయన "నా తర్వాత వెల్లువ ముంచుకొస్తుంది" (After me the deluge) అని తరచుగా అనేవాడు. ఆయన జోస్యం ఫలించడానికి ఎంతో కాలం పట్టలేదు.

తర్వాత అధికారంలోకి వచ్చిన ఆయన కుమారుడు 16వ లూయీ వాస్తవిక పరిస్థితులను చూడడానికి భయపడి ఎక్కువకాలం వినోద కార్యక్రమాల్లోగాని, తాళాలను మరమత్తుచేయడంలో గాని గడిపేవాడు. పైగా ఆయన భార్యా విధేయుడు. ప్రజలకు మేలు చేయాలనే సదుద్దేశ్యం ఉన్నా భార్య మాటను కాదనలేకపోయేవాడు. ఆయన భార్య మేరీ ఆంతోనెట్ మంచి అందగత్తె. దూరదృష్టిలేని ఆమె ప్రభువర్గాన్ని సమర్థిస్తూ సంస్కరణలు అమలు జరగకుండా చూసేది. విలాసవంతమైన జీవితానికి విరివిగా ఖర్చు చేస్తూ ప్రజల ఆగ్రహానికి గురి అయింది. ఇటువంటి అసమర్థులైన, నిరంకుశులైన రాజుల పాలనపట్ల ప్రజల ద్వేషం నానాటికి పెచ్చుపెరిగింది. ఇలాంటి రాచరిక వ్యవస్థ ఏదో ఒకరోజు కూలిపోకతప్పదు. 1789లో అదే జరిగింది.

## 2.1.12 సాంఘిక కారణాలు :

18వ శతాబ్దినాటి ఫ్రెంచి సమాజం విపరీతమైన సాంఘిక అసమానతలతో నెలకొని వుంది. నాటి సమాజాన్ని స్థూలంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు. అవి 1) స్వాధికార వర్గం, 2) స్వాధికారరహిత వర్గం. స్వాధికారవర్గంలో మతాచార్యులు, భూస్వాములు అనే రెండు వర్గాలున్నాయి. ఈ రెండు వర్గాలకు విశిష్టమైన, అపారమైన అధికారాలున్నాయి. స్వాధికారరహిత వర్గంలో మధ్యతరగతివారు, సామాన్య ప్రజానీకం ఉన్నారు. వీరికి ఎలాంటి సౌకర్యాలు ఉండేవికావు. వీరి జీవన పరిస్థితులు దుర్భరంగా ఉండేవి. "ప్రభువులు యుద్ధాలు చేస్తారు, మతాచార్యులు ప్రార్థనలు జరుపుతారు. ప్రజలు పన్నులు చెల్లిస్తారు" అనేది ఆనాడు వాడుకలో ఉన్న నానుడి.

## ఎ) సాధికారవర్గం :

### 1. మతాచార్యులు :

మతాచార్యులనే "మొదటి ఎస్టేట్" (First Estate) గా పరిగణించేవారు. నాడు ఫ్రాన్స్‌లో 1,30,000 కేథలిక్ మతాచార్యులుండేవారు. దేశంలోని సాగుకు అనువైన భూమిలో ఐదోవంతు మతాచార్యుల చేతిలో ఉండేది. దానిపై వారు ప్రభుత్వానికి పన్ను చెల్లించనవసరంలేదు. అంతేకాక వారు తాము చేసే మతపరమైన సామాజిక సేవకు ప్రతిఫలంగా ప్రతి వ్యవసాయదారుని నుంచి పండిన పంటలో పదోవంతు పన్నుగా వసూలు చేసేవారు. ఈవిధంగా వచ్చిన ధనంతో వారు ఆధ్యాత్మిక విధులను నిర్వహించే బాధ్యత విస్మరించి విలాసవంతమైన జీవితం గడిపేవారు. ఒకమారు 16వ లూయీ "పారిస్ ఆర్చిబిషప్‌గానైనా భగవంతుని మీద విశ్వాసం ఉన్నవ్యక్తికి నియమిద్దాం" అన్నాడు కాని ఆయన మాట సాగలేదు. దీనినిబట్టి మతాచార్యులు ఆధ్యాత్మిక జీవితానికి ఎంతగా దూరమయ్యారో అర్థమవుతుంది.

క్రమంగా మతాచార్యులలో కూడా రెండు వర్గాలేర్పడ్డాయి. అవి ఉన్నత, సామాన్య మతాచార్యులు. చర్చిలలో ఉన్నత పదవులన్నీ ఉన్నత మతాచార్యులివే. వీరు పైన చెప్పిన విధంగా ప్రాపంచిక సుఖాలకు అలవాటుపడి కోటలు, ప్రాసాదాలు మొదలైన భోగభాగ్యాలను సమకూర్చుకుంటూ ఆధ్యాత్మిక విషయాలను నిర్లక్ష్యం చేశారు. వీరిలో చాలామంది వర్సెల్స్ ప్రసాదంలోనే కాలం గడిపేవారు. సామాన్య మతాచార్యులు తక్కువ రాబడితో ఇబ్బందులు పడుతున్నప్పటికీ, నీతిగా జీవిస్తూ ఆధ్యాత్మిక కర్తవ్య భారాన్ని వహించేవారు. ఈ రెండువర్గాల మధ్య సంఘర్షణ ఏర్పడి విప్లవం రాగానే సామాన్య మతాచార్యులు ప్రజలతో చేయి కలిపారు.

**2. భూస్వాములు :**

"రెండో ఎస్టేట్స్" (Second Estate) కు చెందినవారే భూస్వాములు. ఫ్రాన్స్‌లోని మొత్తం 2 కోట్ల 40 లక్షల జనాభాలో 1,50,000 భూస్వాములు ఉండేవారు. దేశంలోని ఎక్కువ భూమి భూస్వాముల చేతుల్లో ఉండేది. వ్యవసాయదారుడు ఆచరణలో సేద్య బానిసస్థితిలోనే ఉండేవాడు. రిష్లూ సామంత భూస్వామ్య వ్యవస్థను తుడిచిపెట్టాడు. కాని భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించలేదు. దాదాపు 800 మంది ఉన్నతస్థాయికి చెందిన భూస్వాములు ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో కీలకపాత్ర వహించేవారు. వీరికి ప్రత్యేక అర్హతలు, హక్కులు, సౌకర్యాలు ఉండేవి. ప్రభుత్వంలో, సైన్యంలో ఉన్నత పదవులు అన్నీ భూస్వాములవే. ప్రభుత్వానికి వీరు పన్నులు చెల్లించనక్కరలేదు. కర్షకులను పీడించి రకరకాల రుసుములు వసూలుచేసి రాజధాని వర్సేల్స్ నగరంలో విందులు, వినోదాలతో కాలం గడిపేవారు. కనుకనే నానాటికీ వీరిపైన సామాన్య ప్రజలకు ద్వేషం పెరిగిపోయింది. ఈ భూస్వాములలో కొందరు సామాన్య భూస్వాములు బయలుదేరి విప్లవంలో ప్రజలకు మద్దతు పలికారు.

## బి) స్వాధికారరహిత వర్గం :

దేశ ప్రజలలో అధిక సంఖ్యాకులు స్వాధికార రహిత వర్గానికి చెందినవారే. వీరినే 'మూడో ఎస్టేట్స్"గా (Third Estates) గా పేర్కొంటారు. వీరిని 1) సేద్య బానిసలు, 2) కర్షకులు, 3) బూర్జువాలు అని మూడు తరగతులుగా విభజించవచ్చు.

**1. సేద్య బానిసలు :**

అందరిలో సేద్యబానిసల పరిస్థితి మరీ దుర్భరంగా ఉండేది. ఇతడు తన భూస్వామి పొలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఊడిగం చేయాలి. తన పొలంలో వేసుకున్న పంట ఇంటికి చేరేవరకు నమ్మకంలేదు. భూస్వాములు పెంచే పావురాళ్ళు, లేళ్ళు పంట పొలాలలోపడి నాశనం చేస్తున్నా వాటిని అదిలించడానికి గూడా భయపడే పరిస్థితి సేద్యబానిసలది. పైగా వీరు తమ గ్రామాలకు సంబంధించిన రహదారులను తమ శ్రమతో తామే నిర్మించుకోవలసి వచ్చేది. ఈ వెట్టిచాకిరీని "కార్వీ" అనేవారు.

**2. కర్షకులు :**

వీరు కట్టవలసిన పన్నులకు అంతేలేదు. మతాచార్యులు, భూస్వాములు, పన్నులు చెల్లించవలసిన అవసరం లేనందున కర్షకులే ప్రభుత్వ ఆదాయంలో అత్యధిక భాగాన్ని సమకూర్చవలసి వచ్చేది. రాజుకు ఉప్పు పన్ను నుంచి ఆదాయపుపన్ను వరకు అనేక ప్రత్యక్ష పరోక్ష పన్నులు చెల్లించాలి. ఉప్పు ఉత్పత్తి, వ్యాపారులపై ప్రభుత్వానికి గుత్తాధిపత్యం ఉండేది. ఆదాయం రాబట్టుకొనేందుకు ప్రభుత్వం ఉత్పత్తికి అయ్యే ఖర్చుకు పదిరెట్లు ఎక్కువగా దాని ధరను నిర్ణయించేది. అంతేకాక దేశంలో 7 సంవత్సరాల వయసు దాటిన ప్రతివ్యక్తి - సంవత్సరానికి కనీసం 7 పౌండ్లు ఉప్పుకొని తీరాలని శాసించింది. "సాల్‌గేబెల్" అనే

పీడన పన్నును ప్రజలు విపరీతంగా ద్వేషించారు. కర్షకులు భూస్వామికి వెట్టిచాకిరీ చేయడమేగాక రహదారి పన్నులు, నజరానాలు ఎన్నో చెల్లించవలసి ఉండేది. ఇవికాక చర్చికి తైథ్, పీటర్స్‌పెన్స్ మొదలైన పన్నులు కూడా చెల్లించవలసి ఉండేది. ఈ పనులన్నీ కట్టగా కర్షకునికి (రైతుకు) మిగిలేది నూటికి ఐదోవంతు పంట మాత్రమే. వర్తకులపై కూడా ప్రభుత్వం విచక్షణారహితంగా పన్నులను విధించేది. అందుకనే ఆనాటి ఫ్రాన్స్‌లో నూటికి తొంభైమంది ఆకలితో చస్తే, మిగతా పదిమంది అజీర్ణంతో చచ్చేవారని చెప్పుకునేవారు.

దేశంలో మూడు ఎస్టేట్ల ప్రతినిధులతో కూడిన ఎస్టేట్ జనరల్ ఆమోదం పొందకుండా నూతన పన్నులను విధించరాదనే ఆచారం ఉంది. అయినప్పటికీ ఫ్రెంచి రాజులు దాదాపు 175 సంవత్సరాలపాటు "ఎస్టేట్స్ - జనరల్"ను సమావేశపరచకుండానే పరోక్ష పన్నుల ద్వారా తమ ఆదాయాన్ని పెంచుకొని, రుణాలు సేకరించి కాలం గడిపేవారు. ఇది సాధ్యంకాని దశలో 1789లో 16వ లూయీ ఎస్టేట్స్ జనరల్ సమావేశాన్ని ఏర్పాటు చేయక తప్పలేదు. ఆ సమావేశమే విప్లవానికి నాంది అయింది.

### 3. బూర్జువాలు :

వర్తకులు, పారిశ్రామికవేత్తలు, అధ్యాపకులు, న్యాయవాదులు, రచయితలు మొదలైన మధ్యతరగతివారే బూర్జువాలు. వీరు విద్యావంతులై అన్ని యోగ్యతలు కల్గి ఉన్నప్పటికీ వీరికి ప్రభుత్వంలో ఎలాంటి స్థానం లభించేదికాదు. పన్నులు మాత్రం దండిగా చెల్లించవలసి వచ్చేది. అందుచేత చైతన్యవంతమైన ఈ వర్గం రాజకీయహక్కుల కోసం ఆందోళన చేపట్టింది.

## 2.1.3 ఆర్థిక పరిస్థితులు :

18వ శతాబ్దిలో ఫ్రాన్స్ ఆర్థికపరిస్థితి చాలా దిగజారిపోతుంది. రాచరిక విలాసాలకు, విదేశాలతో యుద్ధాలకు కోట్ల కొలది ధనం దుర్వినియోగమైంది. ముఖ్యంగా 14వ లూయీ చేసిన యుద్ధాలు, నిర్మించిన 'వర్సే' భవనాలు ప్రభుత్వ కోశాగారాన్ని గుల్లచేశాయి. సామాన్య ప్రజలపై పన్నుల భారాన్ని పెంచాయి. అయినా 15వ లూయీ ఆ మార్గం నుంచి బయటపడలేదు. ఆయన ఆస్ట్రియన్ వారసత్వయుద్ధం (1740-48) లో సప్తవర్ష సంగ్రామం (1756-63) లో పాల్గొని చివరకు భారత దేశం, అమెరికాల్లో ఫ్రాన్స్‌కు ఉన్న వలసలను కోల్పోయాడు. దీనితో వలసల నుంచి వచ్చే ఆదాయం తరిగిపోయింది. విదేశీ వాణిజ్యం దెబ్బ తిన్నది. ఆయన తర్వాత అధికారంలోకి వచ్చిన 16వ లూయీ కూడా అదే బాటలో నడిచి అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి (1775-1783)అన్ని విధాల సహాయం చేశాడు. ఇది ప్రభుత్వ ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయడమేకాక ప్రజలలో రాచరిక వ్యవస్థ పట్ల మరింత ద్వేషాన్ని, గణతంత్ర వ్యవస్థ పట్ల అభిమానాన్ని రగుల్కొలిపాయి. ఇదే దశలో కరువు కాటకాలు విస్తరించాయి. 1789 శీతాకాలంలో కనీవినీ ఎరుగని రీతిలో చలిబాధ పెరిగి ప్రజాజీవితాన్ని స్తంభింపచేసింది. సామాన్య ప్రజలకు అవసరమైన ఉన్ని దుస్తులు లేవు. విపరీతంగా పెరిగిన పన్నులు చెల్లించలేక సామాన్య ప్రజలు భూములు వదలి పట్టణ ప్రాంతాలకు పారిపోయారు. ప్రభుత్వ ఆదాయ వ్యయాల లెక్కల నిర్వహణ గాని, ఆడిట్ పద్ధతి గాని ఉండేది కాదు. చివరకు ప్రభుత్వం అప్పుల పాలైంది. ఈ అప్పులు పెరిగి చివరకు ప్రభుత్వ రాబడిలో సగం వడ్డీల చెల్లింపులకే సరిపోయే పరిస్థితి ఏర్పడింది. అస్తవ్యస్తంగా ఉన్న ఆర్థికపరిస్థితిని సరిదిద్దడానికి ప్రభుత్వ అధికార్లు పలు సంస్కరణలు చేశారు. కాని అవేవీ ఫలించలేదు. దేశంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించింది. ఆకలితో అలమటించిన ప్రజలు దోపిడీలకు పూనుకునేవారు అయినా ప్రభుత్వ వైఖరిలో మార్పులేదు. 'డిజోన్' రాష్ట్రగవర్నర్ తనముందు ప్రదర్శన జరిపిన క్షుద్బాధితులకు - "పొలాలలో గడ్డి మొలిచింది, దానిని తిని బతకండి" అని సలహా ఇచ్చాడు. మహారాణి మేరీ ఆంతోనెట్, తన ముందు రొట్టె కావాలని నినాదాలను చేసిన ప్రజలను చూసి - రొట్టె దొరకకపోతే వారెందుకు కేకులు తినరో అర్థం కాక విస్తుపోయింది. ప్రజల పరిస్థితుల గురించి ఆమెకున్న అవగాహన అటువంటిది. రాణీ, ఇతర ఉన్నతోద్యోగుల మాటలు విని, రాజకుటుంబపు అనవసర ఖర్చులను తగ్గించడానికి ప్రయత్నించిన టర్గో (1774-1776),

జాక్వెస్ నెక్కర్ (1776-1781) వంటి ఆర్థికశాఖా మంత్రులను 16వ లూయీ పదవుల నుండి తొలగించాడు. తర్వాత అప్పులు చేయడంలో ఘనుడైన కొలాన్‌ను ఆర్థిక మంత్రిగా నియమించాడు. అతడు హెచ్చువడ్డీకి అప్పులు తెచ్చి కొన్నాళ్ళు ప్రభుత్వం నడిపాడు. ఈ చర్య ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. దేశంలో పెరిగిపోయిన ఈ అసంతృప్తికర పరిస్థితులను చక్కదిద్దడానికి విప్లవం తప్ప వేరే మార్గం లేదనే భావన ప్రబలంగా ఏర్పడింది.

### 2.1.4 వైజ్ఞానిక కారణాలు :

అనేక ఐరోపా దేశాలలో ఫ్రాన్స్‌లో కన్నా ఎక్కువ దుర్భర పరిస్థితులు ఉన్నాయి. కాని వాటిలో విప్లవాలు రాలేదు. ఫ్రాన్స్‌లో విప్లవం రావడానికి అక్కడి ప్రజలలో పెంపొందిన రాజకీయ చైతన్యం ఒక కారణం. ఈ ప్రజా చైతన్యం ఆవిర్భవించి విస్తరించడానికి ఆనాటి ఫ్రెంచ్ మేధావుల రచనలు చాలావరకు దోహదం చేశాయి. ఇంకా ఆనాడు వైజ్ఞానిక పరిశోధనల ఫలితంగా పెరిగిన శాస్త్రీయ విజ్ఞానమూ, హేతువాద దృక్పథమూ రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలను ప్రభావితం చేసింది. ఫ్రెంచి మేధావులు, తత్వవేత్తలు సమాజంలో నెలకొని ఉన్న అసమానతలను, నిరంకుశ, లంచగొండి ప్రభుత్వాన్ని తమ రచనల ద్వారా ఖండించసాగారు. హేతువాదానికి నిలవని ఏ సంస్థనైనా, ఆచారాన్నైనా వీరు దుయ్యబట్టారు. ఇలాంటి తత్త్వవేత్తలలో సుప్రసిద్ధులు ఎ) మాంటెస్క్యూ బి) వోల్టేర్ సి) రూసో.

### ఎ) మాంటెస్క్యూ (1689 - 1755) :

18వ శతాబ్ది తాత్త్వికులలో ప్రముఖుడు మాంటెస్క్యూ "ది స్పిరిట్ ఆఫ్ లాస్" (The Spirit of Laws) అనే తన గ్రంథంలో ఫ్రాన్స్‌లోని రాజకీయ సామాజిక వ్యవస్థలను తీవ్రంగా విమర్శించాడు. అంతేగాక సుప్రసిద్ధ రాజ్యాంగాలను గురించి వర్ణించాడు. ప్రజల రాజకీయ స్వాతంత్ర్యం సురక్షితంగా ఉండాలంటే ప్రభుత్వాధికారాలన్నీ ఒకవ్యక్తి చేతిలో కేంద్రీకృతం కారాదని, ప్రభుత్వంలోని మూడు అంగాలైన శాసన నిర్మాణశాఖ, కార్యనిర్వాహకశాఖ, న్యాయశాఖలు దేనికదే స్వతంత్రంగా, వేరువేరుగా పనిచేస్తూ ఒక దానిని మరొకటి అదుపు చేయాలని ప్రతిపాదించాడు. బ్రిటీషు వ్యవస్థ చక్కగా పనిచేయడానికి కారణం - ఆ దేశంలో శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయశాఖలు వేరువేరుగా పనిచేయడమేనని ఆయన అభిప్రాయపడ్డాడు. నిరంకుశ ప్రభుత్వాన్ని అదుపుచేయాలంటే ఇట్టి 'అధికార విభజన' జరగాలని తన గ్రంథంలో పేర్కొన్నాడు. ఈ సిద్ధాంతం నిరంకుశ రాచరిక వ్యవస్థకు గొడ్డలిపెట్టువంటిది. ఈ గ్రంథం ఫ్రెంచి మధ్యతరగతిని చాలా ప్రభావితం చేసింది. హింసావాదానికి మాంటెస్క్యూ వ్యతిరేకి. కాని తన రచనలు ప్రజలను విప్లవానికి పురికొల్పుతాయని అతడనుకోలేదు.

### బి) వోల్టేర్ (1694 - 1778) :

మరొక ఫ్రెంచి ప్రఖ్యాత తాత్త్వికుడు వోల్టేర్. ఇతని అసలుపేరు 'ఫ్రాన్స్వామారీ ఆర్వే' (Franois Marie Arvoet) వోల్టేర్ రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇతడు హాస్యధోరణిలో చురుకైన విమర్శలు చేస్తూ అనేక వ్యాసాలు ప్రచురించాడు. అంతేకాక, కవిగా, నాటకకర్తగా ప్రసిద్ధుడు. వోల్టేర్ తన వ్యంగ్య రచనల ద్వారా ఆనాటి వ్యవస్థలను తీవ్రంగా దుయ్యబట్టాడు. చర్చి వ్యవస్థలోని, ప్రభుత్వంలోని, సమాజంలో ప్రబలిన దురాచారాలను తీవ్రంగా విమర్శించాడు. ప్రజల సహజహక్కుల (Natural Rights) కోసం తన రచనల ద్వారా పోరాడాడు. శాస్త్రీయ విజ్ఞానం పట్ల వోల్టేర్‌కు గౌరవాభిమానాలు ఎక్కువ. మతాచార్యుడు వట్టి మోసగాళ్లనీ, మత గ్రంథాలలో పేర్కొన్న అద్భుతాలు నిజంగా అద్భుతాలు కావనీ, వట్టి భ్రమలేనని, మానవ కల్పితాలేనని ఆయన ప్రబోధించాడు. ఆయన నిరంకుశ ప్రభుత్వాన్ని ఖండించినప్పటికీ, ప్రాజ్ఞ నిరంకుశత్వాన్ని సమర్థించాడు. "నూరు ఎలుకలు పాలించడం కన్నా ఒక సింహం పాలించడం మేలు కాదా ? అని వోల్టేర్ ప్రశ్నించాడట. చరిత్రలో మానవుడు ఉపయోగించిన

మేధావిక ఆయుధాలన్నింటిలోకి వోల్టేర్ ప్రయోగించిన ప్రహసనం ప్రచండమైనది అంటాడు మెకాలే. దీనినిబట్టి ఫ్రెంచి ప్రజలలో చైతన్యం కలగడానికి వోల్టేర్ రచనలు ఎంతగా తోడ్పడ్డాయో అవగతమవుతుంది. కనుకనే వోల్టేర్‌ను "విప్లవంలో సగభాగం" అన్నారు. ప్రజల మన్ననలను పొంది వారి చేత "వోల్టేర్ రాజు" (King Voltaire) అనే బిరుదు పొందాడు.

## సి) రూసో (1712 - 1778) :

దాదాపు రెండు శతాబ్దాలకు పైగా అనేక దేశాల రాజకీయ భావాలపై తన రచనల ప్రభావాన్ని ప్రసరింపజేసిన జీన్ జాక్ రూసో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఫ్రెంచి తత్త్వవేత్త. జెనీవాలో ఒక బీదకుటుంబంలో జన్మించి, బాల్యంలో అనేక కష్టాలుపడి, జీవనోపాధి కోసం ఉపాధ్యాయునిగా, ప్రయివేటు కార్యదర్శిగా, సంగీత వాయిద్యకారునిగా పనిచేసి చివరకు రచయితగా స్థిరపడ్డాడు. ఆయన వ్రాసిన గ్రంథాలలో My Confession, Emile, Discourses on Arts and Science, Social Contract ముఖ్యమైనవి. హాబ్స్ చెప్పినట్లు మానవుడు సహజంగా క్రూరుడు కాదని రూసో నమ్మిక. అతడు ఆశాజీవి. "డిస్కోర్సెస్ ఆన్ ఆర్ట్స్ అండ్ సైన్స్" అని తన గ్రంథంలో తన ఊహాప్రపంచాన్ని ఈ విధంగా వర్ణించాడు. "అక్కడి ప్రజలంతా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ఓలలాడుతుంటారు. భగవంతుడు ప్రసాదించిన భూమిపై యాజమాన్యపు హక్కు ఎవరికీ లేదు. అక్కడ బీభత్సాలు సృష్టించడానికి యుద్ధాలు గాని, ప్రజలను పీడించడానికి పన్నులు గాని, స్వాతంత్ర్యాన్ని అపహరించే చట్టాలుకాని, ప్రజలను మభ్యపెట్టడానికి తత్త్వవేత్తలు కాని మచ్చుకైనా కనిపించరు". మరో కరపత్రంలో సమాజంలో అసమానత్వం నెలకొనడానికి మూలకారణం సొంత ఆస్తులు కల్గి ఉండడమేననీ, దీని వల్ల అత్యాశతో కొందరు ధనం కూడబెట్టి సమాజాన్ని పీడిస్తారని చెప్పాడు. తన సుప్రసిద్ధ గ్రంథమైన "సోషల్ కాంట్రాక్ట్" లో రూసో "మానవుడు స్వేచ్ఛాజీవిగా జన్మించాడు. కాని ప్రతిచోటా అతడు సంకెళ్ళలోనే ఉన్నాడు" అని ప్రకటించి, నాటి క్రూరపాలనను ఖండించి, "తిరిగి ప్రకృతి వరకు పోదాం" అనే నినాదం లేవనెత్తాడు. రూసో ప్రకృతిని ఆరాధించేవాడు. ఈ ప్రకృతి ఉపాసనే అతణ్ణి మానవుని సహజ ప్రకృతి పరిశోధనకు పురికొల్పింది. రాజ్యసర్వసత్తాకాధిపత్యం ప్రజల చేతిలో ఉంటుందని, ప్రజాసంక్షేమం కోసం పనిచేయని ప్రభుత్వాలను మార్చే అధికారం వారికుంటుందని ప్రతిపాదించాడు. మాంటెస్క్యూ, రూసోల అభిప్రాయాలు అమెరికన్లను ఉత్తేజపరిచి వారిని స్వాతంత్ర్య సంగ్రామానికి పురిగొల్పాయి. వారి రచనలను అనుసరించే అమెరికన్లు గణతంత్ర రాజ్యాంగాన్ని రచించుకొన్నారు. తమ దేశ మేధావుల రచనలు మరొక దేశాన్ని నిరంకుశ పాలననుంచి విముక్తి చేస్తే తమ దేశం రాచరిక వ్యవస్థలో మగ్గడం ఫ్రెంచ్ ప్రజలకు అసంబద్ధంగా అనిపించి వారు కూడా విప్లవ పంథాలో నడిచారు.

## డి) డెనిస్ డిడిరో :

గొప్ప తాత్త్విక రచయిత డిడిరో. ఇతడు 20 సంపుటాలతో కూడిన విజ్ఞాన సర్వస్వాన్ని వెలువరించాడు. ఇందులో రూసో, వోల్టేర్, టర్గో మొదలైన ప్రముఖుల వ్యాసాలు చోటుచేసుకున్నాయి. ఈ ఉద్గ్రంధం నాటి సామాజిక అసమానతలను, సామాన్య ప్రజల దౌర్భాగ్యాన్ని, నిరంకుశ ప్రభుత్వాన్ని దుయ్యబట్టి ప్రజలను మేల్కొలిపింది. ఈ తత్వవేత్తల బోధనలన్నీ స్వేచ్ఛ, సమత్వం, సౌభ్రాతృత్వము అనే మూడు ఆదర్శాలుగా రూపుదిద్దుకున్నాయి. ఇవే విప్లవకారుల నినాదాలయ్యాయి.

## ఇ) ఫిజియోక్రాట్స్ :

ఫ్రెంచి ఆర్థిక శాస్త్రవేత్తలలో ఒక ప్రత్యేక వర్గానికి చెందినవారు ఫిజియోక్రాట్స్. వీరిలో ముఖ్యులు - ఫ్రాన్సాకెనే, మార్క్విస్ డి గూర్నె. సమకాలీన ఆంగ్ల ఆర్థిక శాస్త్రవేత్త అయిన ఆడమ్ స్మిత్ రచనల ప్రభావం ఫిజియోక్రాట్లపై పడింది. సహజసంపదకు మానవ కృషి జోడించినప్పుడే సంపద ఉత్పన్నమౌతుందనే విప్లవాత్మక ఆర్థిక సూత్రాన్ని వీరు ప్రతిపాదించారు.

దీని వల్ల ఉత్పత్తిలో మానవ శ్రమకు గుర్తింపు లభించింది. తద్వారా సామ్యవాద సిద్ధాంతానికి ఈ సూత్రం మూలమైంది. పరిశ్రమల మీద, వర్తక వాణిజ్యాల మీద ప్రభుత్వం ఆంక్షలు విధించరాదని, వాణిజ్యం పోటీ ద్వారానే లాభదాయకమని, స్వేచ్ఛా వాణిజ్యం అనుసరించాలని, అంతర్జాతీయ వ్యాపార విధానం అవలంబించాలని వీరు వాదించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల వివిధ పన్నుల వల్ల బాధపడే సామాన్య ప్రజానీకాన్ని ఈ నూతన ఆర్థిక సిద్ధాంతాలు ఆకర్షించాయి. ఇలాంటి తత్త్వవేత్తల భావోద్రేకపూరితమైన రచనలు ఫ్రెంచివారిని విప్లవాభిమానులను చేశాయి.

### 2.1.5 అమెరికా స్వాతంత్ర్య సంగ్రామ ప్రభావం :

అమెరికా స్వాతంత్ర్య సంగ్రామంలో స్వచ్ఛంద సైనికులుగా పాల్గొన్న కొందరు ఫ్రెంచి జాతీయులు స్వాతంత్ర్యం, సమానత్వం మొదలైన మహదాశయాలచే ప్రభావితులయ్యారు. యుద్ధానంతరం తిరిగి ఫ్రాన్స్‌కు చేరుకున్న వీరు ఫ్రెంచి ప్రజలలో ఈ ఆశయాలను గురించి ప్రచారం చేశారు. ఇది కూడా ఫ్రెంచి విప్లవానికి పరోక్షంగా కారణభూతమైందని చెప్పవచ్చు.

### 2.1.6 బాస్టిల్ పతనం :

16వ లూయీ జాతీయసభా సభ్యులపై సైనిక చర్య జరిపి వారిని చెదరగొట్టదలచుకొని రాజధానిలో సైనిక దళాలను దింపాడు. అంతేకాక, సంస్కరణాభిలాషి అయిన నెక్కర్ అనే ఆర్థిక శాఖామంత్రిని పదవీభ్రష్టుని చేసి దేశ బహిష్కరణ గావించాడు. ప్రజలు దీంతో ఆగ్రహోదగ్రులయ్యారు. జులై 14, 1789 న పారిస్‌లో వారు తిరుగుబాటు చేసి బాస్టిల్ అనే కోటను స్వాధీనం చేసుకొని అందులో ఉన్న ఖైదీలను విడిచిపెట్టారు. బాస్టిల్ పతనం ఐరోపా చరిత్రలో ఒక మహత్తర సంఘటన. రాజరిక నిరంకుశత్వ వినాశనానికది నాంది. విప్లవ ప్రారంభానికది అంకురార్పణం. దేశమంతటా ప్రజల తిరుగుబాటుకు అది ఒక సంకేతం. నాటి నుంచి ఫ్రాన్స్‌లో ఫ్యూడల్ వ్యవస్థ నశించింది. అందువల్లనే ఈనాటికీ ప్రతి సంవత్సరం జులై 14న ఫ్రాన్స్‌లో జాతీయ దినోత్సవం జరుపుకుంటారు.

## 2.2 ఫ్రెంచి విప్లవ ఘట్టాలు : (లేదా) 1789 నుండి 1804 వరకు ఫ్రాన్స్ చరిత్రలో జరిగిన ప్రముఖ సంఘటనలు :

పాత రుణాలను తీర్చలేక కొత్త రుణాలను సంపాదించలేక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న 16వ లూయీ కొత్త పన్నులను విధించి ఆర్థిక సమస్యలను పరిష్కరించాలనే తలంపుతో 1789 మే 5న వర్సై నగరంలో ఎస్టేట్స్ జనరల్ సమావేశాల్ని ఏర్పాటు చేశాడు. మూడు ఎస్టేట్లు విడివిడిగా సమావేశం కావాలని ఒక్కొక్క ఎస్టేట్‌కి ఒక ఓటు ఉంటుందని అతని ఆదేశం స్పష్టం చేసింది. 1789లో మూడో ఎస్టేట్‌కు తీవ్రవాదులు ఎన్నికయ్యారు. అందుచేత మూడో ఎస్టేట్ సభ్యులు (తీవ్రవాదులు) దీనికి అంగీకరించలేదు. మూడు ఎస్టేట్లకు చెందిన సభ్యులు ఏక కాలంలో ఒకే స్థలంలో సమావేశం కావాలని, ప్రతి సభ్యునికి ఓటు హక్కు ఉండాలని వారు వాదించారు. మొదటి రెండు ఎస్టేట్లలో చెరొక 300 మంది, మూడో ఎస్టేట్‌లో 600 మంది సభ్యులుండేవారు. అంటే మొదటి రెండు ఎస్టేట్ల సభ్యుల సంఖ్య మూడో ఎస్టేట్ సభ్యుల సంఖ్యకు సమానమన్నమాట. ఈ ఎస్టేట్ల సభ్యులు గతంలో వేర్వేరుగా సమావేశమై తమ కార్యకలాపాలను నిర్వహించేవారు. ఎంతమంది సభ్యులున్నా ఎస్టేటుకు ఒకే ఓటు ఉండేది. స్వాధికార వర్గాలైనందున మొదటి రెండు ఎస్టేట్‌లు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఐకమత్యంతో కలసి ఓటు చేసేవి. ఫలితంగా మూడో ఎస్టేట్స్ ఎప్పుడూ ఓడిపోతూ ఉండేది. కాని, తర్వాత మొదటి రెండు ఎస్టేట్లలోని కొంతమంది సభ్యులు మూడో ఎస్టేట్‌ను బలపరచడానికి సిద్ధమయ్యాయి. అందుకనే మూడో ఎస్టేట్స్ సభ్యులు ఈ విషయంపై పట్టుబట్టారు. మొదటి రెండు ఎస్టేట్ల సభ్యుల్లో అధికశాతం మూడో ఎస్టేట్స్ ప్రతిపాదనను తీవ్రంగా ప్రతిఘటించారు. నెలరోజులకుపైగా తర్జనభర్జనలు జరిగాయి.

చివరకు మూడో ఎస్టేట్ 1789 జూన్ 17న తనంతటతానుగా సమావేశమై తనను "జాతీయసభ" (National Assembly) గా ప్రకటించుకొంది. దీనిద్వారా మూడోఎస్టేట్ తాను దేశసమస్యలన్నింటిని చర్చించి నిర్ణయాలు తీసుకోదలచుకున్నానని లూయీకి పరోక్షంగా తెలియజేసింది.

## 2.2.1 టెన్నిస్ కోర్టు ప్రతిజ్ఞ :

మూడోసభ జాతీయసభగా ప్రకటించుకోవడంతో ఆగ్రహించిన రాజు 16వ లూయీ జూన్ 20న సభాస్థలిలోనికి "జాతీయసభ" సభ్యులను ప్రవేశించడానికి అనుమతించకుండా, భవనాన్ని మూసివేయించాడు. అయితే జాతీయసభ్యులు (మూడో ఎస్టేట్ సభ్యులు) పక్కనే ఉన్న టెన్నిస్‌కోర్టు హాల్‌లో సమావేశమయ్యారు. పై రెండు సభలలోని సభ్యులు కొందరు వీరిలో చేరారు. సభకు బైలి అధ్యక్షత వహించగా మిరోబా, లఫమెట్, మరా, డాఫన్, రెజెస్పెయర్, స్పెస్ మొదలైన తీవ్రవాదులంతా ఆ సభకు హాజరయ్యారు. తాము దేశానికవసరమైన "రాజ్యాంగ రచనను పూర్తిచేసే వరకు తిరిగిపోయేదిలేదు. అందుకోసం ఎప్పుడవసరమయితే అప్పుడు సమావేశం అవుతాం" అని ప్రతిజ్ఞ చేశారు. "జాతీయ సభగా" ఏర్పడడం ద్వారా శాసనాధికారం తమది అని సూచించిన ఆ సభ సభ్యులు టెన్నిస్‌కోర్టు ప్రతిజ్ఞ ద్వారా తాము దేశానికొక రాజ్యాంగాన్ని వ్రాయదలచుకొన్నామని, దానికి లూయీ కట్టుబడి ఉండాలని హెచ్చరించారు. ఈ "టెన్నిస్‌కోర్టు ప్రతిజ్ఞ"నే విప్లవారంభంగా పరిగణిస్తారు.

ఇందుకు ప్రతిస్పందనగా లూయీ జూన్ 23న ఎస్టేట్ జనరల్ సంయుక్త సమావేశాన్ని ఏర్పాటుచేసి, మూడో ఎస్టేట్ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమైనవని, విలువలేనివని, దాని సభ్యులు కూడా చక్రవర్తి (తన) ఆదేశాలు పాటించవలసిందేనని ప్రకటించింది. కాని "జాతీయ సభ" సభ్యులు మాత్రం సమావేశం నుంచి నిష్క్రమించడానికి నిరాకరించారు. వారి నాయకుడైన మిరాబో "తాము అక్కడ ప్రజాభిప్రాయం మేరకు ఉన్నామని, తమను అక్కడి నుంచి ఎవరూ బయటకు పంపలేరని, ఒక్క తుపాకులు మాత్రమే పంపగలవని మీ యజమానితో చెప్పు" అని వారిని బయటకు పంపడానికి వచ్చిన అధికారిని హెచ్చరించాడు. ఈ చర్య ద్వారా తన ఆదేశాలపై కాక ప్రజల ఆదేశాలపై వారి ప్రతినిధులుగా తామక్కడున్నామని "జాతీయ సభ" సభ్యులు లూయీకి తెలియజేశారు. ఒకపక్క మూడో ఎస్టేట్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తన బంధువులు, ఆస్థాన సభ్యుల ఒత్తిడి వేరొకపక్క మూడోఎస్టేట్ బహిరంగ ధిక్కరణ - ఈ రెండింటికి మధ్య లూయీ ఎటూ తేల్చుకోలేక అనిశ్చిత స్థితిలోపడ్డాడు. ఇది గమనించిన మొదటి రెండు ఎస్టేట్లలోని కొంతమంది సభ్యులు జూన్ 25న "జాతీయ సభ" సమావేశాలలో పాల్గొన్నారు. ఈ వార్త విన్న లూయీ రెండు రోజుల తర్వాత మూడు ఎస్టేట్లు కలిసి కూర్చునేందుకు ప్రతి సభ్యుడు ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అంగీకరించాడు. ఇది మూడో ఎస్టేట్‌కు ఘనవిజయం. కాని లూయీ దానిని "జాతీయ సభ"గా గుర్తించలేదు. జాతీయ సభ నూతన రాజ్యాంగాన్ని నిర్మించాలనే సంకల్పంతో జూలై 8వ తేదీన రాజ్యాంగ పరిషత్‌గా రూపొందింది. కాని లూయీ రాజ్యాంగపరిషత్ కార్యక్రమాలను బలప్రయోగంతోనైనా నిలుపుదల చేయాలనే ఉద్దేశ్యంతో 20వేల సైనికులను సరిహద్దుల నుంచి పారిస్ నగరానికి రప్పించాడు.

## 2.2 బాస్టిల్ పతనం :

లూయీ తన దర్బార్ ప్రముఖుల ఒత్తిడికి లొంగి ప్రభుత్వ దుబారా ఖర్చుకు అడ్డుకట్టవేయడానికి ప్రయత్నిస్తున్న ఆర్థికమంత్రి నెక్కర్‌ను పదవి నుంచి తొలగించాడు. దీనితో ప్రజలు మరింతగా రెచ్చిపోయారు. ఇంకా దేశంలోని ఇతర ప్రాంతాలలో ఉన్న సైనిక దళాలను కూడా పారిస్‌కు తెప్పించాడు. వాటి రాక సందర్భంగా లూయీ అనుచరులు, బంధువులు జూలై 13న భారీఎత్తున విందు చేసుకున్నారు. అదేరోజున పారిస్‌నగర వీధులలో ప్రజలకు సైనికులకు తీవ్రపోరాటం జరిగింది. జూలై 14వ తేదీన బాస్టిల్ కోటను బద్దలుకొట్టి పారిస్ ప్రజలు అందులోని ఖైదీలను విడుదల చేశారు. బాస్టిల్ పతనం విప్లవ చరిత్రలో ఒక ప్రధాన సంఘటన.

అనంతరం విప్లవకారులు తమ నగర ప్రభుత్వ కార్యాలయాలను స్వాధీనం చేసుకొని, వాటిపై మూడురంగుల విప్లవ జండాలను ఎగురవేశారు. విప్లవనాయకులలో ఒకడైన బైలీని పారిస్ మేయర్‌గా నియమించారు. వేలాది యువకులను సమీకరించి "జాతీయ భద్రతా దళాన్ని" (National Guard) ఏర్పాటు చేశారు. దానికి అమెరికా స్వాతంత్ర్య పోరాటంలోపాల్గొని తిరిగి వచ్చిన "లఫయత్"ను దళాధిపతిగా నియమించారు. బాస్టిల్ పతనం వార్త దేశం నలుమూలల వ్యాప్తి చెందగానే సేద్యబానిసలు తిరగబడి భూస్వాముల, మతాధికారుల ప్రాసాదాలను నేటమట్టం చేశారు. వారి భూములను ఆక్రమించడం ప్రారంభించారు. ప్రతి పట్టణంలోను "జాతీయ భద్రతా దళాలు" ఏర్పడ్డాయి. ఇంతవరకు ప్రభుత్వ ఆంక్షలకు భయపడి యదార్థ వార్తలను ప్రచురించలేని పత్రికలకు ఇప్పుడు విముక్తి లభించినందువలన అవి స్వేచ్ఛగా విప్లవ వార్తలను ప్రచురించడం ప్రారంభించాయి. దీనివలన ప్రజలు మరింత ప్రభావితమయ్యారు. బాస్టిల్ ఫ్రెంచ్ నిరంకుశ రాచరిక వ్యవస్థకు చిహ్నం. దాని పతనంతో విప్లవం ప్రజల వద్దకు వచ్చి దేశమంతా వ్యాపించింది. అందుకనే ఫ్రెంచి ప్రజలు ఈనాటికీ జూలై 14ని తమ జాతీయదినంగా జరుపుకుంటారు.

### 2.2.3 పారిస్ స్త్రీల సంరంభం :

పదహారో లూయీ పారిస్ స్త్రీలపై చర్య తీసుకునేందుకు సాహసించలేదు. పైగా నెక్కర్‌ను తిరిగి ఆర్థికమంత్రిగా నియమించాడు. "నేషనల్ గార్డ్"ను గుర్తించాడు. అయితే తన బంధువులు, అనుచరులు విప్లవాన్ని అణచివేయడానికి జరుపుతున్న యత్నాలను నిరోధించలేదు. వర్సైలో జరుగుతున్న కుట్రల గురించిన వార్తలు పారిస్‌కు చేరుతూనే ఉన్నాయి. రాజకుటుంబం వర్సైలో ఉన్నంతకాలం ఇటువంటి కుట్రలు జరుగుతూనే ఉన్నాయనే ఉద్దేశ్యంతో పారిస్ స్త్రీలు గుంపుగా బయలుదేరి వర్సై రాజభవనంపై దాడిచేసి అక్టోబరు 5న రాజు పదహారోలూయీని, రాణి మేరీ ఆంతువానెట్‌ను, వారి కుమారుని ఊరేగిస్తూ పారిస్ తీసుకువచ్చారు. నాటినుంచి రాజకుటుంబం పారిస్‌లోని పాత దుర్గమైన ట్వేలర్‌లో ఇంచుమించు బందీ అయింది. రాజుతోపాటు పరిషత్ సభ్యులు కూడా పారిస్ తరలివచ్చారు. నాటి నుండి నేటివరకు పారిస్ ఫ్రాన్సుకు రాజధానిగా ఉంది.

### 2.2.4 జాతీయ రాజ్యాంగ పరిషత్ (1789 - 91) :

జాతీయ రాజ్యాంగ పరిషత్‌లో ప్రధానంగా మితవాదులు, అతివాదులు, తటస్థులు అనే మూడు వర్గాలుండేవి. మితవాదులు రాజ్యాంగబద్ధమైన రాజరికం, పార్లమెంటరీ వ్యవస్థ ఉండాలని వాదించేవారు. వీరికి నాయకుడు మిరాబు. రాజ్యాంగ పరిషత్ కార్యక్రమాలు మిరాబు దర్శకత్వంలోనే జరిగాయని చెప్పవచ్చు. రాజుకు రాజ్యాంగ పరిషత్‌కు సమాధానం కూర్చడానికి మిరాబు శక్తికొద్దీ ప్రయత్నించి చివరకు విఫలుడయ్యాడు. 1791 ఏప్రిల్ 2న అతడు మరణించాడు. అతివాదులలో జిరాండిస్టులు, కార్డిలియర్లు, జాకోబిన్లు ముఖ్యులు. క్రమక్రమంగా కార్డిలియర్లు మిగతా రెండు అతివాద వర్గాలలో చేరిపోయారు. ఫ్రాన్స్‌లోని జిరాండి ప్రాంతం నుంచి వచ్చినందువలన వారి బృందాన్ని జిరాండిస్టులన్నారు. జాకోబిన్ ఫ్రేయర్ అనే మతాచార్యుని భవనంలో వీరు మొదటిసారిగా సమావేశమైనందువల్ల వీరి జాకోబిన్లు అని పిలిచారు. అతివాద వర్గాలు రాచరిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని, గణతంత్ర ప్రభుత్వం ఏర్పడాలని వాదించేవారు. కాని జిరాండిస్టులలో కొంతమంది రాజ్యాంగబద్ధ రాచరికానికి అనుకూలంగా ఉన్నందువల్ల రాజ్యాంగ రచన విషయంలో మితవాదుల మాటే చెల్లింది. కార్డిలియర్ నాయకులలో డాంటన్ ముఖ్యుడు. ఇతడు ఆ తర్వాత జాకోబిన్లతో చేతులు కలిపాడు. జిరాండిస్టులలో మేడమ్ రోలాండ్ ముఖ్యురాలు. మితవాదుల తర్వాత జాతీయసభలోను, రాజ్యాంగ పరిషత్‌లోను ఆ తర్వాత ఏర్పడిన జాతీయ కన్వెన్షన్ తొలిదశలోను జిరాండిస్టులదే ప్రాబల్యం.

జాతీయ శాసన సభ టెన్నిస్ కోర్టు శపథాన్ని కార్యరూపం దాల్చడానికి రాజ్యాంగపరిషత్‌గా మారి, 1789 అక్టోబర్ నుంచి 1791 సెప్టెంబరు వరకు సమావేశాలు జరిపి విప్లవాత్మకమైన సంస్కరణలు చేసింది.

### 2.2.4.1 భూస్వామ్య వ్యవస్థ రద్దు :

రాజ్యాంగ పరిషత్ భూస్వామ్య వ్యవస్థను, బానిస వ్యవస్థను, వర్గ ఆధిక్యాలను రద్దు చేసింది. ఫలితంగా వ్యవసాయదారునికి భూమి మీద హక్కు లభించింది. కొందరు భూస్వాములు, మతాధికారులు స్వచ్ఛందంగా పోటీపడి తమ హక్కులను, ఆధిక్యతలను వదులుకున్నారు. చర్చి భూములన్నింటిని ప్రభుత్వం హస్తగతం చేసుకొని అది జాతీయ ఆస్తిగా ప్రకటించింది. ఈ ఆస్తిని హామీగా ఉంచి "అసిగ్నాట్స్" అనే నూతన కాగితపు ద్రవ్యాన్ని విడుదల చేశారు. టర్గో, నెక్కర్ వంటి మంత్రులు సాధించలేని సంస్కరణలను రాజ్యాంగపరిషత్ ఒక్క నెలలోనే సాధించగలిగింది. అయితే కొందరు భూస్వాములు, మతాచార్యులు ఈ సంస్కరణలను ప్రతిఘటించి, విదేశాలకు పారిపోయి అక్కడ ఫ్రెంచి విప్లవ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారు. ఇటువంటి వారినే ఎమిగ్రెస్ (Emigres) అనేవారు. విప్లవానికి వీరొక పెద్ద సమస్యగా పరిణమించారు.

### 2.2.4.2 మానవ హక్కుల ప్రకటన :

రూసో రాజకీయ తత్త్వానికి, ఇంగ్లండ్, అమెరికాల రాజ్యాంగాల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రభావితమై రాజ్యాంగ పరిషత్ సర్వదేశాలకు, సర్వకాలాలకు ఉపయోగపడే విధంగా 17 నిబంధనలు గల ఒక మహత్తరమైన మానవ హక్కుల ప్రకటనను విడుదల చేసింది. ఈ ప్రకటనలోని సారాంశమేమంటే - "మానవులందరూ పుట్టుకతో స్వేచ్ఛా జీవులు, వారందరికీ సమాన హక్కులున్నాయి. ప్రజాభిప్రాయమే శాసనం. ప్రతి వ్యక్తికి స్వాతంత్ర్యం, ఆస్తి భద్రత, రక్షణ ఉండి తీరాలి. ఏ వ్యక్తినైనా నిర్బంధించడం కాని, శిక్షించడం కాని జరిగితే అది చట్టం ప్రకారం, న్యాయం ప్రకారం జరగాలి. రాజ్యమే సర్వసత్తాక అధికారానికి మూలం". వాక్స్వాతంత్ర్యం, మతసహనం, పత్రికా స్వాతంత్ర్యం ఈ ప్రకటన ద్వారా గుర్తించడం జరిగింది.

### 2.2.4.3 రాజ్యాంగ సంస్కరణలు :

రాజ్యాంగ పరిషత్ తయారుచేసిన రాజ్యాంగం పార్లమెంటరీ తరహా ప్రభుత్వానికి అవకాశం కల్పించింది. రాజు నామ మాత్రంగా రాజ్యానికి అధిపతిగా ఉంటాడు. శాసనాధికారం "శాసనసభ" చేతిలో ఉంటుంది. కార్యనిర్వాహక విధులు మంత్రుల చేతిలో ఉంటాయి. పరిపాలనా సౌలభ్యం కోసం దేశాన్ని 83 డిపార్ట్‌మెంట్లుగా (రాష్ట్రాలుగా) విభజించి, ఆ రాష్ట్రాలకు ప్రకృతిసిద్ధమైన నదులు, పర్వతాల పేర్లు పెట్టారు. స్థానిక పరిపాలన ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలు తమ ప్రభుత్వాన్ని తామే ఎన్నుకొనే పద్ధతి కల్పించినట్లయింది. న్యాయస్థానాలను దేశమంతటా నెలకొల్పడం జరిగింది. న్యాయాధిపతులను, ప్రభుత్వోద్యోగులను ప్రజలే ఎన్నుకుంటారు.

### 2.2.4.4. ఆర్థిక సంస్కరణలు - చర్చిపై అదుపు :

రాజ్యాంగ పరిషత్ ఎదుర్కొన్న సమస్యలలో అతి క్లిష్టమైనది ఆర్థిక సమస్య. విప్లవ సందర్భంగా ఏర్పడిన అరాచక పరిస్థితులలో ఎవ్వరు కూడా పన్నులు చెల్లించలేదు. నూతన ఆర్థిక యంత్రాంగం ఇంకా రూపుదిద్దుకోలేదు. ఆర్థిక పరిస్థితిని చక్కబరచడానికై పరిషత్ కొన్ని చర్యలు చేపట్టింది. చర్చి ఆధీనంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకొని వాటిని మదుపుపెట్టి ఎస్సిగ్నాట్స్ (Assignants) అనే కాగితపు డబ్బును విడుదల చేశారు. చర్చి ఉద్యోగులకు నెల జీతాలు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ సంస్కరణలతో ఆర్థిక సమస్యలు తాత్కాలికంగా పరిష్కరించబడటమే కాకుండా, చర్చిని అదుపులోకి తీసుకున్నట్లయింది.

### చర్చిపై సివిల్ రాజ్యాంగం :

పరిషత్ సంస్కరణల ద్వారా మతపరమైన విషయాలలో కూడా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. పరిషత్ 1790 జులై 12న చర్చిపై సివిల్ రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం బిషప్‌లు, ఇతర మతాచార్యుల సంఖ్య చాలా వరకు తగ్గించబడింది. మతాచార్యులను ప్రజలే ఎన్నుకోవాలి. వారికి ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుంది. విదేశీయుడైన పోప్ ఆధీనంలో వీరు నామమాత్రంగా ఉంటారు. ఈ రాజ్యాంగం రాజుకు ఇష్టంలేకపోయినా సమ్మతించక తప్పలేదు. ఫ్రాన్స్‌లోని కాథలిక్ మతాచార్యులంతా నూతన రాజ్యాంగానికి బద్ధులమని ప్రమాణం చేయాలి. కాని పోప్ దీనికి తీవ్ర నిరసన తెలిపి, నూతన రాజ్యాంగాన్ని అనుసరించి ప్రమాణం చేసిన మతాచార్యులందరిని మత బహిష్కారం చేశాడు. మరోవైపు సివిల్ రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేయని మతాచార్యులకు జీతాలు నిలుపుదల చేయడమే కాకుండా, శిక్షలు కూడా తప్పవని ప్రభుత్వం బెదిరించింది. ఈ సంఘర్షణ క్లిష్టరూపం దాల్చడంతో కొందరు మతాచార్యులు దేశం వదిలి ఎమిగ్రెస్‌తో చేరారు. మరికొందరు దేశంలోనే ఉండి ప్రజలను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టడం ప్రారంభించారు.

### 2.2.4.5 నూతన రాజ్యాంగం 1791 :

అనేక సంస్కరణల మధ్య రాజ్యాంగ పరిషత్ ఒక నూతన రాజ్యాంగాన్ని రూపొందించింది. అమెరికా రాజ్యాంగం వలె ఇది కూడా వికేంద్రీకరణ సూత్రంపై ఆధారపడి రాజ్యాంగబద్ధమైన రాజరికాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఫ్రెంచి చక్రవర్తికి 'తాత్కాలిక వీటో' అధికారం మాత్రమే ఇవ్వబడింది. శాసనాధికారాలు ప్రజలచే పరోక్షంగా ఎన్నుకోబడ్డ శాసనసభకు ఇవ్వబడ్డాయి. ఈ విధంగా రెండు సంవత్సరాలలోనే రాజ్యాంగ పరిషత్ నిర్మాణాత్మకమైన, శాశ్వతమైన సంస్కరణలు చేసింది. నూతన రాజ్యాంగాన్ని ఆమోదించిన అనంతరం ఈ రాజ్యాంగం ప్రకారం జరిగే ఎన్నికలలో రాజ్యాంగ పరిషత్ సభ్యులు పాల్గొనకూడదనే నియమం పెట్టుకొనడం వలన సెప్టెంబరు 30, 1791 వ తేదీన ఈ పరిషత్ స్వచ్ఛందంగా రద్దయింది.

ఈ నూతన రాజ్యాంగం రాజును నామమాత్రునిగా చేసినందువల్ల తనకు భవిష్యత్తులో ప్రమాదం తప్పదని భావించి రాజకుటుంబీకులు మారువేషాలు ధరించి ట్విలరీ నుండి తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించారు. దురదృష్టవశాత్తు వీరు వరెన్ని గ్రామంవద్ద పట్టుబడి, పారిస్‌కు చేరారు. దీనితో రాజు అసలు రూపం బయటపడిందని, అతను విప్లవవ్యతిరేకి అనీ, అందుచేత రాజును పూర్తిగా తొలగించి రిపబ్లిక్ స్థాపించాలని తీవ్రవాదులు పట్టుబట్టారు. కాని ఆనాడు రాజ్యాంగ పరిషత్‌లో మితవాదులే అసంఖ్యాకులవడం చేత రాజును పునః ప్రతిష్ఠించి, నూతన రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చారు.

### 2.2.5 ఫ్రెంచి శాసనసభ (అక్టోబరు, 1791 - సెప్టెంబరు 20, 1792) :

అక్టోబరు 1, 1791 న నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చి, చక్రవర్తి అధినేతగా లేక రాజ్యాంగబద్ధుడైన రాజుగా ఫ్రాన్స్‌లో ఎన్నికలు జరిగాయి. ఈ నూతన శాసనసభకు 750 మంది సభ్యులు ఎన్నికయ్యారు. వీరికి శాసనసభా కార్యకలాపాల్లో ఎటువంటి అనుభవమూ లేదు. అనుభవజ్ఞులైన రాజ్యాంగ పరిషత్ సభ్యులు అనర్హత వల్ల వారెవరూ శాసనసభకు ఎన్నిక కాలేదు. నూతన సభ్యులలో అనైక్యత నెలకొని, అభిప్రాయ భేదాలు పొడచూపి కొన్ని రాజకీయ పక్షాలుగా చీలిపోయారు. వీరిలో జిరాండిస్టులు, జాకోబిన్‌లు రాజ్యాంగవాదులు ముఖ్యులు. శాసనసభలో అధికస్థానాలు రాజ్యాంగవాదులవే. జిరాండిస్టులు మితవాదులు కాగా, జాకోబిన్‌లు తీవ్రవాదులు. అయితే వీరి మధ్య ఏకాభిప్రాయం లేనందున వీరు ఏ పనీ చేయలేకపోయేవారు.

నవంబరు 7, 1791 న శాసనసభ కొన్ని శాసనాలను జారీ చేసింది. విదేశాలకు పారిపోయిన ప్రభువులు, మతాచార్యులు తిరిగి ఫ్రాన్స్‌కు రావాలి. అలా రాకపోతే వారి భరణాలు రద్దు చేయడమేగాక, వారిని విప్లవ శత్రువులుగా పరిగణిస్తారు. వారి

ఆస్తులను సైతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. వారు పట్టుబడితే మరణ శిక్ష విధించడం జరుగుతుంది. అయితే ఈ శాసనాలను లూయీ వీటో చేశాడు. దీంతో పారిస్ ప్రజలు రెచ్చిపోయి రాజభవనంపై దాడి చేసి, రాజును ద్వేషించడం ప్రారంభించారు.

## 2.2.6 విదేశాల జోక్యం :

ఫ్రెంచి విప్లవానికి ఆంతరంగిక వ్యతిరేకతే కాక విదేశీ జోక్యం కూడా తోడైంది. మొదట ఐరోపా దేశాలన్నీ విప్లవం పట్ల సానుభూతి కల్గి ఉన్నప్పటికీ, బాస్టిల్ పతనానంతరం ఫ్రాన్స్‌లో చెలరేగిన దౌర్జన్యకాండతో విప్లవాన్ని వ్యతిరేకించాయి. ఆనాడు ఐరోపాలో ఒక్క ఇంగ్లండ్‌తప్ప మిగిలిన దేశాలన్నీ నిరంకుశ రాజరికాలే. అందుచేత ఫ్రెంచి విప్లవ ప్రభావం తమ దేశాలపై పడి విపరీత పరిణామాలను దారితీస్తుందని భయాందోళనలు చెందారు. భూస్వామ్యవ్యవస్థ రద్దుతో చివరకు ఇంగ్లండ్ కూడా విప్లవానికి వ్యతిరేకి అయింది. ఇంగ్లండ్‌కు చెందిన ఎడ్‌మండ్ బర్క్, విలియం ఫిట్ మొదలైన మేధావులు విప్లవం పేరుతో జరుగుతున్న హృదయ విదారకర సంఘటనలను తను రచనల్లో వర్ణించి విమర్శించారు. రష్యా రాణి కాథరిన్ వీరి రచనలకు తన మద్దతు తెలిపింది. ఇదంతా చూసి ప్రతిదేశంలో రాజులు, ప్రభువులు, మతాధికారులు తమ దేశంలో విప్లవం చెలరేగుతుందేమోనని భయపడ్డారు. అందుచేత ఫ్రాన్స్‌లో అవసరమైతే యుద్ధమైనా చేసి విప్లవం అణచివేయడమే తమ ప్రధమ కర్తవ్యంగా భావించారు.

ఫ్రెంచి మహారాణి మేరీ ఆంతువానెట్ ఆస్ట్రియా పాలకుడైన రెండో లియోపోల్డ్ సోదరి. లూయీని కాపాడడం తన కర్తవ్యంగా భావించిన లియోపోల్డ్ ప్రష్యా రాజైన రెండో ఫ్రెడరిక్ విలియమ్ మద్దతు సంపాదించాడు. వీరిద్దరూ కలిసి ఆగస్ట్ 27, 1791 న ఫ్రెంచి విప్లవం ఐరోపాలోని రాజులందరికీ సవాల్ వంటిదని ప్రకటించి, ఫ్రాన్స్‌లో రాచరిక వ్యవస్థను పునరుద్ధరించకపోతే యుద్ధం తప్పదని, ఇందుకు గాను ఐరోపా రాజులందరూ సాయపడాలని పిల్‌నిట్జ్ నుంచి ఒక ప్రకటన జారీచేస్తూ ఫ్రెంచి విప్లవ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీనితో విప్లవంలో విదేశీ జోక్యం ప్రారంభమైంది.

ఫ్రాన్స్‌లో అక్టోబరులో అధికారంలోకి వచ్చిన జిరాండిస్టుల ప్రభుత్వం ఈ హెచ్చరికను లక్ష్యపెట్టకపోగా యుద్ధానికి సన్నాహాలు ప్రారంభించింది. యుద్ధం ద్వారా విప్లవ సందేశాన్ని ఐరోపా రాజ్యాలన్నింటికి గొనిపోవచ్చునని జిరాండిస్టులు భావించారు. ఇందులో రక్షణ మంత్రి అయిన కార్నో కీలకపాత్ర వహించాడు. ఏప్రిల్ 20, 1792 న ఆస్ట్రియాపై యుద్ధం ప్రకటించి లూయీ అనుమతిని కోరారు. లూయీ కన్నీటితో ఆ యుద్ధ ప్రకటనపై సంతకం చేశాడు. కాని రోబిస్పియర్ నాయకత్వంలోని జాకోబిన్‌లు యుద్ధాన్ని వ్యతిరేకించారు. యుద్ధం వల్ల ఫ్రాన్స్‌లో నియంతృత్వం వస్తుందేమోనని వారి భయం. కాని జిరాండిస్టులదే పై చేయి అయింది. ఈ సమయంలోనే లియోపోల్డ్ మరణించగా, అతని కుమారుడు రెండో ఫ్రాన్సిస్ (1792-1804) ఆస్ట్రియా సింహాసన మధిష్టించాడు.

తొలిదశలో ఆస్ట్రియా, ప్రష్యా చేతిలో ఫ్రెంచి సైన్యాలు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. దీనికి లూయీ, ఇతర రాజకుటుంబీకులు, విప్లవ వ్యతిరేకులు శత్రువులకు అందజేస్తున్న రహస్య సమాచారమే కారణమని ప్రజలు భావించారు. సెప్టెంబరు 1791లో రాజు, భార్య, యువరాజు దేశం నుంచి పారిపోవడానికి విఫల యత్నం చేశాక, వారి నివాసంలో దొరికిన కొన్ని పత్రాలు ప్రజల అనుమానాన్ని ఇనుమడింపజేశాయి. జులై 10, 1792న రాజ కుటుంబానికి ఎటువంటి హాని జరిగినా తాను పారిస్ నగరాన్ని తగులబెట్టగలనని శత్రుపక్ష నాయకుడైన డ్యూక్ ఆఫ్ బ్రన్స్‌విక్ "Duke of Brunswick" ప్రకటన చేశాడు. ఈ ప్రకటన ప్రజలను మరింత రెచ్చగొట్టడమే కాక, రాజుపై వారికి గల అనుమానాలను బలపరిచింది. ఆగస్ట్ 10న విప్లవకారులు జాకోబిన్‌ల నాయకత్వంలో రాజప్రాసాదమైన ట్విలరీపై దాడిచేశారు. అప్పుడు రాజకుటుంబం సభ్యులు మూడు రోజుల పాటు శాసనసభ ప్రాంగణంలో తలదాచుకున్నారు. అయితే శాసనసభ రాజకుటుంబీకుల ప్రాణాలను కాపాడగలిగిందేకాని వారి రాచరికాన్ని, పదవులను రక్షించలేకపోయింది. విప్లవకారుల వత్తిడికి తట్టుకోలేక రాజు పదవిని, దానికి అవకాశం కల్పించిన 1791 రాజ్యాంగాన్ని

తాత్కాలికంగా రద్దు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాటు జరిగేవరకు జాకోబిన్ పార్టీకి చెందిన డాంటన్‌ని తాత్కాలిక పరిపాలకునిగా నియమించింది. నూతన రాజ్యాంగాన్ని రూపొందించడానికి ఒక జాతీయ కన్వెన్షన్‌ను సమావేశపరచాలని దానికి ఎన్నికలు జరిపించాలని కూడా నిర్ణయించింది.

జాతీయ కన్వెన్షన్ సమావేశమయ్యే వరకు డాంటన్ నిరంకుశాధికారాలు చెలాయించాడు. అతడు తీవ్రవాది అయినప్పటికీ అవినీతిపరుడు కాదు. దేశభక్తి మెండు. ఒక పక్క ఆంతరంగిక శత్రువులను మట్టుపెట్టడంలోనూ, వేరొక ప్రక్క విదేశీ సైన్యాలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించడంలోనూ నిమగ్నమయ్యారు. మరాట్ నాయకత్వంలో ప్రదర్శకులు, శత్రువులతో చేతుల కలిపారనే నెపంతో దాదాపు 2000 మందిని ఒక పారిస్ నగరంలోనే దారుణంగా హతమార్చారు. వీరిలో పురుషులు, స్త్రీలు, పిల్లలూ అందరూ వున్నారు. ఈ దారుణ హత్యలు సెప్టెంబరులో జరిగినందున ఫ్రెంచి విప్లవచరిత్రలో వీటికి సెప్టెంబరు హత్యలు అనే పేరు వచ్చింది.

### 2.2.6.1 వాల్మీ యుద్ధం - సెప్టెంబరు 20, 1792 :

ఆంతరంగిక శత్రువులను హతమార్చిన అనంతరం డాంటన్ తన దృష్టిని విదేశీ శత్రువులపై మరల్చాడు. ఫ్రెంచి సైన్యం వాల్మీ యుద్ధంలో ప్రష్యన్లపై అఖండ విజయం సాధించగలిగింది. ప్రజలు వాటికండగా నిలిచారు. మార్సెయిల్స్ నగరవాసులు ఆలపించిన దేశభక్తి గీతం దేశ ప్రజలందరికీ ఆదరణీయమైంది. ఈనాటికీ అదే ఫ్రాన్స్ జాతీయగీతం. విజయోత్సాహాల మధ్య ఇటువంటి ఉత్సాహకర పరిస్థితుల్లో సెప్టెంబరు 21, 1792 లో జాతీయ కన్వెన్షన్ సమావేశమైంది. ఇందులో తటస్థులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ జాకోబిన్లు దానిపై ప్రాబల్యం వహించగలిగారు. ఫలితంగా అది ఫ్రాన్స్‌ను గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది.

అనంతరం లూయీని, అతని కుటుంబ సభ్యులను, అనుచరులను దేశద్రోహ ఆరోపణలపై విచారించి శిక్షించాలని కన్వెన్షన్ తీర్మానించింది. విచారణలో లూయీని దోషిగా నిరూపించి జనవరి 21, 1793 అతణ్ణి ఉరితీశారు. జూన్ 1789 లో విప్లవం ప్రారంభమైనప్పటికీ కరడుగట్టిన జాకోబిన్‌లు తప్ప మిగతా రాజకీయ సంస్థలు కాని, ప్రజలలో అధిక సంఖ్యాకులు కాని 16వ లూయీని పదవి నుంచి తొలగించాలని కాని, ఉరితీయాలని కాని అనుకోలేదు. వాస్తవానికి అతను దేశద్రోహానికి పాల్పడింది కూడా లేదు. కాని దేశద్రోహానికి పాల్పడిన వారితో సంబంధాలు తెంచుకొని, దేశ ప్రజల తరఫున ధృఢ నిశ్చయంతో నిలబడలేకపోవడమే అతను చేసిన పెద్ద పొరపాటు. దీనికాయన తన ప్రాణాన్నే మూల్యంగా చెల్లించవలసి వచ్చింది. లూయీని ఉరితీయడం అన్యాయమని అనేకమంది చరిత్రకారులు వ్రాశారు.

### 2.2.7 భీతావహపాలన (Reign of Terror) :

లూయీని పదవీభ్రష్టుణ్ణి చేసి, ఉరితీయడం జిరాండిస్టులలో ఎక్కువమందికి ఇష్టంలేదు. దీనితో జాకోబిన్లు వారి చిత్తశుద్ధిని శంకించడం ప్రారంభించారు. విప్లవ వ్యతిరేకశక్తుల నణచి దేశంలో శాంతి భద్రతలు నెలకొల్పి ప్రభుత్వాన్ని సజావుగా నిర్వహించడానికి ప్రజాభద్రతాసమితి (Committee of Public Safety), ప్రజాసంరక్షణ సమితి (Committee of General Security), విప్లవ న్యాయస్థానం (Revolutionary Tribunal) అనే మూడు సంఘాలను కన్వెన్షన్ ఏర్పాటు చేసింది. డాంటన్, రాబిస్పియర్, కార్‌నో, మరాట్ మొదలైన ప్రముఖ విప్లవ నాయకులంతా ప్రజా సంరక్షణ సమితిలో సభ్యులయ్యారు. ఈ మూడు సంఘాలలో జాకోబిన్లు, వారి అనుకూలురే ఎక్కువగా ఉన్నారు. వీరు తమ వ్యతిరేకులందరినీ విద్రోహులుగా పరిగణించి గిలోటిన్ అనే మారణ యంత్రం ద్వారా విచక్షణారహితంగా వధించడం ప్రారంభించారు. మే 31, 1793 లో మరాట్ నాయకత్వాన పారిస్ ప్రజలు జిరాండిస్టులకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరపడంతో జూన్ 2న జిరాండిస్టు పార్టీ నాయకులను నిర్బంధించి విచారించడానికి

కన్వెన్షన్ నిర్ణయించింది. జులైలో జిరాండిస్టు పక్షానికి చెందిన ఒక యువకుడు మరాట్‌ను హత్యచేయడంతో జాకోబిన్లు మరింత రెచ్చిపోయారు. జాకోబిన్ల నాయకత్వంలోని ప్రభుత్వం సెప్టెంబరు 1793 నుంచి జులై 1794 వరకు వేల సంఖ్యలో దేశవ్యాప్తంగా నిరపరాధులను కూడా గిలోటిన్ చేసి భయంకరమైన పరిపాలన సాగించింది. గిలోటిన్‌కు గురి అయిన వారిలో మేడం రోలండ్ మొదలైన అనేకమంది జిరాండిస్టు నాయకులు, మేరి ఆంతువానెట్, ఆమె బంధువులు, మొదటి రెండు ఎస్టేట్లకు చెందిన ప్రముఖులు ఉన్నారు. చివరకు డాంటన్ కూడా ఆ మారణకాండ పట్ల తన నిరసనను తెలిపాడు. దీనితో ఆగ్రహించిన రాబిస్పియర్ అతనిపై దేశద్రోహ నేరం మోపి అతణ్ణి గిలోటిన్ వేటుకు బలిచేశాడు. దీనితో విప్లవానికి నాయకత్వం వహించిన ప్రముఖులలో అత్యధికులు తమ చర్యలకు తామే బలయ్యారు. రాబిస్పియర్, సెయింట్ జస్ట్‌లు మాత్రం మిగిలారు. వారు నిర్విరామంగా భీతావహపాలన సాగిస్తున్నారు. ప్రజలు కూడా వారి చర్యలను నిరసించే పరిస్థితి వచ్చింది. ఇది అవకాశంగా తీసుకొని కన్వెన్షన్‌లోని తటస్థవర్గం చొరవగా జులై 28న వారిద్దరినీ గిలోటిన్‌కు ఆహుతి చేయడం జరిగింది. రాబిస్పియర్ మరణంతో ఫ్రాన్స్‌లో భీతావహపాలన అంతమైంది. దీనినే "థెర్మిడోరియన్ రియాక్షన్" అంటారు.

### 2.2.8 నూతన రాజ్యాంగం :

జాతీయ కన్వెన్షన్ డిసెంబరు 1793 నాటికి నూతన రాజ్యాంగాన్ని తయారు చేసి అమలుపరిచింది. దీని ప్రకారం దేశం గణతంత్ర రాజ్యంగానే ఉంటుంది. శాసనసభలో ఎగువసభ, దిగువసభ అనే రెండు సభలుంటాయి. ఎగువసభలో 250 మంది సభ్యులకు, దిగువసభలో 500 మంది సభ్యులకు ప్రాతినిధ్యం ఉంటుంది. ఈ శాసనసభ సభ్యులు ప్రజలచేత పరోక్షంగా ఎన్నుకోబడతారు. ఈ సభ కార్యనిర్వాహణాధికారాలు గల ఐదుగురు సభ్యులతోటి కూడిన డైరెక్టరీని ఎన్నుకుంటుంది. జాతీయ కన్వెన్షన్ తన రాజ్యాంగాన్ని తానే తయారు చేసుకోవడమే గాక ఆర్థిక, సామాజిక రంగాలలో సామ్యవాద తరహాలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రయత్నించింది. దేశం వదలివెళ్ళిన భూస్వాముల భూములను పేదలకు పంచి ఇచ్చింది. నిత్యావసర వస్తువుల ధరల నదుపులో ఉంచింది. స్త్రీలకు ఆస్తిహక్కు ఈయబడింది. సాంఘిక అసమానతలను, ఉన్నతవర్గాలకు ఉండే హోదాను, బిరుదులను రద్దు చేసింది. ప్రజలందరూ సమాన హోదా గల పౌరులేనని ప్రకటించింది. బానిస వ్యాపారాన్ని నిషేధించి, వారికి విముక్తిని ప్రసాదించింది. తూనికలు కొలతలు ద్రవ్యానికి సంబంధించి దశాంశ పద్ధతిని ప్రవేశపెట్టింది. కొత్త కేలండర్‌ను తయారుచేసింది. దీని ప్రకారం సంవత్సరానికి 12 నెలలే కాని నెలకు మూడు వారాలు, వారానికి 10 రోజులు, వారంలో చివరి రోజు అంటే 10వ రోజు శెలవు. ఆదివారం శెలవు లేదు. ఫ్రాన్స్‌లో లోగడ అమలులో ఉన్న జర్మన్, ఇటాలియన్ భాషలను రద్దుచేసి తమ జాతీయ భాష అయిన ఫ్రెంచిలోనే విద్యాబోధన జరిగేటట్లు చర్యలు చేపట్టింది. మతమనేది వ్యక్తిగతమనీ, మతాన్ని ప్రభుత్వం నుంచి వేరుపరచి అన్ని మతాల పట్ల సహనం పాటించింది.

### 2.2.9 డైరక్టరీ (1795-99) :

డైరక్టరీ అధికారంలో ఉన్న నాలుగు సంవత్సరాలూ ఫ్రాన్స్‌కు ఎలాంటి మేలును చేకూర్చలేకపోయింది. అందుకు కారణం - అందులోని సభ్యులంతా అసమర్థులు, లంచగొండ్లు. ఫలితంగా పరిపాలనా వ్యవస్థలో అనేక లోపాలు చోటు చేసుకొని డైరక్టరీ ప్రజాదరణ కోల్పోయింది. డైరక్టరీ అధికారంలోనికి వచ్చేనాటికి ఫ్రాన్స్ ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. అసిగ్నాట్స్ అనే కాగితపు డబ్బు విలువ పడిపోయి ద్రవ్యోల్బణం ఏర్పడింది. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పేద ప్రజలు నానా ఇబ్బందులకు గురి అయ్యారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. దేశంలో అరాచక పరిస్థితులు నెలకొని రాష్ట్రపాలకులు తిరుగుబాట్లు చేయడం ప్రారంభించారు. డైరక్టరీ పాలనా కాలంలో ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఆస్ట్రియాలతో యుద్ధం చేస్తూనే ఉంది. డైరక్టరీ తన ఆంతరంగిక వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి యుద్ధాన్ని ఇంకా తీవ్రతరం చేయాలని నిర్ణయించుకుంది. ఈ వ్యూహంలో

భాగంగానే తన సైన్యాన్ని రెండు భాగాలుగా విభజించి, కొంతభాగాన్ని మొరో, జార్డాన్ మొదలైన సేనాధిపతుల నాయకత్వంలో జర్మనీలోని రైన్ ప్రాంతానికి చేరవలసిందని ఆదేశించింది. రెండో విభాగాన్ని నెపోలియన్ బోనపార్టీ నాయకత్వంలో ఇటలీ పైకి పంపింది. అప్పటికి నెపోలియన్ వయస్సు 27 సంవత్సరాలు. ఆ యువ సైన్యాధికారి అత్యంత ధైర్యసాహసాలతో ఆల్ప్సు పర్వతశ్రేణులు దాటి సార్డినియా నోడించి, ఆస్ట్రియాను చిత్తుగా ఓడించాడు. అప్పుడు గత్యంతరం లేక ఆస్ట్రియా నెపోలియన్‌తో కాంపో ఫోర్మియా సంధి (1797) చేసుకుంది. ఈ సంధి ప్రకారం ఫ్రాన్స్‌కు బెల్జియం సంక్రమించడమే గాక, ఇటలీలో నెపోలియన్ నిర్మించిన లిగూరియన్ (జినోవా) సిస్ ఆల్‌పైన్ రిపబ్లిక్‌లను గుర్తించడం జరిగింది. దీని వల్ల ఫ్రాన్స్ రైన్ నది వరకు విస్తరించింది. ఈ ఇటాలియన్ దండయాత్ర నెపోలియన్ గౌరవ ప్రతిష్టలను ఇనుమడింపచేసింది. నెపోలియన్‌ను ఫ్రెంచి ప్రజలు 'యుగపురుషుడని' కీర్తించసాగారు.

నెపోలియన్ పట్ల ఫ్రెంచి ప్రజలు చూపుతున్న గౌరవ భావాలపట్ల భీతిచెందని డైరక్టరీ అతని పీడ విరగడ చేసుకోవాలని అతణ్ణి ఇంగ్లండ్, ఇండియాల మధ్య రాకపోకలకు ప్రతిష్ఠంభన కల్పించమని ఈజిప్టుకు పంపింది. నెపోలియన్ కూడా ఇంగ్లండ్‌ను జయించాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. ఇంగ్లండ్ బలోపేతం కావడానికి గల కారణం అది తూర్పుదేశాలతో సాగిస్తున్న వర్తకమేనని గ్రహించిన నెపోలియన్ ఇంగ్లండ్ ఇండియాల మధ్య నున్న మార్గాన్ని అంటే ఈజిప్టును ఆక్రమించి తద్వారా ఆ వర్తకానికి అడ్డుకట్ట వేస్తే ఇంగ్లండ్ లొంగుతుందని ఈజిప్టుపై దండెత్తాడు. ఈజిప్టు నుంచి ఇండియాపై కూడా దాడిచేయాలని అతని ఆలోచన. 1798 మే మాసంలో ఈజిప్టుపై దండెత్తాడు. మొదట మార్గమధ్యంలో బ్రిటన్ ఆధీనంలో ఉన్న మాల్టా నాక్రమించి, ఈజిప్టులో పిరమిడ్‌లు యుద్ధంలో ఘన విజయం సాధించినప్పటికీ, నైల్ యుద్ధంలో బ్రిటిష్ నౌకాదళాధిపతి అయిన నెల్సన్ చేతిలో ఓడిపోయి స్వదేశానికి తిరిగి వచ్చేశాడు.

ఫ్రెంచి ప్రాబల్యానికి భీతిల్లిన ఇంగ్లండ్, ఆస్ట్రియా, రష్యాలు రెండో సంకీర్ణ కూటమిగా ఏర్పడి ఫ్రెంచివారిని ఇతర ఐరోపా రాజ్యాల నుండి తరిమివేశారు. 1799లో ఫ్రాన్సు మద్దతునిచ్చిన హాలండ్ మొదలైన అనేక రిపబ్లిక్‌లు కూలిపోయాయి. ఫ్రాన్స్ పరాభవం పాలైంది. ఈ తరుణంలోనే నెపోలియన్ ఫ్రాన్స్‌కు వచ్చాడు. నెపోలియన్ పరాజయానికి ప్రజలు డైరక్టరీని తప్పుపట్టి, దేశాన్ని రక్షించగల సమర్థుడు నెపోలియన్ పరాజయానికి ప్రజలు డైరక్టరీని తప్పుపట్టి, దేశాన్ని రక్షించగల సమర్థుడు నెపోలియన్ ఒక్కడేనని భావించిన ఫ్రెంచి ప్రజలు అతనికి ఘనస్వాగతమిచ్చారు. ప్రజాభిప్రాయాన్ని గమనించిన నెపోలియన్ డైరక్టరీ సభ్యులలో ఒకడైన అబ్బెసీయస్ సహాయంతో రెండు శాసనసభలనూ, డైరక్టరీ సభ్యుల నివాసాలను దిగ్బంధనం చేసి, బలప్రయోగంతో డైరక్టరీని రద్దుపరచి, కాన్సలేట్ రాజ్యాంగాన్ని రూపొందించి తాను ప్రథమ కాన్సల్‌గా సర్వసైన్యాధ్యక్షునిగా, సర్వాధికారిగా ప్రకటించుకున్నాడు. ఈ విధంగా ఫ్రెంచి విప్లవం ప్రారంభమైన పది సంవత్సరాలకే ఫ్రాన్స్‌లో సైనిక నియంతృత్వం ఏర్పడింది.

ప్రథమ కాన్సల్ పదవిని చేపట్టిన నెపోలియన్ ఆచరణలో సర్వాధికారాలు చలాయించాడు. దేశంలో సమర్థవంతమైన, శక్తివంతమైన ప్రభుత్వాన్ని నెలకొల్పాలి. రెండో సంకీర్ణ కూటమితో యుద్ధానికి తలపడి ఆస్ట్రియన్‌లను హోహెన్ లిండన్ వద్ద ఓడించి వారిని లూనివిల్ సంధికి ఒప్పించాడు. ఆ తర్వాత నెపోలియన్ ఇంగ్లండ్‌తో అమియన్స్ సంధి చేసుకొని ఫ్రాన్స్‌ని విదేశీయుద్ధాల నుండి కాపాడగలిగాడు. అనేక ప్రజాహిత చర్యలు చేపట్టి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. 1802లో జీవిత ప్రథమ కాన్సల్ అయ్యాడు. చివరకు 1804లో డైరక్టరీకి స్వస్తి చెప్పి తాను చక్రవర్తినని ప్రకటించుకున్నాడు. జనాభిప్రాయ సేకరణలో ప్రజలు దీనికి ఆమోదముద్ర వేశారు. దీనితో ఫ్రాన్స్‌లో తిరిగి రాజరిక వ్యవస్థ నెలకొంది.

## 2.3 విప్లవ ఫలితాలు (లేక) ప్రాముఖ్యత :

ఆధునిక ప్రపంచంపై ఫ్రెంచ్ విప్లవ ప్రభావం అపరిమితంగా ప్రసరించింది. అనేక దేశాలలో ఈనాటికీ మారుమోగుతున్న "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం" అనే ఆశయాలు ఫ్రెంచి విప్లవం ప్రసాదించినవే. ఆ తర్వాత ఐరోపాలోనూ, ప్రపంచంలోని ఇతరదేశాలలోను జరిగిన అనేక విప్లవాలకు ఫ్రెంచి విప్లవమే ఆదర్శం. భారతదేశంలో మైసూరు రాజ్యాధిపతి టిప్పుసుల్తాన్ తనను తాను "సిటిజన్ టిప్పు"గా అభివర్ణించుకొని తన రాజధానిలో "స్వేచ్ఛావృక్షాన్ని" నాటాడంటే ఫ్రెంచి విప్లవ ప్రభావం ఆనాడే ఎంత దూర ప్రాంతాలకు పాకిందో అర్థమవుతుంది.

1804లో నెపోలియన్ తిరిగి రాజరిక వ్యవస్థను నెలకొల్పినంత మాత్రాన ఫ్రెంచి విప్లవం విఫలమైందని భావించడం పొరపాటు. ఎందుకంటే ఫ్రాన్స్‌లో పాతవ్యవస్థను తిరిగి నెపోలియన్ పునరుద్ధరించలేదు. అనేక పాలనా సంస్కరణలు ప్రవేశపెట్టి ఫ్రెంచి విప్లవ ఫలాలను ప్రజలకందించాడు. పై పేరాలో చెప్పినట్లుగా ప్రపంచ చరిత్రలోనే ఈ విప్లవం ప్రగాఢమైన ప్రభావం కల్గిఉంది. ఈ విప్లవం వల్ల శాశ్వతమైన సత్ఫలితాలెన్నో కలిగాయి.

ఫ్రాన్స్‌లో సేద్యపు బానిసత్వం, భూస్వామ్య వ్యవస్థ, వర్గపరమైన హక్కులు శాశ్వతంగా అంతరించాయి. భూస్వాముకున్నా ఎస్టేట్ హక్కులు రద్దయినవి. తాము సాగుచేసుకునే భూములపై రైతుల హక్కులు గుర్తించబడ్డాయి. విప్లవం ఫ్యూడల్ వ్యవస్థను, అసమానత్వాన్ని పూర్తిగా రూపుమాపింది. కాగా స్వాధికార వర్గాలైన ప్రభువులు, సేద్యబానిసలు అనే తారతమ్యాలు అంతరించాయి. రాజకీయంగా స్వాధికార వర్గాలైన ప్రభువులు, మతాధిపతులు చెలాయించే ఆధిపత్యాలు రద్దయ్యాయి. ఫ్రెంచి విప్లవం యొక్క ప్రభావం సమకాలీన దేశాల్లో చూపడం ఆరంభమైంది. ప్రష్యాలో సేద్యబానిసలు భూస్వామ్య విధానాన్ని రద్దుచేయమనీ, తమకు స్వేచ్ఛా సమానత్వాలను కల్పించమని పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ప్రష్యా ఆధీనంలోని పోలిష్ భూభాగంలో ప్రజలు జాతీయ భావాలతో ఉత్తేజితులై తమ దేశాన్ని ఆక్రమించిన పొరుగుదేశాలతో యుద్ధానికి దిగడానికి సంసిద్ధులయ్యారు. భారతదేశం వంటి దూరప్రాంతాల్లో సైతం స్వాతంత్ర్య ఉద్యమాలకు ఫ్రెంచి విప్లవ నినాదాలైన స్వేచ్ఛ, సమత్వం, సౌభ్రాతృత్వం ప్రోత్సాహాన్ని ఇచ్చాయి. వ్యక్తి స్వేచ్ఛకు, అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడింది. పౌరులను ఎవరినీ కారణం లేకుండా నిర్బంధించడాన్ని, విచారణ లేకుండా శిక్షించడాన్ని నిషేధిస్తూ, ఖైదీలకు శిక్షలు సంస్కరణను ఉద్దేశించినవేగాని, కక్ష సాధించడానికి కాదని స్పష్టపరచాయి. నాటి నుంచి ప్రపంచవ్యాప్తంగా జైళ్ళలో ఖైదీలను మానవతా దృష్టితో చూడడమూ, వారి మంచి చెడ్డలపై శ్రద్ధ తీసుకోవడమూ ప్రారంభమైంది.

భూస్వామ్య విధానం, వర్గ హక్కులు నశించడంతో ఫ్రెంచి సమాజంలో సాంఘిక సమాత్వమేర్పడి చట్టం దృష్టిలో అందరూ సమానమయ్యారు. సాంఘిక, ఆర్థిక తారతమ్యాలు కృత్రిమంగా, వ్యవస్థలు వక్రీకరణ చెందడం వలన ఏర్పడ్డవేకాని, ప్రకృతి సిద్ధమైనవికావనే ఆలోచనా విధానం సామాన్య ప్రజల్లో బలపడింది. సహోదర భావమనేది అందరూ తమ సమిష్ఠి సమస్యలను సమిష్ఠిగా ఎదిరించి, పరిష్కరించాలనే సహకారభావాన్ని పెంపొందిస్తుంది. ఈ జాతీయభావన వలన తదనంతర కాలంలో నెపోలియన్ పరిపాలన, నియంతృత్వమే అయినా ప్రజలందరికీ ఆమోదయోగ్యమైనది. నెపోలియన్ దిగ్విజయయాత్రలు నిర్వహించి మొత్తం ఐరోపాను తన ఆధీనంలోకి తెచ్చుకుంటే, ఆ విజయం ప్రజల జాతీయ భావోద్వేగాన్ని సంతృప్తిపరచింది. వారి స్వేచ్ఛా, సమానత్వం అనే కాంక్షలు ఈ జాతీయ భావోద్వేగంలో అంతర్భాగాలయ్యాయి.

మాన్‌టెస్క్యూ, రూసోల వంటి తత్వవేత్తల బోధనల కనుగుణంగా సర్వసత్తాక అధికారం ప్రజలదే అనే సిద్ధాంతానికి ఈ విప్లవం ద్వారా గుర్తింపు వచ్చింది. అలాగే రాజకీయ కార్యకలాపాలలో సామ్యవాదభావాలు ప్రవేశించాయి. సామ్యవాద సిద్ధాంతం సమాజంలో కర్షకులు, శ్రామికుల వలన సంపద ఉత్పన్నమవుతుందని, కనుక వారి ప్రాముఖ్యతను రాజకీయ వ్యవస్థలు గుర్తించాలని ఫ్రాన్స్ దేశస్థుడైన లూయీబ్లాంక్ అనే మేధావి వాదించాడు. ఈ సిద్ధాంతం నుండే కమ్యూనిజం సిద్ధాంతాన్ని కారల్‌మార్క్స్ రూపొందించాడు. పరోక్షంగా ఫ్రెంచి విప్లవమే సోషలిజం, కమ్యూనిజం సిద్ధాంతాలకు మూలమైందని చెప్పవచ్చు.

మతసంస్థలు తన ప్రత్యేక అధికారాలను కోల్పోయినాయి. ఫ్రాన్స్‌లో కాథలిక్ మతప్రభావం పూర్తిగా తొలగిపోయింది. పోప్‌తో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. మతాధికారులను ప్రభుత్వమే నియమిస్తుంది కనుక వారికున్న ప్రత్యేక హక్కులన్నీ రద్దయ్యాయి. చర్చి ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, మతాధికారుల ఆదాయాలను తొలగించి వారికి జీతభత్యాలు ఇవ్వబడ్డాయి. తత్ఫలితంగా మతం, మతాధికారుల ఆధిపత్యం పూర్తిగా నశించిపోయింది. మతం అనేది పూర్తిగా వ్యక్తిగత అంశంగా మారింది. ఫ్రాన్స్ లౌకిక రాజ్యంగా మారింది.

ఫ్రెంచి విప్లవం ప్రసాదించిన "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతం" అనే ఆశయాలు ఒక్క ఫ్రెంచి ప్రజలకే పరిమితం కాలేదు. అవి సర్వమానవాళికి చెందిన భావాలు. ఈనాటి యావత్ ప్రపంచం ఈ సిద్ధాంతాలను మహోన్నతమైనవిగా అంగీకరించి పాటిస్తున్నది. ప్రపంచానికి ఈ భావసంపదను ఫ్రెంచి విప్లవమే అందించింది. విప్లవ ప్రభుత్వం ఫ్రెంచి ప్రజలకు సమస్త హక్కులను ఇవ్వడమేగాక ఐరోపాలో నిరపేక్ష రాచరిక వ్యవస్థలను ఎదిరించి ఆ దేశాల ప్రజలను విముక్తి చేయడమే తన ఆశయంగా సౌభ్రాత శాసనాన్ని ప్రకటించింది. ఫలితంగా విప్లవం ఫ్రెంచి సరిహద్దులను దాటి విస్తరించింది. ఈ విధంగా ఫ్రెంచి విప్లవం అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకుంది.

## 2.4 ఫ్రెంచి విప్లవకాలం నాటి ప్రముఖులు :

ఫ్రెంచి విప్లవకాలంలో ఫ్రాన్స్‌ను నడిపించిన నాయకులు అనేకమంది ఉన్నారు. వారిలో ప్రముఖంగా కనిపించేవారు మరాట్, మిరాబు, డాంటన్, రాబిస్పియర్ మొదలైనవారు.

### మరాట్ (1742 - 1793) :

ప్రముఖ విప్లవ జాకోబిన్ నాయకుడు మరాట్ 1742లో ఫ్రాన్స్‌లో జన్మించాడు. వైద్యవృత్తిలో పట్టాను పొందిన అనంతరం, స్కాట్‌లాండ్ విశ్వవిద్యాలయం నుండి భౌతికశాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీని పొందాడు. ఫ్రాన్స్ ప్రజలు ఎదుర్కొన్న కష్టనష్టాలను స్వయంగా పరిశీలించిన మరాట్ తన ఉద్రేకపూరిత ఉపన్యాసాలతో ఫ్రెంచి రాజరికవ్యవస్థను, ఇంగ్లండ్‌లోని పార్లమెంటరీ వ్యవస్థను ఖండించి ప్రజల్ని మెప్పించాడు. ఆయన జాతీయ ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడేవాడు. తీవ్రవాదులైన జాకోబిన్‌ల ప్రోత్సాహంతో వారికి నాయకుడై, స్వల్పకాలంలోనే మూడో ఎస్టేట్ సభ్యుడై, తర్వాత ఫ్రెంచి శాసనసభలో జాకోబిన్ల నాయకుడిగా వ్యవహరించాడు. మరాట్ నిఘా కమిటి సభ్యుడిగా ఉంటూ 1792 సెప్టెంబరు నెలలో విప్లవ వ్యతిరేక శక్తులతో కుమ్మక్కయ్యారనే నెపంపై ఒక్క పారిస్ నగరంలోనే దాదాపు 2000 మందిని చంపించాడు. ఈ దారుణమైన మారణకాండ ఫ్రెంచి విప్లవచరిత్రలో సెప్టెంబరు హత్యలుగా ప్రసిద్ధి కెక్కింది. తర్వాత జాతీయ కన్వెన్షన్ సభ్యుడై 1793 మే 31 జిరాండిస్టులకు వ్యతిరేకంగా పారిస్‌లో ప్రదర్శనలు జరిపి, వారి నాయకులను నిర్బంధించి, జాకోబిన్‌ల అధికారాన్ని నెలకొల్పాడు. కాని మరాట్ సాగించిన నిరంకుశ మారణకాండను సహించలేక జూలైలో ఒక జిరాండిస్టు యువతి ఆయనను హత్యచేసింది.

### మిరాబు (1742 - 1793) :

ఒక ప్రభువర్గ కుటుంబంలో జన్మించి, చిన్న వయసులోనే అనేక దేశాలు విస్తృతంగా పర్యటించి, అనుభవం గడించిన రాజనీతిజ్ఞుడు, విద్యావంతుడు మిరాబు. ప్రభు వర్గీయుడైనప్పటికీ సామాన్య ప్రజానీకంతో స్వేచ్ఛగా తిరుగుతూ వారి ప్రేమాభిమానాలు పొంది 1789లో మూడో ఎస్టేట్‌కు పార్లమెంటులో ప్రతినిధి అయ్యాడు. మూడోఎస్టేట్ తమంతటతాను జాతీయసభగా ప్రకటించుకోవడంతోనూ, రాజుమూడో ఎస్టేట్ సభ్యులను సభాభవనంలోకి అనుమతించనప్పుడు ప్రక్కనున్న టెన్నిస్‌కోర్టు హాలులో సమావేశమై "టెన్నిస్ కోర్టు ప్రతిజ్ఞ" చేయడంలోను మిరాబు ముఖ్య భూమికను పోషించాడు. మిరాబు

మితవాదులకు నాయకుడు. వీరు రాజ్యాంగబద్ధ రాచరికం, పార్లమెంటరీ వ్యవస్థ ఉండాలని వాదించేవారు. రాజ్యాంగ పరిషత్ కార్యకలాపాలు మిరాబు ఆధ్వరంలోనే జరిగాయి. అలాగనే జాతీయ శాసనసభ చేసిన అనేక సంస్కరణలకు దర్శకత్వం వహించింది. ఆయనే. ఆయన చక్రవర్తితో సన్నిహితంగా ఉంటూ, చక్రవర్తికి రాజ్యాంగపరిషత్‌కు మధ్య సత్సంబంధాలకు నెలకొల్పి, విప్లవాన్ని శాంతియుతంగా ముగించాలని విశ్వప్రయత్నం చేశాడు. కాని చక్రవర్తిగాని పరిషత్‌గాని ఆయనను నమ్మలేదు. అందుచేత ఉభయులూ ఆయనకు సహకరించలేదు. తన ప్రయత్నం విఫలం కావడంతో నిరాస నిస్పృహలతో 1791లో ఏప్రిల్ 2న తన 42వ ఏట ఆయన మరణించాడు. ఆయన మరణించేవరకు పరిషత్ నిర్ణయాలపై మితవాదుల ప్రభావమే ప్రస్ఫుటమయ్యేది.

## డాంటన్ (1759 - 1794) :

మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన డాంటన్ న్యాయవాది. సాహసి, గొప్పవక్త. కార్డిలియర్ నాయకులలో డాంటన్ ముఖ్యుడు. ఇతడు ఆ తర్వాత జాకోబిన్లతో చేతులు కలిపాడు. జాకోబిన్లకు నాయకుడై ఫ్రాన్సు విదేశీ దాడులతో ఆంతరంగిక అల్లకల్లోలాలతో సతమతమవుతున్నప్పుడు జిరాడిస్టుల ఆధిపత్యాన్ని అంతంచేసి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. 1792 సెప్టెంబర్‌లో డాంటన్ నియంతగా వ్యవహరించి, సెప్టెంబరు హత్యల ద్వారా ఆంతరంగిక శత్రువులను హతమార్చాడు. ఇతడు తీవ్రవాది. కాని మంచి దేశభక్తుడు. వాల్మీయుద్ధంలో శత్రుకూటమిపై అఖండ విజయం సాధించాడు. తద్వారా ఫ్రెంచి విప్లవకారుల్లో నూతన చైతన్యం, ఆత్మవిశ్వాసం పాదుకొల్పాడు.

జాతీయ కన్వెన్షన్ కాలంలో ఐరోపా ప్రథమ సంకీర్ణ కూటమి ఫ్రాన్స్‌పై దాడిచేసినప్పుడు, విద్రోహకర చర్యలకు పాల్పడిన వారిని విచారించి శిక్షించడానికి ఒక "విప్లవ ట్రిబ్యునల్"ను, దేశభద్రతను పరిరక్షించేందుకు ఒక కమిటీని డాంటన్ నాయకత్వంలోని కన్వెన్షన్ నియమించింది. వీరు తను వ్యతిరేకులందరినీ విద్రోహులుగా పరిగణించి విచక్షణారహితంగా గిలోటిన్ పై కెక్కించి దారుణంగా శిరచ్ఛేదం చేయడం ప్రారంభించారు. గిలోటిన్ ద్వారా ఒక్క పారిస్‌లోనే దాదాపు 5000 మందిని వధించారు. భీతావాహపాలన సాగించి ఫ్రాన్స్‌లో శాంతి నెలకొల్పాడు. డాంటన్ 1794లో మారట్, రాబిస్పియర్‌లతో కలిసి హెర్బరిస్టులను ఓడించి జాతీయ కన్వెన్షన్‌లో తన అధికారం సుస్థిరం చేసుకున్నాడు. ఇటువంటి భీతావహపాలన అవసరం తీరగానే ప్రజలను శాంతి సామరస్యం పాటించమని కోరాడు. ఇతడు అకస్మాత్తుగా మితవాది కావడం రాబిస్పియర్‌కు, అతని ఇతర అనుచరులకు గిట్టలేదు. అందువల్ల ఇతని మీద దేశద్రోహనేరం మోపి ఇతణ్ణి కూడా గిలోటిన్‌కు బలిచేశారు. ఇతని మరణంతో ఫ్రాన్స్ రాజకీయ రంగంలో ఉన్న రెండువర్గాలైన జిరాండిస్టులకు జాకోబిన్‌లకు మధ్య సఖ్యత నెరపాలనే ఆశయం నెరవేరలేదు.

## రాబిస్పియర్ (1757-1794) :

మధ్యతరగతికి చెందిన రాబిస్పియర్ ఫ్రెంచి విప్లవ ప్రముఖులలో ప్రసిద్ధుడు. రాబిస్పియర్ 1758 జూన్ 17న జన్మించాడు. న్యాయవాది అయిన రాబిస్పియర్ రూసో రచనల వల్ల ప్రభావితుడై ఆ సిద్ధాంతాలలోని మంచిని గ్రహించి ఆదర్శరాజ్య నిర్మాణం చేయాలనే ఆలోచనలో ఉండగా ఫ్రెంచి విప్లవం అందుకు చక్కని అవకాశం కల్పించింది. జాకోబిన్‌ల క్లబ్‌కు నాయకుడై, స్వల్పకాలంలోనే జాతీయ కన్వెన్షన్ సభ్యుడిగా డాంటన్ మరాట్‌లతోపాటు లూయీకి ఉరిశిక్ష విధించడంలోను, జిరాండిస్టులను పదవి నుండి తొలగించడంలోను ముఖ్యపాత్ర పోషించాడు. డాంటన్ ప్రారంభించిన భీతావహపాలన కొనసాగించాడు. అయితే భీతావహపాలన విషయంలో డాంటన్ రాబిస్పియర్‌ల మధ్య అభిప్రాయబేధాలున్నాయి. పరిస్థితులను చక్కదిద్దడానికి భీతావహపాలన తప్పదని డాంటన్ అభిప్రాయపడగా, నైతిక విలువల పరిరక్షణకు భీతావహపాలన కొనసాగించాలని రాబిస్పియర్ విశ్వసించాడు. డాంటన్‌ను విప్లవ వ్యతిరేకి అని ముద్రవేసి రాబిస్పియర్ అతణ్ణి గిలోటిన్‌కి పంపి తాను ప్రభుత్వాన్ని కైవసం చేసుకున్నాడు. రాబిస్పియర్ కాలంలో రక్తపాతానికి అంతులేకుండా పోయింది. ఈ మారణకాండతో విసుగెత్తి పోయిన అతని అనుచరులు

అతణ్ణి ఎదిరించి గిలోటిన్‌కు పంపారు. తాను న్యాయవాదిగా ఉంటున్న రోజులలో ఉరిశిక్ష విధించడానికి ఇష్టపడని రాబిస్పియర్ న్యాయవాద వృత్తిని వదిలేసిన తర్వాత మానవ ప్రాణాలతో ఆడుకోవడం విశేషం. అంతేగాక ధర్మరాజ్యాన్ని స్థాపించాలని ప్రయత్నించిన ఇతడు రాక్షసరాజ్య సరళిని అనుసరించడం మరొక వింత. చివరకు అతని విధానమే అతనికి ఎదురు తిరిగింది. అతని అనుచరులే అతణ్ణి గిలోటిన్ పాలు చేశారు.

## 2.5 నమూనా ప్రశ్నలు :

1. 1789 ఫ్రెంచి విప్లవానికి గల కారణాలేవి ?
2. ఎందువలన ఫ్రెంచి విప్లవం (1789) అనివార్యమైనదో సహేతుకంగా వివరించండి ?
3. 1789 నాటి ఫ్రాన్స్ దేశ రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులను వర్ణించండి ?
4. ఫ్రెంచి విప్లవ ఘట్టాలను వివరించండి ?
5. 1789 నుండి 1804 వరకు ఫ్రాన్స్ దేశ చరిత్రలో జరిగిన ప్రముఖ సంఘటనలను వర్ణింపుము ?
6. నెపోలియన్ చక్రవర్తిగా ప్రకటించుకొనే వరకు ఫ్రెంచి విప్లవాన్ని సమీక్షించండి ?
7. మేరీ ఆంతువానెట్
8. రూసో
9. బాస్టిల్ పతనం
10. ఎస్టేట్ జనరల్
11. భీతావహ పరిపాలన
12. డాంటన్
13. రోబెస్పియర్

## 2.9 చదువదగిన గ్రంథాలు :


1. Mahajan V.D. : History of Modern Europe Since 1789
2. Raghubir Dayal : Europe Since Napoleon
3. Acton : Lectures on the French Revolution.


- డా॥ వి.వి. సుబ్బారెడ్డి

పాఠం - 3

# నెపోలియన్ విజృంభణ - పతనము

## 3.0 లక్ష్యం :

నెపోలియన్ సంస్కరణలు, విదేశాంగ విధానము, భూఖండ విధానము, పతనానికి కారణాలు గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయసూచిక :**


3.1 ఉపోద్ఘాతం
3.2 నెపోలియన్ ఇటలీ దండయాత్ర
3.3 ఈజిప్టు దండయాత్ర
3.4 ప్రథమ కాన్సల్‌గా నెపోలియన్
3.5 నెపోలియన్ సంస్కరణలు
3.5.1 పాలనా సంస్కరణలు
3.5.2 ఆర్థిక సంస్కరణలు
3.5.3 పోప్‌తో సంధి
3.5.4 విద్యా సంస్కరణలు
3.5.5 నెపోలియన్ న్యాయ స్మృతి
3.6 నెపోలియన్ విదేశాంగ విధానము
3.6.1 తృతీయ సంకీర్ణకూటమి ఏర్పాటు
3.6.2 ట్రఫాల్గర్ యుద్ధము
3.6.3 భూఖండ విధానం
3.6.4 ద్వీపకల్ప యుద్ధం
3.6.5 ఆస్ట్రియా తిరుగుబాటు
3.6.6 రష్యా దండయాత్ర
3.6.7 విమోచనా యుద్ధం
3.7 నెపోలియన్ పతనానికి కారణాలు
3.7.1 నెపోలియన్ చెడు స్వభావం
3.7.2 సామ్రాజ్య వ్యవస్థలోని లోపాలు
3.7.3 భూఖండ విధానము
3.7.4 స్పానిష్ వ్రణం
3.7.5 రష్యాపై దండయాత్ర
3.7.6 విమోచన యుద్ధం
3.7.7 పటిష్ఠమైన నౌకాదళం లేకపోవుట
3.8 ముగింపు
3.9 నమూనా ప్రశ్నలు
3.10 చదువదగిన గ్రంథాలు

## 3.1 ఉపోద్ఘాతం :

మధ్యధరా సముద్రంలో ఇటలీ సమీపంలో ఉండే కార్సికా ద్వీపం గురించి సుప్రసిద్ధ ఫ్రెంచి మేధావి రూసో "ఈ చిన్న ద్వీపం ఏదో ఒకనాడు ఐరోపానంతటినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతుందని నా మనసు చెబుతోంది" అని 1762లో వ్రాశాడు. ఆయన జోస్యం నిజమైంది. కార్సికా ద్వీపంలోని అజాసియో అనే చిన్న పట్టణంలో 1769 ఆగస్టు 15వ తేదీన ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నెపోలియన్ బోనపార్టీ ఐరోపానేగాక, యావత్ ప్రపంచాన్నే ఆశ్చర్యంలో ముంచెత్తాడు. కార్సికాను ఫ్రాన్స్ జినోవా రాజ్యం నుంచి 1769లో కొనుగోలు చేసింది. అదే సంవత్సరం ఆ ద్వీపంలో జన్మించిన నెపోలియన్ ఫ్రెంచి సామ్రాజ్యానికి చక్రవర్తి కావడం విస్మయకర విషయం.

నెపోలియన్ తన ప్రాథమిక విద్యను కార్సికాలోనే పూర్తిచేసి తొమ్మిదోఏట లూయీ మంజూరు చేసిన ఉచితవేతన సదుపాయాలతో ఒక సైనిక పాఠశాలలో చేరి సైనికవిద్య నభ్యసించాడు. చరిత్ర, గణితశాస్త్రం, భౌగోళిక శాస్త్రాలంటే అతనికి ఎంతో అభిమానం. ఇంకా యుద్ధాలను గురించి తెలుసుకోవడంలో అతడు కడు శ్రద్ధ ప్రదర్శించేవాడు. ఫ్రెడరిక్ మొదలైనవారి దిగ్విజయ యాత్రలలోని యుద్ధతంత్ర నైపుణ్యాన్ని సైతం ఆకళింపుచేసుకున్నాడు.

చదువు పూర్తి చేసిన తరువాత 16వ యేట సైన్యంలో ఫిరంగిదళంలో చేరాడు. తన కర్తవ్య నిర్వహణలో అసమాన ప్రతిభను ప్రదర్శించి 1793 నాటికి బ్రిగేడియర్ కాగలిగాడు. 1794లో బ్రిటిషువారి నోడించి టులోన్‌ను ముట్టడించి ప్రసిద్ధిలోకి వచ్చాడు. 1795లో పారిస్ ప్రజల దాడులనుండి జాతీయ కన్వెన్షన్‌ను కాపాడి, "విప్లవానికి మిత్రుడు, అరాజకానికి శత్రువుగా" మరింత ప్రఖ్యాతి వహించి కన్వెన్షన్ అభిమానం చూరగొన్నాడు. కన్వెన్షన్ అనంతరం అధికారంలోకి వచ్చిన డైరెక్టరీ ఇతడ్ని 1796లో ఇటలీ దండయాత్రకు నాయకునిగా నియమించింది.

## 3.2 నెపోలియన్ ఇటలీ దండయాత్ర :

నెపోలియన్ ఇటలీలోని ఆస్ట్రియన్ సైన్యాలపై దాడి చేయడానికి రెండురోజుల ముందు వివాహం చేసుకున్నాడు. "నీ నుంచి దూరంగా ఉన్న నాకు ఆనందం ఎక్కడ ? నా ఆత్మని మించి మరేదో నువ్వు దోచుకున్నావు. నా సమస్త ఆలోచనలు నువ్వే. ఊపిరి సలుపునివ్వని ఉద్రేకాన్ని నేనిక్కడ అనుభవిస్తున్నాను" అంటూ భార్యకు భావోద్వేకంతో లేఖలు వ్రాశాడు. నెపోలియన్ పొడుగు 5 అడుగుల 3 అంగుళాలు మాత్రమే కాని. తీక్షణతను ప్రసరింపజేసే విశాల నేత్రాలు, పొడుగాటి కొనదేరిన ముక్కు ఆయన శరీరంలో ప్రస్ఫుటంగా కనిపించేవి. ఆయన చూపులు అనుచరులను ఉత్తేజపరిచేవి. శత్రువులను భయకంపితులను చేసేవి. నెపోలియన్ బద్ధశత్రువులైన డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ యుద్ధరంగంలో నెపోలియన్ ఉనికి 40వేల సైనికులకు సమానం అంటాడు. దీన్నిబట్టి నెపోలియన్ వ్యక్తిగత ఆకర్షణ, శక్తి, నాయకత్వ సామర్థ్యం అవగతమవుతాయి. ఫ్రెంచి సైన్యంలో చాలామందికి సరైన శిక్షణలేదు. అయితే చక్రవర్తులు, ప్రభువులు, మతాధిపతుల ఆధిపత్యం ఉన్న సమాజాన్ని ముక్కలు ముక్కలు చేయాలన్న ఆవేశం పొంగిపొర్లేది. ఈ ఆవేశంతోనే వారు చెలరేగి ఐరోపాను గడగడలాడించారు. "సైనికులారా . . . మీకు సరైన అహారంలేదు. ధరించడానికి సరైన వస్త్రాలులేవు. ప్రభుత్వం మీకెంతో ఋణపడి ఉన్నా . . . మీకోసం ఏమీ చేయటం లేదు. మీ సహనం, మీ ధైర్యం మీకు గౌరవాన్ని తెచ్చిపెడుతున్నా . . . అది మీ కెందుకు కొరగావటం లేదు. భూతలంలోని మంచి మాగాణులను మీ స్వాధీనంలోకి తేవడానికి మీకు నేను నాయకత్వం వహిస్తున్నాను. సుసంపన్న ప్రాంతాలు, గొప్పనగరాలు మీ చేతుల్లోకి రాబోతున్నాయి. అప్పుడే మీకు సముచితమైన కీర్తి, గౌరవం, సంపద లభిస్తాయి". ఇలా నెపోలియన్ ప్రసంగాలు సాగేవి. అతిక్లిష్ట సమయంలో తనే ముందుకు దుమికి, ఘోర అపజయాలను కూడా ఎదుర్కొన్నాడు. రెండింటిలోనూ ఆయనే కీలకపాత్రధారి. ఆనాటి చరిత్ర ఆయన చుట్టూ తిరిగేది.

నెపోలియన్ 38 వేల మంది సైన్యంతో బయలుదేరి మొదట సార్డీనియా సైన్యాలను ఓడించి, ఆ తర్వాత ఆస్ట్రియా సైన్యాలున్న మాంటూవా నగరాన్ని జూన్ 1796 నుండి జనవరి 1797 వరకు ముట్టడించాడు. దానిని విముక్తి చేయడానికి నాలుగుదఫాలుగా వచ్చిన ఆస్ట్రియా సైన్యాలను ఆర్కోల, రివోలి మొదలైన స్థలాలలో ఓడించాడు. దీనితో ఆస్ట్రియా, సార్డీనియాలు దాసోహమనక తప్పలేదు. సార్డీనియా తనకు చెందిన సవాయ్, నీస్ ప్రాంతాలను ఫ్రాన్స్‌కి బదిలీ చేసింది. అక్టోబరు 17, 1787లో జరిగిన కాంపో ఫోర్మియో సంధి ద్వారా ఆస్ట్రియా ఉత్తర ఇటలీ ప్రాంతంలో ఉన్న లంబార్డీని, బెల్జియంను జర్మనీలో రైన్‌నదికి ఎడమగట్టు ప్రాంతాలను ఫ్రాన్స్‌కి బదిలీ చేయడానికి అంగీకరించింది. దీనికి బదులుగా వెనీషియాను నెపోలియన్ ఆస్ట్రియాకు స్వాధీనం చేశాడు. జనోవా రిపబ్లిక్‌ను ఫ్రాన్స్ చేతిలోనే ఉంచాడు. అంతేకాక కోర్ఫూ, జాంటే మొదలైన అయోనియన్ సముద్ర ద్వీపాలు కూడా ఫ్రాన్స్‌కి లభించాయి. ఈ ఇటాలియన్ దండయాత్రలో నెపోలియన్ 18 పెద్ద, 65 చిన్నయుద్ధాలు చేశాడు. ఆస్ట్రియా నుండి, ఇటాలియన్ రాజ్యాల నుండి తీసుకున్న నష్టపరిహారం నుండి మూడుకోట్ల ఫ్రాంకులను, 300 ప్రాచీన, ఆధునిక కళాఖండాలను పారిస్‌కు పంపించాడు. లోడి, ఆర్కోలా వంతెనలను దాటడంలో ప్రాణాలకు తెగించి, ఆయన చూపించి ధైర్యసాహసాలు ఫ్రెంచి ప్రజలలో ఆయనపట్ల ఆరాధనా భావాన్ని పెంపొందించాయి. అందువల్లనే అప్పటినుండి సైనికులు అతణ్ణి (Little Corporal) అని ప్రేమపూర్వకంగా పిలిచేవారు.

## 3.3. ఈజిప్టు దండయాత్ర :

నెపోలియన్ విజయాల వలన ఫ్రెంచి సరిహద్దులు రైన్ నది వరకు విస్తరించాయి. ఆస్ట్రియా, సార్డీనియా, ప్రష్యా, స్పెయిన్, హాలెండ్‌లు ఫ్రెంచి సైన్యాల చేతిలో ఓడిపోవడంతో ప్రథమ ఐరోపా సంకీర్ణ కూటమి రాజ్యాలలో ఇక ఇంగ్లండ్ మాత్రమే మిగిలింది. దానిని జయించమని ఫ్రెంచ్ ప్రభుత్వం నెపోలియన్‌ను ఆదేశించింది. ఆయన ఉత్తరకోస్తా ప్రాంతాలను పరిశీలించి ఇంగ్లీష్ నావికాదళ శక్తిని సరిగ్గా అంచనావేసి ఇంగ్లండ్‌పై దాడిచేయడం సాధ్యంకాదని నిర్ణయించాడు. వలస ప్రపంచం నుంచి ముఖ్యంగా భారతదేశం నుండి ఇంగ్లండ్‌కి తరలివస్తున్న ధనరాసులను నిలపు చేయగలిగితే ఆ దేశం దానంతట అదే పతనమవుతుందని కనుక ఐరోపాకి భారతదేశానికి మధ్య కీలకస్థానంలో గల ఈజిప్టును ఆక్రమించడం మంచిదని ఆయన డైరెక్టరీకి సూచించాడు. డైరెక్టరీ దీనిని ఆమోదంచడంవల్ల తన సైన్యంతో ఆయన 1798 మే నెలలో ఈజిప్టుకి ప్రయాణమయ్యాడు. ఈ రోజులలో పేరుకి మాత్రం ఈజిప్టు టర్కీ సుల్తానుల పాలనలో ఉండేది. ఆచరణలో "మామలూక్" (బానిసలు) అనే సుల్తానుల పాలనలో ఉండేది. మొదట నెపోలియన్ మాల్టానాక్రమించి, పిరమిడ్‌ల వద్ద జరిగిన యుద్ధంలో నెపోలియన్ వారి సైన్యాలను ఓడించి ఆ దేశంపై ఫ్రాన్స్ ప్రాబల్యాన్ని నెలకొల్పాడు. అక్కడినుండి భారతదేశంలోని టిప్పుసుల్తాన్, రంజిత్‌సింగ్, పీష్వా రెండో బాజీరావు తదితర మహారాష్ట్ర నాయకులకు ఇరాన్‌షా, ఆఫ్ఘన్ అమీర్‌కు ఉత్తరాలు వ్రాశాడు. కాని ఒక్క టిప్పుసుల్తాన్ నుంచి తప్ప మరెవ్వరి నుంచి ఆయనకు సానుకూల సమాధానం రాలేదు. దానితో భారతదేశంపై దాడిచేసే ప్రయత్నం వదలుకొన్నాడు. ఇంతలోనే ఇంగ్లీష్ అడ్మిరల్ నెల్సన్ నైలునది ముఖద్వారంవద్ద మకాం చేసివున్న ఫ్రెంచి నౌకాదళాన్ని నాశనంచేసి, నెపోలియన్‌ను యుద్ధంలో ఓడించాడు. ఆ తర్వాత సిరియాను జయించాలని శక్తికొద్దీ ప్రయత్నించి చివరకు విఫలుడై ఫ్రాన్సు తిరిగివచ్చాడు.

## 3.4 ప్రథమ కాన్సల్‌గా నెపోలియన్ (1799 - 1804) :

నెపోలియన్ ఈజిప్టు నుంచి ఇక తిరిగి రాడనే ధైర్యంతో 1798లో ఇంగ్లండ్, ఆస్ట్రియా, రష్యా, టర్కీ, నేపుల్స్‌లు "రెండో సంకీర్ణ కూటమి"గా ఏర్పడి ఫ్రెంచివారిని ఇటలీ, జర్మనీల నుండి తరిమివేశారు. నెపోలియన్ పట్ల అసూయ, భయం పెంచుకున్న డైరెక్టరీ అతణ్ణి గురించి పట్టించుకోలేదు. కాగా ఫ్రాన్సులో దుష్పరిపాలన నెలకొనడానికీ, నెపోలియన్ ఈజిప్టులో పరాజయం చెందడానికి డైరెక్టరీని బాధ్యత వహించాలని, ప్రజలు డైరెక్టరీని నిందించి దేశాన్ని రక్షించగల సమర్థుడు నెపోలియన్ ఒక్కడేనని

అతనికి ఘనస్వాగతం పలికారు. ప్రజాభిప్రాయాన్ని గమనించిన నెపోలియన్ డైరెక్టరీ సభ్యులలో ఒకడైన అబ్బెసీయస్ సాయంతో డైరెక్టరీ ప్రభుత్వాన్ని కూలదోసి కాన్సలర్ తరహా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాడు. ముగ్గురి కాన్సలర్‌లలో తాను ప్రథమ కాన్సలరై అధికారమంతా తన చేతుల్లోనే ఉంచుకున్నాడు. డైరెక్టరీ పాలనతో విసిగిన ప్రజలు ఈయన చర్యను హర్షించారు.

ప్రథమ కాన్సల్‌గా నెపోలియన్ రెండో సంకీర్ణ కూటమితో యుద్ధాన్ని కొనసాగించాడు. ఆస్ట్రియన్ సైన్యాలను జర్మనీలో హోహిన్‌లిండన్ వద్ద ఇటలీలోని మెరెంగోవద్ద ఫ్రెంచి సైన్యాలు ఓడించాయి. ఆస్ట్రియా లూన్‌విల్ వద్ద సంధి చేసుకోవడం ద్వారా కాంపోఫోర్మియా సంధిని ధృవపరిచింది. ఆస్ట్రియా లూన్‌విల్ వద్ద సంధి చేసుకోవడం ద్వారా "కాంపాఫోర్మియా" సంధిని ధృవపరిచింది. మిగతా రాజ్యాలు కూడా కూటమి నుంచి తప్పుకొనటం వలన గత్యంతరం లేక 1802లో ఇంగ్లండ్‌లో కూడా ఎమియన్స్ వద్ద ఫ్రాన్స్‌తో సంధి చేసుకొంది. దీనిప్రకారం సిలోన్, ట్రినిడాడ్‌లు తప్ప ఈ యుద్ధంలో ఇంగ్లండ్ జయించిన రాజ్యాలు ఫ్రాన్స్‌కు ఇచ్చివేసింది. నేపిల్స్‌ను వదులుకోవడానికి, ఈజిప్టును టర్కీకి ఇవ్వడానికి ఫ్రాన్స్ అంగీకరించింది. ఎమియన్స్ సంధి ద్వారా నెపోలియన్ ఐరోపాలో తాత్కాలికంగా శాంతి నెలకొల్పాడు.

ప్రథమ కాన్సల్‌గా పేరుప్రఖ్యాతులు గడించిన నెపోలియన్ ప్రజాభీష్టం మేరకు జీవితకాలం కాన్సలర్‌గా ఎన్నికయ్యాడు. పాతవ్యవస్థకు అనుకూలురు తనపై కుట్రపన్నుతున్నారనే నెపంతో తన 34వ సంవత్సరంలో అంటే 1804లో ఫ్రాన్స్ చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. 45వ ఏట పదవీభ్రష్టుడయ్యాడు. ఇంచుమించు 15 సంవత్సరాలుమాత్రం అధికారంలో ఉన్న ఈ వ్యక్తి అనన్య సామాన్యమైన ఘనకార్యాలను సాధించగలిగాడు. అసలు యావత్తు ఐరోపాకే నెపోలియన్ చక్రవర్తి కావాలనుకున్నాడు. ఈ సంకల్పంతోనే ఎన్నో యుద్ధాలు చేశాడు. లక్షలమంది వాటిల్లో శలభాల్లా మాడిపోయారు. ఇంగ్లండ్ మినహా మిగతా ఐరోపా ఖండంపై తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. వోల్టేర్, రూసో ప్రబోధనలతో ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వ స్థాపనకోసం రగులుతున్న ఫ్రెంచివిప్లవం ఎన్నో విపరిణామాల అనంతరం నెపోలియన్ సర్వాధికారాలు చేపట్టడానికి దారితీసింది. చివరకు ఆయన ఫ్రాన్స్ చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. దీనిని చూసే ప్రతివిప్లవం కొత్తరూపంలో నియంతృత్వాన్ని పునఃస్థాపించడానికి దారి తీస్తుందన్న భావన ఏర్పడింది. నెపోలియన్ ఒక కొత్తశక్తికి ప్రాతినిధ్యం వహించాడు. తన యుద్ధాలతో మధ్యయుగాల నాటి అవశేషాలను తుడిచిపెట్టాడు. తాను అడుగుపెట్టిన ప్రతిదేశంలోనూ ఫ్రెంచి విప్లవస్ఫూర్తిని పర్యాప్తం చేశారు. ఆయనని ఫ్రెంచి విప్లవ పుత్రుడనుకోవచ్చు.

## 3.5 నెపోలియన్ సంస్కరణలు :

నెపోలియన్ అధికారంలోకి రాగానే ముందుగా అరాచకశక్తులను అణచివేసి దేశమంతటా శాంతిభద్రతలను నెలకొల్పాడు. దీనితో ఆయన పరిపాలనా సామర్థ్యంపై ప్రజలకు విశ్వాసం కుదిరింది. విద్య, పరిపాలనా సంస్కరణలతో ప్రభుత్వ రూపురేఖలనే మార్చివేశాడు. కనుకనే ఫిషర్ మొదలైన పండితులు "నెపోలియన్ దిగ్విజయాలు" అశాశ్వతమైనప్పటికీ అతని పరిపాలన సంస్కరణలు గ్రానైట్ రాయితో నిర్మించిన పటిష్టమైన భవనంవలె సుస్థిరమైనవి, శాశ్వతమైనవి" అని కొనియాడారు.

### 3.5.1 పాలనా సంస్కరణలు :

నెపోలియన్ పాలనా విధానంలోని మూలసూత్రం కేంద్రీకృత పాలనా వ్యవస్థను నెలకొల్పడమే. విప్లవంనాటి స్థానిక పరిపాలనా వ్యవస్థకు స్వస్తిచెప్పి, దాని స్థానంలో తనకు విధేయులైన వారిని పాలకులుగా నియమించాడు. ఈవిధంగా ప్రతి డిపార్ట్‌మెంట్‌కు (రాష్ట్రానికి) ఒక ప్రిఫెక్ట్‌ను, జిల్లాకు ఒక సబ్‌ప్రిఫెక్ట్‌ను పెద్ద నగరాలకు మేయర్లను ప్రథమ కాన్సల్ (నెపోలియన్) నియమిస్తాడు. నెపోలియన్ కేంద్రప్రభుత్వ పరిపాలన బాధ్యతలను వివిధ మంత్రుల మధ్య విభజించాడు. వారి సిబ్బంది పనిచేయడానికి

సచివాలయాన్ని ఏర్పరిచాడు. కాని మంత్రులు సమిష్టిగా పనిచేసే కాబినేట్ పద్ధతిని నెపోలియన్ ప్రవేశపెట్టలేదు. మంత్రులు విడివిడిగానే చక్రవర్తికి బాధ్యత వహించేవారు. ప్రతిభ ఆధారంగా తన అనుయాయులను మంత్రులుగా ఉద్యోగులుగా నియమించేవారు.

### 3.5.2 ఆర్థిక సంస్కరణలు :

బూర్బన్ రాజుల కాలం నుండి దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైంది. విప్లవ ప్రభుత్వాలు పరిస్థితిని చక్కదిద్దలేకపోయాయి. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ వృధా ఖర్చులకు స్వస్తి చెప్పాడు. జాతీయ శాసనసభ ముద్రించిన అసిగ్నాట్స్ అనే కాగితపు డబ్బును రద్దుచేసి కొత్త నాణాలను ముద్రించాడు. పన్నులను సకాలంలో ఎటువంటి పక్షపాత వైఖరిని ప్రదర్శించకుండా ఖచ్చితంగా వసూలు చేశాడు. తాను జయించిన రాజ్యాల నుండి యుద్ధనష్టపరిహార రూపంలో రాబట్టిన ధనరాసులను ఫ్రెంచి ఖజానాకు తరలించాడు. ప్రభుత్వోద్యోగ వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతిని అరికట్టాడు. అవినీతిని అరికట్టగలిగితే ప్రజలకు లంచాలిచ్చే అవసరం ఉండదుకాబట్టి ప్రభుత్వం విధించిన పన్నులు వారికి భారమనిపించవని, అక్రమార్జన ఆశలేని ప్రభుత్వోద్యోగులు కూడా త్వరితగతిని పనులు పూర్తి చేస్తారని, అటువంటప్పుడు వారి వేతనాలు, ప్రజలపై తదనుగుణంగా పన్నులభారం పెంచినా ఫరవాలేదని నెపోలియన్ విశ్వాసం. ఇది ఆయన ఆచరించి చూపాడు. దేశంలో ఆర్థిక పటిష్టతను నెలకొల్పడానికి ఆయన 1800 సంవత్సరంలోనే "బ్యాంకు ఆఫ్ ఫ్రాన్స్"ను స్థాపించి అచిరకాలంలోనే దానిని అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ బ్యాంక్‌గా తీర్చిదిద్దాడు. ఆర్థిక రంగంలో ఆయన తీసుకున్న చర్యల వలన 1802 నాటికి దేశ ఆర్థిక పరిస్థితి చక్కబడి ఏనాటినుండో పేరుకుపోయిన విదేశీ ఋణభారం కూడా అదృశ్యమైంది. తమకు నిత్యం వడ్డీల రూపంలో లక్షలాది ఫ్రాంకులను ముట్టచెబుతున్న ఫ్రాన్స్ తమ బాకీలను తీర్చివేయడం కొంతమంది విదేశీ బ్యాంకర్లకు ఆగ్రహం కల్గించి వారు నెపోలియన్ శత్రువులకు ఆర్థిక సహాయం అందించడానికి కూడా సంసిద్ధమయ్యారు.

నెపోలియన్ అనేక రహదారులను, వంతెనలు, భవనాలు నిర్మించి దేశంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచాడు. 1811 నాటికి దాదాపు విశాలమైన 200 రోడ్లను నిర్మించాడు. వీటిలో 30 రహదార్లు పారిస్ నుండి వివిధ దిక్కులకు సాగి దేశ సరిహద్దులను తాకేవి. రెండురోడ్లు ఆల్ప్స్ పర్వతాల మీదుగా ఇటలీలోకి ప్రవేశిస్తాయి. నదులపై వంతెనలు నిర్మించి వాటికి తన సైనిక విజయస్థలాల పేర్లు పెట్టాడు. చిత్తడి నేలలను సాగులోకి తీసుకువచ్చి నీటిపారుదల సౌకర్యాలు కల్పించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేశాడు. నౌకాశ్రయాలను విస్తృతపరచి వాటికి అవసరమైన కట్టడాలను నిర్మించి రక్షణ కల్పించాడు. పారిస్‌ను సర్వాంగసుందరంగా రూపొందించాడు. మూడు వరసలలో చెట్లను పెంచి వాటి మధ్య రెండు వరసలలో విశాలమైన రహదారులను నిర్మించే ఎవెన్యూ పద్ధతిని ఆయనే ప్రవేశపెట్టాడు. ఇతర దేశాల నుండి ప్రసిద్ధిచెందిన శిల్పాలను, వర్ణచిత్రాలను తెచ్చి పారిస్ మ్యూజియంకు ప్రపంచంలోనే ఒక విశిష్ఠస్థానం చేకూర్చాడు. దేశంలోని పురాతన భవనాలన్నిటిని మరమ్మత్తు చేయించి వాటి వైభవాన్ని పునరుద్ధరించాడు. సెంట్ - క్లౌడ్, ఫౌంటెన్‌బ్లూ మొదలైన రాజభవనాలను వర్సే భవనంతో పోటీపడేటట్లు తీర్చిదిద్దాడు. దీనివలన ఫ్రాన్స్ ఈనాటికీ గొప్ప పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది.

### 3.5.3 పోప్‌తో సంధి (1802) :

ఫ్రెంచి విప్లవం మతాన్ని నిషేధించింది. కాని నెపోలియన్ 1802లో పోప్ పదోపయస్‌తో సంధి చేసుకోవడం ద్వారా కాథలిక్ మతాన్ని ఫ్రాన్స్‌లో పునరుద్ధరించడానికి అనుమతించాడు. దీనినే మతపరమైన సంధి లేక రాజీ (Religious Concordat) అంటారు. అయితే విప్లవ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న చర్చి భూములను, ఇతర ఆస్తులను తిరిగి చర్చిలకు ఇవ్వడానికి అంగీకరించలేదు. తాను సూచించిన వ్యక్తులనే మతాధికారులుగా నియమించాలని పోపచేత ఒప్పించాడు. అంతేకాక కాథలిక్

మతం ఫ్రాన్స్‌లో అధికారమతంకాదని, కాథలిక్ మతస్తులతోపాటు ఇతర అన్నిమతాల శాఖల వారికి సమానహక్కులు, స్వాతంత్ర్యం ఉంటాయని ప్రకటించాడు. వీటన్నింటికీ అంగీకరించిన పోప్ శత్రురాజ్యాల ప్రోద్బలం వలన 1809లో నెపోలియన్‌ను మతం నుండి వెలివేశాడు. దీనికాగ్రహించిన నెపోలియన్ ఆయనను నిర్బంధంలో ఉంచాడు. గత్యంతరం లేక పోప్ మరొక సంధి చేసుకోవడం ద్వారా 1802లో మతపరమైన రాజీ (Religious Concordat) కి కట్టుబడి ఉండడానికి ఇకముందు అవిగ్నాన్‌లో నివసించడానికి అంగీకరించాడు. నెపోలియన్ పతనమైన తర్వాత కూడా 103 సంవత్సరాలపాటు "1802 కంకర్డాట్" అవిచ్ఛిన్నంగా కొనసాగింది.

### 3.5.4 విద్యాసంస్కరణలు :

నెపోలియన్ గొప్ప విద్యావేత్త. నెపోలియన్ అభ్యసించింది సైనికవిద్య ఇందులో ఆయనకానాడు ఎవరూ సాటికారని ఆయన సాధించిన విజయాలే నిరూపిస్తాయి. అయితే ఆయన గణితశాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర, రాజనీతిశాస్త్రం, భూగోళశాస్త్రం, పురావస్తుశాస్త్రం, సాహిత్యం, కళలు మొదలైన విజ్ఞాన విభాగాలలో కూడా అపారపరిజ్ఞానం సముపార్జించాడు. నిరంతర పఠనా వ్యాసంగం వల్లనే ఆయనకిది సాధ్యమైంది. తోటి విద్యార్థులు ప్రణయ కలాపాలలో నిమగ్నులైతే ఈయన మాత్రం గ్రంథాలకు అంకితమయ్యేవాడు. ఆయన గణితశాస్త్రాన్ని యుద్ధతంత్రానికి అన్వయింపజేశాడు. ఆయకున్న భూగోళ పరిజ్ఞానం యుద్ధవ్యూహరచన కెంతగానో తోడ్పడింది. చరిత్ర పురావస్తు శాస్త్రాలపట్ల ఆయనకున్న ఆసక్తి ఈజిప్టులో ప్రాచీన గ్రీకు, ఈజిప్టియన్ లిపులలో శాసనమున్న "రోజెట్టి శిల"ను వెలికి తీయడానికి ఉపయోగపడింది. ఇది ప్రాచీన ఈజిప్టు చరిత్ర అధ్యయనానికి ఎనలేని మేలుచేసింది. నెపోలియన్‌కు ఫ్రెంచి, ఇటాలియన్, లాటిన్ భాషలపై మంచి ఆధిపత్యం ఉండేది. ఆయన రాసిన ఉత్తరాలలో వచన కవిత్వ లక్షణాలుండేవి. అందుచేతనే బ్రియాండ్ ఆయనను "క్రియారూపంలో ఉన్న కవి"గా అభివర్ణించాడు. గ్రంథకర్త కాకపోయినా సాహిత్య విమర్శకుడిగా నెపోలియన్‌కు మంచి గుర్తింపే లభించింది. పాత్రలలో, కథా వస్తువులలో, దాని సంవిధానంలో సహజత్వం లోపించినప్పుడు రచన పేలవంగా ఉంటుందని ఆయన అభిప్రాయం. "కథానాయకుడిని తాపీగా కూర్చునే వ్యక్తిగా చిత్రించిన రచన ప్రహసనమవుతుందికానీ విషాదాంత కావ్యమెలా అవుతుంది ? అనే ప్రశ్న జర్మన్ సాహితీ ప్రముఖుడైన గెటీని కూడా ఆలోచింపజేసింది. వీలుచిక్కినప్పుడల్లా సాహితీ గోష్ఠిలలో పాల్గొనటం నెపోలియన్‌కి అలవాటు. ఈజిప్టు నుంచి తిరిగివస్తూ సూయజ్ వద్ద కాలువ త్రవ్వి మధ్యధరా, ఎర్రసముద్రాలను కలిపితే అంతర్జాతీయ నౌకాయానానికి ఎంతో మేలు కలుగుతుందని సూచించడం ఆయన ఊహాశక్తికి, దూరదృష్టికి, పరిశీలన శక్తికి చిహ్నం.

నెపోలియన్ విద్యారంగంలోకూడా అనేక మార్పులు తీసుకువచ్చాడు. దేశంలో జాతీయ విద్యావిధానం ప్రవేశపెట్టాడు. విద్యాలయాలపై మతాధికారుల ఆధిపత్యాన్ని తొలగించాడు. నెపోలియన్ విద్యావిధానంలో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు సైనికవృత్తి కళాశాలలు, విశ్వవిద్యాలయాలు అనే 4 శ్రేణులను ప్రవేశపెట్టాడు. ఈ నూతన విద్యావిధానాన్ని అనుసరించి ప్రాథమిక పాఠశాలలో ఫ్రెంచి లాటిన్ భాషలను, సామాజికశాస్త్ర విజ్ఞాన అంశాలపై ఎక్కువ కేంద్రీకరించేవారు. సైనిక వ్యవస్థకు అవసరమయిన ఉద్యోగులను, సాంకేతిక నిపుణులను తయారుచేయడానికి, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి సైనికవృత్తి కళాశాలలు ఉండేవి. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల కృషిని పర్యవేక్షించి వాటికి మార్గదర్శకత్వం వహించడం కోసం నెపోలియన్ పారిస్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. అదేవిధంగా శాస్త్ర విజ్ఞానరంగంలో పరిశోధనలను నిర్వహించడానికి ఒక అకాడమీని స్థాపించాడు.

స్త్రీవిద్యపట్ల నెపోలియన్ ప్రత్యేకశ్రద్ధ వహించాడు. "మాతృమూర్తి కంటే గొప్ప అధ్యాపకులెవ్వరూ ఉండర"ని అందుకనే స్త్రీ అన్ని విధాల ఆదర్శమూర్తిగా రూపొందితే సమాజం సరిఅయిన దారిలో నడుస్తుందని ఆయన విశ్వాసం. విద్యాసంస్థలు యువతులను "హాస్యోక్తులాడుతూ అందరికీ వినోదం కలిగించే అందాలబొమ్మలు"గా కాక, ధర్మశీలినులుగా తయారుచేయాలని,

అందం అలంకరణ వంటి విషయాలపై వారిలో పోటీ మనస్తత్వాన్ని పెంచకూడదని, వారిలో ఉన్నతాదర్శాలను పెంపొందింపచేయాలని ఉద్బోధించేవాడు. స్త్రీలలో అంధవిశ్వాసాలను తొలగించేందుకు వారికి శాస్త్రవిజ్ఞానాన్ని బోధించాలని వారి వ్యక్తిత్వాన్ని వికసింపచేయాలని ఉద్ఘాటించేవాడు.

సైన్స్ ప్రాధాన్యాన్ని గుర్తించిన ఆధునిక పాలకుల్లో నెపోలియన్‌ది అగ్రస్థానం. ఐరోపాలో ఒక శతాబ్దంపాటు ఆయనకు ఈ విషయంలో ధీటైన రాజకీయనాయకుడు లేడు. నెపోలియన్ దృష్టిలో విజ్ఞానశాస్త్రానికి ఎల్లలులేవు. శత్రుదేశాల శాస్త్రవేత్తల పట్ల కూడా ఎంతో గౌరవాన్ని చూపాడు. ఎలక్ట్రో - కెమికల్ ఆవిష్కరణకుగాను హంఫ్రీడేవీని ఫ్రాన్సుకు ఆహ్వానించి బహుమతి అందజేయటమే దీనికి నిదర్శనం.

### 3.5.5. నెపోలియన్ న్యాయస్మృతి (Nepolean Code) :

నెపోలియన్ సంస్కరణలన్నింటిలో అతడు తయారుచేసిన న్యాయస్మృతి చిరస్మరణీయమైనది. విప్లవానికి ముందు ఫ్రాన్స్‌లో వివిధ రకాల న్యాయస్మృతులు ఉండేవి. న్యాయస్థానాలు అవినీతికి, ఆలస్యానికి మారుపేరుగా నిలచాయి. ఇటువంటి పరిస్థితులలో అవినీతికి, అన్యాయానికి చోటులేకుండా నిష్పక్షపాతంగా న్యాయాన్ని ప్రజలకు అందించడానికి ఒక న్యాయకమీషన్‌ను నియమించాడు. నిష్ణాతులైన వ్యక్తులతో కూడిన ఈ కమీషన్ న్యాయస్మృతులను క్రోడీకరించి, ప్రజలకు అనుకూలంగా ఉండేటట్లు నివేదికలను తయారుచేశారు. కమీషన్ సమర్పించిన నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చేర్పులు, మార్పులు చేసి న్యాయస్మృతిని చట్టబద్ధంగా చేశాడు నెపోలియన్. దీనిని "నెపోలియన్‌కోడ్" అంటారు. క్లుప్తంగా, సరళంగా, స్పష్టంగా సామాన్య విద్యావంతునికి కూడా అర్థమయ్యే రీతిలో ఉండడం, సాంకేతిక పదాడంబరం లేకపోవడం ఈ కోడ్ శైలి ప్రత్యేక లక్షణం. ఇది దేశమంతా ఒకేరీతి న్యాయాన్ని ప్రవేశపెట్టింది. విప్లవ ఫలాలైన సాంఘిక సమత్వం, పరమతసహనం, సేద్యబానిసత్వ నిర్మూలనం, విచారణ ద్వారా తీర్పులివ్వడం మొదలైన వాటిని స్మృతులలో పొందుపరచడం జరిగింది. ఇది ఇతర దేశాలకు కూడా ఆదర్శనమూనాగా నిలిచింది. ఈ స్మృతుల వలన నెపోలియన్ తన విమర్శకుల ఆదరాభిమానాలను సైతం పొంది రెండో జస్టీనియన్‌గా కీర్తింపబడ్డాడు.

వార్తాపత్రికలకు, రంగస్థలానికి స్వాతంత్ర్యమీయక పోగా, వాటిపైన అనేక ఆంక్షలు విధించడం వలన ఆయన విప్లవ వ్యతిరేకశక్తిగా కనిపిస్తాడు. విప్లవకాలంలో విదేశాలకు పారిపోయిన ప్రభువులపట్ల సానుభూతి వహించి వారిని తిరిగి స్వదేశానికి ఆహ్వానించాడు. ఆ తర్వాత ఒక శిష్టవర్గాన్ని (Legion of Honour) సృష్టించాడు అయితే ఈ వర్గంలో సభ్యత్వం పుట్టుకను బట్టిగాక ప్రతిభనుబట్టి, ప్రభుత్వానికి చేసిన సేవనుబట్టి లభిస్తుంది. వీరిచేత పరివేష్ఠితమైన నెపోలియన్ పాతకాలపు బూర్బన్ చక్రవర్తులను తలపించేవాడు. శిష్టవర్గ నిర్మాణం ద్వారా తిరిగి రాచరికం నెలకొల్పడమే అయింది.

"నేనే విప్లవం" అన్న నెపోలియన్ మాటలు పూర్తిగా సత్యంకాదు. నిజానికి విప్లవమే జరగకపోతే ఒక సైనికోద్యోగిగా, అనామకుడిగా నెపోలియన్ జీవితం ముగిసేది. ఆయన చక్రవర్తి కావడానికి కారణం విప్లవమే. అంతేగాక విప్లవ వారసుడిగా ప్రాచీన వ్యవస్థను నిర్మూలించడం, విప్లవ భావాలైన సాంఘిక, ఆర్థిక సమత్వాన్ని చట్టసమ్మతాన్ని నెలకొల్పాడు. కాని ప్రభుత్వపాలనలో ప్రజలకు ప్రాతినిధ్యం లేకపోవడమూ, కొత్తగా శిష్టవర్గాన్ని నిర్మించడం పత్రికలపై ఆంక్షలు విధించడం మొదలైన చర్యల ద్వారా ఆయన విప్లవ వ్యతిరేక శక్తిలాగా మెలిగాడు. అందువల్ల "నేను విప్లవం" అని నెపోలియన్ అన్నప్పటికీ అతనిలో విప్లవ వ్యతిరేకత కూడా మూర్తీభవించిందని చెప్పాలి.

### 3.6 నెపోలియన్ బోనపార్టీ విదేశాంగ విధానం :

నెపోలియన్ పరిపాలనా దక్షుడేగాక అంతకుమించిన గొప్ప యుద్ధవీరుడు. యావత్తు యూరప్ ఖండాన్ని తన గుప్పిట్లో బిగించి, ఆ ఖండాన్ని శాసించిన మహాయోధుడు నెపోలియన్. "ఆయన ఎన్నడూ యాదృచ్ఛికంగా కాని, పొరపాటునకాని యుద్ధాలలో విజయం సాధించలేదు. వాటిని యుద్ధభూమిలో కంటే ముందుగానే తన శిరస్సులో జయించేవాడు" అని ఎమర్సన్ వ్రాశాడంటే ఆయ ఎంత స్పష్టంగా, సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా, తన దండయాత్ర పథకాలను రూపొందించేవాడో విశదమవుతుంది" "నీ ఆలోచనలో స్పష్టత ఉంటే ఆ తర్వాత అంతా సక్రమంగా జరుగుతుంది. అనేది ఆయన సువర్ణ సూత్రాలలో ఒకటి. నెపోలియన్ అభ్యసించింది సైనికవిద్య ఇందులో ఆయనకానాడు ఎవరూ సాటికారని ఆయన సాధించిన విజయాలే నిరూపిస్తాయి.

### 3.6.1. తృతీయ సంకీర్ణకూటమి ఏర్పాటు :

నెపోలియన్ ఎమియన్స్ సంధి షరతులను ఉల్లంఘించి ఇటలీ, స్విట్జర్లాండ్, హాలెండ్ రాజకీయాలలో జోక్యం చేసుకొని ఆ రాజ్యాలలో తన పలుకుబడిని పెంచుకున్నాడు. బ్రిటిష్ సామ్రాజాన్ని నాశనం చేయనిదే ఐరోపాలో తన అధికారం నెలకొనదని నెపోలియన్ ఆశిస్తే నెపోలియన్ అంతు తేల్చకపోతే తమ వలస వ్యాపారానికి శాశ్వత రక్షణ లేదని ఇంగ్లండ్ భావించింది. ఇంగ్లండ్‌ను జయించడమే లక్ష్యంగా పెట్టుక్ను నెపోలియన్ ఇంగ్లండ్‌కు వ్యతిరేకంగా తనతో చేతులు కలపమని ప్రష్యా, రష్యాలను కోరాడు. కాని వారి నుంచి ఆయనకు సానుకూల సమాధానం రాలేదు. అయితే స్పెయిన్ ఆయనతో మాడ్రిడ్ సంధి చేసుకొని అమెరికాలోని లూసియానాను ఆయనకిచ్చేయడమేగాక, ఆంగ్ల మిత్రరాజ్యమైన పోర్చుగల్‌పై దాడి చేసినపుడు స్పెయిన్ ఆయనకు సాయపడడానికి అంగీకరించింది. పైగా నెపోలియన్ ఇంగ్లండ్‌పై దండయాత్ర సన్నాహాలు చేస్తున్న విషయాన్ని గ్రహించిన ఇంగ్లండ్ భీతిల్లి ఎమియన్స్ సంధి షరతులనుల్లంఘించి, మాల్టా దీవిని ఖాళీ చేయకుండా తృతీయ సంకీర్ణ కూటమి ఏర్పాటుచేసింది. ఇందులో స్వీడన్,రష్యా, ఆస్ట్రియా, నేపిల్స్ రాజ్యాలు చేరాయి. ప్రష్యా తటస్థంగా ఉన్నది. 1804లో ఇంగ్లండ్ ప్రధాని పిట్ నాయకత్వంలో ఈ "తృతీయ సంకీర్ణరాజ్య కూటమి" ఏర్పడి నెపోలియన్‌ను అంతం చేయడానికి సమాయత్తమైంది. అంతట నెపోలియన్ తన అంతరంగిక వ్యవహారాల నుంచి దృష్టిని యుద్ధభూమికి మరల్చాడు.

### 3.6.2. ట్రఫాల్గర్ యుద్ధము (1805) :

ఇంగ్లండ్‌పై దాడి చేయడానికి నెపోలియన్ బోలోన్ (Bolougne) వద్ద తన నౌకాదళాన్ని కేంద్రీకరించాడు. తృతీయ సంకీర్ణ రాజ్య కూటమి ఫ్రాన్స్‌పై దాడి జరగకముందే నెపోలియన్ పెద్ద సైన్యంతో ఆస్ట్రియాపై దండెత్తి అక్టోబరు 20న ఉల్ఫ్ యుద్ధంలో ఆస్ట్రియన్‌ల నోడించి 60,000 ఆస్ట్రియన్ సైనికులను ఖైదీలుగా పట్టుకున్నాడు. కాని ఆ మరుసటి రోజే ఆంగ్ల నౌకాదళాధిపతి అయిన నెల్సన్ ఫ్రెంచి నౌకాదళాన్ని ట్రఫాల్గర్ వద్ద ఓడించడంతో, నౌకాయుద్ధాలలో ఇంగ్లండ్‌ను జయించే ఆశ ఇక నెపోలియన్‌కి లేకపోయింది. కాని భూప్రాంత యుద్ధాలలో మాత్రం ఆయనకు తిరుగులేకుండా పోయింది. ట్రఫాల్గర్ యుద్ధంలో నెల్సన్ ప్రాణాలు కోల్పోయాడు.

ట్రఫాల్గర్ యుద్ధంలో ఓడిపోయిన నెపోలియన్ నిరాశచెందక ప్రష్యా మీదుగా తన సైన్యాలని నడిపించి రష్యా, ఆస్ట్రియా సైన్యాలను ఆస్టర్‌లిట్జ్ వద్ద 1805 డిశంబరు 2వ తేదీన ఓడించాడు. యుద్ధంలో ఓడిపోయిన ఆస్ట్రియా పాలకుడైన రెండో ఫ్రాన్సిస్ సంకీర్ణ రాజ్య కూటమి నుండి వైదొలగి నెపోలియన్‌తో ప్రెస్‌బర్గు (1805) సంధి చేసుకున్నాడు. ఈ సంధి ప్రకారం రెండో ఫ్రాన్సిస్ టూనిస్, టైరోల్‌లను వదులుకోవడమేగాక "పవిత్ర రోమన్ చక్రవర్తి" బిరుదాన్ని త్యజించి, "ఆస్ట్రియా చక్రవర్తి" బిరుదుతో సంతృప్తి చెందడానికి అంగీకరించాడు. ఫలితంగా గత 700 సంవత్సరాల నుంచి వస్తున్న పవిత్ర రోమన్ సామ్రాజ్యం అంతరించింది.

ఇకముందు పవిత్ర రోమన్ సామ్రాజ్యం పవిత్రమైనదీ కాదు. రోమన్‌ది కాదు. తర్వాత నెపోలియన్ 1806లో ప్రష్యా సైన్యాలను జినా వద్ద జరిగిన యుద్ధంలో ఓడించి విజయగర్వంతో బెర్లిన్‌లో ప్రవేశించి చరిత్రాత్మకమైన బెర్లిన్ డిక్రీలను జారీచేశాడు. 1807లో ఫ్రీడ్‌లాండ్ వద్ద జరిగిన యుద్ధంలో మరొకసారి రష్యన్‌లను ఓడించాడు. రష్యాచక్రవర్తి అయిన మొదటి అలెగ్జాండర్ గత్యంతరంలేని పరిస్థితులలో నెపోలియన్‌తో టిల్‌సిట్ సంధి చేసుకున్నాడు. దీనితో తృతీయ రాజ్యసంకీర్ణ కూటమి విచ్ఛిన్నమవడమేకాక ఇంగ్లండ్ స్వీడన్‌లు మినహా మిగతా ఐరోపా నెపోలియన్ పాదాక్రాంతమైంది.

నెపోలియన్ తాను జయించిన రాజ్యాలలో తన సోదరులను సోదరీమణులను పాలకులుగా నియమించాడు. ఆయన తన అన్న జోసఫ్‌ను మొదట నేపుల్స్‌కి ఆ తర్వాత స్పెయిన్‌కి రాజుగా నియమించాడు. తన తమ్ములలో ఒకడైన లూయీని నెదర్లాండ్స్‌కి రాజుగా నియమించాడు. మరొక తమ్ముడు జరోమ్‌ను వెస్టఫేలియాకు రాజుగా చేశాడు. సోదరి ఎలిజాను టస్కనీకి పరిపాలకురాలుగా నియమించాడు. తాను రైన్ నదిపై నున్న పశ్చిమ జర్మన్‌రాజ్యాలతో ఏర్పరచిన "రైన్ సమాఖ్య" కి, ఇటాలియన్ రిపబ్లిక్‌కి అధ్యక్షుడయ్యాడు. ఇంతేగాక జర్మనీలో వర్టెంబర్, బవేరియాలను ప్రత్యేక రాజ్యాలుగా ఏర్పరిచాడు. ప్రష్యా సామ్రాజ్యంలోని పోలెండ్ భూభాగాన్ని, గెలీషియాను కలిపి వార్సా రాజ్యంగా నేర్పరచి సాక్షనీ పాలకుడికి అప్పగించాడు. ఈవిధంగా దాదాపు యావత్తు ఐరోపాను తన గుప్పిట్లో పెట్టుకున్నాడు.

కాని నెపోలియన్ విజయపరంపరలు అశాశ్వతం కావడం అత్యంత దురదృష్టకరం. అధికారాంధత్వం ముదిరిన తర్వాత మధ్యయుగ రాజవంశీయులకు ఉండే అహంకారం, కీర్తి, కాంక్ష, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం, తన వంశపాలనను సుసిద్ధం చేసుకోవాలనే తాపత్రయం వంటి అవలక్షణాలన్నీ ఆయనకు కూడా ఆవహించాయి. ఆదర్శవాదం, దూరదృష్టి, హేతువాద దృక్పథం ఆయనలో కనుమరుగయ్యాయి. తూర్పుప్రపంచ వాణిజ్యంపై ఇంగ్లండ్‌కు ఉన్న గుత్తాధిపత్యాన్ని విచ్ఛిన్నం చేయడంలో నెపోలియన్ విఫలమయ్యాడు. వీటితో ఆయన పతనం ప్రారంభమైంది. ఇటువంటి నెపోలియన్ పతనానికి గల ముఖ్యకారణాలేమంటేః

### 3.6.3 భూఖండ విధానం :

ఇక్క ఇంగ్లండ్ మాత్రమే నెపోలియన్‌కు దోసోహమనకుండా మిగిలింది. ఇంగ్లండ్ నౌకాదృశక్తిని సరిగ్గా అంచనావేసి, తనకు సరిఅయిన నౌకాదళం లేనందువల్ల ఇంగ్లండ్‌తో నౌకాయుద్ధం చేయడం సాధ్యంకాదని గ్రహించి, బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయడం ద్వారా దానిని లోబరచుకోవచ్చని భావించాడు. ఇందుకోసం "భూఖండ విధానం" అనే కొత్తపద్ధతిని నెపోలియన్ అనుసరించాడు. బెర్లిన్ (1806), మిలాన్ (1807) నగరాల నుంచి జారీచేసిన ఆజ్ఞల ద్వారా ఇంగ్లండ్ దేశవస్తువులను ఐరోపాఖండంలో ఏ ఇతరదేశం దిగుమతి చేసుకోరాదని ప్రకటించాడు. అలా చేసినట్లయితే వాటిలోని సరుకులను ఫ్రెంచి నౌకలు ముంచేస్తాయని కూడా తెలియజేశాడు. అంతేగాక ఇంగ్లీష్ సరుకులు ఫ్రెంచి మిత్రరాజ్యాలలో కనిపిస్తే వాటిని బహిరంగంగా దగ్ధం చేస్తామని కూడా 1810లో ఫెంటెన్‌బ్లో ఉత్తర్వుల ద్వారా హెచ్చరించాడు. ఈ ఆర్థిక దిగ్బంధమే "భూఖండ విధానంగా" ప్రసిద్ధికెక్కింది. ఇంగ్లీషు ఈస్ట్ఇండియా కంపెనీ తూర్పుప్రపంచవాణిజ్యంపై గుత్తాధిపత్యం లభించడంతో ఐరోపా దేశాలన్నీ వస్త్రాలకు, సుగంధ ద్రవ్యాలకు, పాదరక్షలకు, ఆహారపదార్థాలకు ఇంగ్లండ్‌పై ఆధారపడక తప్పలేదు. ఇటువంటి పరిస్థితుల్లో నెపోలియన్ విధించిన ఆర్థిక దిగ్బంధన వల్ల తమ నిత్యావసర సరులకు కోసం ఇంగ్లండ్‌పై ఆధారపడ్డ ఐరోపా రాజ్యాలు నానా ఇక్కట్లుకు గురయ్యాయి. సరుకుల కొరత మూలంగా ధరలు పెరిగిపోయాయి. దీనిని ప్రతిఘటిస్తూ బ్రిటిష్ ప్రధాని పిట్ "Orders in Council" అనే కొన్ని శాసనాలు జారీచేసాడు. ఆ శాసనాల ప్రకారం ఫ్రాన్స్‌తోగాని దాని మిత్రరాజ్యాలతోగాని ఇతర ఐరోపారాజ్యాలు వ్యాపారం చేయకూడదు. అలా చేసినట్లయితే ఆ నౌకలను ఆంగ్లేయులు పట్టుకొని ముంచివేస్తారు. నెపోలియన్ విధించిన ఈ ప్రచ్ఛన్న ఆర్థికయుద్ధాన్ని జార్‌అలెగ్జాండర్, ప్రష్యా రాజు మూడో ఫ్రెడరిక్ విలియమ్‌లు అమలుపరచారు. ఇంకా నేపిల్స్, వెస్ట్‌ఫెలియా,

హాలెండ్ రాజ్యాలు కూడా ఈ విధానాన్ని అమలుజరిపాయి. దీనివల్ల ఫ్రాన్స్, ఇంగ్లండ్ దేశాలకేకాక ఇతర ఐరోపా రాజ్యాలు కూడా బాగా నష్టపోయాయి. తగినంత నౌకాదళం లేనందువల్ల నెపోలియన్ భూఖండ విధానాన్ని సమర్ధవంతముగా అమలుజరపలేకపోయాడు. అయినప్పటికీ అతను ఈ విషయంలో మొండి వైఖరి ప్రదర్శించాడు. భూఖండ విధానాన్ని అమలుపరచలేదని పోప్ ఏడో పయస్‌ను 1809లో బంధించి అతని భూములను ఫ్రెంచి సామ్రాజ్యంలో విలీనంచేశాడు. పోప్‌ని ఈవిధంగా అవమానానికి గురిచేయడం కాథలిక్‌లయిన ఫ్రెంచి ప్రజలు సహించలేకపోయారు.

## 3.6.4. ద్వీపకల్ప యుద్ధం :

1703 నాటి మెతూన్ సంధి ఫలితంగా పోర్చుగల్ ఇంగ్లండ్‌లమధ్య చాలా లాభదాయకమైన వ్యాపారం జరుగుతున్నందువల్ల భూఖండ విధానం అమలుపరచడానికి పోర్చుగల్ నిరాకరించింది. అప్పుడు నెపోలియన్ స్పెయిన్ సహకారంతో పోర్చుగల్‌పై దండెత్తి ఆ దేశాన్ని ఆక్రమించాడు. అంతటితో ఆగకుండా స్పెయిన్ రాజైన నాల్గవ ఛార్లెస్, అతని కుమారుడైన ఫెర్డినాండ్‌ల మధ్య చెలరేగిన తగాదాల్లో నెపోలియన్ తలదూర్చి వారిద్దరిని పదవీచ్యుతులను చేసి తన అన్న జోసఫ్‌ను స్పెయిన్ సింహాసనంపై కూర్చోపెట్టాడు. అయితే స్పానిష్ ప్రజలు జోసఫ్‌ను విదేశీయుడని, అతని పరిపాలనను ఏవగించుకున్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు విదేశీయుల జోక్యాన్ని తీవ్రంగా నిరసించారు. ఫలితంగా అనేక విప్లవసంఘాలు ఏర్పడి తిరుగుబాట్లు ప్రారంభించాయి. ఇదే అదునుగా పోర్చుగల్ స్పెయిన్ దేశాలకు సర్ ఆర్థర్ వెల్లస్లీ (డ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్) నాయకత్వంలో ఇంగ్లీషు సేనలు తరలివచ్చాయి. దీనితో ద్వీపకల్ప యుద్ధం ప్రారంభమైంది. వెల్లస్లీ పోర్చుగల్ నాక్రమించి, స్పెయిన్‌లో ప్రవేశించి సలమంకా (1812), విట్టోరియా (1813) వద్ద జరిగిన యుద్ధాలలో ఫ్రెంచి సేనలను ఓడించి స్పెయిన్ నుంచి తరిమివేశాడు. మొట్టమొదటిసారిగా నెపోలియన్ ఓటమిని చవిచూడడం జరిగింది. నెపోలియన్ సమర్థులైన సేనానులను, సైనికులను పోగొట్టుకున్నాడు. నెపోలియన్ విజయపతాక తిరోగమనం ప్రారంభమైంది. స్పానిష్ వ్రణం నన్ను తినివేసిందని నెపోలియన్ స్వయంగా అంగీకరించాడు. స్పానిష్ జాతీయ తిరుగుబాటు ఐరోపాదేశాలలో జాతీయతిరుగుబాట్లకు ప్రోత్సాహకారి అయింది.

## 3.6.5. ఆస్ట్రియా తిరుగుబాటు :

ఆస్టర్లిట్జ్ యుద్ధానంతరం పరాభవంతో రగిలిపోతున్న ఆస్ట్రియా నెపోలియన్‌పై పగ తీర్చుకోవడానికి అనేక సైనిక వ్యూహాలను రూపొందించింది. పైగా స్పానిష్ ప్రజల జాతీయ తిరుగుబాటు ఆస్ట్రియన్‌లను ఉత్తేజపరిచింది. ఆస్ట్రియన్‌లు ఆర్చ్‌డ్యూక్ ఛార్లెస్ నాయకత్వంలో 1809 ఏప్రిల్‌లో యుద్ధం ప్రకటించి బవేరియా నాక్రమించారు. అయితే నెపోలియన్ వెంటనే సేనలను సమీకరించి వెళ్ళి ఆస్ట్రియన్‌లను వాగ్రాం యుద్ధంలో ఓడించాడు. ఈ యుద్ధంలో నెపోలియన్‌నే విజయలక్ష్మి వరించినప్పటికీ సైనికపరంగా భారీగా నష్టపోయాడు. నెపోలియన్ శక్తియుక్తులు క్రమంగా సన్నగిల్లుతున్నాయని దీనినిబట్టి స్పష్టమౌతుంది. ఆస్ట్రియా చక్రవర్తి రెండో ఫ్రాన్సిస్ కూడా ఇక పోరాటం చేయలేక నెపోలియన్‌తో వియన్నా సంధి (1809) చేసుకున్నాడు. ఈ సంధి ప్రకారం ఆస్ట్రియా చక్రవర్తి పశ్చిమ గెలీషియాను వార్సాకు, తూర్పు గెలీషియాను రష్యాకు, ఇల్లీరియన్ ఫ్రాన్స్‌కు, టైరోల్‌ను బవేరియాకు సమర్పించుకోవలసి వచ్చింది. ఈ సంధి వలన 4 1/2 మిలియన్ల జనాభా కలిగిన భూభాగాలను పోగొట్టుకొని యుద్ధఖర్చుల పరిహారంగా పెద్దమొత్తంలో ధనాన్ని నెపోలియన్‌కు చెల్లించవలసి వచ్చింది. 1811లో నెపోలియన్ ఆస్ట్రియా రాజకుమారి మేరియాను వివాహం చేసుకొని ఆమెకు పుట్టిన కుమారుడిని ఇటలీ చక్రవర్తిగా ప్రకటించుకొన్నాడు. ఇతడే రెండోనెపోలియన్‌గా ప్రసిద్ధికెక్కాడు. ప్రాచీన రాజవంశమైన హాప్స్‌బర్గ్‌తో నెపోలియన్ వైవాహిక సంబంధాలు పెట్టుకోవడం అతని ప్రతిష్ఠను ఇనుమడింపచేసింది. కాని ఆస్ట్రియన్లు మాత్రం తమకు జరిగిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవడానికి సమయం కోసం ఎదురుచూస్తున్నారు.

### 3.6.6. రష్యా దండయాత్ర (1812) :

టిల్సిన్ సంధి (1807)లో మిత్రులుగా మారిన నెపోలియన్, జార్ అలెగ్జాండర్‌ల మధ్య అచిరకాలంలోనే సత్సంబంధాలు క్షీణించి విభేదాలు పరాకాష్ఠనందుకున్నాయి. ముఖ్యంగా భూఖండ విధానం అమలుపరచడం ద్వారా రష్యా అపారంగా నష్టపోవడం జార్ అలెగ్జాండర్‌కు మింగుడుపడలేదు. అందువల్ల భూఖండ విధానాన్ని తిరస్కరించి, గ్రేట్‌బ్రిటన్‌తో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించాడు. దీంతో నెపోలియన్ అత్యంత ఆగ్రహం చెందాడు. కాగా జార్ ఆగ్రహానికి కారణాలు మరికొన్ని కూడా ఉన్నాయి. అవి టర్కీకి రష్యాకు మధ్య యుద్ధం జరిగినప్పుడు నెపోలియన్ జార్‌కు సాయం అందించకపోవడం, తనకు శత్రువైన ఆస్ట్రియా చక్రవర్తి కుమార్తెను నెపోలియన్ వివాహం చేసుకోవడం, జార్ బంధువులను ఓల్డెన్‌బర్గ్ రాజ్యం నుంచి తొలగించి, నెపోలియన్ ఆ రాజ్యాన్ని తన రాజ్యంలో విలీనం చేసుకోవడం. ఇన్ని కారణాల వల్ల రష్యా,ఫ్రాన్స్ స్నేహసంబంధాలు విచ్ఛిన్నమై, యుద్ధానికి సంసిద్ధమయ్యాయి.

1812లో నెపోలియన్ రష్యాపై యుద్ధం ప్రకటించగానే ఆస్ట్రియా 30వేల సైన్యాన్ని అతనికి సాయంగా పంపింది. ప్రష్యా 20 వేల సైన్యాన్ని పంపడమే గాకుండా తన భూభాగాల గుండా రష్యాలోకి నెపోలియన్ సైన్యాన్ని నడిపించడానికి తన అంగీకారాన్ని తెలిపింది. రైన్ సమాఖ్య నుండి లక్షా యాభైవేలు, ఇటలీనుండి 80వేలు, ఇలా వివిధదేశాలు సైనికసాయం చేయగా మొత్తం ఆరులక్షల సైన్యాన్ని సమీకరించుకొని 1812లో జూన్‌లో రష్యాపై దండెత్తాడు. రష్యాసేనలు ప్రత్యక్షంగా తలపడకుండా వెనుకంజవేస్తూ నెపోలియన్ సేనలను మరింతగా రష్యా భూభాగంలోకి చొచ్చుకొని వచ్చేటట్లు చేశాయి. రష్యా సేనలు పోతూపోతూ పురోగమిస్తున్న ఫ్రెంచి సేనలకు త్రాగడానికి, నీరుగాని, తినడానికి ఆహారపదార్థాలు గాని లేకుండా చేశారు. శత్రుమార్గంలో ఉన్న ప్రదేశాలను నిర్మానుష్యం చేశారు. ఇటువంటి క్లిష్టపరిస్థితుల నెదుర్కొంటూ సెప్టెంబరు 7 నాటికి నెపోలియన్ మాస్కో నగరంలో ప్రవేశించాడు. అప్పటికే మాస్కో పౌరులు వేరేచోటికి తరలిపోయారు. నెపోలియన్ సైన్యాలు వెనుతిరిగే నాటికి చలిగాలులు వారు వెన్నువిరిగేటట్లు చేశాయి. రష్యన్లు గెరిల్లా దాడులతో ఫ్రెంచి సైన్యాలను ముప్పతిప్పలు పెట్టారు. 6 లక్షల సైన్యంతో రష్యాపై దండెత్తితే 20వేల మంది ప్రాణాలతో మిగిలారు. నెపోలియన్ రష్యా నుండి వెనక్కు మరలడం చరిత్రలో అత్యంత దుర్భర పరిస్థితిగా కూస్ పండితుడు వ్యాఖ్యానించాడు.

### 3.6.7 విమోచనా యుద్ధం (1813) :

రష్యాలో ఫ్రెంచి సైన్యానికి జరిగిన నష్టాన్ని అవకాశంగా తీసుకొని ప్రష్యా, ఆస్ట్రియాలు నెపోలియన్ పాలన నుండి విముక్తి చెందాలనే కాంక్షతో అతనిపై యుద్ధం ప్రకటించాయి. అందువల్లనే దీనిని విమోచనా యుద్ధం అంటారు. కాని నెపోలియన్ తన సైన్యాలను నడిపించి, ప్రష్యా, ఆస్ట్రియా సైన్యాలను లుట్జను, బాట్జను, డ్రెస్‌డెన్‌ల దగ్గర జరిగిన యుద్ధాలలో ఓడించాడు. బ్రిటన్, రష్యా, ఆస్ట్రియా, ప్రష్యాలు తిరిగి నాల్గవ సంకీర్ణ కూటమిగా ఏర్పడి ఫ్రాన్స్ పై యుద్ధం ప్రకటించాయి. సంకీర్ణకూటమి తన సేనలను లీప్‌జిగ్ దగ్గర మోహరించి పోరాడి నెపోలియన్‌ను ఓడించగలిగాయి. ఈ యుద్ధాన్నే "సంయుక్త రాజ్యాల యుద్ధం" (Battle of Nations) అని కూడా అంటారు. ఈ యుద్ధంలో ఫ్రాన్స్ తీవ్రంగా నష్టపోయింది. ఇందులో 40,000 మంది ఫ్రెంచి సైనికులు మరణించారు, 30,000 మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. పరిస్థితులు అదుపు తప్పినట్లు గ్రహించిన నెపోలియన్ తన సేనలను ఫ్రాన్స్ వైపు మళ్ళించాడు.

ఫ్రాన్స్ చేరిన తర్వాత కూడా నెపోలియన్ తన యుద్ధ ప్రయత్నాలను విరమించుకోలేదు. నాలుగో సంకీర్ణకూటమి తిరిగి నెపోలియన్‌పై యుద్ధం ప్రకటించాయి. 1814 మార్చి నాటికి పారిస్ శత్రుసైన్యాల వశమైంది. ఏప్రిల్‌లో రాజ్య పరిత్యాగం చేసి ఎల్బా ద్వీపానికి ప్రవాస జీవితం గడపడానికి వెళ్ళాడు. మిత్రకూటమి అతనిపై గల గౌరవంతో ఆ ద్వీపానికి అతడు చక్రవర్తి అని ప్రకటించారు.

బూర్బన్ రాజవంశానికి మళ్లీ అధికారం వచ్చింది. మిత్రకూటమి 18వ లూయీని ఫ్రెంచి సింహాసనంపై కూర్చోపెట్టారు. 10 నెలలు ఎల్బాలో గడిపిన నెపోలియన్ 1815 ఫిబ్రవరిలో తప్పించుకొని మళ్లీ ఫ్రాన్స్ చేరుకున్నాడు. నెపోలియన్ తిరిగి వచ్చాడన్న వార్త విన్నంతనే లూయీ పలాయనం చిత్తగించాడు. నెపోలియన్ సింహాసన మెక్కి వంద రోజులు పాలించాడు. ప్రజలు అన్ని విధాల అతనికి సహకరించారు.

నెపోలియన్ రాకతో ఆందోళన చెందిన మిత్రరాజ్యాలు తమ మధ్య ఉన్న విభేదాలను తాత్కాలికంగా విస్మరించి నెపోలియన్‌పై యుద్ధం ప్రకటించాయి. నెపోలియన్ ప్రజలతో సైన్యాన్ని సమకూర్చుకొని తలపడ్డాడు. మిత్రకూటమి సేనలు బ్రిటీష్ జనరల్ డ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్ నాయకత్వంలో నెపోలియన్ సైన్యాలను, 1815 జూన్ 18న వాటర్లూ వద్ద ఓడించాయి. గత్యంతరంలేక జులై 15న లొంగిపోయాడు. మిత్రరాజ్యాలు అతణ్ణి సెయింట్ హెలినా ద్వీపానికి ఖైదీగా పంపారు. అక్కడ ప్రవాసశిక్ష అనుభవిస్తూ 1821 మే 5, అంటే 5 1/2 సంవత్సరాలు గడిపి, మరణించాడు. అంతటితో అతని సామ్రాజ్యం కుప్పకూలిపోయింది.

చివరి రోజులలో నెపోలియన్ యుద్ధాలు మానవజాతి సమస్యలను పరిష్కరించవని అంగీకరించాడు. ఈ జగత్తులో ఆయుధశక్తి, ఆత్మశక్తి అనే రెండే రెండు శక్తులున్నాయి. దీర్ఘకాలికంగా చూసినప్పుడు ఆయుధశక్తి ఎప్పుడు ఆత్మశక్తి చేతిలో ఓడిపోతూనే ఉంటుంది" అంటాడు. నెపోలియన్ 1769లో జన్మించాడు. సరిగ్గా వంద సంవత్సరాల తర్వాత 1869లో భారతదేశంలో జన్మించిన గాంధీమహాత్ముడు ఈ ఆత్మశక్తికి ఒక ఉద్యమరూపమిచ్చాడు.

## 3.7 నెపోలియన్ పతనానికి గల కారణాలు :

1807 నాటికి ఇంగ్లండ్ మినహా ఐరోపాఖండం యావత్తు తన గుప్పిట్లో బిగించి, ఐరోపా రాజ్యాలన్నింటిని శాసించిన మహాయోధుడు నెపోలియన్ త్వరితగతిన పతనానికి కారణాలు అనేకం ఉన్నాయి. ఉవ్వెత్తున ఎగసి ఉస్సురని కూలిన కెరటం నెపోలియన్. అతని పతనానికి కారణం అతని మాటల్లోనే చెప్పాలంటే "నా పతనానికి మరెవ్వరినీ నిందించాల్సిన పనిలేదు. నేనే దానికి పూర్తి బాధ్యుణ్ణి. నేనే నాకు బద్ధశత్రువుని, నా పతనానికి నేనే కారణభూతుణ్ణి".

### 3.7.1 నెపోలియన్ చెడు స్వభావం :

హద్దులు మీరిన అధికార వాంఛ, మితిమీరిన ఆత్మవిశ్వాసం, అహంకారం, మొండితనం, కపట దౌత్యం, నిరంకుశత్వం, ప్రతివాణ్ణి అనుమానించడం మొదలైనవి నెపోలియన్ స్వాభావిక లక్షణాలు. సమర్థులైన కొందరిని అనుమానించి వారిని పదవుల నుంచి తొలగించాడు. ఫలితంగా సమర్థులైన వారి సేవలను కోల్పోవడమే గాకుండా, వారు శత్రు శిబిరంలో చేరి ఇతనికి ద్రోహం తలపెట్టసాగారు. ఉదాహరణకు - నెపోలియన్ సన్నిహితుడైన టెలిరాండ్ ఆస్ట్రియా మంత్రి మెటర్నిక్‌తో చేతులు కలిపాడు. కొందరు విశ్వాసపాత్రులైన మార్షల్‌లు కూడా నెపోలియన్‌కు ఎదురు తిరిగారు. చివరకు తన సోదరులు కూడా తనకు సమయానికి ఉపయోగపడకుండా పోయారు. ఇతరుల అభిప్రాయాలను అతడు ఎన్నడూ మన్నించలేదు. లోపభూయిష్టమైన అతని పథకాలు, తప్పుడు అంచనాలు అతని పతనానికి దారితీశాయి. ఎవరి సలహాలనూ లెక్కపెట్టకుండా మానవాతీతునిలాగ వ్యవహరించాడు. తన వంశపాలనను సుస్థిరం చేసుకోవాలనే తాపత్రయం, తన సామ్రాజ్యాన్ని సుదూరతీరాలకు విస్తరింపజేయాలనే దురాశతో వినాశనాన్ని కొని తెచ్చుకున్నాడు. తాను విధి నిర్ణయానుసారం మహత్తర కర్తవ్య నిర్వహణ కోసం జన్మించిన వ్యక్తినని ప్రకటించుకున్నాడు. "నాకు ఫ్రాన్స్ అవసరం కంటే, ఫ్రాన్స్‌కి నా అవసరం ఎక్కువ" అని ఉద్ఘాటించి దేశ శ్రేయస్సును, ప్రజాసంక్షేమాన్ని విస్మరించాడు. దీనితో అతని పతనం ఆరంభమైంది. తర్వాత అతని జీవితం విషాదాంతంగానే ముగిసింది.

### 3.7.2 సామ్రాజ్య వ్యవస్థలోని లోపాలు :

నెపోలియన్ నిర్మించిన సామ్రాజ్యం ఒకే వ్యక్తి (నెపోలియన్) శక్తిసామర్థ్యాలపై ఆధారపడింది. కాని ఎంతటి సమర్థుడైనప్పటికీ ఒకే వ్యక్తి మహాసామ్రాజ్య భారం వహించడం కష్టం. వయస్సు పైబడుతున్న కొద్దీ నెపోలియన్ శక్తి సామర్థ్యాలు సన్నగిల్లి యుద్ధ నిర్వహణలో, పరిపాలనలో పటుత్వం తగ్గింది.

విశాలమైన సామ్రాజ్యం కావడం, దీనికితోడు రకరకాల జాతులు, సంస్కృతులు ఫ్రాన్స్ దేశపు జీవన వాహినిలో కలవడంతో, వారిని సమన్వయపరచడంలో నెపోలియన్‌కు సమస్యలు అధికమై చివరకు పతనం తప్పలేదు.

నెపోలియన్ తాను జయించిన రాజ్యాలలోని వారిని నిర్బంధంగా సైన్యంలో చేర్చుకున్నాడు. ఆ విధంగా అతని సైన్యంలో భిన్నదేశాలకు చెందిన పెక్కు జాతులవారు ఉండడంతో వారిలో ఐకమత్యం, పరస్పరం సహకారం కొరవపడి కలహాలకు దిగేవారు. ఇలాటి సైన్యం చక్రవర్తికి ఏ మేరకు విజయం సాధించి పెడతారనేది అనుమానమే. కనుకనే నెపోలియన్ వాటర్లూ యుద్ధంలో పరాజయం పొందాడు.

### 3.7.3 భూఖండ విధానం :

ముఖ్యంగా తాను (నెపోలియన్) సృష్టించుకున్న భూఖండ విధానం లేక ఆర్థిక దిగ్బంధమే తనకు ముప్పు తెచ్చిపెట్టింది. దుకాణదారుల దేశమైన (Nation of Shop keepers) ఇంగ్లండ్‌ను దెబ్బతీయాలంటే వారి వ్యాపారాన్ని దెబ్బతీస్తే సరిపోతుందని భావించిన నెపోలియన్ బెర్లిన్ శాసనాలను జారీచేశాడు. ఈ శాసనాల ప్రకారం ఐరోపా రాజ్యాలన్నీ (ఫ్రాన్స్‌తో సహా) ఇంగ్లండ్‌తో ఎటువంటి వ్యాపార సంబంధాలు పెట్టుకోకూడదు. కాని నిత్యావసర సరుకుల కోసం ఇంగ్లండ్‌పై ఆధారపడిన ఐరోపా రాజ్యాలకు ఈ నిబంధనలు పాటించడం కష్టసాధ్యమైంది. పైగా ఈ ఆర్థిక దిగ్బంధాన్ని అమలుపరచడానికి తగినంత నౌకాదళం ఫ్రాన్స్‌కు లేదు. అందుచేత అది ఐరోపా రాజ్యాలకు కావలసిన నిత్యావసరాలను సరఫరా చేయలేకపోయింది. ఫలితంగా దొంగ వ్యాపారం ప్రబలి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సామాన్య ప్రజలు అనేక ఇక్కట్లకు గురయ్యారు. చివరకు నెపోలియన్ తన నిబంధనలను ఉల్లంఘించినప్పటికీ, ఇతర దేశాలను మాత్రం ఈ పద్ధతిని కొనసాగించమని మొండిగా వ్యవహరించాడు. అందుకోసం అతడు స్పెయిన్, పోర్చుగల్‌లతో యుద్ధం చేయవలసి వచ్చింది. ఈ యుద్ధమే అతని పతనానికి ముఖ్యకారణమైంది.

### 3.7.4 స్పానిష్ వ్రణం :

స్పెయిన్, పోర్చుగల్ వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం నెపోలియన్ చేసిన పెద్ద తప్పు. నెపోలియన్ తన సోదరుడైన జోసెఫ్‌ను స్పెయిన్ సింహాసనంపై కూర్చోపెట్టగా స్పెయిన్ ప్రజలు జాతీయభావ ప్రేరితులై తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటును అణచడానికి నెపోలియన్‌కు సాధ్యం కాలేదు. పైగా స్పెయిన్‌కు ఇంగ్లండ్ సహాయపడింది. అందువల్ల నెపోలియన్ చెప్పినట్లు స్పానిష్ వ్రణం అతణ్ణి నిలువునా కుంగదీసింది.

### 3.7.5 రష్యాపై దండయాత్ర :

రష్యాపై జరిపిన దండయాత్ర కూడా నెపోలియన్ పతనానికి ముఖ్య హేతువయింది. ఈ దండయాత్ర వల్ల ఐదు లక్షలకు పైగా ఫ్రెంచి సైనికులు రష్యాలో మంచుబండల మధ్య చిక్కుకొని మరణించారు. వీరిలో చాలా మంది యువకులున్నారు. మళ్లీ అలాంటి సైన్యాన్ని సమకూర్చుకోవడానికి అతనికి సాధ్యపడలేదు.

### 3.7.6 విమోచనా యుద్ధం :

రష్యాలో నెపోలియన్ పరాజయం పొందడం అవకాశంగా తీసుకొన్న అతని శత్రువులు రష్యా, ఆస్ట్రియా, స్వీడన్‌లు అతని పాలన నుంచి విముక్తి పొందడానికి బ్రిటన్ ఏర్పరచిన రాజ్యకూటమిలో చేరి నెపోలియన్‌పై విమోచనాయుద్ధం ప్రకటించారు. లీప్‌జిగ్ వద్ద జరిగిన యుద్ధంలో వీరు నెపోలియన్‌ను ఓడించారు. ఇంతటితో మధ్య ఐరోపాలో నెపోలియన్ ప్రాబల్యం అంతరించింది.

### 3.7.7 పటిష్ఠమైన నౌకాదళం లేకపోవడం :

నెపోలియన్‌కు సరియైన నౌకాదళం లేకపోవడం వల్లనే నైల్, ట్రఫాల్గర్ యుద్ధాలలో బ్రిటన్ నెపోలియన్‌ను ఓడించగల్గింది. నెపోలియన్ అన్నట్లు "సరియైన నౌకాదళం ఉంటే బ్రిటన్‌ను నామరూపాలు లేకుండా చేసేవాడిని".

### 3.8 ముగింపు :

1815లో వాటర్లూ యుద్ధంలో నెపోలియన్ పూర్తిగా ఓడిపోయి, సెయింట్ హెలీనాలో ప్రవాస శిక్ష అనుభవిస్తూ, జీవచ్ఛవం వలె శేష జీవితం గడిపి 1821 లో మరణించాడు. నెపోలియన్ మరణంతో ఒక యుగం ముగిసింది. తమను ఎదిరించగల మహానాయకుడు గతించిన తర్వాత ఐరోపాలో పాలకులు మరల నియంతృత్వానికి తెరలేపడానికి ప్రయత్నించారు. అటువంటి వారిలో ఆస్ట్రియా చాన్సలర్ మెటర్నిక్ ప్రసిద్ధికెక్కాడు.

### 3.9 నమూనా ప్రశ్నలు :

1. ఫ్రెంచి విప్లవంలో నెపోలియన్ వహించిన పాత్ర ఎటువంటిది ?
2. నెపోలియన్ ఫ్రాన్స్ చక్రవర్తిగా ప్రకటించుకునే వరకు అతని జీవితాన్ని, అతడు సాధించిన విజయాలను వర్ణించండి ?
3. "నెపోలియన్ దిగ్విజయాలు అశాశ్వతమైనవి, అతని పాలనా సంస్కరణలు శాశ్వతమైనవి" అనడం ఎంతవరకు సమంజసం?
4. "నేనే విప్లవం" అన్న నెపోలియన్ మాటలు ఎంతవరకు సత్యం ?
5. నెపోలియన్ చక్రవర్తిగా సాగించిన దండయాత్రలు వివరించండి ?
6. నెపోలియన్ బోనపార్టీ విదేశాంగ విధానాన్ని వర్ణించండి ?
7. నెపోలియన్ బోన పార్టీ పతనానికి కారణాలను విశ్లేషించండి ?
8. చర్చితో ఒప్పందం (కం కార్డట్) - 1802
9. భూఖండ విధానము
10. వాటర్లూ యుద్ధం

### 3.10 చదువదగిన గ్రంథాలు :


1. Hayes, G.J.H. : Contemporary Europe Since 1870
2. Lipson, E : Europe in the Nineteenth and Twentieth Centuries
3. ఆధునిక ఐరోపా చరిత్ర : తెలుగు అకాడమి, హైదరాబాదు


**- డా॥ వి.వి. సుబ్బారెడ్డి**

పాఠం - 4

# వియన్నా కాంగ్రెస్ - 1815, ఐరోపా రాజ్యబద్ధ కూటమి, పవిత్ర మైత్రి, మెటర్నిక్

## 4.0 లక్ష్యం :

1815లో జరిగిన వియన్నా కాంగ్రెస్, ఐరోపా రాజ్యబద్ధ కూటమి, పవిత్ర మైత్రి, మెటర్నిక్ విధానము గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశములు :**

**4.1** వియన్నా సమావేశము - 1815

- **4.1.1** పరిచయం
- **4.1.2** వియన్నా సమావేశము
- **4.1.3** సమావేశం ముందున్న ముఖ్య సమస్యలు
- **4.1.4** ఆశయాలు
  - **4.1.4.1** ఐరోపా పట పునః నిర్మాణము
  - **4.1.4.2** ఫ్రాన్స్ సరిహద్దులు నిర్ణయించుట
  - **4.1.4.3** రాజ్యాల పునః నిర్మాణము
- **4.1.5** నాలుగు సూత్రాలు
  - **4.1.5.1** యథాస్థితి
  - **4.1.5.2** న్యాయత్వము
  - **4.1.5.3** పరిహారము
  - **4.1.5.4** ప్రాబల్య తుల్యత
- **4.1.6** పరిష్కార మందలి అంశాలు
  - **4.1.6.1** యథాస్థితి
  - **4.1.6.2** న్యాయత్వము
  - **4.1.6.3** పరిహారము
  - **4.1.6.4** ప్రాబల్య తుల్యత
- **4.1.7** విమర్శ
- **4.1.8** ప్రాముఖ్యత

**4.2** ఐరోపా రాజ్యబద్ధ కూటమి - 1815

- **4.2.1** పరిచయం
- **4.2.2** ఆశయాలు

**4.2.3** సమావేశాలు

**4.2.3.1** ఆక్స్‌లా చాపెల్ సమావేశము **- 1818**

**4.2.3.2** ట్రపాప్ సమావేశము **- 1820**

**4.2.3.3** లైబాక్ సమావేశము **- 1821**

**4.2.3.4** వెరోనా సమావేశము **- 1822**

**4.2.4** ఐరోపా రాజ్యబద్ధ కూటమి విచ్ఛిన్నతకు కారణాలు

**4.2.5** ప్రాముఖ్యత

**4.3** పవిత్రమైత్రి **- 1815**

**4.3.1** పరిచయం

**4.3.2** పవిత్రమైత్రి ఆశయాలు

**4.3.3** పవిత్రమైత్రి విఫలమగుటకు కారణాలు

**4.3.4** విమర్శ

**4.3.5** ప్రాముఖ్యత

**4.4** మెటర్నిక్

**4.4.1** పరిచయం

**4.4.2** మెటర్నిక్ జీవితం

**4.4.3** మెటర్నిక్ వివాహము - ప్రధాని అగుట

**4.4.4** మెటర్నిక్ విధానము - ఆశయము

**4.4.5** మెటర్నిక్ చతుర్ధ రాజ్యకూటమి - ఐరోపారాజ్యబద్ధ కూటమి

**4.4.6** ఐరోపాలో మెటర్నిక్ విధానము అమలుపరుచుట.

**4.4.6.1** ఆస్ట్రియా

**4.4.6.2** జర్మని

**4.4.6.3** ఇటలీ

**4.4.6.4** స్పెయిన్

**4.4.6.5** రష్యా

**4.4.6.6** ఫ్రాన్స్

**4.4.6.7** ఇంగ్లాండ్

**4.4.7** మెటర్నిక్ పతనమునకు కారణాలు

**4.4.8** మెటర్నిక్ విశిష్టత

**4.5** నమూనా ప్రశ్నలు

**4.6** చదువదగిన గ్రంథాలు

## 4.1 వియన్నా సమావేశము - 1815 :

### 4.1.1 పరిచయం :

ఐరోపా చరిత్రలో నెపోలియన్ విజృంభణ, అతని దండయాత్రలవలె అతని పతనము కూడా అంత ప్రాముఖ్యతను పొందినది. అతని దండయాత్రలు ఐరోపాలో భయోత్పాతము సృష్టించినది. తన ప్రజ్ఞాపాటవములతో విప్లవ భావములను జోడించి ఇంగ్లండ్ మినహా ఐరోపా ఖండమంతటిని తన ఆధిపత్యములోనికి తెచ్చి ఐరోపా పటమును మార్చివేసెను. నెపోలియన్ యుద్ధాల వలన, ఆక్రమణలవలన ఐరోపా రాజ్యాల సరిహద్దులు తారుమారై నూతన రాజ్యములు ఏర్పడెను. నెపోలియన్ పతనానంతరము చిన్నాభిన్నమైన ఐరోపా రాజ్యవ్యవస్థను పునః నిర్మించు ఆవశ్యకత ఏర్పడినది. అందుకుగాను ఐరోపా రాజ్యాల రాజ్యాధినేతలు, యువరాజులు, రాయబారులు, ప్రతినిధులు, ఆస్ట్రియా రాజధానియైన వియన్నా నగరములో 1815లో సమావేశమైనారు. ఈ మహా గొప్ప సమావేశము ఏర్పాటు చేయుటలో ప్రముఖపాత్ర పోషించి, అధ్యక్షత వహించినవాడు ఆస్ట్రియా ప్రధాని అయిన మెటర్నిక్ ఈ సమావేశమునకు ఆతిథ్యమిచ్చినవాడు ఆస్ట్రియా రాజైన మొదటి ఫ్రాన్సిస్.

### 4.1.2 వియన్నా సమావేశము :

నెపోలియన్, 1815 వాటర్లూ యుద్ధంలో పూర్తిగా ఓడింపబడుటతో, యావత్ ప్రపంచాన్ని జయించాలనే అతని ఆశ అడియాశ అయినది. ఓటమి అనంతరం నెపోలియన్ బందీగావింపబడి, అట్లాంటిక్ సముద్రములోని సెయింట్ హెలీనాదీవికి ఖైదీగా పంపబడెను. ఇతని యుద్ధాల వలన ఐరోపాలో ఏర్పడిన పరిస్థితులు అనేక చిక్కు సమస్యలకు కారణమయ్యెను. ఈ సమస్యల పరిష్కారమునకు, ఐరోపా పట పునః నిర్మాణమునకు మరియు విప్లవ భావాలను అణిచివేయుటకుగాను 1815లో వియన్నా నగరంలో మెటర్నిక్ అధ్యక్షతన సమావేశము ఏర్పాటు చేయబడినది. ఈ సమావేశమునకు హాజరయిన ప్రముఖులు ఎవరనగా ఇంగ్లండ్ నుండి ఆర్థర్ వెల్లస్లీ మరియు కాసల్రీ ప్రభువు, రష్యా రాజైన జార్ అలెగ్జాండర్, ప్రష్యా రాజైన మూడవ ఫ్రెడరిక్ విలియం, రోమ్ నుండి పోప్ ప్రతినిధిగా కార్డినల్ సెల్వి ఫ్రెంచి విదేశాంగ మంత్రి టాలిరాండ్, వాటర్లూ యుద్ధ విజేత వెల్లింగ్టన్ ప్రభువు మరియు ఆస్ట్రియా ప్రతినిధిగా ఆస్ట్రియా విదేశాంగ మంత్రి పాల్గొనెను. ఇంత పెద్ద దౌత్య సమావేశమునకు ఆస్ట్రియా చక్రవర్తియగు మొదటి ఫ్రాన్సిస్ వీరికి ఆతిథ్యమిచ్చెను. ఈ సమావేశంలో అగ్రరాజ్యాలైన ఇంగ్లండ్, రష్యా, ప్రష్యా, ఆస్ట్రియాలు ప్రముఖపాత్ర వహించెను. ఇది నెపోలియన్ పతనమునకు విజయోత్సవముగా అత్యంత వైభవముగాను, ఆడంబరముగాను జరిగెను.

### 4.1.3 సమావేశం ముందున్న ముఖ్య సమస్యలు :

ఐరోపాలో శాంతియుత వాతావరణం, వియన్నా సమావేశ సమస్యల పరిష్కారముపై ఆధారపడియుంటుంది.

1. నెపోలియన్ దరిదాపుగా 25 సంవత్సరముల పాటు యుద్ధాలు చేసి అనేకమైన రాజ్యాలను ఆక్రమించుకొనినాడు. అందువలన ఐరోపా రాజకీయ పటము పూర్తిగా మార్చిపోయినది. కాబట్టి ఈ సమావేశము ముందున్న సమస్య ఏమనగా - ఐరోపా పట పునఃనిర్మాణము మరియు కోల్పోయిన రాజ్యాలను తిరిగి వారికి అప్పగించటమా ? అనునది లేక తగిన పరిష్కారము కనుగొనుట.
2. రెండవ ముఖ్య సమస్య ఏమనగా విప్లవములను విచ్ఛిన్నం చేయుట, విప్లవ స్ఫూర్తిని, విప్లవ భావాలను నాశనం చేసి, జాతీయ వాదము, ప్రజాస్వామ్యము రాజ్యాంగ విధానాలకు ప్రోత్సాహం లేకుండా చేయుట.

3. మరియొక సమస్య ఏమనగా, విప్లవకాలంలోను, విప్లవం తరువాత నెపోలియన్ కాలంలోను పోప్ ఆధిపత్యం అణిచివేయబడినది. మత సంస్థలు, ఆస్తుల పాలన ప్రభుత్వ ఆధీనంలోకి తేబడినవి. తిరిగి మతం - పోప్ - చర్చి ఆధిపత్యాలను పునరుద్ధరించాలి.

### 4.1.4 ఆశయాలు :

క్రింద పొందుపరచబడినవి ఈ సమావేశము యొక్క ముఖ్యమైన ఆశయములు.

#### 4.1.4.1 ఐరోపా పట పునః నిర్మాణము :

నెపోలియన్ ఎడతెరిపి లేకుండా 25 సంవత్సరముల పాటు యుద్ధాలు చేసి అనేక రాజ్యాలు, ప్రాంతాలు ఆక్రమించుట వలన ఐరోపా రాజకీయ పటము మార్చివేయబడినది. ఐరోపాలో శాంతి ధ్వంసం గావించబడినది. కాబట్టి ఈ సమావేశము యొక్క మొదటి ఆశయము ఐరోపా పట పునః నిర్మాణము మరియు శాంతిని నెలకొల్పుట.

#### 4.1.4.2 ఫ్రాన్సు సరిహద్దులు నిర్ణయించుట :

ఫ్రెంచి విప్లవానికి పూర్వం ఫ్రాన్సు సరిహద్దులను ప్రాతిపదికగా చేసుకొని, ఇపుడు ఆ హద్దులను నిర్ణయించుట.

#### 4.1.4.3 రాజ్యాల పునః నిర్మాణము :

నెపోలియన్ అనేక రాజ్యాలను ధ్వంసం చేసి నూతన రాజ్యాలను సృష్టించి, ఆ సింహాసనాలపై తన బంధువులను నియమించినాడు. అలా సృష్టించబడిన రాజ్యాలను తిరిగి పునః నిర్మించుట.

4. నెపోలియన్ ఆక్రమణకు పూర్వమున్న ఆయాదేశపు రాజులను తిరిగి ఆయా రాజ్యసింహాసనంపై వారిని పునః ప్రతిష్టించటానికి.
5. నెపోలియన్‌కు సహకరించిన ఐరోపా రాజులను శిక్షించుట కొరకు.
6. మతం - చర్చి - పోప్ అధికారాలను పునఃప్రతిష్టించటానికి.
7. భవిష్యత్‌లో ఐరోపాలో శాంతికి భంగం వాటిల్లకుండా ఉండే నిమిత్తము, ఫ్రాన్సు సైనికశక్తిని నిర్మూలించే నిమిత్తము.
8. నెపోలియన్ యుద్ధాల వలన ఐరోపారాజ్యాలు నష్టపోయినవి. అతని తప్పిదముల వలన రాజ్యాలు ఆర్థిక దుస్థితిని ఎదుర్కొన్నవి. అందువలన ఫ్రాన్సు పై అధిక మొత్తంలో యుద్ధనష్టపరిహారం విధించుటకు.
9. అంతర్జాతీయ శాంతిని సాధించటానికి ప్రాబల్య తుల్యత పెంపొందించే మార్గాలు సూచించటానికి.

### 4.1.5 నాలుగు సూత్రాలు :

పైన పేర్కొన్న ఆశయాల సాధన కోసం, ఐరోపాలో రాజకీయ వ్యవస్థను పునఃనిర్మించుటకు ఈ సమావేశం నాలుగు సూత్రాలను రూపొందించినది. అవి ఏమనగా 1. యధాస్థితి 2. న్యాయత్వము 3. పరిహారము 4. ప్రాబల్యతుల్యత.

#### 4.1.5.1 యధాస్థితి :

ఫ్రెంచి విప్లవానికి పూర్వము ఐరోపా రాజ్యాలలో వున్న రాచరిక వ్యవస్థను, యధాతథముగా ఆ రాజ్యాలలో, అరాచక వ్యవస్థలను కొనసాగించుట యధాస్థితి లక్ష్యము.

### 4.1.5.2 న్యాయత్వము :

నెపోలియన్ పూర్వము ఐరోపా రాజ్యాలు ఎవరిచే పాలింపబడుచున్నవో, న్యాయ సమ్మతముగా వానిని తిరిగి ఆ రాజ్యవంశాలకు అప్పగించుటము ఈ న్యాయత్వ సూత్ర లక్ష్యము.

### 4.1.5.3 పరిహారము :

నెపోలియన్ పతనమునకు కృషిచేసిన రాజ్యాలు, ఆయా యుద్ధాలలో నష్టపోయినందున వారికి కొంత పరిహారమును చెల్లించుట మంచిదని సమావేశము భావించినది. ఈ సూత్రము వలన నెపోలియన్‌కు సహకరించిన రాజ్యాలు, నష్టపోయిన వారికి, విజేతలైన వారికి నష్టపరిహారము చెల్లించవలెను.

### 4.1.5.4 ప్రాబల్యతుల్యత :

ఐరోపా ఖండములో సుస్థిర శాంతి నెలకొనవలెనన్న, విప్లవ భావాలతో నిండియున్న ఫ్రాన్సు మరియొక సారి విజృంభించకుండా ఉండులాగున, ఫ్రాన్సు వలే మరే యితర రాజ్యము కూడా ఇటువంటి ప్రభావమునకు లోనుకాకుండునట్లు ఫ్రాన్సు చుట్టూ ఉన్న రాజ్యములను శక్తివంతులుగా చేసి, ఫ్రెంచి దురాక్రమణలు అరికట్టుటకు కొన్ని చర్యలు గైకొనుట.

### 4.1.6 పరిష్కారమందలి అంశాలు :

పైన ప్రతిపాదించిన సూత్రముల ఆధారముగా వియన్నా కాంగ్రెస్ జూన్ 9, 1815న సమస్యలకు పరిష్కారములు రూపొందించెను. ఈ పరిష్కారమందలి అంశములు ఏమనగా :

### 4.1.6.1 యధాస్థితి :

ఈ సూత్రముననుసరించి నెపోలియన్ ఆక్రమించిన దేశములన్నింటిని ఫ్రాన్సు నుండి వేరుచేయవలెను. 1791 నాటికి ఫ్రాన్సు సరిహద్దులు ఏవైతే ఉన్నవో ఆ సరిహద్దులనే నిర్ణయించవలెను.

### 4.1.6.2 న్యాయత్వము :

ఈ సూత్రము ద్వారా ఫ్రాన్సు, స్పెయిన్, సిసిలీలలో బూర్బన్ వంశీయులను నియమించెను. 16వ లూయీ సోదరుడైన 18వ లూయీని ఫ్రాన్సు దేశపు రాజుగా నియమించెను. స్పెయిన్ నందు ఏడవ ఫెర్డినాండ్‌ని రాజుగా నియమించెను. హాలెండ్ ఆరెండ్ వంశస్తులకు ఈయబడినది. పోప్ రాజ్యములు పోప్ ఏడవ పయస్‌కు ఇవ్వబడినవి. సార్డీనియా, పియడ్మాంట్‌లను సవాయ్ రాజవంశీయులకు, పార్మా, మొడినా, టస్కనీలు హాప్స్ బర్గ్ రాజవంశములకు ఇవ్వబడినవి.

### 4.1.6.3 పరిహారము :

ఈ సూత్రలను ఆధారముగా వియన్నా కాంగ్రెస్ ఐరోపా పునః నిర్మాణమునకు ఈ క్రింది నిర్ణయములు గైకొనెను. తత్ఫలితముగా ఐరోపా రాజకీయ పటములో పెక్కు మార్పులు చేయబడెను.

ఎ) యుద్ధ నష్ట పరిహారముగా ఫ్రాన్సుపై 70 కోట్లు, మిత్ర పక్షాలపై కొంత మొత్తం విధించెను. ప్రసిద్ధి గాంచిన రాజభవనాలను ఇంగ్లండ్ ఆధీనంలో అయిదు సంవత్సరములు ఉంచవలెను.

బి) ఇంగ్లండ్ తన వలస రాజ్యములను విస్తరించుకొనెను.

ఇంగ్లండ్‌కు యూరప్ నుండి మాల్టా, హెలిగోలాండ్, వెయోనియన్ దీవులు పొందెను. స్పెయిన్ నుండి ట్రినిడాడ్, ఫ్రాన్సు నుండి మారిషియస్, టొబాగో, హాలెండ్ నుండి గుడ్ హోప్ అగ్రము, సిలోన్‌లు పొందెను.

సి) రష్యా పోలెండ్‌లో అత్యధిక భాగము, టర్కి నుండి చెస్సరేబియా, స్వీడన్ నుండి ఫిన్‌లాండ్‌లు పొందెను.

డి) ప్రష్యా, స్వీడన్ నుండి పామరేనియాను పొందెను. దీనిని బట్టి బాల్టిక్ సముద్రంలో తన నౌకాబలాన్ని పెంపొందింప చేసుకొనుటకు అవకాశము ఏర్పడెను. వెస్ట్ ఫేలియా, సాక్జనీలో ఉత్తరభాగాన్ని, డాంజింగ్, థారోన్ మరియు పోసెన్‌లను పొందెను. వీటిని బట్టి ప్రష్యా, ఫ్రెంచి దాడులను తట్టుకోవటానికి ఐరోపాలో ఒక బలీయమైన శక్తిగా ఆవిర్భవించింది.

ఇ) ఆస్ట్రియా, ప్రాబల్యతుల్యత అనే సూత్రము ద్వారా బెల్జియంను వదులుకోవలసి వచ్చెను. అందుకు ప్రతిగా ఇటలీ నుండి వెనీషియా, లొంబార్డీలు ఇవ్వబడినవి. ఆస్ట్రియాకు టైరోన్, ఇర్లీరియన్ భూభాగాలు, దక్షిణ పోలండ్ లభించినాయి. ఈ విధముగా కోల్పోయిన ఔన్నత్యమును తిరిగి పెంపొందించుకోవటానికి అవకాశము ఏర్పడెను.

ఎఫ్) జర్మనీ పూర్తిగా పునర్వ్యవస్థీకరింపబడెను. నెపోలియన్ విజృంభణకు పూర్వం జర్మని 350 రాజ్యాలుగా వుంది. నెపోలియన్ ఆక్రమణ తరువాత, ఈ చిన్న రాజ్యాలు రైన్ సమాఖ్యగా ఏర్పడినది. నెపోలియన్ పతనానంతరం 350 చిన్న రాజ్యాలు 39 రాజ్యాలుగా కుదించబడినవి. ఈ సమాఖ్యకు పార్లమెంటును ఏర్పాటు చేసి, ఆస్ట్రియా పాలకుని అధ్యక్షునిగా చేసెను.

జి) ఇటాలియన్ రాజ్యాలు ఆస్ట్రియాతో పాటు, పోప్‌కు, బూర్బన్ వంశస్తులకు పంచబడెను. పిడ్మాంట్‌లో కొంతభాగము, సవాయ్, జినోవాలను సార్డీనియాకు ఇవ్వబడెను.

హెచ్) 1813 లిప్ జిగ్ యుద్ధంలో డెన్మార్క్, మిత్ర పక్షాలకు వ్యతిరేకముగా నెపోలియన్‌కు మద్దతుగా నిలిచినది. అందుకుగాను డెన్మార్క్ నుండి నార్వేను వేరుచేసి స్వీడన్‌కు కలిపిరి.

### 4.1.6.4 ప్రాబల్య తుల్యత :

భవిష్యత్‌లో ఫ్రెంచి దాడులను ఎదుర్కొనే నిమిత్తం ప్రష్యాను ఒక శక్తివంతమైన రాజ్యంగా రూపొందించుటకు తన నౌకాబలమును అభివృద్ధి చేసెను. ఫ్రాన్సు దక్షిణ భాగములో జినోవాను సార్డీనియాతో కలిపి పటిష్టపరచెను. స్విట్జర్‌లాండ్‌ను ఒక స్వతంత్ర్య రాజ్యంగా గుర్తించి బలపరచెను. బెల్జియంను హాలెండ్‌తో కలిపి ఫ్రాన్సుకు ఉత్తరాన సంయుక్త నెదర్‌లాండ్స్‌ని ఏర్పాటు చేసెను.

వియన్నా కాంగ్రెస్‌లో తీసుకున్న నిర్ణయాలు, చేసుకున్న రాజకీయ మార్పులు, అగ్రరాజ్యాల స్వార్ధపూరితములు, కృత్రిమములైనవి, స్వప్రయోజనాలు ఆశించి చేసినవి. చారిత్రక సాంప్రదాయములకు వ్యతిరేకమైన చర్యలు. అందువలన ఐరోపాలో సుస్థిర శాంతి నొసంగుటలో విఫలమైనది. దీనినిబట్టి ప్రముఖ చరిత్రకారుడైన హోస్ "వియన్నా కాంగ్రెస్ నిజమైన సమావేశము కానేకాదు" అని నుడివెను. కనుకనే ఆచార్య ఫిషర్ దీనిని 'అసందర్భపు ప్రేలాపన' అని తీవ్రముగా విమర్శించెను.

### 4.1.7 విమర్శ :

వియన్నా కాంగ్రెస్‌లో ఉన్న లోపాలను బట్టి ఇది తీవ్ర విమర్శకు లోనైనది. సమావేశము ప్రముఖముగా ప్రతీకార విధానమునకు లోనయినది. ఫ్రాన్స్ యొక్క దురాక్రమణ విధానాలను త్రుంచివేసి, భవిష్యత్‌లో ఐరోపాలో మరియొకసారి శాంతికి భంగము వాటిల్లకుండా ఉండేందుకు, న్యాయత్వము అనే సూత్రము ద్వారా, ఫ్రాన్సు చుట్టు బలీయమైన రాజ్యాలు రూపొందించుట ఆశయమైనది.

వియన్నా సమావేశమునకు హాజరయిన ప్రముఖులు, ప్రతినిధులు, రాజకీయవేత్తలు, దౌత్యవేత్తలు మొదలగువారు ఐరోపాలో సుస్థిర శాంతిని నెలకొల్పుటకు, ఫ్రాన్సు కాని మరే యితర దేశము కాని దురాక్రమణ విధానము కొనసాగించకూడదని, మంచి ఆశయాలు, సూత్రాలు ప్రతిపాదించినారు. కాని వాటిని ఆ నాలుగు అగ్రరాజ్యాలు - రష్యా, ప్రష్యా, ఆస్ట్రియా, ఇంగ్లండ్‌లు పేర్కొన్న ఆశయాలను, సూత్రాలను విస్మరించి స్వప్రయోజనాల కోసం, ఐరోపాలో తమ ప్రాబల్యత కోసం, విలువలను విస్మరించి, మిత్రపక్షాల విజయ సాధనకు కృషిచేసిన వారి ఆశయాలను వమ్ము చేసి బలహీన రాజ్యాలను, భూభాగాలను కబళించి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను హరించి, జాతీయ ప్రజాస్వామ్య సంస్థలను కూలద్రోసి ఐరోపాలో శాంతికి భంగము కలిగించెను.

విప్లవ భావాలను, జాతీయవాదము, ఉదారవాదములను పూర్తిగా విస్మరించి, పూర్తి సాంప్రదాయబద్ధంగా వ్యవహరించెను. నెపోలియన్ పతనానికి ప్రముఖ కారణం జాతీయ భావమని, నిరంకుశ విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తారని, నాయకులు గ్రహింపకుండుట శోచనీయము.

ఐరోపా రాజ్యాల పునః నిర్మాణమనునది శాశ్వత ప్రాతిపదికన జరగలేదు. న్యాయత్వం, ప్రాబల్య తుల్యత అను అంశాల ప్రాతిపదికన మార్పులు చేయునపుడు ప్రణాళికాబద్ధంగాను, భవిష్యత్‌ని దృష్టియందుంచుకొని, ప్రజలు జాతులు, మతాలు, ప్రాంతాలు, భాషలు, ప్రజల అభీష్టము అనే అంశాలను ప్రామాణికముగా రాజ్యాల పునః నిర్మాణము చేయవలెను. కాని వీటన్నిటికి వ్యతిరేకముగా జరిగినది. సామ్రాజ్యాల విస్తరణములో అగ్రరాజ్యాలను చిన్న రాజ్యాలను పావులుగా వాడుకొన్నాయి. బెల్జియంను హాలెండ్ విలీనము చేయగా, ఈ రెండు దేశాల మతాలు, భాష, సాంప్రదాయాలు విరుద్ధములు. అందువల్ల బెల్జియం స్వతంత్రత కోరినది. బెల్జియంలో తిరుగుబాట్లు జరిగినవి. నార్వే స్వీడన్‌తో కలుపబడినది. కాని వీరి మధ్య సౌభ్రాతృత్వం లేదు. పోలెండ్‌ని మూడు భాగాలు చేసినారు. కాని వీరి మధ్య సమైక్యత లేదు. ఒక ప్రముఖ భాగాన్ని రష్యాతో కలిపినారు. సమైక్య జర్మనీని ఆకాంక్షించు జర్మన్‌ల జాతీయ భావం అణిచి జర్మన్ సమాఖ్య నేర్పరుచుట. జాతీయ పిపాసులైన ఇటాలియన్‌ల స్వాతంత్ర్య మణిచి, నిర్లక్ష్యం చేసి ఇటలీని అయిదు భాగాలుగా విభజించుట జరిగినది.

ఈ విధముగా విప్లవ జనితములైన జాతీయ భావాలను, ఉదారవాదమును సమావేశము త్రోసిపుచ్చెను. తత్ఫలితముగా ఆయారాజ్యాలలో తిరుగుబాట్లు ప్రారంభమయ్యెను. అవియే విప్లవములుగా మారిపోయెను.

## 4.1.8 ప్రాముఖ్యత :

పైన వివరించినట్లుగా ఈ కాంగ్రెస్ నందు అనేకమైన లోపములున్నప్పటికి, కొన్ని రాజకీయ మార్పులు సత్ఫలితములనిచ్చినవి. అందువలన ఇది కొంత ప్రాముఖ్యతను సంతరించుకొన్నది.

1. నెపోలియన్ 25 సంవత్సరాల నిరంతర యుద్ధాల వలన ఐరోపా ప్రజలు భయభ్రాంతులయిరి. ఇపుడు వారికి కావలసింది శాంతి. వియన్నా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారముగా ఐరోపాలో 40 సంవత్సరములపాటు శాంతి కలిగినది. 1815 నుండి 1853 వరకు యుద్ధము జరుగలేదు.
2. జర్మన్ సమాఖ్యలో ప్రష్యా ఒక ప్రముఖ రాజ్యంగా ఆవిర్భవించినది. ప్రష్యా సంస్కృతి, నాగరికత మిగిలిన జర్మన్ రాజ్యాలకు ప్రాకినది. తత్ఫలితముగా ఆస్ట్రియా ఆధిపత్యము క్రమముగా తగ్గినది. తుదకు ప్రష్యాయే నాయకత్వము వహించి ఆస్ట్రియన్‌లను పారద్రోలి జర్మనీ ఏకీకరణను సాధించెను.
3. సార్డీనియాకు జినోవా, పియడ్మాంట్ , సవాయ్ లభించుట ద్వారా ఇటలీ నందు జాతీయ ఐక్యతా భావము ఏర్పడినది. తత్ఫలితముగా ఇటలీ ఏకీకరణోద్యమంలో సార్డీనియా ప్రముఖ పాత్ర వహించినది.

4. రష్యా టర్కీ నుండి బెస్సరేబియా, పోలెండ్ నుండి తూర్పు భాగమును పొందుట ద్వారా, టర్కీలో పాదము మోపగలిగినది. అందువలన రష్యా తూర్పు ప్రాంతాలలో తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోగలిగినది.
5. వియన్నా కాంగ్రెస్ వలన అంతర్జాతీయ న్యాయ సూత్రము అమలులోనికి వచ్చినది. రాజ్యాల మధ్య పరస్పర సహకారము, అవగాహన, వ్యాపార సంబంధాలు ఏర్పడినాయి.
6. ఐరోపా రాజ్యాలలో బానిసత్వమును నిర్మూలించుటకు వియన్నా కాంగ్రెస్ 'బానిసత్వ నిర్మూలన' ప్రకటన చేసినది.

ఈ విధముగా వియన్నా కాంగ్రెస్ ఐరోపా చరిత్రలో ఒక స్థానం సంపాదించుకొన్నది. భవిష్యత్‌లో ఐరోపా ఎదుర్కొనవలసిన సమస్యలన్నిటికి వియన్నా పరిష్కారమే మూలము.

## 4.2 ఐరోపా రాజ్య బద్ధ కూటమి - 1815 :

### 4.2.1 పరిచయం :

నెపోలియన్ దండయాత్రలతో ఐరోపాలో ప్రముఖ రాజ్యాలైన ప్రష్యా, రష్యా, ఆస్ట్రియా, ఇంగ్లండ్‌లు భీతిల్లి, దినదినాభివృద్ధి చెందుచున్న ఉదారవాద ప్రజాస్వామ్య భావాలనరికట్టుటకు, తమ రాచరిక వ్యవస్థలను పరిరక్షించుకొనుటకు ఈ మిత్రరాజ్యాలు ఒక కూటమిగా ఆవిర్భవించినవి. ఈ సంకీర్ణ కూటమి నెపోలియన్‌ను 1815లో పతనము గావించినది. నెపోలియన్ పతనానంతరము వియన్నా కాంగ్రెస్ నందు, ఐరోపాలో విప్లవమునకు పూర్వమున్న పరిస్థితులకు యత్నించెను. ఈ సమావేశంలో జాతీయ, ఉదారవాద, ప్రజాస్వామ్య విధానాలకు విలువనీయక ప్రజాభీష్టమును విస్మరించి స్వార్థప్రయోజనాలకోసం ఐరోపా రాజకీయ పటమును మార్చి వేసెను. అయినను వారిలో భయాందోళనలు తొలగిపోలేదు. ఐరోపా ఆర్థిక స్థితి పటిష్టముగా లేదు. శాంతి భద్రతలు కరువైనాయి. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో ఫ్రాన్సు నందు మరియొక విప్లవము అనివార్యమగునని భావించిరి. ఇట్టి పరిస్థితులలో ఈ సమస్యలనధిగమించటానికి, ఐరోపాలో యుద్ధములను యుద్ధవిధానాల్ని, విప్లవ భావాల్ని నివారించి శాంతి భద్రతలు కలుగచేయుటకు, పరస్పర సహకారంతో ఐరోపాకు సంరక్షకులుగా నుండుటకు 1815 నవంబరు 20న పారిస్ నందు సమావేశమై ఒక అంగీకారమునకు వచ్చి ఒక మైత్రి కూటమిగా ఏర్పడినాయి. దీనినే చతుర్ద రాజ్యకూటమి అందురు. ఈ కూటమినే మెటర్నిక్ 'ఐరోపా రాజ్యబద్ధ కూటమి' అని పిలిచినాడు. ఈ కూటమి ఏర్పాటు చేయుటలో మెటర్నిక్ ప్రముఖ పాత్ర పోషించెను. ఇతను సాంప్రదాయ విధానాలను, సనాతన రాచరిక వ్యవస్థను ప్రోత్సహించెను. ఇతను విప్లవమునకు, జాతీవవాదానికి, ప్రజాస్వామ్యానికి బద్ధవిరోధి.

### 4.2.2 ఆశయాలు :

ఐరోపా రాజ్య బద్ధ కూటమి క్రింది ఆశయాలను కలిగియున్నది.

1. వియన్నా కాంగ్రెస్ నందు తీసుకున్న నిర్ణయాలను, తీర్మానాలను అమలు జరుపుట
2. పారిస్ సంధినసురించి ఫ్రెంచి దురాక్రమణ విధానంను అరికట్టుట.
3. ఐరోపాలో శాంతి కలుగజేయుట, తరుచు తలెత్తు అంతర్జాతీయ సమస్యలను శాంతియుతముగా పరిష్కరించుట.
4. విప్లవ, జాతీయ భావములను అణుచుట.
5. నిరంకుశ రాజుల హక్కులు కాపాడుట.
6. చతుర్ద రాజ్యాలైన రష్యా, ప్రష్యా, ఆస్ట్రియా, ఇంగ్లండ్‌లు 20 సంవత్సరాలు మిత్రరాజ్యాలుగా మెలుగుట.

### 4.2.3 సమావేశాలు :

ఈ ఆశయాల సాధన కోసం, ఐరోపారాజ్య బద్ధ కూటమి తరుచుగా ఆయారాజ్యాలలో సమావేశమై, ఆయా సమస్యలను చర్చించుచుండెను. ఆ రకముగా ఈ కూటమి విచ్ఛిన్నమగు నాటికి (1825) నాలుగు మార్లు సమావేశమైనది.

### 4.2.3.1 ఆక్స్‌లా ఛాపెల్ సమావేశము (1818) :

ఐరోపారాజ్య బద్ధ కూటమి ప్రథమ సమావేశము పవిత్ర రోమన్ సామ్రాజ్య రాజధానియైన ఆక్స్‌లా ఛాపెల్ నందు 1818లో సమావేశమయ్యెను. ఈ సమావేశంలో ఐరోపారాజ్యాల స్థితిగతులు, పరస్పర సంబంధాలు న్యాయసూత్రాలు మతభావాల గురించి చర్చించిరి.

వియన్నా సమావేశ నిర్ణయాలను అమలుపరుచుటకు ఫ్రాన్సు అంగీకరించి, ఈ సమావేశంలో ఐరోపారాజ్యబద్ధకూటమి సభ్యురాలుగా చేరెను. తత్ఫలితముగా చతుర్ధ రాజ్యకూటమి పంచరాజ్య కూటమిగా మారెను.

ఈ సమావేశము నందు స్వీడన్, నార్వే, డెన్మార్క్‌లతో చేసుకున్న ఒడంబడికలను ఉల్లంఘించగా, కూటమి స్వీడన్ రాజును మందలించినది. అమెరికాలోని స్పెయిన్ వలసలలోని ఉదారవాదులు తిరుగుబాట్లు చేయగా, స్పెయిన్ రాజైన ఏడవ ఫెర్డినాండ్ ఐరోపారాజ్యబద్ధకూటమిని సహాయమర్ధించెను. అందుకు ఇంగ్లండ్ "ఇతరుల ఆంతరంగిక వ్యవహారములలో జోక్యము చేసుకోమని" తెలిపెను.

### 4.2.3.2 ట్రపాస్ సమావేశము (1820) :

ఈ కూటమి యొక్క రెండవ సమావేశము జర్మనీలోని ట్రపాస్ నగర మందు 1820లో జరిగెను. పోర్చుగల్, స్పెయిన్, నేపిల్స్, పిడ్మాంట్ మొదలగు ప్రాంతాలలో తమ పాలకులకు వ్యతిరేకముగా జాతీయభావంతో 1820 నాటికి విప్లవములు చెలరేగినవి. ప్రజలు రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వాలు, ఉదార సంస్కరణలు కావలయునని కోరిరి. కాని మెటర్నిక్, జాతీయ, ఉదారవాదంలకు బద్ధవిరోధి కాబట్టి, విప్లవమును అణిచివేయాలని కూటమిని కోరెను. రష్యా, ప్రష్యా సమర్థించగా, ఫ్రాన్సు, ఇంగ్లండులు వ్యతిరేకించెను. కూటమి మధ్య విభేదాలు పొడసూపినాయి. రష్యా, ప్రష్యా, ఆస్ట్రియాలు ఒక వర్గము కాగా, ఇంగ్లండ్, ఫ్రాన్సులు వ్యతిరేక వర్గమయినవి. బ్రిటిష్ ప్రధాని అయిన కాజలరి ప్రభువు "ఆ రాజ్యాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవటము ఆ రాజ్యాలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యము, జాతీయతను వ్యతిరేకించుట" అగునని వాదించెను.

### 4.2.3.3 లైబాక్ సమావేశము (1821) :

ఐరోపా రాజ్యబద్ధకూటమి యొక్క మూడవ సమావేశము 1821లో ఆస్ట్రియా - హంగేరిలలోని లైబాక్ నందు జరిగెను. ఈ సమావేశము నందు నేపిల్స్, పిడ్మాంట్‌లలో వచ్చిన తిరుగుబాట్లు గురించి చర్చించెను. ఆ తిరుగుబాట్లును అణిచివేయుటకు కూటమి ఆస్ట్రియాకు అధికారమిచ్చెను. అంతట మెటర్నిక్ జాతీయ, ఉదారవాద విప్లవములును అణిచివేసెను. సాంప్రదాయ ప్రభుత్వములను నెలకొల్పెను.

### 4.2.3.4 వెరోనా సమావేశము (1822) :

నాల్గవది, చివరిది అయిన సమావేశము 1822 లో ఇటలీలోని వెరోనాలో జరిగినది. స్పెయిన్ రాజు ఏడవ ఫెర్డినాండ్‌కి వ్యతిరేకముగా తిరుగునట్లు జరుగుచుండెను. అంతట ఫెర్డినాండ్ ఫ్రాన్సురాజు 18వ లూయీ సహాయమర్థించెను. ఈ సమస్యను

స్పెయిన్ కూటమి ముందుంచగా, కూటమి ఫ్రాన్సును స్పెయిన్‌లోని తిరుగుబాట్లను అణిచివేయవలసినదిగా తీర్మానించెను. స్పెయిన్‌లో ఫ్రాన్సు జోక్యమును ఇంగ్లండ్ వ్యతిరేకించెను. కాని ఫ్రాన్సు, స్పెయిన్‌లోని తిరుగుబాట్లను అణిచివేసి రాచరిక ప్రభుత్వమును నిలిపెను. అంతట ఇంగ్లండ్ కూటమి నుండి వైదొలగగా ఐరోపారాజ్యబద్ధ కూటమి విచ్ఛిన్నమయ్యెను.

### 4.2.4 ఐరోపా రాజ్యబద్ధకూటమి విచ్ఛిన్నతకు కారణములు :

ఐరోపా రాజ్యబద్ధకూటమి ఆశయ సాధనలో విఫలమగుటకు అనేక కారణములు గలవు.

ఐరోపా రాజ్యబద్ధకూటమి విఫలమగుటకు ప్రముఖ కారణము సభ్యుల మధ్య భేదాభిప్రాయము, అనైక్యత, స్వార్థము కూటమి ఏర్పడినప్పటి నుండి సభ్యులు స్వార్థ ప్రయోజనాలను దృష్టియందుంచుకొని ప్రజల అభీష్టమును విస్మరించెను. సమస్యలను పరిష్కరించే విషయంలో బేదాభిప్రాయములు కలిగి, అసూయ ద్వేషాలతో అనైక్యత కలిగి వర్గాలుగా చీలిపోయిరి.

మెటర్నిక్ కూటమిని ఐరోపాలో తన విధానమును కొనసాగించుటకు మాత్రమే వినియోగించుకొనెను. జాతీయ ఉదార, విప్లవ శక్తులను మాత్రమే అణుచుటకు ఒక సాధనముగా వినియోగించుకొనెను. ఇటువంటి పద్ధతులకు ఇంగ్లండ్ విముఖత తెల్పెను. పోర్చుగల్, స్పెయిన్, నేపిల్స్, పిడ్మాంట్‌లలో జాతీయవాద ఆందోళనలు చెలరేగగా ఆ ఆందోళనలు అణుచు విషయంలో బేధాభిప్రాయములు చెలరేగినవి. కాజలరీ మాటలలో చెప్పవలెనన్న 'కూటమి ఆశయాలు, శక్తికి, పరిమితికి మించినవి'. ఈ పరిస్థితులలో అగ్రరాజ్యమైన ఇంగ్లండ్ వెరోనా సమావేశంలో నిష్క్రమించినది.

ఇంగ్లండ్ మనో సిద్ధాంతమును అంగీకరించుట మరియొక కారణము. వియన్నా సమావేశ తీర్మాన ప్రకారముగా నెపోలియన్ ఆక్రమిత అమెరికాలోని స్పానిష్ పోర్చుగీస్ వలసలు స్వతంత్ర్యమయ్యెను. వాటిపై తిరిగి ఆధిపత్యమునకు స్పెయిన్ ప్రయత్నించెను. అందుకు ఇంగ్లండ్ వలసలు స్పెయిన్ ఆధిపత్యములోనికి వచ్చిన తాను క్రొత్తగా స్థాపించు వలసలకి వాణిజ్యము కుంటుపడునని భావించినది. అటువంటి పరిస్థితులలో అమెరికా అధ్యక్షుడయిన మన్రో తన ప్రఖ్యాత 'మన్రో సిద్ధాంతము'ను ప్రవేశపెట్టెను. దీని ప్రకారము

1. ఐరోపా వ్యవహారములలో అమెరికా జోక్యము చేసుకొనదు.
2. అటులనే ఐరోపా వారు, అమెరికా వ్యవహారములలో జోక్యము చేసుకొనరాదు. ఉత్తర అమెరికాలో వలసలు స్థాపించరాదు.
3. దీనికి భిన్నముగా ఐరోపా రాజ్యాలు వ్యవహరించిన అమెరికా ప్రతిఘటించును. లేదా బలప్రయోగము చేయును.

ఈ మన్రో సిద్ధాంతమును ఇంగ్లండ్ బలపరుచుటతో ఐరోపా రాజ్యబద్ధ కూటమికి దూరమయ్యెను.

బానిస వ్యాపారంలోను, వర్తక వ్యాపారములోను మధ్యధరా సముద్ర, తూర్పు రాజ్యాల సమస్యలపై విశ్వాసము, సహకారము సన్నగిల్లుట వలన కూటమి త్వరిగ గతిన విచ్ఛిన్నమయినది.

### 4.2.5 ప్రాముఖ్యత :

ఐరోపారాజ్యబద్ధకూటమి ఆశయసాధనలో విఫలమై త్వరితగతిని విచ్ఛిన్నమైనప్పటికిని, కూటమి చాలా ప్రాధాన్యతను సంతరించుకొన్నది. అంతర్జాతీయ సమస్యలు పరిష్కరించుటకు, ఐరోపా రాజకీయాలలో రాజ్యాల మధ్య పరస్పర అవగాహన, నమ్మకము, సుహృద్భావ భావములు పెంపొందించుటకు ప్రయత్నించినది. ఐరోపాలో యుద్ధాలను నివారించి శాంతిని నెలకొల్పుటకు జరిగిన మహోన్నత యత్నములలో ఐరోపారాజ్యబద్ధకూటమి మొదటిది. అంతర్జాతీయ భావము జనింపచేసినది. అందువలననే మొదటి ప్రపంచ యుద్ధానంతరం 1920లో నానా జాతి సమితి, 1945లో రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఐక్యరాజ్యసమితి ఏర్పాటుకు అవకాశం ఏర్పడినది. కనుకనే కొందరు చరిత్రకారులు 'ఐరోపారాజ్యబద్ధ కూటమి'ని "ఐక్యరాజ్య సమితి ప్రతిమ" అని శ్లాఘించిరి.

## 4.3 పవిత్రమైత్రి (1815) :

### 4.3.1 పరిచయం :

నెపోలియన్ పతనానంతరం ఐరోపాలో అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించుట కొరకు, శాంతి సుస్థిరతలు నెలకొల్పుటకు భవిష్యత్‌లో ఫ్రెంచి విప్లవములాంటి విప్లవములు సంభవించకుండా నివారించుటకు, రష్యా రాజైన మొదటి జార్ అలెగ్జాండర్ క్రైస్తవ మత సిద్ధాంతాల ప్రాతిపదికన ఒక ప్రణాళికను రూపొందించెను. ఆ ప్రణాళికను అమలు జరుపుటకు మిత్రరాజ్యాల సహకారముతో ఒక మైత్రి కూటమిని ఏర్పరచి, 1815 సెప్టెంబరు 26న ఒక ప్రకటన చేసెను. ఆ మైత్రి కూటమియే 'పవిత్రమైత్రి'.

పవిత్రమైత్రి అనునది రష్యా రాజైన జార్ అలెగ్జాండర్ మది నుంచి ఉద్భవించిన ఊహా జనితమైన సృష్టి. అతను తాత్వికుడు, ఆదర్శవాది, క్రైస్తవ మతాభిమాని, ఆలోచనాపరుడు, ఉదారవాది. నెపోలియన్ యుద్ధాలు, అతని పతనం, మరియు అపుడు ఐరోపాలో జరుగుచున్న అనేక అంశాలను దృష్టియందుంచుకొని, ఐరోపాలో సుస్థిర శాంతిని నెలకొల్పుటకు చతుర్ద రాజ్యకూటమి అనుసరించు బలప్రయోగమునకు క్రైస్తవ ఆధ్యాత్మిక చింతనను జోడించుటే అతని ధ్యేయము. క్రైస్తవ మతములో నున్నటువంటి లక్షణములైన దయ, జాలి, కరుణ, ప్రేమ, శాంతి, కృప, కనికరము, సౌభ్రాతృత్వము మొదలగు భావములు ప్రాతిపదికగా ఈ కూటమి పనిచేయవలెనని అతని ఆశయము. అందుకు ఆయన ఈ సిద్ధాంతములను ప్రచారము చేయసాగెను. జార్ చక్రవర్తి తాను దేవుని ప్రతినిధినని, ఐరోపా ఖండములోని సమస్యలను క్రైస్తవ సిద్ధాంతాల ద్వారా పరిష్కరించుటకొరకు, శాంతిని నెలకొల్పుటకు దేవుడు తనను దూతగా పంపెనని అతని విశ్వాసము. ఆ విధముగా ప్రచారము చేసుకొనెను. అందువలన ప్రజలు ఇతనిని 'తెల్లని దూత' అని, విమోచకుడు అని పిలిచిరి. నెపోలియన్ చేసిన తప్పిదముల వలన, అతనిని 'నల్లని దూత' గా అభివర్ణించినారు.

### 4.3.2 పవిత్రమైత్రి ఆశయాలు :

1. ప్రజలు పాలకుల మధ్య, రాజ్యాల మధ్య స్నేహము, సౌభ్రాతృత్వము పెంపొందింపచేసి, ఐరోపాలో శాంతిని నెలకొల్పుట.
2. మైత్రి నందు ప్రతి సభ్య రాజ్యము క్రైస్తవమత సూత్రాలైన ప్రేమ, దయ, కరుణ, క్షమ, శాంతి, కరుణ మొదలగు అంశాలు వారి ఆంతరంగిక, విదేశాంగ విధానము నందు కలిగి వుండవలెను.
3. సభ్య రాజ్యాధినేతలు, రాజులు సహోదరులుగా మసలవలెను. ఆ రాజ్యాలలోని ప్రజలను తమ బిడ్డలుగా భావించవలెను.

ఈ పవిత్ర ఆశయాలని ఐరోపాలోని రాజ్యాలు అనుసరించుట ద్వారా, రాజ్యాల మధ్య సుహృద్భావ వాతావరణం, శాంతిని నెలకొల్పవచ్చని భావించినాడు. అందుకుగాను ఐరోపాలోనున్న రాజులకు, రాజ్యాధినేతలకు (టర్కి సుల్తాన్‌కు తప్ప) క్రైస్తవ మత సిద్ధాంతాలతో కూడిన పవిత్రమైత్రిని ఆమోదించవలసిందిగా జార్ చక్రవర్తి ఆహ్వానము పంపినాడు. ఆ ఆహ్వానమునందుకొని ఆస్ట్రియా, ప్రష్యా ఇందుచేరినవి. ఇంగ్లండ్, పోప్ ఇందు చేరలేదు. కాని వాస్తవమునకు రష్యాకు తప్ప ఇందులో ఎవరికి ఆసక్తి లేదు. ఈ సూత్రములు ఆచరణ సాధ్యం కాదని, ఈ మైత్రి నిరుపయోగమని, కూటమిలోనున్న తమ మిత్రుని కోసం, సంతృప్తిపరుచుటకు ఆయన పైనున్న గౌరవం కొలది మిత్రరాజ్యాలు ఇందుచేరినవి. ఆస్ట్రియా రాజైన మొదటి ఫ్రాన్సిస్ సంతకమిడుతూ "ఇది ఏమిటో నాకు తెలియదు, రాజకీయ అంశమైన ఛాన్సలర్‌ను, మత సంబంధమైనదైతే మతగురువును సంప్రదింతును", అటులనే బ్రిటిష్ ప్రధాని అయిన కాజలరీ 'ఇది మహోన్నతమైన మతము, నిరర్ధ భాషణము' అని వక్కాణించెను.

### 4.3.3 పవిత్రమైత్రి విఫలమగుటకు కారణములు :

పవిత్రమైత్రి విఫలమగుటకు ప్రముఖ కారణములేవనగా :

1. పవిత్రమైత్రి ఐరోపాలో నెలకొని ఉన్న సాంఘిక రాజకీయ పరిస్థితులను మెరుగుపర్చుటలో విఫలమయ్యెను.
2. ఈ మైత్రి ప్రకటనలో సంతకమిడిన సభ్యదేశాలు, ఇది పనిచేయు విధానంలో శ్రద్ధ వహింపలేదు. వారి మధ్య సఖ్యత లేదు.
3. ఇందు పొందుపరచిన అంశాలు ఆచరణలో సాధ్యం కానివి.
4. ఇంగ్లండ్ ఈ కూటమిలో చేరలేదు. పోగా "అన్యదేశాల అంతరంగిక వ్యవహారములలో జోక్యము చేసుకొనుట ఇంగ్లండ్ ఇష్టపడదు" అని కాజలరీ చెప్పెను.
5. క్రైస్తవ మతాధిపతియైన పోప్ ఇందుచేరలేదు.
6. ఐరోపాలోని పెక్కు రాజ్యములు అందలి అంశాలను సరిగా అర్థము చేసుకొనక, ఇందు చిత్తశుద్ధిని శంకించి చేరలేదు. కొందరు అవగాహన లేక జాతీయ ఉదారవాదాలకు విరుద్ధమని భావించిరి.
7. 1825లో రష్యా రాజు జార్ అలెగ్జాండర్ మరణంతో, పవిత్రమైత్రి కూడా గతించెను.
8. ఆచార్య హెరెన్‌షా నుడివినట్లు "పవిత్రమైత్రికి, వాస్తవ రాజకీయాలకు ఎట్టి సంబంధము లేదు. పుట్టిన నాటి నుండి గిట్టు నాటి వరకు అసలు అమలుపరుచబడలేదు".

### 4.3.4 విమర్శ :

పవిత్రమైత్రి తీవ్ర విమర్శకు లోనయినది. దీని ప్రకటన నుండి గతించు వరకు ఆచరణలోనికి రానే లేదు. విమర్శకులు, ఉదారవాదులు ఈ మైత్రిని సనాతన వ్యవస్థగాను, జాతీయవాదాన్ని, విప్లవశక్తుల నణచుటకు ఏర్పడిన సంస్థగా భావించిరి. సాంఘిక న్యాయము అణిచివేయబడినది. మెటర్నిక్ దీనిని 'వాగ్బాహుళ్యము' అని అభివర్ణించెను. పరిపాలనలో మత సిద్ధాంతాలు ఆచరించుట బహు కష్టము. ఇట్లు ఈ మహోన్నతమైన విలువలు కలిగిన పవిత్రమైత్రి అపవిత్రమైనది.

### 4.3.5 ప్రాముఖ్యత :

పవిత్రమైత్రి విఫలమైనప్పటికి, ఐరోపా రాజకీయాలపై ఈ మైత్రి ప్రభావాన్ని చూపినది. సమస్యలు వచ్చినపుడు శాంతి, దయ, ప్రేమ, కరుణల ద్వారా సోదర భావంతో సుహృద్భావ వాతావరణంలో సమిష్టిగా పరిష్కరించుకోవచ్చునని తెలిపినది. రాజ్యాల మధ్య పరస్పర సహకారము పొందగలమని బోధించినది. శాంతి అహింసల ద్వారా యుద్ధాలను నివారించవచ్చని పేర్కొనినది. అంతర్జాతీయ అవగాహనకు దోహదము చేసినది. దీని పర్యవసానమే 1899లో హేగ్ నగరములో అంతర్జాతీయోద్యమము ప్రారంభమయ్యెను.

## 4.4 మెటర్నిక్ :

### 4.4.1 పరిచయం :

ఫ్రెంచి విప్లవ భావాలైన స్వేచ్ఛ, సమత్వము, సౌభ్రాతృత్వము ఐరోపా ప్రజలందరి మనస్సులో చోటుచేసుకొన్నవి. నెపోలియన్ పతనానంతరము ఐరోపాలో పురాతన సాంప్రదాయవాదులు విప్లవభావాలను వాటి నుండి జనించిన జాతీయ, ఉదారవాద విధానాలు,

ఉద్యమములను అణిచి సాంప్రదాయ బద్ధమైన పురాతన రాచరిక వ్యవస్థను కొనసాగించాలని అనేక విధములైన చర్యలు చేపట్టిరి. వాటి ఫలితముగా విప్లవ ఉదారవాద విధానాలు తాత్కాలికముగా ఓటమి పొందినను, తుదకు అంతిమ విజయము సాధించెను. విప్లవ, జాతీయ, ఉదారవాదుల ఉద్యమములను వ్యతిరేకిస్తూ వాటిని నశింపచేయటానికి, ఐరోపాలో విప్లవ పూర్వపు పరిస్థితిని నెలకొల్పటానికి, ఆస్ట్రియాను విప్లవ ప్రభావము నుండి రక్షించటానికి, ఐరోపాలో సాంప్రదాయ విధానమును కొనసాగించాలనే విధానాన్ని తన విధానంగా చేసికొని అమలుపర్చుటకు కంకణం కట్టుకొన్న నాయకుడు ఆస్ట్రియా ప్రధాని అయిన మెటర్నిక్. అతననుసరించిన విధానమే మెటర్నిక్ విధానము.

1815-1848 వరకు ఐరోపా రాజకీయాలలో ప్రముఖపాత్ర వహించి, రాజకీయవ్యవస్థను తన ఆధీనమందుంచుకొని ఐరోపా 'సంరక్షకుడు' గా, 'ఐరోపా ప్రధాని' గా, 'ఐరోపా రక్షకభటుడు' గా పిలువబడినాడు. కాబట్టి ఇతను ఇంత ప్రముఖ వ్యక్తిగా ఈ కాలంలో వ్యవహరించినాడు కాబట్టి ఈ కాలాన్ని "మెటర్నిక్ యుగము" అందురు.

ఇతని విధానమును, ఇతని చర్యలను ప్రతిఘటిస్తూ ఐరోపాలో 1830, 1848 లలో జాతీయ, ఉదార విప్లవములు చెలరేగినవి.

## 4.4.2 మెటర్నిక్ జీవితము :

మెటర్నిక్ 19వ శతాబ్దంలో ఒక ప్రఖ్యాతి గాంచిన ప్రతిభాశాలి. రాజకీయవేత్త. ఇతని పూర్తి పేరు కౌంట్ క్లెమెన్స్ మెటర్నిక్. ఇతను పశ్చిమ జర్మనీలో ప్రభువంశమునందు 1773లో తన సంస్థానములోని కొబెంజ్ నగరము నందు జన్మించెను. ఇతను జన్మతః భాగ్యవంతుడు. విప్లవకాలంలో ఇతను స్ట్రాస్ బర్గ్ విశ్వ విద్యాలయములో విద్యాభ్యాసము చేయుచుండెను. ఆ సమయంలో అనేక మంది మతాధిపతులు, భూస్వాములు ఫ్రాన్సు నుండి పారిపోయిరి. విప్లవ కాలములో వారు అనుభవించిన బాధలు, హింసలు, వారి కన్నీటి కథలు, విప్లవకారుల ఘోర కృత్యాలు మెటర్నిక్ విని చలించిపోయినాడు. అందుకు ఇతను విప్లవమునకు, విప్లవ విధానములకు బద్ధవిరోధిగా మారినాడు. నెపోలియన్ ఫ్రాన్సు సింహాసన మధిష్టించిన తరువాత మెటర్నిక్ సంస్థానమును కూడా ఆక్రమించుకున్నాడు. నెపోలియన్ యుద్ధములను గర్హిస్తూ, అతనిపై ద్వేషము పెంచుకుని, అతనికి విరోధిగా మారినాడు. అందువలన మెటర్నిక్‌నకు విప్లవమన్నను, విప్లవ భావములన్నను, నెపోలియన్ అన్నను గిట్టదు. వాటికి బద్ధ విరోధిగా మారినాడు. వాటిని ఐరోపాలో సమూలంగా నిర్మూలించి విప్లవ పూర్వ పరిస్థితిని నెలకొల్పుటకు పూనుకొనెను. ఆ ప్రయత్నాలలోనే ఐరోపాకు పీడగానున్న నెపోలియన్‌ను పతనం గావించుటలో కృషిచేసి తనకుతానే 'నెపోలియన్ విజేత' గా ప్రకటించుకొనినాడు.

## 4.4.3 మెటర్నిక్ వివాహము - ప్రధాని అగుట :

మెటర్నిక్ ఆస్ట్రియా ప్రధాని కానిట్జ్ మనుమరాలుకు 1785లో వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం ద్వారా అతనికి మంచి గుర్తింపు లభించినది. తరువాత రష్యా, ప్రష్యా దేశాలకు రాయబారిగా పనిచేసి అనతి కాలంలోనే అతని రాజకీయ విజ్ఞత ఐరోపా అధినేతలతో గల సంబంధాలు అతనిని ఉన్నతమైన స్థానంలో నిలబెట్టినాయి. 1809లో ఆస్ట్రియాకు మెటర్నిక్ ప్రధానమంత్రి లేదా ఛాన్సలర్ అయ్యెను. అప్పటి నుండి నెపోలియన్‌ను ప్రతిఘటించుటకు, నాల్గవ సంకీర్ణ కూటమిని ఏర్పాటు చేయుటలో మెటర్నిక్ ప్రముఖపాత్ర వహించెను.

### 4.4.4 మెటర్నిక్ విధానము - ఆశయము :

మెటర్నిక్ విప్లవ, జాతీయ, ఉదారవాద ప్రజాస్వామ్య వాదాలకు వ్యతిరేకి. 'సాంప్రదాయ బద్ధ పరిపాలన, పురాతన రాచరిక వ్యవస్థ' విధానము శ్రేయస్కరమని భావించాడు. ప్రజాస్వామ్యం లేదా ఉదార ప్రభుత్వము దేశాల్ని అస్థిరతకు గురిచేస్తాయని, అతని విశ్వాసము. "ప్రజాస్వామ్యం పగటి వెలుగును, చీకటి రాత్రిగా మార్చివేస్తుందని' అతని విశ్వాసము. ఆస్ట్రియా రాజు మొదటి ఫ్రాన్సిస్ కూడా ఉదారవాదానికి, జాతీయ వాదానికి బద్ధవిరోధి. కాబట్టి మెటర్నిక్ నిరపేక్ష రాచరిక వ్యవస్థ ద్వారా ఐరోపాలో శాంతిని సాధించగలమని భావించినాడు. అందుకని అతను "ఐరోపావాసులకు కావలసినది శాంతి కాని స్వేచ్ఛ కాదు" అని నుడివెను. జాతీయ, ఉదారవాద విధానాలను అణచటానికి బలప్రయోగం చేయాలనేది అతని విశ్వాసము. తాను రాచరిక వ్యవస్థను పునఃప్రతిష్ఠించటానికి జన్మించిన భగవద్దానుడనని చెప్పినాడు. కాబట్టి ఐరోపాలో 1) పురాతన నిరంకుశ రాచరిక వ్యవస్థను పునఃప్రతిష్ఠించుటకును 2) ఆస్ట్రియాను ఐరోపాలో బలీయమైన రాజ్యంగా రూపొందించుట అనేవి అతని ఆశయములు. అట్టి ఆశయ సిద్ధి కోసం మెటర్నిక్ నెపోలియన్ పతనానంతరం 1815లో వియన్నా నగరంలో ఐరోపా రాజ్యాల సమావేశము నేర్పాటు చేసి పురాతన రాచరిక వ్యవస్థ పునరుద్ధరణకు కంకణం కట్టుకొన్నాడు. దీని ద్వారా ఆస్ట్రియా ఔన్నత్యమునకు పాటుపడుటే కాక ఐరోపా రాజ్యబద్ధకూటమి ద్వారా ఐరోపా రాజ్యాలలో జోక్యం కలిగించుకొనెను.

### 4.4.5 మెటర్నిక్ చతుర్థరాజ్యకూటమి - ఐరోపా రాజ్యబద్ధ కూటమి :

1815 వియన్నా సమావేశానంతరం, మెటర్నిక్ ఒక గొప్ప రాజకీయవేత్తగాను, ఒక దౌత్యవేత్తగాను వెలుగొందెను. ఆస్ట్రియాలో జాతీయ, ఉదార ఉద్యమములను అదుపు చేసిన తరువాత, తన విధానాలను ఆశయాలను ప్రచారము చేసెను. వియన్నా కాంగ్రెస్ తీర్మానాలను అమలుపరుచుటకు, మిత్రరాజ్యాలైన ప్రష్యా, రష్యా, ఇంగ్లండ్‌లతో కలసి చతుర్థరాజ్య కూటమిని ఏర్పాటు చేసెను. ఈ చతుర్ధ రాజ్యకూటమే "ఐరోపారాజ్యబద్ధ కూటమి" అందురు. కూటమిలో సభ్యులు తరుచు సమావేశమై ఐరోపాలో తలెత్తుచున్న సమస్యలు, శాంతికి వ్యతిరేకముగా ఏర్పడిన పరిస్థితులను చర్చించి వాటిని సంయుక్తముగా ఎదుర్కొనుటకు తగిన చర్యలు గైకొనిరి. మెటర్నిక్ ఐరోపారాజ్యబద్ధ కూటమినే ఒక సాధనముగా చేసుకొని ఐరోపాలో పురాతన రాచరిక వ్యవస్థను పునరుద్ధరించి, జాతీయ ఉదార ఉద్యమములను అణిచివేయనెంచెను. అందుకుగాను ఈ ఐరోపారాజ్యబద్ధ కూటమి అది పతనమగునాటికి నాలుగుమార్లు సమావేశమయ్యెను. మొదటిసారిగా 1818 ఆక్సెలా ఛాపెల్ నందు, రెండవ మారు 1820 ట్రపాస్ నందు, మూడవ మారు 1821 లైబాక్ నందును, చివరిసారిగా 1822 లో వెరోనా నందు సమావేశమయ్యిరి. ఇందు ఇంగ్లండు ఐరోపారాజ్యబద్ధకూటమి నుండి వైదొలగినది. ఈ నాలుగు సమావేశములందు అనేక సమస్యలు చర్చించి పరిష్కారములు కనుగొనిరి. కొన్ని సందర్భములలో ముఖ్యముగా స్పెయిన్, నేపిల్స్, పోర్చుగల్ ఆంతరంగిక వ్యవహారములలో జోక్యము కలిగించుకునే విషయములందు ఇంగ్లండ్ విభేదించెను. ఇంకను ఆయా సమస్యలందు మిత్ర రాజ్యములలో భేదాభిప్రాయములు తలెత్తెను. తత్ఫలితముగా ఐరోపారాజ్యబద్ధకూటమి విచ్ఛిన్నమయ్యెను.

## 4.4.6 ఐరోపాలో మెటర్నిక్ విధానం అమలుపరుచుట :

నెపోలియన్‌ని పతనముగావించుటలో ప్రముఖపాత్ర పోషించి, వియన్నా సమావేశము ఏర్పాటు గావించుటకు కృషిచేసి, తన విధానాన్ని ఐరోపా రాజ్యబద్ధకూటమి ద్వారా అమలుపర్చాలనుకున్నాడు మెటర్నిక్. తన స్వంత దేశమైన ఆస్ట్రియాతో సహా జర్మనీ, ఇంగ్లండ్, రష్యా, ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్సు దేశాలలో తన విధానాన్ని ప్రవేశపెట్టినాడు.

### 4.4.6.1 ఆస్ట్రియా :

ఐరోపా ఖండంలో సనాతన సాంప్రదాయాలు కలిగిన ప్రముఖ దేశం ఆస్ట్రియా. ఆస్ట్రియా రాజైన మొదటి ఫ్రాన్సిస్ సహాయముతో మెటర్నిక్ నిరంకుశ పాలనను ప్రవేశపెట్టెను. ఈ దేశము నందు అనేక అభివృద్ధి నిరోధక చర్యలు చేపట్టెను. అభివృద్ధి కుంటుపడెను. పత్రికా స్వాతంత్ర్యమును హరించెను. జాతీయవాద, ఉదారవాద విధానాలకు నిలయమైన విశ్వవిద్యాలయాలను తన ఆధీనములోనికి తెచ్చెను. యావత్ విద్యా విధానమును ప్రభుత్వ ఆధీనమందుంచెను. విప్లవ భావాలు ఆస్ట్రియాకు సోకకుండా వుండేందుకు, ఆస్ట్రియా నుండి ఎవరు విదేశాలకు వెళ్ళకుండా నిరోధించెను. ప్రభుత్వ వ్యతిరేక శక్తులను కఠినముగా శిక్షించెను. దీని పర్యవసానమే విద్యా వాణిజ్యములు కుంటుపడెను. జాతీయ, ఉదారశక్తులు మరుగున పడెను. మెటర్నిక్ ఆస్ట్రియాలో తన విధానం అమలుపరుచుటలో విజయం సాధించెను.

### 4.4.6.2 జర్మనీ :

అనేకమైన చిన్న, చిన్న రాజ్యాలుగానున్న జర్మనీని ఐక్యజర్మనీగా రూపొందించటానికి బదులుగా వియన్నా కాంగ్రెస్ 39 రాజ్యాలుగా ఏర్పరచినది. దీనిని జర్మన్ సమాఖ్యగా పిలిచినది. దీనికి శాసనసభ 'డైట్' కూడా కలదు. ఇందలి సభ్యులను రాజులే నియమించుదురు. ఆస్ట్రియా రాజు ఈ సభకు అధ్యక్షుడు. ఆస్ట్రియా రాజే జర్మన్ సమాఖ్యకు అధ్యక్షుడు కూడా కావటంతో మెటర్నిక్‌నకు ఈ సమాఖ్యలో తన విధానాన్ని ప్రవేశపెట్టుట సులువైనది. ఇందుకు ప్రష్యా రాజైన మూడవ ఫ్రెడరిక్ సహాయపడెను.

నెపోలియన్ యుద్ధాల వలన జర్మనీలో స్వేచ్ఛ స్వాతంత్ర్యములకు, జాతీయ భావముల ద్వారా చైతన్యవంతులయిరి. వియన్నా సమావేశమందలి నిర్ణయములు ప్రజలను నిరుత్సాహపరచెను. అందుకు వారు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సంస్కరణలు కావలయునని ఆందోళన చేయసాగిరి. మెటర్నిక్ ఈ ఉద్యమములణచి వేసి, రాజకీయ హక్కులను రద్దు చేసెను. జర్మనీ దేశములందు సనాతన వ్యవస్థను నెలకొల్పెను. ఉదారవాద, జాతీయవాద ఉద్యమములు అణిచివేయబడటంతో ప్రజలు అసంతుష్టులయిరి.

ఈ పరిస్థితులలో ఉద్యమకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి రహస్య సమావేశము ఏర్పాటు చేసిరి. వీరు ప్రజలలోను, విద్యార్థులలోను చైతన్యమును తెచ్చిరి. విప్లవ జాతీయ భావములను రగుల్కొల్పిరి. అనేక ద్యా సంస్థలలోనున్న విద్యార్థులు వర్గాలుగాను, రహస్య సంఘాలుగాను ఏర్పడి ఆందోళన చేయుటకు పూనుకొనిరి. వానిలో ప్రముఖమయిన రహస్య సంఘములేవనగా 'టుగన్‌బండ్' మరియు 'బుర్షెన్ షాఫ్ట్'. 1819లో కాట్జిబ్యూ అను పత్రికా విలేఖరిని రష్యా గూఢచారి అని అనుమానించి చంపిరి. ఈ చర్యతో మెటర్నిక్ దీనిని ఆసరాగా తీసుకొని విద్యార్థి సంఘాలను, విప్లవ సంఘాలను అణిచివేసే నిమిత్తం ఐరోపా రాజ్యబద్ధ కూటమిని కారల్స్ బాడ్‌లో సమావేశపరచెను. ఈ సమావేశంలో ప్రష్యా సాయంతో అనేక ఆజ్ఞలు జారీచేసెను. అందువలననే ఈ ఆజ్ఞలను లేదా శాసనాలను 'కారల్స్‌బాడ్ శాసనాలు' అందురు. ఈ శాసనాల ప్రకారంగా

ఎ) వాక్, సమావేశ స్వాతంత్ర్యములు హరింపబడినవి.

బి) విద్యార్థి సంఘములు రద్దు కావించబడినవి.

సి) విద్యా సంస్థలలో విద్యార్థులు, ప్రొఫెసర్లుపై గూఢచారి నిఘా ఏర్పరచెను.

డి) విశ్వ విద్యాలయాలలో బోధన ప్రభుత్వ ఆంక్షలకు లోనయ్యెను.

ఇ) పత్రికలపై కఠినమైన ఆంక్షలు విధించబడినవి.

ఎఫ్) ఈ శాసనాల వలన విప్లవకారులకు గట్టి దెబ్బ తగిలినది.

అయినను విప్లవకారులు 1830లో వచ్చిన విప్లవంలో మెటర్నిక్ విధానమునకు వ్యతిరేకముగా బ్రన్స్‌విక్ హెస్సి - కాసల్ నందు తిరుగుబాట్లు తీసుకొనిరాగా వీటితో పాటు జర్మన్ సమాఖ్యలోని అన్ని రాజ్యాలలో విప్లవమును మెటర్నిక్ అణిచివేసెను. 1848 ఫిబ్రవరి విప్లవ కాలంలో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరం నందు జాతీయవాదులైన విప్లవకారులు సమావేశమై జర్మనీ ఏకీకరణకు ఉద్యమించిరి. జర్మన్ సమాఖ్యను ఐక్యజర్మనీగా ఆవిర్భవింపచేసి, నూతన రాజ్యాంగం నిర్మించుకోవటానికి నాల్గవ ఫ్రెడరిక్ విలియంను రాజుగా ప్రకటించడానికి నిర్ణయించుకొనినారు. ఈ జాతీయ వాదుల ఆశలన్నీ వమ్ము చేసి మెటర్నిక్ జర్మనీని తన ఆధీనమందుంచుకొనెను.

### 4.4.6.3 ఇటలీ :

పవిత్ర రోమన్ సామ్రాజ్య పతనంతో ఇటలీ రాజ్యం చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయినది. నెపోలియన్ చిన్న రాజ్యాలను ఐక్యం చేసి తన ఆధీనము నందుంచెను. నెపోలియన్ కోడ్‌ని ప్రవేశపెట్టి, సాంఘిక అసమానతలు తొలగించి సరిక్రొత్త సాంఘిక సమత్వమును ప్రవేశపెట్టెను. తత్ఫలితంగా ప్రజలలో జాతీయ భావం ప్రబలినది.

నెపోలియన్ పతనానంతరం వియన్నా సమావేశంలో తీసుకున్న నిర్ణయ ప్రకారం ఇటలీని ఐదు భాగాలుగా విభజించినారు. ఇందులో ఆస్ట్రియాకు వెనీషియా, లొంబార్డీలపై ఆధిపత్యము లభించినది. ఇంకను మిగిలిన ప్రాంతాలపై పురాతన రాచరిక వ్యవస్థ నెలకొనెను. అందువలన ఇటలీలోని ప్రజలు అనేక కష్టనష్టములకు లోనయిరి. నిరంకుశ ప్రభుత్వాల వలన ప్రజలు అసంతృప్తులై జాతీయభావంతో రాజ్యాంగ ప్రభుత్వములు కావలెనని ఆందోళనలు చేసిరి. 1820లో నేపిల్స్ నందు గొప్ప తిరుగుబాటు జరిగెను. తరువాత పిడ్మాంటునకు ప్రాకినది. అటువంటి పరిస్థితులలో మెటర్నిక్ 1821 లో లైబాక్ నందు ఐరోపారాజ్యబద్ధకూటమిని సమావేశపర్చి, తిరుగుబాటును అణిచివేయుటకును, నిరంకుశ రాచరికమును నెలకొల్పుటకు నిర్ణయము తీసుకొనెను. నేపిల్స్, పిడ్మాంట్‌లలో మెటర్నిక్ తిరుగుబాటును అణిచివేసెను. ఇందు అనేక వేల మంది జాతీయవాదులు మరణించిరి. అనేక మంది నిర్బంధించబడినారు. అనేక మంది దేశం వదలి పారిపోయినారు.

జాతీయవాదులు, ఉదారవాదులు రహస్య సంఘాలుగా ఏర్పడి ప్రజలను చైతన్యవంతులను చేయుచుండిరి. క్రమముగా జాతీయభావ ప్రేరేపితులైన ప్రజలు 1830లో జరిగిన విప్లవములో చురుకుగా పాల్గొన్నారు. ఈ విప్లవం ముఖ్యంగా రొయగ్నా, పిడ్మాంట్, మొడినా, టస్కని ప్రాంతంలలో ప్రారంభమయినది. విప్లవ ధాటికి తట్టుకొనలేక ఆ పాలకులు దేశాలు వదలి పారిపోయిరి. మెటర్నిక్ వారిని రక్షించి, విప్లవాన్ని అణిచివేసి, మరలా వారికి తమ రాజ్యములను అప్పగించెను.

### 4.4.6.4 స్పెయిన్ :

ఫ్రెంచి విప్లవ భావాలతో ప్రభావితులైన ప్రజలు స్పెయిన్ నందు తిరుగుబాట్లు చేయగా, స్పెయిన్ శాసనసభ 1812 రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టినది. వియన్నా కాంగ్రెస్ ప్రకారం ఏడవ ఫెర్డినాండ్, స్పెయిన్ సింహాసనంపై పునః ప్రతిష్ఠింపబడినాడు.

అతను ఈ ఉదార రాజ్యాంగాన్ని రద్దు చేసి, నిరంకుశ పాలనను ప్రవేశపెట్టినాడు. అంతట జాతీయవాదులు, ఉదారవాదులు తిరుగుబాట్లు చేయగా, తిరుగుబాట్లు నణచుటకు ఫ్రాన్సును సహాయమర్థించెను. ఫ్రాన్సు చక్రవర్తి 18వ లూయీ 1822 వెరోనా నందు జరిగిన ఐరోపా రాజ్యబద్ధకూటమి సమావేశము నందు ఈ అంశము ప్రవేశపెట్టగా, మెటర్నిక్ సహాయంతో అనుమతి పొంది తిరుగుబాటును అణిచివేసెను.

### 4.4.6.5 రష్యా :

రష్యా చక్రవర్తియైన జార్ మొదటి అలెగ్జాండర్ ఉదారవాది, కాని మెటర్నిక్ ప్రభావము వలనను మరియు 1819లో రష్యా పత్రికా విలేఖరిని జర్మన్ విప్లవ సంఘాల విద్యార్థులు చంపటంతో అతని మనస్సు మార్చుకొని మెటర్నిక్‌కు అనుకూలముగా మారెను. రష్యాలో ప్రారంభమయిన ఉదారవిప్లవమునకు వ్యతిరేకిగా మారి అణిచివేసినాడు. ఈ దేశమునందు నిరంకుశ పాలనను ప్రవేశపెట్టెను.

### 4.4.6.6 ఫ్రాన్సు :

నెపోలియన్ పతనానంతరం, ఫ్రాన్సులో విప్లవ భావాల వలన గాని, పాలకుల వలన కాని ఐరోపాలో మరియొకసారి శాంతికి భంగము వాటిల్ల గూడదని ఫ్రాన్సు చుట్టు ఉన్న బెల్జియం, హాలెండ్, స్విట్జర్లాండ్, స్వీడన్‌లను బలపరచి, బలీయమైన రాజ్యాలుగా రూపొందించెను. ఫ్రెంచి సైన్యాన్ని తగ్గించెను. 1818లో ఫ్రాన్సు యుద్ధ నష్ట పరిహారం కూడా చెల్లించెను. ఫ్రాన్సు చతుర్ధ రాజ్యకూటమిలో సభ్యత్వం పొందుట ద్వారా ఆ కూటమి పంచరాజ్య కూటమిగా ఆవిర్భవించినది. 1824 లో 18వ లూయీ మరణించెను. అతని మరణానంతరం, అతని స్థానంలో పదవ చార్లెస్ సింహాసనమధిష్ఠించి, ఫ్రాన్సు నందు నిరంకుశ పాలన ప్రవేశపెట్టెను. కనుకనే ఫ్రాన్సు నందు (1815-1830) 15 సం॥ పాటు మెటర్నిక్ విధానము కొనసాగెను.

### 4.4.6.7 ఇంగ్లండ్ :

నెపోలియన్‌ని పతనమొందించు విషయంలోను, వియన్నా కాంగ్రెస్ ఏర్పాటుచేయు విషయంలోను మెటర్నిక్‌నకు ఇంగ్లండ్ పూర్తి సహాయ సహకారాలు అందించినది. ఐరోపాలో శాంతిని నెలకొల్పుటకుగాను, ఐరోపా రాజ్యాలలో రాచరిక పాలనను ప్రవేశపెట్టుటలో ఇరువురు సఖ్యతగా పనిచేసిరి. మెటర్నిక్ అనుసరిస్తున్న సాంప్రదాయ విధానాలు పూర్తిగా ఇంగ్లండ్ సహింపకుండినది. జాతీయవాదాన్ని ప్రజాస్వామ్యాన్ని అణిచివేయు విషయంలో ఇంగ్లండ్ అంతగా యిష్టత చూపకపోగా వ్యతిరేకించెను. ముఖ్యంగా స్పెయిన్ ఆంతరంగిక విషయంలో ఫ్రాన్సు జోక్యం చేసుకొనుట, రష్యా టర్కీ విషయంలో జోక్యం చేసుకొనుట ఇంగ్లండ్ వ్యతిరేకించినది. సుప్రసిద్ధ మన్రో సిద్ధాంతం కూడా ఇంగ్లండ్ మెటర్నిక్‌ల మధ్య వైషమ్యాలు సృష్టించినది. ఇటువంటి పరిస్థితుల వలన ఇతరుల ఆంతరంగిక వ్యవహారములలో జోక్యము చేసుకొనుట ఇష్టంలేని ఇంగ్లండ్ 1822 వెరోనా సమావేశము నందు కూటమి నుండి నిష్క్రమించినది. దీనితో 1825 నాటికి ఐరోపారాజ్యబద్ధకూటమి అంతమయినది.

## 4.4.7 మెటర్నిక్ పతనమునకు గల కారణములు :

1815-1848 మధ్య కాలంలో ఐరోపా రాజకీయ వేదికపై మెటర్నిక్ వైభవముగా వెలుగొందెను. మెటర్నిక్ విధానము తాత్కాలికమైనది. అచిరకాలముననే అది అతని పతనమునకు దోహదము చేసెను. ఏ ఉదార, ప్రజాస్వామ్య విధానాలను వ్యతిరేకించెనో ఆ ఉదారవాదానికి ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు అయిన ఇంగ్లండ్ నందు తల దాచుకొని తుదకు 1856లో మరణించెను. ఇతని పతనమునకు అనేక కారణములు గలవు.

1. మెటర్నిక్ విశ్వసించిన సాంప్రదాయ, రాచరిక విధానముల కంటే ఉదారవాద జాతీయవాద విధానాలు చాలా పటిష్టమైనవని, బలీయమైనవని గ్రహింపకుండుట.

2. ఐరోపారాజ్యబద్ధకూటమిలో తీసుకునే కొన్ని నిర్ణయాలను ఇంగ్లండ్ వ్యతిరేకించుటవలన, రాజ్యాలను విభేధాలు పొడసూపినవి. ప్రజాస్వామ్యము, జాతీయవాదాలను వ్యతిరేకించుట ఇంగ్లండ్ వ్యతిరేకించినది.
3. అమెరికా యొక్క మన్రో సిద్ధాంతము ద్వారా లాటిన్ అమెరికా నందు, స్పానిస్ అధికారమును పునఃప్రతిష్ఠించుట వలన.
4. ఐరోపా దేశాలు సనాతన విధానాలను అనుసరించుట వలన పారిశ్రామిక రంగంలోను, వాణిజ్య రంగంలోను, ఆర్థిక రంగంలో, సాంఘిక రంగంలోను అభివృద్ధి కుంటుపడుట వలన.
5. ఐరోపాలో వారి శ్రామికాభివృద్ధి వలన ప్రజలలో వచ్చిన ఆర్థిక, సాంఘిక, రాజకీయ మార్పులు ఆలోచింపచేయుట వలన.
6. ఐరోపాలో సనాతన వ్యవస్థకు వ్యతిరేకముగా 1848లో విప్లవము రావటము వలన, ఈ విప్లవము నందు ఫ్రెంచి విప్లవ భావాలైన స్వేచ్ఛ, సమత్వము, సౌభ్రాతృత్వములను విప్లవకారులు బాగుగా ప్రచారము చేయుట వలన.

ఆస్ట్రియా నందు విప్లవ నాయకుడైన కొస్సాత్ ప్రజలలో విప్లవ స్ఫూర్తిని బాగుగా తెచ్చినాడు. ప్రజలను చైతన్యవంతులను చేసినాడు. చివరకు వారు పురాతన సాంప్రదాయ, రాచరికములకు నిలయమైన మెటర్నిక్ భవనమును చుట్టుముట్టి 'మెటర్నిక్ నశించాలి' అనెడి నినాదములు చేసినారు. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో వచ్చిన ఈ గొప్ప తిరుగుబాటును మెటర్నిక్ అణచలేక, ఐరోపాకే సర్వాధికారిగా చలామణి అయిన మెటర్నిక్ రహస్యముగా మారు వేషంలో కుటుంబంతో ఇంగ్లండ్‌కు పారిపోయెను. అంతట మెటర్నిక్ పలాయనంతో పాటు మెటర్నిక్ యుగం అంతమయినది. దీనితోనే సనాతన, సాంప్రదాయ శక్తులు అంతరించెను. జాతీయ, ఉదారశక్తులు విజృంభించెను.

### 4.4.8 మెటర్నిక్ విశిష్టత :

మెటర్నిక్ నాగరిక సంపన్నుడు. ఇతను గొప్ప ఆలోచనాపరుడు. ధైర్యవంతుడు, స్థిర నిశ్చయం, దృఢ సంకల్పం కలిగిన ఉక్కు మనిషి. ఐరోపాలో గొప్ప రాజనీతిజ్ఞుడు, ప్రముఖ ప్రజ్ఞాపాటవములు గలవాడు. గొప్ప దౌత్యవేత్త. ఆస్ట్రియాను ఉన్నత శిఖరాగ్రము నందుంచుటయే గాక 1815 నుండి 1848 వరకు ఐరోపా రాజకీయములను శాసించెను. అందువలననే ఈ కాలాన్ని 'మెటర్నిక్ యుగము' అని పిలిచిరి. ఇతనిని 'సనాతన విధానములకు ప్రవక్త' గా అభివర్ణించిరి.

### 4.5 నమూనా ప్రశ్నలు :

1. 1815 వియన్నా కాంగ్రెస్ ప్రాధాన్యతను వివరింపుము.
2. ఐరోపారాజ్యకూటమి బద్ధ సంఘటనలను వర్ణింపుము.
3. మెటర్నిక్ విధానమును గూర్చి వ్రాయుము.
4. పవిత్రమైత్రి
5. మన్రో సిద్ధాంతము

### 4.6 చదువదగిన గ్రంథాలు :


1. H.L. Peacock - Modern European History, 1789-1973
2. Raghubir Dayal - Modern European History
3. C.J.A.H. Hayes - Modern Europe upto 1870
4. C.D, Hazan - Modern Europe upto 1945
5. C.D.M. Ketelby - A History of Modern Times from 1789
6. D. Thamson - Europe Since Napoleon


- శ్రీ యం.జె. జయప్రసాద్

పాఠం - 5

# 1830 జూలై విప్లవము, 1848 ఫిబ్రవరి విప్లవము

## 5.0 లక్ష్యం :

1830 జూలై విప్లవము, 1848 ఫిబ్రవరి విప్లవము గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయసూచిక :


**5.1 1830 జూలై విప్లవము**

- **5.1.1 పరిచయం**
- **5.1.2 ఐరోపా రాజ్యాలపై 1830 జూలై విప్లవ ప్రభావము**
  - **5.1.2.1 బెల్జియం**
  - **5.1.2.2 పోలెండ్**
  - **5.1.2.3 స్పెయిన్**
  - **5.1.2.4 పోర్చుగల్**
  - **5.1.2.5 స్విట్జర్లాండ్**
  - **5.1.2.6 జర్మనీ**
  - **5.1.2.7 ఇటలీ**
- **5.1.3 విప్లవ ప్రాముఖ్యత**

**5.2 1848 ఫిబ్రవరి విప్లవము**

- **5.2.1 పరిచయం**
- **5.2.2 ఫ్రాన్స్ - 1848 విప్లవము**
- **5.2.3 ప్రభావము**
  - **5.2.3.1 ఆస్ట్రియా**
  - **5.2.3.2 హంగేరి**
  - **5.2.3.3 బొహీమియా**
  - **5.2.3.4 జర్మనీ - ప్రష్యా**
  - **5.2.3.5 ఇటలీ**
  - **5.2.3.6 డెన్మార్క్, హాలెండ్**
  - **5.2.3.7 స్విట్జర్లాండ్**
- **5.2.4 విప్లవ ప్రాధాన్యత**

**5.3 నమూనా ప్రశ్నలు**

**5.4 చదువదగిన గ్రంథాలు**

## 5.1 1830 జూలై విప్లవము

### 5.1.1 పరిచయం :

నెపోలియన్ పతనానంతరము, సాంప్రదాయవాదులకు జాతీయ, ఉదారవాద, విప్లవశక్తులకు మధ్య జరుగుచున్న సంఘర్షణా ఫలితమే ఈ 1830 విప్లవము. వియన్నా కాంగ్రెస్ నందు సాంప్రదాయవాదులు విజయం సాధించిరి. ఫ్రెంచి విప్లవము నుండి జనించిన విప్లవ భావములను, జాతీయ, ఉదారవాద శక్తుల నణిచివేసిరి. అయినను ఉదార విప్లవ శక్తులు పూర్తిగా అంతర్ధానముకాకపోగా బలపడెను. ఈ శక్తులు అవకాశం చిక్కినపుడెల్లా విజృంభించుచుండెను. ఇట్టి విజృంభణలే 1830, 1848 విప్లవములు.

1789 లో ఫ్రాన్సు నందు మహా విప్లవము ప్రారంభమయిన నాటి నుండి, ప్రజలలో విప్లవ భావాలు పూర్తిగా నాటుకుపోయినవి. విప్లవం నుండి, విప్లవ భావాలను పుణికి పుచ్చుకున్న నెపోలియన్ విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి ఫ్రాన్సును ఉన్నతమైన స్థితికి తీసుకొని వచ్చెను. నెపోలియన్ పతనానంతరం వియన్నా కాంగ్రెస్ ద్వారా 16వ లూయీ సోదరుడు 18వ లూయీ ఫ్రెంచి సింహాసన మధిష్టించెను. ఫ్రెంచి విప్లవము వలన మారిన పరిస్థితులను బట్టి వాటికనుగుణంగా ఫ్రాన్సునకు ఒక నూతన రాజ్యాంగాన్ని అమలుపరిచినాడు. ఈ రాజ్యాంగము 1848 వరకు కొనసాగినది. ఈ రాజ్యాంగ ప్రకారముగా ఫ్రాన్సు నందు ఎన్నికలు తలపెట్టెను. రాజకీయ పార్టీలు అధికారాల కోసం కుమ్ములాటలు ప్రారంభించినవి. ఆస్తి కలవారికే ఓటు హక్కుండుట వలన సామాన్యులు ఓటు వినియోగించుకొనే హక్కు కోల్పోయిరి. అందువలన సనాతన రాచరికవాదులు అధికమయిరి. క్రమంగా ఫ్రెంచి విధానసభలో రాచరిక ప్రాముఖ్యత పెరిగినది. ఐరోపాలో నిరంకుశ రాచరికమును పునరుద్ధరించుటే వీరి ఆశయము. వీరి ప్రభావమునకు లోనై 18వ లూయీ విప్లవ వ్యతిరేక విధానములను అమలు జరిపినాడు. అనేక ప్రజా వ్యతిరేక చర్యలను చేపట్టినాడు. వార్తాపత్రికల స్వేచ్ఛను హరించెను. శాసన సభ్యులను ఎన్నుకొనే హక్కు ఆస్తి కలవారికి కలుగజేసెను. చర్చి ఆస్తులను పునరుద్ధరించెను. 1823లో స్పెయిన్ నందు చెలరేగిన విప్లవము స్పెయిన్ అభ్యర్థనపై అణిచివేసెను. ఇటువంటి చర్యల పట్ల ప్రజలలో ఇతని పట్ల విశ్వాసం సన్నగిల్లినది. ఇటువంటి పరిస్థితులలో 18వ లూయీ 1824 లో మరణించెను. ఫ్రాన్సు నందు 18వ లూయీ మరణానంతరం అతని సోదరుడైన పదవ చార్లెస్ సింహాసనమధిష్టించెను. ఇతను కరుడు గట్టిన నిరంకుశుడు. మెటర్నిక్ మెప్పు కోసం, సనాతన నిరంకుశ విధానాలతో పరిపాలన ప్రారంభించెను. పత్రికలపై ఆంక్షలు విధించి పత్రికా స్వాతంత్ర్యమును హరించెను. వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించెను. శాసనసభను, మంత్రివర్గాన్ని తన ఆధీనమందుంచుకొనెను. అనేక అభివృద్ధి నిరోధక చట్టాలు ప్రవేశపెట్టెను. విప్లవకాలంలో దేశం వదలి పారిపోయి ఇతర దేశాలలో తలదాచుకున్న ప్రభువుల, మతాధిపతుల ఆస్తిని పునరుద్ధరిస్తూ 1825 లో ఒక చట్టంను చేసెను. దీని ప్రకారం వారి ఆస్తులు పునరుద్ధరించుటే కాక మంచి ఉన్నత పదవులు ఇచ్చింది. దీనివలన ఫ్రెంచి కోశాగారంపై ఆర్థిక భారం పడినది. జాతీయ ఋణం 3% నుండి 5% శాతానికి పెరిగినది. ప్రజలలో అసంతృప్తి ఆవహించినది. ఈ నిరంకుశ చర్యలను ప్రజలు సహింపలేక పోయిరి. ఇటువంటి తరుణంలో 1827లో చట్ట సభలకు ఎన్నికలు జరిగినవి. పదో చార్లెస్ మద్దతు తెలిపిన అల్ట్రా రాజవంశీయులకు తగిన బలం చేకూరలేదు. అందుకు మరలా మూడు సార్లు ఎన్నికలు జరిపించినాడు. కాని అధికారానికి రాలేకపోయిరి. రాజు ఇంత ప్రత్యక్ష మద్దతు రాజవంశీకుల వర్గానికి ఇవ్వటం ప్రజలు సహింపలేకపోయిరి. అల్ట్రా - రాజవంశీయులు ఆధిక్యత సంపాదించలేకపోయిరని 1829లో పదవ చార్లెస్, పాలిగ్నాక్ అను వానిని ప్రధానమంత్రిగా ప్రకటించెను. పాలిగ్నాక్ ప్రమాణ స్వీకారమనంతరం ఆయన ఉద్దేశ్యం సమాజాన్ని పునఃవ్యవస్థీకరించి, మతాన్ని పునరుద్ధరింపచేసి, దేశాన్ని యధాస్థితిలోనికి తీసుకొనివచ్చి, పటిష్టమైన నిరంకుశపాలన ప్రవేశపెట్టటమేనని చార్లెస్‌నుద్దేశించి పాలిగ్నాక్ ప్రకటించెను. ఈ ప్రకటన దేశాన్ని సంక్షోభంలో పడవేయటమే కాక ప్రజలను కోపోద్రిక్తులను చేసినది. ఇది ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రకటన, ప్రజలు రాజును

అసహ్యించుకొనిరి. ఇటువంటి పరిస్థితులలో 1830 జూలై 26న పాలిగ్నాక్ ప్రోత్సాహంతో పదవ చార్లెస్ నాల్గు ఆజ్ఞలు జారీచేసినాడు. అవి ఏమనగా 1. పత్రికా స్వాతంత్ర్యం హరించుట, 2. విధానసభ రద్దు, 3. భూస్వాములకు, మతాధిపతులకు, ధనవంతులకు ఓటు హక్కు నిచ్చుట, 4. 1830 సెప్టెంబరులో నూతన ఎన్నికలను ప్రకటించెను.

పదవ చార్లెస్ అభివృద్ధి నిరోధక, నిరంకుశ చర్యలకు వ్యతిరేకముగా ఉదారవాదులు, మితవాదులు, ప్రజలను చైతన్యవంతులను చేసి విప్లవమును ప్రోత్సహించిరి. పత్రికా రచయితలు వారి రచనల ద్వారా ప్రజలను రెచ్చగొట్టిరి. దీని పర్యవసానంగా పారిస్ నందు 1830 జూలై 26న, పదవ చార్లెస్ నాలుగు శాసనములు జారీచేసిన రోజుననే విప్లవము ప్రారంభమయినది. పారిస్ నగరమంతా ఉద్యమ నినాదములతో మారుమ్రోగిపోయినది. ఉద్యమమును అణిచివేయుటకు ప్రభుత్వము సైన్యమును వినియోగించెను. విప్లవకారులకును సైన్యమునకు మధ్య అంతర్యుద్ధము ప్రారంభమయ్యెను. ఈ అంతర్యుద్ధము నందు విప్లవకారులతో పాటు జాతీయ రక్షణదళంను, జాతీయ సైన్యంవారు అధిక సంఖ్యలో పాల్గొనిరి. రాజు సైన్యమునకు, విప్లవకారులకు మధ్య పారిస్ నందు మూడు రోజులు భీకర పోరాటము జరిగినది. జరుగుతున్న పరిణామములు, పరిస్థితి అంతా పదవచార్లెస్‌కు వ్యతిరేకముగా నుండుటతో, విప్లవ కారులతో రాజీకి యత్నించి విఫలుడయ్యెను. అంతట పదవ చార్లెస్ పదవీ త్యాగం చేసి తన మనుమడిని రాజుగా ప్రకటించి ఇంగ్లండ్ పారిపోయెను. అచట రెండు సంవత్సరములు గడిపిన అనంతరం, ఆస్ట్రియా చేరి అచట 1835 లో మరణించెను.

ఫ్రాన్సులో ఈ సమస్య అంతటితో పరిష్కరింపబడలేదు. పదవ చార్లెస్ ఏర్పాటు చేసిన ప్రభుత్వంను ప్రజలు అంగీకరించలేదు. గణతంత్రవాదులు అధ్యక్ష తరహా పరిపాలన ప్రభుత్వమును ఏర్పాటు చేయనారంభించిరి. కాని మితవాదులు, ఉదారవాదులు ఐరోపాలో రాచరికమున్న రాజ్యాలవారు ఫ్రాన్సు నందు రాచరికము పునఃప్రతిష్టకు పూనుకొని యుద్ధం చేయగలరని భయపడిరి. ఈ పరిస్థితిని అధిగమించుటకు విప్లవకారులు ఆర్లియన్స్ వంశీయుడైన లూయీ ఫిలిప్‌ను (1830) రాజుగా చేసుకొనిరి. లూయీ ఫిలిప్ అనేకమైన ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టి విప్లవ ఉదారవాదులను ఒక అంగీకారమునకు తెచ్చి ఫ్రాన్సునందు శాంతిని నెలకొల్పెను.

## 5.1.2 ఐరోపా రాజ్యాలపై 1830 జూలై విప్లవ ప్రభావము :

1830 జూలై విప్లవము, విప్లవ ప్రభావము ఫ్రాన్సు దేశమునకే పరిమితము కాక, ఐరోపాలో అనేక రాజ్యములకు ప్రాకినది. అందువలన "ఫ్రాన్సు తుమ్మిన ఐరోపా (రాజ్యము) కు జలుబుచేయును" అను నానుడి యదార్థమయినది. ఫ్రాన్సు నందు విప్లవం విజయం సాధించుటతో ఐరోపాలో ప్రజాస్వామ్య విప్లవశక్తులు ఒక్కసారిగా విజృంభించినవి. అనేక దేశములలో ముఖ్యముగా బెల్జియం, ఇటలీ, జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్, పోలెండ్‌లలో ఉదారవాదులు తిరుగుబాటులు చేసిరి. ఈ ప్రజాస్వామ్య విప్లవశక్తులు వియన్నా కాంగ్రెస్ పరిష్కారములను చిన్నాభిన్నము చేసెను.

### 5.1.2.1 బెల్జియం :

వియన్నా కాంగ్రెస్ నిర్ణయ ప్రకారము బెల్జియంను హాలెండ్‌తో కలిపిరి. కాని, ఈ రెండు దేశాల ప్రజల ఆచారాలు, సంస్కృతి, భాష, మతాలు పరస్పర విభిన్నములు. బెల్జియం ప్రజలు కేథలిక్ మతస్తులు, హాలెండు ప్రజలు ప్రొటెస్టాంటులు. బెల్జియం జనాభా హాలెండ్ జనాభా కంటె రెండు రెట్లు పెద్దది. ఈ వ్యత్యాసాలతో పాటు అనేక కఠినమైన ఆంక్షలు బెల్జియం ప్రజలపై విధించిరి. పత్రికల స్వేచ్ఛను హరించెను. వాక్ స్వాతంత్ర్యమును, వ్యక్తి స్వాతంత్ర్యమును హరించెను. అందువలన ప్రజలు అనేక కష్ట నష్టములు, చెప్పుకోలేని బాధలు అనుభవించిరి.

ఫ్రాన్సు నందు ప్రారంభమైన 1830 విప్లవంలో విప్లవ స్ఫూర్తితో బెల్జియంలోని ప్రజలు జాతీయ భావ ప్రేరేపితులై, జాతీయ వాదులు బెల్జియం రాజధానియైన బ్రస్సెల్స్ నందు తిష్టవేసిన డచ్ సైన్యమును పారద్రోలెను. అంతట బెల్జియం ప్రజలు 1830 అక్టోబరులో బెల్జియం స్వాతంత్ర్యమును ప్రకటించుకొని మధ్యంతర ప్రభుత్వమును ఏర్పాటుచేసుకొనెను. ఈ పరిణామమును మెటర్నిక్ తీవ్రముగా పరిగణించెను. ఫ్రాన్స్ రాజైన లూయీ ఫిలిప్ కాని, రష్యా రాజైన జార్ కాని బెల్జియం ఆంతరంగిక వ్యవహారములలో తలదూర్చుట కిష్టపడలేదు. ఇంగ్లండ్ బెల్జియంపై సానుభూతి వహించెను. 1831లో ఇంగ్లండ్ ఐరోపాలోని ప్రముఖ రాజ్యాలైన ఆస్ట్రియా, రష్యా, ఫ్రాన్సులతో లండన్ నందు ఒక సమావేశము ఏర్పాటుచేసి అందు బెల్జియం యొక్క స్వాతంత్ర్యమును గుర్తించెను. ఈ విధంగా జూలై విప్లవము బెల్జియం స్వాతంత్ర్యం పొందుటకు మార్గము చూపెను.

## 5.1.2.2 పోలెండ్ :

వియన్నా కాంగ్రెస్‌లో పోలెండ్‌ని ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాల మధ్య పంచెను. రష్యా ఆధీనములోని పోలాండ్ భూభాగములో రష్యా అన్ని సౌకర్యములు కల్పించినను విభజింపబడిన మిగిలిన భూభాగములతో ఐక్యము కావలెనని ప్రష్యా, ఆస్ట్రియాల నుండి విముక్తి పొందవలెనని వాంఛించిరి. మొదటి అలెగ్జాండర్ మరణానంతరం అతని సోదరుడు మొదటి నికోలస్ రష్యాకు రాజయ్యెను. ఇతను సనాతనవాది. 1830 విప్లవంతో ప్రభావితులైన పోలెండ్ ప్రజలు, పోలెండ్ రాజధానియైన వార్సాలో తిరుగుబాట్లు చేసిరి. అందు అనేకమైన రష్యన్ అధికారులను చంపివైచిరి. సైన్యమును తరిమి వేచిరి. అంతట రష్యా పోలెండ్‌లో విప్లవమును అణిచి తన ఆధీనములోనికి తెచ్చెను. విప్లవకారులకు కఠినశిక్షలు విధించెను. అనేకమంది సైబీరియాకు పంపబడిరి. రష్యా రాజ్యాంగాన్ని రద్దుచేసి పోలెండ్ నందు నిరంకుశ పాలన ప్రవేశపెట్టెను.

## 5.1.2.3 స్పెయిన్ :

1830 జూలై విప్లవము, స్పెయిన్‌లోని ఉదారవాదులకు నూతన ఉత్తేజాన్నిచ్చినది. ఆ దేశపు రాజైన ఏడవ ఫెర్డినాండ్ నిరంకుశ పాలనకు వ్యతిరేకముగా తిరుగుబాట్లు చేసిరి. ఫెర్డినాండ్ ఆ తిరుగుబాట్లను కఠినంగా అణిచివేసెను. ఉదారవాదులు నిరుత్సాహపడక వారి సంఖ్యను ఇంకా పెంచుకొన్నారు. 1834లో జరిగిన ఎన్నికలలో వారు మెజారిటి సాధించి, రాజును పరిపాలన సంస్కరణలు కోరిరి. ఫెర్డినాండ్‌కి వేరే మార్గములేక నూతన ఉదార, రాజ్యాంగాన్ని రూపొందించి, ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టెను.

## 5.1.2.4 పోర్చుగల్ :

1826లో పోర్చుగల్ రాజైన ఆరవ జాన్ మరణంతో, అతని మనుమరాలైన మేరియా డోనా పోర్చుగల్ సింహాసన మధిష్టించెను. కాని ఆమె అంకుల్ అయిన మైకేల్ అనునతడు, బలవంతముగా సింహాసనమును ఆక్రమించి నిరంకుశ పాలనను ప్రవేశపెట్టెను. అంతట పోర్చుగల్ నందు ఇరు వర్గముల మధ్య అంతర్యుద్ధము ప్రారంభమయ్యెను. ఇది ఆరు సంవత్సరములు కొనసాగెను. అంతట మేరియా 1830 జూలై విప్లవ ఉత్తేజముతో ఇంగ్లండ్, ఫ్రాన్సు, స్పెయిన్ దేశాల మద్దతుతో నిరంకుశ ప్రభుత్వమునకు వ్యతిరేకముగా జాతీయ ఉద్యమమును ప్రారంభించెను. చివరకు మైకేల్ నిరంకుశ పాలనను పతనముగావించి పోర్చుగల్ నందు చట్టబద్ధమైన పరిపాలన స్థాపించెను.

## 5.1.2.5 స్విట్జర్‌లాండ్ :

స్విట్జర్‌లాండ్ నందు, స్విస్ ప్రభుత్వము సామాన్య ప్రజల ఆకాంక్షలను వమ్ముచేస్తూ, ప్రభువులు, ఉన్నత వర్గంవారు ప్రత్యేకమైన సదుపాయములు అనుభవిస్తున్నారు. 1830 జూలై విప్లవము ద్వారా ఉదారవాదులు ఉత్తేజితులై, ప్రజల యొక్క

సహకారముతో పరిపాలన సంస్కరణలు కావలెనని కోరిరి. అందుకు స్విస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమమును దృష్టియందుంచుకొని, శాసనములను రూపొందించి అమలుపరిచెను.

### 5.1.2.6 జర్మని :

1830 విప్లవము, దాని ప్రభావము జర్మనీపై కూడా పడినది. సాక్షనీ, బన్స్‌విక్, హెస్సి, హానోవర్ లందు ఉద్యమములు చెలరేగగా ఆ రాజ్యాలలో ఉదార రాజ్యాంగాలు ప్రవేశపెట్టబడెను. కాని మెటర్నిక్ 1819 లో ప్రవేశపెట్టబడిన కారర్స్ బాడ్ శాసనాలు ద్వారా జర్మనీలో విప్లవమును అణిచివేసెను. ఈ విప్లవము ఆస్ట్రియా, ప్రష్యాలను ప్రభావితము చేయలేకపోయినది.

### 5.1.2.7 ఇటలీ :

ఇటలీలో కూడా 1830 జూలై విప్లవము, దాని ప్రభావమును చూపినది. పార్మా, మొడీనాలోని ప్రజలు, ఆ రాజుల పాలనకు వ్యతిరేకముగా తిరుగుబాట్లు చేసిరి. ఆ పాలకులు తిరుగుబాట్లను ఎదుర్కొనలేక దేశములను వదలి పారిపోయిరి. కాని మెటర్నిక్ జోక్యముతో, ఇటలీలో తిరుగుబాట్లు అణిచివేయబడి పురాతన వ్యవస్థ పునరుద్ధరింపబడెను.

### 5.1.3 విప్లవ ప్రాముఖ్యత :

1830 జూలై విప్లవము ఫ్రాన్సు నందేకాక ఐరోపాయందంతటను ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యతను సంపాదించుకొన్నది. ఇది బెల్జియం, పోలెండ్, ఇటలీ, జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్ దేశాలపై అధిక ప్రభావాన్ని చూపినది. ఈ క్రమములో అనేకమైన విప్లవములు ప్రజ్వరిల్లటానికి అవకాశమేర్పడెను. బెల్జియం స్వతంత్ర్య రాజ్యంగా అవతరించినది. వియన్నా కాంగ్రెస్ నిర్ణయాలను కదిలించి వేసినది. ప్రజాస్వామ్య, జాతీయ, ఉదారశక్తులు అనేకచోట్ల విజయం సాధించి బలపడినాయి. మెటర్నిక్ సనాతన సాంప్రదాయ విధానం కొంత వరకు బలహీనపడినది. కొన్ని రాజ్యాలలో ఉదారవాదం, సాంప్రదాయ విధానం ద్వారా అణిచి వేయబడినప్పటికి ఐరోపాలో జాతీయవాదం, ఉదారవాదం పూర్తిగా నశింపబడలేదు. అపుడపుడు పరిస్థితులను బట్టి ఐరోపా రాజ్యాలలో ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ స్ఫూర్తి 1848లో ఐరోపాలో మరియొక విప్లవమునకు దారిచూపినది.

## 5.2 1848 ఫిబ్రవరి విప్లవము :

### 5.2.1 పరిచయం :

ఐరోపాలో మెటర్నిక్ సాంప్రదాయ విధానాల వల్ల ప్రజలు అనేక కష్టనష్టాలకు లోనయినారు. ఉదారవాదులు, జాతీయవాదులు ప్రజలను చైతన్యవంతులను చేసి, నిరంకుశ రాచరికమునకు వ్యతిరేకముగా తిరుగుబాట్లను ప్రోత్సహించిరి. ఈ సాంప్రదాయవాదులకు జాతీయ ఉదారవాదులకు మధ్య జరిగిన పోరాటమే 1830 విప్లవము. ఇందు సనాతనులు కొన్ని రాజ్యాలలో విప్లవములను అణిచివేసి విజయం సాధించగా, మరికొన్ని రాజ్యాలలో ఉదారవాద, జాతీయవాద శక్తులు విజయం సాధించినవి. సనాతనవాదులు విజయములు సాధించినప్పటికి ఆయారాజ్యాలలో ఉదార, జాతీయవాద శక్తులు పూర్తిగా తుడిచిపెట్టబడలేదు. సమయం వచ్చినప్పుడెల్లా వీరు విజృంభించుచుండిరి. ఈ విధంగా ఫ్రాన్సులో మరియొకసారి విప్లవము 1848 ఫిబ్రవరిలో ప్రారంభమయినది. ఫ్రాన్సు తుమ్మిన ఐరోపాకు జలుబు చేయుననెడి నానుడి ప్రకారముగా, ఈ విప్లవ ప్రభావము ఐరోపాలో అనేక రాజ్యములపై పడినది.

### 5.2.2 ఫ్రాన్స్ - 1848 విప్లవము :

1830 జూలై విప్లవములో ఫ్రెంచి ఉదారవాదులు బూర్బన్ వంశీయుడైన పదవ చార్లెస్‌ను తొలగించి ఆర్లియన్స్ వంశీయుడైన లూయీ ఫిలిప్‌ని రాజుగా చేసుకొన్నారు. ఇతను 1830 నుండి 1848 వరకు ఫ్రాన్సును పరిపాలన చేసినాడు. పారిశ్రామికాభివృద్ధికి కృషిచేసినాడు. దేశంలో వివిధ ప్రాంతాలకు రైలుమార్గాలను వేయించెను. శాంతియుత విదేశ విధానాన్ని అనుసరించి, విదేశాలలో దౌత్య సంబంధాలు మెరుగుపర్చినాడు. పారిశ్రామికాభివృద్ధి వలన మధ్య తరగతి ప్రజల నుండి మంచి ఆదరణ లభించినది. సామాన్యులతో కలసి మెలసి తిరిగెడివాడు. అందుచేత ఇతని రాచరికాన్ని 'మధ్య తరగతి రాచరికము' గా అభివర్ణించిరి. అందువలన ఇతర వర్గముల వారికి ఇతను దూరమయ్యెను. పారిశ్రామికాభివృద్ధి వలన, ఫ్రాన్సు నందు కార్మికుల సంఖ్య పెరిగెను. కార్మిక సంఘాలు ఏర్పడినాయి. కార్మికుల సంక్షేమమునకు కాని, కార్మికుల సౌకర్యముల కోసం కాని ఫిలిప్ ప్రయత్నించలేదు. పైగా కార్మికోద్యమములను అణుచుటకు అనేక చర్యలు చేపట్టెను. ఈ కాలంలో ప్రముఖ సామ్యవాదులు బయలుదేరిరి. వారిలో సాంసిమోన్, ప్రూదోన్, ఫ్యూరియె, లూయీ బ్లాంక్ ప్రసిద్ధి గాంచినవారు. వీరి సామ్యవాద బోధనల వల్ల ప్రజలు చైతన్యవంతులయిరి. ప్రభుత్వ విధానాలకు అసంతృప్తులైరి.

అదియేకాక నాటి రాజకీయ వర్గాల వారికెవరికి లూయీ ఫిలిప్ పాలన నచ్చలేదు. ప్రభు వర్గాల వారికి ధనవంతులకు సామాన్యులతో నుండుట వారికి రుచించలేదు. జాతీయవాదులకు ఫిలిప్ శాంతియుత విధానం నచ్చలేదు. కారణం నెపోలియన్ యుద్ధ విజయాలపై వారికి మోజు తగ్గలేదు. న్యాయత్వం ప్రకారం ఫ్రెంచి సింహాసనముపై ఆర్లియన్స్ వంశస్తుడైన లూయీ ఫిలిప్ కూర్చునే హక్కులేదని బూర్బన్ వంశస్తుడయిన పదో చార్లెస్ మనుమడు వాదించినాడు. గణతంత్రవాదులు దేశంలో రాచరికాన్ని కూలద్రోయాలని ప్రయత్నాలు చేయసాగిరి.

పై కారణములన్నింటిని బట్టి ప్రజలకు ప్రభుత్వముపై నానాటికి వ్యతిరేకత పెరగసాగినది. ఫిలిప్ పతనానికి అపుడపుడు వ్యతిరేకులు విందు సమావేశములు ఏర్పాటు చేసుకొనుచుండిరి. ఆ రకముగా పారిస్ నందు 1848 ఫిబ్రవరి 22న ఏర్పాటైన విందు సమావేశమును నిషేధించినది. అయినా కార్మికులు, విద్యార్థులు ప్రభుత్వ ఆజ్ఞలనుల్లంఘించి విందుకు హాజరయిరి. ఆ విందు సమావేశమును భగ్నము చేయుటకు ప్రభుత్వము పోలీస్ చర్య చేపట్టెను. పరిస్థితులను అదుపులో నుంచుటకు పోలీసులు ఆందోళనకారులపై కాల్పులు జరిపినది. పర్యవసానముగా 23 మంది మరణించిరి. 30 మంది గాయపడిరి. పారిస్ ప్రజలలో ఆవేశము కట్టలు త్రెంచుకున్నది. విప్లవ జ్వాలలు ఎగసిపడినవి. విప్లవకారులు మృతదేహాలను బండ్లపై నుంచి, కాగడాలతో పారిస్ నగర వీధులలో రాజుకు వ్యతిరేకముగా నినాదాలు చేసుకొనుచు ఊరేగించిరి. పారిస్ నందు పరిస్థితి అదుపుతప్పినది. జాతీయ దళం కూడా విప్లవకారులతో చేరినది. గత్యంతరము లేక లూయీ ఫిలిప్ రాజ్య పరిత్యాగము చేసి ఇంగ్లండ్ పారిపోయినాడు. అచట రెండు సంవత్సరముల తరువాత మరణించినాడు. అంతట విప్లవకారులు 1848లో సామ్యవాదియైన లూయీ బ్లాంక్ నాయకత్వమున ఫ్రాన్సులో రాచరికము రద్దు చేసి, గణతంత్ర రాజ్యంగా ప్రకటించిరి. ఈ విధముగా ఫ్రాన్సులో రాచరికము రద్దయి, గణతంత్ర్య వ్యవస్థ నెలకొనెను. దీనినే ఫ్రాన్సు నందు రెండవ రిపబ్లిక్ అందురు.

### 5.2.3 ప్రభావము :

1848 ఫ్రాన్సు నందు సంభవించిన విప్లవము, ఐరోపాలోని అనేక రాజ్యములలో ప్రభావము చూపినది. ఈ ప్రభావమునకు లోనైన ప్రముఖ రాజ్యములేవనగా ఆస్ట్రియా, హంగేరి, బొహిమియా, జర్మని-ప్రష్యా, ఇటలీ మొదలగునవి. ఇందు జాతీయవాదులు తిరుగుబాట్లు చేసిరి.

### 5.2.3.1 ఆస్ట్రియా :

1848లో ఆస్ట్రియా నందు రాజకీయ అశాంతి నెలకొనినది. ప్రజలు మెటర్నిక్ విధానమునకు వ్యతిరేకముగా ఆందోళన చేయుచుండిరి. ఉదారవాద నాయకుడైన కొస్సత, జిక్ అనువారు ప్రజల మద్దతు కూడగట్టుకొని, నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ ప్రాణాలకు తెగించి పోరాడినారు. ఈ తిరుగుబాటు నణుచుటకు మెటర్నిక్ పత్రికలపై, రచనలపై ఆంక్షలు విధించెను. వాక్ స్వాతంత్ర్యముపైన, సమావేశములపైన ఆంక్షలు విధించెను. అయినా తిరుగుబాట్లను అణచలేకపోయెను. ఫలితము లభించలేదు. 1848 మార్చి 12న వియన్నా విశ్వవిద్యాలయ అధ్యాపకులు ఒక హక్కుల పత్రమును సమర్పించినారు. ఆ మరుసటిరోజు మెటర్నిక్ వ్యవహార సరళికి కోపోద్రిక్తులయిన విద్యార్థులు, అధ్యాపకులు, కర్షక, కార్మిక వర్గములు, తమ హక్కుల పరిరక్షణ కోసం మెటర్నిక్ భవనము వద్దకు ఒక గొప్ప ఉద్యమాన్ని నిర్వహించిరి. అందు మెటర్నిక్ నశించాలి అని నినాదము చేసినారు. ఆ భయంకర ఉద్యమాన్ని చెల్లాచెదురు చేయుటకు సైన్యం వారిపై నిప్పులవర్షం కురిపించినది. కోపోద్రిక్తులైన ప్రజలు మెటర్నిక్ గృహాన్ని దిగ్బంధం చేసి, ధ్వంసం చేసినారు. ఈ తిరుగుబాటు నందు రక్షణ దళం కూడా కలసినదని తెలుసుకున్న మెటర్నిక్ దిక్కుతోచని పరిస్థితులలో తన పదవికి రాజీనామా చేసి, రహస్యముగా సతీసమేతంగా మారువేషంలో, ప్రజాస్వామ్య ఉదారవాదులకు నిలయమైన ఇంగ్లండ్‌లో తలదాచుకొనెను. ఇది ఐరోపాలో వాటర్లూ యుద్ధమునకు మించిన సంఘటనగా పరిగణించబడినది. మెటర్నిక్ పతనంతో, ఆస్ట్రియానందేకాక ఐరోపాలో కూడా మెటర్నిక్ యుగము ముగిసినది.

విప్లవశక్తుల శక్తిని చూసిన ఆస్ట్రియా రాజు మొదటి ఫెర్డినాండ్ భయకంపితుడై విప్లవకారులకు కొన్ని రాయితీలు ప్రకటించినాడు. ఉదార ప్రభుత్వాన్ని ఏర్పరచి, ఉదారమంత్రి వర్గాన్ని ఏర్పాటుచేసి, ప్రజలపై ఆంక్షలను రద్దుచేసి స్వేచ్ఛ, సమత్వ, స్వాతంత్ర్యములను ప్రసాదించెను.

### 5.2.3.2 హంగేరి :

1848 విప్లవము నందు కొస్యూత్ అనువాని నాయకత్వమున హంగేరి నందు చెలరేగెను. ఆస్ట్రియా పాలన నుండి హంగేరిని విముక్తము గావింపదలచెను. ఇతని ఉద్రేకపూరితమైన ప్రసంగాలు హంగేరి ప్రజలలో చైతన్యము నింపినది. హంగేరి రాజైన మొదటి ఫెర్డినాండ్ కొన్ని ఉదార సంస్కరణలు చేయుటకు అంగీకరించెను. కాని అనేకమైన జాతులు, తెగల సమ్మిళితముగా నున్న హంగేరి ప్రజలు ఒకరితోనొకరు కలహించుకొనుచుండిరి. ఇది అదనుగానెంచుకొని మెటర్నిక్ రష్యా సాయంతో తిరుగుబాటును అణచివేసెను. కొస్యూత్ దేశము విడిచి ఇంగ్లండ్‌కు పారిపోయెను.

### 5.2.3.3 బొహిమియా :

1848 విప్లవము బొహిమియా నందు కూడా ప్రబలినది. ప్రజలలో రాజకీయ అసంతృప్తి అధికముగా నుండుటతో ఆందోళనలకు పూనుకొనిరి. తిరుగుబాటుదారులు రాజ్యాంగ సంస్కరణలు కోరిరి. కాని బొహిమియాలో నున్న జర్మనులు దీనిని వ్యతిరేకించిరి. ఈ సమస్యను పరిష్కరించుటకు బొహిమియా రాజధానియైన ప్రాగ్స్ నందు ఐరోపారాజ్యాలవారు సమావేశమైరి. ఆ సమావేశంలోనికి ఆందోళన కారులు ప్రవేశించి ఆందోళన సృష్టించిరి. అందుకు బొహిమియా, ఆస్ట్రియా సైన్య సహకారంతో తిరుగుబాటును అణిచివేసెను.

### 5.2.3.4 జర్మని - ప్రష్యా :

1848 యొక్క విప్లవ ప్రభావము జర్మని ప్రష్యా దేశాలపై పడినది. జర్మనీలోనున్న చిన్న రాజ్యాలను ఐక్యపరచి, రాజ్యాంగబద్దమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయమని ఆందోళనకారులు ఆందోళన చేయసాగిరి. ఈ రాజ్యాలలోవారు ఉదార

సంస్కరణలు ప్రవేశపెట్టుటకు అంగీకరించెను. కాని బవేరియా, సాక్షని, హానోవర్, ప్రష్యాలలో రాజులు అంగీకరించలేదు. అందుకు ప్రజలు విప్లవకారులతో కలసి ఒక గొప్ప ఉద్యమాన్ని చేపట్టి రాజప్రసాదాన్ని నిర్బంధించిరి. అంతట రాజు సైనిక చర్య చేపట్టెను. అందు 200 మంది మరణించిరి. దీనికి కోపోద్రిక్తులైన ప్రజలు విధ్వంసానికి పూనుకొనిరి. ఈ ఉద్యమానికి తలొగ్గిన రాజు ఫ్రెడరిక్ విలియం ప్రష్యాలో రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినాడు.

అంతట ఉద్యమకారులు సమైక్య జర్మనీని సాధింపనెంచి 1848 లో ఫ్రాంక్ ఫర్ట్‌లో సమావేశమై జర్మనీకి నూతన రాజ్యాంగం రూపొందించి, జర్మని పాలకునిగా నాల్గవ ఫ్రెడరిక్ విలియంని రాజుగా ఎన్నుకొనిరి. అందుకు ఫ్రెడరిక్ విలియం ఇది విప్లవకారుల నిర్ణయమని తృణీకరించి పార్లమెంటును అణిచివేసెను. కాని జర్మని ఏకీకరణ జరుగవలెనని ఫ్రెడరిక్ విలియం ఆకాంక్షించెను.

### 5.2.3.5 ఇటలీ :

ఇటలీ ప్రజలలో కూడా 1848 విప్లవము యొక్క ప్రభావము చూపినది. వియన్నా కాంగ్రెస్ తీర్మానం ప్రకారం ఇటలీ అయిదు భాగాలుగా విభజింపబడినది. ఈ రాజ్యాలలో నిరంకుశ పాలనకు వ్యతిరేకముగా ఉద్యమములు వచ్చినవి. అయిదు భాగములలో ఆస్ట్రియా ఆధిపత్యము అధికముగా గలదు. ఆస్ట్రియా ఆధిపత్యము నుండి, ఇటలీని విముక్తి గావించి సమైక్యపరుచుటకు జాతీయవాదులు కృషిచేసిరి. సార్డీనియా పాలకుడైన చార్లెస్ ఆల్బర్ట్ నాయకత్వమున ఇటలీ జాతీయోద్యమములో ప్రారంభమయినది. వెనిస్, లొంబార్డీలు అల్బర్ట్‌కు బాసటగా నిలిచినవి. ఈ ఉద్యమం ద్వారా చార్లెస్ ఆల్బర్ట్‌నకు, ఆస్ట్రియన్‌లకు మధ్య జరిగిన యుద్ధంలో కస్టోజా, నొవరా అనే యుద్ధరంగాలలో ఆల్బర్ట్ పరాజయం పాలయ్యెను. అంతట మనఃస్థాపం చెందిన ఆల్బర్ట్ పదవికి రాజీనామా చేయగా అతని కుమారుడు రెండవ విక్టర్ ఇమ్మాన్యుయేల్ సార్డీనియా పాలకుడయ్యెను.

పోప్ రాజ్యంలోని రోమ్ నందు కూడా ఆందోళనలు కొనసాగినవి. వీటిని అదునుగా తీసుకొని జాతీయవాది అయిన మాజిని పోప్‌ని రోమ్ నుండి తరిమివేసి రోమ్ నందు రిపబ్లిక్‌ని స్థాపించెను. ఇటలీ రాజ్యములలో, జాతీయోద్యమములు ఇంత ఉధృతముగా సాగినను, ఆస్ట్రియా తన సైనిక శక్తితో అణిచివేసి, తన ఆధిపత్యమును కొనసాగించెను. అయినను, జాతీయ వాదశక్తులు తాత్కాలికముగా అణిచివేయబడినను మెటర్నిక్ పతనానంతరం క్రమక్రమంగా బలపడి స్వాతంత్ర్యోద్యమానికి ఏకీకరణకు దారిచూపినది.

### 5.2.3.6 డెన్మార్క్ - హాలెండ్ :

1848 ఫిబ్రవరి విప్లవమునకు ప్రభావితులైన డానిష్ ప్రజలు రాజ్యాంగబద్ధ ప్రభుత్వము కావలెనని ఆందోళన చేసిరి. అందుకు డెన్మార్క్ రాజు, వీరి కోర్కెలను మన్నించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినాడు. హాలెండ్ రాజైన రెండవ విలియం, ఉద్యమమును అణచలేకపోయినాడు. పత్రికా స్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యములను పొందుపరుస్తూ రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వాన్ని ప్రసాదించెను.

### 5.2.3.7 స్విట్జర్‌లాండ్ :

స్విట్జర్‌లాండ్ నందు గణతంత్ర్య ప్రభుత్వము నడుపబడుచున్నప్పటికి, ఆ ప్రభుత్వము ధనికులు, కేథలిక్ మతాధిపతుల ఆధిపత్యంలో నిర్వహింపబడుచున్నది. దేశభక్తులు, జాతీయవాదులు 1848 విప్లవ ప్రభావంతో స్విట్జర్‌లాండ్ నందు ఆందోళనలు చేయగా ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేయబడినది.

### 5.2.4 విప్లవ ప్రాధాన్యత :

1848 సంవత్సర విప్లవము తన ఆశయాలు అయిన జాతీయవాదము, ఉదారవాదములను సాధించుటలో విఫలమైనది. సాంప్రదాయవాదుల చేత కొన్ని ఐరోపా రాజ్యాలలో జాతీయవాదములు, ఉదారవాదములు అణిచివేయబడినవి. కాని కొన్ని రాజ్యములలో సనాతనవాదియైన మెటర్నిక్ అతని విధానము నశించినది. ఫ్రాన్సు నందు రాచరికము రద్దయి రిపబ్లిక్ ఏర్పడినది. ఐరోపాలో సాంప్రదాయవాదులు తొలుత విజయం సాధించినను, జాతీయవాదులు ఉదారవాదులు తాత్కాలికముగా అణిచివేయబడినప్పటికి విప్లవశక్తులు ఈ 1848 విప్లవంలో నిరంకుశ రాచరికమును సవాలు చేసి భయభ్రాంతులను చేసెను. ఐరోపా రాజ్యాలలో సనాతన సాంప్రదాయ విధానాన్ని కొనసాగించాలనే ఆశయంతో ఐరోపా రాజకీయములలో తిరుగులేని మెటర్నిక్, ఐరోపా సంరక్షకుడుగా నున్న మెటర్నిక్ జాతీయవాద, ఉదారవాద విధానాల శక్తిని ఎదుర్కొనలేక చివరికి రాజీనామా చేసి దేశం వదలి పారిపోయెను. దీనితో ఐరోపాలో మెటర్నిక్ యుగం అంతమయ్యెను. విప్లవజనితమైన జాతీయభావం ఇటలీ, జర్మనీలలో ఏకీకరణలకు దోహదము చేసెను. పారిశ్రామికాభివృద్ధి వలన ఫ్రాన్సు, జర్మనీ అందు కార్మిక సంఘములేర్పడెను. సామ్యవాద విధానాలకు మార్గము చూపెను. చివరికి 1848 విప్లవము పారిశ్రామిక విప్లవమునకు దారిచూపెను. కాబట్టి 1848 ఫిబ్రవరి విప్లవము ఐరోపా రాజకీయాలలో మార్పులతో పాటు భవిష్యత్ ఆర్థిక విధానంపై మార్పు తెచ్చినది.

### 5.3 నమూనా ప్రశ్నలు :

1. ఫ్రాన్స్‌లో జరిగిన జూలై 1830 విప్లవము గురించి వివరింపుము.
2. ఫ్రాన్స్‌లో 1848 విప్లవం ప్రాముఖ్యతను వివరింపుము.
3. లూయీ బ్లాంక్

### 5.4 చదువదగిన గ్రంథాలు :


1. C.J.A.H. Hayes - Modern Europe upto 1870
2. C.D. Hazan - Modern Europe upto 1945
3. D. Thomson - Europe since Napoleon
4. R. Dayal - Modern Europeon History
5. C.D.M. Ketelby - A History of Modern Times from 1789.


- శ్రీ యం.జె. జయప్రసాద్

పాఠం - 6

# పారిశ్రామిక విప్లవము - ఫలితాలు

## 6.0 లక్ష్యం :

పారిశ్రామిక విప్లవానికి గల కారణాలు, అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలలో దాని ప్రభావము గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


6.1 పరిచయం

6.2 పారిశ్రామిక విప్లవం - ఇంగ్లండు

6.3 పారిశ్రామిక విప్లవము ఇంగ్లండులో జనించుటకు కారణాలు

6.4 నూతన పరిశ్రమలు

  6.4.1 నేత పరిశ్రమ

  6.4.2 ఆవిరి యంత్రం

  6.4.3 ఇనుము - ఉక్కు పరిశ్రమ

  6.4.4 వ్యవసాయక విప్లవం

  6.4.5 రాకపోకల సౌకర్యాలు

  6.4.6 వార్తా సౌకర్యాలు

6.5 పారిశ్రామిక విప్లవ ఫలితాలు

  6.5.1 ఆర్థిక ఫలితములు

  6.5.2 సాంఘిక ఫలితములు

  6.5.3 రాజకీయ ఫలితములు

6.6 నమూనా ప్రశ్నలు

6.7 చదువదగిన గ్రంథాలు


## 6.1 పరిచయం :

'విప్లవం' అనే పదం సామాన్యంగా రాజకీయ వ్యవస్థలోని బృహత్తరమైన మార్పులకు వాడటం పరిపాటి. ఫ్రెంచి విప్లవం రష్యా విప్లవం దీనికి ఉదాహరణలు. కాని న్యాయంగా పరిశీలిస్తే ఏ వ్యవస్థలోనైనా మార్పు త్వరితగతిలో జరిగితే ఆ మార్పును కూడ విప్లవం అనవచ్చు. ఈ కోవకు చెందినదే పారిశ్రామిక విప్లవం. ప్రపంచ చరిత్రలో 18వ శతాబ్దం వరకు పెద్ద పరిశ్రమలు ఏర్పడలేదు. వస్తువుల తయారీ పూర్తిగా మానవుని శక్తిపైనే ఆధారపడి ఉండేది. కాని ఈ శతాబ్దంలో బ్రహ్మాండమైన నూతన పరికరములు కనిపెట్టబడి ఒక్కసారిగా యంత్రయుగం ఆరంభమయింది. యంత్రాల సాయంతో ఉత్పత్తి పెరిగింది. పరిశ్రమలు

విపరీతంగా అభివృద్ధి చెందాయి. ఒక్కసారి మానవశక్తి యంత్రశక్తిగా మారడంతో అనేక ఆర్థిక, సాంఘిక మార్పులు వచ్చాయి. ఈ మార్పులు క్రమంగా కాక ఒక్కసారిగా ఒకే శతాబ్దంలో రావడంతో దీనిని పారిశ్రామిక విప్లవంగా వ్యవహరిస్తారు. ఈ పారిశ్రామిక విప్లవం అనే పదమును మొదటసారిగా ఉపయోగించినవాడు ఫ్రెంచి సోషలిస్టు నాయకుడైన లూయీ బ్లాంక్. పారిశ్రామిక విప్లవమనుపేరుతో ఆర్నాల్డ్ టాయిన్‌బీ ఒక గ్రంథమును రచించి దీనిని బహుళ ప్రచారములోనికి తెచ్చెను.

## 6.2 పారిశ్రామిక విప్లవము - ఇంగ్లండు :

ఐరోపాలో రాజకీయ విప్లవములకు ఫ్రాన్స్ జన్మస్థలియైన పారిశ్రామిక విప్లవము ఇంగ్లండులో మొగ్గతొడిగి చిగురించింది. ఫ్రాన్స్ నుండి రాజకీయ విప్లవ భావములు మిగిలిన ఐరోపా దేశములకు వ్యాపించినట్లుగానే పారిశ్రామిక విప్లవము ఇంగ్లండు నుండి మిగిలిన ఐరోపా దేశములకు వ్యాపించెను.

## 6.3 పారిశ్రామిక విప్లవము ఇంగ్లండులో జనించుటకు గల కారణములు :

1) బొగ్గు ఇనుప ఖనిజములు ఇంగ్లండులో విరివిగా లభించుట
2) నేత పరిశ్రమకు అనువైన శీతోష్ణ స్థితి, జలశక్తి యుండుట.
3) ఐరోపా రాజ్యాలలో రాజకీయ సాంఘిక క్లిష్టపరిస్థితులు తరచూ సంభవించటంతో అనేక మంది పనివాండ్రు ఇంగ్లండుకు వలస వెళ్ళినారు.
4) వర్తక వ్యాపారాలలో అభివృద్ధి చెందిన ఇంగ్లండు ఆర్థికంగా పెట్టుబడులు పెట్టే పరిశ్రమలు స్థాపించటానికి నూతన పరిశోధనలు చేయటానికి వీలు కలిగింది.
5) ఇంగ్లండు వలస సామ్రాజ్యాధిపత్యం సంపాదించటంతో తమ పరిశ్రమలకు కావలసిన ముడిసరుకులను వలసల నుండి తెచ్చుకొనుటకు, తాను ఉత్పత్తి చేసిన వస్తువులను వలస రాజ్యాలలో మార్కెట్ చేసుకొనుటకు ఇంగ్లండుకే అవకాశముంది.

## 6.4 నూతన పరిశ్రమలు :

### 6.4.1 నేత పరిశ్రమ :

నేత పరిశ్రమలో మొట్టమొదట యంత్రం ప్రవేశించినది. 18వ శతాబ్దానికి పూర్వము నేత పనివారు కండెన చేతపట్టుకొని పడుగు పేకల గుండా దారాన్ని మెల్లగా లాగుతుండేవారు. కాని జాన్‌కే అనే అతడు 'తురి' అనే సాధనాన్ని కనిపెట్టడం వలన నేత పని చురుకుగా అత్యంత వేగంగా సాగునట్లు చేసెను. అందువలన నూలు ఎక్కువగా కావలసి వచ్చింది. లాంక్‌షైర్ వాస్తవ్యుడైన 'జేమ్స్ హర్ గ్రీవ్స్' 'స్పిన్నింగ్ జెన్ని' అను యంత్రమును కనిపెట్టుట వలన ఎక్కువ నూలు వడుకుటకు వీలయ్యెను. దీనితో 8 కదుళ్ళతో ఒకేసారి నూలు వడకవచ్చు. తర్వాత ఆర్క్‌రైట్ నీటి వత్తిడితో నడిచే రోలర్ల ద్వారా నూలు వడుకుటకు 'వాటర్ ఫ్రేమ్' అనే యంత్రాన్ని కనిపెట్టినాడు. ఈ రెండు యంత్రాల వలన కూడ నూలు సమస్య పరిష్కారం కాలేదు. స్పిన్నింగ్ జెన్ని ద్వారా తయారైన దారం సన్నగా ఉన్న పురి ఎక్కువగా లేనందున బలహీనంగా ఉండేది. 'వాటర్ ఫ్రేమ్' ద్వారా తయారైన దారం గట్టిగా ఉన్నా ముతకగా ఉండేది. చివరకు ఈ రెండు యంత్రాల లక్షణాలను కలిపి 'శామ్యూల్ క్రాంప్టన్' అనే యువకుడు 'స్పిన్నింగ్ మ్యూల్' అనే యంత్రాన్ని తయారుచేశాడు. తర్వాత 'కార్ట్ రైట్' మర మగ్గాన్ని సృష్టించాడు. దీని వలన ఉన్ని, నూలు పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.

### 6.4.2 ఆవిరి యంత్రం :

ఆవిరి యంత్రమును కనిపెట్టినది 'న్యూకోమెన్' యైనను దానిలోని లోపములను సవరించి ఒక నిర్దిష్టమైన ఆవిరి యంత్రమును రూపొందించినవాడు 'జేమ్స్ వాట్' (1769). జేమ్స్‌వాట్ ఆవిరి యంత్రమును ఉపయోగించుకొని 'రిచర్డ్ ట్రెవిధిక్' (1808) మొదటసారిగా ఆవిరి రైలు ఇంజను కనిపెట్టెను. దీనినే 1825లో 'జార్జి స్టీవెన్‌సన్' ఆధునిక రైలు ఇంజనుగా రూపొందించెను. అచిరకాలములో ఇంగ్లండు దేశమంతటా రైలు మార్గములతో నిండెను. ఆవిరిశక్తి సహాయంతో 'రాబర్ట్ ఫుల్ టన్', 'నికొలస్ రూజ్‌వెల్ట్' అనువారలు ఆవిరి ఓడలను నిర్మించిరి. ఇట్టి ఆవిరిఓడ 1838 లో ప్రధమముగా 'సవన్నా' నుండి బయలుదేరి అట్లాంటిక్‌ను 14 రోజులలో దాటి 'లివర్‌పూల్' ను చేరెను. ఆవిరిశక్తి పరిశ్రమల యొక్క రూపాన్నే మార్చింది.

### 6.4.3 ఇనుము - ఉక్కు పరిశ్రమ :

యంత్రములు రాకపూర్వం గ్రామంలోని కమ్మరి కర్ర బొగ్గు వేడితో ఇనుమును కరిగించేవాడు. 18వ శతాబ్దంలో 'హెన్రీ కార్ట్' ఇనుమును కరిగించే పద్ధతిని కనిపెట్టినాడు. నేలబొగ్గును భూమి నుండి వెలికితీయుట ప్రమాద భరితము అయ్యెను. అట్టి సమయమున 'హంఫ్రిడేవి' సేఫ్టీలాంప్‌ను కనుగొనటంతో ఆ ప్రమాదము తొలగెను. దీనికితోడు ఉక్కు తయారుచేయు కొలిమిని కనుగొనుట ఉక్కు పరిశ్రమాభివృద్ధికి నాంది పలికెను. 'హెన్రీ బెస్మర్' ఉక్కు పోత పోయు పద్ధతిని కనుగొనుటతో ఉక్కు పరిశ్రమ ఎనలేని రీతిలో అభివృద్ధి చెందెను. ఇట్టి అభివృద్ధి వలన ఇంగ్లండు నందు అనేక ఇనుము - ఉక్కు కర్మాగారములు స్థాపించబడెను. కనుకనే పారిశ్రామిక యుగానంతరమును ఇనుము ఉక్కు యుగమని పరిగణించిరి.

### 6.4.4 వ్యవసాయక విప్లవం :

18వ శతాబ్దం నాటికి ఐరోపాలో భూస్వామ్య పద్ధతి అమలులో ఉండేది. భూమి అంతా ఒకచోట ఉన్నట్లయితే భూస్వాములు అధిక బలవంతులై రాజును ధిక్కరిస్తారని భూమిని ముక్కలుగా సామంత భూములుగా చీల్చి అనేకచోట్ల ఇచ్చేవారు. భూస్వామ్య వ్యవస్థ క్షీణించి పంటపొలం అంతా రైతుల పరమయ్యెను. పంట మార్పిడి పద్ధతి ననుసరించి రైతులు విశేష లాభాలు ఆర్జించారు. దీనినే వ్యవసాయక విప్లవంగా భావించారంటే ఐరోపాలో దాని ప్రభావమెంతగా ఉండేదో మనం ఊహించుకోవచ్చు. రాను రాను వ్యవసాయంలో కూడ యంత్రాలు వాడకం బాగా పెరిగింది. నేలను చదును చేయటం మొదలు ధాన్యం నిల్వపోసుకునే వరకు అన్ని ప్రక్రియలు యంత్ర సహాయంతోనే జరిగేటంతగా పురోగతి విస్తరించింది.

### 6.4.5 రాకపోకలు సౌకర్యాలు :

పారిశ్రామిక విప్లవం ఫలితంగా రవాణా సౌకర్యాలు కూడ అభివృద్ధి చెందాయి. రైళ్ళు, లారీలు లేని ఆ రోజుల్లో సాధారణంగా సరుకులను గుర్రపు బగ్గీల ద్వారా నాటు రోడ్లపై రవాణా చేసేవారు. 1711 లో స్కాటిష్ ఇంజనీర్ అయిన 'జాన్ మెక్‌డమ్' కంకరరోడ్లను నిర్మించే పద్ధతిని కనిపెట్టాడు. దీనినే మెక్‌డమ్ పద్ధతి అంటారు. వీనితోపాటు మంచికాలువలు కూడ తవ్వారు. వీని వలన ఇంగ్లండులో రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందాయి.

### 6.4.6 వార్తా సౌకర్యాలు :

1844 'శామ్యూల్ మోర్స్' టెలిగ్రాఫ్‌ను 1876లో 'అలెగ్జాండర్ భెల్' టెలిఫోన్‌ను కనిపెట్టాడు. భౌతికశాస్త్ర జ్ఞానం, సాంకేతిక విజ్ఞానం పెరిగిన కొద్దీ యంత్ర నిర్మాణ ప్రగతి ఊహించలేనన్ని రంగాలకు పాకింది. విద్యుచ్ఛక్తి, రేడియో, టెలివిజన్, అణుశక్తి మొదలైన నూతన పరిశోధనల ద్వారా ప్రపంచానికి ఈ రంగంలో సాటిలేని సేవ జరుగుతూనే ఉంది.

ఇట్లా ఇంగ్లండులో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం అనతికాలంలోనే జర్మనీ, రష్యా, అమెరికా, జపాన్ మొ॥లగు దేశములకు వ్యాపించెను. ఇండియా మొదలైన దేశాలు కూడ పారిశ్రామిక పంథాన పురోగమించ ప్రయత్నిస్తున్నాయి.

## 6.5 పారిశ్రామిక విప్లవ ఫలితములు :

పారిశ్రామిక విప్లవము ఐరోపా చరిత్ర యందే గాక విశ్వమానవ చరిత్ర యందు సైతము గణనీయమైనది. ఈ విప్లవము ప్రపంచ ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగములలో గొప్ప మార్పులు చేసెను. ఈ విప్లవము వలన మానవజాతికి అనంత సౌఖ్యములు లభించుటయేగాక అనేక క్లిష్టమైన సమస్యలు కూడ సృష్టించెను. ఈ విప్లవ ఫలితములను మూడు భాగములుగ విభజించవచ్చును.

### 6.5.1 ఆర్థిక ఫలితములు :

1) యాంత్రిక శక్తితో వస్తువుల ఉత్పత్తి ఊహించలేనంతగా పెరిగింది. దీనివలన వస్తువుల ధరలు తగ్గి ఐరోపాలో వినిమయం పెరిగింది. ఐరోపాలో ఉత్పత్తి అయిన వాటిలో మిగులు సరుకు అమ్మడానికి ఖండాంతర వ్యాపారం చేయవలసి వచ్చెను. ఇట్లాంటి వ్యాపారం క్రమంగా వలసరాజ్య స్థాపనకు దారితీసింది. వలసరాజ్య విధానం ప్రబలి సామ్రాజ్య వాదంగా తయారై అనేక యుద్ధాలకు దారితీసింది.
2) పారిశ్రామిక రంగమునకు ముడిసరుకులు అవసరమగుట వలన వ్యవసాయము, గొర్రెల పెంపకము అభివృద్ధి చెందెను.
3) పరిశ్రమల స్థాపనకు అపారధనం అవసరమగుట వలన ఐరోపాలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఈ విప్లవం దోహదం చేసెను.
4) పెట్టుబడిదారులు అధిక లాభములు ఆశించి జాతీయ స్వయం సమృద్ధి విధానమునకు స్వస్తి చెప్పి దేశీయ, అంతర్జాతీయ స్వేచ్ఛా వ్యాపారం కొనసాగించిరి.

### 6.5.2 సాంఘిక ఫలితములు :

పారిశ్రామిక విప్లవం గొప్ప సాంఘిక పరిణామాలకు కారణమయింది. పెద్ద పరిశ్రమాగారాలు వెలిసి వాటి చుట్టూ పెద్ద నగరాలు ఏర్పడ్డాయి. ఈ నగరాలలో ప్రజలు రెండు వర్గాలుగా ఉండేవారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వడ్డీ వ్యాపారస్తులు కలసి ఒక వర్గం. వీరినే బూర్జువాలు అంటారు. మిల్లులలో, గనులలో పనిచేసే కార్మికులు రెండో వర్గం. దీనిని 'ప్రొలిటేరియట్' అంటారు. వీరిద్దరి కృషి వల్లనే రైల్వేలు, ఓడలు, పోస్టు, టెలిగ్రాఫ్ వంటి సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. అనేక నూతన వనరులతోబాటు ఈ సాంఘిక పరిణామం నూతన సమస్యలను కూడ తెచ్చిపెట్టింది. చేతి పరిశ్రమలు నశించి శ్రామికులు అనేకులు నిరుద్యోగులై బాధలుపడ్డారు. పాలుగారే పసికందులు, స్త్రీలు దుర్భర పరిస్థితులలో కర్మాగారాల్లో ఊడిగం చేసేవారు. సహింపశక్యం గాని మురికివాడల్లో జీవితాలు వెళ్ళబోయడం ఇప్పటికీ జరుగుతూనే ఉంది. పారిశ్రామిక విప్లవం వలన ఏ కొద్ది మందో కోటీశ్వరులైనా అధికసంఖ్యలో ప్రజలు అణగారి పోవడం వలన వర్గపోరాటం తలెత్తింది. కార్మికులు తామున్న పరిస్థితి నుండి బయటపడటానికి ప్రయత్నించసాగారు. ఇట్టి సాంఘిక దురాచారాలను నివృత్తి చేయుటకు అనేకమంది మానవతావాదులు, సౌమ్యవాదులు అనేక ఉద్యమాలు సాగించారు. ఉదా : జాన్ వెస్లీ మెథడిస్టు ఉద్యమమును సాగించెను. లార్డ్ సాఫ్ట్ బరీ బాలురు ఫ్యాక్టరీ యందు పనిచేయుటను తీవ్రంగా ప్రతిఘటించెను. రాబర్ట్ ఓవెన్ కార్మికులలో మానసిక చైతన్యమును కలిగించి కార్మిక సంఘముల నేర్పరచి వారి సమస్యలను పరిష్కరించుటలో సమైక్యంగా పోరాడుటకు దోహదం చేసెను.

### 6.5.3 రాజకీయ ఫలితములు :

సంఘమున కార్మికవర్గం ఏర్పడటంతో వారు తమ సమస్యలను పరిష్కరించుకొనుటకు రాజకీయ అధికారం కైవశం చేసుకొనదలచిరి. రాబర్ట్ ఓవెన్, సాంసిమోన్ ప్యూడాన్ మొదలగు సామ్యవాదుల సిద్ధాంతములను క్షుణ్ణంగా పరిశీలించి సామ్యవాదాన్ని శాస్త్రీయ పద్ధతిలో కమ్యూనిజంగా రూపొందించిన తత్వవేత్త కారల్ మార్క్స్. ఈతడు జర్మన్ యూదుల కుటుంబంలో 1818లో జన్మించాడు. తన మిత్రుడైన ఏంజల్‌తో కలసి 1848 లో కమ్యూనిస్టు ప్రకాశన పత్రము (Communist Manifesto) అనే ప్రసిద్ధ గ్రంథం రచించాడు. ఇందులో నాలుగు భాగాలున్నాయి. ఈ గ్రంథమందు మార్క్స్ సంఘర్షణ అనివార్యమని, ఈ సంఘర్షణలో అంతిమ విజయం కార్మికులదేనని, పెట్టుబడిదారుల పతనం తప్పదని, అందుకు విప్లవ విధానము అనగా బలప్రయోగమును అనుసరించవలెనని ప్రవచించెను. విప్లవము వలన కార్మికులు పోగొట్టుకొనునది దాస్య శృంఖలములు తప్ప మరేమికాదని వారు విశ్వమంతటిని జయింప వలసియున్నది గనుక 'ప్రపంచ కార్మికులారా ఏకం కండు' అని ప్రభోదించెను. 1848 ఫ్రాన్స్ విప్లవము నందు కార్మికులు పాల్గొని విజేతలైరి. 1917 కమ్యూనిస్టు విప్లవము కూడ వీరి సిద్ధాంత ఫలితమే.

పారిశ్రామిక విప్లవం ఒకవైపు కమ్యూనిజానికి పునాదులు వేస్తూ పెట్టుబడిదారి విధానాన్ని బలపరచింది. ఈ పదానికి ఇంతవరకు సంతృప్తికరమైన నిర్వచనం వెలువడలేదు. కాని స్థూలంగా చెప్పవలెనంటే ధనమును పెట్టుబడి పెట్టి స్వేచ్ఛగా వ్యాపారం సాగించే పద్ధతిక పెట్టుబడిదారి విధానం అనవచ్చు. ఈ రెండు సిద్ధాంతములు స్థిరపడుతున్న సమయంలో 19వ శతాబ్దంలో జాతీయ భావం పెరగజొచ్చింది. జాతి, భాష, నైసర్గిక పరిస్థితులు, సంస్కృతులు ఆధారంగా నూతన దేశాలు రూపురేఖలు సంతరించుకోవడం మొదలుపెట్టాయి. అటువంటి వాటిలో ఇటలీ, జర్మనీ అగ్రగాములు.

## 6.6 నమూనా ప్రశ్నలు :

1. పారిశ్రామిక విప్లవానికి గల కారణాలు తెల్పి, అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలలో దాని ప్రభావమును తెల్పుము.

## 6.7 చదువదగిన గ్రంథాలు :


1. Hayes - Modern Europe
2. C.D. Hazan - Modern Europe upto 1945.
3. Raghubir Dayal - Modern European History
4. C.D. M. Ketelby - A History of Modern Times from 1789.


- శ్రీమతి యం. శివకుమారి

పాఠం - 7

# ఫ్రాన్స్ రెండో రిపబ్లిక్ - మూడవ నెపోలియన్

# ఫ్రాన్స్ మూడో రిపబ్లిక్

**7.0 లక్ష్యం :**

ఫ్రాన్స్ రెండో రిపబ్లిక్, మూడో నెపోలియన్ ఆంతరంగిక, విదేశాంగ విధానము, ఫ్రాన్స్ మూడో రిపబ్లిక్ గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయసూచిక :**


**7.1 ఫ్రాన్స్ రెండవ రిపబ్లిక్ - మూడో నెపోలియన్**

**7.1.1 పరిచయం**

**7.1.2 10వ చార్లెస్, 1824-1830**

**7.1.3 1830 జూలై విప్లవ ఫలితాలు**

**7.1.4 లూయీఫిలిప్, 1830-1848**

**7.1.5 ఫ్రెంచి రెండవ రిపబ్లిక్ పరిపాలన, 1848-1852**

**7.1.6 నూతన రాజ్యాంగము, 1848**

**7.1.7 మూడవ నెపోలియన్ 1808-1873**

**7.1.7.1 అధ్యక్షునిగా లూయీ నెపోలియన్ - 1848-1852**

**7.1.7.2 చక్రవర్తిగా మూడవ నెపోలియన్ - 1852-1870**

**7.1.7.2.1 ఆంతరంగిక విధానము**

**7.1.7.2.2 విదేశాంగ విధానము**

**7.1.7.2.2.1 వలసరాజ్యస్థాపన**

**7.1.7.2.2.2 రష్యాతో సంబంధాలు - క్రిమియా యుద్ధం - 1854-56**

**7.1.7.2.2.3 ఇటలీతో సంబంధాలు**

**7.1.7.2.2.4 రుమేనియా సంబంధాలు**

**7.1.7.2.2.5 పోలండుతో సంబంధాలు**

**7.1.7.2.2.6 మెక్సికోతో సంబంధాలు**

**7.1.7.2.2.7 జర్మనీతో సంబంధాలు**

**7.1.7.2.2.8 ఫ్రాన్స్ - ప్రష్యా యుద్ధము - 1870**

**7.1.7.2.3 ఘనత**

## 7.1 ఫ్రాన్స్ రెండవ రిపబ్లిక్ - 3వ నెపోలియన్ :

### 7.1.1 పరిచయం :

నెపోలియన్ పతనానంతరం, ఫ్రాన్స్ దేశ చరిత్రలో అనేక నూతన సంఘటనలు చోటు చేసుకొన్నాయి. నెపోలియన్ పతనానంతరం ఏర్పడ్డ వియన్నా కాంగ్రెస్ న్యాయత్వ సిద్ధాంతం ప్రకారం ఫ్రెంచ్ సింహాసనాన్ని బోర్బన్ వంశీయులకే హస్తగతం చేసింది. బోర్బన్ వంశానికి చెందిన 18వ లూయి (1815-1824) ఫ్రెంచి చక్రవర్తిగా అధికారాన్ని స్వీకరించాడు. ఇతడు 16వ లూయీ సోదరుడు. నెపోలియన్ కాలంలో ఇతను ఇంగ్లండులోని ఒక మారుమూల గ్రామంలో నివశించినాడు. 18వ లూయీని ఫ్రాన్స్ రాజుగా ప్రకటించగానే ఫ్రాన్స్ వచ్చి సింహాసనాన్ని అధిష్ఠించినాడు. ఫ్రాన్స్‌ను ప్రజాభీష్టం ప్రకారమే పరిపాలించెదనని ప్రకటించినాడు. దానికి అనుగుణంగానే వివిధ మార్గాలు వివిధ మతాల మధ్య సామరస్యం కుదుర్చటానికి ప్రయత్నం చేసినాడు. కాని ఫ్రెంచి విధాన సభలో రాచరిక వర్గం ప్రాధాన్యత పెరిగింది. నిరంకుశ రాజరిక వ్యవస్థను పునరుద్ధరించటమే వీరి ధ్యేయం. వీరి ప్రభావానికి లోనైన 18వ లూయీ ఫ్రెంచి విప్లవ పతాకమైన 3 రంగుల జెండాను రద్దు చేసి దాని స్థానంలో బూర్బన్ వంశ జెండా అయిన రోజా పువ్వుల తెల్ల జెండాను ప్రతిష్ఠించినాడు. పత్రికలపై ఆంక్షలు విధించి నిరంకుశత్వంగా పరిపాలించెను. ఐరోపారాజ్యబద్ధకూటమి ఆజ్ఞప్రకారం స్పెయిన్‌పై దాడి చేసి అపూర్వ విజయంను సాధించెను. స్పెయిన్ విజయంతో ఫ్రాన్స్‌లో తన అధికారాన్ని సుస్థిరం చేసికొన్న 18వ లూయీ క్రీ.శ. 1824లో మరణించెను.

### 7.1.2 10వ చార్లెస్ 1824-1830 :

18వ లూయీ మరణానంతరం అతని తమ్ముడు 10వ చార్లెస్ ఫ్రెంచి సింహాసనం అధిష్ఠించెను. ఇతను నూటికి నూరుపాళ్ళు సనాతనవాది, నిరంకుశుడు. ఇతడు 1789 నుండి తానేమీ మారలేదని సగర్వంగా చెప్పుకున్నాడు. ఇతని పరిపాలనలో భాగ్యవంతులకు మాత్రమే స్థానం కల్పించాడు. పత్రికా స్వాతంత్ర్యం రద్దు చేశాడు. విప్లవ కాలంలో ఫ్రాన్స్ వదలివెళ్ళి పోయినవారికి నష్టపరిహారం కూడా ప్రకటించినాడు. ఈవిధమైన చర్యల వలన 10వ చార్లెస్ ప్రజాభిమానాన్ని కోల్పోయినాడు. 1827 ఎన్నికలలో రాచరికవాదులు ఓడిపోయి ఉదారవాదులు అత్యధిక సంఖ్యా బలంతో గెలుపొందినారు. అయినప్పటికి 10వ చార్లెస్ పార్లమెంటుకు వ్యతిరేకంగా పాలిగ్నాక్ అను సనాతనవాదిని ప్రధాన మంత్రిగా నియమించినాడు. పాలిగ్నాక్ ప్రోత్సాహంతో 10వ చార్లెస్ విప్లవ శక్తులను అణచుటకు 1830 జూలై 26న నాలుగు చట్టములు జారీచేసెను. ఈ శాసనముల వలన నూతనంగా ఎన్నుకొన్న విధానసభ సమావేశం కాకపూర్వమే రద్దయినది. విధాన సభ పదవీకాలం 7 సం॥ల నుండి 5 సం॥లకు తగ్గించబడినది. ఈ శాసనములు జారీచేసిన రోజునే పారిస్‌లో విప్లవం ప్రారంభమయినది. పత్రికా రచయితలు తమ రచనల ద్వారా ప్రజలను రెచ్చగొట్టారు. జాతీయ రక్షణదళం విప్లవకారులతో చేతులు కలిపినది. పారిస్ నగర వీధులలో 3 రోజులు భయంకర పోరాటం జరిగినది. దీనినే 1830 జూలై విప్లవం అందురు. ఈ విప్లవం అణుచుటలో విఫలుడైన 10వ చార్లెస్ సింహాసనం వదిలి ఇంగ్లండు పారిపోయెను. ఫ్రెంచి ప్రజలు ఆర్లియన్స్ వంశానికి చెందిన లూయీ ఫిలిప్‌ను 1830లో తమ చక్రవర్తిగా నియమించుకొన్నారు.

### 7.1.3 1830 జూలై విప్లవ ఫలితాలు :

1) ఫ్రాన్స్‌లో బోర్బన్ వంశం రద్దయినది.
2) రాజు దైవాంశ సంభూతుడనే సిద్ధాంతం న్యాయబద్ధ రాచరిక సిద్ధాంతం పరాజయం పొందాయి.
3) గులాబి పువ్వుల తెల్ల జెండా పోయి మూడురంగుల విప్లవ జెండా ప్రతిష్ఠించుటమైనది.
4) 'ఫ్రాన్స్ తుమ్మితే ఐరోపాకు జలుబు చేస్తుంది' అనే సూక్తి ప్రకారం జూలై విప్లవ విజయధ్వానాలు ఐరోపా మొత్తం మారుమోగాయి.

### 7.1.4 లూయీ ఫిలిప్ 1830-1848 :

చార్లెస్ పదవీ విరమణ చేయటంతో ఆర్లియన్స్ వంశానికి చెందిన లూయీ ఫిలిప్ ఫ్రెంచి సింహాసనంను అధిష్టించెను. ఇతను గొప్ప ఉదారవాది. పత్రికలపైనున్న ఆంక్షలు రద్దు చేసెను. ప్రజాస్వామ్యవాదిగా ఓటింగు హక్కును విస్తృతపరచెను. ఫ్రాన్స్ దేశాభివృద్ధికి విశిష్టమైన కృషి చేసెను. ఇంగ్లండు, అమెరికా దేశాలు పర్యటించి పారిశ్రామిక ప్రగతిని గమనించాడు. ఇంగ్లండు నుండి యంత్రాలను దిగుమతి చేసుకుని అనేక కర్మాగారాలు నిర్మించాడు. రవాణా సౌకర్యాలు అభివృద్ధి పరచినాడు. బెల్జియం, స్పెయిన్, వర్డింబర్గ్ రాజ్యాలతో వివాహ సంబంధాలు ఏర్పరచుకొని తన రాజకుటుంబ ప్రతిష్టను పెంచుకొన్నాడు.

లూయీ ఫిలిప్ మధ్యతరగతి వారిని బాగా ఆదరించి సామాన్యులతో కలిసిమెలసి తిరిగెడివాడు. తన పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలకే పంపేవాడు. కనుకనే అతని రాచరికాన్ని 'మధ్యతరగతి రాచరికం' అని అతనిని 'పేదరాజు' అని పిలిచెడివారు. ఫ్రెంచి ప్రజల కోరిక ప్రకారం నెపోలియన్ అస్థికలను సెయింట్ హెలీనా దీవి నుండి పారిస్‌కు తెప్పించి పారిస్‌లో ఖననం చేసి అచట ఒక టూంబును నిర్మించినాడు. ఫ్రెంచి ప్రజలతో బాటు నెపోలియన్‌కు శ్రద్ధాంజలి ఘటించి ప్రజల మన్ననలకు పాత్రుడైనాడు.

ఫ్రాన్స్ దేశ ఔన్నత్యమునకు ఇంతగా కృషిచేసిన ఫిలిప్ తాను స్థాపించిన పరిశ్రమల వలన ఏర్పడిన కార్మిక వర్గ శ్రేయస్సుకు కృషి చేయలేదు. సామ్యవాద నాయకుడు లూయీ బ్లాంక్ దేశమంతట సామ్యవాద సిద్ధాంతములను ప్రచారం చేసెను. ఫిలిప్ విధానాలు కూడ ఫ్రెంచి వారిని తృప్తి పరచలేదు. వియన్నా సమావేశ నిర్ణయకర్తలు లూయీ ఫిలిప్ ఫ్రెంచి సింహాసనం అధిష్టించుట అన్యాయమని తలచిరి. ప్రజాస్వామ్యవాదులు ఇతనిని ప్రజాస్వామ్య వ్యతిరేకి అని భావించిరి. సామ్యవాదులు ఇతనిని పెట్టుబడిదారి వ్యవస్థకు నాయకుడని వర్ణించినారు. ఈవిధంగా ప్రజలలో అసంతృప్తి చెలరేగి అనేక తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాట్లను అణచటానికి ఫిలిప్ తన ప్రధానమంత్రి గీజో సహాయంతో అనేక శాసనములు చేసెను. సభలు, సమావేశములు, విందులు నిషేధించెను. ఈ నిషేధ ఉత్తర్వులను వ్యతిరేకించి 1848 ఫిబ్రవరి 22 వ తేదీన ఏర్పాటైన విందుకు కార్మికులు, విద్యార్థులు హాజరైనారు. వీరిపై ప్రభుత్వం కాల్పులు జరిపించింది. ఈ మరణించిన వారిని పారిస్ నగర వీధులలో ఊరేగించటంతో కోపోద్రిక్తులైన ప్రజలు ఫిలిప్‌ను కూడ చార్లెస్ వద్దకు పంపవలెనని నినాదాలు చేసిరి. విప్లవకారులతో రక్షణదళం కూడ చేతులు కలపటంతో భయపడ్డ ఫిలిప్ సింహాసనం వదలి కుటుంబంతో సహా ఇంగ్లండు పారిపోయెను. దీనినే 1848 విప్లవం అందురు.

ఈ విప్లవ ఫలితంగా ఫ్రాన్స్ నందు రాచరిక వ్యవస్థ రద్దయి 1848 ఫిబ్రవరి 28వ తేదీన ఫ్రాన్స్ రెండవ రిపబ్లిక్‌గా రూపొందించబడింది.

### 7.1.5 ఫ్రెంచి రెండవ రిపబ్లిక్ పరిపాలన, 1848-1852 :

క్రీ.శ. 1848 విప్లవంలో లూయీ ఫిలిప్ రాజ్యభ్రష్టత పొందటంతో ఫ్రాన్స్ రెండవ రిపబ్లిక్‌గా రూపొందినది. రిపబ్లికన్ల సామ్యవాదుల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినది. ఈ తాత్కాలిక ప్రభుత్వానికి అధ్యక్షుడుగా కాథలిక్ నాయకుడు లామార్టైన్ ఎన్నికయినాడు, సోషలిస్టు నాయకుడైన లూయీ బ్లాంక్ కార్మికుడైన ఆల్బర్టులు ఈ ప్రభుత్వంలో చేరారు. సామ్యవాద నాయకుడు లూయీ బ్లాంక్ ప్రభావంతో ఈ తాత్కాలిక ప్రభుత్వం పెక్కు విప్లవాత్మక సంస్కరణలు చేసింది. సార్వత్రిక ఓటింగు విధానాన్ని ప్రవేశపెట్టడం, జాతీయ సైన్యంలో అన్ని వర్గాల వారికి ప్రవేశ అర్హత కల్పించటం కార్మికుల శ్రేయస్సుకై అనేక సంస్కరణలు చేసెను. వారి పనిగంటలు, వేతనములు నిర్ణయించెను. సహకార సంఘములను నెలకొల్పెను. దేశమంతట జాతీయ కార్ఖానాలు స్థాపించబడెను. మొదటి మూడు మాసములు ప్రభుత్వం సామ్యవాదుల చేతులలో ఉంది.

క్రీ.శ. 1848 ఏప్రియల్ 23, 24 తేదీలలో సాధారణ ఎన్నికలు జరిగెను. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోబడ్డ కొత్త శాసనసభ 1848 మే 4 వ తేదీన సమావేశమైనది. ఎన్నికైన వారిలో అధిక సంఖ్యాకులు మితవాదులు. మరల లామార్టైన్ పాలనా బాధ్యతలను స్వీకరించెను. లూయీ బ్లాంక్, ఆల్బర్టులకు నూతన మంత్రి వర్గం నందు స్థానం లేదు. జాతీయ శాసనసభ తన దృష్టిని మొదట జాతీయ కార్ఖానాలపై కేంద్రీకరించింది. ఈ కార్ఖానాలు దుబారాకు నిలయమైనాయని కార్మికులకు ఇచ్చే ద్రవ్యసహాయాన్ని ఆపివేసినది. ఇది సహించని కార్మికులు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు అణచటానికి 'కావిగ్నే' అనే సేనానికి ప్రభుత్వం సర్వాధికారాలు ఇచ్చినది. అతను అతి క్రూరంగా ఈ తిరుగుబాటును అణచివేసినాడు. 4 వేల మంది తిరుగుబాటుదారులకు ద్వీపాంతరవాస శిక్ష విధించబడెను. లూయీ బ్లాంక్ ఇంగ్లండు పారిపోగా, ప్రొదన్ బందీ అయ్యెను. దీనితో సామ్యవాదుల బెడద తొలగిపోయి ప్రశాంత వాతావరణంలో జాతీయ శాసనసభ నూతన రాజ్యాంగమును తయారుచేసెను.

### 7.1.6 నూతన రాజ్యాంగము - 1848 :

నూతన రాజ్యాంగము ప్రకారం దేశాధ్యక్షుడు వయోజనులైన పురుషులందరిచే ఎన్నుకోబడును. ఇతని పదవీకాలం నాలుగు సంవత్సరాలు. ఇతను తిరిగి ఎన్నికగుటకు వీలులేదు. 750 సభ్యులు కల్గిన ఏకశాసనసభ ఎన్నుకోబడుతుంది. వీరి పదవీ కాలం 3 సంవత్సరాలు. కార్యనిర్వాహక అధికారం అధ్యక్షునికే చెందుతుంది. అధ్యక్షుడు శాసన సభ నుండి మంత్రులను నియమించును. వీరు శాసనసభకు బాధ్యత వహించవలెను. శాసనసభ చేసిన నిర్ణయాలను రద్దు చేసే అధికారం అధ్యక్షునకు లేదు.

### 7.1.7 3వ నెపోలియన్ క్రీ.శ. 1808-1873 :

నూతన రాజ్యాంగం ప్రకారం ఫ్రాన్సులో 1848 డిసెంబరులో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో లూయీ నెపోలియన్ బోనాపార్టీ అధ్యక్షుడుగా ఎన్నికయినాడు. ఇతను షుమారు 2 దశాబ్దాల పాటు ఫ్రాన్సు దేశ చరిత్రలోనేగాక మొత్తం ఐరోపా చరిత్రలోనే ప్రముఖపాత్ర వహించినాడు. లూయీ నెపోలియన్ మొదటి నెపోలియన్ సోదరుడైన లూయీ బోనాపార్టి కుమారుడు. ఇతను 1808 లో పారిస్ నందు జన్మించెను. క్రీ.శ. 1815లో ఫ్రాన్సులో బోర్బన్ వంశ పునఃప్రతిష్ఠాపన జరిగిన సందర్భంలో దేశబహిష్కృతులలో ఒకడై తన తల్లితో స్విట్జర్లాండ్ వెళ్ళవలసి వచ్చినది. అపుడు అతని వయస్సు ఏడు సంవత్సరములు. అచటనే సైనికవిద్యనభ్యసించి 1830 ఉదారవాద తిరుగుబాట్లు కాలంలో ఫ్రాన్సు రావాలని ప్రయత్నించి విఫలుడైనాడు. 1831లో ఇటలీలోని రహస్య విప్లవ సంఘమైన కార్బనరీలో చేరి పోప్‌పై తిరుగుబాటులో పాల్గొని బందీ అయి తల్లి జోక్యంతో నిర్బంధం నుండి విడుదల అయ్యెను. ఆ తరువాత బోనాపార్టి వంశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపచేయటానికి 'నెపోలియన్ భావములు' అను గ్రంథమును రచించినాడు. ఈ గ్రంథము నందు నెపోలియన్ పరిపాలనా కాలాన్ని అతి సుందరంగా వర్ణించుటయే కాకుండా తన రాజకీయ భావములను కూడ వెల్లడించినాడు. లూయీ ఫిలిప్ కాలంలో ప్రజలు మొదటి నెపోలియన్‌ను ఒక యుగ పురుషుడుగా ఆరాధించసాగారు. ఈ ప్రజాభిప్రాయాన్ని గమనించిన లూయీ నెపోలియన్ ఫ్రెంచి రాజ్యాధికారాన్ని కైవశం చేసుకోవటానికి ప్రయత్నించి విఫలుడైనాడు. చివరకు 1848 విప్లవమున లూయీ ఫిలిప్ పదవీ భ్రష్టుడు కావటంతో ఫ్రాన్సు రెండవ రిపబ్లిక్‌గా అవతరించినది. ఇది లూయీ నెపోలియన్‌కు మంచి అవకాశమిచ్చింది. నూతన రాజ్యాంగం ప్రకారం జరిగిన ఎన్నికలలో లూయీ నెపోలియన్ ఫ్రాన్సు రెండవ రిపబ్లిక్ అధ్యక్షుడుగా ఎన్నికయినాడు.

### 7.1.7.1 అధ్యక్షునిగా లూయీ నెపోలియన్ 1848-1852 :

లూయీ నెపోలియన్ ఫ్రాన్సు దేశ అధ్యక్షుడుగా 1848 నుండి 1852 వరకు తన అధికారమును వ్యక్తిగత పలుకుబడిని పెంపొందించుకోవటానికి ప్రయత్నించాడు. దేశములోని అన్ని వర్గాల మద్దతు సంపాదించటానికి తీవ్ర ప్రయత్నం చేశాడు.

మితవాదులు అతివాదుల మధ్య ఉదారవాదులు, సనాతనుల మధ్య తటస్థ వైఖరి అవలంభించాడు. కార్మికుల సౌకర్యార్థం అనేక సంస్కరణలు చేసినాడు. కాథలిక్కుల మద్దతు కోసం పోప్ సహాయార్థం ఫ్రెంచి సైన్యాన్ని పంపినాడు. క్రీ.శ. 1848 లో ఎన్నికైన శాసనసభ మితవాదుల ఆధిక్యతతో కార్మికుల ఓటింగు హక్కును పరిమితం చేయటానికి శాసనం చేసింది. ఈ శాసనం ప్రకారం ఒకేచోట 3సం॥లు స్థిరనివాసం లేని పన్నులు చెల్లించని వారికి ఓటు హక్కు రద్దు చేయబడినది. దీనితో 30 లక్షల పనివాండ్రు తమ ఓటు హక్కు కోల్పోయినారు. ఈ శాసనంకు వ్యతిరేకంగా వివిధ నగరాలలో ప్రదర్శనలు జరిగాయి. లూయీ నెపోలియన్ ఈ శాసనమును రద్దుచేయమని శాసనసభను హెచ్చరించెను. లూయీ నెపోలియన్ హెచ్చరికను శాసనసభ తిరస్కరించటంతో 1851లో శాసనసభను రద్దు చేసి సార్వత్రిక ఓటింగును ప్రవేశపెట్టి తాత్కాలిక నియంతృత్వమును స్థాపించెను. తాను ఊహించినట్లుగానే ఫ్రెంచి ప్రజలు తనను సమర్థించినారు. తన సైనిక సహాయంతో, రహస్య బలగంతో వ్యతిరేకులను ఏరిపారవేసినాడు. ఇటువంటి పరిస్థితులలో ఫ్రెంచి ప్రజలు కొత్త రాజ్యాంగమును తయారుచేసే అధికారం లూయీ నెపోలియన్‌కు ఇచ్చారు.

క్రీ.శ. 1852 జనవరి 14 న నూతన రాజ్యాంగం ప్రకటించబడింది. దీని ప్రకారం శాసనసభ పూర్వం వలె ఎన్నిక అవుతుంది. అధ్యక్షుని పదవీకాలం 10సం॥లకు పొడిగించబడినది. శాసనసభ అధ్యక్షుని అదుపులోనికి వచ్చినది. లూయీ నెపోలియన్ నూతన అధ్యక్షునిగా దేశమంతా పర్యటించి తన వాగ్దానాల ద్వారా ప్రజలందరిని ముగ్ధులను చేసి, 1852 డిసెంబర్ 2 వ తేదీన మూడవ నెపోలియన్ అనే బిరుదుతో ఫ్రాన్సు చక్రవర్తి అయ్యెను. అతి కొద్ది మార్పులతో 1852 రాజ్యాంగం కొనసాగించబడినది.

## 7.1.7.2 చక్రవర్తిగా మూడవ నెపోలియన్ 1852-1870 :

మూడవ నెపోలియన్ చక్రవర్తిగా తన 18సం॥ల పాలనా కాలంలో ఫ్రాన్సు చరిత్రనేగాక ఐరోపా చరిత్రను కూడ ప్రభావితం చేశాడు. ఈ సందర్భంగా 'మా వంశ భవిష్యత్తు ఈ బాలుడుతో ముడిపడి ఉండలేదని ఎవరనుకోగలరు' అని లూయీని గురించి నెపోలియన్ అన్న మాటలు నిజంగా గమనార్హం.

### 7.1.7.2.1 అంతరంగిక విధానం :

ఫ్రాన్సులోని వివిధ వర్గాలు వివిధ భావాలు విరుద్ధ రాజకీయాల మధ్య సామరస్యాన్ని సాధించి ప్రజలకు రక్షణ కల్పించాడు. ఒకవైపు పత్రికా స్వాతంత్ర్యాన్ని అరికట్టి, శాసనసభను అదుపులో పెట్టి తన వ్యతిరేకులను నిర్బంధించి దేశము నుండి పారద్రోలి నిరంకుశ అధికారాన్ని చలాయిస్తూనే రెండవవైపున నామమాత్రపు సార్వత్రిక ఓటింగు పద్ధతిని సమర్ధిస్తూ తీవ్రవాదులకు, సనాతనులకు తృప్తి కల్గించే రీతిగా వ్యవహరించాడు. చక్రవర్తిగా రాజదర్పాన్ని, రాజవైభవాన్ని ప్రదర్శించవలెనని తలచినాడు. ఇతని కాలంలో ఫ్రెంచిరాజదర్బారు అందాలకు, అలంకారాలకు, ఆడంబరాలకు నిలయమైనది. ఇది సనాతనులకు తృప్తి నిచ్చింది.

నెపోలియన్ ఫ్రాన్సు ఆర్థికస్థితిని పెంపొందించటానికి తీవ్ర కృషి చేసెను. ప్రైవేటు వ్యాపారంపై ప్రభుత్వ నిర్బంధాలు తగ్గించాడు. మధ్యతరగతి వ్యాపారస్తుల ప్రయోజనాలను కాపాడాడు. పారిశ్రామిక సంస్థలను స్థాపించినాడు. యంత్రములను ప్రవేశపెట్టినాడు. ఎగుమతి దిగుమతి సుంకములను తగ్గించినాడు. అనేక బ్యాంక్‌లను స్థాపించి తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పించాడు. రోడ్లు, కాలువలు, నౌకాశ్రయములను నిర్మించినాడు. రైలు మార్గములను ప్రవేశపెట్టినాడు. దేశీయ, విదేశీయ వ్యాపారం కూడా అభివృద్ధి చెందినది. దీనితో ఫ్రాన్సు దేశ ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగుపడింది. కార్మికుల చక్రవర్తి అనిపించుకొనదలచి వారి సంక్షేమార్థం అనేక కార్యక్రమాలు చేపట్టాడు. కార్మిక సంఘాలను ప్రోత్సహించెను. తినుబండారముల ధరలు తగ్గించెను. ప్రమాదాల నుండి ఆకస్మిక మరణం నుండి భద్రతకై జీవితభీమా పథకాలు ప్రవేశపెట్టినాడు. కార్మికులకు శెలవు దినములు ప్రకటించటమే కాకుండ సమ్మె హక్కు కూడా మొదటిసారిగా గుర్తించెను. దీనివలన కార్మికుల ఆదరాభిమానములను పొంది

కార్మిక చక్రవర్తి అనే బిరుదును సంపాదించెను. ఒకవైపు కార్మికుల సంక్షేమానికి కృషిచేస్తూనే రెండోవైపున రైతుల ప్రయోజనాలను కాపాడాడు. వ్యవసాయానికి కావలసిన నీరు, రవాణా, మార్కెట్లు సౌకర్యాలను అభివృద్ధి పరచినాడు. ద్రాక్ష, గోధుమ పంటలను ప్రోత్సహించినాడు. ప్రైవేటు ఆస్థి హక్కును సమర్థించినాడు.

ఈ విధంగా మూడవ నెపోలియన్ కాలంలో ఫ్రాన్సు దేశంలో మొదటిసారిగా వివిధ వర్గాలు, వివిధ భావాలు, విరుద్ధ రాజకీయాల మధ్య కొంతవరకు రాజకీయ సాంఘిక భావసమైక్యత సాధించబడినది.

## 7.1.7.2.2 విదేశీ విధానము :

నెపోలియన్ స్వతహాగా శాంతిని కోరుకునే తత్వం గలవాడు. యుద్ధమన్న రక్తపాతమన్న అతనికి ఇష్టముండదు. తుపాకి మందు వాసనకూడ భరించలేడు. కనుకనే ఒక ఉపన్యాసంలో అతడు "సామ్రాజ్యమంటే శాంతి అని ఫ్రాన్సు శాంతిగా ఉంటే ప్రపంచం శాంతిగా ఉంటుందని వైభవం అనేది వారసత్వంగా వచ్చేది అని యుద్ధం ద్వారా వచ్చేది కాదు' అని అన్నాడు. కాని పరిస్థితుల ప్రభావం వలన తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి పేరు ప్రతిష్టలను పెంపొందించుకోవడానికి అనేక ఐరోపా యుద్ధాలలో పాల్గొన్నాడు. అంతేగాకుండ ఫ్రాన్సులో ఆంతరంగిక సంక్షోభం ఏర్పడినపుడు కూడా వారి దృష్టిని మరల్చటానికి ఏదో ఒక విదేశీ దండయాత్రకు పూనుకొనెడివాడు.

### 7.1.7.2.2.1 వలసరాజ్య స్థాపన :

3వ నెపోలియన్ ఫ్రెంచి వలస సామ్రాజ్య స్థాపనకై తీవ్ర కృషిచేసెను. ఖండాంతర వలసలను స్థాపించటమే గాకుండ పశ్చిమ ఇండియా దీవుల్లో, దక్షిణ అమెరికాలో, ఆఫ్రికాలోను ఫ్రెంచి వలసల పాలనను క్రమబద్ధం చేసెను. అల్జీరియాను ఆక్రమించెను. పసిఫిక్ దీవులలోని న్యూకల్ డోనియాను జయించినాడు. ఇండో చైనాలో ఫ్రెంచి ఆధిక్యతకు పునాది వేసినాడు. మెక్సికో విషయంలో జోక్యం చేసుకున్నాడు. ఇండియాలోని ఫ్రెంచిస్థావరములపై శ్రద్ధ చూపాడు. ఈ విధంగా 3వ నెపోలియన్ ఫ్రాన్సు దేశానికి ఎన్నో వలసలను సంపాదించిపెట్టాడు.

### 7.1.7.2.2.2 రష్యాతో సంబంధాలు - క్రిమియా యుద్ధం 1854 - 1856 :

మొదటి నెపోలియన్ పతనం నుండి ఫ్రాన్సుకు రష్యాకు మధ్య సఖ్యత నశించి వైషమ్యములు పెరిగెను. దీనికితోడు 3వ నెపోలియన్‌కు రష్యా చక్రవర్తి నికోలస్‌తో మొదటి నుండి వైరం ఏర్పడింది. నెపోలియన్ చక్రవర్తి బిరుదు స్వీకరించటం నికోలస్‌కు ఏమాత్రం ఇష్టంలేదు. అలాగే రష్యాపట్ల ఫ్రెంచి ప్రజలు కూడా విముఖత చూపారు. ఫ్రెంచి ఉదారవాదులకు రష్యా నిరంకుశ విధానాలు వాణిజ్య నిర్బంధాలు, మత అసహనం ఏవగింపు కలిగించినాయి. బాల్కన్ ప్రాంతంలో టర్కీ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసి రష్యా తన అధికారాన్ని స్థాపించాలని ప్రయత్నిస్తుంది. ఇది 3వ నెపోలియన్‌కు ఏమాత్రం ఇష్టం లేదు. ఇదే సమయంలో పాలస్తీనా లాంటి పవిత్ర స్థలాలలో కాథలిక్‌లు, ఆర్థడాక్స్ చర్చి అనుయాయుల మధ్య కలహాలు చెలరేగాయి. ఎప్పటినుండో బాల్కన్ రాజ్యాలపై దృష్టి నిల్పిన రష్యాకు ఇది మంచి అవకాశమనిపించి ఆర్థడాక్స్ క్రైస్తవ మతాన్ని సుల్తాన్ బారి నుండి రక్షించే బాధ్యత తమకు కలదని ప్రకటించింది. రష్యా జోక్యాన్ని ఫ్రాన్సు తిరస్కరించింది. అంతేగాకుండ రష్యా దండయాత్ర చేసిన తాను సహాయంగా రాగలనని టర్కీ సుల్తాన్‌కు 3వ నెపోలియన్ వాగ్దానం కూడ చేశాడు.

రష్యా టర్కీ సామ్రాజ్యంపై క్రీ.శ. 1854 యుద్ధం ప్రకటించింది. దీనినే క్రిమియా యుద్ధమందురు. ఈ యుద్ధంలో ఇంగ్లండు, ఫ్రాన్సు, సార్డీనియాలు సుల్తానుకు సహాయం చేశాయి. రష్యా ఓడిపోయి 1856లో పారిస్ సంధి చేసుకుంది.

**పారిస్ సంధి :**

ఈ సంధి నెపోలియన్ అధ్యక్షతన పారిస్‌లో జరిగెను. ఈ సంధి ప్రకారం నల్ల సముద్రంలో రష్యా తన ఆధిక్యతను కోల్పోయెను.

## 7.1.7.2.2.3 ఇటలీతో సంబంధాలు :

సార్డీనియా ప్రధానమంత్రి కవూర్ పారిస్ సంధి సందర్భంగా ఇటలీ ఏకీకరణకు మూడవ నెపోలియన్ సహాయం కోరాడు. 3వ నెపోలియన్ సార్డీనియాకు సహాయం చేయతలచాడు. దానికి కొన్ని ప్రత్యేక కారణములు కూడా కలవు. ఇటలీ తన పూర్వీకుల దేశము. మొదటి నెపోలియన్ ఇటలీ రాజుగా గుర్తింపు పొందాడు. 3వ నెపోలియన్ యువకుడుగా ఇటలీ ఉద్యమములలో పాల్గొన్నాడు. ఇటలీతో తనకున్న ఈ అనుబంధమేకాకుండ సార్డీనియాకు సహాయం చేసిన యెడల కొంత ప్రతిఫలాన్ని కూడా కవూర్ నుండి పొందవచ్చని భావించాడు. కానీ ఏకీకృత ఇటలీ ఫ్రెంచి అభివృద్ధికి ఆటంకం కాగలదని, ఫ్రెంచి కాథలిక్కులు తనను విమర్శించగలరని భయడి ఏ నిర్ణయం చెయ్యకుండా తాత్సారం చేసినాడు.

నెపోలియన్ ఎంతకు తన నిర్ణయాన్ని తెల్పనందున విసిగి వేసారి పోయిన ఆర్మిని అనే ఇటాలియన్ యువకుడు 3వ నెపోలియన్‌పై బాంబుతో హత్యాయత్నం చేశాడు. దీనికి హడలిపోయిన నెపోలియన్ 1858లో కవూర్‌తో ప్లాంబియర్స్ వద్ద ఆకస్మిక సమావేశంను ఏర్పాటుచేసెను. ఈ సమావేశంలో లొంబార్డీ, వెనీషియాల నుండి ఆస్ట్రియన్లను తరిమివేయటానికి తాను సైన్య సహాయం చేస్తానన్నాడు. దీనికి ప్రతిఫలంగా సవాయి, నైస్ అనే రెండు ప్రాంతాలు ఫ్రాన్సుకు ఇవ్వబడతాయి. ఫ్రెంచి సాయంతో సార్డీనియా మాజింటా, సల్ఫరినో యుద్ధాలలో విజయం సాధించి లొంబార్డీ నుండి ఆస్ట్రియన్లను తరిమివేసింది.

దీనికి ఫ్రాన్సులో కాథలిక్‌ల నుండి, సనాతనుల నుండి విమర్శలు బయలుదేరాయి. పైగా సార్డీనియా విజయం ఇటలీ ఏకీకరణ ఫ్రాన్సు భవిష్యత్తుకు ప్రమాదమని భావించి కవూర్‌తో చెప్పకుండ ఆస్ట్రియాతో విల్లా - ఫ్రాంకా 1859 సంధి చేసికొని యుద్ధభూమి నుండి వైదొలగినాడు. దీనితో ఫ్రెంచి ఉదారవాదులు ఇటలీ ప్రజలు 3వ నెపోలియన్ విధానాన్ని దుయ్యబట్టారు. చివరకు లంబార్డీనే గాక మధ్య ఇటలీలోని ప్రాంతాలను కూడా సార్డీనియా స్వాధీనం చేసుకోవటం ఫ్రాన్సు అంగీకరించింది. దీనికి ప్రతిఫలంగా సవాయి, నైస్ భూభాగాలు ఫ్రెంచి వారికి ఇవ్వబడ్డాయి.

## 7.1.7.2.2.4 రుమేనియాతో సంబంధాలు :

రుమేనియన్లు టర్కీ సామ్రాజ్యంలోని మల్దీవియా, వలేషియా రాష్ట్రాలలో నివసించేవారు. వారిలో వెల్లివిరిసిన జాతీయ భావాన్ని పురస్కరించుకొని వారి నాయకులు స్వాతంత్ర్యం కోసం తిరుగుబాటు చేశారు. ఈ స్వాతంత్ర్య తిరుగుబాటును 3వ నెపోలియన్ సమర్థించినాడు. ఈ ప్రాంతాలు తమ పార్లమెంటును ఎన్నుకునే అధికారాన్ని అగ్రరాజ్యాలచేత అంగీకరింపజేయటమే కాకుండ ఈ రెండు రాష్ట్రాలు కలిసి రుమేనియా అనే ఏకరాజ్యంగా రూపొందించటాన్ని బలపరచినాడు.

3 వ నెపోలియన్ 1860 నాటికి ఆంతరంగికంగా అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. ఇటలీలో ఇతని జోక్యం అసంపూర్తిగా మిగిలిపోయిందని ఉదారవాదులు విమర్శిస్తే ఇతని జోక్యం అనవసరమని కేథలిక్కులు, సనాతనులు దుయ్యబట్టారు. ఇలాంటి సమయంలో ప్రజల దృష్టిని విదేశీ వ్యవహారాలపై మళ్ళించటానికి కొన్ని సాహసాలకు పూనుకొన్నాడు.

### 7.1.7.2.2.5 పోలెండుతో సంబంధాలు 1863 :

పోలెండు ప్రజలు రష్యాపై తిరుగుబాటు చేసి 3వ నెపోలియన్ సహాయాన్ని అర్థించారు. ఫ్రాన్సులోని అన్ని వర్గాల ప్రజలు పోలెండు తిరుగుబాటును సమర్థించినారు. అంతేకాకుండ తమ రాజును పోలెండుకు సహాయం చేయమని కోరారు. కాని ఐరోపా దేశాలన్ని వేరు వేరు కారణాల వల్ల 3వ నెపోలియన్ జోక్యాన్ని వ్యతిరేకించాయి. ఐరోపా రాజ్యాలతో యుద్ధానికి భయపడిన 3వ నెపోలియన్ రష్యా విధానానికి అభ్యంతరం చెప్పటం తప్ప పోలెండుకు ఏవిధమైన సహాయం చేయలేదు. నెపోలియన్‌పై ఆశపెట్టుకుని తిరుగుబాటు చేసిన పోలెండ్ ప్రజలు రష్యా చేతిలో క్రూరంగా నలిగిపోయినారు. దీనితో పోలెండు ప్రజలు ఫ్రాన్సులోని, ఉదారవాదులు, కాథలిక్కులు 3వ నెపోలియన్‌ను తీవ్రంగా విమర్శించినారు. ఈ ఆంతరంగిక విమర్శలకు భయపడిన 3వ నెపోలియన్ తన అధికారాన్ని నిలబెట్టుకోవటానికి ప్రజల దృష్టిని విదేశీ వ్యవహారాలపై మళ్ళించటానికి మెక్సికో విషయంలో దుస్సాహసానికి పాల్పడ్డాడు.

### 7.1.7.2.2.6 మెక్సికోతో సంబంధాలు :

ఇది అమెరికా సంయుక్త రాష్ట్రములకు దక్షిణంగా ఉంది. మెక్సికో రాజ్యంలో స్థానిక రైతులకు భూస్వాములైన స్పెయిన్ అమెరికన్లకు మధ్య విభేదాలు ఏర్పడి అది అంతర్యుద్ధానికి దారితీసింది. ఈ అంతర్యుద్ధంలో పేదరైతుల నాయకుడు తీవ్రవాది అయిన బెనిటో జూరెజ్ విజయం సాధించి మెక్సికోకు 1860లో అధ్యక్షుడైనాడు. ఇతను అధికారానికి వచ్చిన వెంటనే మెక్సికో విదేశాలకు చెల్లించవలసిన ఋణాలను ఎగవేయు కార్యక్రమాలు చేపట్టెను. మెక్సికోకు అప్పులిచ్చిన దేశాలలో ఫ్రాన్సు కూడా ఉంది. అందువలన ఫ్రాన్సుకు కూడ ఆర్థిక నష్టం వాటిల్లినది. మెక్సికోకు తగిన గుణపాఠం చెప్పవలెనని 3వ నెపోలియన్ భావించాడు. అదే సమయంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు అంతర్యుద్ధంలో మునిగి యుండటం గమనించి 30 వేల సైన్యంతో మెక్సికో రాజ్యాన్ని ఆక్రమించినాడు. బెనిటో జూరెజ్ ఓడిపోయి పారిపోయినాడు. నెపోలియన్ ఆస్ట్రియా రాకుమారుడైన మాక్స్‌మిలన్‌ను మెక్సికో చక్రవర్తిగా చేసెను. అతనికి సహాయంగా కొంత సైన్యాన్ని కూడా ఉంచెను.

కాని మెక్సికో ప్రజలు విదేశీ పాలనను సహించలేదు. వారు తిరుగుబాటు చేసి మాక్స్‌మిలన్‌ను హతమార్చిరి. అంతర్యుద్ధంలో మునిగియున్నను అమెరికా నెపోలియన్ చర్యను ఖండించి మన్రో సిద్ధాంతం పునరుద్ఘాటించెను. 1867 నాటికి ఫ్రెంచి సైన్యాలు ఉపసంహరింపబడి మెక్సికో స్వతంత్రమైనది. దీనితో నెపోలియన్ పరిస్థితి మరీ అధ్వానమయ్యెను.

### 7.1.7.2.2.7 జర్మనీతో సంబంధాలు :

ప్రష్యా ఛాన్సలర్ బిస్మార్క్ జర్మనీ ఏకీకరణ కార్యక్రమానికి పూనుకొన్నాడు. అందుకు అతను ఇటలీ సహాయంతో జర్మనీపై ఆధిపత్యం కల్గిన ఆస్ట్రియాను ఓడించటానికి వ్యూహం పన్నాడు. ఈ యుద్ధానికి దూరంగా ఉంటే కొంత ప్రతిఫలాన్ని ముట్టచెప్పగలనని మూడవ నెపోలియన్‌కు ఆశ కల్పించినాడు. ఆస్ట్రియా ప్రష్యాల మధ్య యుద్ధం జరిగితే ఆ రెండు రాజ్యాలు బలహీనపడునని అప్పుడు ఐరోపాలో తనకు ఎదురు ఉండదని నెపోలియన్ భావించి బిస్మార్క్ కోరిక ప్రకారం తటస్థంగా ఉన్నాడు. ప్రష్యా ఆస్ట్రియాను ఏడువారాల యుద్ధంలో ఓడించి ఉత్తర జర్మన్ సమాఖ్యను చేసుకొన్నది. బిస్మార్క్ 3వ నెపోలియన్‌కు ఎలాంటి ప్రతిఫలాన్ని ముట్టచెప్పలేదు. అంతేగాకుండా ప్రష్యా జర్మనీ రాజ్యాలన్నింటిని ఏకంచేసి బలపడటం ఫ్రాన్స్ భవిష్యత్‌కు ప్రమాదమని భావించిన నెపోలియన్ దక్షిణ జర్మన్ రాజ్యాలను ఉత్తర జర్మన్ సమాఖ్యలో విలీనం చేయవద్దని హెచ్చరించెను. బిస్మార్క్ ఫ్రాన్స్‌తో యుద్ధాన్ని కాంక్షించాడు. అదేవిధంగా ఫ్రాన్సులోని అన్నివర్గాల ప్రజలు ప్రష్యాతో యుద్ధాన్ని కోరుకున్నారు.

ఇదే సమయంలో స్పెయిన్‌లో బోర్బన్ రాజరికానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. స్పెయిన్ ప్రజలు తమ రాణి 2వ ఇసబెల్లాపై తిరుగుబాటు చేసి ప్రష్యా చక్రవర్తి సోదరుడైన లియోపాల్డ్‌ను తమ రాజుగా ఎన్నుకొన్నారు. ఇతను కోహింజలాన్ వంశానికి చెందినవాడు. లియోపాల్డ్ స్పెయిన్ సింహాసనాన్ని అధిష్టించటాన్ని 3వ నెపోలియన్ అభ్యంతరం తెలిపినాడు కనుక లియోపాల్డ్ పదవీ విరమణ చేసినాడు. దీనితో తృప్తి చెందని 3వ నెపోలియన్ భవిష్యత్తులో కోహింజలాన్ వంశస్థులెవ్వరు స్పెయిన్ సింహాసనాన్ని అధిష్టించబోమని ప్రష్యా చక్రవర్తి నుండి వాగ్దానాన్ని రాబట్టమని తమ రాయబారిని పంపెను. ప్రష్యా చక్రవర్తి ఫ్రెంచి రాయబారి ఏమ్స్ అనుచోట సమావేశమైనారు. నెపోలియన్ కోరికను ప్రష్యా చక్రవర్తి అంగీకరించలేదు. ఈ విషయాన్ని ప్రష్యా చక్రవర్తి బెర్లిన్‌లోయున్న బిస్మార్క్‌కు టెలిగ్రాం ద్వారా తెలియచేశాడు. ఫ్రాన్సుతో యుద్ధాన్ని వాంఛించిన బిస్మార్క్ టెలిగ్రాంలో ఉన్న విషయాన్ని పూర్తిగా మార్చివేసి ఫ్రాన్సు రాయబారి ప్రష్యా చక్రవర్తిచేత అవమానింపడ్డాడన్న అబద్దపు సమాచారాన్ని ఫ్రెంచి స్వాతంత్ర్య దినోత్సవం నాడు చేరునట్లుగా పంపినాడు. కోపోద్రిక్తులైన ఫ్రెంచి ప్రజలు నిజానిజాలు తెలుసుకోకుండా 3వ నెపోలియన్‌చే ప్రష్యాపై యుద్ధాన్ని ప్రకటింపజేశారు.

## 7.1.7.2.2.8 ఫ్రాన్సు - ప్రష్యా యుద్ధము 1870 :

క్రీ॥శ॥ 1870లో ఫ్రాన్సు ప్రష్యాపై యుద్ధం ప్రకటించింది. యుద్ధంలో విజయం సాధించటానికి ఉద్రేకాలు మాత్రమే చాలవు. ఆలోచనా, వివేకం కూడా అవసరం. అవిలేని ఫ్రాన్స్ ప్రష్యా చేతిలో పెక్కు చోట్ల ఓడిపోయినది. 1870 ఆగస్టులో పరిస్థితి మరీ విషమించటంతో 3వ నెపోలియన్ యుద్ధ రంగానికి వెళ్ళవలసి వచ్చినది. ప్రష్యా చేతిలో 3వ నెపోలియన్ 1870 సెప్టెంబరు 1,2 తేదీలలో సెడాన్ వద్ద జరిగిన యుద్ధంలో ఘోరంగా ఓడిపోయి 80 వేల సైన్యంతో లొంగిపోయినాడు.

తమ చక్రవర్తి శత్రువులకు లొంగిపోయినాడనే వార్త తెలియగానే పార్లమెంటులోని రిపబ్లికన్లు గాంబెట్టా నాయకత్వాన ఫ్రాన్స్‌లో రాచరికాన్ని రద్దుచేసి ఫ్రాన్సును మూడవ రిపబ్లిక్‌గా ప్రకటించినారు. రాణి తన కుమారునితో ఇంగ్లండు పారిపోయెను. జర్మనీ నిర్బంధం నుండి విడుదలయిన నెపోలియన్ ఇంగ్లండు చేరి తన భార్యా బిడ్డలతో శేష జీవితం గడిపి 1873 లో మరణించినాడు. ఇతని కుమారుడు బ్రిటిష్ సైన్యంలో చేరి అతను కూడ 1879 లో మరణించినాడు. భార్య యూజనీ మాత్రం ఇంగ్లండులోనే దయనీయమైన జీవితం గడిపింది. ఆమె మొదటి ప్రపంచ యుద్ధంలో ఫ్రాన్స్ జర్మనీపై సాధించిన విజయాన్ని చూసి సంతృప్తితో 1920లో ఇంగ్లండు నందు మరణించినది.

## 7.1.7.2.3 ఘనత :

మూడవ నెపోలియన్ ఫ్రాన్స్ దేశ ఔన్నత్యమునకు బోనపార్టి వంశ పేరు ప్రతిష్టలకు ఎంతగానో కృషిచేసెను. ఆధునిక యుగంలో ఫ్రాన్స్ దేశానికి పెద్ద వలస సామ్రాజ్యాన్ని స్థాపించి ఫ్రాన్స్ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తం చేసినాడు. క్రిమియా యుద్ధంలో విజయం సాధించుట ఆస్ట్రో సార్డీనియా యుద్ధంలో సవాయి, నైస్‌లు పొందుట అతడు సాధించిన ఘన విజయములు. ఇంకను అతను అంతరంగికంగా ప్రవేశపెట్టిన సంస్కరణలు ప్రజానురంజకమయినవనుట నిర్వివాదాంశము. అయితే ఫ్రెంచి శాసనసభ ఫ్రాన్స్ వినాశనానికి ఇతడే కారకుడని ఆరోపించింది. ఇందులో కొంత వాస్తవం కలదు. ఇతనికి సమర్థత కన్నా ఆశ ఎక్కువ. చంచల స్వభావుడు. ఒక పద్ధతిగాని సరైన లక్ష్యంగాని లేని ఇతని విదేశాంగవిధానం పూర్తిగా విఫలమైనది. కనుకనే విక్టర్ హ్యూగో ఇతనిని చిన్న నెపోలియన్‌గా వర్ణించెను. ఫ్రాన్స్‌ను పరిపాలించిన గణనీయమైన చక్రవర్తులలో 3వ నెపోలియన్ ఒకడు అనుట సమంజసము.

# 7.2 ఫ్రెంచి మూడో రిపబ్లిక్ (1870-1940)

**విషయసూచిక :**


7.2.1 పరిచయం

7.2.2 మొదటి రిపబ్లిక్

7.2.3 రెండో రిపబ్లిక్

7.2.4 మూడో రిపబ్లిక్

7.2.5 సమస్యలు

7.2.6 పారిస్ కమ్యూన్

7.2.7 కమ్యూన్ సంస్కరణలు

7.2.8 అడాల్ఫ్ థియర్స్ పరిపాలన (1871-1873)

7.2.9 1875 లో ఫ్రెంచి రాజ్యాంగం

7.2.10 మాక్ మహోన్ పరిపాలన (1875-1879)

7.2.11 జూల్స్ గ్రెవీ పరిపాలన (1879-1887)

7.2.12 కార్నాట్ పరిపాలన (1887-1894)

7.2.13 బులాంజర్ ఉదంతం (1886-1889)

7.2.15 కాసిమిర్ - ఫేరియర్

7.2.16 ఫార్ (1894-1914)

7.2.17 డ్రీఫస్ ఉదంతం

7.2.18 చర్చితో తెగతెంపులు చేసుకొనుట

7.2.19 సామ్యవాదులు

7.2.20 సమీక్ష

7.2.21 నమూనా ప్రశ్నలు

7.2.22 చదువదగిన గ్రంథాలు


## 7.2.1 పరిచయం :

ప్రపంచంలో తొలిసారిగా స్వాతంత్ర్య సమరం జరిగి ప్రజారాజ్యంగా అవతరించింది అమెరికా. అయినప్పటికి ఫ్రెంచి విప్లవంలో "ఫ్రెంచి రిపబ్లిక్ వ్యవస్థ" ఏర్పడటం ప్రపంచ చరిత్రలో ఎక్కువ ప్రాచుర్యం పొందింది. ఫ్రాన్స్‌ను డాంటన్ ఏ ముహూర్తంలో "రిపబ్లిక్" గా ప్రకటించినాడో గాని, నాటి నుండి ఎంతో రక్తపాతం, ఎన్నో కల్లోలాలు, ప్రభుత్వాలు పడిపోవటం, సంఘర్షణలు చెలరేగటం, అనేక పర్యాయాలు రాజ్యాంగాన్ని రాసుకొని రద్దు చేసుకోవడం, ఫ్రెంచి ప్రజలు వర్గాలుగా చీలిపోవటం మనం ప్రపంచ చరిత్రలో ఒక్క ఫ్రాన్స్‌లో తప్పా ఇంకా ఎక్కడా చూడలేదు. మొత్తం మీద ఫ్రాన్స్‌లో 5 సార్లు గారి పబ్లిక్‌లు ప్రకటించబడినవి. అవి.

| వ.నెం. | రిపబ్లిక్ | నుండి | వరకు | ప్రకటించినవారు |
|---|---|---|---|---|
| 1. | మొదటి రిపబ్లిక్ | 22-9-1792 | 2-12-1804 | డాంటన్ |
| 2. | రెండో రిపబ్లిక్ | 28-2-1848 | 2-12-1852 | లామార్టైన్ |
| 3. | మూడో రిపబ్లిక్ | 4-9-1870 | 1940 | లియోన్ గాంబెట్టా |
| 4. | నాల్గవ రిపబ్లిక్ | 1944 | 1958 | డీ గోల్ |
| 5. | అయిదవ రిపబ్లిక్ | 1958 | - | డీగోల్ |

### 7.2.2 మొదటి రిపబ్లిక్ :

ఫ్రెంచి విప్లవంలో పౌర రాజ్యాంగ పరిషత్ ఫ్రాన్స్‌నకు రాజ్యాంగబద్ధ రాజరికం ఏర్పాటుచేసింది. అయితే అది ఫ్రెంచి చక్రవర్తి 16వ లూయీ అవివేకం వల్ల విఫలమైంది. డాంటన్ 1792 లో ఫ్రాన్స్‌లో మొదటి రిపబ్లిక్‌ను ప్రకటించాడు. ఇది 1804 లో మొదటి నెపోలియన్ అంతంచేసే వరకు కొనసాగింది. అనగా 12 సంవత్సరాలు. నేషనల్ కన్వెన్షన్, డైరక్టరీ, ప్రథమ కన్సల్‌గా నెపోలియన్ పాలనా కాలాలలో కొనసాగింది. అనేక క్రొత్త రాజ్యాంగాలు కూడా వ్రాయబడ్డాయి.

### 7.2.3 రెండో రిపబ్లిక్ :

లూయీ ఫిలిప్ పతనం తర్వాత 1848 ఫిబ్రవరి 28వ తేదీన లామార్టైన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్‌ను ప్రకటించారు. ఇది 1852 డిశంబర్ 2వ తేదీ వరకు అనగా చక్రవర్తిగా మూడో నెపోలియన్ ప్రకటించుకొనువరకు కొనసాగింది. ఈ కాలంలో లామార్టైన్, మూడో నెపోలియన్‌లు పాలించారు. 3 సార్లు రాజ్యాంగం వ్రాయబడింది. 1852 డిశంబరు 2 వ తేదీన మూడో నెపోలియన్ చక్రవర్తిగా ప్రకటించుకోవడంతో ఇది రద్దయింది.

### 7.2.4 మూడో రిపబ్లిక్ :

ఫ్రాంకో - ప్రష్యా యుద్ధంలో (1870-1871) ఫ్రాన్స్ తీవ్రంగా నష్టపడింది. అంతవరకు ఐరోపాలో ఫ్రాన్స్‌కు ఉండే ప్రముఖస్థానం ఇప్పుడు జర్మనీకి దక్కింది. ఫ్రాన్స్ ఓటమి ఆంతరంగికంగా చాలా పరిణామాలకు దారితీసింది. పారిస్‌లో తాత్కాలికంగా "కమ్యూన్" స్థాపితమైంది. రిపబ్లిక్‌ను సుస్థిరంగా స్థాపించడానికి చాలా యత్నాలు జరిగాయి. కానీ ఈ మూడో రిపబ్లిక్ మాత్రం కొన్ని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నది.

### 7.2.5 సమస్యలు :

ఫ్రెంచి సేనలు సెడాన్ యుద్ధంలో ప్రష్యన్ సేనలకు లొంగిపోయిన వెంటనే సెప్టెంబర్ 4, 1870 లో తాత్కాలిక రక్షణ ప్రభుత్వమేర్పడి పారిస్‌లో మూడో రిపబ్లిక్ స్థాపితమైంది. ఈ ప్రభుత్వంలో ముఖ్యనాయకుడు లియోన్ గాంబెట్టా. ఫ్రాంకో - ప్రష్యా యుద్ధంలో ఫ్రెంచి ఓటమి వల్ల పోయిన ప్రతిష్టను పునఃస్థాపితం చేయవలెనని, మూడో రిపబ్లిక్‌ను పూర్వం వలే గాక సుస్థిరం చేయవలెనని సంకల్పించినాడు. రాజకీయంగా ప్రజాస్వామ్యాన్ని ఫ్రాన్స్‌లో పాతుకొని పోయేటట్లు చేసింది మూడో రిపబ్లిక్. అందుకనే 1789 నాటి ఫ్రెంచి విప్లవం సంకల్పించిన సిద్ధాంతాలు మూడో రిపబ్లిక్‌లోనే సిద్ధించాయని కొంతమంది చరిత్రకారులు వ్యాఖ్యానించిరి.

పారిస్ నగరము ప్రష్యన్ సేనల వశమయ్యే సమయానికి ముఖ్యంగా రిపబ్లికన్ (Republican) రాచరిక (Royalism) పక్షాలు రెండూ ఫ్రాన్స్‌లో ఉన్నాయి. రిపబ్లికన్‌లో గాంబెట్టా నాయకత్వంలో ఫ్రాన్స్ ఓటమి సహించలేక యుద్ధం కొనసాగించవలెనని

పట్టుబట్టిరి. రాచరిక పక్షం వారు సంధి చేసుకొంటే మంచిదన్నారు. ఫిబ్రవరి 1871లో జాతీయ సభకు జరిగిన ఎన్నికలలో రిపబ్లికన్ల కంటే రాచరిక పక్షానికి ఎక్కువ ఓట్లు రావడంతో అడాల్ఫ్ థియర్స్ అనే రాచరిక పక్ష వాదిని ప్రభుత్వాధిపతిగా నియమించడమైంది. తదుపరి "జాతీయ సభ" కేంద్రాన్ని బూర్డో (Bordeau) నుంచి వర్సేకు తరలించినారు. ఈ జాతీయసభ ఫ్రాంకో-ప్రష్యా యుద్ధానంతరం ఫ్రాంక్ ఫర్ట్ సంధిని మే 1871లో ధ్రువీకరించింది. ఈ సంధి ప్రకారం 1. స్ట్రాస్ బర్గ్, మెట్జ్, ఆల్సేస్, లొరైన్‌లను ఫ్రాన్సు - ప్రష్యాకర్పించింది. 2. ఫ్రాన్స్ - ప్రష్యాకు 200 మిలియన్ ఫ్రాంకుల ధనాన్ని యుద్ధ నష్టపరిహారంగా 3 సంవత్సరాలలో చెల్లించాలి. అది చెల్లించేవరకు ఫ్రాన్స్‌లో ప్రష్యన్ సైన్యం ఉంటుంది.

## 7.2.6 పారిస్ కమ్యూన్ (1871) :

కమ్యూన్ చేత ప్రభావితులైన కొందరు జాతీయ సభ తీరునచ్చక తిరుగుబాటు లేవనెత్తిరి. వీరు పారిస్‌లో కమ్యూన్‌ను స్థాపించి నగర పరిపాలన చేయసాగిరి. నగరం స్వయం పాలితమని, జాతీయసభ అధికారం చెల్లదని ప్రకటించిరి. ఫ్రాంకో - ప్రష్యా యుద్ధ సమయంలో పారిస్ నగరం చాలా దుస్థితిననుభవించింది. రాజధానిని బూర్డో నుంచి పారిస్‌కు కాకుండా వర్సేకు తరలించినప్పుడు పారిస్ ప్రజలు అవమానంగా భావించిరి. ఎంతో ప్రాముఖ్యం వహించిన పారిస్‌కు ప్రాధాన్యం తగ్గిన కారణంగా ప్రజలు కోపానికి గురైరి. వారిలో చాలా మంది జాతీయ రక్షణ సైన్యం నుంచి తిరిగి వచ్చిన నిరుద్యోగులు, మరియు కార్మికులు, సామ్యవాదులు, ఉగ్రవాదులు ఉన్నారు. వారిలో కొంతమంది మార్క్సిస్ట్ ప్రభావానికి లోనైరి. ఫ్రాన్స్ ఓడిపోవడమే గాక, పరువు ప్రతిష్టలు మంటగలిశాయని, ఆర్థిక, వాణిజ్య భద్రతలు పోయినాయని, తిరిగి రాచరికం అవతారం ఎత్తుతుందని భావించిన ఉగ్రవాదులు పారిస్ నగరపాలనకు "కమ్యూన్" అవసరమని భావించిరి.

## 7.2.7 కమ్యూన్ సంస్కరణలు :

కమ్యూన్ స్థాపించబడగానే చేపట్టిన సంస్కరణలలో ముఖ్యమైనవి 1) సేనలను నిరాయుధం చేయటం, 2) వర్సే పార్లమెంటు శాసనాలు చెల్లవు. 3) ఎర్రజెండాను ఆవిష్కరించి, విప్లవ కాలెండర్‌ను ప్రవేశపెట్టింది, 4) జాతీయ కార్ఖానాలను నెలకొల్పింది. 5. ఫ్రాన్స్‌లో కమ్యూన్‌లు స్థాపితం కావలెనని, కమ్యూన్‌ల సమాఖ్య ఏర్పడెవలెనని, స్థానిక ప్రభుత్వాలు, స్వయం పాలనాధికారాలు కల్గి, శ్రామికవర్గం - మధ్యతరగతి వర్గం వారిపై విజయం సాధించి, భూస్వాముల నుంచి విముక్తి పొంది "సామ్యవాద కామన్‌వెల్త్" నెలకొల్పడానికి ప్రయత్నించింది. 5)ఎన్నికలు జరిగి ఉగ్రవాదులే అధిక సంఖ్యలో ఎన్నికైరి.

అడాల్ఫ్ థియర్స్ ప్రభుత్వం కమ్యూన్‌ను అణచివేయడానికి పూనుకొన్నది. రెండు నెలలు పారిస్ ముట్టడి జరిగింది. రెండు పక్షాలలోను, రక్తపాతం - జననష్టం సంభవించాయి. కమ్యూన్‌ను అణచివేయడమైంది. అనేకమంది న్యూ కాలిడోనియాకు పారిపోయిరి. దీనితో ఉగ్రవాద పక్షం అంతరించింది. కాని అతి కాఠిన్యం చూపినందుకు రాచరిక పక్షం ప్రజల సానుభూతిని కోల్పోయి, రిపబ్లిక్ పక్షం సానుభూతిని పొందింది.

## 7.2.8 అడాల్ఫ్ థియర్స్ పరిపాలన (1871-1873) :

మే 1871 ఆఖరికి, జాతీయసభ అంగీకారంతో థియర్స్ జర్మన్‌లతో సంధి చేసుకొని ఫ్రాన్స్‌లో సుస్థిర శాంతిని నెలకొల్పినాడు. జర్మనీకి కట్టవలసిన యుద్ధ నష్టపరిహార ధనం కోసం రుణం చేసి 2 1/2 సంవత్సరాలలో ఆ ధనమంతా చెల్లించాడు. అతని సేవలను గుర్తించిన ఫ్రెంచి ప్రజలు అతనిని "దేశ విముక్తికి కారకుడు" (Liberator of the Nation) అని కీర్తించిరి. ఇతనికి తాత్కాలికంగా "ఫ్రెంచి, రిపబ్లిక్ అధ్యక్షుడు" అనే బిరుదు వచ్చింది. దేశ సైన్యాన్ని పటిష్టం చేయడానికి సైనిక సంస్కరణలు

ప్రవేశపెట్టినాడు. ముఖ్యంగా ప్రష్యాలో వలెనే సార్వత్రిక నిర్బంధ సైనిక పద్ధతిని ప్రవేశపెట్టినాడు. జర్మన్ సరిహద్దు పొడవునా రక్షణ దుర్గాలను కట్టించి, అచ్చట సైన్యాలను నిలిపినాడు.

1871లో చేసిన రివెట్ శాసనం ప్రకారం జాతీయసభకు కొత్త రాజ్యాంగం తయారుచేయటానికి అధికారం వచ్చింది. రాజ్యాంగబద్ధమైన పరిపాలన కోసం కొత్త రాజ్యాంగం తయారయింది. 500 మంది ఉన్న జాతీయ సభలో దాదాపు 400 మంది రాచరిక పక్షంవారు. వీరు రాచరికం కావాలని ప్రయత్నించిరి. కాని ఎవరు రాజు కావలెననే విషయంలో వీరు 3 వర్గాలుగా చీలిపోయిరి. వారిలో 1. బూర్బన్ వంశంవారు, 2. ఆర్లియన్స్ వంశంవారు, 3. బోనపార్టీ వంశం వారు కావాలని కోరిరి. అందుకే "ఉన్నది ఒకే సింహాసనం. దానికి ముగ్గురు హక్కుదార్లు" అని చరిత్రకారులు చమత్కరించిరి. థియర్స్ ఆర్లియన్స్ పక్షాభిమాని అయినా ఫ్రాన్స్ రాజ్యాంగం రిపబ్లిక్‌గా ఉండవలెనని కోరుకున్నాడు. పతాకం విషయంలో కూడా ఏకాభిప్రాయం కుదరలేదు. ఒకేవర్గంవారు బూర్బన్ వంశ శ్వేత పతాకం కావాలని కోరగా, రెండో వర్గం ఫ్రెంచి విప్లవ చిహ్నమైన త్రివర్ణ పతాకం కావాలని కోరిరి. అందుచేత రాచరిక పక్షం వారి సంఖ్య శాసనసభలో ఎక్కువగా ఉన్నా రాజ్యాంగం రిపబ్లిక్‌గా రూపొందక తప్పలేదు.

### 7.2.9 1875లో ఫ్రెంచి రాజ్యాంగం :

1873లో థియర్స్ తన పదవికి రాజీనామా యిచ్చాడు. రాచరిక పక్ష నాయకుడు మాక్ మహోన్ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. 1875లో చాలా కొద్ది మెజారిటీతో రిపబ్లిక్ రాజ్యాంగం అమలులోనికి వచ్చింది. ఈ రాజ్యాంగంలో రాచరికవాదుల, రిపబ్లికన్ల ఆశయాలను సమన్వయపరచే ప్రయత్నం జరిగింది. ఈ రాజ్యాంగం ప్రకారం ఎ) 7 సంవత్సరాలకొక పర్యాయం అధ్యక్షుడు రెండు శాసనసభల చేత ఎన్నికకావలె. తిరిగి మళ్ళీ ఎన్నిక కావడానికి అర్హత ఉన్నది. రాజవంశంవారు అర్హులు కారు. బి) అధ్యక్షుడు - మంత్రిమండలి సభ్యులను, మంత్రిమండలి అధ్యక్షుని కూడా నియమిస్తాడు. మంత్రివర్గం పార్టీల బలం మీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ 18 మాసాల గడువులోనే, రెండు మంత్రి వర్గాలు మారి సంక్షోభమేర్పడితే అధ్యక్షునితో సంప్రదించి జాతీయ శాసనసభను రద్దు పరచేటట్లు మంత్రిమండలి నిర్ణయించవచ్చు. సి) జాతీయ శాసనసభ - సెనేట్, ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్ సార్వత్రిక వోటింగ్ చేత ప్రత్యక్ష ఎన్నిక పద్ధతిలో ఏర్పడుతుంది. సెనేట్ పరోక్ష ఎన్నిక పద్ధతిలో ఏర్పడుతుంది. సెనేట్ అనుమతితో అధ్యక్షుడు దిగువసభ అయిన ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌ను రద్దుచేయవచ్చు. డి) మంత్రులు వ్యక్తిగతంగాను, సమిష్టిగాను శాసనసభకు బాధ్యత వహిస్తారు.

### 7.2.10 మాక్ మహోన్ పరిపాలన (1875-1879) :

కొత్త రాజ్యాంగం ప్రకారం 1875 లో ఎన్నికలు జరిగాయి. రాచరిక పక్షానికి ఎక్కువ వోట్లు రాగా మాక్ మహోన్ అధ్యక్షుడైనాడు. యుద్ధ, నౌకాదళ, విదేశీ వ్యవహారాల శాఖలను శాసనసభ నియంత్రణ నుంచి తొలగించినాడు. రిపబ్లిక్ పార్టీ మంత్రి వర్గమేర్పడింది. రాచరిక పక్షం వారు - క్రైస్తవ మతాచార్య వర్గం వారి సహకారంతో రిపబ్లికన్ పక్షం వారిపై దాడి చేయటం ప్రారంభించినారు. 1877లోనే మాక్ మహోన్ మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేసి శాసనసభను రద్దు చేశాడు. రిపబ్లికన్‌లు గాంబెట్టా నాయకత్వంలో ప్రతిఘటించిరి. మళ్ళీ ఎన్నికలు జరిగినప్పుడు రిపబ్లికన్‌లకే ఎక్కువ వోట్లు రాగా 1879లో మాక్ మహోన్ తన పదవికి రాజీనామా చేశాడు. రిపబ్లికన్ పక్ష నాయకుడు గ్రెవీ అధ్యక్షుడైనాడు. రిపబ్లిక్ వ్యవస్థ స్థిరపడింది.

### 7.2.11 జూల్స్‌గ్రెవీ పరిపాలన (1879-1887) :

గ్రెవీ 1879 లో ఫ్రాన్స్‌నకు అధ్యక్షుడైనాడు. ఫ్రాన్స్ రాజధానిని వర్సే నుంచి 1880లో పారిస్‌నకు తరలించినాడు. కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినాడు. అవి. 1. పత్రికా స్వాతంత్ర్యం యిచ్చుట, 2. సమావేశాలు జరుపుకోవచ్చు, 3. జాతీయ విద్యా

విధానం ఏర్పడి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్థాయిలోను, సాంకేతిక పరంగాను శ్రద్ధ తీసుకోవటం జరిగింది, 4. విద్య, విదేశీ వ్యవహారాల మంత్రి జూల్స్‌ఫెర్రీ తాను తయారుచేసిన పథకం ప్రకారం ప్రభుత్వ పాఠశాలలను చర్చి అధీనంలో నుంచి తప్పించి లౌకిక నిర్వహణ క్రిందనే ఉంచి మతబోధ లేకుండా చేసినాడు. చర్చివారు తమ పాఠశాలలను వేరే పెట్టుకోవచ్చు. చర్చి రాచరిక పక్షానికి మద్దతు యిచ్చిన కారణంగా ఈ చర్య తీసుకొన్నాడు, 5. యూదులను, జెసూట్లను (మతాధికారులు) దేశం నుంచి తరిమివేశాడు, 6. కార్మిక సంఘాలను న్యాయబద్ధం చేశాడు. దీనివల్ల సామ్యవాద పక్షమేర్పడడానికి దారితీసింది.

గ్రెవీ పాలనలో ఫ్రెంచి వలస సామ్రాజ్యాభివృద్ధి జరిగింది. ట్యూనిష్ పై రక్షకత్వ మేర్పడి అది ఫ్రెంచి ప్రదేశంగా తయారయింది. ఇండో-చైనాలో అన్నామ్ టోంకిన్ ప్రాంతాలు ఫ్రెంచి అధీనంలోనికి వచ్చాయి. ఆఫ్రికా వలసల సంపాదనలో కూడా ఫ్రాన్స్ భాగస్తురాలైంది. మెడగాస్కర్ ఆక్రమణ జరిగింది. ఫెర్రీ వలసల విధానం పట్ల ఇటలీ, బ్రిటన్, స్పెయిన్‌లతో ఫ్రాన్స్‌కు విరోధమేర్పడింది.

1884లో రాజ్యాంగ సవరణ - అధ్యక్ష పదవి రాజవంశస్తులెవరికీ చెందకూడదు అని తీర్మానించింది. 1886లో ఫ్రాన్స్ నుంచి పూర్వ రాజవంశస్తులను దేశం నుండి పంపివేయడమైంది. దీనితో రాచరికం తిరిగి వస్తుందనే అనుమానం పోయింది కాని రిపబ్లిక్ పక్షం వారిలో చీలికలేర్పడి మంత్రివర్గాలు దీర్ఘకాలం అధికారంలో ఉండక మంత్రివర్గంలో అనేక మార్పులు రావడానికి అవకాశం కల్గింది.

## 7.2.12 కార్నాట్ (Cornot) పరిపాలన (1887-1894) :

ఇతని కాలంలో రిపబ్లికన్లలో వర్గాలు ఏర్పడినాయి. మంత్రుల - శాసనసభ్యుల లంచగొండితనం, అవినీతి వల్ల సూయజ్ కంపెనీ దివాళా తీసింది. కాథలిక్కులు, సోషలిస్టులు ప్రభుత్వాన్ని విమర్శించసాగిరి.

## 7.2.13 బులాంజర్ ఉదంతం (1886-1889) :

బులాంజర్ అనే సేనాని 1886-1889లలో యుద్ధమంత్రిగా ఉన్నాడు. ఇతడు సైనిక సౌకర్యాలు ఎక్కువగా కల్పించి, సైనికులలో పేరు సంపాదించుకొన్నాడు. జర్మనీతో యుద్ధం చేసి పగతీర్చుకోవలెనని ప్రయత్నించినాడు. రాచరిక పక్షం, బొనపార్టీ పక్షం, మతాచార్యవర్గం వారంతా బులాంజర్‌ను సమర్థించిరి. దీన్ని అదనుగా తీసుకొని బులాంజర్ రాజ్యాంగ సవరణ అవసరమని, అధ్యక్షునికి ఎక్కువ అధికార మివ్వవలెనని ఉద్యమం లేవనెత్తినాడు. అతని ధోరణి చూస్తే రిపబ్లిక్‌ను పడదోసి తాను నియంత అవుతాడేమోనని అనిపించింది. రిపబ్లికన్ ప్రభుత్వం భయపడి అతనిపై దేశద్రోహ నేరం మోపింది. దీనితో భయపడి బులాంజర్ బెల్జియంనకు పారిపోయి చివరకు 1891లో బ్రస్సెల్స్ నగరంలో ఆత్మహత్య చేసుకొన్నాడు. రిపబ్లిక్‌కు ఒక ప్రమాదం తప్పింది.

## 7.2.14 పనామా కాలువ కంపెనీ అపవాదు :

ఫెర్డినాండ్ డిలెసెప్ పర్యవేక్షణ క్రింద పనామా కాలువ త్రవ్వించడానికి "పనామా కాలువ కంపెనీ" ఒకటి రిపబ్లిక్ అధికారపత్రంతో స్థాపితమైంది. ఈ కంపెనీలో చాలా మంది యూదు వడ్డీవ్యాపారులు, శాసనసభా సభ్యులు వాటాలు తీసుకొన్నారు. కానీ ఆ కంపెనీ దివాలా తీసింది. కంపెనీ నిర్దేశకులు మంత్రులకు, శాసనసభ్యులకు లంచాలిచ్చారనే అపవాదు బయలుదేరింది. దర్యాప్తు చేయగా ఫెర్డినాండ్ డిలెసెప్ పైననే నిందవచ్చింది. అతని కుమారుడు ఛార్లెస్ డిలెసెప్ తన తండ్రి తరపున వాదించి, నిందను తనపై వేసుకోవలసి వచ్చింది. ఈ సందర్భంలో కొందరు మంత్రులు, శాసనసభ్యులు రాజీనామా యిచ్చిరి. ఈ అపవాదుమూలంగా రిపబ్లిక్ పేరు ప్రతిష్టలు కొంతవరకు దెబ్బతిన్నాయి.

### 7.2.15 కాసిమిర్ - పేరియర్ (Casimir - Perier) :

1894లో కార్నాట్ హత్యకు గురికాగా కాసిమిర్ - పేరియర్ అధ్యక్షుడైనాడు. కానీ కొద్ది నెలలకే అతడు రాజీనామా చేసినాడు.

### 7.2.16 ఫార్ (Faure) (1894-1914) :

### 7.2.17 డ్రే ఫస్ ఉదంతం :

ఫార్ అధ్యక్ష పదవీ కాలంలో ఫ్రాన్స్ నంతా దద్దరిల్లచేసిన సంఘటన "డ్రేఫస్ ఉదంతం". డ్రేఫస్ అనే ఆల్సేస్ యూదుడు ఫిరంగి దళంలో కెప్టెన్‌గా ఉండి సైనిక రహస్యాలను జర్మనీకి అందచేసినాడనే నేరంపై ద్వీపాంతరవాస శిక్ష విధించి, అతడిని ఫ్రెంచి గయానా వద్ద డెవిల్స్ దీవికి 1884లో పంపారు. 1896లో కర్నల్ ఫికార్డ్ అనే ఉద్యోగి డ్రేఫస్ శిక్షార్హుడని నిరూపణ చేసిన పత్రం మేజర్ హెస్టర్ హెజీ ఫోర్జరీ అని, కేసును తిరిగి విచారణ చేయవలెనని ఒత్తిడి చేశాడు. కాని మంత్రివర్గం తప్పుచేసింది కాబట్టి దానిని కప్పి పుచ్చుకోవడానికి ఫికార్డ్‌ను ట్యూనిస్‌నకు బదిలీ చేసింది. అతనిస్థానే కర్నల్ హెన్రీని నియమించింది. ఎట్లాగో ఈ వ్యవహారమంతా పొక్కి (బహిర్గతమై) ప్రజల దృష్టిలో పడింది. ప్రభుత్వ చర్యను రాచరిక పక్షంవారు, చర్చివారు, సైనికశాఖవారు సమర్థించగా ప్రజలు వ్యతిరేకించిరి. ఎమైల్ జోలా, అనటోల్ ఫ్రాన్స్ వంటి సాహితీపరులు యిందులో ఉన్నారు. ఫ్రాన్స్ డ్రేఫస్ పక్ష, ప్రతిపక్షాలు ఏర్పడ్డాయి. ఈ లోపల హెస్టర్ హెజీ ఇంగ్లాండ్‌నకు పారిపోయి తాను ఫోర్జరీ చేసి ఆ నేరాన్ని డ్రేఫస్‌పై త్రోసివేశానని ప్రకటించి ఆత్మహత్య చేసుకొనినాడు. కనుక 1896లో ఫ్రెంచి ప్రభుత్వం మరలా డ్రేఫస్ కేసును విచారించి, అతడు నిర్దోషి అని ప్రకటించి, తిరిగి అతనిని ఉద్యోగంలో నియమించి గౌరవించింది. అయితే ప్రభుత్వం మాత్రం మరింత అపఖ్యాతి పాలయింది.

### 7.2.18 చర్చితో తెగతెంపులు చేసుకొనుట :

ఫార్ పరిపాలనాకాలంలో జరిగిన మరొక సంఘటన చర్చితో తెగతెంపులు చేసుకొనుట. పోప్ 13వ లియో - మూడో రిపబ్లిక్‌ను గుర్తించినా, చర్చితో సంబంధాలు రద్దు చేయబడినవి. దాని ప్రకారం 1. ఫ్రాన్స్‌లో చర్చి సంఘాలేవీ ఉండకూడదు, 2. ఫ్రాన్స్‌కు పోప్‌కు మధ్య దౌత్య సంబంధాలు తెగతెంపులు చేయుట జరిగింది. 3. క్రైస్తవ ఆలయాలు తప్ప, తక్కిన చర్చికి చెందిన భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది. 4. మతసంస్థలు బోధన చేయరాదు. వాటి పాఠశాలలు మూసివేయవలె లేదా ప్రభుత్వపరం చేయవలె.

ఫ్రెంచి అధ్యక్షుడు ఇటలీని సందర్శించినపుడు తన అసమ్మతిని తెలిపినాడు. తదుపరి I నెపోలియన్ చర్చితో చేసుకొనిన "రాజీ" ని (Concord) రద్దుపరచడమైంది. దీనితో చర్చి, ప్రభుత్వం వేరైనాయి. (Seperation of Church and State).

### 7.2.19 సామ్యవాదులు (Socialists) :

1884-1914ల మధ్యకాలం ఫ్రాన్స్‌లో సామ్యవాద ప్రభావం మిలిరాండ్ (Millerand) నాయకత్వంలో ఎక్కువైంది. ప్రభుత్వం దానికనుగుణంగా కొన్ని శాసనాలు చేసింది. అవి 1. కార్మిక సంస్థలు చట్టబద్ధం చేయబడినాయి. 2. ఫ్యాక్టరీలలో పనిచేసేకాలం నియమితమైంది. 3. పెన్సన్ విధానం ప్రవేశపెట్టబడింది. సమ్మెలు కూడా జరిగాయి. వాటిలో 1910లో జరిగిన రైల్వే సమ్మె ముఖ్యమైంది. దానిని నాటి ప్రధాని, సామ్యవాది బ్రియాండ్ (Briand) అణచివేసినాడు.

### 7.2.20 సమీక్ష :

18వ శతాబ్దం నుంచి ఫ్రెంచి చరిత్ర చూస్తే మూడో రిపబ్లిక్ పాలన ఉన్నంతకాలం ఏ ప్రభుత్వమూ లేదు అనుట నిర్వివాదాంశం. రెండో ప్రపంచ యుద్ధకాలంలో కొంతకాలం ఫ్రాన్స్ జర్మనీ కీలుబొమ్మ వి.కె. ప్రభుత్వం అధీనంలోనికి పోయినా మళ్ళీ తిరిగి 5వ రిపబ్లిక్‌గా ఏర్పడి పరిపాలన కొనసాగించుచున్నది. 20వ శతాబ్దంలోకి ప్రవేశించేటప్పటికి ఆంతరంగిక అవాంతరాలను అధిగమించి, ఫ్రాన్స్ సాంఘీకాభివృద్ధికి కృషిచేసి, వైదేశిక విధానంలోను, వలస విధానంలోను కూడా విజయవంతంగా నిర్వహించి, బలాన్ని, కీర్తిని పొందింది.

### 7.3 నమూనా ప్రశ్నలు :

1. మూడో నెపోలియన్ విదేశాంగ విధానమును వివరింపుము.
2. ఫ్రాన్స్‌లో మూడో రిపబ్లిక్ పాలనను సమీక్షింపుము.
3. డ్రైపస్ ఉదంతము.

### 7.4 చదువదగిన గ్రంథాలు :


1. Great & Temperly - Europe in the 19th 20th Centuries
2. Hazen C.D. - Europe since 1815
3. Hayes J.H. - Modern Europe upto 1870
4. Kettelby C.D.M. - History of Europe
5. Mahajan V.D. - History of Modern Europe since 1789
6. R. Arnand - The Second Republic and Napolean III
7. Taylor - The Struggle for Mastery of Europe
8. Wright - History of the Third French Republic
9. Bourgeon's - History of Modern France


- శ్రీమతి యం. శివకుమారి, శ్రీ పి. లక్ష్మీనారాయణ

పాఠం - 8

# ఇటలీ ఏకీకరణ - జర్మనీ ఏకీకరణ
# బిస్మార్క్ ఆంతరంగిక, విదేశీ విధానాలు

**8.0 లక్ష్యం :**

ఇటలీ, జర్మనీ ఏకీకరణలు, బిస్మార్క్ ఆంతరంగిక, విదేశీ విధానాలు గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**


**8.1 పరిచయం**

**8.2 ఇటలీ ఏకీకరణ**

**8.2.1 ఏకీకరణ నాటికి ఇటలీ పరిస్థితి**

**8.2.2 ఇటలీ ఏకీకరణ ఉద్యమాలు - రహస్య సంఘాలు**

**8.2.3 రిసార్జిమెంటో ఉద్యమము**

**8.2.4 సమైక్యవాద వర్గాలు**

**8.2.4.1 మాజిని (1805-1872)**

**8.2.4.2 జియోబర్టి వర్గం**

**8.2.4.3 సార్డీనియా రాజపక్ష వర్గం**

**8.2.4.3.1 విక్టర్ ఎమాన్యుయేల్**

**8.2.5 కవూర్**

**8.2.6 ఇటలీ ఏకీకరణలో ముఖ్య ఘట్టాలు**

**8.2.6.1 ప్రథమ ఘట్టము**

**8.2.6.1.1 క్రిమియా యుద్ధము**

**8.2.6.1.2 ఆస్ట్రో - సార్డీనియా యుద్ధం, 1859**

**8.2.6.2 ద్వితీయ ఘట్టము**

**8.2.6.3 తృతీయ ఘట్టము**

**8.2.6.4 చతుర్థ ఘట్టము**

**8.2.6.4.1 వెనీషియా విలీనీకరణ**

**8.2.6.4.2 రోమ్ విలీనీకరణ**

**8.2.7 ప్రాధాన్యత**

**8.3 జర్మనీ ఏకీకరణ**

**8.3.1 పరిచయం**

8.3.2 జాల్వేరిన్ వాణిజ్యసంస్థ

8.3.3 ఫ్రాంక్ ఫర్ట్ సమావేశము

8.3.4 ప్రష్యా నాయకత్వము

8.3.5 మొదటి విలియం (1861-1888)

8.3.6 ఆటోవాన్ బిస్మార్క్ (1815-1898)

8.3.6.1 రక్తపాత విధానం

8.3.6.2 డెన్మార్క్‌లో యుద్ధము - 1864

8.3.6.3 ఆస్ట్రియా - ప్రష్యా యుద్ధము - 1866

8.3.6.3.1 ప్రాగ్ సంధి

8.3.6.3.2 యుద్ధ ఫలితాలు

8.3.6.4 ఫ్రాన్స్ - ప్రష్యా యుద్ధం - 1870

8.3.6.4.1 ఫ్రాంక్ ఫర్ట్ సంధి

8.3.6.4.2 ఏకీకరణ సంపూర్తి

8.3.7 ప్రాముఖ్యత

8.4 ఆటోవాన్ బిస్మార్క్ ఆంతరంగిక, విదేశీ విధానాలు

8.4.1 పరిచయం

8.4.2 బిస్మార్క్ తొలిజీవితం

8.4.3 మొదటి విలియం పాలన (1861-1888)

8.4.4 బిస్మార్క్ ఆశయాలు

8.4.5 జర్మనీ ఏకీకరణకు ముందు స్థూలంగా జర్మనీ రాజకీయ పరిస్థితి

8.4.6 బిస్మార్క్ ఆంతరంగిక విధానం

8.4.6.1 కొత్త రాజ్యాంగం

8.4.6.2 పరిపాలనా సంస్కరణలు

8.4.6.2.1 ఆర్థిక సంస్కరణలు

8.4.6.2.2 సైనిక సంస్కరణలు

8.4.6.2.3 చర్చితో తగాదా లేదా నాగరికతా రక్షణ యుద్ధం

8.4.6.3 కాథలిక్‌లకు వ్యతిరేకంగా బిస్మార్క్ గైకొన్న చర్యలు

8.4.6.4 మే శాసనాలు లేక ఫాక్ చట్టాలు

8.4.6.5 సామ్యవాద ప్రజాస్వామ్యం - సోషలిస్ట్ ఉద్యమం

8.4.6.6 వలస సామ్రాజ్యం

8.4.7 బిస్మార్క్ విదేశీ విధానం

8.4.7.1 జర్మనీ ఏకీకరణకు పూర్వపు విదేశీ విధానం

**8.4.7.1.1 డెన్మార్క్‌తో యుద్ధం - 1864**
**8.4.7.1.2 ఆస్ట్రియాతో యుద్ధం - 1866**
**8.4.7.1.3 ఫ్రాన్స్‌తో యుద్ధం - 1870-1871**
**8.4.7.2 జర్మనీ ఏకీకరణానంతర విదేశీ విధానం**
**8.4.7.2.1 త్రిసామ్రాట్ మిత్రమండలి (1872)**
**8.4.7.2.2 ద్విపక్షమైత్రి (1879)**
**8.4.7.2.3 త్రిసామ్రాట్ మైత్రీకూటమి (1881)**
**8.4.7.2.4 త్రిరాజ్యసంధి (1882)**
**8.4.7.2.5 రష్యాతో పునర్ భద్రతా సంధి (1887)**
**8.4.8 బిస్మార్క్ వ్యక్తిత్వం**
**8.4.9 నమూనా ప్రశ్నలు**
**8.4.10 చదువదగిన గ్రంథాలు**

## 8.1 పరిచయం :

19వ శతాబ్దం నాటికి జాతీయవాదం, ఉదారవాదం అను రెండు ఆధునికభావాలు ఐరోపాను ప్రభావితం చేశాయి. నెపోలియన్ తాను విప్లవవారసుడినని చెప్పుకొని ఐరోపా అంతట జాతీయ భావాన్ని మేల్కొలిపాడు. జర్మనీ, ఇటలీలు జాతీయ ఐక్యతను చవిచూచినవి. నెపోలియన్ పతనానంతరం ఐరోపా పోలీస్ అని పేరుగాంచిన మెటర్నిక్ జాతీయ ఉదార భావాలను అణచాలని ప్రయత్నించాడు. కాని జాతీయ భావం నశించలేదు. క్రీ॥శ. 1830-1848 విప్లవాలు మెటర్నిక్ విధానాలపై పోరు కొనసాగించినాయి. 1830 విప్లవాన్ని మెటర్నిక్ అణచినా 1848 విప్లవాన్ని అణచలేక ఇంగ్లండు పారిపోయినాడు. కాని ఆస్ట్రియా ఈ 1848 విప్లవాన్ని అణచినది. ఈ తిరుగుబాట్లు అణచివేయబడినా ఉదారవాద ప్రభావం మాత్రం తగ్గలేదు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు మేధావులు ఉదారవాదంచే ఆకర్షించబడి జాతీయ రాజ్యాలు ఏర్పడాలని రాజ్యాంగబద్ధ ప్రభుత్వాల నిర్మాణం ఆవశ్యకమని భావించారు.

19వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవ ఫలితంగా సమాజంలో ఎన్నో మార్పులు వచ్చాయి. నగరాలు, పట్టణాలు పెరిగినవి. రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందినాయి. కొత్త పరిశ్రమలు స్థాపించినారు. ఆర్థిక పరిస్థితులలో మార్పు వచ్చినది. దీనితో ఉదారవాదుల బలం పెరిగినది. దీని ఫలితంగా జాతీయ రాజ్యాల స్థాపనకు రాజ్యాంగబద్ధ ప్రభుత్వాల నిర్మాణానికి ప్రోత్సాహం లభించినది. ముఖ్యంగా ఈ జాతీయ ఉదార భావాలు ఇటలీ, జర్మనీ ఏకీకరణ ఉద్యమాలుగా తలఎత్తి సనాతనవాదంపై పోరాటం జరిపినది. ఇటలీ, జర్మనీలు రెండు జాతీయరాజ్యాలుగా అవతరించినవి. 19వ శతాబ్దంలో ఐరోపా చరిత్రలో అతి ముఖ్యమైన రాజకీయ సంఘటన ఇటలీ, జర్మనీల ఏకీకరణ.

## 8.2 ఇటలీ ఏకీకరణ :

ఐరోపా రాజ్యములన్నింటిలోను ఇటలీలో ఉదారవాదుల ప్రభావం ప్రబలంగా ఉంది. వీరు క్రీ॥శ॥ 1848 నాటి వైఫల్యాన్ని అధిగమించి ఉదార జాతీయ సామ్రాజ్యాన్ని స్థాపించుకొన్నారు. దీనినే ఇటలీ ఏకీకరణ అందురు.

## 8.2.1 ఏకీకరణ నాటికి ఇటలీ పరిస్థితి :

కొన్ని శతాబ్దాల నుండి ఇటలీ అనేక నగర రాజ్యాలుగా విభజింపబడి ఉంది. భౌగోళికంగా ఈ ప్రాంతాన్నంతా ఇటలీగా పరిగణించినను అది ఏనాడు సమైక్యమైన ఏకరాజ్యం కాదు. అగ్రరాజ్యాలైన ఆస్ట్రియా, ఫ్రాన్స్, స్పెయిన్‌లు ఇటలీలోని ప్రాంతాల ఆధిపత్యం కోసం పెనుగులాడుతూ ఉండేవి. ఫ్రెంచి విప్లవ ఫలితంగా, నెపోలియన్ యుద్ధాల ఫలితంగా ఇటలీ ప్రజలలో రాజకీయ ఐక్యత, జాతీయ భావం పెంపొందినాయి. కాని నెపోలియన్ పతనానంతరం ఏర్పడ్డ వియన్నా కాంగ్రెస్ ఇటలీ ప్రజల జాతీయతను నిర్లక్ష్యం చేసి ఇటలీని అనేక భాగాలుగా విభజించినది. అవి

1) ఉత్తర ఇటలీలో లంబార్డీ, వెనీషియాలు ముఖ్యరాజ్యాలు. ఇవి ఆస్ట్రియా పాలనలో ఉండేవి. సనాతన ఆస్ట్రియా ఈ రాజ్యాలను తన ప్రతినిధులచే ప్రత్యక్షంగా పాలించేది.
2) మధ్య ఇటలీలో టస్కనీ, మొదీనా, పార్మా అనే మూడు చిన్న రాజ్యాలు ఉండేవి. ఇవి ఆస్ట్రియా రాజవంశానికి సంబంధించిన వారిచే పాలింపబడేవి. ఈ రాజ్యాలపై కూడ ఆస్ట్రియా పరోక్షంగా అధికారాన్ని చలాయించేది.
3) మధ్య ఇటలీలో రొమగ్నా, అంబ్రియా, సెంట్ పీటర్స్ పేట్రా మనీలు పోప్ ఆధిపత్యంలో ఉన్నాయి. ఇతని పరిపాలన సనాతనము అభివృద్ధి నిరోధకము.
4) దక్షిణ ఇటలీలో రెండు సిసిలీల (నేపుల్స్, సిసిలీ) రాజ్యాన్ని బోర్బన్ వంశస్థుడైన ఫెర్డినాండ్ పరిపాలిస్తు ఉండేవాడు. ఇతను సనాతనవాది. అతి క్రూరుడు.
5) ఇటలీ వాయవ్యాన పీడ్‌మాంట్‌తో బాటు సవాయి, సార్డీనియా, జెనీవా రాజ్యాలు ఒక చిన్న జాతీయ రాజ్యంగా ఏర్పడి ఉదారవాదానికి జాతీయ వాదానికి ఎడారిమయంగా కనిపించిన ఇటలీలో ఈ రాజ్యం ఒయాసిస్సు వంటిది. ఇటలీలోని ఉదారవాదులు దేశభక్తులంతా తమదేశ ఏకీకరణకు ఈ రాజ్యనాయకత్వాన్ని అభిలషించారు.

## 8.2.2 ఇటలీ ఏకీకరణ ఉద్యమాలు - రహస్య సంఘాలు :

ఇటలీలోని రాజ్యాల ఉదారవాదులంతా సమైక్య ఇటలీని వాంఛించారు. కాని ఇటలీ సమైక్యతకు అనేక అడ్డంకులు వచ్చాయి. ఇటలీపై ఆధిపత్యం కల్గిన ఆస్ట్రియా ఇటలీ సమైక్యతను వ్యతిరేకించింది. అంతేకాకుండ ఇటలీలోని వివిధ రాజ్యాల అధినేతలు పోప్ ఐక్య ఇటలీలో తమ అధికారాలు తగ్గిపోతాయనే భయంతో ఇటలీ సమైక్యతను వ్యతిరేకించారు. వీరు తమ రాజ్యాలలో వాక్స్వాతంత్ర్యము పత్రికా స్వాతంత్ర్యమును అరికట్టి సభలు సమావేశాలను నిషేధించి నిరంకుశత్వాన్ని స్థాపించినారు.

దీనితో ఇటలీలోని జాతీయవాదులు, ఉదారవాదులు అనేక రహస్యసంఘాలుగా ఏర్పడినారు. వాటిలో కార్బొనరీ రహస్య విప్లవ సంఘం ముఖ్యమైనది. కార్బొనరీ అనగా బొగ్గును కాల్చేవారని దీని అర్థము. మొదట ఈ సంఘానికి చెందినవాడే కుజని. ఇది మొదట నేపుల్స్‌లో స్థాపించబడినది. తర్వాత ఇది దేశమంతటా వ్యాపించినది. 1830 నాటికి ఇందు లక్ష మంది సభ్యులు చేరారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యం వీరి నినాదం. విదేశీ పాలన నుండి ఇటలీని విముక్తి చేయడం వారి లక్ష్యం. వీరికి ప్రత్యేక విప్లవ పతాకం కలదు. కాని వీరి ఉద్యమాన్ని మెటర్నిక్ అణచినాడు. దానితో కార్బొనరీ విప్లవసంఘం బలహీనమైనది.

## 8.2.3 రిసార్జిమెంటో ఉద్యమము :

పైన చెప్పిన రహస్య సంఘాలేకాకుండ ఇటలీలోని కవులు, రచయితలు, నాటకకర్తలు తమ రచనల ద్వారా ఇటలీలో జాతీయభావాన్ని ప్రేరేపించే ఉద్యమాన్ని సాగించినారు. ఈ ఉద్యమాన్నే రిసార్జిమెంట్ ఉద్యమమని అందురు.

## 8.2.4 సమైక్యవాద వర్గాలు :

ఇటలీ సమైక్యతను వాంఛించే వారిలో మూడు వర్గాలు కలవు.

### 8.2.4.1 మాజని (1805-1872) :

ఇటలీని సమైక్య రిపబ్లిక్‌గా రూపొందించాలనే ఉదారవర్గానికి జోసెఫ్ మాజనీ నాయకుడు. ఇతను జెనివా వాస్తవ్యుడు. ఇతడు మొదట కార్బొనరి సంఘ సభ్యుడుగా చేరెను. కాని ఆ సంఘములో కొన్ని లోపములున్నందున తాను ప్రత్యేకముగా 1831లో యంగ్ ఇటలీ అనే నూతన విప్లవ సంఘాన్ని స్థాపించినాడు. 40 సం॥లలోపు విద్యావంతులు ఈ సంఘ సభ్యులు. ఈ సంఘం ఇటలీని సమైక్య రిపబ్లిక్‌గా రూపొందించటానికై నిరంతర కృషి కొనసాగించింది. 1848 విప్లవ కాలములో ఇతను తన శిష్యుడు గారిబాల్డీ సహాయంతో మధ్య ఐరోపాలోని పోప్ అధికారాన్ని కూలద్రోసి రిపబ్లిక్‌ను స్థాపించినాడు. కాని ఫ్రాన్స్ చక్రవర్తి మూడవ నెపోలియన్ ఈ రిపబ్లిక్‌ను కూలద్రోసి పోప్ అధికారాన్ని కాపాడెను, తర్వాత చార్లెస్ అల్‌బర్ట్ హత్య కుట్రలో పాల్గొని ఇంగ్లండు పారిపోయెను. దీనితో మాజని ప్రయత్నం విఫలమైంది. దీనికి తోడు ఇటలీ ప్రజలు కూడ రిపబ్లిక్ భావానికి వ్యతిరేకులు. అందుచేత పబ్లికన్ల ఆశయం నెరవేరకపోయిన వీరి ప్రచారం చేసిన భావాలు ఇటలీ ఏకీకరణకు తోడ్పడ్డాయి. కనుక మాజనీని ఇటలీ జాతీయోద్యమ సంస్థాపకుడుగా చెప్పవచ్చును.

### 8.2.4.2 జియోబర్టి వర్గం :

పిడ్‌మాంట్‌కు చెందిన జియోబర్డి అనే మతాచార్యుడు కూడ సమైక్య ఇటలీని వాంఛించినాడు. ఇతను రిపబ్లిక్‌కు వ్యతిరేకి. ఇటలీలోని రాజ్యాలన్ని పోప్ ఆధ్వర్యంలో ఒక ఉదార సమాఖ్యగా ఏర్పడాలని ప్రతిపాదించినాడు. ఈ విషయాన్నే అతని గ్రంథం అయినటువంటి "ఇటలీ దేశస్థుల నైతిక పౌరప్రాధాన్యత" చెప్పబడినది. ఈ ప్రతిపాదనను ధనికులు, కేథలిక్ మతాచార్యులు బలపరచినారు. పోప్ 9వ పయస్ వీరిని సమర్థించినాడు. ఈ పథకం విజయం పోప్‌పై ఆధారపడి ఉంది. అయితే సనాతనుడైన పోప్ ఉదారవాదాన్ని హర్షించలేదు. అంతేకాకుండ తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి విదేశీ సహాయం అర్థించటంతో ఈ వర్గం ప్రజలలో పలుకుబడి కోల్పోయింది. అంతేకాకుండ మాజని 1848లో పోప్ అధికారాన్ని కూలదోసి అచట రిపబ్లికన్‌ను స్థాపించినాడు. దీనితో జియోబర్టి ఉద్యమం అంతమయినది.

### 8.2.4.3 సార్డీనియా రాజపక్ష వర్గం :

పై ఉద్యమాలు విఫలం కావటంతో ఇటలీలోని ఉదారవాదులు ఇటలీ ఏకీకరణకు సార్డీనియా రాజు వంశాన్ని నాయకత్వం వహించవలసినదిగా కోరారు. ఇటలీలో ఉన్న పాలకులలో సార్డీనియాను పాలించే సవాయి వంశం ఒక్కటే ఇటలీ జాతికి చెందినది. ఇటలీలో ఉన్న రాజ్యాలన్నింటిలోను బలమైనది, భాగ్యవంతమైనది సార్డీనియా రాజ్యం. అచటనున్న ధనికులు, మధ్యతరగతి ప్రజలు అందరు జాతీయ వాదులు, ఉదారవాదులు. సార్డీనియా రాజు చార్లెస్ అల్‌బర్ట్. ఇతడు ఉదారవాది. తన రాజ్యంలో అనేక ఉదారవాద సంస్కరణలను ప్రవేశపెట్టాడు. క్రీ॥శ॥ 1848లో ఇటలీలో ఉదారవాద విప్లవం సందర్భంగా ఆస్ట్రియాతో తలపడి ఓడిపోయినాడు. ఆ అవమానం భరించలేక సింహాసనాన్ని పరిత్యజించినాడు. అతని తర్వాత అతని కుమారుడు రెండవ విక్టర్ ఇమ్మాన్యుయేల్ సార్డీనియా రాజయ్యెను.

#### 8.2.4.3.1 విక్టర్ ఎమాన్యుయేల్ :

ఛార్లెస్ అల్‌బర్ట్ తర్వాత అతని కుమారుడు విక్టర్ ఎమాన్యుయేల్ రాజయ్యెను. ఇతను ఉదారవాది. మిగతా ఇటలీ రాజ్యాలు క్రీ.శ. 1848లో ప్రవేశపెట్టిన తమ రాజ్యాంగాలను రద్దుచేశాయి. కాని సార్డీనియాలో ఈ రాజ్యాంగం కొనసాగింపబడి ఎమాన్యుయేల్ ప్రజలచే ధర్మప్రభువుగా కీర్తించబడ్డాడు. ఇతను జాతీయవాదులకు పూర్తి సహకారాన్ని ఇచ్చి ఇటలీ ఏకీకరణకు నాయకత్వం వహించాడు. ఈ కార్యాన్ని సాధించటానికి మేధా సంపన్నుడైన కౌంట్ కవూర్‌ను తన ప్రధానమంత్రిగా నియమించాడు.

## 8.2.5 కవూర్ :

కవూర్ ఇటలీ ఏకీకరణలో ప్రముఖపాత్ర వహించెను. ఇతను క్రీ.శ. 1810 లో పిడ్‌మాంట్‌కు చెందిన ఒక ఉన్నత కుటుంబంలో జన్మించెను. సార్డీనియా సైన్యంలో పనిచేస్తూ ఆంగ్ల రచయిత ప్రభావమునకులోనై ఉదార భావాలను సంతరించుకున్నాడు. ఇంగ్లండు, ఫ్రాన్సు దేశాలలో పర్యటన చేసి పారిశ్రామిక ప్రగతిని గమనించాడు. రిసార్జిమెంట్ పత్రికలో సంపాదకుడుగా చేరి ఇటలీ సమైక్యతకు సార్డీనియా నాయకత్వాన్ని బలపరచినాడు. తన తెలివితేటలతో క్రీ॥శ 1850లో విక్టర్ ఎమాన్యుయేల్ మంత్రి వర్గంలో చేరి క్రీ.శ. 1852లో ప్రధానమంత్రి అయినాడు. తన మేధాశక్తితో ఇటలీ ఏకీకరణ ప్రథమ, ద్వితీయ ఘట్టాలలో ప్రముఖపాత్ర నిర్వహించి ఏకీకరణ సాధించాడు.

## 89.2.6 ఇటలీ ఏకీకరణలో ముఖ్య ఘట్టాలు :

### 8.2.6.1 ప్రథమ ఘట్టము :

ఇటలీ ఏకీకరణకు సార్డీనియా నాయకత్వం వహించింది. ఇటలీ ఏకీకరణ సాధించాలంటే ఇటలీపై ఆధిపత్యం కల్గిన ఆస్ట్రియాను సార్డీనియా ఓడించవలెను. కాని ఆస్ట్రియాను ఓడించగల్గిన శక్తి సామర్థ్యాలు సార్డీనియాకు లేవు. సార్డీనియా చాలా చిన్న దేశం. జనాభా 50 లక్షలు మాత్రమే. కనుక కవూర్ తన రాజ్య సంపత్తిని వృద్ధి చేయడమే కాకుండ తన దౌత్యనీతితో విదేశీ సహాయాన్ని సంపాదించటానికై ప్రయత్నించెను. అట్టి సమయములోనే 1856లో ఐరోపాలో రష్యా ఆటోమాన్ రాజ్యాల మధ్య క్రిమియా యుద్ధం ప్రారంభమయ్యెను.

### 8.2.6.1.1 క్రిమియా యుద్ధము :

క్రీ॥శ 1854-1856 లో రష్యాకు టర్కీకి బాల్కన్ రాజ్యాలలో వచ్చిన సమస్యల వలన క్రిమియా యుద్ధము జరిగినది. ఈ యుద్ధంలో ఇంగ్లండు, ఫ్రాన్సులు టర్కీ రాజ్యాన్ని బలపరచినాయి. ఈ యుద్ధంతో ఎట్టి సంబంధం లేకపోయిన సార్డీనియా రాజ్యం ఇంగ్లండు, ఫ్రాన్సులతో చేరినది. రష్యా పక్షాన ఆస్ట్రియా చేరగలదని కవూర్ ఆశించాడు. కాని ఆస్ట్రియా ఈ యుద్ధంలో చేరలేదు. కవూర్ కొంత నిరాశ చెందినప్పటికి ఈ యుద్ధాన్ని అవకాశంగా తీసికొని ఫ్రెంచి చక్రవర్తి మూడవ నెపోలియన్‌తో స్నేహం చేశాడు. 1856లో కవూర్ క్రిమియా సంధి సందర్భంగా పారిస్‌ను సందర్శించాడు. ఆస్ట్రియాతో తాను చేయబోయే యుద్ధంలో కవూర్ మూడవ నెపోలియన్ సహాయం కోరాడు. అనేక అవరోధాలు దాటి చివరకు 1858లో ప్లాంబియర్స్ వద్ద మూడవ నెపోలియన్‌తో ఒక అంగీకారం కుదుర్చుకొన్నాడు. దీని ప్రకారం కవూర్‌కు లంబార్డీ వెనీషియాల నుండి ఆస్ట్రియన్‌లను తరిమి వేయుటానికి మూడవ నెపోలియన్ సహాయం చేయుటకు అంగీకరించాడు. దీనికి ప్రతిఫలంగా సవాయి భూభాగం, నైస్ పట్టణం ఫ్రాన్సుకు ఇవ్వబడతాయి.

### 8.2.6.1.2 ఆస్ట్రో - సార్డీనియా యుద్ధం (1859) :

ప్లాంబియర్స్ సంధి తర్వాత కవూర్ ఆస్ట్రియాతో యుద్ధానికి సన్నాహాలు చేయసాగెను. లంబార్డీ, వెనీషియాలో సైన్యాన్ని వృద్ధి చేయసాగెను. ఈ సైన్యాభివృద్ధిని చూసిన ఆస్ట్రియా సైన్యాన్ని తగ్గించమని సార్డీనియాను హెచ్చరించింది. దీనిని కవూర్ తిరస్కరించగా ఆస్ట్రియా సార్డీనియాపై 1859 లో యుద్ధం ప్రకటించింది. ఫ్రెంచి సార్డీనియా సైన్యాలు లంబార్డీలో ప్రవేశించి మాజెంటా, సల్ఫరినో యుద్ధాలలో ఆస్ట్రియా సేనలను ఓడించి తరిమికొట్టెను. లంబార్డీ సార్డీనియాకు వశమయ్యెను. కాని వెనీషియా కూడ సార్డీనియా వశమైతే ఇటలీలో సార్డీనియా పలుకుబడి ఎక్కువవుతుందని దీనివలన ఫ్రెంచి భవిష్యత్తుకు ప్రమాదం

వాటిల్లుతుందని భయపడిన మూడవ నెపోలియన్ కవూర్‌తో చెప్పకుండా సార్డీనియాకు తానిచ్చిన వాగ్దానం పూర్తిగా నెరవేర్చకుండానే ఆస్ట్రియాలో 1859లో విల్లా ఫ్రాంకా వద్ద రహస్య సంధి చేసుకుని యుద్ధభూమి నుండి మరలెను. దీనితో నిరాశ చెందిన కవూర్ ఆవేశంతో తన పదవికి రాజీనామా చేసెను. ఈ ప్రథమ ఘట్టంలో లొంబార్డీ సార్డీనియా వశమయ్యెను, దీని ఫలితంగా సార్డీనియా రాజ్య విస్తీర్ణం, జనాభా రెండింతలయ్యెను.

## 8.2.6.2 ద్వితీయ ఘట్టము :

సార్డీనియా ఆస్ట్రియాను ఓడించి లంబార్డీని ఆక్రమించటంతో మధ్య ఇటలీ రాజ్యాలయినటువంటి టస్కనీ, పార్మా, మొదీనా ప్రజలలో దేశభక్తి, జాతీయభావం పెంపొంది తమ రాజ్యాధినేతలపై తిరుగుబాటు చేయటంతో వారు పారిపోయినారు. ఈ మూడు రాజ్యాలలోను విప్లవ ప్రభుత్వాలు ఏర్పడి ప్రజాభిప్రాయాన్ని సేకరించి సార్డీనియాతో సంలీనం చెందటానికి అభ్యర్థన పంపారు. ఇదే సమయంలో పోప్ ఆధీనంలో నున్న రొమగ్నా, బలగ్నాలలోని ప్రజలు తిరుగుబాటు చేసి వారు కూడ సార్డీనియాతో కలసిపోదలచిరి. దీనికి ప్రథమంలో 3వ నెపోలియన్ వ్యతిరేకించాడు. ఇలాంటి సమయంలో దేశ శ్రేయస్సుకై తిరిగి పదవి చేపట్టిన కవూర్ ఈ రాజ్యాల సంలీనాన్ని 3వ నెపోలియన్‌తో అంగీకరింపచేశాడు. సవాయి, నైస్‌లు ఫ్రాన్సుకు ఇవ్వబడ్డాయి. టస్కనీ, పార్మా, మొదీనా పోప్ ఆధీనంలోనున్న రొమగ్నా కూడ సార్డీనియాతో విలీనమైనాయి. దీనితో రెండవ ఘట్టం ముగిసింది.

## 8.2.6.3 తృతీయ ఘట్టము :

మొదటి రెండు ఘట్టాలకు కవూర్ నాయకుడైతే ఈ మూడవ ఘట్టము గారిబాల్డీ నాయకత్వంలో జరిగెను. ఇతడు 1807లో నైస్‌లో జన్మించెను. సార్డీనియా నౌకాదళంలో నావికుడిగా పనిచేసినాడు. యంగ్ ఇటలీచే ఆకర్షితుడై మాజినీ ప్రభావానికి లోనై ఐక్య ఇటలీ స్థాపనకై తన జీవితాన్ని అంకితం చేశాడు. సాహసికుడైన గారిబాల్డి జనీవాలో తిరుగుబాటు చేసి యుద్ధ నౌకను ఆయుధాగారాన్ని పట్టుకోవటానికి ప్రయత్నించి పట్టుబడ్డాడు. ప్రభుత్వం ఇతనికి మరణ శిక్ష విధించెను. ఎలాగో తప్పించుకొని దక్షిణ అమెరికా పారిపోయినాడు. మరల 1848 లో రెడ్ షర్ట్స్ (Red Shirts) అనబడే తన సైన్యంతో సార్డీనియాలో ప్రవేశించి ఆస్ట్రియాకు వ్యతిరేకంగా పోప్‌పై యుద్ధం చేశాడు. పరాజితుడై న్యూయార్క్ పారిపోయినాడు. చివరకు 1854లో ఇటలీ ఏకీకరణ సందర్భంగా స్వదేశానికి తిరిగివచ్చి ఏకీకరణ కృషికి ఎంతగానో తోడ్పడ్డాడు.

దక్షిణ ఇటలీలోని రెండు సిసిలీల రాజ్యం ఫెర్డినాండ్ నిరంకుశత్వంలో నలిగిపోయింది. క్రీ॥శ॥ 1859లో 2వ ఫ్రాన్సిస్ రాజయ్యెను. పరిపాలనా పద్ధతి మారలేదు. క్రీ॥శ॥ 1860లో ఈ రాజ్య ప్రజలు తిరుగుబాటు చేయగా వారికి సహాయం చేయటానికి కవూర్ ప్రోత్సాహంతో గారిబాల్డీ 1860 మే నెలలో సిసిలీలో ప్రవేశించినాడు. అతి కొద్దికాలంలోనే సిసిలీ ద్వీపం ఇతని వశము అయ్యినది. సెప్టెంబరు 1860లో నేపుల్స్‌ను ఆక్రమించినాడు. 2వ ఫ్రాన్సిస్ పారిపోయెను.

సిసిలీ ద్వయాన్ని ఆక్రమించిన వెంటనే గారిబాల్డీ రోమ్ వైపు పురోగమించెను. గారిబాల్డీ రిపబ్లిక్ భావాలు కలిగినవాడు. రెండు సిసిలీలు రిపబ్లిక్‌గా రూపొందితే ఇటలీ ఐక్యతకు అవరోధం కలుగుతుందనే భయంతో కవూర్ సార్డీనియా సైన్యమును పోప్ రాజ్యములోనికి పంపెను. సార్డీనియా సేనలు పోప్ సేనలను ఓడించి రెండవ ఫ్రాన్సిస్‌ను బంధించి నేపుల్స్‌ని చేరింది. రోమ్ మినహా మిగతా భూభాగమంతా పోప్ వ్యతిరేకతను కూడా లెక్కచేయక సార్డీనియాతో కలపబడింది. గారిబాల్డీ రిపబ్లికన్‌ల కాని అంతకు మించి దేశభక్తుడు. తాను జయించిన రెండు సిసిలీల రాజ్యాన్ని సార్డీనియా రాజుకు అప్పగించి రాజకీయ రంగం నుండి విరమించి నిరాడంబర జీవితమును గడిపెను. రోమ్, వెనీషియాలు మినహా మిగతా ఇటలీ దేశమంతా సార్డీనియా నాయకత్వమున సమైక్యతను సాధించింది.

### 8.2.6.4 చతుర్థ ఘట్టము :

సమైక్య ఇటలీలో రోమ్, వెనీషియాలు చేర్చబడలేదు. జర్మనీ ఏకీకరణ సందర్భంగా ఈ రెండు రాజ్యాలు ఇటలీ దేశంలో చేర్చబడ్డాయి.

### 8.2.6.4.1 వెనీషియా విలీనీకరణ :

జర్మనీ ఏకీకరణకై బిస్మార్క్ నాయకత్వంలో ప్రష్యా ఆస్ట్రియాపై యుద్ధం ప్రకటించెను. విక్టర్ ఎమాన్యుయేల్ బిస్మార్క్ పక్షం వహించెను. ఏడు వారాల యుద్ధంలో ఘోరంగా ఓడిపోయిన ఆస్ట్రియా ప్రాగ్ సంధి చేసుకొనెను. ఈ సంధి ప్రకారము 1866లో వెనీషియాను ఇటలీకి దత్తం చేసినది.

### 8.2.6.4.2 రోమ్ విలీనీకరణ :

వెనీషియాను ఇటలీ విలీనం చేసికొన్న 4 సం॥ల తర్వాత ఫ్రాన్స్ ప్రష్యాల మధ్య యుద్ధం ప్రారంభమయ్యెను. ఫ్రాన్స్ చక్రవర్తి 3వ నెపోలియన్ తన దేశంలోని కేథలిక్కుల మద్దతుకై పోప్‌కు తన సైన్యంతో రక్షణ కల్పించాడు. కాని ప్రష్యాతో యుద్ధ సందర్భంగా రోమ్‌లోనున్న ఫ్రెంచ్ సైన్యాలను తిరిగి ఫ్రాన్స్‌కు పిలిపించుకొనెను. ఎమాన్యుయేల్ దీనిని అవకాశంగా తీసికొని బిస్మార్క్ అంగీకారంతో 60 వేల సైన్యంతో పోప్‌పై దాడిచేసి రోమ్‌ను ఆక్రమించెను. శతాబ్దాల తరబడి పోప్‌కు నిలయమైన రోమ్ క్రీ॥శ 1871లో ఇటలీ జాతీయ రాజధానిగా వెలసినది. రెండవ విక్టర్ ఎమాన్యుయేల్ సమైక్య ఇటలీకి ప్రధమ చక్రవర్తి అయ్యెను. తరతరాలుగా ఇటలీ దేశాభిమానులు కలలు కంటున్న ఆశయం నెరవేరింది.

మాజనీ నైతిక బలంతో, కవూర్ దౌత్యనీతితో గారిబాల్డీ సాహసంతో విక్టర్ ఎమాన్యుయేల్ మంచితనంతో ఇటలీ సమైక్యత సాధించబడింది. ఇటలీ ఏకీకరణ అనే మహా వ్యక్తికి మాజనీ ఆత్మ, కవూర్ మేధస్సు, గారిబాల్డీ దేహం, విక్టర్ ఎమాన్యుయేల్ రక్షకుడు అని కొందరు వర్ణించిరి.

### 8.2.7 ప్రాధాన్యత :

ఇటలీ ఏకీకరణ అనేది ఉదారవాదానికి, జాతీయవాదానికి ఘనవిజయం. సనాతన వాదానికి చరమగీతం. సమైక్య ఇటలీ అతి కొద్ది కాలంలోనే ఐరోపా రాజకీయాలలో ప్రముఖపాత్ర వహించింది. "విగత జాతిగా కన్పించిన ఇటలీ నూతన చైతన్యంతో పునరుత్తేజితమై గతమనే శృంఖాలను తెంచుకొని బంగారు భవిష్యత్తుకు బాటను నిర్మించుకొందని" లార్డ్ పామస్టన్ శ్లాఘించాడు.

## 8.3 జర్మనీ ఏకీకరణ :

### 8.3.1 పరిచయం :

ఇటలీ వలనే జర్మనీ కూడ 19వ శతాబ్దం వరకు రాజకీయ ఐక్యతను సాధించలేకపోయినది. ఈ దేశం కూడ పవిత్ర రోమన్ సామ్రాజ్యంలో భాగమై ఆస్ట్రియా ఆధిపత్యం క్రింద ఉంటూ అనేక రాజ్యాలుగా విభజించబడి వివిధ రాజవంశులచే పరిపాలిస్తూ ఉన్నందువలన ఏకీకరణ సాధ్యపడలేదు. మతసంస్కరణ ఉద్యమ ఫలితంగా, ముప్పది సంవత్సరాల యుద్ధ ఫలితంగా పవిత్ర రోమన్ సామ్రాజ్యాధికారం క్షీణించటం జరిగింది. 17, 18 శతాబ్దాలలో జర్మనీలోని ప్రష్యా సామ్రాజ్యం బలపడినది. జర్మనీ ప్రాంతాలపై ఆధిపత్యం కొరకు ఫ్రాన్స్ దాడులు చేస్తూ ఉండేది. నెపోలియన్ ఈ జర్మనీలోని పెక్కు రాజ్యాలను జయించి చిన్న సంస్థానాలను పెద్ద రాజ్యాలతో మిళితం చేసి మొత్తం జర్మనీలో 37 రాజ్యాలు ఉండేటట్లు పునర్వ్యవస్థీకరించాడు. ఈ

రాజ్యాలపై ఆస్ట్రియా ఆధిపత్యం తొలగింపబడింది. ఈ రాజ్యాలన్నింటిలోను నెపోలియన్ కొన్ని ప్రజాహితమైన సంస్కరణలను ప్రవేశపెట్టినాడు. బానిసత్వాన్ని నిర్మూలించాడు. భూస్వామ్య పద్ధతిని రద్దు చేసినాడు. విప్లవ సిద్ధాంతాలను అనుసరించి ఆర్థిక, సాంఘిక వ్యవస్థలో మార్పులు ప్రవేశపెట్టినాడు. ఒకేవిధమైన పాలనా వ్యవస్థను రూపొందించినాడు. దీనితో వివిద సంస్థానాల మధ్య అడ్డంకులు పోయి జర్మన్‌లంతా ఒక్కటే అనే జాతీయతాభావం జర్మనీలో అంకురించటానికి నెపోలియన్ కారకుడయినాడు. అందుకే ఆధునిక జర్మనీ అవతరణకు నెపోలియన్‌ను మూలపురుషుడుగా చెప్పవచ్చును.

నెపోలియన్ పతనానంతరం ఏర్పడ్డ వియన్నా కాంగ్రెస్ జర్మనీ జాతీయతను నిర్లక్ష్యం చేసి జర్మనీని 38 రాజ్యాలుగా ఒక సమాఖ్యను ఏర్పరచి దానిపై ఆధిపత్యం ఆస్ట్రియాకు ఇచ్చినది. మెటర్నిక్ జర్మనీ జాతీయ ఉదార భావాలను విప్లవశక్తులను అణచివేయటానికి నిరంతర కృషి చేసినాడు. జర్మనీ విద్యార్థులు విప్లవ సంఘాలు స్థాపించగా కారల్స్ బాడ్ శాసనాల ద్వారా వారిని అణచినాడు.

## 8.3.2 జొల్వేరిచ్ వాణిజ్య సంస్థ (Customs Union) :

క్రీ॥శ॥ 1818లో ప్రష్యా నాయకత్వంలో వివిధ జర్మన్ రాజ్యాల మధ్య జొల్వేరిన్ అనే సుంకాల వ్యవస్థ ఏర్పడింది. ఈ యూనియన్‌లో 17 రాజ్యాలు చేరాయి. ఈ వ్యవస్థలోని రాజ్యాల మధ్య స్వేచ్ఛావర్తక వ్యాపారాలు ఆర్థిక సహకారం ప్రోత్సహింపబడినాయి. ఈ వ్యాపార సంబంధాలు జర్మనీ ప్రజలలో ఐక్యభావాన్ని కల్గించినాయి. జొల్వేరియన్ సంస్థ జర్మనీ ఏకీకరణకు తొలి సోపానంగా పనిచేసింది.

## 8.3.3 ఫ్రాంక్‌ఫర్ట్ సమావేశము :

క్రీ॥శ॥ 1830 లో జర్మనీలో కూడ పెక్కు జాతీయ తిరుగుబాట్లు జరిగాయి. కాని అవి విఫలమయినాయి. 1848లో జరిగిన ఉదార విప్లవం వలన ప్రష్యారాజు 4వ ఫెడరిక్ విలియం జాతీయ పార్లమెంటును ఫ్రాంక్‌ఫర్ట్ వద్ద సమావేశపరచినాడు. జర్మనీ రాజ్యానికి రాజ్యాంగం రూపొందించమని కోరాడు. కాని ఆస్ట్రియా ప్రష్యాను ఓడించి ఆ ప్రయత్నాన్ని వమ్ముచేసింది. దీనితో ఆస్ట్రియా జర్మనీ నుండి వైదొలగితేగాని జర్మనీ ఏకీకరణ సాధ్యంకాదని ప్రష్యాయే ఆ పనిచేసి జర్మనీ ఐక్యానికి పూనుకొనవలెనని నిర్ధారణ అయింది.

## 8.3.4 ప్రష్యా నాయకత్వము :

క్రీ॥శ॥ 1859 నాటికి ఆస్ట్రియా ఇటలీలో ఓడింపబడి బలహీనపడింది. దీనితో జర్మనీ నాయకత్వం ప్రష్యాకు లభించినది. జర్మనీలోని ప్రతి ఒక్కరు జర్మనీ ఏకీకరణను వాంఛించినారు. ప్రష్యారాజు 4వ ఫెడరిక్ విలియంకు 1858లో మతిభ్రమించి 1861లో మరణించటంతో అతని సోదరుడు మొదటి విలియం ప్రష్యా రాజయినాడు.

## 8.3.5 మొదటి విలియం (1861-1888) :

మొదటి విలియం సమర్థుడైన రాజు. విధి నిర్వహణలో శ్రద్ధ, దృఢ నమ్మకం కల్గిన యోగ్యుడు. సనాతనవాది. రాచరికం దైవదత్తమని, రాజు దైవాంశ సంభూతుడనే భావాలు ఉన్నవాడు. తన వంశ పేరు ప్రతిష్టలను ఇనుమడింపచేయాలనే ఆకాంక్ష కల్గినవాడు. గొప్ప సైనిక వాది. సైనిక విషయాలను అత్యంత శ్రద్ధాశక్తులతో గమనించి సైన్యాన్ని సమర్థవంతంగా రూపొందించినాడు. రూన్ అనే విశిష్టవ్యక్తిని యుద్ధమంత్రిగాను, వాన్ మాల్టేగ్ అనే వీరుడ్ని సైన్యాధిపతిగా నియమించాడు. నిర్బంధ సైనికశిక్షణ ప్రవేశపెట్టినాడు. అంతకు పూర్వం ప్రతి సంవత్సరము 40 వేల మందికి సైనిక శిక్షణ ఇచ్చేవారు. కాని ఆ సంఖ్యను 63 వేలకు

పెంచినాడు. ఈ అదనపు ఖర్చును ప్రష్యా పార్లమెంటు ఆమోదించవలసియున్నది. పార్లమెంటులో ఉదారవాదుల బలం అధికం. వారు ఈ సైన్యాభివృద్ధికి వ్యతిరేకులు కానప్పటికి ఈ అదనపు ఖర్చును మంజూరు చేయకుండా రాజును ఇబ్బంది పెట్టి అతనిచే ప్రష్యాలో రాజ్యాంగబద్ధ రాచరికానికి అంగీకరింపజేయాలని భావించారు. క్రీ॥శ 1861లో వీరు రాజు కోరిన డబ్బును మంజూరు చేయటానికి నిరాకరించినారు. అందువలన అతను పార్లమెంటును రద్దు చేసి ఎన్నికలు జరిపినాడు. కాని మరల నూతన పార్లమెంటుకు ఉదారవాదులు అత్యధిక సంఖ్యలో ఎన్నికై అతని విధానాన్ని వ్యతిరేకించినారు. దీనితో అతను సింహాసనం పరిత్యజింపవలసిన పరిస్థితి ఏర్పడింది. కాని యుద్ధ మంత్రి రూన్ సలహా ప్రకారం ఆటోమన్ బిస్మార్క్ అనే వ్యక్తిని రాజు ఆహ్వానించి అతనితో సంప్రదించి అతనిని ఛాన్సలర్‌గా నియమించినాడు. బిస్మార్క్ రాకతో జర్మనీ ఏకీకరణ ఉద్యమంలో నూతన అధ్యాయం ప్రారంభమయినది.

## 8.3.6 ఆటోమన్ బిస్మార్క్ (1815-1898) :

బిస్మార్క్ బెర్లిన్‌కు 40 మైళ్ళ దూరంలో ఉన్న షోన్ హుసెన్ అనే గ్రామంలో ఒక భూస్వామి కుటుంబంలో జన్మించినాడు. బెర్లిన్ గొటెంజన్ విశ్వవిద్యాలయాలలో విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగంలో చేరినాడు. కాని క్రమశిక్షణా రాహిత్యం వలన ఉద్యోగాన్ని కోల్పోయినాడు. 1847లో ఒక భూస్వామి కుమార్తెను వివాహమాడెను. ఆమె ప్రభావంతో స్థిరమైన భావాలను సంతరించుకొని ప్రముఖ సనాతనవాదిగా తయారయినాడు. 1848 ఉదారవాద విప్లవ సమయంలో అతడు ప్రష్యా శాసనసభలో సభ్యుడిగా ఉండి రాజ్యాంగాన్ని మంజూరు చేయవద్దని 4వ ఫెడరిక్ విలియంను కోరినాడు.

ఇతని ప్రజ్ఞా విశేషాలను గమనించిన ప్రభుత్వం ఇతనిని దౌత్య శాఖలో నియమించెను. 8 సం॥ లె జర్మన్ సమాఖ్యలో ప్రష్యా ప్రతినిధిగా పనిచేసెను. ఆ సమయంలోనే ఆస్ట్రియాపై వ్యతిరేకతను పెంచుకొనినాడు. రష్యాలో రాయబారిగా పనిచేసి రష్యా చక్రవర్తిచే గౌరవ మర్యాదలు పొందినాడు. పారిస్‌లో రాయబారిగా పనిచేసి 3వ నెపోలియన్ యొక్క బలహీనతలను గమనించెను. ఇంతటి విశేష అనుభవంతో క్రీ.శ. 1862 లో ప్రగల్భాలను పలుకుతున్న పార్లమెంటును మచ్చిక చేసుకోవటానికై బిస్మార్క్ ప్రధానమంత్రిగా నియమింపబడెను. బిస్మార్క్ పార్లమెంటుతో అంగీకారాన్ని కుదుర్చుకోవటానికి ప్రయత్నించి విఫలుడు కావటంతో బిస్మార్క్ తన విధానాన్ని ప్రకటించినాడు.

### 8.3.6.1 రక్తపాత విధానం :

బిస్మార్క్ "రాజకీయ సమస్యలు ఉపన్యాసముల వలన గాని పార్లమెంటు తీర్మానాల వలన గాని పరిష్కరింపబడవు దానికి కఠిన దండనీతే తరుణోపాయమని" ఉద్ఘాటించాడు. పార్లమెంటు ప్రమేయం లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టకుండా పన్నులు విధించి వసూలు చేసి నియంతృత్వపు పోకడలతో సైన్యాభివృద్ధి చేసినాడు. అభ్యుదయవాదులు, ఉదారవాదులు ఇతని విధానాన్ని దుయ్యబట్టారు. అయినప్పటికి ఏమాత్రం చలించక రాజ్యాంగ విరుద్ధ పాలనను 4 సం॥లు కొనసాగించినాడు. విధానం కన్న లక్ష్యసాధన ముఖ్యమని తలపోసినాడు. జర్మనీ ఏకీకరణ సాధించుటకు ప్రజాభీష్టమని అందుకు తాను ఏ పద్ధతులు అనుసరించిన వారికి సమ్మతమేనని ప్రజాభిప్రాయాన్ని చక్కగా అంచనా వేశాడు. ఇట్టి బలప్రయోగ విధానం ద్వారా బిస్మార్క్ 3 యుద్ధములుచేసి అడ్డంకులు అధిగమించి జర్మనీ ఏకీకరణ సాధించెను. ఆ యుద్ధములు ఏవనగా

1) డెన్మార్క్‌తో యుద్ధం (1864)
2) ఆస్ట్రో ప్రష్యా యుద్ధం (1866)
3) ఫ్రాంక్ ప్రష్యా యుద్ధం (1870-71)

### 8.3.6.2 డెన్మార్క్‌తో యుద్ధము (1864) :

ప్రష్యా ఆస్ట్రియాను అతి సునాయాసంగా ఓడించగలడనే నమ్మకం బిస్మార్క్‌కు కలిగింది. కాని ఆస్ట్రియాతో యుద్ధం చేయటానికి ఏదో ఒక కారణం కావాలి. డెన్మార్క్‌కు చెందిన ష్లేష్‌విగ్, హోల్‌స్టీన్ అనే రెండు సంస్థానముల యొక్క సమస్య అతనికి సదవకాశాన్ని ఇచ్చింది. ఈ రెండు సంస్థానములు జర్మన్ భూభాగాలు. ఇందులో అధిక సంఖ్యాకులు జర్మన్ ప్రజలు. అయినప్పటికి వియన్నా కాంగ్రెస్ ఈ రెండు ప్రాంతాలను డెన్మార్క్ ఆధీనంలో ఉంచింది. 1848లో ఈ రెండు ప్రాంతములు ఎవరికి చెందాలనే విషయం మీద పెద్ద వివాదం ఏర్పడింది. డెన్మార్క్ రాజైన 7వ ఫెడరిక్ ష్లేష్‌విగ్‌ను డెన్మార్క్‌తో కలపాలని ప్రయత్నించినాడు. అందుకు అంగీకరించని ష్లేష్‌విగ్ ప్రజలు తిరుగుబాటు చేసినారు. వారి తిరుగుబాటును ప్రష్యా సమర్థించింది. వియన్నా కాంగ్రెస్ ఈ ప్రాంతాలను డెన్మార్క్‌కు ఇచ్చియున్నందున ప్రష్యా జోక్యాన్ని ఇంగ్లండు, ఫ్రాన్స్, రష్యాలు అభ్యంతరం తెలిపినాయి. ఇది పెద్ద వివాదంగా మారటం వలన 1850లో ఐరోపారాజ్యాలు లండన్‌లో సమావేశమై ఒక రాజీ ప్రతిపాదన చేశాయి. దీని ప్రకారం ష్లేష్‌విగ్ హోల్‌స్టీన్ డెన్మార్క్ ఆధీనంలోనే ఉంటాయి. కాని డెన్మార్క్ ఈ ప్రాంతాలను విలీనం చేయకూడదు.

కాని ఫెడరిక్ తర్వాత అధికారానికి వచ్చిన 9వ క్రిష్టియన్ లండన్ సమావేశానికి విరుద్ధంగా 11 సం॥ల తర్వాత డెన్మార్క్ ప్రజల కోరికపై ఈ రెండు ప్రాంతములను డెన్మార్క్‌తో కలిపి వేసినాడు. ఇందుకు ప్రష్యా, ఆస్ట్రియాలు అభ్యంతరం తెలిపినాయి. వీరి అభ్యంతరాన్ని 9వ క్రిష్టియన్ లెక్కచేయలేదు. దీనితో ఆస్ట్రియా ప్రష్యాలు డెన్మార్క్‌పై దాడి చేసాయి. డెన్మార్క్ ఎంత వీరోచితంగా పోరాడినా 1864 అక్టోబర్‌లో ఓడిపోయి వియన్నా సంధి చేసుకొని ఈ ప్రాంతాలను వదులుకుంది. ఈ సంస్థానముల భవిష్యత్తును నిర్ణయించటంలో ఆస్ట్రియాతో కలహానికి దిగవచ్చని బిస్మార్క్ ఆశపడ్డాడు. ఆస్ట్రియా ఈ రెండు ప్రాంతములను ప్రత్యేక రాజ్యంగా రూపొందించి జర్మనీ సమాఖ్యలో సభ్యునిగా చేర్చుకోవాలని ప్రతిపాదించింది. దీనికి డయట్ కూడ అంగీకరించింది. ఈ విషయం ఆస్ట్రియా ప్రష్యాలకే సంబంధించినదని దీనితో డయట్‌కు సంబంధం లేదని బిస్మార్క్ వాదించాడు. యుద్ధానికి సిద్ధంగా లేని ఆస్ట్రియా 1865లో గాస్టిన్ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ష్లేష్‌విగ్ ప్రష్యాకు, హోల్‌స్టీన్ ఆస్ట్రియాకు చెందుతాయి. బిస్మార్క్ వ్యూహం ప్రకారం ఈ ప్రాంతాల విషయంలోనే ఆస్ట్రియాతో కలహం ప్రారంభించి యుద్ధానికి దిగాలి.

### 8.3.6.3 ఆస్ట్రియా - ప్రష్యా యుద్ధము - 1866 :

జర్మనీలో ఆస్ట్రియాతో అంతర్యుద్ధం ప్రారంభించే ముందు ఆస్ట్రియాకు ఏ విదేశీ సహాయం రాకుండా బిస్మార్క్ తన మేధాశక్తిని దౌత్యనీతిని ఉపయోగించి ఏకాకిని చేయుటకు ప్రయత్నించాడు. అగ్రరాజ్యమైన ఇంగ్లాండులో ప్రజాభిప్రాయం ప్రష్యా పక్షాన ఉంది. ప్రష్యాలోని స్వేచ్ఛా వ్యాపార పద్ధతి ఇంగ్లాండుకు అనుకూలం. వర్తక వ్యాపారాలపై ఆస్ట్రియా విధించిన విధానాలు ఇంగ్లాండుకు వ్యతిరేకం. కనుక ఇంగ్లండు నుండి ఎలాంటి ప్రమాదం లేదు. రష్యా తనకు క్రిమియా యుద్ధంలో సహాయం చేయని ఆస్ట్రియాపై కోపంగా ఉంది. పోలెండులో తిరుగుబాటు అణచటానికి బిస్మార్క్ రష్యాకు సహాయం చేస్తానన్నాడు. కనుక రష్యా కూడ ప్రష్యాకు అనుకూలంగా ఉంది. ఇకపోతే ఫ్రాన్స్ ఆస్ట్రియా కన్న ప్రష్యాను ఎక్కువగా ద్వేషిస్తుంది. కాని 3వ నెపోలియన్ పిరికితన్నాన్ని గమనించిన బిస్మార్క్ ఫ్రాన్స్ నుండి ఎలాంటి ప్రమాదాన్ని శంకించలేదు. ఇటలీ వెనీషియా ప్రాంతాన్ని సంపాదించటానికి ఇది తగిన సమయము విక్టర్ ఎమాన్యుయేల్‌ని ప్రోత్సహించి ఇటలీని తనవైపుకు త్రిప్పుకొన్నాడు.

ఈ విధంగా ఆస్ట్రియాను ఏకాకిని చేసి యుద్ధం చేయటానికి కవ్వింపు చర్యలు ప్రారంభించినాడు. మొదట హోల్‌స్టీన్‌లో ఆస్ట్రియా పాలనకు విరుద్ధంగా కుట్రలు పన్ని అలజడులు లేవదీశాడు. అపుడు ఆస్ట్రియా జర్మన్ పార్లమెంటుకు ఫిర్యాదు చేసింది. దానికి ఆస్ట్రియా గాస్టిన్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందనే నెపంతో ప్రష్యా సైన్యాలు హోల్‌స్టీన్‌ను ఆక్రమించుకొన్నాయి. దీనితో ఆస్ట్రియా ప్రభుత్వం కవ్వించబడింది. హోల్‌స్టీన్‌లో ప్రష్యా జోక్యాన్ని నిరోధించటానికై జర్మనీ సైన్యాలు సమీకరింపబడాలని

డయట్‌ని ఆస్ట్రియాని కోరింది. ప్రష్యా నాయకత్వంలో సమైక్య జర్మనీ ఏర్పడితే తమ పదవులను కోల్పోవలసి వస్తుందని చిన్న రాజ్యాల పాలకులు ఆస్ట్రియా ప్రతిపాదనను సమర్థించినారు. ఈ సమర్థింపును ఆస్ట్రియా చిన్న రాజ్యాలు సంయుక్తంగా తమ దేశంపై దాడి చేశాయని కనుక స్వీయ రక్షణకై యుద్ధం చేయక తప్పలేదన్నట్లుగా ప్రపంచానికి చాటాడు. ఈ యుద్ధంలో ప్రష్యా ఇటలీలు ఒక పక్షాన ఆస్ట్రియా, చిన్న జర్మన్ రాజ్యాలు రెండో పక్షాన క్రీ॥శ॥ 1866లో యుద్ధానికి తలపడ్డాయి. ఈ యుద్ధాన్ని ఏడు వారాల యుద్ధం అందురు. ఈ యుద్ధంలో ఆస్ట్రియా ఒకవైపు ప్రష్యాతోను, రెండవవైపు ఇటలీతో యుద్ధం చేయవలసి వచ్చినది. అది సమర్థవంతమైన ప్రష్యా సైన్యము చిన్న జర్మన్ రాజ్యాలను ఓడించి తర్వాత ఆస్ట్రియాను 1866 జూలై 3వ తేదీన సెడావో యుద్ధంలో ఓడించింది. ఓడిపోయిన ఆస్ట్రియా ప్రష్యాతో ప్రాగ్ సంధి చేసుకుంది.

### 8.3.6.3.1 ప్రాగ్ సంధి :

ఈ సంధి ఆస్ట్రియా ప్రష్యాకు హోల్‌స్టీన్ ఇటలీకి వెనీషియాను దత్తం చేసింది. జర్మన్ సమాఖ్య రద్దుకు ఉత్తర జర్మన్ సమాఖ్య ఏర్పాటుకు అంగీకరించింది. ఈ సమాఖ్యలో ఆస్ట్రియాకు సభ్యత్వం లేదు. బిస్మార్క్ చిన్న జర్మన్ రాజ్యాలలో పెక్కింటిని ష్లెష్‌విగ్ హోల్‌స్టీన్ సంస్థానములను హనోవార్ రాజ్యాన్ని నజు, హీశ్ కాసిల్ సంస్థానములను ఫ్రాంక్‌ఫర్ట్ నగరాన్ని ప్రష్యాలో సంలీనం చేశాడు. దీనితో ప్రష్యారాజ్యం 50 లక్షల కొత్త జనాభాను 27 వేల చదరపు మైళ్ళ భూభాగాన్ని సంపాదించింది. మెయిన్ నదికి ఉత్తరాన ఉన్న ఇంకో 20 రాజ్యాలతో క్రీ.శ. 1867లో ఉత్తర జర్మన్ సమాఖ్య ఏర్పడింది. దీనికి ప్రష్యారాజు అధ్యక్షుడు.

### 8.3.6.3.2 యుద్ధ ఫలితాలు :

ఈ యుద్ధం వలన ప్రష్యా గొప్ప సైనిక దేశంగా కీర్తి పొందింది. జర్మనీ నుండి ఆస్ట్రియా వెలివేయబడింది. ఉత్తర జర్మన్ రాజ్యాలను సమైక్యపరచుట బిస్మార్క్ సాధించిన ఘన విజయం.

కాని ఇంకను దక్షిణ జర్మనీలో బవేరియా, వర్టెంబర్గ్ బేడన్, హేశీ, డార్మ్ స్టాడ్ రాజ్యాలు స్వతంత్రగా ఉండిపోయాయి. తమ ప్రాముఖ్యత తగ్గిపోతుందనే భయంతో వీరు ప్రష్యాలో చేర ఇష్టంలేదు. కాని బిస్మార్క్ ఫ్రాన్స్ తమ రాష్ట్రాలపై దండెత్తుతుందనే భీతి కల్గించి జర్మన్ జాతీయ భావాన్ని రగుల్గొల్పి ఆ రాష్ట్రాలతో చాకచక్యంగా వ్యవహరించి వేరువేరుగా మైత్రి సంధులు చేసుకొన్నాడు. దీనితో జర్మనీ ఏకీకరణ చాలవరకు పూర్తయిందనే చెప్పవచ్చును.

### 8.3.6.4 ఫ్రాన్స్ - ప్రష్యా యుద్ధము (1870) :

ఆస్ట్రియా పరాజయంతో ప్రష్యా నాయకత్వంలోని జర్మనీ ఏకీకరణను నిరోధించగల్గిన రాజ్యం ఫ్రాన్స్ ఒక్కటే. ఫ్రాన్స్‌తో తప్పనిసరిగా యుద్ధం జరుగుతుందనే బిస్మార్క్ భావించాడు. దానికి తగినట్లుగానే 3వ నెపోలియన్ దక్షిణ జర్మన్ రాజ్యాలను ఉత్తర జర్మన్ సమాఖ్యలో సంలీనం చేయవద్దని హెచ్చరించాడు. బిస్మార్క్ కూడ ఫ్రాన్స్‌తో యుద్ధాన్ని వాంఛించాడు. ఫ్రాన్స్‌తో యుద్ధానికి తలపడితే దక్షిణ జర్మనీ రాజ్యాలలో జాతీయత దేశభక్తి పెంపొందునని దాన్ని అవకాశంగా తీసికొని దక్షిణ జర్మన్ రాజ్యాలను కూడ ప్రష్యాతో విలీనం చేసి జర్మనీ ఏకీకరణను పూర్తిచేయవచ్చని భావించాడు. బిస్మార్క్ తన తెలివితేటలు ఉపయోగించి ఫ్రాన్స్ మొదట ప్రష్యాపై యుద్ధం ప్రకటించేటట్లు చేశాడు.

ఇదే సమయంలో 1868లో స్పెయిన్‌లో వారసత్వ వివాదం వచ్చింది. బోర్బన్ వంశస్తురాలైన స్పెయిన్ రాణి ఇసబెల్లాను తొలగించి హోహెంజలాన్ వంశానికి చెందిన లియోపాల్డ్‌ను తమ రాజుగా ఎన్నుకోవటం జరిగింది. దానికి 3వ నెపోలియన్ అభ్యంతరం తెల్పాడు. లియోపాల్డ్ తన పదవికి రాజీనామా చేశాడు. దీనితో తృప్తి చెందని 3వ నెపోలియన్ భవిష్యత్తులో కూడ స్పెయిన్ సింహాసనానికి తమ వంశస్థులెవ్వరు ప్రయత్నించకుండ ప్రష్యా చక్రవర్తి నుండి వాగ్దానం పొందుటకు తన రాయబారిని ప్రష్యా పంపాడు. ఫ్రెంచి రాయబారి ఏమ్స్ అనే చోట ప్రష్యా రాజుతో సమావేశమై నెపోలియన్ రాయబారాన్ని వివరించాడు. అందుకు విలియం తిరస్కరించి ఈ విషయాన్ని బెర్లిన్‌లోనున్న బిస్మార్క్‌కు టెలిగ్రామ్ ద్వారా తెలియచేశాడు. ఈ టెలిగ్రామ్‌నే ఏమ్స్ టెలిగ్రామ్ అందురు. అయితే బిస్మార్క్ టెలిగ్రామ్‌లోని విషయాన్ని పూర్తిగా మార్చివేసి ఫ్రాన్స్‌కు తమ రాయబారి ప్రష్యా చక్రవర్తి చేత అవమానింపబడ్డాడన్న అబద్ధపు సమాచారాన్ని ఫ్రెంచి స్వాతంత్ర్య దినోత్సవం నాడు చేరేటట్లు పంపాడు. దీనితో కోపోద్రిక్తులైన ఫ్రెంచి ప్రజలు 3వ నెపోలియన్‌చే ప్రష్యాపై యుద్ధం ప్రకటింపచేశారు. బిస్మార్క్ కోరిన విధంగానే ఫ్రాన్స్‌తో యుద్ధం వచ్చింది.

1870 జూలైలో ఫ్రాన్స్ ప్రష్యాల మధ్య యుద్ధం ప్రారంభమయింది. ప్రష్యాకు ఉత్తర జర్మన్ సమాఖ్యయేగాక దక్షిణ జర్మనీలోని 4 రాజ్యాలు కూడ సహాయం చేశాయి. ఫ్రాన్స్ సెడాన్ యుద్ధంలో ఓడిపోయింది. 3వ నెపోలియన్ 80 వేల సైన్యంతో లొంగిపోయి బందీగా చిక్కాడు. తమ చక్రవర్తి శత్రువులకు లొంగిపోయాడనే వార్త తెలియగానే ఫ్రాన్స్‌లోని రిపబ్లికన్లు గామ్‌బెట్టా నాయకత్వంలో తమ దేశంలో రాజరికాన్ని రద్దు చేస్తూ ఫ్రాన్స్‌ను 3వ రిపబ్లిక్‌గా ప్రకటించారు. మూడవ రిపబ్లిక్‌గా ప్రకటించబడ్డ ఫ్రాన్స్ యుద్ధాన్ని కొనసాగించింది. ప్రష్యా సైన్యం పారిస్ వైపు పురోగమించింది. బిస్మార్క్ అల్సేస్, లొరైన్ ప్రాంతాలను కోరాడు కాని ఒక్క అంగుళం ఫ్రెంచి భూమైనా, ఫ్రెంచి కోటలోని ఒక చిన్న ఇటుకరాయినైనా ఇవ్వమని ఫ్రాన్స్ ప్రకటించటంతో ఈ యుద్ధం 1871 వరకు కొనసాగింది. చివరకు ఫ్రాన్స్ ఓడిపోయి ప్రష్యాతో ఫ్రాంక్‌ఫర్డ్ సంధి చేసుకుంది.

### 8.3.6.4.1 ఫ్రాంక్ ఫర్ట్ సంధి :

ఈ సంధి ప్రకారం ఫ్రాన్స్ అల్సేస్ భూభాగాన్నంతను లొరైన్ తూర్పు ప్రాంతాన్ని జర్మనీకి ఇచ్చివేసింది. పెద్ద మొత్తాన్ని యుద్ధ నష్టపరిహారంగా చెల్లించవలసి వచ్చింది. ఆ డబ్బు చెల్లించేంతవరకు ప్రష్యా సైన్యాలు ఫ్రాన్స్‌లో ఉండును.

### 8.3.6.4.2 ఏకీకరణ సంపూర్తి :

ఈ యుద్ధ ఫలితంగా సమైక్య జర్మనీ స్థాపనకై బిస్మార్క్ వేసిన ప్రణాళిక ఫలించినది. ఈ యుద్ధ కాలములో దక్షిణ జర్మనీ రాజ్యాధిపతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను విస్మరించి ప్రష్యాతో విలీనానికి అంగీకరించారు. తత్ఫలితంగా జర్మనీ ఏకీకరణ పొందినది. ఉత్తర జర్మన్ సమాఖ్య జర్మన్ మహా సామ్రాజ్యంగాను ప్రష్యా రాజు జర్మన్ చక్రవర్తిగా రూపొందారు. ఈవిధంగా బిస్మార్క్ నాయకత్వంలో ప్రష్యా ఆధ్వర్యంలో జర్మనీ ఏకీకరణ సాధించబడినది.

### 8.3.7 ప్రాముఖ్యత :

జర్మనీ ఏకీకరణతో ప్రష్యా ఆధిక్యత ఆస్ట్రియా బలహీనత వెల్లడయినాయి. కొన్ని వందల సంవత్సరాలుగా విభజింపబడి దోచుకొనబడి విదేశీ జోక్యానికి కేంద్రమై ఆర్థికంగా, రాజకీయంగా పతనం చెందిన జర్మన్ జాతి ఐక్యమై సజీవమై పటిష్టమై ఐరోపా రాజ్యాలన్నింటిలోను అగ్రగామిగా రూపొందినది. సమైక్య జర్మనీ కొద్దికాలంలోనే ఐరోపా రాజకీయాలలో ప్రముఖపాత్రను నిర్వహించటమే కాకుండ ప్రపంచ రాజ్యాలన్నింటిని భయభ్రాంతులను చేసింది.

## 8.4 ఆటోవాన్ బిస్మార్క్ - ఆంతరంగిక విదేశీ విధానాలు :

### 8.4.1 పరిచయం :

1871 మరియు 1914 ల మధ్య జర్మనీలో అనేక ముఖ్యమైన రాజకీయ, సైనిక, ఆర్థిక మార్పులు జరిగాయి. బిస్మార్క్ ఆంతరంగిక, విదేశీ విధానాలు 1871 నుండి 1890 వరకు ఆంతరంగికంగా సంపూర్ణాధికారం జర్మనీ దేశాన్ని బలపరచడమేగాక, ఐరోపాలో దానిని శక్తివంతమైన దేశంగా రూపొందించింది. ఈవిధంగా ఏర్పడిన జర్మనీ సామ్రాజ్యం, బిస్మార్క్ విధానాల నుండి ఉత్పన్నమై, ఐరోపా రాజకీయాలపై ఆధిపత్యం సాగించింది.

### 8.4.2 బిస్మార్క్ తొలి జీవితం (1815-1898) :

బిస్మార్క్ 1815లో బెర్లిన్‌కు పడమరగా 40 మైళ్ళ దూరంలో ఒక భూస్వామి కుటుంబంలో జన్మించినాడు. గోటింజన్, బెర్లిన్ విశ్వవిద్యాలయాల పరిధిలో విద్యనభ్యసించి ప్రభుత్వోద్యోగంలో చేరినాడు (Civil Service). ఆ ఉద్యోగం నందు క్రమశిక్షణతో మెలగక, చంచల స్వభావంతో వ్యవహరించడం వల్ల చాలా సార్లు తొలగించబడినాడు. 1847లో అతనికి వివాహమైంది. దానితో అతనిలో కొంత మార్పు వచ్చింది. అతనికి ప్రజాస్వామ్య పద్ధతులన్నా, విప్లవ భావాలన్నా, ఉదార భావాలన్నా నమ్మకం లేదు. 1848 ఫిబ్రవరి విప్లవ సమయంలో అతడు ప్రష్యా శాసనసభలో సభ్యుడుగా ఉండి రాజ్యాంగ మార్పును వ్యతిరేకించినాడు. ప్రష్యా దేశపు దౌత్య ప్రతినిధిగా సెయింట్ పీటర్స్ బర్గ్ నందుండి రష్యా చక్రవర్తి గౌరవ మర్యాదలను పొందినాడు. పారిస్ నగరంలో ప్రష్యా రాయబారిగా ఉండి మూడో నెపోలియన్ (ఫ్రాన్స్ చక్రవర్తి) పాలనా రీతులను సమగ్రంగా అవగాహన చేసుకొన్నాడు.

### 8.4.3 మొదటి విలియం పాలన (ప్రష్యారాజు) (1861-1888) :

1861లో మొదటి విలియం ప్రష్యాకు రాజైనాడు. ఇతని రాకతో ప్రష్యాలో నూతన శకం ఆరంభమైనదని చెప్పవచ్చు. ఇతనిలో స్వభావపరంగా మంచితనం సైనిక లక్షణాలు, వాస్తవిక పరిస్థితిని అవగాహన చేసుకొనే శక్తి, దృఢనిశ్చయం ఉన్నాయి. అయితే రాచరికం దైవదత్తమని, నిరంకుశత్వమే తగిన విధానమని నమ్మినాడు. ఇటలీ ఏకీకరణ సందర్భంలో ఆస్ట్రియా ఓటమి ప్రష్యాకు ప్రోత్సాహం కల్గించింది. కానీ ఆల్మట్జ్ అనే ప్రాంతం దగ్గర ప్రష్యా సేనలకు జరిగిన అవమానం సైనిక దక్షతకు లోటు అని, సైనిక సంస్కరణలు ముఖ్యమని విలియం గుర్తించినాడు. అందుచేతనే సైనిక పునర్ వ్యవస్థీకరణకు పూనుకొన్నాడు. ప్రతి దృఢకాయుడు కనీసం 3 సంవత్సరాలైనా సైన్యంలో సేవ చేయాలనే నిర్బంధ సైనిక సేవా పద్ధతిని ప్రష్యాలో అమలులో పెట్టినాడు. వాన్‌రూన్‌ను యుద్ధమంత్రిగాను, మాల్ట్కేని సైన్యాధికారిగాను నియమించి సైన్యాన్ని బలవంతంగాను, శక్తివంతంగాను చేయదలచినాడు. దీనికయ్యే అదనపు మిలటరీ ఖర్చు ఆమోదించడానికి ప్రష్యా శాసనసభ (Landtag) ను సమావేశపరచినాడు. ఇది ఒక సంవత్సరానికయ్యే ఖర్చును మాత్రం అంగీకరించింది. అందుచేత రాజ్యాంగ సంక్షోభమేర్పడింది. అంతట విలియం రాజు సింహాసన పరిత్యాగం చేయడానికి సిద్ధమైనాడు.

ఇటువంటి క్లిష్ట సమయంలో యుద్ధమంత్రిగా ఉన్న వాన్‌రూన్ రాజైన విలియంనకు బిస్మార్క్‌ను ఛాన్సలర్‌గా (ప్రధానమంత్రి) నియమిస్తే పరిస్థితి చక్కబడుతుందని సలహానిచ్చాడు. ఈ సలహా రాజునకు నచ్చి, వెంటనే పారిస్‌లో రాయబారిగా ఉన్న బిస్మార్క్‌ను బెర్లిన్‌కు పిలిపించడం జరిగింది. 1862 సెప్టెంబర్ 23న విలియం రాజు బిస్మార్క్‌ను సంప్రదించి మంత్రి మండలి అధ్యక్షుడిగా (ఛాన్సలర్) నియమించినాడు. ఈ సందర్భంలో "నేను మీతో మరణించడానికైనా సిద్ధపడతాను కానీ పార్లమెంటుతో మీరు పడుతున్న ఘర్షణలో మిమ్ములను ఎప్పుడూ విడనాడను"అని బిస్మార్క్ విలియంనకు వాగ్దానం చేసినాడు.

ఛాన్సలర్ కావడానికి కొద్ది కాలం ముందే ఇంగ్లాండ్‌లో పర్యటిస్తూ బ్రిటీష్ రాజకీయవేత్త (బెంజిమన్ డిజ్రాలీ) తో బిస్మార్క్ తన మనోగతం ఈవిధంగా వెల్లడించినాడు. "త్వరలో నేను ప్రష్యా ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించవలసి వస్తుంది. ప్రష్యన్ పార్లమెంట్ అంగీకరించినా అంగీకరించకపోయినా ప్రష్యన్ సైన్యాన్ని పటిష్టం చేయటం నా మొదటి కర్తవ్యం. రాజు ఇప్పటికే ఈ కర్తవ్యంలో నిమగ్నమై ఉన్నాడు. నేను ఆశించిన బలం సైన్యానికి చేకూరగానే, ఆస్ట్రియాపై యుద్ధం ప్రకటిస్తాను. జర్మనీ రాజ్య సమ్మేళనాన్ని చిందరవందర చేస్తాను. చిన్నరాజ్యాలను తొక్కేసి, ప్రష్యా నాయకత్వం క్రింద జర్మనీ ఐక్యతను సాధించి తీరుతాను".

బిస్మార్క్ ఛాన్సలర్ పదవిని స్వీకరించిన తర్వాత "రాజకీయ సమస్యలు సిద్ధాంతాల వల్ల కాని, శాసనసభల వల్ల రాద్ధాంతాల వల్ల కాని, తీర్మానాల వల్ల కాని పరిష్కారం కావు. కత్తినుపయోగించి రక్తపాతం చేయడానికి సిద్ధమైతే కాని, అంటే దండోపాయంనుపయోగిస్తేనే కాని లేదా అయోరుధిర విధానం పాటిస్తేనే గాని (Policy of Blood and Iron) పరిష్కారం జరగదని" చెప్పినాడు.

ఛాన్సలర్ అయిన తర్వాత ప్రష్యారాజు తలపెట్టిన మిలటరీ విధానానికి బిస్మార్క్ పూర్తిగా సహకారమిచ్చినాడు. జర్మనీ ఏకీకరణ ప్రష్యా నాయకత్వంలోనే సాధ్యమౌతుందని దృఢంగా విశ్వసించినాడు. ప్రష్యా శాసనసభ ప్రమేయం లేకుండానే నియంతృత్వ విధానంలో పన్నుల విధింపు, సేకరణలు, మిలిటరీ కార్యకలాపాలను గురించి ప్రతిపాదనలు రూపొందించినాడు. 1863లో రష్యా అధీనంలో ఉండే పోలిష్ (Polish) ప్రజలు తిరుగుబాటు చేశారు. ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌లు వారి పట్ల సానుభూతిని చూపించాయి. ప్రష్యా శాసనసభ వైఖరి రష్యాకు వ్యతిరేకంగా ఉండగా పోలీష్ ఉదారతా ధోరణి ప్రష్యాకు కూడా వ్యాపిస్తుందేమోననే భావంతో బిస్మార్క్ రష్యాతో మైత్రిని నిర్వహించినాడు. దీని వల్ల తనకు ఆస్ట్రియాతో విరోధం వస్తుందని, జర్మనీ ఏకీకరణ కార్యక్రమంలో ఆస్ట్రియాతో యుద్ధమే సంభవిస్తే రష్యా తనకు అనుకూలంగానే ఉంటుందని భావించినాడు. ఆస్ట్రియాకు జర్మన్ విషయాలలో ఎలాంటి ప్రాధాన్యం యివ్వటం అతనికి యిష్టంలేదు.

### 8.4.4 బిస్మార్క్ ఆశయాలు : బిస్మార్క్ ఆశయాలు మూడు. అవి

1. ప్రష్యా ప్రభావం జర్మనీ మొత్తానికి వ్యాప్తి చెందాలి.
2. జర్మనీలో నాయకత్వం వహించవలసింది ప్రష్యా రాజ్యమా ? లేక ఆస్ట్రియా రాజ్యమా ? అనేది తేల్చుకోవాలి.
3. జర్మన్ భూభాగం లో ఫ్రాన్స్ ప్రాధాన్యాన్ని తగ్గించాలి.

### 8.4.5 జర్మనీ ఏకీకరణకు ముందు స్థూలంగా రాజకీయ పరిస్థితి :

1. హనోవర్, ఫ్రాంక్‌ఫర్ట్ మొదలైన ఉత్తర జర్మనీ రాజ్యాలన్నీ ఒక సమాఖ్యగా నేర్పడి ఆస్ట్రియా అధీనంలో ఉన్నాయి.
2. బవేరియా, వర్టెంబర్గ్, హెస్సీ, బేడిన్ మొదలైన దక్షిణ జర్మన్ రాజ్యాలు స్వతంత్ర్యంగా ఉన్నా వీటిపై ఆస్ట్రియా, ఫ్రాన్స్‌ల ప్రాబల్యం ఉన్నది.
3. రైన్ నదీ ప్రాంతం, ఆల్సేస్, లొరైన్ ప్రాంతాలు - ఫ్రాన్స్ అధీనంలో ఉన్నవి.
4. ష్లెష్‌విగ్, హోల్‌స్టీన్ రాష్ట్రాలు - డెన్మార్క్ అధీనంలో ఉన్నవి.
5. ప్రష్యా అధీనంలో బ్రాడెన్‌బర్గ్, సాక్షనీ, పామరేనియా, తూర్పు ప్రష్యాలు ఉన్నవి.

బిస్మార్క్ ప్రష్యా ఛాన్సలర్‌గా చేపట్టిన పాలనారీతులను రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి. 1. జర్మనీ ఆంతరంగిక విధానం, 2. జర్మనీ విదేశీ విధానం.

## 8.4.6 జర్మనీ ఆంతరంగిక విధానం :

### 8.4.6.1 క్రొత్త రాజ్యాంగం (1871) :

ఈ రాజ్యాంగం ప్రకారం జర్మనీ 25 దేశాల సమాఖ్య. ప్రష్యా వీటన్నింటిలో పెద్దది, విశేషాధికారాలు కలది. నూతన రాజ్యాంగం ప్రకారం హోహెన్‌జోలరిన్ రాజవంశస్థుడైన ప్రష్యా రాజు జర్మన్ సామ్రాజ్యానికి చక్రవర్తి. ప్రధానమంత్రి చక్రవర్తికే బాధ్యుడు. అతనిని నియమించే అధికారంగాని, తొలగించే అధికారం గాని చక్రవర్తికే కలదు. చక్రవర్తి ఆదేశానుసారం, ప్రధానమంత్రి సామ్రాజ్య విధానాలు నిర్వర్తించేవాడు. మిగతా మంత్రులందరకూ ప్రధానమంత్రికి లోబడి, విధులను నిర్వర్తించవలసిందే. అధికారాలన్నీ చక్రవర్తి చేతిలో కేంద్రీకృతమయినవి. యుద్ధ ప్రకటన, శాంతి ఒప్పందాలను చక్రవర్తే చేసేవాడు. సైనికదళాలు అతని అధీనంలో ఉండేవి. సామ్రాజ్యంలోని సమాఖ్యరాజ్యాల పరిపాలకులకు సైన్యంపై ఎలాంటి నియంత్రణ లేదు.

చక్రవర్తి సామ్రాజ్యానికి సర్వాధికారైనా, మిగతా రాజ్యాల పాలకుల అధికారాలు కూడా వారి ప్రాంతాలలో కొనసాగినాయి. అయితే ప్రతి రాజ్యానికి స్వయంపాలనా ప్రభుత్వం ఉండి, స్థానిక వ్యవహారాలైన - విద్య, ఆరోగ్యం, పోలీస్, పన్ను వసూలు, శిస్తు పద్ధతి మొదలైన వాటిపై సర్వాధికారం ఉన్నది. అఖిల సామ్రాజ్యానికి వర్తించే విషయాలు - విదేశీ రాజ్యాంగ విధానము, యుద్ధ వ్యవహారాలు మొదలైనవి సమాఖ్య ప్రభుత్వానికే చెందుతాయి.

జర్మనీకి సంబంధించి ఈ రాజ్యాంగం ప్రకారం రెండు శాసన సభలకివ్వబడింది. ఎగువసభను బుందేసరాత్ అని దిగువసభను రీచ్‌స్టాగ్ అని పిలవటం జరిగింది. బుందేసరాత్‌లో జర్మన్ రాజ్య పాలకుల ప్రతినిధులు సభ్యులు. దీని మొత్తం సభ్యుల సంఖ్య 58. దీనిలో ప్రష్యా ప్రాతినిధ్యం 17 మంది. మిగతా ప్రాంతాలపై ప్రష్యా ఆధిక్యత ఎక్కువ. దిగువసభ రీచ్‌స్టాగ్. ఇది సార్వత్రిక ఎన్నికలవల్ల ఏర్పడుతుంది. అయితే ఈ ఎన్నికల హక్కు పురుషులకే పరిమితం. దీనిలో సభ్యుల సంఖ్య 397. బుందేసరాత్ అనుమతిలేనిదే సామ్రాజ్యానికి సంబంధించిన చట్టాలు చేయబడవు. రీచ్‌స్టాగ్‌నకు పరిమిత అధికారాలు మాత్రమే కలవు. అవి కొత్త పన్నులు వేయటానికి దీని అనుమతి అవసరం. అమలులో నున్న పన్నులను కొనసాగించటానికి దీని అనుమతి అవసరంలేదు. అయితే క్రొత్త శాసనాలను రూపొందించటంలో ఉభయ సభలకు సమాన ప్రాముఖ్యత కలదు.

## 8.4.6 పరిపాలనా సంస్కరణలు :

### 8.4.6.1 ఆర్థిక సంస్కరణలు :

ఏకీకరణకు ముందు జర్మన్ రాజ్యాల్లో రకరకాలైన న్యాయ విధానాలు, ప్రత్యేకమైన కరెన్సీలు ఉండేవి. అవి జాతి సమైక్యతకు భంగకరమని భావించి బిస్మార్క్ జర్మన్ సామ్రాజ్యం మొత్తానికి ఒకే విధమైన కరెన్సీ న్యాయవిధానం అమలుపరిచినాడు. అన్ని ప్రాంతాలలోని రైల్వేలను కలిపివేసి "ఇంపీరియల్ రైల్వే బ్యూరో" (Imperial Railway Bureau) అనే సంస్థను ఏర్పరచినాడు. సామ్రాజ్యంలోని టెలిగ్రాఫ్, టెలిఫోన్ శాఖలను రైల్వే శాఖలో విలీనం చేయుట జరిగింది. జర్మనీ సైనిక పరంగా పటిష్టం చేసిన తర్వాత జరిగింది. జర్మనీని సైనిక పరంగా పటిష్టం చేసిన తర్వాత దేశానికి ఆర్థిక సంపదను చేకూర్చవలెనని ప్రయత్నించినాడు. అందుకు వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధి జరగవలెనని భావంచినాడు. పరిశ్రమలకు ముఖ్యంగా బొగ్గు, ఇనుము అవసరం. రూర్, సార్ నదీ లోయలలోను, లొరైన్ లోయలోను ఇనుము, బొగ్గు ఖనిజ సంపద పుష్కలంగా ఉన్నది. దానిని ఉపయోగించుకోవడానికి తగిన ద్రవ్యం అవసరం. దాని కోసం 1875 లో ఒక (Bank Act) బ్యాంక్ చట్టం చేసి, జర్మన్ బ్యాంకులన్నింటిని బుందేసరాత్ నియంత్రణ క్రిందకు తెచ్చినాడు. 1876లో రీచ్ బ్యాంక్ (Reich Bank) అనే సామ్రాజ్య బ్యాంక్‌ను (Imperial Bank) స్థాపించినాడు. ఈ బ్యాంకు వల్ల కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక విధానాలను ఎటువంటి అడ్డంకులు

లేకుండా అమలుచేయగలిగింది. దేశ ఖనిజసంపదను సక్రమంగా వినియోగించుకోవడానికి అవకాశం కల్గింది. యంత్ర పరిశ్రమాభివృద్ధికి ఎంతో కృషి జరిగి కొద్ది కాలంలోనే జర్మనీ పారిశ్రామిక దేశంగా అగ్రస్థానాన్ని ఆక్రమించేటట్లు బిస్మార్క్ చేసినాడు. బిస్మార్క్ దండోపాయవిధానం (Policy of Blood and Iron) వల్ల జర్మనీ ఏకీకరణ సాధించగా, బొగ్గు, ఇనుము విధానం వల్ల (Policy of Coal and Iron) జర్మనీని పారిశ్రామిక దేశంగా మార్చినాడు.

ఇంకా స్వేచ్ఛా వ్యాపారపద్ధతి మొదట జర్మనీలో అమలులో ఉన్నప్పటికీ, జర్మనీ ఏకీకరణ అయిన తర్వాత ఆ పద్ధతి విరమించవలసి వచ్చింది. దానికి కారణం జర్మనీలో వ్యవసాయ మాంద్యం ఏర్పడటం. అందుకే 1879లో విదేశాలనుంచి వచ్చే సరుకుల పైన బిస్మార్క్ సుంకం విధించినాడు. ఈ రక్షక విధానం (Policy of Protection) వల్ల దేశ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. కాని విదేశీ ఆహార వస్తువుల పైన సుంకం విధించడం వలన కార్మికులు దెబ్బతిన్నారు. ఈ పరిస్థితి సామ్యవాద ఉద్యమానికి దోహదం చేసింది.

### 8.4.6.6.2 సైనిక సంస్కరణలు :

జర్మనీ ఏకీకరణ యుద్ధాల ద్వారానే జరిగింది. అందువల్ల, సైనికావశ్యకత బిస్మార్క్‌నకు బాగా తెలుసు. ఏకీకరణకు ముందే ప్రష్యాలో నిర్బంధ సైనిక సేవ అమలులో ఉండేది. దానిని బిస్మార్క్ 1871లో జర్మనీ అంతటా అమలు జరిపినాడు. శాంతికాలంలో జర్మన్ సైనికులు 4,00,000 మంది ఉండాలని నిర్ధారించడమైంది. దీనికయ్యే ఖర్చు ఎవరు భరించాలి అనే విషయంపై బిస్మార్క్‌నకు, శాసన సభకు మధ్య వివాదం ఏర్పడింది. దానిని ఇంపీరియల్ ట్రెజరీ భరించాలని అంగీకారం కుదిరింది. ప్రభుత్వం అనుసరిస్తున్న సైనిక విధానం శాసనసభలో (Reich stag) తరచు విమర్శకు గురవుతూ ఉండేది. కాని బిస్మార్క్ యుద్ధ భయాన్ని కల్గించి, (Reichstag) రీచ్ స్టాగ్ నుంచి అవసరమైన ఆర్థిక వనరులను సైన్యానికి సమకూరుస్తుండేవాడు.

### 8.4.6.2.3 చర్చితో తగాదా లేదా నాగరికతా రక్షణ కోసం యుద్ధం (Kultur Kampf or war of Civilisation):

జర్మనీ ఏకీకరణ పూర్తి కాగానే, అక్కడి కాథలిక్ చర్చికి, ప్రభుత్వానికి మధ్య తీవ్ర స్థాయిలో పోరాట పరిస్థితి ఏర్పడింది. దీనికి Kultur Kampf or war of Civilisation అని పేరు. ఆస్ట్రియా, ఫ్రాన్స్‌లు రెండూ కాథలిక్ దేశాలు. జర్మనీ ప్రొటెస్టంట్ దేశం. జర్మనీ సమైక్యత కోసం ఆస్ట్రియా ఫ్రాన్స్‌లపై యుద్ధం చేసి విజయం సాధించింది. ఇది కాథలిక్‌లపై ప్రొటెస్టాంట్‌లు సాధించిన విజయంగా కాథలిక్ ప్రపంచం భావించింది. అందువల్ల జర్మన్ కాథలిక్‌లు కూడా బిస్మార్క్ పట్ల శత్రుభావం పెంచుకొన్నారు. జర్మన్ కాథలిక్‌లకు (Mintz) మిన్ట్జ్ అనే మత బోధకుడు (ఆర్చిబిషప్) నాయకత్వం వహించినాడు. కార్మిక రంగంలో కూడా ఉధృతంగా పనిచేసిన వ్యక్తి ఇతడు. కార్మికుల శ్రేయస్సు కోసం ఈ ఆర్చిబిషప్ క్యాథలిక్‌లకు సోషల్ యూనియన్స్‌ను (Catholic Social Unions) ఏర్పరచినాడు. ఇతడు "కార్మికుల పనివేళలను తగ్గించాలని, ఆదివారం శెలవు దినంగా ప్రకటించాలని, ఫ్యాక్టరీలపై అజమాయిషీకి, నియంత్రణకు ప్రభుత్వాధికారులను నియమించాలని" వత్తిడి తెచ్చాడు. ఇది పారిశ్రామికవేత్తలకు ఆగ్రహం కల్గించింది. పారిశ్రామికవేత్తలలో చాలామంది బిస్మార్క్ అనుచరులు. జాతీయ జీవన ప్రవంతిలో అందరూ చేరిపోవాలని, దానికిగాను కేంద్రప్రభుత్వం శక్తివంతంగా ఉండాలని బిస్మార్క్ అభిప్రాయం. ఇది జర్మన్ కాథలిక్‌లకు నచ్చలేదు.

ఈ కారణాల వల్ల బిస్మార్క్‌నకు, కాథలిక్ చర్చికి మధ్య వైషమ్యం పెరుగుతూ వచ్చింది. తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి జర్మన్ కాథలిక్‌లు 'సెంటర్' (Centre) అనే ఒక రాజకీయ పార్టీని స్థాపించుకొన్నారు. రీచ్ స్టాగ్‌నకు జరిగిన మొదటి ఎన్నికల్లో సెంటర్ పార్టీ 63 స్థానాలను గెలుచుకున్నది. చర్చి రాజకీయాల్లో ప్రవేశించడం వల్ల జర్మనీ సార్వభౌమాధికారానికి ముప్పు ఏర్పడుతుందని బిస్మార్క్ భావించినాడు.

కాథలిక్‌లకు మధ్య ఏర్పడ్డ అంతఃకలహం “కుల్తూర్ కాంప్” నకు దారితీసింది. పోప్ తొమ్మిదో ఫయస్ (Pope Pius-IX) వాటికన్ నగరంలో 1669లో ఒక సమావేశం ఏర్పాటుచేశాడు. ప్రపంచం మొత్తం మీద దీనికి 800 మంది మతబోధకులు హాజరైరి. దీనిలో జరిగిన చర్చను 1870లో “పోప్ అమోఘత్వ ఉత్తర్వు” (Papal Infallibility Decree) జారీ చేశాడు. దీని ప్రకారం “మత, నీతి సూత్రాలలో కాథలిక్‌లందరూ తమ తమ ప్రభుత్వాలకు గాక పోప్‌కు మాత్రమే లోబడి ఉండాలి”.

పోప్ అమోఘత్వాన్ని ఆమోదించిన కాథలిక్‌లకు, ప్రాచీన కాథలిక్‌లు అని పేరు వచ్చింది. దాన్ని ఆమోదించని కాథలిక్‌లు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ప్రాచీన కాథలిక్‌లను పదవుల నుంచి తొలగించాలని వారు పట్టుబట్టిరి. అంతట పోప్ అమోఘత్వాన్ని ఆమోదించిన, వ్యతిరేకించిన జర్మన్ కాథలిక్‌ల మధ్య పోరు ప్రారంభమై, అది చాలా కాలం సాగింది. దీన్ని అదనుగా తీసుకొని బిస్మార్క్, కాథలిక్‌లను అణచివేయడానికి మొదట ప్రష్యాలోనూ, తర్వాత జర్మనీ అంతటా చర్యలు ప్రారంభించినాడు. కాథలిక్‌లకు వ్యతిరేకంగా తాను తలపెట్టిన పోరాటానికి అతడు “కుల్తూర్ కాంఫ్” అని నామకరణం చేసినాడు.

### 8.4.6.3 కాథలిక్‌లకు వ్యతిరేకంగా బిస్మార్క్ గైకొన్న చర్యలు :

1. జెసూట్లను (Jesuits) (మతాధికారులు) జర్మనీ నుంచి బహిష్కరించుట.
2. ప్రష్యన్ శాసనసభ లాండ్ టాగ్ (Landtag) 1873, 1874, 1875 సంవత్సరాలలో మే నెలల్లో అనేక కాథలిక్ వ్యతిరేక చట్టాలను చేసింది. అందువల్ల వాటికి (May Laws) మే చట్టాలు అని పేరు వచ్చింది. ప్రష్యన్ విద్యా శాఖామంత్రి ఫాక్ (Falk) ఈ చట్టాలను రూపొందించడంలో కీలకపాత్ర నిర్వహించడం వల్ల ఈ చట్టాలకు “ఫాక్ చట్టాలు” అని కూడా పేరు వచ్చింది.

### 8.4.6.4 మే శాసనాలు లేక ఫాక్ చట్టాలు :

1. కాథలిక్ చర్చికి చెందిన ప్రతి ఉద్యోగి జర్మన్ దేశానికి చెందిన వాడై ఉండాలి.
2. ప్రతి జర్మన్ చర్చి ఉద్యోగి జర్మన్ విద్యాలయాల్లో చదివి ఉండాలి.
3. ప్రతి చర్చి నడుపుతున్న విద్యాలయాలన్నీ ప్రభుత్వ నియంత్రణ క్రిందకు రావాలి.
4. మత శిక్షణ జర్మన్ భాషలోనే జరగాలి.

ఇది ఫాక్ చట్టాలలోని సారాంశం. వీటిని ఉల్లంఘించినవారు ప్రభుత్వ దండనకు, దేశ బహిష్కరణకు గురౌతారు. కాథలిక్ ప్రపంచంలో ఫాక్ చట్టాలు చాలా అలజడిని సృష్టించినాయి. ముఖ్యంగా జర్మనీలో వీటికి వ్యతిరేకంగా తీవ్ర నిరసన ప్రారంభమైంది. మే చట్టాలు చెల్లవని, వాటిని ఉల్లంఘించమని పోప్ జర్మన్‌లను ఆదేశించినాడు. బిస్మార్క్ వాటికన్‌తో సంబంధాలను తెగతెంపులు చేసుకొన్నాడు. మే చట్టాలను కఠినంగా అమలుపరిచాడు. చాలా మంది మతాధికారులను ఖైదుచేసి, చాలా మందిని దేశం నుండి బహిష్కరించినాడు. కాథలిక్ చర్చికి చెందిన ప్రభుత్వాధికారులు తొలగించబడిరి.

అంతట కాథలిక్‌లు రాజకీయంగా క్రమంగా బలం పుంజుకోసాగిరి. ఈ విషయంలో బిస్మార్క్ అనుకూల వర్గాలు కూడా వ్యతిరేకించసాగినాయి. ఇదే సమయంలో బిస్మార్క్‌నకు సాంఘీక, ఆర్థిక రంగాలలో సమస్యలు ఎదురైనాయి. కాథలిక్‌ల కన్నా జర్మనీకి సోషలిస్ట్‌ల నుంచి ప్రమాదం ఎక్కువగా పొంచి ఉందని బిస్మార్క్ గమనించాడు. 1878లో పోప్ 9వ ఫయిస్ మరణించడంతో 13వ లియో (Pope Leo XIII) పోప్ అయినాడు. కొత్త పోప్, బిస్మార్క్‌తో రాజీపడటానికి అంగీకరించినాడు. దీనితో బిస్మార్క్ కాథలిక్ వ్యతిరేకచట్టాలను క్రమంగా ఉపసంహరించాడు. దీనితో సమస్య సద్దుమణిగింది.

### 8.4.6.5 సామ్యవాద ప్రజాస్వామ్యము - సోషలిష్ట్ ఉద్యమం :

జర్మనీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందటంతో పాటు కార్మిక సమస్యలు కూడా పెరిగాయి. జర్మనీలో క్యూనిష్ట్ సిద్ధాంతం పుట్టింది. దీని సిద్ధాంత కర్త కారల్‌మార్క్స్. ఇతడు జర్మన్ దేశస్తుడు. అతడు నాటి కార్మిక సమస్యలను అర్థం చేసుకొని దాస్ కాపిటల్ (Das Capital) కమ్యూనిష్ట్ ప్రకాశన పత్రం (Communist Manifesto) అనే గ్రంథాలను రచించి ఐరోపాను కుదిపివేసినాడు. "సార్వత్రిక జర్మన్ కార్మికుల సంఘం" (The Universal German Working Men's Association) అనే వ్యవస్థను ఏర్పాటు చేసిన వాడు ఫెర్డినాంగ్ లాసెల్. వీరిద్దరి ప్రచారాల వల్ల సామ్యవాద ఉద్యమం జర్మనీలో బాగా వ్యాప్తమై "సామ్యవాద - ప్రసాజ్వామ్య పార్టీ" (Social-Demicratic Party) అనేది ఏర్పడి సామ్యవాద ఉద్యమానికి పూనుకొన్నది. బిస్మార్క్ భావాలకు, ఉద్దేశాలకు వ్యతిరేకంగా ఈ ఉద్యమం జరిగింది. 1878లో బిస్మార్క్ ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి శాసనసభ ద్వారా అనేక చర్యలు తీసుకొన్నాడు. అవి 1. సంఘాల నిషేధం. 2. సమావేశాలు జరుపరాదు. 3. సామ్యవాద ప్రచారానికి ప్రచురణలు ఏమీ చేయరాదు. 4. అనుమానాస్పదమైన వ్యక్తులందరిని నిర్భంధించాలి. ఇవి 12 సంవత్సరాలపాటు అమలులో నుండి అనేక ప్రచురణలు నిషేధించి, అనేకులను దేశం నుండి బహిష్కరించి, చాలా మందిని ఖైదు చేసి, వారి నిధులను స్వాధీనం చేసుకొన్నాడు.

బిస్మార్క్ ఉద్యమాన్ని అణచడానికి ప్రయత్నించినా, మరో విధంగా ప్రభుత్వమే సామ్యవాద సోషలిష్ట్ విధానాన్ని అనుసరించి ప్రజా బాహుళ్యం మెప్పు పొందటానికి తగిన చర్యలు గైకొన్నాడు. అవి 1. కార్మికులకు రోగనివారణ కోసం భీమా పద్ధతిని, 2. ఉద్యోగ నిర్వహణలో ప్రమాదాల నుండి రక్షణకు భీమాను, 3. వృద్ధులకు, దుర్భలురకు భీమా పద్ధతిని ప్రవేశపెట్టినాడు. దీనికే "ప్రభుత్వ సామ్యవాదం" (State Socialism) అని పేరు. బిస్మార్క్ ఎంత బుజ్జగించాలని ప్రయత్నించినా సామ్యవాద ఉద్యమం జర్మనీలో అణిగిపోక వృద్ధి చెందుతూనే వున్నది.

### 8.4.6.6 వలస సామ్రాజ్యం :

బిస్మార్క్ ప్రారంభంలో వలసల సంపాదన కోసం ప్రయత్నించలేదు. కానీ జర్మనీ పారిశ్రామికాభివృద్ధికి ముడిపదార్థాలు, సరుకులు అమ్ముడు పోవడానికి మార్కెట్లు అవసరమైనాయి. అందువల్ల 1884 నుంచి వలసలను సంపాదించడంలో జర్మనీ కృషి చేసింది. ఆఫ్రికాలో టోగో లాండ్, కామెరూన్, పసిఫిక్ దీవులలోని మార్షల్ దీవులు, న్యూగినీలు ముఖ్యమైనవి. 1890లో బిస్మార్క్ పదవీ విరమణ చేసే కాలం నాటికి ఈ రక్షక స్థానాలన్నింటిని రాజు వలసలుగా మార్చివేసినాడు.

### 8.4.7 బిస్మార్క్ విదేశీ విధానం :

బిస్మార్క్ చేపట్టిన విదేశీ విధానం రెండు రకాలు. అవి. 1. జర్మనీ ఏకీకరణ పూర్వపు విదేశీ విధానం. 2. జర్మనీ ఏకీకరణానంతర విదేశీ విధానం.

### 8.4.7.1 జర్మనీ ఏకీకరణకు పూర్వపు విదేశీ విధానం :

జర్మన్ దేశ ఏకీకరణ కోసం బిస్మార్క్ 3 యుద్ధాలను నిర్వహించినాడు. అవి -

1. డెన్మార్క్‌తో యుద్ధం - 1864
2. ఆస్ట్రియాతో యుద్ధం - 1866
3. ఫ్రాన్స్‌తో యుద్ధం - 1870-1871

### 8.4.7.1.1 డెన్మార్క్‌తో యుద్ధం (1864) :

ప్రష్యా - ఆస్ట్రియాను ఓడించగలదనే నమ్మకం బిస్మార్క్‌నకు కల్గింది. కానీ, ఆస్ట్రియాను యుద్ధానికి కవ్వించాలంటే, ఏదో ఒక కారణం ఉండాలి. ఆ కారణం కొరకే ఆస్ట్రియాతో కలసి, డెన్మార్క్‌తో బిస్మార్క్ యుద్ధం చేయవలసి వచ్చింది. ఈ రెండు రాష్ట్రాలు జర్మన్ ప్రాంతాలైనప్పటికి 1815లో వియన్నా కాంగ్రెస్ వీటిని డెన్మార్క్ అధీనంలో ఉంచినది. ఇప్పుడు బిస్మార్క్ షెల్స్‌విగ్ (Schelswig) హోల్‌స్టీన్ (Holstein) ల సమస్యను చక్కగా వినియోగించుకొన్నాడు. ఇవి రెండూ డెన్మార్క్ అధీనంలో ఉన్నాయి. అయినా, వీటిలోని ప్రజలు అధిక సంఖ్యాకులు జర్మన్‌లు. క్రీ.శ. 1848లోనే ఈ ప్రాంతాలు ఎవరికి చెందాలి అనే అంశంపై డెన్మార్క్ -ప్రష్యాల మధ్య వివాదమేర్పడింది. డెన్మార్క్ రాజైన 7వ ఫ్రెడరిక్ - షెల్స్‌విగ్‌ను తన రాజ్యంలో కలుపుకోజూచాడు. షెల్స్‌విగ్ యిందుకు విరుద్ధంగా తిరుగుబాటు చేసింది. ప్రష్యా దీనిని సమర్థించింది. ప్రష్యా సమర్ధింపును ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు వ్యతిరేకించాయి. ఈ దేశాలు ఇది వియన్నా కాంగ్రెస్ చేసిన ఏర్పాటుకు భంగకరమని వాదించినాయి. దీనితో క్రీ.శ. 1852లో జరిగిన లండన్ సంధి ప్రకారం, రాజీమార్గంగా ఈ రెండు ప్రాంతాలు డెన్మార్క్‌తో లీనం చేయకూడదని అంగీకరించిరి. కాని క్రీ.శ. 1863లో ఈ అంగీకారాన్ని త్రోసి పుచ్చి, డేనిష్ ప్రజల కోరికపైన, తనరాజు 9వ క్రిష్టియన్, ఈ ప్రాంతాలను డెన్మార్క్‌తో కలిపివేసినాడు. జర్మన్ జాతి ప్రజలు ఈ చర్యను గర్హించారు. నూతన ప్రష్యా సైన్యశక్తిని, పాటవాన్ని పరీక్షించడానికి ఇది ఒక అదునుగా తీసుకొన్న బిస్మార్క్ ఆస్ట్రియాతో కలిసి డెన్మార్క్ రాజును బెదరించినాడు. కాని, డెన్మార్క్ రాజు ఈ బెదరింపులను నిర్లక్ష్యం చేసినాడు. అంతట ఆస్ట్రియా, ప్రష్యాలు క్రీ.శ. 1864లో అక్టోబర్‌లో డెన్మార్క్ పై యుద్ధం చేసి, ఓడించి, వియన్నా సంధి ద్వారా డెన్మార్క్ ఈ ప్రాంతాలను వదలుకొనేటట్లు చేశాయి.

షెల్స్‌విగ్, హోల్‌స్టీన్‌లను డ్యూక్ ఆఫ్ అగస్టెసేనకు యిచ్చివేయమని ఆస్ట్రియా, ప్రష్యాను కోరింది. దానికి ప్రష్యా అంగీకరించక వేరే గాస్టీన్ ఒప్పందం (Gastein Convention) 1865 లో ఆస్ట్రియాతో చేసుకొని తాత్కాలికంగా ఆస్ట్రియా హోల్‌స్టీన్‌ను ఆక్రమించి పాలించేటట్లు, ప్రష్యా షెల్స్‌విగ్‌ను ఆక్రమించి పాలించేటట్లు నిర్ణయానికి వచ్చింది. దీనిని బట్టి డ్యూక్ ఆఫ్ అగస్టన్ బర్గ్‌నకు అవి దక్కలేదు. ఇది బిస్మార్క్‌నకు ఘనవిజయం. గాస్టీన్ ఒప్పందం ఆస్ట్రియాకు అంత క్షేమకరం కాదని, అగస్టన్‌బర్గ్‌ను తన హక్కు కోసం ప్రోత్సహించగా ఈ పరిస్థితి బిస్మార్క్ గమనించి ఆస్ట్రియా చర్య గాస్టీన్ ఒప్పందానికి విరుద్ధమని తన అసమ్మతిని ప్రకటించినాడు. అంతట ఆస్ట్రియా యుద్ధం తలపెట్టింది. బిస్మార్క్ కూడా సిద్ధపడినాడు. రాబోయే యుద్ధంలో తటస్థంగా ఉంటే ఆస్ట్రియా అధీనంలో ఉన్న వెనీషియాను ఇటలీ ఆక్రమించుకొనేటట్లు బిస్మార్క్ ఇటలీతో ఒప్పందం చేసుకొన్నాడు.

### 8.4.7.1.2 ఆస్ట్రో - ప్రష్యా యుద్ధం (1866) :

యిరు పక్షాలు యుద్ధ ప్రయత్నాలు చేయసాగినాయి. ఆస్ట్రియాకు విదేశీ సహాయం అందకుండా బిస్మార్క్ అన్ని రకాల చర్యలు తీసుకొన్నాడు. చర్యలో భాగంగా ఇంగ్లాండ్, రష్యా, ఫ్రాన్స్, ఇటలీలను దౌత్యనీతి నంతా ప్రయోగించి తన వైపునకు తిప్పుకొని ఆస్ట్రియాపై యుద్ధం చేసినాడు.

ఈ యుద్ధానికి 7 వారాల యుద్ధం (Seven weeks war) అని కూడా పేరు. ఆస్ట్రియా తరపున - బవేరియా, సాక్షనీ, హనోవర్ లాంటి చిన్న జర్మన్ రాజ్యాలు సహాయంగా వెళ్ళాయి. వాటిని ప్రష్యా ఎదుర్కోవలసి వచ్చింది. ముందుగా హనోవర్ సేన ఓడిపోయింది. తదుపరి బొహిమియాలో ఉన్న కొనిగ్రాట్జ్ (Koniggratz) లేదా షడోవా (Sadowa) అనే చోట 1866 జూన్ 16న యుద్ధం ప్రారంభమై, జూలై 3న అంతమైంది. జూలై 26న తాత్కాలిక సంధి "నికోలస్ బర్గ్ శాంతి ఒడంబడిక" (Peace of Nicholasberg) పైన, ఆగస్ట్ 23న స్పష్టమైన "ప్రాగ్ శాంతి సంధి" (Peace of Prague) పైన సంతకాలు జరిగాయి. అతి తక్కువ కాలంలో ముగిసిన యుద్ధాలలో ఇది ఒకటి. కాని, దీని ఫలితాలు మాత్రం ఐరోపా ఖండంలోనే గాక యావత్ ప్రపంచం మీద పడ్డాయని చరిత్ర రుజువు చేసింది.

**ప్రాగ్ సంధి (1866 ఆగస్ట్ 23) :**

ఈ సంధిలోని ముఖ్యాంశములు

ఎ) ఆస్ట్రియా, హోల్‌స్టీన్‌ను ప్రష్యాకు యిచ్చివేయుటయే గాక, జర్మనీ భూభాగం నుండి వైదొలగింది.

బి) వెనీషియాను ఇటలీకి యిచ్చింది.

సి) జర్మన్ సమాఖ్య రద్దుకు, ప్రష్యా నాయకత్వంలో ఉత్తర జర్మన్ సమాఖ్య ఏర్పాటుకు అంగీకరించింది.

డి) ఉత్తర జర్మన్ సమాఖ్యలో ఆస్ట్రియాకు సభ్యత్వముండదు.

**ఫలితాలు :**

ఎ) బిస్మార్క్ దీనిని అవకాశంగా తీసుకొని చిన్న జర్మన్ రాజ్యాలలో చాలా వాటిని షెల్స్‌విగ్, హోల్‌స్టీన్, హనోవర్ రాజ్యాల్ని, నాసౌ (Nasow) హెస్సె - కాసిల్ (Hesse-Kasil) ఫ్రాంక్‌ఫర్ట్ నగరాన్ని ప్రష్యాలో కలిపినాడు.

బి) పై ప్రాంతాల చేరికతో, ప్రష్యా రాజ్యం 50 లక్షల జనాభాను 27,000 చదరపు మైళ్ళ భూభాగాన్ని సంపాదించింది.

సి) 1867 నాటికి రైన్ నదికి ఉత్తరాన ఉన్న ఇంకో 20 రాజ్యాలలో ఉత్తర జర్మన్ సమాఖ్య ఏర్పడింది. ప్రష్యా రాజు ఈ సమాఖ్యకు అధ్యక్షుడు. ఇతడు ఈ సమాఖ్య విదేశీ వ్యవహారాలు నిర్వహిస్తాడు.

డి) ఆస్ట్రియాను పూర్తిగా ఓడించిన ప్రష్యా, జర్మనీ సమైక్యతను చాలా వరకు సాధించింది.

ఇ) దక్షిణ జర్మనీలోని బవేరియా, వర్టెంబర్గ్, బేడిన్, హెస్సే రాజ్యాలు స్వతంత్రంగా ఉండిపోయాయి. తమ ఉనికి, ప్రాముఖ్యత తగ్గుతుందనే భయంతో ఈ రాజ్యాలు ప్రష్యాతో చేరలేదు. బిస్మార్క్ తెలివిగా వీటి పట్ల స్నేహ ధోరణి అవలంభించి, రక్షణ సంధులను చేసుకొన్నాడు.

ఎఫ్) బిస్మార్క్ ఉదారవాదులతో కూడా మైత్రిని నెరపి, పెక్కు ఉదారవాద సంస్కరణలను తలపెట్టినాడు. ఈ ఉదారవాదులు కూడా బిస్మార్క్ విధానాన్ని సమర్థించారు. ఈ చర్యలు బిస్మార్క్ రాజనీతిజ్ఞతకు చక్కని నిదర్శనాలు.

## 8.4.7.1.3 ఫ్రాంకో - ప్రష్యా యుద్ధం (1870-1871) :

ఆస్ట్రియాతో యుద్ధం తర్వాత జర్మనీ పూర్తి సమైఖ్యత సాధించడానికి బిస్మార్క్‌నకు రెండే రెండు అవరోధాలు ఎదురైనాయి. అవి. 1. ఫ్రెంచి వ్యతిరేకత, 2. దక్షిణ జర్మన్ రాజ్యాలు స్వతంత్రంగా ఉండాలనే ఆలోచన (బవేరియా, వర్టెంబర్గ్, బేడిన్), "తార్కికంగా చూస్తే, ఫ్రాన్స్‌తో యుద్ధం అనివార్యం" అని బిస్మార్క్ భావించినాడు. ఆస్ట్రియా ఓటమి, జర్మనీ నుంచి ఆస్ట్రియాను గెంటివేయటం, ప్రష్యా శక్తివంతమైన సైనికశక్తిగా రూపొందటం - తుల్యప్రాబల్యాన్ని దెబ్బతీసిందనే భావం ఫ్రాన్స్‌లో ఏర్పడి ఉంది. ఇది ఫ్రాన్స్‌కు క్షేమకరంకాదని, ఫ్రాన్స్ రాజకీయవేత్తలు భావించిరి. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితి ఫ్రాన్స్ - ప్రష్యాల మధ్య నెలకొన్నది.

ఎవరూ ఊహించని విధంగా ఫ్రాంకో-ప్రష్యా యుద్ధం పెను తుఫానుగా ఐరోపా ఖండాన్ని ఆవరించింది. స్పెయిన్‌లో సంభవించిన ఉదారవాద తిరుగుబాటు వల్ల రాణి రెండో ఇసబెల్లా (Isabella - II) దేశం నుంచి పలాయనం చిత్తగించింది. అందువల్ల సింహాసనం ఖాళీ అయి, రాజకీయ అస్థిరత్వం నెలకొన్నది. సింహాసనం అధిష్టించమని యూరోపియన్ రాజ కుటుంబసభ్యులకు కొందరికి ఆహ్వానాలు వెళ్ళాయి. కాని ఎవరూ దీనికి ముందుకు రాలేదు. ఇటువంటి పరిస్థితులలో స్పానిష్ రాజమకుటాన్ని స్పానిష్ ఉదారవాద రాజకీయవేత్త లియోపాల్డ్, ఓహెన్ జోలరిన్ - సిగ్మరింజన్ (ప్రష్యా రాజు దగ్గర బంధువు) (Leopald, Hohenzollerin - Sigmaringen) కు అప్పగించటానికి సన్నద్ధులైనారు. లియోపాల్డ్, ప్రష్యారాజు మొదటి

విలియంనకు బంధువు. అతడు మొదట స్పానిష్ వ్యవహారాలలో తలదూర్చడానికి నిరాకరించినాడు. కానీ బిస్మార్క్ దౌత్యం వల్ల అంగీకరించినాడు.

అంతట ఫ్రెంచి చక్రవర్తి 3వ నెపోలియన్ తన తీవ్ర నిరసనను ప్రష్యన్, స్పానిష్ ప్రభుత్వాలకు తెలియచేశాడు. 1870 జూలై 12న స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో అధికారికంగా ప్రకటించడం జరిగింది. ఈ సమస్య అంతటితో సమసిపోయి ఉండేది. దౌత్యపరంగా ఏదో విధంగా దెబ్బతీయమని 3వ నెపోలియన్‌కు అతడి మంత్రులు సలహానిచ్చారు. అంతట భవిష్యత్‌లో కూడా ఓహెన్ జోలరిన్‌లలో ఎవ్వరూ స్పానిష్ రాజమకుటాన్ని స్వీకరించరని ప్రష్యా రాజు హామీ యివ్వాలని కోరేందుకు బెర్లిన్‌లో ఫ్రెంచి రాయబారిని (బెనడెట్టి Benedetti) మొదటి విలియంను కలవవలసిందిగా నెపోలియన్ ఆజ్ఞాపించినాడు. విలియం అప్పుడు ఎమ్స్ (Elms) అనే ఆరోగ్య కేంద్రంలో విశ్రాంతి తీసుకొంటున్నాడు. అక్కడ ఫ్రెంచి రాయబారి విలియంను కలిశాడు. విలియం అప్పుడు ఖచ్చితంగా ఏది తేల్చి చెప్పలేదు. అందువల్ల, తనను కలుసుకొనేందుకు మరోసారి అనుమతి నివ్వవలసిందిగా ఫ్రెంచి రాయబారి విలియంను కోరినాడు. తాను ఆ రాత్రే ఎమ్స్ నుంచి వెళ్ళిపోతున్నానని అందువల్ల అతడిని కలుసుకోవడానికి వీల్లేదని విలియం సమాధానమిచ్చినాడు. దౌత్యవర్గాల్లో ఇది కొంత సంచలనాన్ని కల్గించింది. ఈ పరిణామాన్ని తెలియజేస్తూ విలియం బిస్మార్క్‌నకు ఒక టెలిగ్రాం పంపించినాడు. దీనికే "ఎమ్స్ టెలిగ్రాం" అని పేరు. (Elms Telegram) ఫ్రాన్స్‌తో కయ్యానికి సిద్ధంగా ఉన్న బిస్మార్క్‌నకు ఇది చక్కని అవకాశం తోచింది. ఎమ్స్ టెలిగ్రాంలో ఉన్నవి లేనట్లు లేనివి ఉన్నట్లుగా మార్పులు, చేర్పులు చేసి, దాన్ని పత్రికల వారికి బిస్మార్క్ విడుదల చేశాడు. దీనివల్ల, ఫ్రెంచి రాయబారిని ప్రష్యారాజు అవమానపరిచాడనే భావం ప్రష్యన్‌లకు కల్గింది.

1870 జూలై 14న ఫ్రెంచి వారు తమ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొనే సమయంలో, ప్రష్యా రాజు తమ రాయబారిని తీవ్ర అవమానానికి గురిచేశాడని పారిస్‌లో పత్రికలన్నీ ప్రముఖంగా ప్రకటించినాయి. దీనివల్ల రెండు దేశాలలోను జాతీయ ఆవేశాలు పెంపొందినాయి. మరుసటిరోజే ఫ్రెంచి పార్లమెంట్ సమావేశమై, ప్రష్యాపై యుద్ధం ప్రకటించింది. ఈ విధంగా ఫ్రాంకో-ప్రష్యా యుద్ధం 1870 జూలై 15న మొదలైంది.

యుద్ధానికి ముందు బిస్మార్క్ దౌత్యపరంగా ఫ్రాన్స్‌ను ఏకాకిని చేయుటకు ఇంగ్లాండ్, ఆస్ట్రియా, రష్యా, ఇటలీలను తనవైపునకు త్రిప్పుకొనినాడు.

**యుద్ధక్రమం :**

1870 ఆగస్టులో అల్జీరియాలో ఉన్న మార్షల్ మాక్‌మహోన్ (Marshall Mac Mohan) ను ఫ్రెంచి ప్రభుత్వం ఫ్రాంకో - ప్రష్యా యుద్ధంలో పాల్గొనేందుకు పిలిపించింది. ముందుకు దూసుకు వస్తున్న జర్మన్‌లు మాక్‌మహోన్ సారథ్యంలోని ఫ్రెంచి సైన్యాన్ని స్ట్రాస్‌బర్గ్ వద్ద ఓడించారు. దీనితో ఆల్సేస్ (Alsace) లో చాలా భాగం ప్రష్యా స్వాధీనమైంది. ఆగస్టు 18న మరో జర్మన్‌సైన్యం లొరైన్‌లో (Loraine) మార్షల్ బజాయిన్ (Marshall Bazaine) నాయకత్వంలోని మరో ఫ్రెంచి సైన్యాన్ని పరాజయం పాలు చేసింది. మెట్జ్‌లోని (Metz) ఒక దుర్గంలో మిగిలిన ఫ్రెంచి సైన్యం తలదాచుకొన్నది. ఇలాంటి విపత్కర పరిస్థితిలో తనతో వచ్చి చేరిన చక్రవర్తి నెపోలియన్‌కు ఫ్రెంచి సైన్యాలను పారిస్‌కు తరలించి, అక్కడి ప్రష్యన్‌లను ఎదిరించి నిలిస్తే బాగుంటుందని మాక్‌మహోన్ సూచించినాడు. ఈ విషయంపై నెపోలియన్ పారిస్‌లో అధికారవర్గాల సలహా కోరాడు. మాక్‌మహోన్ సలహా పాటిస్తే అది ఫ్రెంచి సామ్రాజ్య అంతమని, అందువల్ల మెట్జ్ రక్షణకు చర్యలు తీసుకుంటే ఉత్తమమని టెలిగ్రాం ద్వారా నెపోలియన్‌కు సమాధానం వచ్చింది. చేసేది లేక, నెపోలియన్, మాక్ మహోన్‌లు మ్యూసేనది (River Meuse) ని దాటి ప్రష్యన్‌లతో యుద్ధానికి తలపడ్డారు. అంతట యిరుపక్షాల వారికి బెల్జియం సరిహద్దులోని సెడాన్ (Sedan) వద్ద యుద్ధం జరిగింది. 1870 సెప్టెంబర్

1, 2 తేదీలలో అధిక సంఖ్యలో నున్న ప్రష్యన్ సైన్యం, ఫ్రెంచి సైన్యాన్ని చుట్టి వేసింది. లొంగిపోవడం తప్ప ఫ్రెంచివారికి వేరొక మార్గం లేదు. ఈ యుద్ధంలో 81,000 మంది ఫ్రెంచి సైనికులు యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. దాదాపు 25,000 మంది మరణించడమో, క్షతగాత్రులు కావడమో జరిగింది. మూడో నెపోలియన్ యుద్ధ ఖైదీగా పట్టుబడ్డాడు. "మన సైన్యం ఓడిపోయి, బందీగా పట్టుబడింది. నేనే యిప్పుడు యుద్ధ ఖైదీని" అని నెపోలియన్ ఫ్రెంచి వారికి తెలియచేశాడు. అంతట సెప్టెంబర్ 4 వ తేదీన పారిస్‌లో శాసనసభ సమావేశమైంది. చర్చలకు కూడా వ్యవధి లేదు. గుంపులు గుంపులుగా శాసనసభ ప్రాంగణంలోనికి ప్రదర్శన కారులు ప్రవేశించి చక్రవర్తికి, రాజరికానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఫ్రాన్స్‌లో రిపబ్లిక్ పాలన కావాలని డిమాండ్ చేశారు. గుంపులకు నాయకత్వం వహించిన లియోన్ గాంబెట్టా (Leon Gambetta) జూల్స్ ఫార్ (Jules Favre), జూల్స్ ఫెర్రీలు (Jules Ferry), హోటల్ ద వీల్ (Hotel de ville) లో సమావేశమై, ఫ్రాన్స్‌ను రిపబ్లిక్‌గా ప్రకటించారు. చక్రవర్తిని తొలగిస్తూ ఒక తీర్మానం చేశారు. ఇదే ఫ్రెంచి చరిత్రలో మూడో రిపబ్లిక్ (Third Republic) జాతీయ రక్షణ ప్రభుత్వం (Government of National Defence) ను ఏర్పరచడం జరిగింది. జనరల్ ట్రోచు (General Trochu) దీనికి అధినేత. యుద్ధం పూర్తి అయ్యేటంతవరకు ఈ ప్రభుత్వమే కొనసాగింది.

మూడో రిపబ్లిక్ అయిన తర్వాత ఫ్రాన్స్ మళ్ళీ యుద్ధం కొనసాగించింది. ఇది ఫ్రాంకో-ప్రష్యా యుద్ధానికి రెండో దశ. ఇది 1870 సెప్టెంబర్ నుంచి 1871 జనవరి వరకు సాగింది.

ఫ్రెంచి రిపబ్లిక్‌నకు లియోన్ గాంబెట్టా (Leon Gambetta) యుద్ధమంత్రిగా వ్యవహరించినాడు. ఒకవైపు పారిస్ మీద జర్మన్‌ల పట్టు బిగిస్తుంటే, మరోవైపు గాంబెట్టా బెలూన్‌లో పారిపోయి ప్రష్యాకు వ్యతిరేకంగా ప్రతిఘటన సాగించమని, ఫ్రెంచి ప్రజలకు విజ్ఞప్తి చేసినాడు. చెల్లాచెదురైన ఫ్రెంచి సైన్యాలను సమీకరించడానికి అతడు ప్రయత్నించినాడు. 21 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు వారందరూ సైన్యంలో చేరాలని ఫ్రెంచి ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. శత్రుసైన్యాలు అన్నివైపుల మొహరించి ఉన్నప్పటికి పారిస్, మెట్జ్, స్ట్రాస్‌బర్గ్ నగరాలను రక్షించేందుకు గాంబెట్టా సైన్యాలను తరలించినాడు. కాని ఫలితం దక్కలేదు. సెప్టెంబర్ చివరి నాటికి స్ట్రాస్‌బర్గ్ ప్రష్యన్‌ల స్వాధీనమైంది. మెట్జ్‌లో 1,50,000 మంది ఫ్రెంచి సైనికులు యుద్ధ ఖైదీలుగా పట్టుబడిరి. పారిస్ నగర వాసులకు ఆహార కొరత ఏర్పడి, చలిగాలుల వల్ల చాలా మంది ఆ నగరంలో మృత్యువు వాత పడ్డారు. 1871 జనవరి 28 నాటికి పారిస్ కూడా ప్రష్యాకు స్వాధీనమైంది. అడాల్ఫ్ థియర్స్ ఫ్రెంచి మూడో రిపబ్లిక్ అధ్యక్షుడై ప్రష్యాతో ఫ్రాంక్‌ఫర్ట్ సంధి చేసుకొనినాడు.

**ఫ్రాంక్ ఫర్ట్ సంధి (Frankfurt) (1871 మే 10) :**

ఫ్రాంకో-ప్రష్యా యుద్ధానికి ముగింపుగా ఫ్రాంక్‌ఫర్ట్ సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం

1. స్ట్రాస్‌బర్గ్, మెట్జ్, ఆల్సేస్, లొరైన్‌లను ఫ్రాన్స్-ప్రష్యాకు అర్పించవలసి వచ్చింది.
2. 5,000 మిలియన్ ఫ్రాంకుల ధనాన్ని యుద్ధ నష్టపరిహారంగా 3 నెలల లోపుగా ఫ్రాన్స్, ప్రష్యాకు చెల్లించాలి. అది చెల్లించబడేవరకు ప్రష్యన్ సైన్యం ఫ్రాన్స్‌లో ఉంటుంది.
3. ఈ సంధితో జర్మనీ ఏకీకరణ పూర్తయింది.

## యుద్ధఫలితాలు :

ఫ్రాన్స్ ఓటమితో జర్మనీ ఏకీకరణ పూర్తయి, జర్మన్ సామ్రాజ్యం అవతరించింది. ఫ్రాన్స్‌లో రెండో సామ్రాజ్యం అంతమై, మూడో రిపబ్లిక్ అవతరించింది. ఇటలీ ఏకీకరణ కూడా పూర్తయింది. ఫ్రాన్స్ ఓటమి వల్ల రష్యా బాల్కన్ వ్యవహారాలలో మళ్ళీ

తిరిగి జోక్యం చేసుకొన్నది. అందువల్ల ఐరోపాలో తుల్య ప్రాబల్యం అంతరించి జర్మనీ బలమైన రాజ్యం కావటానికి, విపత్కకర పరిణామాలకు దారితీసింది. యుద్ధానంతరం ఫ్రాన్స్‌లోని వర్సేల్సు అద్దాల భవనంలో లేదా కాంచనశాలలో (Hall of Mirrors) 1871లో బిస్మార్క్ చేత విలియం "కైజర్" (జర్మన్ చక్రవర్తి) అనే బిరుదంతో జర్మన్ చక్రవర్తిగా ప్రకటించబడినాడు. దీనిని ఫ్రెంచి ప్రజలు అవమానంగా భావింపగా జర్మన్ ప్రజలు విజయసంకేతంగా భావించారు. ఈవిధంగా బిస్మార్క్ నాయకత్వంలో, ప్రష్యా ఆధ్వర్యంలో జర్మనీ ఏకీకరణ పూర్తయింది.

## 7.4.7.2 జర్మనీ ఏకీకరణానంతర విదేశీ విధానం :

1871-1914ల మధ్య కాలంలో ఐరోపాలోని రాజ్యాలు పరస్పరం వైరుధ్యమున్న రెండు కూటాలుగా నేర్పడినాయి. శాంతి సమయంలో ఇలాంటి కూటాలు ఏర్పడటం ఆధునిక ప్రపంచ చరిత్రలో ఇదే మొదటిసారి అని చెప్పవచ్చు. ఈ కూటాలు మొదటి ప్రపంచ సంగ్రామ ఆవిర్భావానికి పునాదులు వేశాయి.

బిస్మార్క్ ఆస్ట్రియా, ఫ్రాన్స్‌లతో యుద్ధాలు జరిపి జర్మనీ ఏకీకరణ సాధించినాడు. అతడు యుద్ధం ముగియగానే ఆస్ట్రియాతో స్నేహసంబంధాలు పెంపొందించుకొనినాడు. కానీ ఫ్రాన్స్ యెడల కఠినత్వాన్నే ప్రదర్శించినాడు. ప్రజాస్వామ్య భావాలు, సామ్యవాద భావాలు కల ఫ్రాన్స్‌పై ఆయనకు మొదటి నుంచి ఏవగింపు కలదు. అంతేగాక ఏనాటికైనా జర్మనీ ఏకీకరణకు, శాంతిభద్రతలకు ఫ్రాన్స్ ముప్పు తెస్తుందని భావించినాడు. అందువల్ల ఐరోపాలో ఫ్రాన్సును ఏకాకిని చేయుటకు తీవ్రంగా ప్రయత్నించినాడు.

### 8.4.7.2.1 త్రి సామ్రాట్ మిత్ర మండలి (1872) :

దీనిలో సభ్యరాజ్యాలు రష్యా, ఆస్ట్రియా, జర్మనీలు. దీనిలోని ముఖ్యాంశములు ఎ) 1871 నాటి ఫ్రాంక్‌ఫర్ట్ సంధిననుసరించి ఏర్పడిన షరతులను పరిరక్షించుట. బి) తూర్పు సమస్యను పరిష్కరించుట. సి) విప్లవోద్యమాలను అణచివేయుట.

### 8.4.7.2.2 ద్విపక్ష మైత్రి (1879) :

1878లో బెర్లిన్ కాంగ్రెస్ తర్వాత రష్యా, జర్మనీల మధ్య సంబంధాలు చాలావరకు దెబ్బ తిన్నాయి. బెర్లిన్ కాంగ్రెస్‌ను, రష్యా తనపైన జరిగిన కుట్రగా భావించింది. పరిస్థితి విషమించిందని గమనించిన బిస్మార్క్ 1879లో ఆస్ట్రియాతో రహస్యమైత్రి చేసుకొనినాడు. ఇది రష్యాకు వ్యతిరేకంగా చేసుకోబడింది. ఇది మొదటి ప్రపంచ యుద్ధం వచ్చేవరకు కొనసాగింది. దీనిలో ముఖ్యాంశములు ఎ) రష్యా తమ ఇద్దరిలో ఎవరిపైనా దండెత్తిన ఉభయులు సంయుక్తంగా ఎదిరించాలి. బి) ఫ్రాన్స్‌కు - జర్మనీకి యుద్ధం వస్తే ఆస్ట్రియా తటస్థంగా ఉండాలి.

### 8.4.7.2.3 త్రి సామ్రాట్ మైత్రీ కూటమి (1881) :

దీనిలో సభ్యులు జర్మనీ, రష్యా, ఆస్ట్రియాలు. దీని ప్రకారం ఎ) పై మూడు రాజ్యాలలో ఏదేశమైనా ఇతర దేశాలపై దండెత్తినట్లయితే తక్కిన రెండు దేశాలు తటస్థంగా ఉండాలి. బి) ఆస్ట్రియాకు బెర్లిన్ సమావేశం వల్ల సంక్రమించిన భూ భాగాలకు రష్యా తన అనుమతినిచ్చింది. సి) బాల్కన్‌లలోని డార్డినల్స్ జలసంధి విషయమై ఈ మూడు రాజ్యాలు కొన్ని నిర్ణయాలు తీసుకొన్నాయి. డి) ఈ మైత్రి వల్ల రష్యా, ఆస్ట్రియాపై దండెత్తే ప్రమాదం తప్పింది. రష్యా, ఫ్రాన్స్‌నకు సహాయపడే అవకాశం కూడా సన్నగిల్లింది.

### 8.4.7.2.4 త్రిరాజ్యసంధి (1882) :

ఇటలీ-ఫ్రాన్స్‌ల మధ్య ఆఫ్రికాలోని ట్యూనిస్ విషయమై తీవ్ర తగాదా వచ్చింది. అదను చూచుకొని బిస్మార్క్ ఫ్రాన్స్‌ను ట్యూనిస్‌ను ఆక్రమించుకోవలసిందిగా ప్రోత్సహించినాడు. దానితో ఫ్రాన్స్ ట్యూనిస్‌ను ఆక్రమించుకొన్నది. ఈ పరిస్థితులలో ఇటలీకి జర్మనీతో స్నేహం అవసరమైంది. అందువల్ల ఈ సంధిలో ఇటలీ, ఆస్ట్రియా, జర్మనీలు సభ్యులైనాయి. యిందులోని ముఖ్యాంశములు :

ఎ) జర్మనీ పైకి ఫ్రాన్స్ గాని మరే రాజ్యకూటమి గాని దండెత్తినట్లయితే ఇటలీ, జర్మనీకి సహాయపడాలి.

బి) అదేవిధంగా ఆస్ట్రియాపై దురాక్రమణ జరిగినా ఇటలీ సహాయపడాలి.

సి) ఇటలీపై ఫ్రాన్స్‌గాని, మరే రాజ్యకూటమి గాని దురాక్రమణ జరిపే సందర్భంలో జర్మనీ, ఆస్ట్రియాలు ఇటలీకి మద్దతు యివ్వాలి. 1887లో ఈ సంధిని మళ్ళీ పొడిగించి, ఇంకో అదనపు షరతుపెట్టారు. అది ఆస్ట్రియా కాని, ఇటలీ కాని పరస్పర అంగీకారం లేకుండా బాల్కన్ భూభాగంలో ఏ ప్రాంతాన్ని ఆక్రమించరాదు.

### 8.4.7.2.5 రష్యాతో పునర్ భద్రతా సంధి (Re-Insurance Treaty) (1887) :

ఇది రష్యా - జర్మనీల మధ్య రహస్యంగా జరిగింది. 1885-1886 లలో తూర్పు రుమేనియా, బల్గేరియాలో ఐక్యమైంది. ఈ పరిణామం రష్యాకు నచ్చకపోయినా, ఆస్ట్రియా, జర్మనీలకు నచ్చింది. ఈ పరిస్థితులలో బిస్మార్క్ "బల్గేరియాతో నేను రష్యావాడిని" అని ప్రకటించినాడు. ఈ పునర్ భద్రతాసంధి 1887లో రష్యా, జర్మనీల మధ్య రహస్యంగా జరిగింది. ఈ సంధి ప్రకారం ఎ) రష్యా-ఫ్రాన్స్ కు ఎట్టి సహాయం చేయకూడదు. బి) ఇందుకు ప్రతిఫలంగా జర్మనీ, ఆస్ట్రియాకు విరుద్ధంగా బాల్కన్ రాజ్యాలలో రష్యాను సమర్థించగలదు. సి) ఈ సంధి ఆస్ట్రియా - రష్యాల మధ్య యుద్ధాన్ని నివారించడమే కాక, ఫ్రాన్స్ - రష్యాల మధ్య కూటమి ఏర్పాటును గూడా అరికట్టింది.

### 8.4.8 బిస్మార్క్ వ్యక్తిత్వం :

బిస్మార్క్ సాటిలేని దేశభక్తుడు. అతని ఏకైక లక్ష్యం, ప్రష్యా ఆధ్వర్యంలో జర్మనీని సమైక్యపరచడం. దృఢదీక్షతో దానిని సాధించెను కూడా. బిస్మార్క్ రాజనీతి నైపుణ్యతతో ఐరోపాలోని అగ్రరాజ్యాలను తన చెప్పు చేతల్లోకి తెచ్చుకున్నాడు. జర్మనీ శాంతిభద్రతలను కాపాడి ఆదేశ రాజకీయ, ఆర్థిక, సాంఘిక పురోభివృద్ధిని సాధించినాడు. ఐరోపాలో 3 దశాబ్దాలపాటు పెద్దయుద్ధాలు సంభవించకుండా అరికట్టడానికి కారకుడయ్యాడు. కాని అతడు చేపట్టిన విదేశీ రహస్య మైత్రీ విధానం ఐరోపా రాజ్యాలలో భయానికి, అనుమానానికి తావిచ్చింది. 1888లో రెండో విలియం జర్మనీకి రాజైనాడు. ఇతడు బిస్మార్క్ విధానాల్ని త్రోసిపుచ్చి, కొత్త విధానాల్ని పాటించినాడు. అవి 1. జర్మనీ ప్రపంచాధిపత్యం పొందుట. 2. పదాతి, నౌకాదళాన్ని పెంపొందించుట. 3. వలసల్ని అధికంగా సంపాదించుట. రెండో విలియంనకు బిస్మార్క్‌నకు - వయస్సులోను, ఆశయాలలోను, ఆచరణా విధానంలోను అధిక వైవిధ్యం ఉండటంతో బిస్మార్క్ 1890లో తన ఛాన్సలర్ పదవికి రాజీనామా యిచ్చినాడు. బిస్మార్క్ ఏర్పరచిన రహస్య మైత్రీ సంధులు చివరికి ప్రపంచాన్ని రెండు సాయుధ శిబిరాలుగా మార్చి మొదటి ప్రపంచ యుద్ధం రావటానికి కారకుడైనాడు. బిస్మార్క్ 83 సంవత్సరాల పండు జీవిగా 1898 లో పరమపదించినాడు. చనిపోబోయే ముందు ఒక రాజకీయవేత్తతో (Herr Ballin) బిస్మార్క్ ఈ విధంగా పల్కినాడు "ప్రపంచయుద్ధం జరుగుతుంది. అది నేను చూడను. నీవు చూస్తావు. అది సమీపప్రాచ్యంలో ఆరంభమౌతుంది" (Near East) అన్న మాట వాస్తవమైంది. ఏది ఏమైనా జర్మన్ చరిత్రలోనేగాక, ఐరోపా చరిత్రలోకూడా గొప్ప పేరు గడించినాడు. అందుచేతనే బిస్మార్క్‌ను కొంతమంది ఆధునిక చరిత్రకారులు "ఆధునిక జర్మనీ నిర్మాత" అని పేర్కొనుట జరిగింది.

## 8.4.9 నమూనా ప్రశ్నలు :

1. ఇటలీ ఏకీకరణలోని వివిధ దశలు తెల్పుము ?
2. జర్మనీ ఏకీకరణకు బిస్మార్క్ చేసిన సేవ ఎట్టిది ?
3. జర్మనీ ఏకీకరణ తర్వాత బిస్మార్క్ ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణలను వర్ణింపుము.
4. మాజిని
5. కవూర్
6. గారిబాల్డీ
7. ఫ్రాన్స్ - ప్రష్యా యుద్ధం
8. ఫ్రాంక్ ఫర్టు యుద్ధం - 1871
9. కుల్‌తుర్ కాంఫ్

## 7.4.10 చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Great and Temperly | - | Europe in the 19th, 20th Centuries |
| 2. | Hazen C.D | - | Modern Europe |
| 3. | Hayes C.J.H. | - | Modern Europe upto 1870 |
| 4. | Taylor A.J.P. | - | Bismarc the Man and the States - Man. |
| 5. | Holland | - | Builders of United Italy |
| 6. | Marriott | - | Makers of Modern Italy |
| 7. | W.H. Dawson | - | Evolution of Modern Germany |
| 8. | C.P. Gooch | - | Germany |
| 9. | C.P. Gooch | - | History of Modern Europe. |


- శ్రీమతి యం. శివకుమారి, శ్రీ పి. లక్ష్మీనారాయణ

పాఠం - 9

# ప్రాచ్య సమస్య లేక బాల్కన్ సమస్య

**9.0 లక్ష్యం :**

ప్రాచ్య సమస్య లేక బాల్కన్ సమస్య, అందులో భాగంగా క్రిమియా యుద్ధం, రష్యా-టర్కీ యుద్ధం, బెర్లిన్ కాంగ్రెస్, యంగ్‌టర్క్ ఉద్యమం, బాల్కన్ యుద్ధాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయసూచిక :**


**9.1 పరిచయం**

**9.2 ప్రాచ్య సమస్య అంటే**

**9.3 ఆటోమన్ టర్కీ సామ్రాజ్య విస్తరణ - విచ్ఛిన్నం**

**9.4 అగ్రరాజ్యాల జోక్యం**

**9.4.1 రష్యా**

**9.4.2 ఆస్ట్రియా**

**9.4.3 ఇంగ్లండ్**

**9.4.4 ఫ్రాన్స్**

**9.4.5 ఇటలీ, జర్మనీ**

**9.5 బాల్కన్‌లలో తిరుగుబాట్లు**

**9.5.1 సెర్బియా**

**9.5.2 గ్రీస్**

**9.5.3 టర్కీ - ఈజిప్టు యుద్ధం (1831 - 41)**

**9.5.3.1 లండన్ సంధి (1840)**

**9.6 క్రిమియా యుద్ధం (1854-56)**

**9.6.1 కారణాలు**

**9.6.1.1 రష్యా సామ్రాజ్య కాంక్ష**

**9.6.1.2 బాల్కన్ ప్రజలలో అశాంతి**

**9.6.1.3 మత పరిస్థితులు**

**9.6.2 యుద్ధం**

**9.6.3 పారిస్ సంధి షరతులు**

**9.6.4 క్రిమియా యుద్ధ ఫలితాలు**

**9.6.5 విమర్శ**

**9.7 రష్యా - టర్కీ యుద్ధం (1877)**
**9.7.1 బల్గేరియా దురంతాలు**
**9.7.2 సాన్ స్టి ఫానో సంధి (1878)**
**9.7.3 బెర్లిన్ కాంగ్రెస్ (1878)**
**9.7.3.1 బెర్లిన్ సంది నిర్ణయాలు**
**9.7.3.2 విమర్శ**
**9.8 బెర్లిన్ కాంగ్రెస్ అనంతర ప్రాచ్యసమస్య**
**9.8.1 బల్గేరియా ఏకీకరణ (1885)**
**9.8.2 క్రీట్, ఆర్మేనియా**
**9.8.3 బోస్నియా - హెర్జిగోవినాల ఆక్రమణ (1908)**
**9.9 యంగ్ టర్క్ ఉద్యమం**
**9.9.1 ఉద్యమ ప్రాధాన్యత**
**9.10 బాల్కన్ యుద్ధాలు**
**9.10.1 సెర్బియా**
**9.10.2 బల్గేరియా**
**9.10.3 గ్రీస్**
**9.10.4 రుమేనియా**
**9.10.5 మాంటెనీగ్రో**
**9.11 టర్కీ - ఇటలీ యుద్ధం**
**9.12 బాల్కన్ కూటమి**
**9.13 మొదటి బాల్కన్ యుద్ధం (1912-1913)**
**9.13.1 లండన్ సంధి (1913)**
**9.14 రెండో బాల్కన్ యుద్ధం (1913)**
**9.14.1 బుఖారెస్ట్ సంధి (1913)**
**9.15 ఫలితాలు**
**9.16 నమూనా ప్రశ్నలు**
**9.17 చదువవలసిన గ్రంథాలు**

## 9.1 పరిచయం :

క్రీ.శ. 18వ శతాబ్దం నాటికి బలహీనపడిన టర్కీ ఐరోపా జబ్బు మనిషిగా పిలవబడినది. టర్కీ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉన్న బాల్కన్ రాజ్యాల ఆంతరంగిక వ్యవహారాలలో ఐరోపాలోని ప్రముఖ రాజ్యాలైన రష్యా, ఆస్ట్రియా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాలు జోక్యం చేసుకోవటంతో సమస్య ప్రారంభమైంది. ఆ సమస్యనే బాల్కన్ సమస్య లేక ప్రాచ్య సమస్య అని, తూర్పు ఐరోపా సమస్య

అని వ్యవహరిస్తారు. ప్రాచ్య సమస్యతో ముడిపడ్డ అనేక పరిస్థితులు మొదటి ప్రపంచ యుద్ధానికి కూడా కారణమైనాయి. ఆ పరిస్థితులేమిటో ఈ పాఠంలో చర్చించుదాము.

## 9.2 ప్రాచ్య సమస్య అంటే :

ప్రపంచ తూర్పు ప్రాంతాలను సమీప ప్రాచ్యం, దూర ప్రాచ్యం, మధ్య ప్రాచ్యం అని మూడు భాగాలుగా ఐరోపా చరిత్రకారులు విభజించారు. మనం అంటున్న ప్రాచ్య సమస్య అంటే సమీప ప్రాచ్యం లేక బాల్కన్ ద్వీప కల్పం. ఇది టర్కీ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉన్నది. ఐరోపాలో ఆగ్నేయదిశగా ఉన్న ప్రాంతం ఇది. దీనికి ఉత్తరాన డాన్యూబ్ నది, దక్షిణాన ఈజియన్ సముద్రం, తూర్పున నల్ల సముద్రం, పడమట ఆడ్రియాటిక్ సముద్రం సరిహద్దులుగా ఉన్నాయి. ఈ ద్వీపకల్పంలోని రాజ్యాలు సెర్బియా, బల్గేరియా, బొస్నియా, హెర్జిగోవినా, మాంటినీగ్రో, గ్రీస్‌లు. బాల్కన్ రాజ్యాలలో గ్రీకులు, సెర్బియన్‌లు, బల్గేరియన్‌లు, రుమేనియన్‌లు మున్నగు క్రైస్తవ జాతులు ఉండేవి. కాని వారి పాలకులు, సైనికోద్యోగులు మహమ్మదీయులు. వారి నిరంకుశ పాలన వల్ల బాల్కన్ ప్రజల జీవితం దుర్భరమైంది. క్రమంగా బాల్కన్‌లలో జాతీయతాభావం తలెత్తింది.

ప్రాచ్యసమస్య అంటే టర్కీ సామ్రాజ్య క్షీణత, బాల్కన్ రాజ్యాలలోని క్రైస్తవ జాతుల స్వాతంత్ర్య కాంక్షకు సంబంధించినది. దీనికితోడు అగ్రరాజ్యాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం జోక్యం చేసికోవడం కూడా ప్రాచ్య సమస్యకు దారితీసింది. ప్రాచ్య సమస్య నాలుగు ప్రధాన సమస్యల చుట్టూ అల్లుకొని ఉన్నది. అవి. 1) ఐరోపాలో టర్కీ సామ్రాజ్య క్షీణత 2) బాల్కన్ ప్రజల జాతీయ భావం 3) టర్కీ ఆస్తుల విషయంలో ఐరోపా రాజ్యాల వివాదాలు 4) ఐరోపా రాజ్యాల పరస్పర వ్యతిరేక ప్రయోజనాలు. "మారుతూ ఉన్న, లొంగని, ఒకదానితో ఒకటి అల్లుకొని చిక్కుబడిన వ్యతిరేక ప్రయోజనాలు, విరుద్ధ మత విశ్వాసాల సమస్య"గా దీన్ని లార్డ్ మోర్లే అభివర్ణించాడు.

## 9.3 ఆటోమన్ టర్కీ సామ్రాజ్య విస్తరణ - విచ్ఛిన్నం :

తురుష్కులు మధ్య ఆసియా ప్రాంతానికి చెందిన ఆదివాసులు. అక్కడినుండి మెసపొటేమియా, సిరియా, ఈజిప్ట్, ఆసియామైనర్‌లకు వలసవెళ్ళారు. వారు ఎక్కడ స్థిరపడ్డారో అక్కడి మతాన్ని అంటే ముస్లిం మతాన్ని అవలంభించారు. ఆసియామైనర్‌లోకి వచ్చిన ఒక తురుష్క తెగకు ఉస్మాన్ నాయకుడు. అతని వంశీయులకు లోబడి ఉన్న తురుష్కులు ఆటోమన్ తురుష్కులని పిలవబడ్డారు. వారు ఇతర తురుష్క తెగలను జయించి బలవత్తరమైన సైనిక రాజ్యాన్ని నిర్మించారు. ఈ ఆటోమన్ సామ్రాజ్యం బలపడుతూ సమీప ప్రాచ్యంపై ఆధిపత్యం కోసం క్రైస్తవులతో పోరాటాన్ని కొనసాగించినది.

క్రమేణా తురుష్కులు బల్గేరియా, యుగోస్లోవియా, గ్రీస్, కాన్‌స్టాంట్ నోపిల్ మొదలగు ప్రాంతాలను ఆక్రమించుకొన్నారు. సులేమాన్ చక్రవర్తి పాలనలో ఈ రాజ్యం పరాకాష్ఠనందుకొంది. 16, 17 శతాబ్దాలలో తురుష్కులు తమ అధికారాన్ని ఆసియామైనర్, సిరియా, మెసపొటేమియా, అరేబియా, ఈజిప్ట్, ఆఫ్రికా ఉత్తర తీరం వరకు విస్తరించారు. అయితే 1571 లెపాంటో యుద్ధంలో తీవ్ర పరాజయాన్ని పొందారు. 17వ శతాబ్దం నాటికి ఆటోమన్ సామ్రాజ్యం బలహీనపడింది. 18వ శతాబ్దం నాటికి ఈ సామ్రాజ్యాన్ని 'ఐరోపా జబ్బు మనిషి' గా వ్యవహరించారు. అదే సమయంలో తూర్పు ఐరోపాలో అనేక మార్పులు జరిగాయి. రష్యా ఒక ప్రముఖ రాజ్యంగా రూపొంది ఆటోమన్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయటం ద్వారా తన రాజ్యాన్ని విస్తరింపచేయాలనుకొన్నది. టర్కీ సుల్తాన్‌కు వ్యతిరేకంగా బాల్కన్ ప్రజలలో జాతీయతాభావాన్ని రెచ్చగొట్టింది. రష్యా విస్తరణకు భయపడిన ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఆస్ట్రియా రాజ్యాలు ఈ రాజకీయాలలో జోక్యం చేసుకోవడంతో పెక్కు సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యలే బాల్కన్ సమస్య లేక ప్రాచ్య సమస్యగా చెప్పటం జరిగింది.

## 9.4 అగ్రరాజ్యాల జోక్యం :

టర్కీ అధికారం క్షీణిస్తున్న దశలో బాల్కన్‌లలోని క్రైస్తవ రాజ్యాలు జాతీయతా భావంతో సతమతమవుతూ టర్కీ పాలన నుండి విముక్తికి ప్రయత్నించాయి. అయితే టర్కీ క్రైస్తవులను నిరంకుశంగా అణచివేసింది. అది ఐరోపాలోని క్రైస్తవ రాజ్యాలలో ఆగ్రహాన్ని కల్గించింది. ఒకే మతానికి చెందినవారమనే భావంతో, స్వార్థ ప్రయోజనాలతో బాల్కన్ వ్యవహారాలలో జోక్యం కల్గించుకొన్నాయి. బాల్కన్ ప్రాంతం రణరంగంగా మారింది. అది బాల్కన్ సమస్యను మరింత క్లిష్టం చేసింది.

### 9.4.1 రష్యా :

దక్షిణ దిశగా విస్తరించాలనే రష్యా ఆకాంక్షే ప్రాచ్య సమస్యకు కారణం. రష్యా బాల్కన్‌లలో జోక్యం చేసుకోవడానికి ప్రధానంగా రెండు కారణాలున్నాయి. రష్యా, బాల్కన్ ప్రజలూ ఒకే స్లావ్ జాతికి, ఒకే ఆర్థడాక్స్ కాథలిక్ మతానికి చెందినవారు. బాల్కన్ రాజ్యాల రక్షణ రష్యా స్వీకరించింది. అందుచే టర్కీ నిరంకుశత్వం నుండి బాల్కన్ ప్రజలను కాపాడాలని భావించింది. దీనికితోడు రష్యా స్వార్థం కూడా తోడైంది. రష్యాలోని తీరాలు చాలా భాగం మంచుతో కప్పబడి ఉన్నాయి. విదేశాలతో వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలకు అది ప్రతిబంధకమైంది. అందువల్ల మంచులేని తీరప్రాంతాల కోసం రష్యా అన్వేషించింది. రష్యా చక్రవర్తి పీటర్ మహారాజు కాలంలో బాల్టిక్ తీరంలో సెంట్ పీటర్స్ బర్గ్‌ను, నల్ల సముద్రాన అజోవ్‌ను సంపాదించగలిగాడు. కాని తురుష్కులు అజోవ్‌ను తిరిగి ఆక్రమించారు. కాథరిన్ మహారాణి కాలంలో 1773 లో టర్కీని ఓడించి కుషుక్, కైనార్జీ సంధి ద్వారా అజోవ్‌ను తిరిగి సంపాదించింది. ఫలితంగా ఈ ప్రాంతంలో రష్యా ఆధిక్యతను సంపాదించటమేగాక మధ్యధరా సముద్రానికి డార్డినల్స్, బాస్పరస్ జలసంధుల ద్వారా తన నౌకలను పంపడానికి వీలు కలిగింది. అంతేగాక ఆటోమన్ సామ్రాజ్యాన్ని నాశనంచేసి కాన్‌స్టాంట్ నోపుల్‌ను స్వాధీనం చేసుకోవాలనీ లేకపోతే ఆ ప్రాంతాన్ని తన ఆధిపత్యంలోనైనా ఉంచుకోవాలనేదే రష్యా వాంఛ. ఆ కారణంగా బాల్కన్ వ్యవహారాలలో రష్యా జోక్యం చేసుకొన్నది.

### 9.4.2 ఆస్ట్రియా :

బాల్కన్ ప్రాంతంలో ఆస్ట్రియాకున్న ప్రయోజనాలు రష్యా మరి ఇతర దేశాల కంటే ముఖ్యమైనవి. ఆస్ట్రియా చుట్టూ అనేక దేశాలున్నాయి. ఆస్ట్రియాకు ఒక్క డాన్యూబ్ నది తప్ప బయటి ప్రపంచంతో సంబంధబాంధవ్యాలు పెట్టుకోవడానికి మరొక అనువైన జలమార్గం లేదు. నల్ల సముద్రం రష్యా అదుపులోకి వచ్చినట్లయితే ఈ చిన్న అవకాశం కూడా ఉండదు. పైగా బాల్కన్‌లలో రష్యా ప్రోత్సహిస్తున్న 'స్లావ్‌లంతా ఒక్కటే' అన్న భావం ఆస్ట్రియాకు ప్రమాదం. బాల్కన్ తెగలు ఆస్ట్రియా తెగలకు సన్నిహితం. బాల్కన్‌లలో జాతీయతా భావం పెరిగితే అది ఆస్ట్రియాకు కూడా వ్యాపించి ఆస్ట్రియాలోని వంశపారంపర్య సామ్రాజ్యానికి ముప్పు కలిగించవచ్చు. అందువల్ల ఒక వైపు రష్యా విస్తరణను నిరోధించటానికి ప్రయత్నిస్తూ మరొకవైపు తన పలుకుబడిని పెంచుకోవటానికి ఆస్ట్రియా ప్రయత్నించింది.

### 9.4.3 ఇంగ్లండ్ :

బాల్కన్ రాజ్యాలలో రష్యా విస్తరణ ఇంగ్లండ్‌కు ఇష్టం లేదు. ఇంగ్లండ్ వర్తక దేశం. ప్రాచ్యదేశాలతో వర్తక, వ్యాపారాలు నిరాటంకంగా కొనసాగాలంటే తూర్పు మధ్యధరా సముద్రం ఎవరి అదుపులో ఉండకూడదు. రష్యా విస్తరణ తూర్పు వలస రాజ్యాలలో బ్రిటిష్ బలహీనపరుస్తుంది. అందుకే సూయజ్ కాలువ త్రవ్వకం జరిగింది. అందువల్ల ఈ ప్రాంతాలలో రష్యా, ఇంగ్లండ్‌ల మధ్య స్పర్థ ఏర్పడింది. బాల్కన్ ప్రాంతంలో రష్యా విస్తరణను అరికట్టడానికి ఆటోమన్ సామ్రాజ్య ఐక్యతనే ఇంగ్లండ్ బలపరచింది. అధికార సమతూకాన్ని కొనసాగించటానికి, టర్కీని బలంగా ఉంచడానికి ఇంగ్లండ్ ప్రయత్నించింది.

### 9.4.4 ఫ్రాన్స్ :

వాణిజ్య, మత కారణాల మూలంగా ఫ్రాన్స్ కూడా బాల్కన్ సమస్యలో తలదూర్చింది. తూర్పున తన వాణిజ్య సంబంధాలను నిలుపుకోదలచుకొంది. తన నౌకా, వాణిజ్యాలకు ప్రమాదం రానంతవరకూ బాల్కన్ వ్యవహారాలకు ఫ్రాన్స్ దూరంగానే ఉంటూ వచ్చింది.

### 9.4.5 ఇటలీ, జర్మనీ :

ఇటలీ, జర్మనీలు ఏకీకరణ తరువాత లాభాలను పొందాలనే ఉద్దేశ్యంతో బాల్కన్ సమస్యలో తలదూర్చాయి. జర్మనీ బాల్కన్ సమస్య నుండి దూరంగా ఉన్నప్పటికీ 1878 బెర్లిన్ కాంగ్రెస్‌లో మధ్యవర్తిగా వ్యవహరించి ఆస్ట్రియాకు అనుకూలంగా, రష్యాకు వ్యతిరేకంగా విమర్శించడం జరిగింది. ఈ సంఘటన తరువాత జర్మనీ టర్కీకి దగ్గరైంది.

## 9.5 బాల్కన్‌లలో తిరుగుబాట్లు :

టర్కీ సుల్తాన్ నిరంకుశ పాలనలో క్రైస్తవ జీవితం దుర్భరమైంది. వారికి ఎటువంటి రాజకీయ హక్కులు లేవు. వారు నిర్బంధ శ్రమ చేయాలి. పన్నుల భారం భరించలేని విధంగా మోపబడింది. దీనికి తోడు టర్కీ సైనికదళం దురంతాలతో బాల్కన్ ప్రజలు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. టర్కీ సుల్తాన్ క్రూరమైన పాలన వల్ల వారు పీడింపబడ్డారు. వారిలో జాతీయతాభావం, స్వాతంత్ర్యకాంక్ష పెంపొంది అనేక తిరుగుబాట్లకు కారణమైంది.

### 9.5.1 సెర్బియా :

టర్కీ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వారిలో ప్రథములు సెర్బియన్లు. రైతు కుటుంబంలో జన్మించిన కారా జార్జి నాయకత్వంలో 1804లో సెర్బియన్లు తిరుగుబాటు ప్రారంభించారు. రష్యా ఈ తిరుగుబాటుకు 1812 వరకు మద్దతు నిచ్చింది. 1812 లో నెపోలియన్ వల్ల రష్యా టర్కీతో శాంతి సంధి కావించుకుంది. కొద్ది కాలం టర్కీ సెర్బియాను వశం చేసుకొన్నది. కాని మిలోష్ ఒబ్రెనోవిచ్ నాయకత్వంలో తిరుగుబాటు తిరిగి తలెత్తింది. సెర్బియన్లు సుల్తాన్ ప్రతినిధిని బెల్‌గ్రేడ్ నుండి పారద్రోలారు. టర్కీ సుల్తాన్ మిలోష్ ఒబ్రెనోవిచ్‌ను సెర్బియన్ల పాలకుడుగా గుర్తించాడు. రష్యా మద్దతుతో సెర్బియా ఆంతరంగిక పాలనలో స్వేచ్ఛను సంపాదించింది. 1830 నాటికి టర్కీతో సంబంధం నామమాత్రమైంది. అప్పటి నుండి ఒబ్రెనోవిచ్ కుటుంబానికి సెర్బియా మీద రాజరికపు వారసత్వ హక్కు లభించింది.

### 9.5.2 గ్రీస్ :

సెర్బియన్ల తరువాత టర్కీ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినవారు గ్రీకులు. గ్రీకులు తమ ప్రాచీన సంస్కృతి, వైభవాన్ని గుర్తుకు తెచ్చుకొని నూతన జాతీయతాభావాన్ని జోడించి ఉత్తేజితులైనారు. సుల్తాన్‌పై స్వాతంత్ర్యం కోసం తిరుగుబాటు చేశారు. 1814లో 'హిటైరా ఫిలికె' అనే సంఘం ఒడెస్సాలో స్థాపితమైంది. దీని ప్రభావం గ్రీస్ అంతటా వ్యాపించింది. 1821లో అలెగ్జాండర్ ఇప్సి లాంటి నాయకత్వంలో గ్రీకులు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటును టర్కీ సుల్తాన్ క్రూరంగా అణచడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో సుల్తాన్ ఈజిప్ట్ పాలకుడు మహ్మద్ ఆలీ సహాయాన్ని అర్థించాడు. ఆయన తన కుమారుడు ఇబ్రహీం నాయకత్వంలో పెద్ద సైన్యాన్ని, నౌకాబలాన్ని పంపించాడు. ఇబ్రహీం దారుణ మారణ కాండను సాగిస్తూ మోరియా ప్రాంతం ద్వారా ముందుకు సాగాడు. ఇబ్రహీం చేసిన ఘోర కృత్యాలు ఐరోపాలోని క్రైస్తవ దేశాలకు బాధను కలిగించాయి.

తురుష్కులకు వ్యతిరేకంగా ఐరోపా దేశాలు గ్రీకుల పట్ల సానుభూతి చూపాయి. ఈ సమయంలో రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు జోక్యం చేసికొన్నాయి. ఆ దేశాల నుండి అనేక మంది వాలంటీర్లు వచ్చి గ్రీకుల పక్షాన చేరి టర్కీతో పోరాడినారు. వారిలో సుప్రసిద్ధ ఆంగ్లకవి లార్డ్ బైర్తన్ ఒకడు. 1824లో జరిగిన మిస్సో లంఘి యుద్ధంలో అతడు ప్రాణం కోల్పోయాడు. బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలు టర్కీపై ఒత్తిడి తెచ్చి 1826లో అకర్మక సంధికి అంగీకరింపజేశాయి. ఆ ఒప్పందం ప్రకారం గ్రీస్‌కు స్వయం పాలన ఇవ్వడానికి, మాల్డీవియా, వల్లాషియాలు టర్కీ అధికారం నుండి విడిపోయేటట్లుగా నిర్ణయించబడింది.

గ్రీస్‌కు స్వతంత్ర్యం ఇవ్వటానికి సుల్తాన్ నిరాకరించాడు. రష్యా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు తమ నౌకాబలాలను పంపాయి. 1827 లో నవారినో యుద్ధంలో టర్కీ, ఈజిప్ట్‌ల నౌకాదళాన్ని అవి ఓడించాయి. అకర్మక సంధి షరతులను ఖరారు చేయడానికి ప్రయత్నించాయి. టర్కీ సుల్తాన్ నిరాకరించటంతో రష్యా సేనలు ఆడ్రియా నోపుల్ వరకు విస్తరించడంతో భయపడిన టర్కీ సుల్తాన్ 1829 లో ఆడ్రియా నోపుల్ సంధికి అంగీకరించాడు. దీని ప్రకారం గ్రీస్ టర్కీ సామ్రాజ్యచ్ఛాయలో స్వయంపాలిత రాజ్యంగా గుర్తించబడింది. మాల్డీవియా, వల్లాషియా రాష్ట్రాలకు స్వతంత్ర ప్రతిపత్తి లభించింది. అవి రష్యా రక్షణలోకి వెళ్ళాయి. అయితే గ్రీకులు ఈ ఒప్పందాన్ని వ్యతిరేకించారు. 1830 నుండి లండన్‌లో బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాల మధ్య సమావేశాలు జరిగాయి. 1832 లండన్ సమావేశంలో మూడు రాజ్యాలు గ్రీస్‌ను పూర్తి స్వతంత్ర్య దేశంగా గుర్తించాయి. బల్గేరియా పాలకుడు పిన్స్ ఓటో మొదటి గ్రీకు రాజయ్యాడు. అక్కడ 1833లో రాజ్యాంగబద్ధమైన రాజరికం ఏర్పడింది.

ఆడ్రియానోపుల్ సంధి ఆటోమన్ సామ్రాజ్య పతనానికి నాంది అయింది. గ్రీకులు తమకు స్వాతంత్ర్యం రష్యా వల్లనే లభించినదని భావించారు. మాల్డీవియా, వల్లాషియాలు అలాగే భావించాయి. ఫలితంగా బాల్కన్ రాజ్యాలలో రష్యా పలుకుబడి, ప్రతిష్ఠ, ప్రభావం పెరిగాయి. ఆ విధంగా ఐరోపా రాజకీయ రంగంపై గ్రీస్ జాతీయవాదం గణనీయమైన ప్రభావాన్ని చూపెట్టింది.

### 9.5.3 టర్కీ - ఈజిప్ట్ యుద్ధం (1831-1841) :

గ్రీకు స్వాతంత్ర్యయుద్ధం సుల్తాన్ బలహీనతను బయట పెట్టింది. ఇది సామంతులు విజృంభణకు దోహదం చేసింది. ఈజిప్టు పాలకుడు మహ్మద్ ఆలీ సుల్తాన్ మీద తిరుగుబాటు గావించాడు. గ్రీకు యుద్ధంలో సుల్తాన్‌కు సహాయపడినందులకు గాను క్రీటు దీవిని పొందినప్పటికి అతనికి తృప్తి కలగలేదు. సుల్తాన్ నుండి సిరియాను, స్వాతంత్ర్యాన్ని కోరినాడు. సుల్తాన్ తిరస్కరించటంతో మహ్మద్ ఆలీ సిరియాను ఆక్రమించుకొని కాన్‌స్టాంట్ నోపుల్ పైకి పురోగమించాడు. సుల్తాన్ భయపడి ఐరోపా రాజ్యాల సహాయం కోరాడు. రష్యా తప్ప ఎవ్వరూ సాయం చేయలేదు. 1833లో రష్యా, టర్కీల మధ్య స్కెలెస్సి అనే సంధి జరిగింది. దాని ప్రకారం రష్యా యుద్ధ నౌకలు నల్ల సముద్రంలో ప్రవేశించవచ్చు. యుద్ధ సమయంలో ఒక రష్యాకు తప్ప మిగిలిన దేశాలన్నింటికి డార్డినల్స్ జలసంధిని మూసివేయటానికి అంగీకరించింది. టర్కీకి ఏదైనా ప్రమాదం సంభవించినపుడు రష్యా సహాయపడటానికి అంగీకరించింది. దీనితో నల్లసముద్రం పై రష్యాకు ఆధిక్యత, టర్కీపై రక్షకత్వం బాధ్యత లభించాయి. అందువల్ల రష్యాకు నల్లసముద్రంలోను, తూర్పు మధ్యధరా సముద్రంలోను తన నౌకలను యదేచ్ఛగా నడిపించుకోవచ్చు. ఈ ఆధిక్యత ఐరోపా రాజ్యాలకు ఆందోళనను కల్గించింది. ఫ్రాన్స్ మహ్మద్ ఆలీకి మద్దతు నిచ్చి ఈజిప్టు, సిరియాలలో ప్రాబల్యం సంపాదించాలని భావించింది. టర్కీలో రష్యా ఆధిక్యతను, ఈజిప్టు సిరియాలలో ఫ్రెంచి ప్రాబల్యాన్ని బ్రిటన్ వ్యతిరేకించింది. ఈజిప్టును ఫ్రాన్స్ సమర్థించటం రష్యాకు ఇష్టం లేదు. మహ్మద్ ఆలీ ఆటోమన్ సామ్రాజ్యాన్ని ఆక్రమిస్తే తన ప్రాబల్యం దెబ్బతింటుందనే భయం రష్యాకుంది. అందుకని రష్యా, ఇంగ్లండ్ కావించిన సమావేశ ప్రతిపాదనలను అంగీకరించింది.

### 9.5.3.1 లండన్ సంధి (1840) :

స్కెలెస్సి సంధి గాని, అక్కడ రష్యా ప్రభావం గాని ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల కిష్టం లేదు. ఆ సంధి విఫలత కోసం వేచి ఉన్నాయి. అదే సమయంలో మహ్మద్ ఆలీ తన సైన్యానికి మోల్ట్కీ అనే జర్మన్ చేత తర్ఫీదు నిప్పించి టర్కీ సుల్తాన్‌తో యుద్ధానికి తలపడ్డాడు. ఫ్రాన్స్ మహ్మద్ ఆలీ పక్షాన చేరింది. యుద్ధంలో మహమ్మద్ ఆలీ కుమారుడు ఇబ్రహీం టర్కీని ఓడించాడు. రష్యా పలుకుబడిని తగ్గించటం కోసం బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రియాలు ఈజిప్టును సమర్థించాయి. ఈ సమయంలో బ్రిటిష్ ప్రధాని ఈజిప్టు, సిరియాలలో ఫ్రెంచి ప్రాబల్యాన్ని, టర్కీలో రష్యా ఆధిక్యతను తగ్గించుటకు ఐరోపా రాజ్యాలను లండన్ సమావేశానికి ఆహ్వానించెను. మహ్మద్ ఆలీ విజయానికి ఆందోళన చెందిన రష్యా ఆటోమన్ సామ్రాజ్యం ఈజిప్ట్ వశం కాకుండా ఉండటానికై, ఈజిప్టు, సిరియాలలో ఫ్రెంచి ప్రాబల్యం అరికట్టడానికి లండన్ సమావేశానికి హాజరయ్యెను.

లండన్‌లో సమావేశమైన బ్రిటన్, రష్యా, ఆస్ట్రియా, ప్రష్యాలు ఒక అంగీకారాన్ని కుదుర్చుకొన్నాయి. కాని ఈ ఒప్పందాన్ని ఈజిప్టు, ఫ్రాన్స్‌లు అంగీకరించలేదు. అంతట మిత్రరాజ్యాల సేనలు 'ఏ కి' ని స్వాధీనం చేసుకొన్నాయి. ఇబ్రహీంను సిరియాలో ఓడించి అలెగ్జాండ్రియా వైపు పురోగమించాయి. గత్యంతరం లేని ఈజిప్టు, ఫ్రాన్స్‌లు లండన్ ఒప్పందానికి అంగీకరించాయి. ఈ ఒప్పందం ప్రకారం :

1) మహ్మద్ ఆలీ సిరియాపై తన హక్కును వదలుకొన్నాడు.

2) ఈజిప్ట్ పాలనలో టర్కీ ప్రమేయం అంతమై మహ్మద్ ఆలీ వంశానికి వంశపారంపర్యపు హక్కు గుర్తించబడింది.

3) యుద్ధ సమయంలో డార్డినల్స్ జలసంధి అన్ని యుద్ధ నౌకలకు మూసివేయబడింది.

ఆ విధంగా మహ్మద్ ఆలీ దాడుల నుండి ఆటోమన్ సామ్రాజ్యాన్ని కాపాడుటయేగాక, టర్కీలో రష్యా ఆధిక్యత, ఈజిప్టు, సిరియాలలో ఫ్రెంచి పలుకుబడి నిరోధింపబడెను. ఈ సంధి ఇంగ్లండ్‌కు గొప్ప విజయం, ఇంగ్లండ్ ప్రతిష్ఠ ఇనుమడించింది.

## 9.6 క్రిమియా యుద్ధం (1854 - 56) :

లండన్ సంధి తరువాత మళ్ళీ ప్రాచ్య సమస్య తలెత్తింది. అదే క్రిమియా యుద్ధం. ఈ యుద్ధం టర్కీ సుల్తానుకు, బాల్కన్ ప్రజలకు మధ్యగాక విరుద్ధ రాజకీయ స్వార్థ ప్రయోజనాలను ఆశించిన ఐరోపా రాజ్యాల మధ్య జరిగింది. కనుకనే సీమన్ పండితుడు 'ప్రాచ్య సమస్య కన్నా ఐరోపా తులప్రాబల్యత కోసం జరిగిన యుద్ధం ఇది' అని అభివర్ణించాడు.

### 9.6.1 కారణాలు :

అన్ని యుద్ధాల మాదిరిగానే క్రిమియా యుద్ధానికి కూడా అనేక కారణాలున్నాయి. అవి : రష్యా సామ్రాజ్య కాంక్ష, బాల్కన్ ప్రజలలో అశాంతి, బ్రిటన్ రష్యాల మధ్య శతృత్వం, మత పరిస్థితులు.

### 9.6.1.1 రష్యా సామ్రాజ్య కాంక్ష :

టర్కీలో రష్యా యొక్క ఆధిపత్యాన్ని లండన్ ఒప్పందం ద్వారా ధ్వంసం చేశారు. తరువాత టర్కీ సామ్రాజ్య పంపకం కోసం ఇంగ్లండ్‌తో ప్రతిపాదనలు జరిపెను. దీని ప్రకారం ఈజిప్ట్, క్రీటు ఇంగ్లండ్‌కు, డార్డినల్స్, కాన్‌స్టాంట్‌నోపుల్ మున్నగునవి రష్యాకు లభించును. బాల్కన్ ప్రాంతంలో రష్యా విస్తరణ అరికట్టాలనుకొంటున్న ఇంగ్లాండ్ ఈ ప్రతిపాదనలను తిరస్కరించెను. తన ఆశయసిద్ధికై రష్యా యుద్ధానికి తలపడింది.

### 9.6.1.2 బాల్కన్ ప్రజలలో అశాంతి :

గ్రీక్ స్వాతంత్ర్య యుద్ధం బల్గేరియా, రుమేనియా మున్నగు బాల్కన్ ప్రజలకు స్ఫూర్తి నిచ్చింది. ఐరోపాలోని అగ్రరాజ్యాల స్వార్థ ప్రయోజనాలు బాల్కన్ ప్రజలలో మరింత అశాంతిని నింపింది.

### 9.6.13 మత పరిస్థితులు :

మత సమస్యే క్రిమియా యుద్ధానికి ప్రధాన కారణం. టర్కీ సామ్రాజ్యంలోని పవిత్ర స్థలాలైన జెరూసలెం, బెత్లహాంల విషయంలో లాటిన్ మతాధికారులకు, గ్రీక్ ఆర్థడాక్స్ చర్చి మతాధికారులకు మధ్య కలహాలు, వాని నిర్వహణ సమస్య తలెత్తింది. రష్యా చక్రవర్తి నికోలస్ గ్రీక్ మత గురువుల పక్షాన సుల్తాన్ మీద ఒత్తిడి తెచ్చాడు. ఈ ప్రతిపాదనను అంగీకరిస్తే రష్యా నిరంతర జోక్యాన్ని తమ పాలనలో అంగీకరించినట్లవుతుందని భావించి సుల్తాన్ రష్యా కోర్కెను తిరస్కరించాడు. ఫ్రెంచ్ చక్రవర్తి మూడవ నెపోలియన్ లాటిన్ మతాధికారులను బలపరచి తన కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించుకోవాలని భావించాడు. టర్కీ సామ్రాజ్యంలో రష్యా జోక్యం ఆటోమన్ సామ్రాజ్య క్షీణతకు, రష్యా బలపడటానికి అవకాశమిస్తుందని బ్రిటన్ భావించి ఫ్రాన్స్ పక్షాన చేరింది. ఇరుపక్షాలు యుద్ధానికి సిద్ధమయ్యాయి. ఈ యుద్ధంలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు రష్యాకు వ్యతిరేకంగా టర్కీని బలపరిచాయి. రష్యా ఆస్ట్రియా సహాయాన్ని ఆశించింది. కాని ఆ దేశం తటస్థంగా ఉంది.

### 9.6.2 యుద్ధం :

రష్యా 1854లో టర్కీపై యుద్ధం ప్రకటించి మాల్డీవియా, వల్లాషియాలను ఆక్రమించుకొన్నది. బ్రిటన్, ఫ్రాన్స్‌లు మాల్డీవియా, వల్లాషియాల నుండి వైదొలగవలసిందిగా రష్యాను హెచ్చరించాయి. రష్యా నిరాకరించడంతో బ్రిటన్, ఫ్రాన్స్‌లు రష్యాపై 1854లో యుద్ధాన్ని ప్రకటించాయి. సార్డీనియా కూడా వీటితో చేరింది. ఈ యుద్ధం ప్రధానంగా క్రిమియాలోనే జరిగింది. కనుక ఈ యుద్ధం క్రిమియా యుద్ధంగా ప్రసిద్ధిగాంచింది. మిత్రరాజ్యాల సైన్యాలు రష్యా సైన్యాలను ఆల్మాయుద్ధంలో ఓడించాయి. తరువాత బాక్లావా, ఇంకెర్‌మన్ యుద్ధాలలో రష్యా సైన్యం ఓడించినప్పటికీ మిత్రరాజ్యాల సైన్యాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బాక్లావా యుద్ధంలో బ్రిటిష్ సైన్యం ప్రదర్శించిన ధైర్య సాహసాలను ఆధారంగా చేసికొని ఆంగ్ల కవి టెన్నిసన్ ఒక కవితను రచించెను. 1855 సెప్టెంబర్‌లో సెబస్టోపోల్‌ను మిత్రరాజ్యాలు ముట్టడించాయి. రష్యా చలికి ఇరుపక్షాల సైన్యం తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యాయి. 11 నెలల ముట్టడి పిదప సెబస్టోపోల్ ధ్వంసమైంది. రష్యా 2,50,000 సైన్యాన్ని పోగొట్టుకొంది. మిత్రరాజ్యాలు సెబస్టోపోల్‌ను పట్టుకోవడంతో క్రిమియా యుద్ధం ముగిసింది. రష్యాలో నికోలస్ మరణించడంతో రెండో అలెగ్జాండర్ అధికారానికి వచ్చాడు. అతడు సంధికి అంగీకరించడంతో 1856 మార్చి 30న పారిస్ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

### 9.6.3 పారిస్ సంధి షరతులు :

1) డాన్యూబ్ ప్రాంతాలైన మాల్డీవియా, వల్లాషియాలపై రష్యా రక్షణ బాధ్యత కోల్పోయింది. ఈ ప్రాంతాలకు స్వతంత్రపాలన ఇవ్వడమైనది. కాని తరువాత ఈ రెండు రాజ్యాలు కలిసి రుమేనియా అనే స్వతంత్ర రాజ్యంగా ఏర్పడ్డాయి.

2) నల్ల సముద్రం తటస్థ జలాలుగా ప్రకటించబడింది. ఇందు వ్యాపార నౌకలు తప్ప యుద్ధ నౌకలు ప్రవేశించకూడదు. టర్కీ గాని, రష్యా గాని తమ యుద్ధ నౌకలు అక్కడ ఉంచకూడదు.

3) డాన్యూబ్ నది అంతర్జాతీయం చేయబడింది.

4) రష్యా ఆక్రమణలోని దక్షిణ బెస్స రేబియా మాల్డీవియాకు లభించింది.

5) క్రిమియా ప్రాంతం రష్యాకు తిరిగి ఇవ్వబడింది.

6) తన పాలనలోని క్రైస్తవులను మానవతా దృష్టితో చూడటానికి, ఉదారంగా పాలించటానికి టర్కీ సుల్తాన్ అంగీకరించాడు.

7) ఆటోమన్ సామ్రాజ్య భౌగోళిక ఐక్యతను కాపాడటానికి ఐరోపాలోని అగ్రరాజ్యాలు హామీనిచ్చాయి. టర్కీ సామ్రాజ్యపు ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోకుండా ఉండటానికి అంగీకరించాయి.

### 9.6.4 క్రిమియా యుద్ధ ఫలితాలు :

1) ఆటోమన్ సామ్రాజ్యంలో రష్యా ఆధిక్యత దెబ్బతిన్నది. మాల్దీవియా, వల్లాషియా, స్వతంత్ర రాజ్యాలుగా అవతరించడం రష్యావ్యాప్తికి ప్రతిబంధకమైంది.

2) నల్ల సముద్రం తటస్థ జలాలుగా ఉండటం ఇంగ్లండ్‌కు తృప్తి కలిగించింది. సమీప ప్రాచ్యంలో ఇంగ్లాండ్ ప్రయోజనాలు కాపాడబడ్డాయి.

3) ఆటోమన్ సామ్రాజ్య పతనం తాత్కాలికంగా నిలిపివేయబడింది.

4) క్రిమియా యుద్ధం పరోక్షంగా ఇటలీ ఏకీకరణ సాధ్యమయ్యే అవకాశం ఏర్పడింది.

5) క్రిమియా యుద్ధంలో రష్యా ఆస్ట్రియా సహాయాన్ని ఆశించింది. కాని ఆస్ట్రియా తటస్థంగా ఉంది. అందువల్ల ఆస్ట్రియా-రష్యాల మధ్య విరోధం ఏర్పడి రష్యా, ప్రష్యాల మైత్రికి దారితీసింది.

6) ఈ యుద్ధ ఓటమితో రష్యా చక్రవర్తి రెండో అలెగ్జాండర్ రష్యా అభివృద్ధికై అనేక సంస్కరణలు గావించాడు. అంతేగాక రష్యా తన విస్తరణకు ఆసియావైపు దృష్టి సారించింది.

### 9.6.5 విమర్శ :

పారిస్ సంధి వల్ల ఏర్పడిన శాంతి కేవలం తాత్కాలికమైంది. టర్కీ విచ్ఛిన్నతను ఈ సంధి ఆపలేకపోయింది. టర్కీ సుల్తాన్ తన సామ్రాజ్యంలో ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టలేదు. రష్యా నల్ల సముద్రానికి సంబంధించిన అంశాలకు అనుగుణంగా ఉండడానికి నిరాకరించింది. ఈ విధంగా బాల్కన్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనడంలో పారిస్ సంధి విఫలమైంది. కనుకనే పారిస్ సంధి లోపభూయిష్టమైనదని మొదటి ప్రపంచ యుద్ధానికి దోహదం చేసిందని చరిత్రకారులు అభిప్రాయపడిరి.

## 9.7 రష్యా - టర్కీ యుద్ధం (1877) :

క్రిమియా యుద్ధం 1856లో పారిస్ సంధితో ముగిసింది. కాని ఆటోమన్ సామ్రాజ్యాన్ని సుస్థిరం చేయలేకపోయింది. పారిస్ సంధి అనంతరం కూడా టర్కీ సుల్తాన్ నిరంకుశంగానే పరిపాలించడంతో బాల్కన్ ప్రజలలో అసంతృప్తి ఎక్కువైంది. బాల్కన్ రాజ్యాలు సుల్తాన్ నిరంకుశ పాలన నుండి విముక్తికై తీవ్ర ప్రయత్నాలు కొనసాగించిరి. దీనికి తోడు రష్యా ప్రోద్బలంతో బాల్కన్‌లలో అఖిలస్లావ్ ఉద్యమ ప్రభావం వృద్ధి అవుతూ వచ్చింది. అది ఆస్ట్రియాకు ఆందోళన కలిగించింది.

పారిస్ సంధిని ఉల్లంఘించి మాల్దావియా, వల్లాషియాలు రుమేనియా అనే పేరుతో ఒకే రాజ్యంగా ఏర్పడ్డాయి. సుల్తాన్ నిరంకుశత్వం వల్ల మాంటెనీగ్రోలో తిరుగుబాటు జరిగింది. బొస్నియా, హెర్జి గోవినాలలో కూడా తిరుగుబాటు జరిగింది.

### 9.7.1 బల్గేరియా దురంతాలు :

తిరుగుబాటు ప్రభావం బల్గేరియాకు కూడా వ్యాపించింది. 1875లో బల్గేరియన్లు టర్కీ అధికారాన్ని ధిక్కరించాడు. దానితో టర్కీ సైనిక దళం తిరుగుబాటును క్రూరంగా అణచివేయడం జరిగింది. బల్గేరియా దురంతాలు ఐరోపా అంతటా మారుమ్రోగిపోయాయి. ఐరోపా ప్రజలు టర్కీ పట్ల ఆగ్రహావేశులైనారు. టర్కీని ఐరోపా నుండి తరిమివేయాలని ఇంగ్లండ్‌లోని ప్రతిపక్ష నాయకుడు గ్లాడ్‌స్టన్ ఉద్ఘాటించాడు. ఐరోపా ప్రజలు అనుకూలంగా ఉండడంతో రష్యాకు ప్రోత్సాహాన్నిచ్చింది. 1877 ఏప్రిల్‌లో రష్యా టర్కీపై యుద్ధం ప్రకటించింది. ఈ యుద్ధం కొద్దికాలం మాత్రమే జరిగింది. టర్కీ ప్లెవ్నా యుద్ధంలో రష్యా చేతిలో ఓడిపోయింది. రష్యా సైన్యం ఆడ్రియానోపుల్ వరకు విస్తరించింది. సుల్తాన్ ఓటమి నంగీకరించడంతో రష్యా-టర్కీ యుద్ధం శాన్‌స్టెఫానో సంధితో ముగిసింది.

### 9.7.2 శాన్‌స్టెఫానో సంధి (1878) :

1) ఈ సంధి ప్రకారం సెర్బియా, మాంటినీగ్రో, రుమేనియాలు, స్వతంత్ర రాజ్యాలుగా టర్కీ సుల్తాన్ అంగీకరించాడు.
2) బోస్నియా, హెర్జిగోవినాలలో ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టడానికి టర్కీ సుల్తాన్ అంగీకరించెను.
3) సుల్తాన్ ఆధిపత్యం క్రింద బల్గేరియా స్వయంపాలనతో రష్యా పర్యవేక్షణలో పెద్దరాజ్యంగా ఏర్పడింది.
4) రష్యాకు బతూమ్, కార్స్, బెస్సరేబియాలు లభించాయి. ఫలితంగా బాల్కన్‌లలో రష్యా పలుకుబడి పెరిగింది.
5) బాస్పరస్, డార్డినల్స్, జలసంధులలో వాణిజ్యం కోసం అన్నిదేశాల వాణిజ్య నౌకలకు ప్రవేశార్హత కల్పించబడెను.

### 9.7.3 బెర్లిన్ కాంగ్రెస్ (1878) :

శాన్‌స్టెఫానో సంధితో బాల్కన్ రాజ్యాలలో రష్యా పలుకుబడి ఇనుమడించింది. ఈ సంధితో ఐరోపాలో టర్కీ సామ్రాజ్యం పూర్తిగా విచ్ఛిన్నమైంది. బాల్కన్ ప్రాంతంలో రష్యా విస్తరణ ఇంగ్లండ్‌కు గొప్ప ప్రమాదంగా పరిణమించింది. బ్రిటన్ - ఇండియా సముద్ర మార్గం మధ్యధరా సముద్రం ద్వారా ఉన్నది. ఈ మార్గం సురక్షితంగా ఉండాలంటే రష్యా విస్తరణను అరికట్టాలి. మరొకవైపు బాల్కన్ రాజ్యాలలో రష్యా విస్తరణ ఆస్ట్రియాకు పెద్ద అవరోధం. అందువల్ల ఆస్ట్రియా, ఇంగ్లండ్‌లు శాన్‌స్టెఫానో సంధిని పునరాలోచనకు తీసుకురావాలని రష్యాను కోరాయి. రష్యా అందుకు సమ్మతించలేదు. అందువల్ల యుద్ధానికి సన్నాహాలు ప్రారంభమైంది. యుద్ధానికి వెరచిన రష్యా, ఇంగ్లండ్ - ఆస్ట్రియా ప్రతిపాదనలను అంగీకరించింది. బిస్మార్క్ మధ్యవర్తిత్వంలో 1878లో ఐరోపా రాజ్యాల సమావేశం బెర్లిన్‌లో జరిగింది. ఈ బెర్లిన్ నిర్ణయాలననుసరించి శాన్‌స్టెఫానో సంధి షరతులు రద్దయ్యాయి.

### 9.7.3.1 బెర్లిన్ సంధి నిర్ణయాలు :

1) రుమేనియా, సెర్బియా, మాంటినీగ్రోల స్వాతంత్ర్యం గుర్తించడమైనది.
2) పెద్ద బల్గేరియా తూర్పు రుమేనియా, బల్గేరియా అనే రెండు రాజ్యాలుగా విభజింపబడింది. బల్గేరియా సుల్తాన్‌కు కప్పం చెల్లిస్తూ స్వయం పాలిత రాజ్యంగా ఉంటుంది. తూర్పు రుమేనియా టర్కీ పాలనలో క్రైస్తవ ప్రతినిధిచే స్వయంపాలన కల్గివుంటుంది.

3) మాసిడోనియా టర్కీ పాలనలోనే ఉంటుంది.

4) బోస్నియా, హెర్జిగోవినాలు పేరుకు టర్కీ పాలనలోనే ఉన్నా వాటిపై అధికారం ఆస్ట్రియాకు ఇవ్వబడింది.

5) ఇంగ్లండ్‌కు సైప్రస్ దీవి లభించింది.

6) రష్యాకు కార్స్, బెస్సరేబియాలు లభించింది.

7) క్రీట్, మాసిడోనియా, ఆల్బేనియాలలో సంస్కరణలు ప్రవేశపెట్టడానికి సుల్తాన్ అంగీకరించాడు.

### 9.7.3.2 విమర్శ :

బెర్లిన్ సంధి శాన్‌స్టెఫానో సంధి షరతులను తారుమారు చేసింది. బెర్లిన్ కాంగ్రెస్ నిర్ణయాలు గౌరవప్రదమైన శాంతి ఒడంబడికగా బ్రిటిష్ ప్రధాని డిజ్రేలీ అభివర్ణించినా, అవి అంత గౌరవప్రదమైనవి కావు. బెర్లిన్ సంధి టర్కీ సామ్రాజ్య విచ్ఛిన్నతను అంగీకరించింది. టర్కీ సామ్రాజ్యాన్ని కాపాడతామన్న ఇంగ్లండ్, ఆస్ట్రియాలు ఆ రాజ్య భూభాగాలను పొందటం శోచనీయమైన అంశం. బల్గేరియాను రెండుగా విభజించడం, బోస్నియా, హెర్జిగోవినాల మీదన ఆస్ట్రియాకు అధికారం ఇవ్వటం జాతీయవాద సూత్రాన్ని పూర్తిగా విస్మరించడమే. బెర్లిన్ కాంగ్రెస్‌లో జర్మనీ ఆస్ట్రియా పక్షం వహించటంతో రష్యా-జర్మనీల మధ్య వైషమ్యం పెరిగింది. తరువాత ఐరోపాలో రెండు సైనిక కూటములు ఏర్పడి మొదటి ప్రపంచ యుద్ధానికి కారణమైంది. బోస్నియా, హెర్జిగోవినాలు ఆస్ట్రియా అధికారంలోనికి వెళ్ళటం సెర్బియాకు ఆగ్రహాన్ని కల్గించింది. ఫలితంగా సెర్బియా, ఆస్ట్రియాల మధ్య విరోధమేర్పడి అది మొదటి ప్రపంచ యుద్ధానికి ముఖ్య కారణమైంది. కనుకనే లోపభూయిష్టమైన బెర్లిన్ కాంగ్రెస్ నిర్ణయాలే తరువాత బాల్కన్ యుద్ధాలకు కారణమైనాయి.

## 9.8 బెర్లిన్ కాంగ్రెస్ అనంతర ప్రాచ్యసమస్య :

బెర్లిన్ కాంగ్రెస్ నిర్ణయాలు బాల్కన్ ప్రజలనే కాక ఐరోపా రాజ్యాలను కూడా సంతృప్తిపరచలేదు. తరువాత బాల్కన్ రాజ్యాలలో ఎన్నో పరిణామాలు సంభవించాయి.

### 9.8.1 బల్గేరియా ఏకీకరణ (1885) :

బెర్లిన్ కాంగ్రెస్ నిర్ణయాలననుసరించి బల్గేరియా విభజన తాత్కాలికమైంది. జాతీయతాభావంతో ప్రేరేపితులైన తూర్పు రుమేనియా ప్రజలు తిరుగుబాటు గావించారు. బల్గేరియా రాజు రెండు ప్రాంతాలను విలీనం చేసాడు. ఫలితంగా సమైక్య బల్గేరియా రాజ్యం ఏర్పడింది. ఇది రష్యాకు ఇష్టం లేదు. సెర్బియా కూడా దీనిని వ్యతిరేకించింది. అది తమ వాణిజ్యానికి ప్రమాదమని భావించిన సెర్బియా బల్గేరియా ఏకీకరణను ప్రతిఘటించింది. బల్గేరియా దీనిని ఎదుర్కొని సెర్బియాను ఓడించింది. 1886లో బుఖారెస్ట్ సంధితో యుద్ధం ముగిసింది. శాన్ స్టెఫానో సంధి వల్ల బల్గేరియా రష్యాకు అనుకూలముగా కాన్‌స్టాంట్ నోపిల్ కు దగ్గరగా ఉండేది. కాని ఇప్పటి బల్గేరియా రష్యాను నిరోధించగలిగేదిగా తయారయింది.

### 9.8.2 క్రీట్, ఆర్మీనియా :

1896లో క్రీట్‌లో ఉండే గ్రీకులు తిరుగుబాటు చేస్తే టర్కీ సుల్తాన్ అణచివేసాడు. కాని మళ్ళీ తిరుగుబాట్లు జరిగి 1908లో క్రీట్ గ్రీస్‌లో విలీనమయింది. బెర్లిన్ కాంగ్రెస్ ద్వారా ఆర్మీనియాలోని క్రైస్తవులను ఉదారంగా పరిపాలిస్తానని ఐరోపా అగ్రరాజ్యాలను సుల్తాన్ హామి ఇచ్చాడు. కాని అది నెరవేర్చలేదు. ఫలితంగా ఆర్మీనియాలోని క్రైస్తవులు తిరుగుబాటు చేసారు.

ఆర్మీనియా కూడా తన పాలన నుండి విముక్తం చెందుతుందని భావించిన సుల్తాన్ ఈ తిరుగుబాట్లను క్రూరంగా అణిచివేసాడు. సుమారు 50,000 మంది ఆర్మీనియన్‌లు వధింపబడ్డారు. కాని ఐరోపా రాజ్యాలు తమ విభేదాల వల్ల ఈ దారుణకాండను నిరోధించి టర్కీని శిక్షింపకపోవడం శోచనీయం.

## 9.8.3 బోస్నియా - హెర్జిగోవినాల ఆక్రమణ (1908) :

1878 బెర్లిన్ సంధి ప్రకారం బోస్నియా, హెర్జిగోవినాలు ఆస్ట్రియా పాలనలో ఉంచడమైంది. ఈ రెండు ప్రాంతాలు స్లావ్ జాతివి. మూడు శతాబ్దాల పాటు ఆవిధంగా జరిగింది. యంగ్ టర్క్ ఉద్యమానికి భయపడిన ఆస్ట్రియా రష్యాతో రహస్యంగా మంతనాలు జరిపి 1908 అక్టోబర్ 7న బోస్నియా, హెర్జిగోవినాలను ఆక్రమించుకొన్నది. ప్రతిగా రష్యా నౌకలు డార్డినల్స్ జలసంధిలో ప్రవేశం కల్గించటానికి ఆస్ట్రియా అంగీకరించింది. బోస్నియా, హెర్జిగోవినాలను ఆస్ట్రియా ఆక్రమించటం సెర్బియాకు ఇష్టం లేదు. సెర్బియా ఈ ఆక్రమణను ప్రతిఘటించింది.

## 9.9 యంగ్ టర్క్ ఉద్యమం :

టర్కీలోని యువకులు తమ దేశం యొక్క బలహీనతను గమనించారు. తిరిగి దాన్ని బలీయమైన, పటిష్టమైన రాజ్యంగా చెయ్యాలనే ఉద్దేశంతో వారు ఉద్యమించారు. ఈ యువకులు పాశ్చాత్య భావాలైన జాతీయవాదం, ప్రజాస్వామ్య భావాలతో ప్రభావితమైనారు. టర్కీ యువత 'సమైక్య అభివృద్ధి సమితి' అనే పార్టీని స్థాపించారు. విద్యావంతులైన యువకులు ఈ పార్టీలో చేరారు. ఇందులో ఎన్వర్ బే అనే సైన్యాధికారి ప్రముఖపాత్ర వహించాడు. నిరంకుశ, అసమర్ధ సుల్తాన్ ప్రభుత్వాన్ని తొలగించడం, సంస్కరణలు ప్రవేశపెట్టి టర్కీని పాశ్చాత్యీకరించడం, మత స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం కల్పించటం, టర్కీని బలీయమైన రాజ్యంగా రూపొందించటం యంగ్ టర్క్‌ల లక్ష్యాలు. టర్కీలో విదేశీయుల జోక్యం అధికంగా ఉందని, దాన్ని తొలగించి టర్కీని గొప్ప సామ్రాజ్యంగా రూపొందించాలనేదే వీరి లక్ష్యం. సైనిక సహాయంతో యంగ్ టర్క్‌లు 1908లో కాన్‌స్టాంట్ నోపుల్‌పై దాడిచేసి సుల్తాన్ హమీద్‌ను తొలగించి అతని సోదరుడు ఐరోమహమ్మద్‌ను సుల్తాన్‌గా చేసారు. ఎన్వర్ బే ఆధ్వర్యంలో నూతన సంస్కరణలు చేపట్టబడ్డాయి. తురుష్క భాషను అధికార భాషగా చేయడం, జాతీయ పాఠశాలలు నెలకొల్పటం, నిర్బంధ సైనిక సేవ మున్నగునవి అందులో భాగం. క్రమంగా ఎన్వర్ బే 'టర్కీకరణ' ను ప్రారంభించాడు. 'టర్కీ టర్కులదే' అన్న నినాదంతో యంగ్ టర్క్ ఉద్యమం టర్కీలో బాగా వ్యాపించింది. దీనితో బాల్కన్‌లలో జాతీయ భావం మరింతగా పెరిగింది. బాల్కన్‌లలోని క్రైస్తవులు కానీ, అటు ఆసియాలోని అరబ్బులు కాని యంగ్ టర్క్‌ల కార్యక్రమాన్ని అంగీకరించలేదు. అందువల్ల యంగ్‌టర్క్‌లు అణచివేత చర్యలకు పూనుకొన్నారు. దాంతో వ్యతిరేకత కూడా పెరిగింది.

## 9.9.1 ఉద్యమ ప్రాధాన్యత :

ఆటోమన్ సామ్రాజ్యంలో యంగ్ టర్క్ ఉద్యమం విఫలమైనప్పటికీ దాని ప్రాధాన్యత ముఖ్యమైనదే. ఆటోమన్ సామ్రాజ్యాన్ని పునరుద్ధరించడమే ఈ ఉద్యమ లక్ష్యమైనప్పటికీ అది సామ్రాజ్యంలో మరింత చీలికలకు దారితీసింది. ఈ ఉద్యమ విఫలత బాల్కన్ యుద్ధాలకు, అవి ఐరోపా యుద్ధానికి దారితీసాయి.

## 9.10 బాల్కన్ యుద్ధాలు :

యంగ్‌టర్క్ ఉద్యమ ఫలితంగానే బాల్కన్ యుద్ధాలు జరిగాయి. యంగ్‌టర్క్‌లు తమ జాతి ఔన్నత్యాన్ని స్థాపించటానికి అనేకమంది క్రైస్తవులను హింసించారు.

### 9.10.1 సెర్బియా :

సెర్బియాలోని ప్రజలు స్లావ్ జాతివారు. బోస్నియా, హెర్జిగోవినాలను కలుపుకోవాలని సెర్బియాకు ఉంది. బెర్లిన్ కాంగ్రెస్ ఆ రెండు ప్రాంతాలను ఆస్ట్రియాకు ఇవ్వడంతో సముద్రమార్గం లేకుండా పోయింది. 1908లో ఆస్ట్రియా ఆ రెండు ప్రాంతాలను కలుపుకోవడంతో అనేక సంవత్సరాలుగా మధ్యయుగం నాటి సెర్బియన్ సామ్రాజ్యాన్ని పునరుద్ధరించాలనుకొన్న సెర్బియా ఆశలకు అవరోధం ఏర్పడింది. ఫలితంగా సెర్బియా - ఆస్ట్రియాల మధ్య సంబంధాలు చెడ్డాయి. బాల్కన్ కూటమిలో సెర్బియా కూడా చేరింది.

### 9.10.2 బల్గేరియా :

శాన్‌స్టిఫానో సంధి ప్రకారం విశాలమైన బల్గేరియా ఏర్పడింది. బెర్లిన్ కాంగ్రెస్ ఈ బల్గేరియాను రెండుగా విభజించింది. అయితే ఆ తరువాత ఆ రెండు ప్రాంతాలు 1885లో కలసిపోయాయి. ఇది బల్గేరియా, రష్యాల మధ్య వైరానికి కారణమైంది. బల్గేరియా మాసిడోనియాను ఆక్రమించుకోవడానికి బాల్కన్ కూటమిలో చేరింది.

### 9.10.3 గ్రీస్ :

గ్రీస్ రాజ్యం ఏర్పడింది కాని అందులో గ్రీకులంతా చేరలేదు. ఇంకా చాలా మంది గ్రీకులు సుల్తాన్ పాలనలోనే ఉన్నారు. గ్రీస్‌కు క్రీట్, మాసిడోనియాలను ఆక్రమించుకోవాలనే ఉద్దేశ్యంతో ఆ ప్రాంతాలలో తిరుగుబాట్లను ప్రోత్సహించింది. 1908లో గ్రీస్ క్రీట్‌ను ఆక్రమించింది కాని మాసిడోనియాలోని తిరుగుబాట్లను సుల్తాన్ అణచివేసినాడు. బాల్కన్ కూటమి ఏర్పాటులో గ్రీస్ ముఖ్యపాత్ర వహించింది.

### 9.10.4 రుమేనియా :

మాల్డావియా, వల్లాషియాలు కలిసి స్వతంత్ర రుమేనియా రాజ్యంగా ఏర్పడ్డాయి. కాని అనేక మంది రుమేనియన్లు టర్కీ, ఆస్ట్రియా, రష్యాలలో ఉన్నారు. అందువల్ల రుమేనియా ఆ రాజ్యాలను ఎదుర్కోవలసి వచ్చింది. అందువల్ల రుమేనియా బాల్కన్ కూటమిలో చేరింది.

### 9.10.5 మాంటినీగ్రో :

సెర్బియన్లకు రెండు స్వతంత్ర రాజ్యాలు ఉన్నాయి. అవి 1) సెర్బియా 2) మాంటినీగ్రో. బాల్కన్‌లలోని సెర్బియన్‌లకు నాయకత్వం వహించాలన్నది మాంటినీగ్రో ఆరాటం. చిన్న రాజ్యమైనప్పటికి బాల్కన్ యుద్ధాలలో అది ముఖ్యపాత్ర వహించింది.

### 9.11 టర్కీ - ఇటలీ యుద్ధం :

ఉత్తర ఆఫ్రికాలోని ట్రిపోలి మీద ఇటలీకి ఆశ ఉంది. టర్కీలోని పరిస్థితులను అవకాశంగా తీసుకొని 1911లో టర్కీపై ఇటలీ యుద్ధాన్ని ప్రకటించి ట్రిపోలీని ఆక్రమించింది. ఈ యుద్ధం టర్కీ సైనిక బలహీనతను వెల్లడి చేసింది. బాల్కన్ రాజ్యాలు టర్కీ మీద దండెత్తడానికి తోడ్పడింది.

### 9.12 బాల్కన్ కూటమి :

తమ సమస్యలకు కారణమైన టర్కీ పట్ల అన్ని బాల్కన్ రాజ్యాలలో అసంతృప్తి ఉంది. యంగ్ టర్క్‌లు క్రైస్తవులపై జరిగిన హింసాకాండ బాల్కన్ రాజ్యాలలో ఆగ్రహాన్ని కల్గించింది. తమ మధ్య గల విభేదాలను మరచి ఆ రాజ్యాలు టర్కీపై

పోరాటానికి సిద్ధపడ్డాయి. గ్రీస్, మాంటినీగ్రో, సెర్బియా, బల్గేరియాలు కలిసి 1912 మేలో ఒక కూటమిగా ఏర్పడ్డాయి. అదే బాల్కన్ కూటమి.

## 9.13 మొదటి బాల్కన్ యుద్ధం (1912-13) :

మాసిడోనియాలోని క్రైస్తవులకు సంస్కరణలు ప్రవేశపెట్టాలని బాల్కన్ రాజ్యాలు టర్కీని కోరాయి. దానిని టర్కీ తిరస్కరించడంతో, అది బాల్కన్ రాజ్యాలలో ఆగ్రహాన్ని కల్గించింది. 1912లో బాల్కన్ కూటమిలోని రాజ్యాలు మాంటినీగ్రో, సెర్బియా, బల్గేరియా, గ్రీస్‌లు సంయుక్తంగా మాసిడోనియాను విముక్తం చేయడానికి టర్కీపై యుద్ధం ప్రకటించాయి. అదే మొదటి బాల్కన్ యుద్ధం. బాల్కన్ సైన్యం కాన్‌స్టాంట్ నోపుల్‌కు 40 కి.మీ. దూరం వరకు విస్తరించాయి. టర్కీని ఓడించి బాల్కన్ కూటమి మాసిడోనియాను ఆక్రమించుకొన్నది. ఆటోమన్ సామ్రాజ్యం పూర్తిగా పతనమై కాన్‌స్టాంట్ నోపుల్‌కు మాత్రమే పరిమితమైంది. ఆ సమయంలో అగ్రరాజ్యాలు జోక్యం చేసుకొని లండన్‌లో సమావేశానికి టర్కీని ఆహ్వానించాయి. 1913 మేలో జరిగిన లండన్ సంధితో యుద్ధం ముగిసింది.

### 9.13.1 లండన్ సంధి (1913) షరతులు :

1) కాన్‌స్టాంట్‌నోపుల్, గాలిపోలి, మధ్యధరా సముద్ర ఉత్తర తీరభూమి తప్ప తక్కిన ఐరోపాలోని తన భూభాగాన్నంతా టర్కీ వదలుకొంది.
2) ఆల్బేనియా స్వతంత్ర రాజ్యమయింది.
3) గ్రీస్‌కు క్రీట్‌ను ఇవ్వడమైంది.
4) సెర్బియాకు సముద్ర మార్గం లభించలేదు. అందువల్ల అది నిరాశ చెందింది.

## 9.14 రెండో బాల్కన్ యుద్ధం (1913) :

బాల్కన్ రాజ్యాలలో ఏర్పడిన విభేదాల వల్ల బాల్కన్ కూటమి విచ్ఛిన్నమైంది. ఆల్బేనియా ఏర్పాటును సెర్బియా వ్యతిరేకించింది. దీని వల్ల సెర్బియాకు సముద్ర మార్గం లభించలేదు. కనుక తనకు మాసిడోనియా చెందాలని సెర్బియా కోరింది. దీనికి బల్గేరియా అంగీకరించలేదు. గ్రీస్, సెర్బియా, మాంటినీగ్రో, రుమేనియాలు కల్సి బల్గేరియాపై యుద్ధం ప్రకటించాయి. మొదటి బాల్కన్ యుద్ధంలో తటస్థంగా ఉన్న రుమేనియా బల్గేరియాలోని ఈశాన్య ప్రాంతాల కోసం రెండో బాల్కన్ యుద్ధంలో పాల్గొన్నది. పోగొట్టుకొన్న భూభాగాలను కొన్నైనా సంపాదించుకోవాలన్న ఆశతో టర్కీ వీటిలో చేరింది. టర్కీ ఆడ్రియా నోపుల్‌ను తిరిగి ఆక్రమించింది. ఈ కూటమి బల్గేరియాను ఓడించడంతో చివరకు బల్గేరియా 1913లో బుఖారెస్ట్ సంధికి అంగీకరించటంతో యుద్ధం ముగిసింది.

### 9.14.1 బుఖారెస్ట్ సంధి (1913) :

1) క్రీట్, ఈజియన్ దీవులు, మాసిడోనియాలోని సెలోనికా ప్రదేశాలన్నీ గ్రీస్‌కు లభించాయి
2) సెర్బియాకు మధ్య మాసిడోనియా లభించింది. కాని ఏడ్రియాటిక్ సముద్రానికి మార్గం లభించలేదు.
3) బోస్నియా, హెర్జిగోవినాలు ఆస్ట్రియా పాలనలోనే ఉంచబడ్డాయి.
4) టర్కీకి కాన్‌స్టాంట్‌నోపుల్, ఆడ్రియా నోపుల్, డార్డినల్స్, బాస్పరస్‌లు లభించాయి.
5) ఆల్బేనియా స్వాతంత్ర్యం గుర్తించబడింది.

## 9.15 ఫలితాలు :

ఈ యుద్ధాల వల్ల టర్కీ చాలా నష్టపోయింది. ఐరోపాలో టర్కీ సామ్రాజ్యం కాన్‌స్టాంట్ నోపుల్, ఆడ్రియా నోపుల్‌లకు మాత్రమే పరిమితమైంది. రుమేనియా, మాంటినీగ్రో, గ్రీస్‌లు విస్తరించాయి. సెర్బియా తన రాజ్య భాగాన్ని రెండు రెట్లు పెంచుకొంది. దీనివల్ల బల్గేరియా బాగా నష్టపోయింది.

గ్రీస్, సెర్బియాలు విస్తరించడం చేత ఆస్ట్రియాకు గాని జర్మనీకి గాని టర్కీతో ప్రత్యక్ష సంపర్కం లేకుండా పోయింది. ఆ రెండు రాజ్యాల రక్షకత్వం రష్యాకు లభించటం చేత రష్యా పలుకుబడి పెరిగింది. అది ఆస్ట్రియాకు అసంతృప్తిని కల్గించింది. బోస్నియా, హెర్జిగోవినాలను ఆస్ట్రియా కలుపుకోవడం సెర్బియా - ఆస్ట్రియాల మధ్య వైరాన్ని పెంచింది. టర్కీ, బల్గేరియాలు బలహీనపడ్డాయి. టర్కీ, బల్గేరియాలకు ఆస్ట్రియా, జర్మనీల మద్దతు లభించింది. ఆవిధంగా బాల్కన్‌లలోని రాజకీయ పరిణామాలు దౌత్య సంబంధాలలో గొప్ప మార్పును తెచ్చాయి. "నేను ప్రపంచ యుద్ధాన్ని చూడను. మీరు చూస్తారు. అదీ సమీప ప్రాచ్యంలోనే ఆరంభమవుతుంది" అని బిస్మార్క్ అన్నాడు. ఆ మాటలు నిజమయ్యాయి. 1914 జూన్ 28న ఆస్ట్రియా యువరాజు ఫెర్డినాండ్ బోస్నియాను సందర్శించినప్పుడు సెరజివో అనేచోట తన భార్యతో సహా హత్యకు గురి అయ్యాడు. ఈ సంఘటన మొదటి ప్రపంచ యుద్ధానికి కారణమైంది.

## 9.16 నమూనా ప్రశ్నలు :

1. క్రిమియా యుద్ధమునకు గల కారణాలను, ఫలితాలను వర్ణింపుము.
2. రష్యా - టర్కీ యుద్ధాన్ని, శాన్‌స్టిఫానో సంధి, బెర్లిన్ సంధి (1878) గురించి వివరింపుము.
3. బాల్కన్ యుద్ధాలను గురించి వ్రాయుము.
4. యంగ్‌టర్క్ ఉద్యమము
5. గ్రీక్ స్వాతంత్ర్య యుద్ధము
6. లండన్ సంధి (1840)

## 7.4 చదువదగిన గ్రంథాలు :


1. G.P. Gooch - History of Modern Europe, 1878-1945
2. Hazen C.D. - Europe since 1815
3. J.A.R. Marriott - The Eastern Question
4. C.J.H. Hayes - The History of Modern Europe
5. Taylor - The Struggle for Rostery in Europe, 1848-1918.


- శ్రీమతి యం. సుజని

పాఠం - 10

# ఐరోపా రాజ్యాల దౌత్య సంబంధాలు (1871-1914)

## త్రిరాజ్య సంధి (Triple Alliance) త్రిపక్ష మైత్రి (Triple Entente)

**10.0 లక్ష్యం :**

1871-1914 మధ్య కాలంలో ఐరోపా రాజ్యాల దౌత్య సంబంధాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**


**10.1 పరిచయం**
**10.2 త్రిసామ్రాట్ మండలి (డ్రై కైసర్ బాండ్)**
**10.3 త్రిరాజ్య సంధి (1882)**
**10.4 ఫ్రాన్స్ - రష్యాల ద్విపక్ష కూటమి (1895)**
**10.5 ఇంగ్లాండ్ - ఫ్రాన్స్‌ల మధ్య స్నేహ ఒడంబడిక (1904)**
**10.6 త్రిపక్ష మైత్రి**
**10.7 ముగింపు**
**10.8 నమూనా ప్రశ్నలు**
**10.9 చదువదగిన గ్రంథాలు**


**10.1 పరిచయం :**

1871-1914 మధ్య కాలంలో ఐరోపాలోని రాజ్యాలు విరుద్ధ కూటాలుగా ఏర్పడ్డాయి. అందులో ప్రధానంగా చెప్పుకోదగినవి రెండు. అవి త్రిరాజ్య సంధి, త్రిపక్ష మైత్రి. ఈ విధమైన కూటములు ఏర్పడడం ఆధునిక ప్రపంచ చరిత్రలో ఒక రకంగా ఇదే మొదటిసారి. పరస్పర ద్వేషం, ఈర్ష్య రెండు కూటాల మధ్య పెరిగాయి. రహస్య కూటాలు ఏర్పడటం, వాటి మధ్య ద్వేషం యివన్నీ కలసి మొదటి ప్రపంచ యుద్ధానికి హేతువయ్యాయి. దీనికి కారణాలేమిటో పరిశీలిద్దాం.

జర్మనీ ఏకీకరణకు కారకుడైన బిస్మార్క్ కొంతవరకు ఈ పరిస్థితికి బాధ్యుడు. ఏకీకరణ తరువాత బిస్మార్క్ ఫ్రాన్స్ పట్ల విముఖతను ప్రదర్శించాడు. దానికి కారణాలు ఫ్రాన్స్‌లోని విప్లవ భావాలు, సామ్యవాదం, ప్రజాస్వామ్యం మొదలగు భావాలపై మొదటి నుండి ఏవగింపు ఉంది. 1870లో జరిగిన ఫ్రాంకో-ప్రష్యా యుద్ధంలో ఫ్రాన్స్ ఓడిపోయి ఆల్సెస్-లారైన్‌లను ఫ్రాంక్‌ఫర్ట్ సంధి ద్వారా పోగొట్టుకొంది. జర్మనీ చేతిలో భంగపడిన ఫ్రాన్స్ ఏనాటికైనా బలపడి తిరిగి ప్రతీకారం తీర్చుకొంటుందని, అది జర్మనీ భద్రతకు ప్రమాదం అని బిస్మార్క్ తలపోసాడు. అందువల్ల ఐరోపాలో ఫ్రాన్స్‌ను ఏకాకిని చేయడానికి ప్రయత్నించాడు.

**10.2 త్రి సామ్రాట్ మండలి (Three Emperors League) :**

1872లో బిస్మార్క్ త్రిసామ్రాట్ మండలిని ఏర్పరచాడు. ఇందులో జర్మనీ, ఆస్ట్రియా, రష్యాలు ఉన్నాయి. దీని ప్రకారం, 1871 ఫ్రాంక్‌ఫర్ట్ సంధి ననుసరించి ఏర్పడిన సరిహద్దులను పరిరక్షించడానికి, విప్లవ ఉద్యమాలను అణచడానికి, తూర్పు సమస్యను పరిష్కరించడానికి అంగీకరించాయి. అయితే ఈ ఒప్పందం ఎక్కువ కాలం మనలేదు. 1873 నాటికే ఫ్రాన్స్ జర్మనీకి యుద్ధ నష్టపరిహారం చెల్లించింది. దానికి తోడు ఫ్రాన్స్‌లో జాతీయ భావమూ పెరుగుతూ వచ్చింది. ఇది బిస్మార్క్‌కు ఆందోళన

కల్గించింది. ఫ్రాన్స్ బలపడితే అది జర్మనీకి ప్రమాదమని భావించాడు. అందువల్ల ఐరోపాలోని అగ్రరాజ్యాలతో ఫ్రాన్స్ జర్మనీకి విరోధి అనే భావాన్ని కల్గించటమే గాక, ఫ్రాన్స్‌ను ఏకాకిని చేయడానికి బిస్మార్క్ ప్రయత్నించాడు. ఫ్రాన్స్‌తో రష్యా మిత్రభావాన్ని కల్గిఉందని తలపోసి, దాని విరోధి అయిన ఆస్ట్రియాతో మైత్రి కోసం ప్రయత్నించాడు. 1878 బెర్లిన్ సమావేశంలోనే ఆస్ట్రియాపై పక్షపాతం చూపాడు. ఒకరకంగా అది రష్యా ఆగ్రహానికి కారణమైంది.

బిస్మార్క్ ఆస్ట్రియాతో అనేక సంప్రదింపులు జరిపినాడు. ఫలితంగా రెండు దేశాల మధ్య 1879లో ద్విపక్షమైత్రి (Dual Alliance) ఏర్పడింది. దీని ప్రకారం రష్యా తమ రెండు దేశాలలో దేనిపైనైనా దాడి జరిపినట్లయితే రెండో దేశం సహాయపడాలి. రష్యా గాక మరో దేశం దండెత్తినట్లయితే రెండో దేశం తటస్థంగా ఉండాలి. ఒకవేళ దురాక్రమణ దేశానికి రష్యా మద్దతు ఉన్నట్లయితే రెండో దేశం దానికి సహాయపడాలి. అంతేగాక ఈ షరతులు రహస్యంగా ఉంచటానికి అంగీకరించాయి. ఈ ఒప్పందం ఐదు సంవత్సరాల వరకూ అమలులో ఉంటుంది. అవసరమైతే పొడిగించటానికి అంగీకరించాయి.

అయితే రష్యాతో పూర్తిగా తెగతెంపులు చేసుకొంటే రష్యా ఫ్రాన్సుతో చేరగలదనే భయం బిస్మార్క్‌కు ఉండటం చేత త్రిసామ్రాట్ మండలిని కొనసాగించాడు. బాల్కన్ ప్రాంతంలో ఆస్ట్రియా, రష్యాల మధ్య ఏర్పడిన విరోధం ఫలితంగా బిస్మార్క్ రష్యాతో పునర్ భద్రతా సంధి అనే రహస్య ఒప్పందం గావించుకొన్నాడు. దీని ప్రకారం రష్యా ఫ్రాన్సుకు సహాయపడకుండా ఉండటానికి అంగీకరించింది. అందుకు ప్రతిగా జర్మనీ ఆస్ట్రియాకు వ్యతిరేకంగా బాల్కన్ రాజ్యాలలో రష్యాను బలపరుస్తుంది. కాని ఈ సంధి అనతికాలంలోనే ముగిసిపోయింది. బిస్మార్క్ తరువాత జర్మన్ ఛాన్సలర్ కాప్రివి 1890 తరువాత ఈ సంధిని కొనసాగించలేదు. దీంతో త్రి సామ్రాట్ మండలి, పునర్ భద్రతా సంధి ముగిసిపోయాయి.

## 10.3 త్రి రాజ్య సంధి (Triple Alliance) 1882 :

ఇటలీ, ఫ్రాన్స్‌ల మధ్య ఏర్పడిన వివాదమే ఈ కూటమి స్థాపనకు కారణమైంది. ఉత్తర ఆఫ్రికాలోని ట్యూనిస్ విషయమై ఫ్రాన్స్, ఇటలీల మధ్య తగాదా ఏర్పడింది. 1881 లో ఫ్రాన్స్ ట్యునిస్‌ను ఆక్రమించింది. ఆ పరిస్థితులలో ఇటలీ జర్మనీతో మైత్రికి ప్రయత్నించింది. ఫ్రాన్స్, ఇటలీల మధ్య ఏర్పడిన విరోధం త్రిరాజ్య సంధికి దారితీసింది. ఈ సంధిలో జర్మనీ ఆస్ట్రియా, ఇటలీలు చేరాయి. దీని ప్రకారం ఈ కూటమిలోని ఏ రాజ్యంపైనైనా దురాక్రమణ జరిగితే మిగిలిన రెండు రాజ్యాలు దానికి సహాయపడాలి. మొదట ఐదు సంవత్సరాలకు పరిమితమైన ఈ సంధి 1887 లో పొడిగించబడింది. అయితే ఇటలీ, ఆస్ట్రియాల మధ్య ఇటాలియా ఇరిడెంటా, ఏడ్రియాటిక్ సముద్రాధిపత్యంపై అభిప్రాయబేధాలున్నాయి. దీనితో ఇటలీ 1902లో జర్మనీ, ఆస్ట్రియాలకు తెలియకుండా ఫ్రాన్స్‌తో రహస్యసంధి కావించుకొన్నది. దీనిని బట్టి ఆనాటి దౌత్యనీతి ఎంత ప్రమాదకరంగా ఉందో తెలుస్తుంది.

బిస్మార్క్ జర్మనీలో శాంతిభద్రతలను కాపాడి ఆదేశ అభివృద్ధికి కారకుడయ్యాడు. తన రాజనీతి చతురతతో ఐరోపాలోని అగ్రరాజ్యాలను తనకు సన్నిహితంగా ఉంచుకోగలిగినాడు. కాని అతని రహస్య మైత్రి విధానం ఐరోపా రాజ్యాలలో భయాన్ని కల్గించింది. బిస్మార్క్ పతనానంతరం ఫ్రాన్స్ ఇతర దేశాలతో సంధి కావించుకొన్నది.

## 10.4 ఫ్రాన్స్ - రష్యాల ద్విపక్ష కూటమి (1895) :

రెండో విలియం కాలంలో జర్మనీని అగ్రరాజ్యంగా రూపొందించటానికి ప్రయత్నాలు జరిగాయి. జర్మనీకి వలసలు సంపాదించటానికి కూడా ప్రయత్నించాడు. అందువల్ల జర్మనీ సైనిక, నౌకాబలాలను విలియం వృద్ధి చేశాడు. అది ఇంగ్లండ్‌కు భీతి కల్గించింది. ఫ్రాన్స్ అప్పటికే జర్మనీ వ్యవహారాలు గమనించి రష్యాతో చేతులు కలిపింది. జర్మనీ పునర్ భద్రతా సంధికి అంగీకరించక పోవటంతో రష్యా, ఫ్రాన్స్‌తో కలసి 1891 లో రహస్య సంధి కావించుకొన్నాయి. దీనినే ద్విపక్షమైత్రి అంటారు. యుద్ధ విషయాలలో పరస్పరం చర్చించుకోవటానికి, సహాయం చేసుకోవడానికి రెండు రాజ్యాలు అంగీకరించాయి. ఈ సంధి జర్మనీకే గాక ఇంగ్లండ్‌కు కూడా భయాన్ని కల్గించింది. ఫ్రాన్స్‌కు మాత్రం ఒంటరిననే భయం పోయి ధైర్యం కలిగింది.

## 10.5 ఇంగ్లాండ్ - ఫ్రాన్స్‌ల మధ్య స్నేహ ఒడంబడిక (1904) :

పైవిధంగా ఐరోపాలో త్రిరాజ్యసంధి, ద్విపక్ష మైత్రి అను రెండు సైనిక కూటాలు ఏర్పడ్డాయి. ఇంగ్లండ్ మాత్రం ఈ రెండు కూటమిలతో సంబంధం లేకుండా తటస్థ వైఖరిని అవలంభించింది. దానికి కారణం ఈ కూటాలలోని రాజ్యాలతో ఇంగ్లండ్‌కు ఏదో ఒకచోట వివాదం ఉండటమే. అయితే దక్షిణాఫ్రికాలో బోయర్లతో యుద్ధాలు జరుగుతున్నప్పుడు అన్ని రాజ్యాలు ఇంగ్లండ్‌కు వ్యతిరేకంగా బోయర్లను సమర్థించాయి. దాంతో తనను ఇతర రాజ్యాలు దూరం చేస్తున్నాయని ఇంగ్లాండ్ గ్రహించింది. జపాన్‌తో 1902లో ఆంగ్లో - జపాన్ సంధి కావించుకొన్నది. దీని ప్రకారం రష్యాకు ఏ ఐరోపా దేశమైన సహాయపడినట్లయితే ఇంగ్లండ్ జపాన్‌కు సహాయపడుతుందనే అంగీకారం కుదిరింది. 1905లో రష్యా-జపాన్ యుద్ధంలో ఇంగ్లండ్ అన్నివిధాలుగా జపాన్‌కు సహాయపడింది. ఈ యుద్ధంలో రష్యా ఓడిపోయింది. ఇంకా రష్యాను బలహీనపరచడానికి జర్మనీతో సంధి కోసం ఇంగ్లండ్ ప్రయత్నించింది. జర్మనీతో అంగీకారం కుదరకపోతే ఇతర రాజ్యాలతో మైత్రి చేసుకొంటానని బెదిరించింది. కాని జర్మనీ ఇంగ్లాండ్ ప్రతిపాదనలను తిరస్కరించింది. జర్మనీతో నిరాకరించబడిన ఇంగ్లండ్ ఫ్రాన్స్‌తో అంగీకారానికి వచ్చింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల మైత్రి ఒక విప్లవాత్మకమైన మార్పుగా చెప్పుకోవచ్చు. 1904లో ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల మధ్య సంధి (Anglo - French Entente or the Entente Cordiale) జరిగింది. దీని ప్రకారం ఈజిప్టులో బ్రిటిష్ అధికారాన్ని ఫ్రాన్స్ గుర్తించింది. మొరాకాలో ఫ్రెంచి హక్కులను ఇంగ్లాండ్ అంగీకరించింది. అప్పటి నుండి ఫ్రాన్స్ మొరాకోలో తన పలుకుబడిని పెంచుకోసాగింది. దానిని రెండో విలియం వ్యతిరేకించాడు. అందువల్ల 1906 అల్జీరాస్‌లో సమావేశం జరిగింది. దాని ప్రకారం ఫ్రాన్స్ మొరాకోను స్వాధీనం చేసుకోకుండా నిలిపివేయబడింది. ఇది ఒక రకంగా జర్మనీకి విజయం.

## 10.6 త్రిపక్ష మైత్రి (Triple Entente) :

క్రమంగా రష్యా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల మధ్య స్నేహభావం పెరిగింది. ఈ మూడు రాజ్యాలు ఒకే పక్షమనే అభిప్రాయమేర్పడింది. ఈ మూడు రాజ్యాలను కలిపి త్రిపక్షమైత్రి అని పిలిచారు. ఈ త్రిపక్షమైత్రి సైనిక కూటమి కాదు. ఈ మూడు రాజ్యాలు అంతర్జాతీయ వ్యవహారాలలో పరస్పరం సంప్రదించుకోవాలని నిర్ణయించుకొన్నాయి. ఈ కూటమి త్రిరాజ్యసంధికి విరుద్ధం.

## 10.7 ముగింపు :

ఈ విధంగా ఐరోపా రెండు విరుద్ధ సైనిక కూటాలుగా విభజింపబడింది. ఏ స్థానిక సంఘర్షణైనా ప్రపంచ యుద్ధానికి దారి తీసే పరిస్థితులు ఐరోపాలో నెలకొన్నాయి. అవే 1914లో మొదటి ప్రపంచ యుద్ధానికి కారణమైనాయి.

## 10.8 నమూనా ప్రశ్నలు :

1. 1871-1914 మధ్య కాలంలో ఐరోపా రాజ్యాల దౌత్య సంబంధాల గురించి వివరింపుము.
2. 1882 త్రిరాజ్యసంధి
3. డ్రై కైసర్ బాండ్ (త్రి సామ్రాట్ మండలి)

## 10.9 చదువదగిన గ్రంథాలు :


1. A.J.O. Taylor - Bismarc - The Man and the Statesman
2. C.J.H. Hayes - Contemporary Europe Since 1870
3. Gran and Temperley - Europe in the 19th and 20th Centuries
4. C.D. Hazen - Modern Europe upto 1945
5. L. Mukherjee - A Study of Modern Europe and the World


- శ్రీమతి యం. సుజని

పాఠం - 11

# ఆసియా, ఆఫ్రికా ఖండాలలో సామ్రాజ్యతత్వం

**11.0 లక్ష్యం :**

ఆసియా, ఆఫ్రికా ఖండాలలో సామ్రాజ్యతత్వం గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**


**11.1 పరిచయం**

**11.2 సామ్రాజ్యవాదం - అర్థం.**

**11.3 వలసవాదం - సామ్రాజ్యవాదానికి దారితీయుట**

**11.4 1870 నుండి నవ్య సామ్రాజ్యవాదం మొదలగుట**

**11.5 నవ్యసామ్రాజ్యవాదం తలెత్తటానికి గల కారణాలు**

**11.5.1 పారిశ్రామిక విప్లవం**

**11.5.2 పెట్టుబడులు**

**11.5.3 ముడిపదార్థాలు - మార్కెట్‌లు**

**11.5.4 యుద్ధావసరాలు**

**11.5.5 మతం**

**11.5.6 జాతి - పరువు ప్రతిష్టలు**

**11.6 ఆఫ్రికా**

**11.6.1 ఆఫ్రికాలో వలస స్థావరాలకై పోటీ లేదా కుమ్ములాట**

**11.6.1.1 ఇంగ్లాండ్ - ఎ) ఈజిప్టు బి) సూడాన్ సి) దక్షిణ ఆఫ్రికా డి) ఇతర స్థావరాలు**

**11.6.2 ఫ్రాన్స్**

**11.6.3 ఇటలీ**

**11.6.4 జర్మనీ**

**11.6.5 బెల్జియం**

**11.6.6 పోర్చుగల్**

**11.6.7 స్పెయిన్**

**11.6.8 బెర్లిన్ సమావేశం (1884-1885)**

**11.7 ఆసియాపై సామ్రాజ్యవాద ప్రభావం**

**11.7.1 1850 కి పూర్వం ఐరోపా ఖండంతో ఆసియాకు గల సంబంధాలు**

**11.7.2 1850 తర్వాత ఆసియాలో ఐరోపా దేశాల ప్రాబల్యం**

**11.7.3 దూర ప్రాచ్యం**

**11.7.3.1 జపాన్**

**11.7.3.1.1 జపాన్ ఐరోపీకరణ**

**11.7.3.1.2 జపాన్ సామ్రాజ్యవాదం**

**11.7.3.2 చైనా సామ్రాజ్యం**

**11.7.3.2.1 చైనాపై ఐరోపావారి దురాక్రమణ**

**11.7.3.2.2 అమెరికా ఓపెన్ డోర్ విధానం**

**11.7.3.2.3 ప్రతిచర్య సంస్కరణలు**

**11.7.3.2.4 బాక్సర్ తిరుగుబాటు (1899-1901)**

**11.7.3.2.5 చైనా విప్లవం (1911-1912)**

**11.7.4 భారతదేశంలోని పరిపాలన బ్రిటీష్ రాజు చేతిలోనికి పోవటం.**

**11.7.4.1 భారతదేశంపై బ్రిటీష్ వారి అధికారం**

**11.7.5 సయాం, పరిష్యా తదితర రాజ్యాలు**

**11.8 సామ్రాజ్యవాద ఫలితాలు**

**11.8.1 ఆధునికీకరణ**

**11.8.2 ఆర్థిక దోపిడీ**

**11.8.3 జాతి వివక్షత**

**11.8.4 ఇతర ఫలితాలు**

**11.9 నమూనా ప్రశ్నలు**

**11.10 చదువదగిన గ్రంథాలు**

## 11.1 పరిచయం :

1453లో కాన్‌స్టాంట్ నోపిల్ పతనం ఐరోపాలో అనేక మార్పులను తెచ్చింది. అట్టి మార్పులలో ప్రధానమైనది భూగోళ పరిశోధనలు. ఇంకొకటి మతం మత్తును వదిలించుకొని వైజ్ఞానిక పరిశోధనలు సాగించినది. తత్ ఫలితంగా పారిశ్రామిక విప్లవం జనించినది. దీని ఫలితంగా ముడిసరుకులు, మార్కెట్ల అవసరం ఏర్పడింది. అంతేగాక వలసల స్థాపన కోసం ప్రయత్నం జరిగింది. దానికితోడు క్రైస్తవ మిషనరీలు క్రైస్తవ మతాన్ని ఇతర ఖండాలలో వ్యాప్తి చేయవలెననే ప్రయత్నంలో వలస సామ్రాజ్యాన్ని బలపరిచారు. అందువల్ల ఐరోపా రాజ్యాలు ప్రపంచంలో వెనుకబడి, బలహీనంగా ఉన్న ప్రాంతాలను తమ అధీనంలోనికి తెచ్చుటకు ప్రయత్నించినవి. భూగోళ పరిశోధనల ఫలితంగా ముందుగా పోర్చుగీస్‌వారు ఇండియాతో వ్యాపార సంబంధాలను నెలకొల్పుకొనిరి. ఈ వ్యాపారం లాభసాటిగా ఉండటంతో డచ్చివారు, ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు కంపెనీలు ప్రారంభించి ఆసియా ఖండంలో వ్యాపారం సాగించిరి. కాని వారి మధ్య పోటీ ఏర్పడి, పోటీలో పోర్చుగల్, డచ్చి, ఫ్రాన్స్ దేశాలు వలసలను పోగొట్టుకొన్నవి. ఇంగ్లాండ్‌కు ఇండియా పూర్తిగా వశమైంది. 1947 ఆగస్టు 15వరకు ఇండియాను ఆంగ్లేయులు పాలించిరి. ఐరోపా రాజ్యాలు తమ పారిశ్రామిక ప్రగతిని సాధించడానికి నూతన వలసలు కావలసి వచ్చెను. ఈ ప్రయత్నంలో వెనుకబడి తమనుతాము రక్షించుకోలేనివారికి ఆఫ్రికా, ఆసియా దేశాలు వారి కంట పడినవి. ఈ ప్రాంతాలను ఆక్రమించుటలో ఐరోపా రాజ్యాల మధ్య అనేక స్పర్థలు, సంఘర్షణలు ఏర్పడి మొదటి ప్రపంచ యుద్ధానికి కూడా దారితీసినవి.

## 11.2 సామ్రాజ్యవాదం - అర్థం :

19వ శతాబ్ది భారీ సామ్రాజ్యాల నిర్మాణం జరిగిన కాలం. అలా సాగిన ఉద్యమాన్నే సామ్రాజ్యవాదమంటారు. చాలాకాలం వరకు సామ్రాజ్యవాదం, వలసవాదం, జాతీయ ప్రభుత్వ విధానాల పరికరాలుగా ఉపయోగించబడ్డాయి. సామ్రాజ్యవాదం అనే పదాన్ని, అందరూ అంగీకరించే విధంగా నిర్వచించడం కష్టం. సామ్రాజ్యవాదంలో అనేక రకాలు కలవు. అవి - రాజకీయ, ఆర్థిక, జాతీయ, భావపూర్వక, సాంస్కృతిక సామ్రాజ్యవాదాలు. ఛార్లెస్ హాడ్జెన్ అభిప్రాయంలో "సామ్రాజ్యవాదమనగా బాహ్యమైన ఒక విదేశీ రాజకీయ, ఆర్థిక లేక సాంస్కృతికపరమైన అధికారాన్ని, ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా ఇంకోదేశ ప్రజలపై వ్యాపింపచేయటమే" అని పేర్కొనినాడు. ఒక ప్రదేశం, అచ్చటి ప్రభుత్వం, ఇంకో ప్రదేశం, అచ్చటి ప్రభుత్వానికి లోబడి వుంటే, ఆ సంబంధాన్ని గూర్చి చెప్పేదే సామ్రాజ్యవాదం. దీన్నిబట్టి సామ్రాజ్యవాదమంటే ఎప్పుడూ లోబడి ఉండటమే.

## 11.3 వలసవాదం - సామ్రాజ్యవాదానికి దారితీయుట :

వలసవాదం, సామ్రాజ్యవాదం అనే మాటలను సామాన్యంగా ఒకే అర్థంలో వాడుతుంటారు. అయితే కొందరు పండితులు ఈ రెండు మాటల మధ్య అర్థ భేదమున్నదని తెలిపారు. జె.ఏ. హాబ్సన్ సామ్రాజ్యవాదాన్ని నిర్వచించడంలో విఫలుడైనప్పటికి, వలసవాదాన్ని చక్కగా వివరించాడు. ఆయన అభిప్రాయంలో "సరైన అర్థంలో వలస విధానమంటే సహజంగా జాతీయతాభావం కట్టలు తెంచుకొని ప్రవహించటమే. వలసవచ్చినవారు తాము మెట్టిన స్థావరంలోని సహజ, సాంఘిక వాతావరణంలో తమ నాగరికతను నాటగల వారి శక్తి, వలస విధానానికి గీటురాయి" అని పేర్కొనినాడు. 1492లో కొలంబస్ అమెరికాను కనిపెట్టటం, 1498లో వాస్కోడిగామా సముద్ర మార్గాన భారతదేశాన్ని కనిపెట్టటంతో ఐరోపా దేశాలు వలస స్థావరాల్ని స్థాపించటం మొదలైంది. తొలిగా స్థావరాల్ని ఏర్పరచుకొన్న దేశాలు - స్పెయిన్, పోర్చుగల్. తదుపరి నావికాధిక్యత కల్గిన దేశాలు - ఇంగ్లాండ్, ఫ్రెంచి, హాలండ్‌లు వలసల ఉధృతిని కొనసాగించినాయి. వానిజ్యపరమైన లాభాలను దృష్టిలో ఉంచుకొని అమెరికా, ఆసియా, ఆఫ్రికాలలో తమతమ స్థావరాలను నెలకొల్పారు. వలస స్థావరాలను పోషించడానికి మాతృదేశం ఆర్థికంగా పెద్ద బరువు నెత్తుకోవాల్సి వచ్చింది. పరిపాలనకై చాలామంది ఉద్యోగులు, సైనికులు అవసరమైనారు. వలస స్థావరాలపై గల ఆసక్తి వల్ల ఐరోపాదేశాల మధ్య తీవ్రంగా పోటీ ఏర్పడింది. ఈ పోటీ యుద్ధాలకు దారితీసింది. అలాంటి వాటిలో అమెరికా స్వాతంత్ర్య యుద్ధం (1776-1783) జరిగి, స్వతంత్రం కావటం, అమెరికాలో ఐరోపాదేశాలు వలస స్థావరాల నేర్పరచరాదని, జోక్యం చేసుకోరాదని, 1823లో మన్రో సిద్ధాంతాన్ని ప్రతిపాదించటంతో, వారి ఆశలు అడుగంటినాయి. ఇక ఎటు దారిలేక ఐరోపారాజ్యాలు తమ వలసల విస్తరణకై ఆసియా, ఆఫ్రికా ఖండాలపై తమ దృష్టిని మళ్ళించినాయి. 19వ శతాబ్ది అంతానికి, స్థావరాల పట్ల వలస విధాన వైఖరి సామ్రాజ్యవాదంగా మార్పు చెందింది.

## 11.4 1870 నుండి నవ్య సామ్రాజ్యవాదం మొదలగుట :

సామ్రాజ్యవాదం 2 రకాలు. అవి 1. పాత సామ్రాజ్యవాదం (1492-1763 వరకు), 2. నవ్యసామ్రాజ్యవాదం (1870 నుండి నేటివరకు) 1870 నాటికి ఐరోపా ఖండంలోని దేశాలు పారిశ్రామికంగా, జాతీయపరంగా చాలా అభివృద్ధి చెందాయి. ప్రపంచంలో మిగతా దేశాలతో సరిపోల్చరాని - వస్తు సంపద, సాయుధ సంపత్తి, తమ దేశాలను విస్తృతపరచుకోవాలనే ఆకాంక్ష ఐరోపా రాజ్యాలకున్నాయి. నూతన ఆర్థికాభివృద్ధి, వర్తక, వాణిజ్యాలు, పరిశ్రమ విస్తృతి, ప్రపంచ దేశాల ప్రయాణాలకు వీలు కలగటం, జనాభా పెరుగుదల, అధికంగా వలస పోవటం, ధనం పెట్టుబడి పెట్టడానికి అవసరమైన మార్కెట్‌లు, ముడిపదార్థాలు మొదలైనవన్నీ జాతీయవాదంతో కలసి, 1870 తర్వాత సామ్రాజ్య వాదానికో క్రొత్త ఊపు నిచ్చాయి.

## 11.5 నవ్యసామ్రాజ్యవాదం తలెత్తటానికి గల కారణాలు :

### 11.5.1 పారిశ్రామిక విప్లవం :

18వ శతాబ్దిలో ఇంగ్లాండ్‌లో మొదలైన పారిశ్రామిక విప్లవం 19వ శతాబ్ది నాటికి క్రమంగా మిగతా ఐరోపాదేశాలకు కూడా పాకింది. ఆవిరి యంత్రం, పత్తి, నూలు పరిశ్రమలు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు, రవాణా, వార్తా పత్రికలు ఆదిగా గల రంగాల్లో వచ్చిన వినూత్న మార్పుల వల్ల కర్మాగారాలు, పరిశ్రమలు నెలకొన్నాయి. 1870 తర్వాత పరిశ్రమలు విపరీతంగా పెరిగాయి. అందువల్ల ముడిపదార్థాలు, తయారైన వస్తువులకు మార్కెట్ అవసరమైనాయి. అందువల్ల ఐరోపా రాజ్యాలలో పోటీ ఏర్పడి, క్రమంగా సామ్రాజ్యవాదానికి దారితీసింది.

### 11.5.2 పెట్టుబడులు :

మిగులు మూలధనం పెట్టుబడికి కారణమైంది. ఐరోపాలో వడ్డీ వ్యాపారులు, పెట్టుబడిదారులు డబ్బు సంపాదించడానికి వలస స్థావరాలు క్రొత్త మార్గాలుగా కన్పించాయి. ఆసియా, ఆఫ్రికాలలో తోటల పెంపకం, రైల్వేలు మొదలైన వాటిపై పెట్టుబడులు పెట్టి ఎక్కువ లాభాలను ఆర్జించాయి. ఇది కూడా సామ్రాజ్యవాదానికి దారితీసింది.

### 11.5.3 ముడి పదార్థాలు - మార్కెట్‌లు :

పారిశ్రామిక విప్లవ ఫలితంగా ముడిపదార్థాలకు, మార్కెట్లకు మంచి గిరాకీ ఏర్పడింది. ఉదాహరణకు సైకిల్, ఆటోమొబైల్ యంత్రాలు రావటంతో ఆఫ్రికా, ఆసియాల్లో రబ్బరు, నూనె, తగరాల కొరకు వెదుకులాట ప్రారంభమైంది. కాఫీ, తేయాకు, కొబ్బరి, పంచదార, పొగాకు లాంటి వస్తువులకు ఐరోపా ఖండ దేశాల్లో గిరాకీ ఏర్పడింది. ఐరోపాలో తయారైన వస్తువుల అమ్మకానికై మార్కెట్ల కోసం, వర్తకాభివృద్ధి కోసం రూపొందించబడిందే సామ్రాజ్యవాదం.

### 11.5.4 యుద్ధావసరాలు :

ఆనాటి యుద్ధతంత్ర నిపుణులు కీలకస్థానాల్లో ఉన్న నౌకాశ్రయాలను, బొగ్గు దొరికే స్థలాలను ఆక్రమించుటలో గల లాభాలను గూర్చి చెప్పేవారు. సైనిక జన అవసరాల కోసం ఫ్రెంచి, జర్మన్ దేశాలు పోటీపడినాయి.

### 11.5.5 మతం :

ఐరోపా దేశస్తులు ఎక్కడకు వెళ్ళినా తమతోపాటు తమ వ్యాపారాన్నే కాక సిలువను కూడా తీసుకెళ్ళారు. సైనిక విస్తరణతో పాటు, మతం మార్పిడికై వత్తిడి కూడా జోడీ అయింది. ఈవిధంగా క్రైస్తవ మిషనరీల మతతత్వం సామ్రాజ్యవాదానికి దారితీసింది.

### 11.5.6 జాతి పరువు - ప్రతిష్టలు :

ప్రపంచంలోని వెనుకబడిన ప్రాంతాలలోని మానవాళిని ఉద్ధరించుట, నాగరికులను చేయటం, తమ బరువుగా, బాధ్యతగా చాలామంది ఐరోపావారు భావించేవారు. ఇది జాతి పరువు, ప్రతిష్టలకు మూలమని చాలామంది సామ్రాజ్యవాదులు భావించేవారు.

## 11.6 ఆఫ్రికా :

ఇది ఐరోపాకు దగ్గరగా ఉన్నది. ఐరోపా కన్నా ఇది 3 రెట్లు పెద్దది. పెద్ద ఖండాల్లో రెండోదైన ఆఫ్రికా అన్ని ఖండాలకంటే పెద్దది మరియు వెనుకబడినది. ప్రపంచ తొలి నాగరికతల్లో ఒకటైన ఈజిప్టు నాగరికత, ఉత్తర ఆఫ్రికాలో నైల్ నదీ లోయలో వర్ధిల్లింది. 1487 తర్వాత బార్తలోమియో డయాజ్ - గుడ్ హోప్ అగ్రాన్ని కనుక్కొన్నప్పుడు, ఇప్పటివరకు తెలియని ఖండపు విస్తీర్ణం, రూపం ప్రపంచానికి మొదటిసారిగా తెలిశాయి. అయితే అచ్చటి ప్రజలను గూర్చి, వనరులను గూర్చి తెలిసిందేమి లేదు.

ఆఫ్రికాను ప్రపంచ చీకటి ఖండంగా పిలిచేవారు. 19వ శతాబ్దం వరకు, ఆఫ్రికా ఖండం ఎవరికీ తెలియకుండా, ఎవరూ శోధించకుండానే ఉండిపోయింది. శోధకులు, క్రైస్తవ మిషనరీలు, ఐరోపా దేశస్తులు చీటికఖండంపై కాలు పెట్టినప్పుడు, ఇంకా ముందుకు సాగినప్పుడు, అక్కడి వాతావరణం చాలా వేడిగా రోగాలు పుట్టించే ప్రాంతాలతోను, దట్టమైన అడవులతోను నిండి ఉన్నది. అయినా ఐరోపా దేశాలు "తేలికగా డబ్బు సంపాదించుట కోసం" ఒకదానితో ఒకటి పోటీపడసాగినాయి.

### 11.6.1. ఆఫ్రికాలో వలస స్థావరాలకై పోటీ లేదా కుమ్ములాట :

చీకటిఖండమైన ఆఫ్రికాలో శోధకుల, మిషనరీల కార్యకలాపాల వలన, అక్కడి ముడిపదార్థాలు, పారిశ్రామిక అవకాశాలు, మార్కెట్ల రూపంలో ధనం, ప్రపంచానికి మిరుమిట్లు గొలిపేటట్లు చేసింది. 1869 సూయజ్ కాల్వ తెరవబడటంతో, ఆఫ్రికా ఖండ ప్రాముఖ్యత హెచ్చింది. ఆఫ్రికాను దోచుకోవాలనే తపన మొదలైంది. 19వ శతాబ్దానికల్లా ఐరోపా దేశాలు - ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, బెల్జియం, స్పెయిన్, పోర్చుగల్ మొత్తం ఆఫ్రికా ఖండాన్ని పంచుకొన్నాయి.

#### 11.6.1.1 ఇంగ్లాండ్ :

**ఎ) ఈజిప్టు :**

మహ్మద్ ఆలీ చనిపోయిన తర్వాత ఈజిప్టులో రాజకీయమైన అలజడులు చెలరేగినాయి. ఇస్మాయేల్ పాషా (సామంతరాజు) పరిపాలించే కాలంలో మధ్యధరా సముద్రాన్ని ఎర్ర సముద్రంలో కలిపే సూయజ్ కాలువ త్రవ్వకం, 1869లో ఫ్రెంచి ఇంజనీర్ - ఫెర్డినాండ్ డిలెసెప్స్ పర్యవేక్షణలో పూర్తయింది. ఇంకా రైల్వేలు, తంతి, తపాలా ప్రవేశపెట్టటంతో, ఈజిప్టు ఆధునికతను సంతరించుకొన్నది. వీటన్నింటికి ఈజిప్టు భారీ మొత్తాలను, ఇతర ఐరోపా దేశాల నుండి అప్పుగా తీసుకొన్నది. అప్పు తీర్చడం కోసం ఈజిప్టు పాషా సూయజ్ కంపెనీలో తనకున్న షేర్లను అమ్మాలని నిశ్చయించుకొన్నాడు. బ్రిటీష్ ప్రధాని డిజ్రైలీ ఆ కాలువ ప్రాముఖ్యత గుర్తించి షేర్లన్నింటిని కొనేసినాడు. ఆంగ్ల పాలనకు వ్యతిరేకంగా ఈజిప్టులో అనేక తిరుగుబాట్లు వచ్చాయి. వాటిని 1883 కల్లా ఆంగ్లేయులు అణచివేసి యజమానులైరి.

**బి) సూడాన్ :**

ఇది ఈజిప్టులో ఒక రాష్ట్రం. 1879లో సూడాన్ ప్రజలు మహ్మద్ అహ్మద్ నాయకత్వంలో ఈజిప్టు పాషాకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవదీసిరి. యిందులో ఆంగ్లేయులు, ఈజిప్టువారు చాలా మంది చనిపోయిరి. 1898లో జనరల్ కిచ్నర్ చేతిలో సూడాన్ ఓడిపోయి, ఆంగ్ల రక్షక రాష్ట్రంగా (Protectorate) గా మారింది. ఈజిప్టులోను, సూడాన్‌లోను ఇంగ్లీష్ వారు పొందిన విజయాలు, వారి దృష్టిని ఆఫ్రికాలోని మిగతా భూభాగాలవైపు మళ్ళించినవి.

### సి) దక్షిణాఫ్రికా :

బ్రిటన్ దక్షిణ ఆఫ్రికాలోని అన్ని వలస స్థావరాలను క్రమక్రమంగా హస్తగతం చేసుకొన్నది. గుడ్ హోప్ అగ్రానికి చేరువుగా ఉన్న కేప్ వలస స్థావరం - మొదట్లో డచ్చివారిది, తదుపరి అది నెపోలియన్ చేతచిక్కి, ఆయన పతనానంతరం ఇంగ్లాండ్ వారిచేత కొనుగోలు చేయబడింది. స్థావరంలో ఇంకా ఉన్న పాత డచ్చి నివాసితులను (Settlers) బోయర్లు అని పిలిచేవారు. మొదట్నుంచి ఇంగ్లీష్ వారికి, బోయర్లకు మధ్య సత్‌సంబంధాలు లేవు. అందువల్ల బోయర్లు ఉత్తరంగా పోయి "ట్రాన్స్‌వాల్" "ఆరంజ్ స్వతంత్రరాజ్యం" అనే వలస స్థావరాలను ఏర్పరచుకొన్నారు. అయితే బ్రిటీష్‌వారికి బోయర్లకు, దేశీయ తెగల వల్ల ప్రమాదమేర్పడగా, బ్రిటీష్‌వారు నేటాల్‌ను, కొత్త బోయర్ స్థావరాలను కలుపుకొన్నారు. ఇది రెండుబోయర్ యుద్ధాలకు దారితీసింది. వీటిలో బోయర్లు ఓడిపోయిరి. 1909లో ఇంగ్లీష్, డచ్ స్థావరాలు ఏకమై, బ్రిటీష్ వారి ఆధీనంలో "దక్షిణ ఆఫ్రికా యూనియన్"గా వెలవడినాయి.

### డి) ఇతర స్థావరాలు :

ఈజిప్టు, సూడాన్, దక్షిణ ఆఫ్రికాలనేకాక, ఇంగ్లాండ్ ఇంకా జాంజిబార్, ఉగాండా, గోల్డ్‌కోస్ట్, న్యాసాలాండ్, రొడీషియా, బ్రిటీష్ తూర్పు ఆఫ్రికాలను కూడా సంపాదించింది.

### 11.6.1.2 ఫ్రాన్స్ :

ఫ్రెంచివారు ఆఫ్రికా పశ్చిమ తీరంలో అప్పటికే కొన్ని స్థావరాలను ఏర్పరచుకొన్నారు. అయితే వారు వాటితో తృప్తిపడక అల్జీరియా, ట్యూనీషియాలను కూడా ఆక్రమించాలని ప్రయత్నించిరి. 1847లో ఫ్రాన్స్ అల్జీరియాపై విజయం సాధించింది.

ట్యూనిషియాపై ఫ్రెంచి - ఇటలీలు పోటీపడ్డాయి. ట్యూనీషియా అభివృద్ధికై ఫ్రాన్స్ చాలా డబ్బు ఖర్చుపెట్టింది. ట్యూనిష్ పరిపాలన లంచగొండులు, అసమర్థుల చేతుల్లో ఉంది. అందువల్ల ఫ్రెంచి వారి అప్పు తీరుతుందనే ఆశలేదు. పరిపాలనను సక్రమ మార్గంలో పెట్టాలనే మిషతో ఫ్రాన్స్, ఇటలీలు ట్యూనీషియా ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకొన్నాయి. 1878లో బెర్లిన్ కాంగ్రెస్‌లో బిస్మార్క్ ట్యూనీషియాను ఫ్రాన్స్ ఆక్రమించవచ్చునని సలహా నిచ్చాడు. 1881లో అంతట ఫ్రాన్స్ ట్యూనీషియాను ఆక్రమించింది. 1881 మే 12 వ తేదీన "బార్డో" ఒప్పందం ప్రకారం, పెద్ద దేశాలన్నీ ట్యూనీషియాపై ఫ్రెంచి వారి ఆధిపత్యాన్ని అంగీకరించాయి.

### 11.6.1.3 ఇటలీ : సోమాలీలాండ్, లిబియాలను ఆక్రమించుట :

1885 లో ఇటలీ సోమాలీలాండ్‌ను, 1911-12 లలో లిబియాను ఆక్రమించింది.

### 11.6.1.4 జర్మనీ :

ఏకీకరణ పూర్తయిన తర్వాత జర్మనీ పారిశ్రామికీకరణ జనాభా పెరుగుదల మూలంగా ముడిపదార్థాల అవసరం కోసం, మార్కెట్ల అవసరం కోసం కొత్త స్థావరాల వెదుకులాట ప్రారంభించింది. దాని ఫలితంగా బిస్మార్క్ దృష్టి ఆఫ్రికా వైపునకు మళ్ళింది. 1885 నాటికల్లా జర్మనీ - టోగోలాండ్, కామెరూన్, నైరుతీ, తూర్పు ఆఫ్రికాలను తన రక్షణలోనికి తెచ్చుకొన్నది.

### 11.6.1.5 బెల్జియం : కాంగో :

బెల్జియం రాజు రెండో లియోపాల్డ్ మధ్య ఆఫ్రికా శోధన, నాగరికతలపై ఒక అంతర్జాతీయ సంఘాన్ని నడిపినాడు. ఈ సంఘం వారి దృష్టి కాంగోపై బడింది. 1884 నాటికి కాంగో స్వతంత్రమై 1885లో లియోపాల్డ్ సార్వభౌమాధికారం క్రిందకు వచ్చింది.

### 11.6.1.6 పోర్చుగల్ :

ఇది మొజాంబిక్, అంగోలా, గినియాలను ఆక్రమించింది.

### 11.6.1.7 స్పెయిన్ :

ఇది మొరాకోను పొందింది.

### 11.6.1.8 బెర్లిన్ సమావేశం (1884-1885) :

జర్మనీ, ఫ్రాన్స్‌లు ఆఫ్రికా పరిస్థితులను ముఖ్యంగా కాంగో సమస్యను చర్చించే నిమిత్తం, బెర్లిన్ సమావేశాన్ని ఏర్పరచినాయి. సమావేశానికి ఐరోపాలోని అన్ని దేశాలు, అమెరికా హాజరైనాయి. ఈ సమావేశం కాంగో స్వాతంత్రతను గుర్తించింది. బానిసత్వాన్ని, బానిస వ్యాపారాన్ని నిర్మూలించాలని కాంగో బేసిన్‌లో వ్యాపార స్వాతంత్రముండాలని అన్నిదేశాలు అంగీకరించాయి. ఇది సఫలీకృతం కాలేదు. 1914 నాటికల్లా అబిసీనియా, లైబీరియాలు తప్ప, ఆఫ్రికా ఖండాన్నంతా వివిధ ఐరోపా దేశాలు పంచుకొన్నాయి.

## 11.7 ఆసియాపై సామ్రాజ్యవాద ప్రభావం :

ప్రపంచంలో పెద్ద ఖండం ఆసియా. దీనిలో 5 పెద్ద ప్రదేశాలున్నాయి. అవి 1. సోవియట్ రష్యా 2. దూరప్రాచ్యం (చైనా, జపాన్) 3. ఆగ్నేయ ఆసియా 4. దక్షిణ ఆసియా 5. నైరుతి ఆసియా లేదా మధ్య ప్రాచ్యం. ఈ ఖండంలో జనాభా ఎక్కువ. చాలా ప్రదేశాలు వెనుకబడి ఉన్నాయి. ప్రజల్లో అధిక సంఖ్యాకులు భూమిలేని వ్యవసాయ కూలీలు, విద్యాశూన్యులు, భావాలను చెప్పలేనివారు. బీదతనం, మూఢ విశ్వాసాలు, రోగాలతో పీడింపబడ్డారు. బ్రతుకు పోరాటం ఆసియా ఖండపు ముఖ్య లక్షణం. ప్రపంచ తొలి నాగరికతలు ఇక్కడే పుట్టాయి. అవే మెసపుటోమియా, సింధూలోయ, చైనా నాగరికతలు. ప్రపంచంలోని గొప్ప మతాలన్నీ హిందూమతం, బౌద్ధమతం, యూదుమతం, జొరాష్ట్రియన్ మతం, క్రైస్తవ మతం, ఇస్లాం మతం, కన్‌ఫ్యూషియస్ మతం ఇక్కడే పుట్టాయి.

### 11.7.1 1850 కి పూర్వం ఐరోపా ఖండంతో ఆసియాకు గల సంబంధాలు :

క్రీ.శ. 1453లో ఆటోమన్ టర్క్‌లు కాన్‌స్టాంట్ నోపిల్ పట్టణాన్ని ఆక్రమించుటతో, ఐరోపాలో నూతన శకానికి నాంది పలికింది. కొత్త యుగపు లక్షణాల్లో ఒకటి ఆ కాలంలో జరిగిన భౌగోళిక ఆవిష్కరణలు. క్రీ.శ. 1498లో పోర్చుగీస్ నావికుడైన వాస్కోడిగామా భారతదేశానికి కొత్త నౌకామార్గాన్ని కనిపెట్టటంతో ఆసియాతో ఐరోపాకు ప్రత్యక్ష సంబంధాలు మొదలయ్యాయి. ఆసియాతో ప్రత్యక్ష వ్యాపార సంబంధాలను స్థాపించిన మొదటి దేశం పోర్చుగల్. పోర్చుగీస్ వ్యాపారులు ఇండియా, శ్రీలంక, సుమత్రా, చైనా, జావా, జపాన్‌లలో వర్తక కేంద్రాలు ఏర్పాటుచేశారు. కొత్త ప్రదేశాలను కనుక్కోవాలని శోధన సాగించిన ఇతర దేశాలు స్పెయిన్, ఇంగ్లాండ్, హాలండ్, ఫ్రాన్స్‌లు కూడా కలవు. 16వ శతాబ్దాంతానికి వ్యాపారానికి తోడు క్రైస్తవ మిషనరీలు

కూడా వచ్చి ఆయాదేశ ప్రజలను ధనాన్ని కొల్లగొట్టుటకు, మత మార్పిడులకు ప్రయత్నించాయి. ఎ) 18వ శతాబ్దాంతానికి ఫ్రెంచి వారిని వెళ్ళగొట్టి, భారతదేశంలో ఇంగ్లాండ్ గుత్తాధికారి అయింది. చైనా, జపాన్‌లలో కూడా కొన్ని సదుపాయాలు పొందింది. బి) ఫ్రెంచి మిషనరీలు, వ్యాపారులు ఇండో చైనాలో తమ స్థావరాలను ఏర్పాటు చేశారు. సి) పోర్చుగీస్ వారు ఇండియాలో గోవా, డయ్యూ, డామన్‌లను, హాంగ్‌కాంగ్ సమీపంలోని మాకో ద్వీపాన్ని నిలబెట్టుకోగలిగారు. డి) డచ్చివారు (హాలండ్) తూర్పు ఇండియా దీవులను, జపాన్‌లో దెషియా ద్వీపాన్ని ఆక్రమించారు.

19వ శతాబ్ది తొలిదశలో జరిగిన నల్లమందు యుద్ధాల ద్వారా విదేశీయులు చైనాలో ప్రవేశించారు. సంస్కృతీ పరంగా నిజమైన పాశ్చాత్యీకరణ జరగలేదు.

## 11.7.2 1850 తర్వాత ఆసియాలో ఐరోపా దేశాల ప్రాబల్యం :

ఐరోపాలోని కొత్త సామ్రాజ్యవాదం విస్తృతమై పారిశ్రామిక విప్లవం దీన్ని మరింత ముందుకు తీసుకెళ్ళింది. ముడిపదార్థాల సేకరణకూ, తయారైన వస్తువులను అమ్మడానికి, మిగులు మూలధనాన్ని పెట్టుబడి పెట్టడానికి, అనువైన వలస స్థావరాలకై, ఆసియాలో కూడా, పారిశ్రామికీకరణ సాధించిన ఐరోపాదేశాల మధ్య కుమ్ములాట మొదలైంది.

### 11.7.2.1 ఇంగ్లాండ్ :

ఇండియా, బర్మా, బెలూచిస్తాన్, సింగపూర్, మలక్కా, బోర్నియో, ఏడెన్, కువైట్‌లను సంపాదించటమేకాక, దక్షిణ పర్షియాను, చైనా నుండి హాంగ్‌కాంగ్‌ను, టిబెట్‌ను సంపాదించింది. 20వ శతాబ్దపు ప్రారంభానికల్లా, ఆసియాలో 3వ వంతు జనాభాను గ్రేట్ బ్రిటన్ పరిపాలించసాగింది.

### 11.7.2.2 ఫ్రాన్స్ :

ఇండో చైనాను, భారతదేశంలో కొన్ని వర్తక స్థావరాలను, సయాం, చైనాలలో కూడా కొంత ఆధిక్యతను సంపాదించుకొన్నది.

### 11.7.2.3 హాలండ్ :

డచ్ ప్రాచ్య భారత సామ్రాజ్యాన్ని, సుమత్రా, జావా, సెలిబస్ దీవులను, బోర్నియోలో రెండు వంతులను, కొత్త గినియాను సంపాదించింది.

### 11.7.2.4 పోర్చుగల్ :

ఇండియాలో కొన్ని వర్తక స్థావరాలు, చైనాలో మకావో రేవు పట్టణాన్ని సంపాదించింది.

### 11.7.2.5 జర్మనీ (1880) :

కొత్త ఈశాన్య గినియాను, చైనా నుండి కియాషో రేవును సంపాదించింది.

### 11.7.2.6 రష్యా :

సైబీరియాను, తుర్కీస్తాన్, పడమర, మధ్య ఆసియాను, ఉత్తర పర్షియాను, భారతదేశం వరకూ ఉన్న భూభాగాన్ని సంపాదించింది.

### 11.7.2.7 అమెరికా :

ఆగ్నేయ ఆసియాలో, పసిఫిక్ తీరంలో భూభాగాలు, ఫిలిప్పైన్స్ దీవులు సంపాదించింది.

## 11.7.3 దూర ప్రాచ్యం :

దూర ప్రాచ్యంలోని చైనా, జపాన్, సయాం దేశాలు, మధ్య ప్రాచ్య ప్రాంతాలయిన, ఆటోమన్ సామ్రాజ్యం, పర్షియా, ఆఫ్ఘనిస్తాన్, అరేబియాలు. ఈ దేశాలన్నీ పాశ్చాత్యుల భౌతిక నాగరికత పట్ల ఆకర్షితులైనప్పటికీ, ఇవి పూర్తిగా ఐరోపా ఆధిక్యతకు లోబడలేదు.

### 11.7.3.1 జపాన్ :

1853 దాకా జపాన్ చాలా వెనుకబడిన దేశం. ఇతరులతో సంబంధం లేకుండా కాలం వెళ్ళబుచ్చుతున్న దేశం. జపాన్ దేశ చట్ట ప్రకారం 1. విదేశీయులు జపాన్‌పై అడుగుపెట్టటానికి వీలు లేదు. 2. అదే విధంగా జపనీయులు ఇతరదేశాలకు వెళ్ళటానికి వీలులేదు. ముఖ్యంగా 1638 నుండి 1853 వరకు జపాన్‌తో ఐరోపాకు, ఐరోపాతో జపాన్‌కు ఎలాంటి సంబంధాలు లేవు. 1853లో కమ్మోడోర్ మ్యాథ్యూ ఫెర్రీ నాయకత్వంలో అమెరికా నౌకాదళం, జపాన్ సముద్ర తీరానికి వెళ్ళి, జపాన్ రేవులు అమెరికా వ్యాపారార్ధమై, తెరవబడాలని కోరింది. 1854లో జపాన్ రాజు అమెరికాతో ఒక ఒప్పందాన్ని చేసుకొన్నాడు. దాని ప్రకారం జపాన్ ఇద్దరు అమెరికా వ్యాపారులను, రెండు జపాన్ రేవులను సందర్శించి అనుమతినిచ్చింది. వెంటనే బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, హాలెండ్, రష్యా తమ తమ నౌకాదళాలను పంపి, అమెరికా లాగానే రేవుల సందర్శన అనుమతిని పొందాయి. ఫలితంగా జపాన్‌లో అంతఃకలహం మొదలై విప్లవం (1867-1868) వచ్చింది. విప్లవంలో పురోగామి వాదులు విజేతలై జపాన్ రూపురేఖల్ని మార్చివేసిరి.

#### 11.7.3.1.1 జపాన్ ఐరోపీకరణ :

మట్సుహిటో (1867-1912) పరిపాలనా కాలంలో జపాన్ శీఘ్రంగా పాశ్చాత్యీకరణ సాధించింది. 1871లో భూస్వామ్య వ్యవస్థ తొలగించబడింది. జపాన్ యువకులను విదేశాలకు పంపడం, విదేశీయులను స్వదేశానికి ఆహ్వానించడం జరిగింది. దేశంలోని రాజకీయ, విద్య, సైనిక, ఆర్థిక, పారిశ్రామిక సంస్థలను ఆధునికీకరించడం జరిగింది. 19వ శతాబ్దాంతానికల్లా జపాన్ సమర్థవంతమైన సైనిక నావికాబలాన్ని సమకూర్చుకోగల్గింది. 20వ శతాబ్దపు మొదటి దశాబ్దాంతానికల్లా అమెరికా, ఐరోపాల స్థాయిలో జపాన్ త్వరితంగా పారిశ్రామికీకరణను సాధించింది.

#### 11.7.3.1.2 జపాన్ సామ్రాజ్యవాదం :

ప్రగతిని సాధించిన జపాన్ సామ్రాజ్యవాదానికి ఒడిగట్టింది. చైనా వ్యవహారాల్లో జోక్యం అధికం చేసింది. 1894లో చైనా-జపాన్ యుద్ధం జరిగి, చైనా ఓడిపోయింది. 1895లో జరిగిన షిమోనోసేకీ ఒడంబడిక ప్రకారం చైనా, జపాన్‌కు కొరియాను అర్పించింది. జపాన్ బలానికి భయపడిన పాశ్చాత్య దేశాలు రష్యా, జర్మనీ, ఫ్రాన్స్‌లు చైనాను సమర్ధించాయి. అందువల్ల జపాన్ రష్యాపై పగతీర్చుకోవడానికి నిర్ణయించుకొన్నది. 1902లో జపాన్-బ్రిటన్‌తో మిత్రపక్షపు సంధి చేసుకొన్నది. యింతలో రష్యా మంచూరియాను ఆక్రమించి తన సైన్యాన్ని కొరియా సరిహద్దుల వైపుగా నడిపింది. అంతట జపాన్-రష్యాపై 1904-05లలో యుద్ధం చేసింది. జపాన్ విజేత అయింది. ఫలితంగా పోర్ట్స్ మౌత్ సంధి జరిగింది (1905). ఈ సంధి ప్రకారం 1. రష్యా జపాన్‌కు ఆర్థర్ రేవును, లియాటుంగ్ ద్వీపకల్పాన్ని తిరిగి యిచ్చివేసి కొరియాపై కూడా జపాన్ ఆధిక్యతను గుర్తించింది.

2. కొరియా మంచూరియాల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోనని రష్యా ప్రకటించింది. 3. 1910లో జపాన్-కొరియాను కలుపుకొన్నది. ఈవిధంగా జపాన్ మొదటి ప్రపంచ యుద్ధం నాటికి ఒక అగ్రగామి దేశంగా అభివృద్ధి చెందింది.

### 11.7.3.2 చైనా సామ్రాజ్యం :

చైనా సామ్రాజ్యం చాలా పురాతనమైంది. ఉన్నత నాగరికత కలది. ఇది కూడా పాశ్చాత్య దేశాల వ్యాపార మార్కెట్లకై సాగించిన సామ్రాజ్యవాద పెనుగులాటలో బలిపశువైంది. చైనా సామ్రాజ్యం చాలా పెద్దది. యిందు మంచూరియా, మంగోలియా, సింకియాంగ్, టిబెట్ లాంటి రాష్ట్రాలున్నాయి. చైనా చాలా వరకు ఐరోపా దేశాలకు లొంగలేదు. కానీ ఐరోపా దేశాలు వరుసగా దండయాత్రలు సల్పి, చైనా కొంత భూభాగాన్ని వదలుకొనేటట్లుగాను, వ్యాపార హక్కులు కల్పించే విధంగాను బలవంతం చేశాయి.

### 11.7.3.2.1 చైనాపై ఐరోపావారి దురాక్రమణ :

చైనా నల్లమందు వ్యాపారాన్ని నిషేధించింది. అయినా నల్లమందు దొంగ వ్యాపారం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. 1839లో దొంగ వ్యాపారాన్ని (Smuggling) అరికట్టడానికై నియమింపబడిన ప్రత్యేక కమీషనర్ 20,000 నల్లమందు పెట్టెలను తన అధీనంలోనికి తీసుకొని, వాటినన్నింటిని ధ్వంసం చేసినాడు. మొదటి నల్లమందు యుద్ధం (1839-42) జరిగింది. చైనీయులు ఓడిపోయారు. ఫలితంగా నాన్ కింగ్ ఒడంబడిక (1842) జరిగింది. దీని ఫలితంగా 1. చైనా చాలా పెద్ద మొత్తంలో బ్రిటన్‌కు నష్టపరిహారం యివ్వాల్సివచ్చింది. 2. హాంగ్ కాంగ్‌ను బ్రిటన్‌కు అప్పగించటమేకాక, కాంటన్, అమోయ్ నిన్‌పో, ఫూచౌ, షాంఘైలను బ్రిటన్‌కు యిచ్చింది. దీనిని అవకాశంగా తీసుకొని అమెరికా, ఫ్రాన్స్, బెల్జియం, ప్రష్యా, హాలెండ్, పోర్చుగల్‌లు సంధులు చేసుకొని, బ్రిటన్‌లాగా హక్కులు పొందాయి. ఈ ఒడంబడికలు మంచూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడంతో ఇంకా పాశ్చాత్య దేశాల చొరబాటు ఆగలేదు. ఫలితంగా రెండో నల్లమందు యుద్ధం (1856-60) జరిగింది. యిందు ఇంగ్లీష్ ఫ్రెంచివారు పాల్గొన్నారు. మళ్ళీ చైనా ఓడిపోయింది. టియన్‌ట్సిన్ (1860) సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం 1. చైనా విదేశీ వ్యాపార నిమిత్తమై ఇంకా 6 అదనపు రేవులను అనుమతించాలని 2. నల్లమందు వ్యాపారాన్ని చట్టబద్ధం చేయుటకు 3. విదేశీ మంత్రులను పెకింగ్‌నకు ఆహ్వానించుటకు 4. క్రైస్తవ మిషనరీల కార్యక్రమాలపై పరమత సహనాన్ని చూపించాలని 5. దేశం అంతర్భాగంలో ప్రయాణించే విదేశీయులకు యోగ క్షేమాలు కల్పించబడాలని చైనా అంగీకరించింది.

ఈ విధంగా సామ్రాజ్యవాద శక్తులు చైనాలో తమ పలుకుబడిని పెంచుకొన్నాయి. అవి. 1. గ్రేట్ బ్రిటన్ - యాంగ్ ట్సె లోయలోను 2. రష్యా - మంచూరియా, మంగోలియాలపై 3. ఫ్రాన్స్ నైఋతీ చైనాలో 4. జర్మనీ షాంటుంగ్‌లోను, ఫుకియాన్ పైన తన పలుకుబడిని పెంచుకొన్నాయి.

### 11.7.3.2.2 అమెరికా ఓపెన్ డోర్ విధానం :

సామ్రాజ్యవాదశక్తుల మధ్య వైరమే చైనాను ముక్కలు కాకుండా కాపాడింది. ముఖ్యంగా బ్రిటన్, అమెరికాలకు యిన్నిదేశాలు చైనాను పంచుకోవటం యిష్టంలేదు. 1899లో అమెరికా రాజ్య కార్యదర్శి (Secretary of State) జాన్ హే ఈ ఓపెన్ డోర్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినాడు. యిందులో "చైనాలో రేవులు వ్యాపారానికై, పెట్టుబడికై విదేశీ పౌరులందరికి సమాన ప్రాతిపదికపై, తెరచి ఉండాలని" నొక్కి చెప్పిందీ సిద్ధాంతం.

### 11.7.3.2.3 ప్రతిచర్య సంస్కరణలు :

ఐరోపా దేశాలు చైనాలోకి చొరబడడంతో, చైనా ప్రజలు ఆర్థికంగా నష్టపోయారు. మంచూ పరిపాలకుల బలహీనత బహిర్గతమైంది. ప్రజలకు ప్రభుత్వంపై గౌరవం నశించింది. సామ్రాజ్యమంతా విప్లవ భావాలతో నిండిపోయింది. ఫలితంగా హంగ్‌సిన్ చువాన్ నాయకత్వంలో, తైపింగ్ తిరుగుబాటు (1850-65) సంభవించింది. అయితే దీనిని మంచూ పాలకులు అణచివేసి, పాలనా సంస్కరణలను ప్రవేశపెట్టిరి. ఇవి చైనా సాంప్రదాయవాదులకు నచ్చలేదు. దానితో 1898 సెప్టెంబర్‌లో త్సు-సీ- రాణి తలపెట్టిన కుట్రతో సేనాని యువాన్ - షి- కై చక్రవర్తిని బంధించినాడు. సంస్కరణలు రద్దు చేయబడ్డాయి.

### 11.7.3.2.4 బాక్సర్ తిరుగుబాటు (1899-1901) :

త్సు-సీ-రాణి ప్రోత్సాహంతో, తిరుగుబాటు దారులలోని సాంప్రదాయక వర్గం చైనాలో రహస్య సంఘాలనేర్పరచింది. అలాంటి రహస్య సంఘాల్లో ఒకటి "బాక్సర్లు" (దేశభక్తి భావనతో స్వధర్మ రక్షణకై పిడికిలిని ముడిచినవారు) వీరు విదేశీయులను తమ దేశాన్నుండి తరిమివేయాలని నిర్ణయించినారు. వీరు హింసాకాండకు దిగి, మతప్రచారకులను హత్యచేయటం, రైల్వేలను నాశనం చేయటం, విదేశీయుల ఇండ్లకు నిప్పు పెట్టటం వంటి చర్యలకు దిగారు. 1900 వ సంవత్సరానికల్లా ఈ ఉద్యమం చైనాలోని అన్ని ప్రముఖ నగరాలకు వ్యాపించింది. పెకింగ్‌లో పతాకస్థాయికి చేరుకొన్నది. అందువల్ల సామ్రాజ్యవాద శక్తులన్నీ కలసి చర్చించి రష్యా, బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, జపాన్‌ల సైనిక భాగాలతో ఒక అంతర్జాతీయ సైనిక కూటమిని ఏర్పరచి బాక్సర్లను అణచివేయుటకు చైనా మీదకు దండెత్తినాయి. ఈ దాడిలో బాక్సర్లు తీవ్రంగా అణచివేయబడిరి. దాని ఫలితంగా విదేశీ రాజ్యాలతో చైనా ఒడంబడిక చేసుకొన్నది. దీని ప్రకారం 1. 333 మిలియన్ డాలర్ల మేరకు నష్టపరిహారం యివ్వడం, 2. విదేశీయులు ఆస్తులను పరిరక్షించడం 3. పెకింగ్, టియన్‌టిన్ నగరాలలో విదేశీశక్తులు తమ ఆత్మరక్షణార్థం సైన్యాలను నిలుపుకోవటం.

### 11.7.3.2.5 చైనా విప్లవం (1911-1912) :

ఈ విధంగా సామ్రాజ్యవాద శక్తుల చేతుల్లో చైనా ఆక్రమించబడి, దోపిడీకి గురైంది. విదేశాలలో చదువుకొని, పాశ్చాత్య భావాలకు లోనైన యువతరానికి చెందిన చైనా మేధావులకు ఈ పరిస్థితి బాధాకరమైంది. అందువల్ల చైనా పునరుజ్జీవనం పొందాలంటే మంచూ వంశం, వారి సాంప్రదాయ పరిపాలన తొలగిపోవాలనే నిర్ణయానికి వచ్చారు. వీరికి నాయకుడు సన్ యట్ సేన్. ఇతడు డాక్టరు వృత్తిని వదలి, విద్యార్థుల్లో, సైనికుల్లో విప్లవ బీజాలు నాటినాడు. ఆయన విప్లవ చర్యలకు వ్యతిరేకించిన ప్రభుత్వం 1895లో దేశం నుండి బహిష్కరించింది. బహిష్కరణలో కూడా విప్లవ కార్యకలాపాలు నడిపినాడు. చాలా ప్రాంతాలు ఆక్రమించబడినాయి. ఇంతలో రాణి, చక్రవర్తి మరణించిరి. 1911 నాటికి విప్లవం విజయవంతమై సన్‌యట్‌సేన్ అధ్యక్షుడుగా, నాన్‌కింగ్‌లో తాత్కాలిక ప్రజా ప్రభుత్వమేర్పడింది. 1912 నాటికి చైనాలో మంచూ వంశపాలన అంతరించింది. ఆవిధంగా 1912 నాటికి చైనా విప్లవం విజయవంతమై, చైనాను ప్రజా ప్రభుత్వంగా ప్రకటించింది.

### 11.7.4 భారతదేశంలోని పరిపాలన బ్రిటీష్ వారి చేతిలోనికి పోవటం :

క్రీ.శ. 1498 లో వాస్కోడిగామా ఇండియాకు కొత్త సముద్రమార్గాన్ని కనుగొనటంతో ఐరోపావాసులు భారతదేశానికి రాసాగిరి. భారతదేశంలో వ్యాపారకేంద్రాలను స్థాపించిన వారిలో మొదటివారు పోర్చుగీస్‌లు. తర్వాత డచ్చి, ఇంగ్లీష్, ఫ్రెంచివారు కూడా స్థాపించిరి. ఐరోపా దేశాల మధ్య, భారతదేశంలో వ్యాపారగుత్తాధిపత్యానికై సాగిన తీవ్రపోరాటంలో ఇంగ్లీష్, ఫ్రెంచివారు మిగిలిపోయారు. అప్పుడు భారతదేశాన్ని మొగల్ వంశస్తులైన మహ్మదీయ చక్రవర్తులు పాలించుచుండిరి. 1757లో జరిగిన ప్లాసీ

యుద్ధంలో ఫ్రెంచివారిని ఓడించి రాబర్ట్ క్లైవ్ భారత దేశంలో బ్రిటీష్ పరిపాలనను సుస్థిరం చేసినాడు. 1818 నాటికల్లా బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశానికి యజమాని అయింది.

1857లో భారతదేశంలో బ్రిటీష్ వారి పరిపాలనకు సిపాయి కలహంతో అంతరాయమేర్పడింది. బ్రిటీష్‌వారు ఈ కలహాన్ని అణచివేసినా ఫలితం మాత్రం భారతదేశంలో మొగలాయి పరిపాలన అంతరించటం మరియు ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలన కూడా అంతరించడం జరిగింది. 1858 లో బ్రిటీష్ పార్లమెంట్ 'సుదృఢ భారత ప్రభుత్వ చట్టాన్ని" (Better Government of India Act) ఆమోదించింది. దీని ప్రకారం ఈస్ట్ ఇండియా కంపెనీ రద్దయింది. బ్రిటీష్ ప్రభుత్వం స్వయంగా తానే పరిపాలన చేపట్టి, భారతదేశపు పూర్తి బాధ్యతను వహించింది.

### 11.7.4.1 భారతదేశంపై బ్రిటీష్ వారి అధికారం :

బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశ పరిపాలనను చేపట్టినప్పుడు, బ్రిటీష్ ఇండియా భిన్న ప్రకృతుల దేశం. భౌగోళిక భేదాలతో బాటు, అనేక జాతుల, భాషల, మతాల, సంస్కృతుల కలగలుపు. బ్రిటీష్ రక్షణలో పేరుకు మాత్రం స్వతంత్రాన్ని కల్గినా 700 స్వదేశీ సంస్థానాలు ఉన్నాయి. ఇంత భిన్న ప్రకృతి కల్గిన భారత దేశాన్ని పరిపాలించడానికై, బ్రిటీష్ ప్రభుత్వం రెండు పద్ధతులను అవలంభించింది. అవి 1. నేరుగా బ్రిటీష్ పరిపాలనలో ఉన్న భారత భాగం "భారత సామ్రాజ్యం" అని ఇంగ్లాండ్ రాజ ప్రతినిధి (Viceroy) చేత పరిపాలించబడటం. 2. బ్రిటీష్ ఆధిక్యాన్ని అంగీకరించిన దేశీయ ప్రభువులచే పాలించబడే స్వదేశీ సంస్థానాలు, రాజ ప్రతినిధి పర్యవేక్షణలో కొనసాగటం.

బ్రిటీష్ సామ్రాజ్యంలో ఒక భాగంగా భారత దేశం బాగా అభివృద్ధి చెందింది. రోడ్లు, రైలు మార్గాలు, వ్యవసాయోత్పత్తులు, పరిశ్రమలు, రేవులు, పరిశుభ్రత, ప్రజారోగ్యం అభివృద్ధి చెందాయి. బ్రిటీష్ అధికార్లతో భారత సైన్యం ఏర్పాటైంది. అయినప్పటికీ, భారత జాతీయుల్లో జాతీయ భావనలు రగుల్కొన్నాయి. దాని ఫలితంగా 1885 లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది. ఈ సంస్థ ద్వారా భారత జాతీయోద్యమం కొనసాగి 1947 ఆగస్ట్ 15వ తేదీన స్వాతంత్ర్యం సిద్ధించింది.

### 11.7.5 సయాం, పర్షియా తదితర రాజ్యాలు :

తన స్వాతంత్ర్యం కోల్పోకుండా, ఐరోపా ఆధిక్యతకు లొంగిన దూర ప్రాచ్యంలోని మరో దేశం సయాం. బ్రిటన్, ఫ్రాన్స్‌లు సయాం సరిహద్దు రాష్ట్రాలను హస్తగతం చేసుకొన్నాయి. 1896లో తమ పలుకుబడిని విస్తరించుకొనే ప్రదేశంగా మొత్తం దేశ విభజనకు అంగీకరించాయి. అయితే స్వతంత్ర సయాంను రెండు దేశాలు తమ ఆస్తుల మధ్య రక్షణగా ఉన్న దేశంగా గుర్తించడంతో, పాక్షికంగా ఆ దేశం రక్షించబడింది.

మహ్మదీయ ప్రాంతాలు కూడా ఐరోపా వారి ప్రభావానికి లోనైనాయి. ఈ ప్రాంతంలోని ముఖ్య దేశాలు పర్షియా, బెలూచిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్, టర్కీస్థాన్ మొదలైనవి. రష్యా - పరిష్యా, ఆఫ్ఘనిస్థాన్‌ల వైపు విస్తరించాలని ప్రయత్నించడం ఇంగ్లాండ్‌నకు నచ్చలేదు. 1878-1881 ల మధ్య ఇంగ్లాండ్ - రష్యాలకు యుద్ధాలు జరిగాయి. ఫ్రెంచి మధ్యవర్తిత్వంతో యిరుదేశాలు మళ్ళీ దగ్గరైనాయి.

## 11.8 సామ్రాజ్యవాద ఫలితాలు :

### 11.8.1 ఆధునికీకరణ :

ఐరోపా సామ్రాజ్యవాదం ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. ఐరోపా రాజ్యాలు వలస స్థావరాలను సంపాదించటంతో, ఐరోపా నాగరికత అన్ని ఖండాలకు వ్యాపించింది. అప్పటి దాకా చీకటి ఖండంగా ఉన్న ఆఫ్రికా మరియు ఆసియా, ఐరోపా దేశాల

సంబంధ బాంధవ్యాలతో చాలా లాభపడ్డాయి. బానిస వ్యాపారం నిర్మూలించబడింది. ఆఫ్రికా తెగలు, క్రైస్తవ మత ప్రభావానికి లోనైనాయి. పాశ్చాత్య విద్య వల్ల లాభాలు పొందారు. పాశ్చాత్య పద్ధతిలో ప్రభుత్వపాలన సాగింది. వలస స్థావరాలు మెల్లగా స్వయం పాలన పొందాయి. రైల్వేలు, తంతి, తపాలా సౌకర్యాలు, విద్యావకాశాలు మెరుగైనాయి. ఆసియా, ఆఫ్రికాలు పాశ్చాత్యుల అధీనంలో గొప్ప ఆర్థిక ప్రగతిని సాధించినాయి.

### 11.8.2 ఆర్థిక దోపిడీ :

సామ్రాజ్యవాదం వల్ల చెడు ఫలితాలు కూడా కలిగాయి. వాటిలో ప్రధానమైనది ఆర్థికపరమైన దోపిడీ. మాతృదేశ లాభం కోసం, వలస స్థావరాల దోపిడీ ఉధృతంగా సాగింది. ఖనిజాలను, ముడిపదార్థాలను తమ కర్మాగారాలకై ఐరోపా దేశాలు తీసుకుపోయేవి. తయారైన వస్తువులను మళ్ళీ వలస స్థావరాలకు తెచ్చి ఎక్కువ ధరకు అమ్మేవి.

### 11.8.3 జాతి వివక్షత :

సామ్రాజ్యవాదం ఆఫ్రికా, ఆసియాలలో వర్ణవివక్షతకు దారితీసింది. ఆఫ్రికాలోని నల్లవాడి మీద, ఆసియాలో గోధుమ రంగు వారిపై తెల్లవాడి ఆధిక్యత, వర్ణ వివక్షతకు మార్గాన్ని చూపింది. ఇంగ్లీష్‌వారు ఆఫ్రియావాసులను బానిసలుగా చేశారు. ఈ వర్గ వివక్షత జాతి వివక్షత, స్థానిక ప్రజలను స్వపరిపాలన వైపు దృష్టిని మళ్ళించేటట్లు చేశాయి.

### 11.8.4 ఇతర ఫలితాలు :

సామ్రాజ్యవాదం గొప్ప దేశాల మధ్య తీవ్ర వైషమ్యాలకు దారితీసింది. ఈజిప్టు, సూడాన్ వ్యవహారాలు ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల మధ్య యుద్ధానికి దారితీసినాయి. ట్యూనీషియా సమస్యపై ఇటలీ, ఫ్రాన్స్‌లు శత్రువులయ్యాయి. బోయర్ యుద్ధాలు - ఇంగ్లాండ్, జర్మనీల మధ్య వైరాన్ని పెంపొందించినాయి. మొరాకో సమస్య ఫ్రెంచి - జర్మన్‌లకు మధ్య వైరాన్ని పెంచింది. వలస స్థావరాల సంపాదనలో ప్రారంభమైన ఈ వైరం చివరికి మొదటి ప్రపంచ యుద్ధ సమయానికి రెండు సాయుధ కూటాలుగా ఏర్పడినాయి. జర్మనీ, ఆస్ట్రియా, ఇటలీలు త్రిపక్షకూటమిగాను, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యాలు - త్రిపక్ష అవగాహనగాను ఆవిర్భవించాయి. ఈ విధంగా మొదటి ప్రపంచ యుద్ధ ప్రారంభానికి సామ్రాజ్యవాదం ఒక కారణమైంది.

### 11.9 నమూనా ప్రశ్నలు :

1. ఆఫ్రికాలో వలస స్థావరాలకై జరిగిన పోటీని వివరింపుము.
2. సామ్రాజ్యవాదం
3. వలసవాదం
4. అమెరికా ఓపెన్‌డోర్ విధానం
5. బాక్సర్ తిరుగుబాటు

### 11.10 చదువదగిన గ్రంథాలు :


1. Gooch G.P. - History of Modern Europe (1878-1919)
2. Great & Temperly - Europe in the 19th, 20th Centuries
3. Hazen C.D. - Europe since - 1815
4. Hazen C.D. - Modern Europe upto 1945
5. Hayes C.J.H. - Contemporary Europe Since 1870
6. Marriot J.A.R. - A History of Europe from 1815 to 1839
7. Snellgrase I.E. - The Modern World Since 1870
8. Taylor A.J.P. - The Struggle for Mastery in Europe (1848 to 1918)


- శ్రీ పి. లక్ష్మీనారాయణ

పాఠం - 12

# మొదటి ప్రపంచ యుద్ధము - వర్సే సంధి, ఇతర సంధులు

## 12.1 మొదటి ప్రపంచ యుద్ధము (1914-1918)

**12.1.0 లక్ష్యం :**

మానవాళికి దురదృష్టకరంగా పరిణమించిన మొదటి ప్రపంచ యుద్ధ కారణాలు, గమనం, ఫలితాలు, యుద్ధ స్వభావం గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**

**12.1.1 పరిచయం**

**12.1.2 మొదటి ప్రపంచయుద్ధ కారణాలు**

**12.1.2.1 రహస్య కూటముల ఏర్పాటు**

**12.1.2.2 యూరప్ దేశాల సైనిక విధానము**

**12.1.2.3 తీవ్ర జాతీయవాదం**

**12.1.2.4 సామ్రాజ్యవాదం**

**12.1.2.5 జర్మనీలో యుద్ధోన్మాదం**

**12.1.2.6 మొరాకో సమస్య**

**12.1.2.7 బాల్కన్ సమస్య**

**12.1.2.8 అగాడిర్ సంఘటన**

**12.1.2.9 ఇటలీ విధానం**

**12.1.2.10 ఫ్రాన్స్ విధానం**

**12.1.2.11 వార్తా పత్రికలు**

**12.1.2.12 అంతర్జాతీయ శాంతిసాధన లేకపోవడం**

**12.1.2.13 సన్నిహిత కారణం**

**12.1.3 యుద్ధ గమనం**

**12.1.3.1 మొదటి దశ (1914-1917)**

**12.1.3.2 రెండోదశ (1917-1918), అమెరికా ప్రవేశం**

**12.1.4 యుద్ధ ఫలితాలు**

**12.1.4.1 నిరంకుశ రాచరిక ప్రభుత్వాల స్థానే రిపబ్లికన్ ప్రభుత్వాల ఏర్పాటు**

**12.1.4.2 నూతన జాతీయ రాజ్యాల ఆవిర్భావం**

**12.1.4.3 ఆసియా, ఆఫ్రికాలలో స్వయం నిర్ణయ సూత్రాల వ్యాప్తి**

**12.1.4.4 ప్రపంచ రాజకీయాలలో అమెరికా పాల్గొనడం**

**12.1.4.5 బోల్షివిక్ విప్లవం**

**12.1.4.6 టర్కీకి కల్గిన నష్టాలు**

**12.1.4.7 హిట్లర్ విజృంభణ**

**12.1.4.8 అపార ధన, ప్రాణ నష్టములు**

**12.1.4.9 నానాజాతి సమితి ఆవిర్భావము**

**12.1.4.10 ఆర్థిక సంక్షోభము**

**12.1.5 యుద్ధ స్వభావము**

**12.1.6 ముగింపు**

**12.1.7 నమూనా ప్రశ్నలు**

**12.1.8 చదువదగిన గ్రంథాలు**

## 12.1.1 పరిచయం :

మానవ మారణ హోమానికి కారణమైన మొదటి ప్రపంచ యుద్ధం (1914-1918) కనీవినీ ఎరుగనిది. ఈ యుద్ధం ఊహించని విషాదాంత సంఘటన కాదు. 1871 నుండి ఐరోపాలోని పరిస్థితులు యుద్ధానికి దారితీసేటట్లుగా వున్నాయి. పరిస్థితులు విషమంగా ఉన్నప్పటికీ పెద్ద రాజ్యాలు 1914 వరకు శాంతియుతంగా వుండడానికే ప్రయత్నించాయి. ఇలాంటి ప్రశాంతతనే 'సాయుధ శాంతి' అని, ఈ కాలాన్ని 'సాయుధ శాంతి యుగం' అని పేర్కొనడం జరిగింది. ఈ యుగ ముఖ్య లక్షణాలు పారిశ్రామికీకరణ, కార్మికవర్గ ఉద్యమం, దురుసు జాతీయవాదం. ఈ కాలంలోనే ఐరోపా ఖండంలోని చాలా దేశాలు పారిశ్రామికీకరణను సాధించి, ఆర్థికాభివృద్ధిని చూరగొన్నాయి. ఐరోపా పారిశ్రామికీకరణ వలన ముడిపదార్థాల సంపాదనకు, తయారయిన వస్తువుల విక్రయానికి వలస స్థావరాలు ఎంతో అవసరమయ్యాయి. ఐరోపా రాజ్యాల ఈ దాహానికి ఆసియా, ఆఫ్రికా దేశాలు బలి అయ్యాయి. స్థావర శోధన రాజ్యాల మధ్య వలస స్థావర శతృత్వానికి, పోటీకి దారితీసింది. ఈ యుద్ధాలు చిన్నవి. అంతేగాక ఇవి ఒక ప్రదేశానికి పరిమితమైనవి. పారిశ్రామికీకరణ వలన ఐరోపాలో కార్మికుల సంఖ్య పెరిగింది. కార్మికుల స్థితిగతులు మెరుగుకావడానికి అనేక సాంఘిక, మానవతా ఉద్యమాలు బయలుదేరాయి. ఫలితంగా ఐరోపాలోని కొన్ని రాజ్యాలు కార్మికుల పరిస్థితిని మెరుగుపరచడానికి చట్టాలను ప్రవేశపెట్టాయి. దీనివలన కార్మికులకు, పెట్టుబడిదారీ దేశాలకు మధ్య యుద్ధం తొలగిపోయింది. జాతీయతా వాదం దేశాలమధ్య సత్సంబంధాలను దెబ్బతీశాయి. ఆల్సేస్-లోరేయిన్‌లు జర్మనీ - ఫ్రాన్స్‌ల మధ్య వివాదానికి కారణమయ్యాయి. ట్యుటానిక్ జాతులైన జర్మన్, ఆస్ట్రియాల ప్రజలకు స్లావ్ జాతులయిన రష్యా, సెర్బియా ప్రజలకు మధ్య వైరముంది. బోస్నియా, హెర్జ్‌గోవినాలను ఆస్ట్రియా ఆక్రమించడం సెర్బియా, రష్యాల నిరసనకు కారణమయింది. ఇటాలియన్లు ఆస్ట్రియాను తమజాతి శత్రువుగా పరిగణించసాగారు. ఐరోపా నుండి టర్కీ బహిష్కరణ తరువాత బాల్కన్ రాజ్యాల మధ్య శతృత్వం, పోటీ అధికమయ్యాయి. 1907 నాటికి ఐరోపా ఖండం రెండు సాయుధ శిబిరాలుగా విడిపోయింది. ఈ రెంటిమధ్య అనారోగ్యకరమైన ఆయుధ సేకరణకై పోటీ కూడా సాగింది. ఐరోపా శాంతికి అనేకసార్లు ప్రమాదం ఏర్పడినా భారీయుద్ధం జరగలేదు, 1914 వరకు వాయిదా పడింది.

## 12.1.2 మొదటి ప్రపంచ యుద్ధానికి కారణాలు :

మొదటి ప్రపంచ యుద్ధము యూరప్‌లో 1914లో ప్రారంభమయి, క్రమంగా ప్రపంచమంతా వ్యాపించింది. మానవజాతి చరిత్రలో ఇటువంటి యుద్ధం ఇంతకు పూర్వమెప్పుడూ జరగలేదు. అందువల్లనే ఈ యుద్ధాన్ని మొదటి ప్రపంచ యుద్ధమనవచ్చు.

యూరప్‌లో కొన్ని సంవత్సరాలుగా జరుగుతూ ఉన్న పరిణామాలు ఈ యుద్ధానికి దారితీసినాయి. వీటిలో ఈ క్రింది పరిణామాలను ప్రధానంగా పేర్కొనవచ్చు.

### 12.1.2.1 రహస్య కూటముల ఏర్పాటు :

జర్మనీ, ఆస్ట్రియా - హంగరీలు 1879లో, తమ రక్షణార్థం, రష్యాకు వ్యతిరేకంగా ఒప్పందం చేసుకొన్నాయి. అది అలా, రెండు దేశాల మిత్రపక్షమయింది. 1882లో ఇటలీ ఈ మిత్రపక్షంతో చేరగా అది త్రిరాజ్యకూటమి అయింది. బిస్మార్క్ జర్మనీకి ఛాన్సలర్‌గా వున్నంతకాలం ఫ్రాన్స్, రష్యాలు ఒక దగ్గరకు రాకుండా యత్నించాడు. అయితే 1890లో బిస్మార్క్ తన పదవి నుంచి తప్పుకొన్న తర్వాత జర్మనీ రష్యాను లక్ష్యపెట్టలేదు. అప్పటి నుండి రష్యా ఫ్రాన్స్ వైపు మొగ్గుచూపనారంభించింది. ఫ్రాన్స్ కూడా రష్యాతో స్నేహ సంబంధాలకై ప్రయత్నించసాగింది. అలా 1894 లో ఫ్రాన్స్ - రష్యా మిత్రకూటమి ఏర్పడింది. ఇంగ్లాండ్ తన ఏకాంత విధానానికి స్వస్తి చెప్పి, స్నేహితులకై వెదకులాట ప్రారంభించింది. జర్మనీ నౌకా విస్తరణ కార్యక్రమాలకు భయపడిన ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌లో సౌహార్ద్ర పూరితమైన ఒప్పందాన్ని చేసుకొని మిత్రకూటమిగా ఏర్పడింది. 1907లో ఇంగ్లాండ్ రష్యాతో ఒడంబడిక చేసుకోవడంతో త్రిరాజ్య మిత్రకూటమి ఏర్పడింది. ఈ విధంగా ఐరోపాఖండం త్రిరాజ్యకూటమి, త్రిరాజ్య మిత్ర కూటమి అను రెండు సైనిక శిబిరాలుగా విడిపోయింది. త్రిరాజ్యకూటమిలో జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ, ఇటలీదేశాలు, త్రిరాజ్యమిత్ర కూటమిలో ఫ్రాన్స్, రష్యా, ఇంగ్లాండ్‌లున్నాయి. ఈ రెండు శిబిరాల మధ్య పరస్పర ద్వేషం, ఈర్ష్యాసూయలు పెరిగాయి. రహస్య మిత్ర వర్గాలుగా ఏర్పడటం, దాని వలన జనించిన పరస్పర ద్వేషం, 1914లో యుద్ధం ప్రారంభమవడానికి కారణభూతమయ్యాయి.

### 12.1.2.2 యూరప్ దేశాల సైనిక విధానము :

మిత్రవర్గ విధానం, సైనిక వ్యవస్థ ఐరోపా ఖండాన్ని రెండు శత్రుశిబిరాలుగా తయారు చేసింది. ప్రథమంగా రాజ్యాలు మిత్రవర్గాలుగా ఏర్పడినాయి. అయితే వాస్తవానికి ఈ మిత్రవర్గ పుట్టుక ఐరోపాఖండ రాజ్యాల భద్రతకు భంగం వాటిల్లేటట్లుగా తయారయింది. ప్రతివర్గం ఎదుటివర్గం సైన్య సమాయత్తం చేస్తుందని భయపడింది. ఈ అపనమ్మకం, అనుమానం ఆయుధ పోటీకి దారి తీశాయి. ప్రతి ఏటా పెద్ద దేశాల సైన్యం, నౌకాదళం, ఆయుధ సేకరణ విపరీతంగా పెరగసాగాయి. జర్మనీ, ఇంగ్లాండ్‌ల నౌకాదళాల మధ్య తీవ్రమైన పోటీ మొదలయింది. జర్మనీ తయారుచేసిన ప్రతి ఒక్క నౌకకు ఇంగ్లాండ్ రెంటిని తయారుచేయసాగింది. ఈ ఆయుధపోటీని హేగ్ సమావేశాలు ఆపలేకపోయాయి. ఆస్ట్రియా-హంగరీ, రష్యాలు తమ సైనిక సంఖ్యను అధికం చేశాయి. ఆయుధ సేకరణ పోటీలో ఫ్రాన్స్ కూడా పాల్గొన్నది. ఫ్రాన్స్, రష్యా సైనిక విస్తరణకు భయపడిన జర్మనీ కూడా తన స్థిరసైన్యాన్ని పెంచసాగింది. చిన్న చిన్న దేశాలు కూడా తమ సైనిక బలాన్ని పెంచుకోసాగాయి. ఈ ప్రయత్నాలన్నీ 1914 యుద్ధంతో పరాకాష్టకు చేరుకున్నాయి.

### 12.1.2.3 తీవ్ర జాతీయవాదం :

దేశభక్తినే జాతీయవాదమంటారు. దేశభక్తి అంటే ప్రజలకు తమ దేశంపై గల ప్రేమ, అభిమానం. తమ దేశాన్ని ప్రేమించటంతోపాటు, ఇతర దేశాలను ద్వేషించటం కూడా ప్రారంభమయింది. జాతీయవాదం దేశదురభిమానానికి దారితీసింది. ఇది రాజ్యాల మధ్య ద్వేషభావాన్ని సృష్టించింది. జర్మనీ ఏకమైనప్పటి నుండి ఆల్సేస్, లొరైన్‌లు ఫ్రాన్స్ జర్మనీల మధ్య వివాద కారణమయ్యాయి. ఇటాలియన్‌లు ఆస్ట్రియాను తమజాతి శత్రువుగా పరిగణించసాగారు. పైగా 'ఇటాలియా ఇర్రెడెంటా' ను ఆస్ట్రియా పాలన నుండి విముక్తిచేయనభిలషించారు. బోస్నియా, హెర్జ్‌గోవినాలను ఆస్ట్రియా కలుపుకోవటాన్ని సెర్బియా నిరసించింది. సెర్బియాలో జాతైక్యత కలిగిన ఈ రెండు రాష్ట్రాల ప్రజలు తాము సెర్బియాతో కలసిపోవాలనే జాతీయవాద భావాలలో ఊగిసలాడిపోయారు. బాల్కన్ రాజ్యాలైన బల్గేరియా, రుమేనియా, సెర్బియా, గ్రీస్, మాంటినీగ్రోల మధ్య వైరం రెండో బాల్కన్

యుద్ధానికి (1913) దారితీసింది. ఈ యుద్ధంలో అవమానపడిన బల్గేరియా మిగతా బాల్కన్ రాజ్యాల కూటమిపై పగతీర్చుకోవడానికి యుద్ధం చేయ కృతనిశ్చయమైంది. సెర్బియాలో ప్రభావితమైన తీవ్ర జాతీయవాదం సెర్బియా, ఆస్ట్రియా-హంగరీల మధ్య వైరానికి కారణమైంది. ఈ బాల్కన్ విషమ పరిస్థితే చివరకు మొదటి ప్రపంచ యుద్ధానికి తక్షణ కారణమైంది. ఈవిధంగా దేశీయ దురభిమానంతో కూడిన జాతీయవాదం ఐరోపాదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితిని కలిగించి యుద్ధానికి దోహదం చేసింది.

## 12.1.2.4 సామ్రాజ్యవాదం :

19వ శతాబ్దంలో యూరప్‌లో సంభవించిన పారిశ్రామిక విప్లవం ఫలితంగా ముడిపదార్థాలకు, మార్కెట్లకు పారిశ్రామికాభివృద్ధి చెందిన రాజ్యాలు వెనకబడిన ప్రాంతాలలో అన్వేషణ చేయడం వల్ల అగ్రరాజ్యాల మధ్య తీవ్ర రాజకీయ, ఆర్థిక స్పర్థలు బయలుదేరినాయి. ప్రపంచంలోని వెనకబడిన ప్రాంతాలలో తమ వలసలను, రక్షక ప్రదేశాలను స్థాపించుకోవడం కోసం అగ్రరాజ్యాలు పోటీపడడం ప్రారంభమయింది. ఈ పోటీ కొన్ని విషమ సమస్యలకు దారితీసింది. బాల్కన్లలో ఆస్ట్రియా, రష్యాలు సంఘర్షణ పడటం మొదలెట్టాయి. రెండో విలియం చక్రవర్తి తలపెట్టిన బెర్లిన్ - బాగ్దాద్ రైలు మార్గం బాల్కన్‌లలో రష్యా ఆసక్తులను, తూర్పున ఇంగ్లాండ్ ఆసక్తులను దెబ్బతీసేటట్లుగా కన్పించింది. దక్షిణ ఆఫ్రికాలో జర్మనీ విస్తరణ ఆ ప్రాంతంలోని బ్రిటిష్ ప్రాభావానికి ప్రమాదమైంది. కీల్ కాలువను వెడల్పు చేయడం, నౌకారంగంలో ఇంగ్లాండ్‌తో పోటీపడడానికి జర్మనీ చేసిన అన్ని ప్రయత్నాలు ఇంగ్లాండ్‌కు తన సముద్రాధిపత్యాన్ని జర్మనీ ధిక్కరించినట్లనిపించింది. మొరాకోలో జర్మనీ, ఫ్రాన్స్‌లు విరోధులయ్యాయి. మొరాకో, అగడీర్ విషమ సమస్యలు జర్మనీ-బ్రిటన్‌ల మధ్య పూర్తి వైరానికి కారణమయ్యాయి. ఈ రెండు దేశాల మధ్య తలెత్తిన ఆర్థిక వైరం అన్నిటికంటే ఎక్కువ శత్రుత్వాన్ని కల్గించింది. 20వ శతాబ్ది ప్రారంభానికి జర్మనీలో తయారయిన పారిశ్రామిక వస్తువులు, బ్రిటన్‌తో తీవ్రంలో పోటీచేయడం మొదలెట్టాయి. ఈ ఆర్థిక సామ్రాజ్యవాదం కూడా ఇంగ్లాండ్ - జర్మనీల వేర్పాటుకు కారణమైంది. ఈవిధంగా మొదటి ప్రపంచ యుద్ధానికి సామ్రాజ్యవాదం ఒక కారణమైంది.

## 12.1.2.5 జర్మనీలో యుద్ధోన్మాదం :

బిస్మార్క్ యొక్క 'దండోపాయ విధానం' వల్ల జర్మనీ రాజ్యం ఏర్పడింది. ఏకీకరణ తరవాత కూడా జర్మనీ అదే విధానాన్ని అవలంబించసాగింది. జర్మన్‌లు యుద్ధాన్ని ఒక ఉన్నతాదర్శంగా కొనియాడేవారు. యుద్ధం వల్లనే సమస్యలు పరిష్కారమవుతాయనీ అందువల్ల యుద్ధం అవసరమనీ జర్మన్ చక్రవర్తి రెండో విలియం ఒక నూతన విధానాన్ని తయారుచేసినాడు. 'వెల్ పాలిటిక్' లేదా 'ప్రపంచ విధానం' జర్మన్‌ల నినాదమైంది. ఇదే సమయంలో జర్మన్‌లలో కొత్త నమ్మకం ఆవహించింది. తమ జాతి గొప్పదనీ, తమ సంస్కృతి ప్రపంచాన్ని జయించడానికై నిర్దేశించబడినదనీ జర్మన్‌లు నమ్మారు. రెండో విలియం సామ్రాజ్యవాద విధానం ఈ నమ్మకానికి అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. ఇది సాధించడానికి జర్మనీ బ్రిటన్‌పై నౌకాధిపత్యం సాధించవలసివుంది. రెండో విలియం 1898, 1907 లలో నౌకావిస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాడు. ఇది బ్రిటీష్ వారి శత్రుత్వాన్ని, పోటీని కొని తెచ్చుకుంది. ఈ విధంగా రెండో విలియం అనుసరించిన విదేశాంగ విధానం ఇంగ్లాండ్, జర్మనీల మధ్య సంబంధాలను నాశనం చేసింది.

## 12.1.2.6 మొరాకో సమస్య :

మొరాకోలో ఫ్రాన్స్, జర్మనీ దేశాలకు ఆర్థికపరమైన ఆసక్తి ఉంది. మొరాకోలో 1905లో రాజకీయ పరిస్థితులు అస్తవ్యస్తం కావడంతో ఫ్రాన్స్ ఆ దేశ వ్యవహారాల్లో కల్పించుకొని సంస్కరణలు చేపట్టమని సుల్తాన్ అబ్దుల్ అజీజ్‌ను బలవంతపెట్టింది. అయితే మొరాకో ఆంతరంగిక వ్యవహారాలలో ఫ్రాన్స్ తలదూర్చటానికి జర్మనీ అభ్యంతరాన్ని తెలిపింది. రెండో విలియం చక్రవర్తి తన సేనతో టాంజియర్‌లో ప్రవేశించి సుల్తాన్ స్వాతంత్ర్యానికి తన మద్దతు ప్రకటించాడు. జర్మనీ వైఖరి అంతర్జాతీయ

విషమ సంఘటనగా తయారైంది. అయితే మొరాకో వివాద పరిష్కారార్థమై అంతర్జాతీయ సమావేశాన్ని జరపాలన్న జపాన్ కోరికను ఫ్రాన్స్ మన్నించటంలో యుద్ధం జరిగే పరిస్థితి తొలగిపోయింది. ఆ ప్రకారం దక్షిణ స్పెయిన్‌లోని అల్జిసిరాస్‌లో 1906లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్రిటన్, ఇటలీ మొదలగు దేశాలు ఫ్రాన్స్‌కు సమర్థించాయి. సమావేశంలో జర్మనీ ఒంటరిదయిపోయింది. బ్రిటన్ మద్దతుతో ఫ్రాన్స్ మొరాకోలో తన రక్షక ప్రభుత్వాన్ని స్థాపించింది. అందువల్ల ఇంగ్లాండ్‌పై జర్మనీ కోపం వహించింది. ఈ విధంగా మొరాకో సమస్య ఫ్రాన్స్ - ఇంగ్లాండ్‌ల మధ్య స్నేహాన్ని మరింత పటిష్టం చేయగా, జర్మనీ-ఇంగ్లాండ్‌ల మధ్య పాత వైరాన్ని పునరుద్ధరించింది.

## 12.1.2.7 బాల్కన్ సమస్య :

ఇంగ్లాండ్ - రష్యాల మధ్య 1907లో జరిగిన సౌహార్ద్ర ఒడంబడిక వలన రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా సాగుతున్న శతృత్వం అంతమైంది. దీంతో జర్మన్‌లలో ఉద్రిక్తత ప్రారంభమైంది. 1908తో తలెత్తిన యంగ్‌టర్క్ ఉద్యమం టర్కీ పునరుద్ధరణకు నాంది అవుతుందేమోనని ఆస్ట్రియా భయపడింది. అందువల్ల 1908లో ఆస్ట్రియా-హంగరీ, జర్మనీ సహకారంతో బోస్నియా, హెర్జిగోవినాలను ఆక్రమించింది. ఇది 1878 బెర్లిన్ ఒడంబడికను భంగపరిచింది. ఆస్ట్రియా చర్యను సెర్బియా తీవ్రంగా నిరసించింది. సెర్బియాను రష్యా సమర్థించింది. ఆస్ట్రియా-సెర్బియాల వివాదం వల్ల యుద్ధ ప్రమాదమేర్పడింది. బోస్నియా, హెర్జిగోవినాల నష్టాన్ని పూరించడానికై టర్కీకి ఆస్ట్రియా నష్టపరిహారం ఇవ్వటంతో యుద్ధం తప్పిపోయింది. ఆస్ట్రియా-హంగరీ బోస్నియా, హెర్జిగోవినాలను కలుపుకోవడానికి టర్కీ అంగీకరించడంలో రష్యా మౌనం వహించింది. అయితే కలిపివేత ఆస్ట్రియా - సెర్బియాల మధ్య తీవ్ర వైమనస్యతకు దారితీసింది. సెర్బియా విరోధ వైఖరి బాల్కన్‌లలో ప్రశాంతతకు ప్రమాదకారణమైంది. ఈ పరిస్థితే చివరకు మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసింది.

## 12.1.2.8 అగాడిల్ సంఘటన :

మొరాకోలో 1911లో అంతఃకలహం చెలరేగగా, మొరాకో సుల్తాన్ ఫ్రాన్స్ సహాయమర్థించాడు. వెంటనే ఫ్రాన్స్ నౌకాదళాన్ని పంపి రాజధాని ఫెజ్‌ను ఆక్రమించింది. మొరాకోలో ఫ్రెంచి జోక్యాన్ని జర్మనీ వ్యతిరేకించింది. జర్మన్‌ల ఆర్థిక ఆసక్తుల పరిరక్షణార్థం జర్మనీ 'పాంథర్' అనే పేరు గల ఫిరంగి నౌకను మొరాకో తీరంలో వున్న అగాడిల్ రేవుకు పంపింది. దీంతో ఐరోపాలో ప్రశాంతతకు ప్రమాదమేర్పడింది. దీనినే 'అగాడిల్ సంఘటన' అంటారు. ఈ విషయంలో ఫ్రాన్సును బ్రిటన్ సమర్థించింది, జర్మనీ సైనిక చర్యను గర్హించింది. బ్రిటన్‌తో యుద్ధం సరికాదని జర్మనీ తన యుద్ధ నౌకను తిరిగి వెనక్కు తెప్పించుకుంది. ఫలితంగా యుద్ధం ఆగిపోయింది. మొరాకోను ఫ్రెంచివారి రక్షణలోని రాష్ట్రంగా జర్మనీ గుర్తించింది. జర్మనీకి నష్టపరిహారంగా ఫ్రెంచి కాంగోలో విశాలమైన భూభాగాలు ఇవ్వబడ్డాయి.

## 12.1.2.9 ఇటలీ విధానం :

ఇటలీకి చెందిన ట్రినిటినో, ట్రిస్టీలను ఆస్ట్రియా-హంగేరి ఆక్రమించుకొన్నది. ఈ ప్రాంతాలను తిరిగి పొందటానికి ఇటలీ అనేక ప్రయత్నాలు చేసింది. అంతేగాక ఇటలీలో పెరుగుతున్న ఆర్థిక ద్రవ్యోల్బణం, జనాభా పెరుగుదల, ఆర్థిక వనరుల తరుగుదల మొదలగు వాటిని అధిగమించటానికి ఇతర ప్రాంతాలను ఆక్రమించుకోవాలనే కోరిక ఇటలీకి కలిగింది. ఆడ్రియాటిక్ సముద్ర ప్రాంతాన్ని ఆస్ట్రియా-హంగరీ ఆక్రమించుకోవటంలో ఇటలీ పోటీకి దిగింది. కాలక్రమేణ రెండు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది.

### 12.1.2.10 ఫ్రాన్స్ విధానం :

1871 లో ఫ్రాన్స్ ప్రాంతాలైన ఆల్సెస్ - లోరైన్‌లను జర్మనీ ఆక్రమించుకొన్నది. అపారమైన ఖనిజ సంపద గల ఈ ప్రాంతాన్ని జర్మనీ నుండి తిరిగి పొందుటకు ఫ్రాన్స్ అనేక ప్రయత్నాలు చేసింది. దీనితో అంతర్జాతీయ రాజకీయ వాతావరణం కలుషితమైంది.

### 12.1.2.11 వార్తాపత్రికలు :

మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వము ఐరోపా ఖండ రాజ్యాలలోని వార్తాపత్రికలు తమ దేశ ప్రజలలో తీవ్ర జాతీయతాభావాన్ని పెంపొందించడమేగాక ఇతర దేశాల పట్ల ద్వేషభావాన్ని రగులుకొల్పుటలో కీలకపాత్ర వహించెను. నాటి పత్రికలు వదంతులను వ్యాప్తిచేయుటలో, చిన్న సంఘటనలు పెద్దవిగా చిత్రించుటలో, ప్రజాభిప్రాయాన్ని యుద్ధోన్ముఖులుగా మార్చుటతో నిర్విరామ కృషి చేశాయి. ఆస్ట్రియా యువరాజు హత్యతో సెర్బియా, ఆస్ట్రియాలలోని వార్తాపత్రికల మధ్య సంఘర్షణ తీవ్ర రూపం దాల్చింది.

### 12.1.2.12 అంతర్జాతీయ శాంతి సాధన లేకపోవటం :

రాజ్యాల మధ్య వివాద పరిష్కారానికై అంతర్జాతీయ యంత్రాంగం ఏదైనా వుండి వుంటే, యుద్ధం వచ్చి వుండేది కాదు. నెపోలియన్ పతనానంతరం భవిష్యత్తులో యుద్ధాలు రాకుండా ఆపేందుకై ఏర్పడిన ఐరోపా రాజ్యబద్ధ కూటమి అకాలమృత్యువు వాతబడింది. దానికి బదులుగా మరేదీ ఆ స్థానాన్ని ఆక్రమించలేదు. బిస్మార్క్ రహస్య మిత్రవర్గ విధానం, రాజ్యాల మధ్య స్నేహ సంబంధాల పెరుగుదలకు భంగమయ్యే వాతావరణాన్ని కల్పించింది. ఒకరిపై మరొకరికున్న అపనమ్మకం, అనుమానం, అందరూ ఆయుధసన్నద్ధులవటానికి దారితీసింది. రెండో నికోలస్ జార్ 1899, 1907లో తలపెట్టిన రెండు హేగ్ సమావేశాలు పరాజయం పొందాయి. ప్రపంచ శాంతికై, శాశ్వత అంతర్జాతీయ యంత్రాంగ నిర్మాణ ప్రయత్నంలో రెండు సమావేశాలు ఫలితాలను సాధించలేదు. రెండు మొరాకో విషమ సమస్యల పరిష్కారానికి గాని, రెండు బాల్కన్ యుద్ధాలనాపటానికి గాని ఎలాంటి శాంతి యంత్రాంగం లేకుండెను. అంతర్జాతీయ శాంతి సంస్థ లేకపోవడం వల్ల 1914లో యుద్ధం ప్రారంభమైంది.

### 12.1.2.13 సన్నిహిత కారణం :

1914 జూన్ 28న ఆస్ట్రియా యువరాజైన ఫ్రాన్సిస్ ఫెర్డినాండ్ సతీసమేతంగా బోస్నియా ముఖ్య పట్టణమైన సెరాజివోను సందర్శించినపుడు 'నల్లచేయి' అనే రహస్య సెర్బియన్ సంఘానికి చెందిన ఒక సభ్యుడు కాల్చి చంపివేసినాడు. సెర్బియన్ ప్రజలు నివశించే ప్రాంతాల ఏకీకరణ లేక దాని సాధనలో మరణించడమో ఆ సంఘ ఆశయమై ఉండెను. సెర్బియా ప్రోత్సాహంతో ఈ హత్య జరిగింది. సెర్బియాను అణగద్రొక్కటానికి ఈ సంఘటనను తనకనువుగా మలచుకోవాలని ఆస్ట్రియా తలచింది. సెర్బియాకు ఆస్ట్రియా ఒక అల్టిమేటమ్‌ను పంపింది. దానికి సెర్బియా సరియైన సమాధానమివ్వలేదు. దాంతో ఆస్ట్రియా, జర్మనీ మద్దతుతో సెర్బియాపై యుద్ధ ప్రకటన చేసింది. సెర్బియాకు మిత్రదేశమైన రష్యా జర్మనీపై యుద్ధప్రకటన చేసింది. రష్యా మిత్రరాజ్యమైన ఫ్రాన్స్ కూడా జర్మనీపై యుద్ధప్రకటన చేసింది. బెల్జియం తాటస్థ్యాన్ని జర్మనీ భంగపరచగా బ్రిటన్ కూడా ఫ్రాన్స్, రష్యాలతో చేయి కలిపింది. ఈ విధంగా 1914లో ఆస్ట్రియా, సెర్బియాల మధ్య ప్రారంభమైన స్థానిక యుద్ధం ప్రపంచయుద్ధంగా మారింది.

### 12.1.3 యుద్ధగమనం :

1914 ఆగస్ట్‌లో సెర్బియాపై ఆస్ట్రియా యుద్ధం ప్రకటించడంతో ప్రారంభమైన మహాయుద్ధం 1918 నవంబర్ వరకు కొనసాగింది. ఈ యుద్ధగతిని రెండు దశలుగా విభజించవచ్చును.

#### 12.1.3.1 మొదటిదశ (1914 - 1917) :

జర్మనీ మొదట తన దృష్టిని పశ్చిమాన కేంద్రీకరించి, బెల్జియంను ఆక్రమించింది. బెల్జియం తాటస్థ్యాన్ని జర్మనీ భంగపరచడంతో ఇంగ్లాండ్ ఇంగ్లాండ్ యుద్ధంలో చేరింది. బెల్జియం మీదుగా ఫ్రాన్సుపై జర్మనీ దాడి చేసింది. జర్మన్ సైనికుల పురోగతిని ఇంగ్లాండ్, ఫ్రాన్స్ సైన్యాలు నిలువరించింది. మార్న్ యుద్ధం కందక యుద్ధ నీతికి చిరస్మరణీయమైనది. మిత్ర వర్గం జర్మన్‌ల నోడించి ఫ్రాన్స్ నుండి వారిని తరిమికొట్టింది. జర్మన్ ఆక్రమణ నుండి పారిస్ రక్షించబడింది. కాని ఫ్రాన్స్ సరిహద్దులలో యుద్ధం కొనసాగింది.

తూర్పున రష్యా సైన్యం జర్మనీ, ఆస్ట్రియాలపై దాడిని సాగించింది. రష్యాకు వ్యతిరేకంగా ఆస్ట్రియా సాగించిన యుద్ధంలో జర్మనీ ఆస్ట్రియాకు సహాయం చేయవలసి వచ్చింది. 1915లో టన్నెన్ బర్గ్ యుద్ధంలో జర్మన్ సేనానాయకుడు హిండెన్‌బర్గ్ చేతిలో రష్యా ఓడిపోయింది. అయినా ఆస్ట్రియాపై రష్యా గుర్తింపదగిన విజయాన్నే సాధించింది. హంగరీని రష్యా ఆక్రమించే స్థితిలో వుంది. జర్మనీ ఆస్ట్రియా సహాయార్థమై వచ్చింది.

టర్కీ జర్మనీ పక్షాన యుద్ధంలోకి దిగడంతో రష్యాకు మిత్రవర్గంతో పూర్తి సంబంధాలు పోయాయి. రష్యా ఒంటరిదై పోయింది. టర్కీ, జర్మన్ నౌకాదళం బాల్టిక్ సముద్రం, నల్ల సముద్రాలపై పూర్తి ఆధిపత్యాన్ని వహించింది. రష్యాకు సహాయం చేయడం కోసం ఇంగ్లాండ్ తీవ్రంగా ప్రయత్నించి విఫలమయింది. అయితే బ్రిటీష్ వారు టర్కీని ఓడించి సైప్రస్, ఈజిప్ట్, మెసపుటేమియా, పాలస్తీనా ప్రదేశాలను వశం చేసుకొన్నారు. ఇంతలో 1915లో ఆస్ట్రియా నుండి ఇటాలియా ఇర్రెడెంటాను సాధించేందుకై ఇటలీ మిత్రవర్గం వారి పక్షం వహించింది. అయితే ఇటలీ చాలా చోట్ల పరాజయాన్ని పొందింది. ఫ్రెంచి, బ్రిటీష్ సైన్యం కష్టంతో ఆస్ట్రియా చేతిలోకి ఇటలీ పోకుండా కాపాడగలిగారు. బల్గేరియా జర్మన్ పక్షంతో చేయి కలపగా, రుమేనియా జర్మనీ, ఆస్ట్రియాలపై యుద్ధ ప్రకటన చేసింది. కాని రుమేనియా యుద్ధంలో ఘోరంగా ఓడిపోయింది. జర్మనీ రుమేనియా రాజధాని బుఖారెస్ట్‌ను ఆక్రమించింది.

జర్మన్ నౌకల రాకపోకలను ఇంగ్లాండ్ అడ్డుకొంది. ఉత్తర సముద్రంపై బ్రిటిష్ నౌకాదళం కాపుకాయగా, మెడిటరేనియన్ సముద్రంపై ఫ్రెంచి, ఇటాలియన్ నౌకాదళాలు ఆధిపత్యం వహించాయి. ఈ అటకాయింపును తప్పుకోవడానికి జర్మనీ అనేక ప్రయత్నాలు చేసింది. గత్యంతరం లేక 1916లో బ్రిటీష్ వారితో జర్మనీ జట్ లాండ్ యుద్ధం చేసింది. ఇరు పక్షాలు తీవ్రంగా నష్టపోయాయి. ఇది ఇంగ్లాండ్‌కు ఘన విజయం. యుద్ధం అయిపోగానే జర్మనీ నౌకలు కీల్ కాలువకు తిరిగి వెళ్ళాయి. అటకాయింపును నిరోధించలేక పరాజయం పొంది జర్మనీ బ్రిటీష్ దీవుల మీద తన జలాంతర్గాములతో యుద్ధం చేయసాగింది. జర్మన్ 'యు' బోట్లు బ్రిటీష్ వాణిజ్య నౌకలకే కాక, తటస్థ దేశాలకు కూడా తీవ్ర నష్టాన్ని కల్గించాయి. అయితే యుద్ధం ముగిసేవరకు ఇంగ్లాండ్ తన నౌకాధిపత్యాన్ని నిలబెట్టుకుంది.

రష్యా యుద్ధంలో వరుసగా ఎదుర్కొన్న పరాజయాలు, తీవ్ర నష్టాలు రష్యాలో జార్ ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలుచేసాయి. అది ప్రజల అభిమానాన్ని కోల్పోయింది. ఫలితంగా జార్ ప్రభుత్వాన్ని లెనిన్ కూలద్రోసి 1917లో బోల్షివిక్ ప్రభుత్వాన్ని స్థాపించాడు. బోల్షివిక్ ప్రభుత్వం శాంతిని వాంఛించి జర్మనీతో బ్రెస్ట్‌లిటోవస్క్ సంధిని చేసుకొంది. యుద్ధం నుండి రష్యా విరమించుకొంది.

### 12.1.3.2 రెండో దశ (1917-1918) అమెరికా ప్రవేశం :

రష్యా 1917 లో యుద్ధం నుండి విరమించుకోవడంతో జర్మనీ శక్తివంతమైన దేశమైంది. జర్మనీ తనబలాన్ని పశ్చిమాన కేంద్రీకరించసాగింది. మిత్ర కూటమి నష్టపోయినట్లుగా కనిపించింది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా వారికి తోడుగా నిల్చింది. అమెరికా పౌరులను తీసుకువెళ్తున్న బ్రిటీష్ రవాణా నౌకను 1915 మే లో జలాంతర్గాములు సముద్రంలో ముంచివేయుట జరిగింది. దీనితో జర్మనీపై అమెరికా ప్రజలు తీవ్ర వ్యతిరేకతను ప్రదర్శించారు. చివరకు జర్మనీ తన అనియత జలాంతర్గామి యుద్ధనీతిని ఇంకా సాగించాలని నిర్ణయం తీసుకొనటంతో, అమెరికా కూడా జర్మన్ కూటమిపై యుద్ధాన్ని ప్రకటించాల్సి వచ్చింది. 'ప్రపంచంలో ప్రజాస్వామ్య పరిరక్షణకై' అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ 1917లో జర్మనీపై యుద్ధ ప్రకటన చేశాడు. అధిక సంఖ్యలో అమెరికా దళాలు ఐరోపాకు రాసాగాయి. సముద్రంపై అమెరికా నౌకాదళం బ్రిటీష్ వారికి సాయం చేయసాగింది. అమెరికా తమవైపు తిరగటంతో మిత్రవర్గం బలం పుంజుకుంది. జయాన్ని ఆకాంక్షిస్తోంది.

1918లో జర్మనీ, ఆస్ట్రియా - హంగరీలు చివరి దాడిని జరిపాయి. ఈ సవాలును ఎదుర్కొనటానికై ఫ్రెంచి సేనా నాయకుడైన మార్షల్ ఫోక్‌ను మిత్రవర్గ సర్వసైన్యాధిపతిగా చేయటం జరిగింది. వరసగా జర్మన్‌లకు ఓటమి తరవాత ఓటమి తటస్థించింది. జర్మనీ వెనక్కి వెళ్ళిపోవటం మొదలెట్టింది. ఇంతలో టర్కీ, బల్గేరియాలు ఓడిపోయాయి. ఆస్ట్రియా ఓడిపోయి చివరకు లొంగిపోయింది. 1918 నవంబర్ 9న రెండో విలియం జర్మనీ సింహాసనాన్ని త్యజించి హాలెండ్‌కు పారిపోయాడు. జర్మనీ రిపబ్లిక్‌గా ప్రకటించబడింది. కొత్త వీమర్ రిపబ్లిక్ శాంతికై ప్రార్థించింది. బేషరతుగా జర్మనీ మిత్రవర్గానికి లొంగిపోవడంతో యుద్ధం అంతమయింది. 1918 నవంబర్ 11 న సంధి జరిగింది.

### 12.1.4 యుద్ధ ఫలితాలు :

మొదటి ప్రపంచయుద్ధ ఫలితంగా కనీ, వినీ ఎరుగని వినాశనం జరిగింది. అనేక పట్టణాలు నేలమట్టమయ్యాయి. లక్షల కొలది ప్రజలు మరణించారు. ఐరోపా అంతటా ఆహార పదార్థాల కొరత ఏర్పడింది. యుద్ధం తరవాత ఐరోపాలో ఎక్కడ చూసినా ఆకలి, అంటురోగాలు, అనారోగ్యం వీర విహారం చేశాయి. పరిశ్రమలు కుంటుపడ్డాయి. ద్రవ్యోల్బణం, అధిక ధరలు ప్రజలను నాశనం చేశాయి. చాలా ఐరోపా ఖండ దేశాలలో రాజకీయ విప్లవాలు ప్రారంభమయ్యాయి. రాచరిక సామ్రాజ్యాల స్థానే క్రొత్త రాజ్యాలు ఆవిర్భవించాయి.

### 12.1.4.1 నిరంకుశ రాచరిక ప్రభుత్వాల స్థానే రిపబ్లికన్ ప్రభుత్వాల ఏర్పాటు :

మొదటి ప్రపంచయుద్ధ ఫలితంగా ఐరోపాలో రాచరిక సామ్రాజ్యాలు తొలగించబడి, కొత్త రిపబ్లిక్ ప్రభుత్వాలు నెలకొన్నవి. జర్మనీలో హోహెన్‌జోలర్న్ వంశీకులు, ఆస్ట్రియా-హంగరీలో హాప్స్‌బర్గ్ వంశీకులు, రష్యాలో రోమనావ్ వంశీకులు, టర్కీలో సుల్తానులు, అధికారాన్ని కోల్పోయారు. జర్మనీలో వీమర్ రిపబ్లిక్ ఏర్పాటయింది. ఆస్ట్రియా - హంగరీ రాచరికం నాశనమవటంతో ఆస్ట్రియా, హంగరీ రిపబ్లిక్‌లు అవతరించాయి. టర్కీలో రాచరికం పోయి రిపబ్లిక్ వచ్చింది. ఈ విధంగా ప్రజలకు హక్కులు, పాలనలో వారు పాల్గొనే అవకాశం లభించాయి.

### 12.1.4.2 నూతన జాతీయ రాజ్యాల ఆవిర్భావం :

మొదటి ప్రపంచ యుద్ధం వల్ల నూతన జాతీయ రాజ్యాలు ఏర్పడ్డాయి. అవి జర్మనీ, ఆస్ట్రియా - హంగరీ, రష్యా దేశాల భూభాగాల నుండి లేక వాటిని ఇంకో భూభాగంలో కలపటం వల్ల గాని ఏర్పడ్డాయి. ఆస్ట్రియా-హంగరీ శిధిలాల నుండి ఆవిర్భవించిన తొలి జాతీయ రాజ్యం జెకోస్లోవేకియా. ఇంకో కొత్త జాతీయ రాజ్యం యుగోస్లావియా. మధ్య ఐరోపాలో పోలెండ్ రాజ్యం ఏర్పడింది.

### 12.1.4.3 ఆసియా, ఆఫ్రికాలలో స్వయం నిర్ణయ సూత్రాల వ్యాప్తి :

మొదటి ప్రపంచ యుద్ధ ఫలితంగా జాతీయవాదానికి, అమెరికా అధ్యక్షుడైన ఉడ్రో విల్సన్ ప్రతిపాదించిన స్వయం నిర్ణయ సిద్ధాంతానికి గుర్తింపు లభించింది. స్వయం నిర్ణయ సిద్ధాంతం ప్రకారం వివాదగ్రస్తమైన ప్రదేశాల్లో ప్రజల కోర్కెలను తెలుసుకోవడానికి ప్రజాభిప్రాయ సేకరణలు జరిగాయి. ఆ ప్రకారం ఫిన్‌లాండ్, లాట్వియా, ఎస్టోనియా, లిథూనియాలు నూతన జాతీయ రాజ్యాలుగా అవతరించాయి. ఈ స్వయం నిర్ణయ సిద్ధాంతం ఐరోపాకే పరిమితం కాక ఆసియా, ఆఫ్రికా ఖండాలకు కూడా వ్యాపించింది. ఫలితంగా ఇండియా, చైనా, ఈజిప్ట్‌లలో అనేక జాతీయోద్యమాలు తలెత్తాయి.

### 12.1.4.4 ప్రపంచ రాజకీయాల్లో అమెరికా పాల్గొనడం :

మొదటి ప్రపంచయుద్ధ ఫలితంగా అమెరికా మన్రో సిద్ధాంతాన్ని త్రోసిరాజని అంతర్జాతీయ రాజకీయాల్లో పాల్గొన సాగింది. అమెరికా ప్రపంచ శక్తిగా అవతరించింది. ఈ యుద్ధం వల్ల ఇంగ్లాండ్, ఫ్రాన్స్, రష్యా, జర్మనీ, ఇటలీ, ఆస్ట్రియాల ఆధిక్యత తగ్గి పోయింది.

### 12.1.4.5 బోల్షివిక్ విప్లవం :

మొదటి ప్రపంచ యుద్ధ పరోక్ష ఫలితంగా రష్యాలో బోల్షివిక్ విప్లవం సంభవించింది. ప్రపంచంలో రష్యా మొదటి కమ్యూనిస్ట్ దేశంగా అవతరించింది. రష్యాలో కమ్యూనిస్ట్ ప్రభుత్వ స్థాపన ప్రపంచ రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలికింది.

### 12.1.4.6 టర్కీకి కల్గిన నష్టాలు :

మొదటి ప్రపంచ యుద్ధంలో పరాజయం చెందిన టర్కీ తన భూభాగాల నెన్నిటినో మిత్ర వర్గానికి సమర్పించింది. ఈజిప్ట్, సుడాన్, సైప్రస్, సిరియా, మెసపొటోమియా, పాలస్తీనా, అరేబియాలపై టర్కీ తన హక్కులను వదులుకొన్నది. అంతేగాక పెద్ద మొత్తంలో టర్కీ నష్టపరిహారాన్ని చెల్లించింది. టర్కీ సుల్తానుల పరిపాలన అంతమై రిపబ్లిక్ స్థాపించబడింది.

### 12.1.4.7 హిట్లర్ విజృంభణ :

మొదటి ప్రపంచయుద్ధ ఫలితంగా జర్మనీ ఎన్నో భూభాగాలను వదులుకోవలసి వచ్చింది, తన సైన్యాన్ని తగ్గించుకోవలసి వచ్చింది. పెద్ద మొత్తాలలో యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించాల్సి వచ్చింది. జర్మనీ వలస స్థావరాలన్నింటినీ బ్రిటన్, ఫ్రాన్స్‌లు పంచుకొన్నాయి. ఆల్సేస్, లొరైన్, బెల్జియం, లగ్జెంబర్గ్ ప్రాంతాలను జర్మనీ అప్పగించాల్సి వచ్చింది. పోలెండ్‌ను ఖాళీ చేసింది. రాచరికం అంతమయి రిపబ్లిక్ ప్రభుత్వం ఏర్పాటయింది. జర్మనీ భరించిన ఈ అవమానాలే నాజీ నియంత హిట్లర్ జర్మనీలో తలెత్తడానికి, హిట్లర్ వల్ల రెండో ప్రపంచ యుద్ధం రావటానికి కారణాలయ్యాయి.

### 12.1.4.8 అపార ధన, ప్రాణ నష్టములు :

ఈ యుద్ధంలో జరిగిన ధన ప్రాణనష్టం అంతకు ముందు ఏ యుద్ధంలో జరగలేదు. ఈ యుద్ధంలో మరణించినవారు, గాయపడినవారు సుమారు మూడు కోట్ల ఇరువది లక్షల మంది. వీరిలో పెక్కు మంది యువకులే. ఈ యుద్ధంలో 27 రాజ్యాలు పాల్గొన్నవి. ఈ యుద్ధానికి సుమారు 1860 కోట్ల డాలర్లు ఖర్చయ్యెను. ఇంకా అనేక పట్టణాలు, పరిశ్రమలు ధ్వంసం చేయబడ్డాయి.

### 12.1.4.9 నానాజాతి సమితి ఆవిర్భావం :

ప్రపంచంలో యుద్ధాలను నివారించి, శాంతిని నెలకొల్పుటకు ఏర్పడిన నానాజాతి సమితి మొదటి ప్రపంచయుద్ధ ఫలితమే. ఈ సమితి అనేక రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమస్యలను పరిష్కరించుటకు గొప్ప కృషి చేసెను.

### 12.1.4.10 ఆర్థిక సంక్షోభము :

ఈ యుద్ధం వలన ఐరోపా రాజ్యాలు తీవ్ర సంక్షోభమునకు గురిఅయ్యెను. అందువలన ఐరోపా రాజ్యాలు అమెరికాపై ఆధారపడవలసి వచ్చెను. డాలర్ అంతర్జాతీయ మారక ద్రవ్యంగా పరిగణనలోనికి వచ్చెను.

### 12.1.5 యుద్ధ స్వభావము :

మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో 27 దేశాలు పాల్గొన్నాయి. పెద్ద ఎత్తున జరిగిన తొలి యుద్ధం ఇదే. యుద్ధం నాలుగు దీర్ఘ సంవత్సరాల కాలం నడిచింది. తొలిసారిగా ఆకాశాన్ని యుద్ధభూమిగా వాడటం జరిగింది. కందక యుద్ధ విధానం చాలా ప్రధాన యుద్ధ పద్ధతైంది. ఇంకో యుద్ధ లక్షణం యుద్ధంలో విమానాల వాడకం. శతృస్థావరాన్ని పసికట్టేందుకు 'జెప్పెలిన్లు' అనే గాలి బెలూన్లను వాడటం జరిగింది. ఇంకొక ఆయుధం విషవాయువు. దీన్ని జర్మన్లు మొదటిసారిగా వాడారు. టాంకులను వాడటం ఈ యుద్ధంలో జరిగింది. జలాంతర్గామి యుద్ధతంత్రం కూడా ఈ యుద్ధానికున్న లక్షణాలలో ఒకటి. 'యు' బోట్లు అని పిలువబడే జర్మన్ జలాంతర్గాములు బ్రిటీష్ నౌకల చలనాన్ని విజయవంతంగా నిరోధించాయి. మానవ జీవితానికి, నాగరికతకు యుద్ధం అశనిపాతమయింది. చాలామంది జనం యుద్ధాలలో చనిపోయారు. అసంఖ్యాకమైన పట్టణాలు, కార్మిక వాడలు నాశనమయ్యాయి.

### 12.1.6 ముగింపు :

ఈ యుద్ధము ప్రపంచ చరిత్రలో నూతనశకం ప్రవేశపెట్టిందని చెప్పవచ్చు. ఇదివరలో జరిగిన స్థానిక యుద్ధాలవలె కాక ఈ యుద్ధం ప్రపంచ సంగ్రామంగా పరిణమించింది. ఎప్పుడూ కనీవినీ ఎరుగని యుద్ధసాధనాలు, ఆయుధాలు, విషవాయువులు, మర ఫిరంగులు, విమానాలు మొదలైన వాటిని ఈ యుద్ధంలో ఉపయోగించడం జరిగింది. రక్షించుకోవడానికి గోతులు తవ్వి తుపాకులు పేల్చడం, సముద్రాలలో జలాంతర్గాములు ఉపయోగించడం, మందు పాతరలు ఏర్పరచడం ఈ యుద్ధకాలంలో జరిగింది. ఈ యుద్ధం వల్ల అపారమైన ధన, ప్రాణ నష్టం జరిగింది. అంతేగాక ఈ యుద్ధ ఫలితంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థ తీవ్ర సంక్షోభానికి గురి అయింది.

### 12.1.7 నమూనా ప్రశ్నలు :

1) మొదటి ప్రపంచ యుద్ధమునకు గల కారణములను చర్చించుము.
2) మొదటి ప్రపంచ యుద్ధమునకు కైజర్ విలియమ్ - 2 ఎంతవరకు బాధ్యుడో అంచనా వేయుము.
3) మొదటి ప్రపంచ యుద్ధగతిలోని ముఖ్య సంఘటనలను వర్ణించుము.
4) మొదటి ప్రపంచ యుద్ధ ఫలితాలను పరిశీలించండి.

### 12.1.8 చదువదగిన గ్రంథాలు :


1. C.J.A.H. Hayes - Modern Europe Since 1870
2. C.D. Hazan - Modern Europe upto 1945
3. D. Thamson - Europe since Napoleon
4. Raghubir Dayal - Modern European History
5. H.L. Peacock - Modern European History
6. G.P. Gooch - History of Modern Europe 1878-1915
7. John and Gwenneth Stokes - Europe and the Modern World, 1870-1983.


- డా॥ వి. కె. మోహన్

# 12.2 వర్సైల్స్ సంధి (Treaty of Versailles), ఇతర సంధులు

## 12.2.0 లక్ష్యం :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం శాంతి ప్రయత్నాలు, వర్సైల్స్ శాంతి ఒప్పందం, దానిలోని అంశాలను, ఇతర సంధులను గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**ముఖ్యాంశములు :**

**12.2.1** పరిచయం

**12.2.2** పారిస్ శాంతి సమావేశం

**12.2.3** సమావేశానికి హాజరైన ప్రతినిధులు

**12.2.4** వివిధ శాంతి సంధులు

**12.2.5** వర్సే సంధి షరతులు

- **12.2.5.1** ప్రాదేశిక ఏర్పాట్లు
- **12.2.5.2** సైనిక నిబంధనలు
- **12.2.5.3** ఆర్థిక నిబంధనలు
- **12.2.5.4** నష్టపరిహార సమస్య
- **12.2.5.5** న్యాయసంబంధమైన నిబంధనలు
- **12.2.5.6** యుద్ధ దోషారోపణ నిబంధన
- **12.2.5.7** రాజకీయ నిబంధనలు
- **12.2.5.8** వర్సే సంధి - విమర్శ
- **12.2.5.9** వర్సేసంధి విఫలమవడానికి కారణాలు

**12.2.6** సెంట్ జర్మెయిన్ సంధి

**12.2.7** న్యూల్లీ సంధి

**12.2.8** ట్రియనాన్ సంధి

**12.2.9** సెవెర్స్ సంధి

**12.2.10** మైనారిటీలకు సంబంధించిన సంధులు

**12.2.11** ముగింపు

**12.2.12** నమూనా ప్రశ్నలు

**12.2.13** చదువదగిన గ్రంథాలు

## 12.2.1 పరిచయం :

మొదటి ప్రపంచ యుద్ధము 1914 నుంచి 1918 వరకు జరిగింది. ఈ యుద్ధంలో మిత్రరాజ్యాలు విజయం సాధించాయి. జర్మనీ కూటమి పరాజయం చెందింది. జర్మన్ చక్రవర్తి రెండో విలియం హాలెండుకు పారిపోయాడు. అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ 14 సూత్రాల ఆధారంగా శాంతి సంధి చేసుకోవడానికి జర్మనీ అంగీకరించడంతో 1918 నవంబరు 11న మిత్రరాజ్యాలకు, జర్మనీకి మధ్య యుద్ధ విరమణ ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడిక ప్రకారం 1) జర్మనీ తన సైన్యాలను మిత్రరాజ్యాల భూభాగాల నుంచి ఉపసంహరించుకొన్నది. 2) రైన్ భూభాగాన్ని నిస్సైనిక మండలంగా ప్రకటించడం జరిగింది. 3) జర్మనీ తన యుద్ధ సామగ్రినంతా మిత్రరాజ్యాల వశం చేసింది. 4) తాను లోగడ రష్యాతో, రుమేనియాతో చేసుకొన్న సంధులను జర్మనీ రద్దు చేసుకొన్నది.

## 12.2.2 పారిస్ శాంతి సమావేశం :

యుద్ధ విరమణ ఒడంబడిక ప్రకారం శాంతి సంధికి సంబంధించిన వివరాలు చర్చించి నిర్ణయాలు చేయడానికి పారిస్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. పారిస్‌కు సమీపంలోని వర్సైల్స్ నగరంలో గల పేరు మోసిన అద్దాల భవనంలో 1919 జనవరి 18వ సమావేశం మొదలైంది. ఇక్కడే, ఈ భవనంలోనే ఇదే రోజున 48 సంవత్సరాల క్రితం ఫ్రాన్స్‌ను జర్మనీ అవమానపరిచింది. ఈ భవనంలోనే యుద్ధంలో ఘోర పరాజయానికి గురై, చితికిపోయి, అవమానాల పాలైన జర్మనీ భవితవ్యం నిర్ణయించబడింది.

## 12.2.3 సమావేశానికి హాజరైన ప్రతినిధులు :

పారిస్ శాంతి సమావేశానికి మిత్రరాజ్యాల ప్రముఖులు హాజరైనారు. ఈ సమావేశంలో పాల్గొనే హక్కును జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, టర్కీ, బల్గేరియా దేశాలకు నిరాకరించడం జరిగింది. ఈ సమావేశంలో ఫ్రాన్స్ తరపున ఆ దేశపు ప్రధానమంత్రి క్లెమెన్ స్యూ, యుద్ధ సంధాత విజేతైన మార్షల్ ఫాక్, అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు ఉడ్రో విల్సన్, ఇంగ్లాండ్ తరపున లాయిడ్ జార్జి, ఇటలీ ప్రధానమంత్రి ఆర్లెండో, జపాన్ తరపున సార్క్విస్ సైయాన్‌జి, దక్షిణాఫ్రికా తరపున బోధా స్మట్‌లు పాల్గొన్న ప్రముఖులు. ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, న్యూ ఫౌండ్ లాండ్ ప్రధానమంత్రులు, ఇండియా, అరేబియా నుండి రాకుమారులు, నూతనంగా ఆవిర్భవించిన యుగోస్లావియా, పోలెండ్, జకోస్లవేకియా ప్రధాన మంత్రులు ఈ సమావేశానికి హాజరైనారు.

పారిస్ శాంతి సమావేశం 1919 జనవరి 18న లాంఛనప్రాయంగా ప్రారంభమైంది. ఈ సమావేశంలో జటిల సమస్యల మీద నాలుగైదు నెలలపాటు సుదీర్ఘమైన చర్చలు జరిగినాయి. ఈకాలంలో అనేక రహస్య సమావేశాలూ, బహిరంగ సమావేశాలు జరిగినాయి. అన్ని ప్రముఖ నిర్ణయాలు అగ్రనాయకులైన క్లెమెన్‌స్యూ, లాయిడ్ జార్జి, ఆర్లెండో, విల్సన్‌ల అంగీకారంతో జరిగాయి. చివరకు 1919 మే నాటికి సంధి ముసాయిదా పత్రాలు తయారయినాయి. 230 పేజీల సంధి ముసాయిదా 15 భాగాలుగా, 439 ప్రకరణాలుగా విభజితమయింది. సంధి ముసాయిదా సంతకాల కోసం జర్మన్ ప్రతినిధుల ముందు ఉంచినారు. జర్మన్ ప్రతినిధులు 1919 ఏప్రియల్ 30 నాటికే పారిస్ పట్టణం చేరుకొన్నారు. అయితే జర్మన్ ప్రతినిధులు పారిస్ పట్టణంలో దాదాపుగా ఖైదీలుగా ఉండి అవమానానికి గురిఅయినారు. సంధి పత్రాల మీద సంతకాలు చేయడానికి జర్మన్ ప్రతినిధి వర్గానికి మూడు వారాల వ్యవధినిచ్చినారు. సంధి పత్రాల మీద సంతకాలు చేయడానికి జర్మన్ ప్రతినిధులు మొదట నిరాకరించి, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను చేసినారు. కాని చివరకు మిత్రరాజ్యాల బలవంతంమీద గత్యంతరం లేక జర్మన్ ప్రతినిధులు సంధి పత్రాల మీద 1919 జూన్ 28న వర్సే అద్దాల భవనంలో సంతకాలు చేసినారు. ఈ సంధిని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాలు ఆమోదించినాయి. ఈ సంధికే వర్సైల్స్ శాంతి ఒప్పందమంటారు. ఈ సంధిని అమెరికా ధృవపరచలేదు.

## 12.2.4 వివిధ శాంతి సంధులు :

శాంతి సాధన కోసం యుద్ధంలో ఓడిపోయిన ముఖ్య దేశాలతో చేసుకొన్న సంధులకు తోడు అనేక ఇతర ఒడంబడికలు కూడా జరిగాయి. అవి : 1919 జూన్ 28న జర్మనీతో చేసుకొన్న వర్సే సంధి, 1919 సెప్టెంబర్ 10న ఆస్ట్రియాతో జరిగిన సెంట్ జర్మేయిన్ సంధి, 1919 నవంబర్ 27న బల్గేరియాతో జరిగిన న్యూల్లీ సంధి, 1920 జూన్ 4న హంగరీతో జరిగిన ట్రియనాన్ సంధి, మైనారిటీ సంధులు.

## 12.2.5 వర్సే సంధి షరతులు :

మిత్రరాజ్యాల ఆదేశానుసారం జర్మన్ ప్రతినిధులు 1919 జూన్ 28న సంధి పత్రాల మీద సంతకాలు చేశారు. దీనిని పారిస్ సమావేశానంతరం జరిగిన వర్సే సంధి అంటారు. దీనినే జర్మన్‌లు తమమీద బలవంతంగా రుద్దిన సంధి అని, అందువల్ల నైతికంగా తాము దానికి కట్టుబడి ఉండనక్కరలేదని వాదించినారు.

### 12.2.5.1 ప్రాదేశిక ఏర్పాట్లు :

వర్సే సంధి ప్రకారం యూరప్‌లో జరిగిన ప్రాదేశిక మార్పులు :

1) 1871లో ఫ్రాన్స్ పోగొట్టుకొన్న ఆల్సేస్, లోరేయిన్ ప్రాంతాలను తిరిగి పొందింది.

2) జర్మన్ దురాక్రమణ వల్ల జరిగిన నష్టానికి పరిహారంగా యూపెన్, మాల్‌మెడి, మొర్సెనెట్ అను భూభాగాలను బెల్జియం పొందింది.

3) ఉత్తర ష్లెస్‌విగ్‌ను ప్రజాభిప్రాయాన్ని అనుసరించి డెన్మార్క్‌కు ఇవ్వడం జరిగింది.

4) పోసెన్, పశ్చిమ ప్రష్యా, కషూబ్ జిల్లా, ఎగువ సైలీషియా పోలెండ్‌కు ఇచ్చారు.

5) సార్ లోయ నానాజాతి సమితి ఆధీనంలో ఉంచినారు. దానిలోని బొగ్గుగనులు ఫ్రాన్స్‌కు ఇచ్చినారు. 15 సంవత్సరాల తరవాత జనవాక్య సేకరణ ప్రాతిపదికగా సార్‌లోయ భవిష్యత్‌ను నిర్ణయించడం జరుగుతుంది.

6) మెమెల్ ముఖ్యమైన మిత్రరాజ్యాల కిచ్చినారు. 1925లో లిథువేనియా పరమయింది.

7) సెగువ సైలేషియాలో కొద్దిభాగం చెకొస్లొవాకియాకు ఇవ్వడం జరిగింది.

8) ఆస్ట్రియాను సంపూర్ణ స్వతంత్ర దేశంగా జర్మనీ గుర్తించింది.

9) జర్మన్ పట్టణమైన డాన్ జిగ్ స్వేచ్ఛా పట్టణంగా ప్రకటించి నానాజాతి సమితి పరిపాలన కింద ఉంచినారు.

10) 260 మైళ్ళ పొడవు, 80 మైళ్ళ వెడల్పు ఉన్న జర్మన్ కారిడార్ పోలండ్ ఆధీనంలోకి వచ్చింది.

11) జర్మన్ వలసలు మిత్రరాజ్యాల పర్యవేక్షణలోకి వచ్చాయి. వీటిని ఆదిష్ట ప్రాంతాలు అంటారు. ఎ) టోగోలాండ్, టాంగనీకా బ్రిటీష్ పరిపాలనలోకి వచ్చినాయి. బి) జర్మన్ నైరుతి ఆఫ్రికా పరిపాలనాధికారం దక్షిణాఫ్రికా ప్రభుత్వానికిచ్చినారు. సి) జర్మన్ సమోవా దీవులు న్యూజీలాండ్ ఆధీనంలో ఉంచినారు. డి) మార్షల్ దీవుల పరిపాలనా బాధ్యతను జపాన్‌కు అప్పగించినారు. ఇ) జర్మన్ న్యూగయానా పరిపాలన ఆస్ట్రేలియాకు అప్పగించినారు. ఎఫ్) చైనాలోని నియాచౌ, షాన్‌టుంగ్ రాష్ట్రాలు జపాన్‌కు ఇచ్చినారు. జి) చైనా, సయామ్, మొరాకో మొదలైన దేశాలలో జర్మనీ తనకున్న కొన్ని హక్కులను, అధికారాలను కూడా వదులుకోవలసివచ్చింది.

### 12.2.5.2 సైనిక నిబంధనలు :

వర్సే సంధిలోని సైనిక నిబంధనలు ప్రకారం :

1) జర్మనీ నిర్బంధ సైనిక విధానాన్ని విడనాడవలెను. జర్మనీ సైనిక బలం ఒక లక్షకు పరిమితం చేయవలెను.
2) రైన్ నది ఎడమ భాగం పూర్తిగాను, కుడి భాగం కొంతవరకు నిస్సైనిక మండలంగా ప్రకటించడానికి జర్మనీ సమ్మతించింది. జర్మనీలోని రక్షణ నిర్మాణాలు, యుద్ధ సామగ్రి పూర్తిగా ధ్వంసంగావించారు.
3) జర్మన్ నౌకాదళం ఆరు యుద్ధ నౌకలకు, ఆరు చిన్న యుద్ధనౌకలకు, 12 నౌకా విధ్వంసక నావలకు పరిమితమయింది.
4) జర్మనీకి విమానబలము ఉండకూడదు.
5) రైన్ భూభాగము 15 సంవత్సరాల వరకు మిత్రరాజ్యాల సైనిక ఆక్రమణలో ఉంటుంది.
6) జర్మన్ నదులు, కాలువలు అంతర్జాతీయ కమీషన్ అధికారంలో ఉంచడం జరిగింది.

### 12.2.5.3 ఆర్థిక నిబంధనలు :

వర్సే సంధిలోని ఆర్థిక నిబంధనల ప్రకారం :

1) జర్మన్ వాణిజ్య నౌకలు ఫ్రాన్స్‌కు, జర్మన్ యుద్ధ నౌకలు బ్రిటన్‌కు ఇచ్చారు.
2) యుద్ధకాలంలో మిత్రరాజ్యాలు పోగొట్టుకున్న నౌకలస్థానే కొత్త నౌకలను తన ఖర్చు మీద జర్మనీ నిర్మించి ఇవ్వవలెను.
3) సయామ్, లైబీరియా, మొరాకో, ఈజిప్ట్, టర్కీ, బల్గేరియాలలో తనకున్న ఆస్తి హక్కులను, అధిరాజ్యాల హక్కులను జర్మనీ వదులుకొన్నది.
4) విదేశాలలో ఉన్న జర్మన్ పౌరుల ఆస్తులను జప్తు చేసే అధికారం మిత్రరాజ్యాలకు వచ్చింది.
5) జర్మనీ రాబోయే పది సంవత్సరాలలో అధిక పరిమాణంలో బొగ్గును ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం దేశాలకు సరఫరా చేయవలెను.
6) ఐదు సంవత్సరాల కాలం జర్మన్ ఎగుమతి, దిగుమతి వ్యాపారం మీద మిత్రరాజ్యాలకు ప్రత్యేకాధికారాలు ఉంటాయి.
7) జర్మనీ ఐదు వేల రైలు ఇంజన్‌లను, ఒక లక్షా యాభైవేల మోటారులను మిత్రరాజ్యాలకు ఇవ్వవలెను.
8) జర్మనీలోని ఎల్బ్, ఓడర్ నదులు అంతర్జాతీయమైనాయి.
9) కీల్ కాలవను కూడా అంతర్జాతీయం చేసినారు.

### 12.2.5.4 నష్టపరిహార సమస్య :

వర్సే సంధిలోని నష్టపరిహారానికి సంబంధించిన నిబంధనల ప్రకారం :

1) జర్మనీ తనకున్న పెద్ద వాణిజ్య నౌకలను, ఓడలలో సగ భాగాన్ని, ఆవిరి ఓడలలో నాలుగో భాగాన్ని, చేపలు పట్టే నావలను మిత్రరాజ్యాలకు అప్పగించవలెను.
2) యుద్ధ కాలంలో విధ్వంసం చేసిన భవనాల స్థానే కొత్త భవనాలు నిర్మించడానికి కావలసిన భవన నిర్మాణ సామగ్రి జర్మనీ సమకూర్చవలెను.
3) వర్సే సంధి అమలులోకి వచ్చిన ఆరు మాసాలలో జర్మనీ తాను ఫ్రాంకో -జర్మన్ యుద్ధం కాలంలోను, మొదటి ప్రపంచ యుద్ధకాలంలోను ఫ్రాన్స్ నుంచి కాజేసిన ట్రోఫీలను, ప్రాచీన పత్రాలను, కళాఖండాలను తిరిగి ఫ్రాన్స్‌కు అప్పగించవలెను.

4) రెండో విలియం చక్రవర్తికి లోగడ బహుకరించిన కొరాన్ ప్రతిని హెజాజ్ రాజుకు ఇవ్వవలెను.

5) లొవయిన్ విశ్వవిద్యాలయానికి సంభవించిన నష్టాన్ని జర్మనీ గుర్తించి పరిహారంగా వ్రాతప్రతులను, పుస్తకాలను ఇవ్వడానికి అంగీకరించింది.

6) యుద్ధ కాలంలో బెల్జియం మిత్రరాజ్యాల నుంచి అప్పుగా తీసుకొన్న పెద్ద మొత్తం డబ్బును ఐదు శాతం వడ్డీతో జర్మనీ మిత్రరాజ్యాలకు చెల్లించవలెను.

7) జర్మనీలో ఉన్న రెండు ప్రఖ్యాతి వహించిన వర్ణచిత్రాలను బెల్జియంకు ఇవ్వవలెను.

### 12.2.5.5 న్యాయసంబంధమైన నిబంధనలు :

వర్సే సంధిలోని న్యాయసంబంధమైన నిబంధనల ప్రకారం :

1) జర్మనీ చక్రవర్తిని యుద్ధ నేరస్తుడుగా ప్రకటించారు.

2) జర్మన్ చక్రవర్తి రెండో విలియంతో సహా దాదాపు వందమంది జర్మన్ యుద్ధ నేరస్థులను విచారించడానికి ఏర్పాటు చేసినారు. అయితే హాలండ్ రక్షణలో ఉన్న రెండో విలియం చక్రవర్తిని విచారించడానికి వీలుపడలేదు. చివరకు 12 మంది యుద్ధ నేరస్థులను మాత్రమే విచారణ చేసినారు

### 12.2.5.6 యుద్ధ దోషారోపణ నిబంధన :

మొదటి ప్రపంచ యుద్ధానికి, యుద్ధకాలంలో జరిగిన నష్టాలకు పూర్తి బాధ్యత జర్మనీదే అనే అంశము వర్సే సంధిలో చేర్చడం జరిగింది.

### 12.2.5.7 రాజకీయ నిబంధనలు :

1) నానాజాతి సమితి స్థాపనకు సంబంధించిన నిబంధనలు వర్సే సంధిలో భాగంగా చేర్చినారు.

2) రష్యా, జర్మనీలు చేసుకొన్న బ్రెస్ట్-లిటోవస్క్ సంధి వంటి యుద్ధకాలంలో జరిగిన సంధులు, యుద్ధానికి ముందు జరిగిన సంధులు కూడా రద్దయినాయి.

3) జర్మనీ తూర్పు సరిహద్దు కొత్తగా నిర్ణయమయింది.

4) బెల్జియం, పోలండ్, యుగోస్లావియా, చెకొస్లావాకియా దేశాలను స్వతంత్ర్య దేశాలుగా గుర్తించడం జరిగింది.

వర్సే సంధి వల్ల జర్మనీ 28,000 చదరపు మైళ్ల భూభాగాన్ని, దాదాపు ఏడు మిలియన్‌ల జనాభాను పోగొట్టుకొన్నది. దీని ఫలితంగా జర్మనీ ఆర్థికంగా ఎక్కువ నష్టానికి గురి అయింది. ఇనుప ఖనిజాలు, బొగ్గు గనులు, రబ్బరు, కొబ్బరి మొదలైనవి ఉన్న భూములను జర్మనీ పోగొట్టుకొన్నది.

### 12.2.5.8 వర్సే సంధి - విమర్శ :

ఆధునిక కాలానికి చెందిన ఒక ముఖ్యమైన వివాదాస్పదమైన సంధి వర్సే సంధి. ఈ సంధి పరిష్కరించిన సమస్యల కన్నా, కొత్తగా సృష్టించిన సమస్యలే ఎక్కువని, బలప్రయోగం ద్వారా విధించబడిన ఈ ఒప్పందం బలవంతంగా కొనసాగింపబడవలెనని, విల్సన్ 14 సూత్రాలు 14 నిరాశలుగా మిగిలాయని, నిరాయుధీకరణ చెదరిన కలగా మిగిలిపోయిందని జె.ఎల్. కార్విన్ పండితుడు వ్యాఖ్యానించాడు. ఈ శాంతి సంధి కఠినాతికఠినమే గాక, అవమానకరమైనదని, షరతులకు కట్టుబడి

ఉండడం అసాధ్యమని కీన్స్ పండితుడు పేర్కొన్నాడు. శాంతి సంధి సంతృప్తికరమైనది కాకపోయినా, యుద్ధ విరమణకు తప్పనిసరైనందున సంతకం పెట్టానని మిత్రరాజ్యాల ప్రతినిధులలో ఒకరైన జనరల్ స్మట్స్ అంగీకరించాడు. ఈ సంధి తనమీద జరిగిన ఒక పెద్ద కుట్ర అని, బలవంతంగా రుద్దిన శాంతి అని జర్మన్‌లు అభిప్రాయపడినారు. ఏ దృష్టితో పరిశీలించినప్పటికీ వర్సే సంధి జర్మనీపట్ల అన్యాయంగా లేదని, గథార్ని - హార్డి అను పండితుడు అభిప్రాయపడినాడు. నిష్పాక్షికమైన కొంతమంది చరిత్రకారులు వర్సేసంధి లక్ష్యం జర్మనీని నిర్దాక్షిణ్యంగా అణచడమేనని అభిప్రాయపడినారు. ఈ సంధి మరొక యుద్ధప్రకటన వంటిదని ఫిలిప్ స్నోడెన్ అభిప్రాయపడినాడు. నిజానికి ఈ సంధి వల్ల జర్మనీ దయాదాక్షిణ్యాలు లేకుండా అవమానకరంగా శిక్షితురాలయిందని చెప్పవచ్చు.

జర్మనీ పట్ల మిత్రరాజ్యాలకు ఎంత పగ, ద్వేషము ఉన్నాయో, దయాదాక్షిణ్యాలు లోపించినాయో వర్సే సంధి నిరూపించింది. పారిస్ సమావేశ నాయకులు జర్మనీ పట్ల కనీస మర్యాద కూడా చూపలేదు.

శాంతిసంధిని తయారుచేసినవారు జర్మన్‌ల మనోభావాలను గాని, మానసిక ప్రతిక్రియను గాని లక్ష్యం చేయలేదు. మిత్రరాజ్యాలు జర్మనీ పట్ల మితిమీరిన కఠిన వైఖరిని అవలంబించకపోయినట్లయితే జర్మన్‌లు మారిన పరిస్థితుల కనుగుణంగా సర్దుకొని పోయేవారని కొందరి భావం. మిత్రరాజ్యాల పగ సాధింపు ధోరణి వల్ల జర్మన్ ప్రజలలో అసంతృప్తి, ద్వేషమూ ఎక్కువైనాయి.

జర్మనీ పట్ల మిత్రరాజ్యాలు చాలా అవమానకరమైన విధానాన్ని అనుసరించినాయి. రెండు ముఖ్య సిద్ధాంతాల మీద ఆధారపడి వర్సే సంధి రూపొందింది. ఒకటి యుద్ధానికి కారణమైన జర్మనీని శిక్షించడం, రెండోది భవిష్యత్తులో జర్మనీ దురాక్రమణ నుంచి యూరప్‌ను కాపాడడం. సంధి షరతులను తయారుచేసేటప్పుడు మిత్రరాజ్యాలు జర్మన్ ప్రతినిధులను ఏమాత్రం సంప్రదించలేదు. పైగా పారిస్ సమావేశంలో మిత్రరాజ్యాలు జర్మన్ ప్రతినిధులను దోషులుగా పరిగణించి అవమానించినారు. మిత్రరాజ్యాల నాయకులు బెదిరించి జర్మన్ ప్రతినిధులచేత సంతకాలు పెట్టించినారు.

వర్సే సంధి మీద సంతకాలు చేసిన దేశాలన్నీ నిరాయుధీకరణ సూత్రాన్ని ఆమోదించినాయి. కాని మిత్రరాజ్యాలు నిరాయుధీకరణను తమ విషయంలో అమలుపెట్టలేదు. జర్మనీ సైనిక బలం, నౌకాబలం మాత్రం పూర్తిగా నాశనమయినాయి. అందువల్ల అవకాశం దొరికినప్పుడు సంధిలోని సైనిక నిబంధనలను జర్మనీ తోసివేస్తే ఆశ్చర్యపడనక్కరలేదు.

వర్సే సంధి వల్ల జర్మనీకి ఆర్థికంగా చాలా అన్యాయం జరిగింది. జర్మనీ తన వలసలనన్నిటినీ పోగొట్టుకోవడమేగాక పారిశ్రామిక ప్రదేశాలను, ఖనిజ ప్రాంతాలను కోల్పోయి శక్తికి మించిన నష్టపరిహారాన్ని కూడా చెల్లించవలసి వచ్చింది.

జాతీయతా సిద్ధాంతాన్ని, స్వయం నిర్ణయ సిద్ధాంతాన్ని నిష్పాక్షికంగా అనుసరించడం జరగలేదు. ఈ సిద్ధాంతాల ననుసరించి పోలండ్, చెకోస్లోవాకియా, యుగోస్లావియా మొదలైన స్వతంత్ర రాజ్యాలను సృష్టించడం జరిగింది. కాని దీనికి భిన్నంగా జర్మన్ జాతి ప్రజలు పోలండ్, బోహీమియా, ఇటలీ మొదలైన దేశాల ఆధిపత్యంలో ఉన్నారు. అల్ప సంఖ్యాక ప్రజల సమస్యలు భవిష్యత్తులో అనేక అనర్థాలకు దారితీసినాయి.

వర్సే సంధిలో మూడు వాదాల సంఘర్షణ ఉన్నది. అవి విల్సన్ ఆదర్శవాదము, క్లిమెన్సో జాతీయవాదము, లాయిడ్ జార్జి అవకాశవాదం. బ్రిటన్, ఫ్రాన్స్‌ల స్వప్రయోజనాల మధ్య సంఘర్షణ ఏర్పడింది. ప్రపంచ నాయకత్వం కోసం అమెరికా, ఇంగ్లండ్‌ల మధ్య పోటీ ఏర్పడింది. వ్యాపార రంగంలో అమెరికా, జపాన్‌ల మధ్య పోటీ ఏర్పడింది. అంతేగాక మిత్రరాజ్యాల మధ్య ఉన్న రహస్య సంధులు ప్రజాస్వామ్య, స్వయం నిర్ణయ సిద్ధాంతాలకు అవరోధంగా ఉన్నాయి.

మిత్రరాజ్యాలు జర్మనీకి ఇచ్చిన వాగ్దానాలు అమలుకాలేదు. వర్సే సంధి పూర్తిగా విల్సన్ 14 సూత్రాల కనుగుణంగా లేదు. స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతము, స్వేచ్ఛా నౌకాయాన సిద్ధాంతము నిష్పాక్షికంగా అమలులోకి రాలేదు.

వర్సే సంధి నైతికంగా సమర్ధనీయం కాదు. సంధిలోని నిబంధనలు న్యాయసూత్రానికి అనుగుణంగా తయారుచేయలేదు. తన మీద విధించే నష్టపరిహారం మొత్తాన్ని చెల్లించడం జర్మనీకి సాధ్యం కాలేదు. ఎందువల్లనంటే ఈ సంధి వల్ల జర్మనీ తన వలసలను, పారిశ్రామిక ప్రదేశాలను, వ్యాపార సదుపాయాలను కోల్పోయింది. ఆర్థికంగా, సైనికంగా బలహీనమైపోయిన జర్మనీకి నష్టపరిహారం చెల్లించడం మోయలేని భారమైంది. ఈవిధంగా మిత్రరాజ్యాలు జర్మనీపట్ల నైతికంగా సమర్థనీయం కాని విధానాన్ని అనుసరించాయి.

జర్మనీ వలసలను ఆదిష్ట ప్రాంతాలుగా ప్రకటించి మిత్రరాజ్యాల పరిపాలనలో ఉంచడం జరిగింది. నైతికంగా ఈ ఏర్పాటు సమర్థనీయం కాదు. ఆదిష్ట ప్రాంతాలలో మిత్రరాజ్యాల పాలన జర్మనీ పరిపాలన కంటే ఏవిధంగాను మెరుగుగా లేదు. జాతీయతా సిద్ధాంతము, స్వయం నిర్ణయ సిద్ధాంతము జర్మనీ విషయంలో సరిగా అనుసరించలేదు. ఇది నైతికంగా సమర్థనీయం కాదు. నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని మిత్రరాజ్యాలు అనుసరించలేదు. అందువల్ల మిత్రరాజ్యాలను జర్మనీ వంచకులుగా నిందించడం నిరాధారం కాదు అనిపిస్తుంది.

వర్సేసంధిలో ఆచరణ సాధ్యం కాని అంశాలు కూడా ఉన్నాయి. జర్మనీ వంటి ప్రథమ శ్రేణికి చెందిన అగ్రరాజ్యాన్ని ఎక్కువకాలం బలహీన పరిస్థితులలో ఉంచడం సాధ్యం కాదు. జర్మనీకి చెందిన భూభాగాలు అనేక దేశాలకు బదిలీ చేయడం, జర్మనీలో పోలిష్ కారిడార్ సృష్టించడం, జర్మన్ బొగ్గు గనులు, ఇనుప ఖనిజాలు ఫ్రెంచివారి ఆధీనంలో ఉంచడం మొదలైన ఏర్పాట్ల వల్ల జర్మన్‌లు చాలా అవమానానికి గురిఅయినారు. గొప్ప సంస్కృతి కలిగిన జర్మనీ వంటి అగ్రరాజ్యం అవమానాన్ని ఎంతోకాలం భరించలేకపోయింది. అందువల్ల భవిష్యత్తులో జరగబోయే అనేక అనర్థాలకు వర్సే సంధిలో బీజాలున్నాయని చెప్పవచ్చు. ఈ సంధి వల్ల జర్మనీ వలసలనే గాక తన రాజ్యంలో ఎనిమిదో వంతు భూభాగాన్ని, ఏడు మిలియన్‌ల జనాభాను కోల్పోయింది. పరిశ్రమలను, పశు సంపదను కోల్పోయింది. జర్మనీ ఆర్థిక దుస్థితిని గమనించకుండా మిత్రరాజ్యాలు పెద్ద మొత్తం నష్టపరిహారాన్ని జర్మనీ మీద విధించినాయి. ఆర్థిక సంక్షోభానికి లోనై, నిరుద్యోగ వర్తక మాంద్యాలతో సతమతమవుతున్న జర్మనీ పెద్ద మొత్తంలో నష్టపరిహారాన్ని చెల్లించడం సాధ్యపడని విషయం.

వర్సే సంధిని తమ మీద బలవంతంగా రుద్దిన శాంతి అని జర్మన్‌లు వర్ణించారు. ఈ సంధి యుద్ధంలో గెలిచిన రాజ్యాలు ఓడిపోయిన రాజ్యాల మీద దయాదాక్షిణ్య రహితంగా విధించిన శిక్ష అని జర్మన్‌లు భావించారు. వర్సే సంధిని అన్యాయమైన సంధి అని జర్మన్‌లు పేర్కొన్నారు. అయితే ఏ సంధినైనా న్యాయమైనదో, అన్యాయమైనదో నిర్ణయించడం సులభం కాదు. అంతేగాక ఒక గొప్ప యుద్ధం తరవాత న్యాయమైన సంధి నిబంధనలను తయారుచేయడం తేలికైన పనికాదు. మిత్రరాజ్యాలు తమపట్ల పగసాధింపు ధోరణిని అవమానకరమైన ధోరణిని అనుసరించాయని జర్మన్‌లు భావించారు. వర్సే సంధి నిబంధనలను తయారుచేసేటప్పుడు పారిస్ సమావేశం నాయకులకు జర్మనీపట్ల యూరప్ ప్రజలకున్న కోపాన్ని, ద్వేషాన్ని కప్పిపుచ్చడం సాధ్యపడలేదు. అంతేగాక శాంతిసంధులు ఎప్పుడూ ఓడిపోయిన రాజ్యాల దృష్టిలో అన్యాయంగానే ఉంటాయి. ఈ సంధి విల్సన్ సూత్రాలకు అనుగుణంగా తయారు చేయడం జరగలేదని జర్మన్‌లు భావించినారు. నిజానికి స్వయం నిర్ణయ సిద్ధాంతాన్ని జర్మనీపట్ల నిష్పాక్షికంగా అమలు చేయలేదు. వర్సే సంధి మొత్తం మీద జర్మన్‌ల మీద బలవంతంగా రుద్దిన శాంతి అని చెప్పిన ఇ.హెచ్. కార్ మాటల్లో సత్యం లేకపోలేదు. ఈ సంధిని తయారుచేసేటప్పుడు జర్మన్ ప్రతినిధులలో మిత్రరాజ్యాలు సంప్రదించలేదు. అంతేగాక మిత్రరాజ్యాలు బెదిరించి బలవంతంగా జర్మన్ ప్రతినిధుల చేత వర్సే సంధి పత్రాలమీద సంతకాలు చేయించినారు.

వర్సే సంధిలోని కొన్ని షరతులు నిస్సందేహంగా జర్మనీ పట్ల చాలా కఠినంగా ఉన్నాయి. ఈ సంధి వల్ల జర్మన్ ప్రజలలో ఆగ్రహం పెరిగి జాతీయభావం మరింత తీవ్రమై శాంతి భద్రతలకు భంగం కలిగింది. నిజానికి వర్సే సంధి 20 సంవత్సరాల కాలం మాత్రమే అమలులో ఉన్న తాత్కాలిక సంధి అని చెప్పవచ్చు. రెండో ప్రపంచ యుద్ధానికి బీజాలు వర్సే

సంధిలోనే ఉన్నాయని కొంతమంది విమర్శకుల అభిప్రాయం. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా జర్మనీ వంటి గొప్పదేశం కఠినమైన షరతులతో కూడిన వర్సే సంధిని ఎక్కువ కాలం అమలుపరచడం సాధ్యం కాలేదు. చాలా మంది చరిత్రకారులు చెప్పినట్లుగా జర్మనీ వర్సే సంధిని ఉల్లంఘించడం రెండో ప్రపంచ యుద్ధానికి ఒక ముఖ్యకారణమని చెప్పవచ్చు. 1926లో జర్మనీ సమితిలో సభ్యరాజ్యంగా చేరినప్పటి నుంచి ఒకదాని తరవాత ఒకటి సంధి షరతులను ఉల్లంఘించడం ప్రారంభించింది. 1938 నాటికి హిట్లర్ నాయకత్వంలో జర్మనీ బలమైన సైనిక రాజ్యంగా రూపొందింది. 1939 లో హిట్లర్ బోహీమియా, మొరేవియా, పోలండ్‌లను ఆక్రమించుకోవడంతో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది.

### 12.2.5.9 వర్సే సంధి విఫలమవడానికి కారణాలు :

వర్సే సంధి విఫలమవడానికి అనేక కారణాలు గలవు. అవి :

1) వర్సే సంధి యుద్ధంలో గెలిచిన రాజ్యాలు, ఓడిపోయిన రాజ్యాలు కూడా సంతృప్తి చెందలేదు.
2) వర్సే సంధిని తయారుచేసిన వారికి అనుభవపూర్వకమైన దృష్టిలేదు.
3) మిత్రరాజ్యాలు సంధిలోని నిబంధనలను ఖచ్చితంగా అమలుపరచడంలో విఫలమైనాయి. అందువల్ల సంధిని ఉల్లంఘించడానికి జర్మనీకి ఒకవిధమైన ఉత్సాహం, ప్రేరణ కలిగినాయి.
4) జర్మనీ వంటి రాజ్యాన్ని ఎక్కువ కాలం బలహీనస్థితిలో ఉంచడం సాధ్యపడలేదు.
5) అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఏర్పడిన సిద్ధాంతా విభేదాలు జర్మనీ తిరిగి తలెత్తడానికి అవకాశమిచ్చినాయి.

### 12.2.6 సెంట్ జర్మెయిన్ సంధి :

మిత్రరాజ్యాలు 1919 సెప్టెంబర్ 10న ఆస్ట్రియాలో చేసుకొన్న సంధిని సెంట్ జర్మెయిన్ సంధి అంటారు. ఈ సంధి ప్రకారం :

1) ఆస్ట్రియా-హంగరీ సామ్రాజ్యాన్ని రెండు భాగాలుగా చేసి హంగరీని స్వతంత్ర రాజ్యంగా గుర్తించడం జరిగింది.
2) కొత్త ఆస్ట్రియా రాజ్యం ఎక్కువ భూభాగాన్ని, జనాభాను కోల్పోయింది.
3) ట్రిస్టి. ఇస్ట్రియా, బ్రెన్నర్ కనుమ, డాల్మేషియాలో కొన్ని భాగాలు ఇటలీకి ఇచ్చినారు.
4) బోస్నియా, హెర్జిగోవినా, డాల్మేషియా తీరం యుగోస్లావియాకిచ్చారు.
5) బోహీమియా, మొకావియా, స్లావాకియాలను చెకొస్లావాకియాలో చేర్చారు.
6) బుకోవినా, ట్రాన్సిల్వేనియాలను రుమేనియాకిచ్చినారు.
7) గలీషియాను పోలండ్ కిచ్చినారు.
8) ఆస్ట్రియా సైనిక బలం 30 వేలకు పరిమితం చేశారు.
9) యుగోస్లావియా భూ భాగం ద్వారా ఆస్ట్రియాకు ఏడ్రియాటిక్ సముద్రంతో సంబంధాలుంటాయి.
10) ఆస్ట్రియా తన వలస సామ్రాజ్యాన్ని, వ్యాపార సదుపాయాలను కూడా కోల్పోయింది.
11) ఈ సంధి వల్ల ఆస్ట్రియా 31,756 చదరపు మైళ్ళ విస్తీర్ణమున్న చిన్న దేశంగా రూపొందింది.

## 12.2.7 న్యూల్లీ సంధి :

1919 నవంబరు 27న మిత్రరాజ్యాలు బల్గేరియాతో న్యూల్లీ సంధి చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం :

1) బల్గేరియన్‌లు అధికంగా ఉన్న పశ్చిమ బల్గేరియాను యుగొస్లావియా కిచ్చినారు.

2) పశ్చిమ థ్రేస్‌ను, ఈజియన్ తీరాన్ని గ్రీస్‌కు బదిలీ చేసినారు. అయితే బల్గేరియాకు ఈజియన్ తీరంతో సంబంధాలుంటాయి.

3) బల్గేరియా సైనిక బలం 20 వేలకు పరిమితమయింది. నౌకాబలాన్ని పూర్తిగా నిషేదించారు.

4) బల్గేరియా పెద్ద మొత్తం నష్టపరిహారాన్ని చెల్లించవలసి వచ్చింది.

5) ఈ సంధి వల్ల బల్గేరియా విరోధి దేశాల ద్వారా సముద్రతీరంతో సంబంధాలను పెట్టుకోవలసి వచ్చింది.

6) బల్గేరియా మూడు లక్షల జనాభాను పోగొట్టుకొని బాల్కన్ ప్రాంతంలో చాలా బలహీనమైన రాజ్యంగా రూపొందింది.

## 12.2.8 ట్రియనాన్ సంధి :

మిత్రరాజ్యాల సహాయంతో ఆడ్మిరల్ హోర్థి నాయకత్వంలో హంగరీలో ఒక నూతన ప్రభుత్వమేర్పడింది. మిత్రరాజ్యాలు ఈ నూతన ప్రభుత్వంలో 1920 జూన్ 4న ట్రియనాన్ సంధి చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం :

1) హంగరీని ఆస్ట్రియా నుంచి విడదీసి స్వతంత్ర రాజ్యంగా చేసినారు.

2) ట్రాన్సిల్వేనియాను రుమేనియాకు ఇచ్చినారు.

3) క్రోషియాను యుగొస్లావియా కిచ్చినారు.

4) స్లావాకియాను చెకొస్లావాకియా కిచ్చినారు.

5) ఫ్యూమ్ రేవును స్వతంత్ర ప్రతిపత్తి గల నగరంగా మార్చి 1924లో ఇటలీకి ఇచ్చినారు.

6) హంగరీ సైనిక బలం 35 వేలకు పరిమితమయింది.

7) హంగరీ నష్టపరిహారాన్ని కూడా చెల్లించవలసి వచ్చింది.

8) హంగరీ మూడింట రెండు వంతుల భూభాగాన్ని, జనాభాను పోగొట్టుకొన్నది.

## 12.2.9 సెవెర్స్ సంధి :

మిత్రరాజ్యాలు టర్కీతో 1920 ఆగస్టులో సెవెర్స్ సంధి చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం :

1) టర్కీ నుంచి ఆసియామైనర్, థ్రేస్, ఏడ్రియానోపుల్, గల్లిపోలీలను విడదీసి గ్రేస్ కిచ్చినారు.

2) సిరియాను ఫ్రాన్స్‌కిచ్చినారు.

3) పాలస్తీనా, మెసపొటేమియాలను ఇంగ్లండ్ కిచ్చినారు.

4) హెజాజ్ రాజును స్వతంత్రుడుగా ప్రకటించడమయింది.

5) టర్కీ రాజ్యం ఆసియాకు పరిమితమయింది.

6) టర్కీ సైనిక బలం 50 వేలకు పరిమితమయింది.

7) టర్కీ రేవులు అంతర్జాతీయ నియంత్రణలో ఉంచడమయింది.

## 12.2.10 మైనారిటీలకు సంబంధించిన సంధులు :

పారిస్ శాంతి సమావేశం ఫలితంగా జరిగిన శాంతి సంధుల వల్ల అనేక నూతన రాజ్యాలు అవతరించినాయి. నూతన రాజ్యాలలోను, అనేక ఇతర రాజ్యాలలోను అతి క్లిష్టమైన అల్పసంఖ్యాక వర్గాల సమస్యలు తలెత్తినాయి. మైనారిటీల భద్రతా సమస్యలను పరిశీలించడానికి పారిస్ సమావేశం ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘం సిఫారసుల ఆధారంగా అల్పసంఖ్యాక వర్గాల సమస్యలను పరిష్కరించడానికి మిత్రరాజ్యాలు చెకొస్లోవాకియా, యుగొస్లావియా, రుమేనియా, గ్రీస్ మొదలైన దేశాలతో కొన్ని మైనారిటీ సంధులు చేసుకొన్నాయి. ఈ సంధుల ఫలితంగా మైనారిటీల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, మానవతా హక్కులను చాలావరకు కాపాడినారు. అంతేగాక అల్పసంఖ్యాక వర్గాలు నానాజాతి సమితి పర్యవేక్షణలో ఉంటాయి.

## 12.2.11 ముగింపు :

వర్సే సంధి షరతులు జర్మనీలో మరోసారి నిరంకుశ ప్రభుత్వ స్థాపనకు, హిట్లర్ దురహంకార విధానాలకు దోహదం చేసి, రెండో ప్రపంచ యుద్ధానికి కారణమైంది. ఈ సంధి వల్ల తూర్పు యూరప్‌లో చిన్నచిన్న రాజ్యాలు ఏర్పడ్డాయని, అవి తరువాత కాలంలో నాజీ జర్మనీ ధాటికి లొంగిపోయాయని సీమన్ పండితుడు అభిప్రాయపడినాడు. ఈ సమావేశం చర్చలన్నీ న్యాయబద్ధంగా సర్దుబాట్లు చేసుకొనవలెననే ఆదర్శం మధ్య, తుల్య ప్రాబల్యం, గెలిచిన రాజ్యాలు లాభాలు పొందాలనే ఆకాంక్ష మధ్య సర్దుబాట్లుగా మారాయని కెటిల్ బీ పండితుడు వ్యాఖ్యానించాడు. మొత్తం మీద వర్సేసంధి చాలా అసంతృప్తికరమైనది. ఈ శాంతి సంధి విల్సన్ సూత్రాలనే ఆదర్శపు ముసుగును ధరించిన సామ్రాజ్యవాద శాంతి. ఈ సంధి ఐరోపా ఖండ రాజకీయ వాతావరణాన్ని కలుషితంచేసి, జర్మనీలో సైనిక నియంతృత్వాన్ని లేపి, ప్రపంచాన్ని రెండో ప్రపంచ యుద్ధానికి బలి చేసింది.

## 12.2.12 నమూనా ప్రశ్నలు :

1. వర్సైల్స్ సంధి షరతులను వివరించి, వాటి లోపాలను పేర్కొనుము.
2. రెండో ప్రపంచ యుద్ధానికి, మొదటి ప్రపంచ యుద్ధానంతరం చేసిన సంధి షరతులు ఎంతవరకు కారణమో విశదీకరింపుము.
3. సెవెర్స్ సంధి

## 12.2.13 చదువదగిన గ్రంథాలు :


1. C.J. A.H. Hayes - Modern Europe since 1870
2. C.D. Hazan - Modern Europe upto 1945
3. D. Thamson - Europe since Nepoleon
4. H.L. Peacock - Modern European History 1789-1973
5. E. Lipson - Europe between the Two World Wars


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 13

# నానాజాతి సమితి

## 13.0 లక్ష్యం :

నానాజాతి సమితి ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులు, దాని లక్ష్యాలు, ఆ సంస్థ వివిధ అంగాలు, వాటి పనితీరు, సమితి సాధించిన విజయాలు, పొందిన అపజయాలు, సమితి అంతిమ వైఫల్యం గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయసూచిక :


13.1. పరిచయం

13.2 తొలి ప్రయత్నాలు

13.2.1 హేగ్ సమావేశాలు

13.2.2 విల్సన్ 14 సూత్రాలు

13.3. సమితి ముఖ్యోద్దేశాలు, లక్ష్యాలు

13.4 సభ్యత్వం

13.5 సమితి నిర్మాణం

13.5.1 సమితి మహాసభ

13.5.2 సమితి మండలి

13.5.3 సమితి సచివాలయం

13.5.4 శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానము

13.5.5 అంతర్జాతీయ కార్మిక సంస్థ

13.5.6 సహాయక అంగాలు

13.6 సమితి కార్యకలాపాలు

13.6.1 సమితి సాధించిన రాజకీయ విజయాలు

13.6.1.1 ఆలండ్ దీవుల వివాదము

13.6.1.2 ఆల్బేనియా సరిహద్దు వివాదము

13.6.1.3 ఎగువ సైలీషియా తగాదా

13.6.1.4 పోలెండ్ - లిథుమేనియాల మధ్య తగాదా

13.6.1.5 కార్ఫూ వివాదము

13.6.1.6 జర్మనీ - బెల్జియంల మధ్య తగాదా

13.6.1.7 గ్రీస్ - బల్గేరియాల మధ్య తగాదా

13.6.1.8 మోసుల్ వివాదము

13.6.1.9 బొలీవియా - పరేగ్వేల మధ్య తగాదా

**13.6.2 ఆర్థిక, సాంఘిక,మానవతా రంగాలలో సమితి కార్యకలాపాలు (రాజకీయేతర రంగంలో సమితి కృషి)**

**13.6.3 సార్ పాలన**

**13.6.4 డాన్‌జిగ్ పరిపాలన**

**13.6.5 ఆదిష్టపద్ధతి** (Mandates Systems)

**13.6.6 అల్పసంఖ్యాత వర్గాలు**

**13.6.7 నిరాయుధీకరణ**

**13.7 సమితి క్షీణదశ**

**13.7.1 మంచూరియా మీద జపాన్ దురాక్రమణ**

**13.7.2 ఇథియోపియా మీద ఇటలీ దురాక్రమణ**

**13.7.3 స్పెయిన్‌లో అంతర్యుద్ధము**

**13.8 సమితి విఫలం కావటానికి గల కారణాలు**

**13.8.1 సమితి ఒడంబడికలోని లోపాలు**

**13.8.2 అగ్రరాజ్యాల వైఖరి**

**13.8.3 మితిమీరిన జాతీయ భావము**

**13.8.4 అగ్రరాజ్యాలు సమితిలో చేరకపోవడం**

**13.8.5 తృప్తిపరచే విధానము**

**13.8.6 సమితికి సాయుధబలం లేకపోవడం**

**13.8.7 నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసికోవాలనే సూత్రం**

**13.8.8 నియంతృత్వ ప్రభుత్వాల విధానం**

**13.8.9 నిరాయుధీకరణ ప్రయత్నాలు విఫలం కావడం**

**13.8.10 ఆర్థిక వనరుల లోపం**

**13.8.11 వర్సే సంధిలోని లోపాలు**

**13.8.12 జర్మనీ ప్రతీకార వాంఛ**

**13.9 ముగింపు**

**13.10 నమూనా ప్రశ్నలు**

**13.11 చదువదగిన గ్రంథాలు**

## 13.1 పరిచయం :

అంతర్జాతీయ వివాదాలు శాంతియుతంగా పరిష్కారం కావలెననే యూరప్ దేశాల ప్రయత్నాల ఫలితంగా మొదటి ప్రపంచ యుద్ధానంతరం అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ 14 సూత్రాలలోని చివరి సూత్రం ఆధారంగా నానాజాతి సమితి అనే ఒక అంతర్జాతీయ సంస్థను నెలకొల్పడం జరిగింది. వాస్తవానికి ఇది పూర్తిగా కొత్త సంస్థ కాదు. ప్రాచీన యుగంలో రోమన్ సామ్రాజ్యం, మధ్యయుగంలో పవిత్ర రోమన్ సామ్రాజ్యం, రోమన్ కాథలిక్ చర్చి ప్రపంచదేశాల మధ్య సార్వత్రిక సహకారం

ఉండవలెననే ఆదర్శాన్ని ప్రబోధించినాయి. ఆధునిక యుగంలో స్థాపితమైన యూరప్ దేశాల బద్ధ కూటమి అగ్రరాజ్యాల మధ్య సహకారం పెంపొందించడానికి ప్రయత్నించింది. మొదటి ప్రపంచయుద్ధకాలంలో, యుద్ధం ముగిసిన తరువాత జరిగిన ప్రయత్నాల ఫలితంగా నానాజాతి సమితి స్థాపించడం జరిగింది. యూరప్ రాజ్యాలబద్ధ కూటమి స్థానే నెలకొల్పబడిన సంస్థ నానాజాతి సమితి అని టాయిన్బీ పండితుడు పేర్కొన్నాడు. అయితే యూరప్ రాజ్యాలబద్ధకూటమి యూరప్‌కే పరిమితమైన సంస్థ కాగా నానాజాతి సమితి ప్రపంచ సంస్థ. సమిష్టి భద్రతకు ప్రాముఖ్యం ఇవ్వడం సమితి విషయమై చెప్పుకోదగిన ప్రత్యేకత.

## 13.2 తొలి ప్రయత్నాలు :

అంతర్జాతీయ శాంతి పరిరక్షణకు మొదటి ప్రపంచ యుద్ధానికిముందు, యుద్ధకాలంలో అనేక ప్రయత్నాలు జరిగాయి.

### 13.2.1 హేగ్ సమావేశాలు :

రష్యా చక్రవర్తి రెండో నికోలస్, నెదర్‌లాండ్స్ రాణి విల్ హెల్ మీనా అంగీకారంతో 1899లో హేగ్‌లో ప్రపంచశాంతి సమావేశాన్ని ఏర్పాడు చేశాడు. ఇదే బహుశా ప్రపంచశాంతి పరిరక్షణకు చేసిన తొలిప్రయత్నం. ఈ సమావేశానికి 26 రాజ్యాల ప్రతినిధులు హాజరయ్యారు. ఆయుధాల సాధారణ పరిమితి విషయంలో, యుద్ధం సంభవిస్తే కొన్నిరకాల ఆయుధాల పరిమితి వాడకంపై కొన్ని చర్యలు తీసుకోబడ్డాయి. అంతేగాక నిర్ణాయక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయడానికి కూడా నిర్ణయాలు తీసుకోబడ్డాయి. 1907లో అమెరికా అధ్యక్షుడు థియొడోర్ రూజ్‌వెల్ట్, రష్యా చక్రవర్తి రెండో నికోలస్ రెండో అంతర్జాతీయ శాంతి సమావేశాన్ని హేగ్‌లో ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి 44 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో యుద్ధాలలో విషవాయువును వినియోగించరాదని అంగీకరించడం జరిగింది. అంతేగాక క్షతగాత్రులైన యుద్ధఖైదీల విషయంలో అనుసరించదగు ఒక నియమావళి రూపొందించబడింది. వీటికితోడు హేగ్‌లో శాశ్వత నిర్ణాయక న్యాయస్థానం స్థాపించబడింది. అంతర్జాతీయ వివాదాల పరిష్కారంలో ఈ న్యాయస్థానం సహాయపడుతుంది. అంతర్జాతీయ శాంతి, సహకారాల సాధనకు 1915లో మూడో హేగ్ సమావేశం జరపాలని నిర్ణయించినా 1914లో మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమవడంతో ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయి.

### 13.2.2 విల్సన్ 14 సూత్రాలు :

మానవతావాది, ఆశావాది అయిన అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ మొదటి ప్రపంచ యుద్ధకాలంలో 1918లో జనవరి 8న గంభీరోపన్యాసం ఇస్తూ ప్రపంచ దేశాలను మిత్రరాజ్యాల యుద్ధ ఆశయాలకు బాసటగా నిలువమని విజ్ఞాపన చేశాడు. ఆ సమయంలోనే చరిత్ర ప్రసిద్ధికెక్కిన తన 14 సూత్రాలను ప్రతిపాదించి, ప్రవచించాడు. అవి :

1. దేశాలు రహస్యంగా కాక బహిరంగంగా ఒడంబడికలు చేసికోవలెను.
2. సముద్రాలను స్వేచ్ఛగా అన్నిదేశాలు ఉపయోగించుకోవలెను.
3. అంతర్జాతీయ వర్తకం స్వేచ్ఛగా జరగవలెను.
4. అన్ని దేశాలు ఆయుధబలాన్ని తగ్గించుకోవలెను.
5. వలసల హక్కులు న్యాయంగా నిర్ణయం కావలెను.
6. రష్యా భూభాగం నుంచి సైన్యాలను ఉపసంహరించవలెను.
7. బెల్జియం నుంచి విదేశ సైన్యాలను ఉపసంహరించి, బెల్జియం స్వాతంత్ర్యాన్ని కాపాడవలెను.
8. ఫ్రెంచి రాజ్యభాగాలైన ఆల్సేస్ - లొరేయిన్‌లను ఫ్రాన్స్‌కు ఇవ్వవలెను.

9. ఇటలీ దేశ సరిహద్దులు జాతీయతాసిద్ధాంతాన్ని అనుసరించి నిర్ణయం కావలెను.
10. ఆస్ట్రియా - హంగరీలోని అనేక జాతులకు స్వయంపాలన ఇవ్వవలెను.
11. బాల్కన్ రాజ్యాలైన రుమేనియా, సెర్బియా, మాంటెనీగ్రోల జాతీయతను గుర్తించాలి.
12. టర్కీలోని కొన్ని జాతులకు స్వయంపాలన ఇవ్వవలెను.
13. పోలెండ్ స్వాతంత్రరాజ్యం కావలెను.
14. అంతర్జాతీయ శాంతిసంస్థ ఏర్పడవలెను.

## 13.3. సమితి ముఖ్య ఉద్దేశ్యాలు, లక్ష్యాలు :

ఉడ్రోవిల్సన్ 14 సూత్రాలలోని చివరి సూత్రం ఆధారంగా నానాజాతి సమితి అనే ప్రపంచ సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. పారిస్ శాంతి సమావేశము 26 ప్రకరణాలతో, ఒక ప్రవేశికతో కూడిన సమితి ఒడంబడిక పత్రాన్ని ఆమోదించి వర్సే సంధిలో మొదటి భాగంగా చేర్చింది. నానాజాతి సమితి 1920 జనవరి నుంచి అమలులోకి వచ్చింది. సమితి ఉద్దేశ్యాలను, లక్ష్యాలను సమితి ఒడంబడికలో ప్రవేశికగా చేర్చినారు. ఈ సంస్థ లక్ష్యాలు :

1. అంతర్జాతీయ సహకారం పెంపొందించి అంతర్జాతీయ శాంతి భద్రతలు సాధించడం
2. యుద్ధం తలపెట్టిన బాధ్యతలు నిర్వహించడానికి వివిధ దేశాలు అంగీకరించేటట్లు చేయడం
3. దేశాలమధ్య బహిరంగంగా న్యాయంగా ఉండే సంబంధాలు నెలకొల్పడం
4. ప్రభుత్వాల మధ్య అంతర్జాతీయ న్యాయరీత్యా సంబంధాలు ఏర్పరచుకోవడం
5. సమితి ఒడంబడిక పత్రాన్ని ప్రపంచదేశాలన్నీ అంగీకరించేటట్లు చేయడం
6. సభ్యరాజ్యాల మధ్య తగాదాలు వచ్చినప్పుడు, యుద్ధానికి దిగాక శాంతియుతంగా పరిష్కారం చేసుకోవడానికి ప్రయత్నాలు చేయవలెను.
7. సమితికి భిన్నంగా ప్రవర్తించిన రాజ్యాలమీద తక్కిన సభ్యరాజ్యాలు తగినచర్య తీసుకోవలెను.
8. సభ్యరాజ్యాలమధ్య తగాదాలు వచ్చినపుడు సమితి మధ్యవర్తిత్వాన్ని శిరసావహించాలి.
9. సభ్యరాజ్యాల మధ్య జరిగే సంధి పత్రాల ప్రతులు సమితికి అందజేయవలెను.
10. తమ ఆధీనంలో వుంచబడిన అదిష్టరాజ్యాలు పరిస్థితుల మీద వార్షిక నివేదికను సభ్యరాజ్యాలు సమితికి నివేదించవలెను.
11. రాజకీయ, సాంఘిక, ఆర్థిక, విజ్ఞాన రంగాలలో అంతర్జాతీయ సహకారం పెంపొందించడం
12. అల్పసంఖ్యాక వర్గ ప్రజల రక్షణకు హామీ ఇవ్వడం
13. విద్య, ఆరోగ్యం, రాకపోకలు, శ్రామిక ప్రజల పరిస్థితులు మొదలగు విషయాలలో అంతర్జాతీయ సహకారం పెంపొందించడం

## 13.4 సభ్యత్వం :

ప్రథమంలో సమితి సభ్యత్వం మిత్రరాజ్యాలకు, వాటితో సహకరించిన రాజ్యాలకు, పారిస్ సంధికి అంగీకారం తెలిపిన రాజ్యాలకు కొద్ది తటస్థ దేశాలకు పరిమితం చేయబడింది. 1920లో సమితి సభ్యదేశాల సంఖ్య 42 కాగా 1931 నాటికి 62కుపెరిగింది. ఈ సమితి స్థాపన ప్రతిపాదన చేసిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు సమితిలో సభ్యదేశంగా లేకపోవడం విచిత్రం. అమెరికా సెనేట్‌లోని అత్యధిక సభ్యుల విముఖత వలన, ఆ దేశం సమితిలో సభ్యదేశంగా చేరలేకపోయింది. 1931-1938ల మధ్యకాలంలో బ్రెజిల్, కోస్టారికా, జర్మనీ, జపాన్, పెరుగ్వేలు సమితి నుండి వైదొలగగా, ఆఫ్ఘనిస్థాన్, ఈక్వెడార్, రష్యా దేశాలు సమితిలో చేరటం గమనార్హం.

## 13.5 సమితి నిర్మాణం :

నానాజాతి సమితిలో మూడు ప్రధాన అంగాలు కలవు. అవి సమితి మహాసభ, సమితి మండలి, సమితి సచివాలయం. సమితికి చెందిన మరి రెండు స్వయం పరిపాలనాధికారమున్న అంగాలు కలవు. అవి : శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ కార్మిక సంస్థ. ఇవిగాక సమితిలో కొన్ని సహాయక అంగాలు కూడా ఉన్నాయి.

### 13.5.1 సమితి మహాసభ :

మహాసభ నానాజాతి సమితికి చెందిన శాసనాధికారారమున్న సంస్థ. దీనిలోఅన్ని సభ్యదేశాలకు ప్రాతినిధ్యం వుంటుంది. ప్రతి సభ్యదేశం ముగ్గురు ప్రతినిధులను పంపవచ్చు. అయితే, వారికి ఒకే ఓటు వుంటుంది. సభ నిర్ణయాలన్నీ అన్ని సభ్యదేశాల ఆమోదాన్ని పొందాలి. ఆ సభ ప్రపంచశాంతికి ముప్పు తెచ్చే అంతర్జాతీయ, ఆర్థిక అంశాలను చర్చిస్తుంది. సభ్యదేశాలకు ఎన్నో విషయాలలో సలహాలిస్తుంది. అయితే సభ్యదేశాలకు శాసనాలను రూపొందించే అధికారంగాని, తన నిర్ణయాలను సభ్యదేశాలు తప్పనిసరిగా అమలుచేయాలని నిర్బంధించడానికిగానీ, ఈ సభకు అధికారాలు లేవు. ఇది సమితి బడ్జెట్‌ను రూపొందించి పర్యవేక్షిస్తుంది. మండలి పనిపై పర్యవేక్షణ, మండలి తాత్కాలిక సభ్యుల ఎన్నిక, కొత్త సభ్యులను చేర్చుకోవడం మొదలగునవి ఈ సభ నిర్వహించే ముఖ్య అధికారాలు. ఈ సభ ప్రతి సంవత్సరం సెప్టెంబరు నెలలో జెనీవాలో సమావేశమవుతుంది.

### 13.5.2 సమితి మండలి :

మండలి సమితి రాజ్యనిర్వహణాధికారాలను నిర్వహించే సంస్థ. ఇది 9 మంది కలిగిన చిన్న సంస్థ. దీనిలో శాశ్వత సభ్యులు, తాత్కాలిక సభ్యులు, నిర్ణీత కాలానికి ఎన్నుకోబడే ప్రతినిధులుంటారు. జపాన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఇటలీ, అమెరికా శాశ్వత సభ్యులు. అమెరికా సమితిలో చేరకపోవడంతో శాశ్వత సభ్యుల సంఖ్య నాలుగైంది. మరికొంతమంది శాశ్వత సభ్యులను సార్వత్రిక సభ, మండలి అంగీకారంతో చేర్చుకోవచ్చు. 1926లో జర్మనీకి, 1934లో రష్యాకు మండలిలో శాశ్వత సభ్యత్వం లభించింది. జపాన్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్‌లు అనేక కారణాల వల్ల తమ శాశ్వత సభ్యత్వానికి రాజీనామా ఇవ్వగా, రష్యా ఫిన్‌లాండ్‌పై దూరాక్రమణ చేయడంవల్ల మండలి నుండి బహిష్కరింపబడింది. తాత్కాలిక సభ్యుల సంఖ్య 11 వరకు పెరిగింది. ఆయుధాల తగ్గింపుకు ప్రణాళికలను తయారుచేయడం, దురాక్రమణ నుండి సభ్యదేశాలను రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవడం, సభ్యదేశాలమధ్య,వివాద పరిష్కారంలో మధ్యవర్తిత్వం నెరపడం, ఆదిష్ట ప్రాంతాల పాలన పర్యవేక్షించడం మండలి ముఖ్య విధులు. మండలి సంవత్సరానికి మూడుసార్లైనా జెనీవాలో సమావేశం కావాలి. అత్యవసర పరిస్థితులలో ఎప్పుడైనా సమావేశం కావచ్చు. మండలి ముఖ్యనిర్ణయాలన్నీ ఏకగ్రీవమై ఉండాలి.

### 13.5.3 సమితి సచివాలయం :

సమితి మూడు ప్రధాన అంగాలలో ముఖ్యమైనది సచివాలయం. దీని కేంద్రస్థానం జెనీవా. దీని అధినేత సెక్రటరీ జనరల్ ఇతనిని మండలి నియమిస్తుంది. మండల ఆమోదంతో సెక్రటరీ జనరల్ సిబ్బందిని నియమిస్తాడు. సచివాలయ ఖర్చును సభ్యరాజ్యాలు చెల్లిస్తాయి. ఇది సంవత్సరమంతా పనిచేసే కార్యాలయం. అంతర్జాతీయ సమస్యలపై విషయసేకరణ, సంధులను నమోదు చేయడం, సమితి మండలి, సభల కార్యనిర్వహణకు తోడ్పడం సచివాలయ ముఖ్యవిధులు.

### 13.5.4 శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానం :

అంతర్జాతీయ న్యాయస్థానం హేగ్‌లో ఏర్పాటు చేయబడింది. దీనిలో 15 మంది న్యాయాధిపతులుంటారు. సభ్య, మండలి కలసి వీరిని 9 సంవత్సరాల పదవీ కాలానికి ఎన్నుకుంటారు. వీరిని పదవి నుండి తొలగించడం సాధ్యపడదు.

మహాసభ, సమితి మండలి దీని సలహాలను కోరవచ్చు. రాజ్యాల మధ్య తగాదాలను, వివాదాలను, అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం పరిష్కరించడం, మండలికి ముఖ్య విషయాలలో సలహాలివ్వడం ఈ న్యాయస్థాన ముఖ్యవిధులు. ఈ న్యాయస్థాన నిర్ణయాలపై ఫిర్యాదుకు అవకాశం లేదు. అయినా ప్రత్యేక పరిస్థితులలో తన నిర్ణయాలనే ఇది తిరిగి పరిశీలించవచ్చు. ఈ న్యాయస్థానం సుమారు 200 ఉత్తర్వులను జారీ చేసింది. 65 కేసులను విచారించింది. 32 తీర్పులు ఇచ్చింది. 27 విషయాలలో సలహాలు ఇచ్చింది.

### 13.5.5 అంతర్జాతీయ కార్మిక వ్యవస్థ :

అంతర్జాతీయ కార్మిక సంస్థ స్వయం పరిపాలనాధికారమున్న సంస్థ. అయినప్పటికీ సమితిలో అంతర్భాగమేనని చెప్పవచ్చు. దీని ఖర్చులన్నింటినీ సమితి భరిస్తుంది. సమితిలో సభ్యులందరూ ఈ సంస్థలో కూడా సభ్యులు, సభ్యత్వంలేని రాజ్యాలు కూడా ఈ సంస్థలో చేరవచ్చు. వివిధ దేశాలలోని కార్మికుల మధ్య, కార్మికులకు యజమానులకు మధ్య సహకారం పెంపొంచడం ఈ సంస్థ యొక్క లక్ష్యం. ఈ సంస్థ ఇతర లక్ష్యాలు కార్మికుల పని స్థితిగతులను మెరుగుపరచడం, కార్మికుల పనికాలాన్ని నిర్ణయించడం, కార్మికులకు సబబైన జీతభత్యాలు, పెన్షన్, బోనస్ మొదలైన సౌకర్యాలు కలుగజేయడం, రోగగ్రస్తులైన కార్మికులకు వైద్యసదుపాయాలు ఏర్పాటు చేయడం, స్త్రీల, శిశువుల యోగక్షేమాల రక్షణకు ఏర్పాట్లు చేయడం, కార్మికులను యాజమాన్యంలో పాల్గొనేటట్లు చేయడం, కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛను కార్మికులకు కలుగజేయడం మొదలైనవి. అంతర్జాతీయ కార్మిక సంస్థ తన విధులను ఒక రాజ్యాంగం ప్రకారం నిర్వహించింది. దీని రాజ్యాంగం సమితి రాజ్యాంగాన్ని పోలివున్నది.

### 13.5.6 సహాయక అంగాలు :

నానాజాతి సమితికి ఈ క్రింది సహాయక సంస్థలు కూడా ఉన్నాయి. అవి : ఆర్థిక సంఘము, రాకపోకల సంఘము, భద్రతా సంఘము, జ్ఞానాభివృద్ధి సంఘము, నల్లమందు మొదలైన మత్తుపదార్థాల గురించి సలహాలిచ్చే సంఘము, స్త్రీ శిశు సంక్షేమ సంఘము, శరణార్థుల సంఘము, ఆయుధాల సంఘము, ఆదిష్ఠరాజ్యాల సంఘము, బానిసత్వ నిర్మూలన సంఘం మొదలైనవి.

## 13.6 సమితి కార్యకలాపాలు :

నానాజాతి సమితి 1920 జనవరి నుంచి అమలులోకి వచ్చింది. ఆనాటినుంచి 1923 వరకు సమితి చెప్పుకోదగిన ప్రగతిని సాధించలేక పోయింది. 1924 నుంచి 1930 వరకు సమితి కొన్ని అంతర్జాతీయ తగాదాలను శాంతియుతంగా పరిష్కరించగలిగింది. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో కూడా సమితి చెప్పుకోదగిన ప్రగతిని సాధించింది. సమితి ఈ కాలంలో సాధించిన విజయాలన్నింటినీ పరిగణలోనికి తీసుకొని 1924 నుండి 1930 వరకు గల కాలం సమితి ప్రతిష్ఠ పరాకాష్టలందు కొన్నకాలం అని ఇ.హెచ్. కార్ వర్ణించాడు. అయితే 1931లో మంచూరియా మీద జపాన్ దురాక్రమణ జరిపిన తరువాత సమితి క్షీణదశ ప్రారంభమైంది.

### 13.6.1 సమితి సాధించిన రాజకీయ విజయాలు :

20 సంవత్సరాల కాలంలో సమితి దాదాపు 40 అంతర్జాతీయ రాజకీయ వివాదాలను పరిశీలించింది. వీటిలో 7 ముఖ్యమైన రాజకీయ వివాదాలను సమితి విజయవంతంగా పరిష్కరించగలిగింది. సమితి సాధించిన రాజకీయ ప్రగతి ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

### 13.6.1.1 ఆలండ్ దీవుల వివాదము :

ఆలండ్ దీవులు ఫిన్‌లాండ్ ఆధీనంలో ఉన్నాయి. ఈ దీవులలోని ప్రజలు స్వీడన్ జాతికి చెందినవారు. వీరు తమ దీవులను స్వీడన్‌తో కలుపవలెనని ఆందోళన చేసినారు. ఈ సమస్యను ఇంగ్లండ్ సమితికి నివేదించింది. ఆలండ్ దీవుల మీద ఫిన్‌లాండ్ సార్వభౌమాధికారాన్ని సమితి గుర్తించి, స్వీడన్ జాతి ప్రజల రక్షణకు కొన్ని సిఫారసులను చేసింది. సమితి సిఫారసులను ఫిన్‌లాండ్, స్వీడన్‌లు ఆమోదించడంతో ఆలండ్ దీవుల తగాదా శాంతియుతంగా పరిష్కారమైంది. ఇది సమితి సాధించిన తొలి విజయం.

### 13.6.1.2 ఆల్బేనియా సరిహద్దు వివాదము :

యుగోస్లావియా 1921లో ఆల్బేనియా మీద దురాక్రమణకోసం తన సైన్యాలను పంపింది. ఆల్బేనియా విజ్ఞప్తిని పురస్కరించుకొని సమితి జోక్యం చేసుకొని యుగోస్లావియా దురాక్రమణ బారినుంచి ఆల్బేనియాను కాపాడింది.

### 13.6.1.3 ఎగువ సైలీషియా తగాదా :

ఎగువ సైలీషియా విషయంలో పోలెండ్, జర్మనీల మధ్య 1921లో తగాదా వచ్చింది. పోలెండ్‌ను ఫ్రాన్స్, జర్మనీని ఇంగ్లండ్ సమర్థించడంతో ఈ సమస్య జటిలంగా తయారయింది. సమితి జోక్యం చేసుకొని ఎగువ సైలేషియాను పోలెండ్ జర్మనీలకు పంచిపెట్టింది.

### 13.6.1.4 పోలెండ్ అథూయేనియాల మధ్య తగాదా :

పోలెండ్ బలప్రయోగం చేసి అథూమేనియాలో భాగమైన విల్నాను 1920లో ఆక్రమించుకొన్నది. ఫ్రాన్స్ సహాయంతో పోలెండ్ సమితి మధ్యవర్తిత్వాన్ని వ్యతిరేకించింది. సమితి ఈ విషయంలో ఏమిచేయలేక పోయింది. విల్నాను పోలెండ్‌లో భాగంగా 1923 నాటికి గుర్తించడం జరిగింది. అయితే సమితి పోలెండ్, అథూమేనియాల సరిహద్దు వివాదరహితంగా నిర్ణయించింది.

### 13.6.1.5 కార్ఫూ వివాదము :

ఇటలీ ప్రభుత్వోద్యోగులను కొంతమందిని గ్రీస్‌లో హత్యచేయడం జరిగింది. దీనితో గ్రీస్‌కు చెందిన కార్ఫూ దీవిని ఇటలీ 1923లో ఆక్రమించుకొన్నది. గ్రీస్ సమితికి విజ్ఞప్తి చేసింది. కార్ఫూ సమస్య తన ఆంతరంగిక వ్యవహారమని ఇటలీ వాదించింది. చివరికి కార్ఫూను గ్రీస్‌కు ఇవ్వడం జరిగింది. ఇటలీకి గ్రీస్ పెద్దమొత్తంలో పరిహారం ఇచ్చింది.

### 13.6.1.6 జర్మనీ, బెల్జియంల మధ్య తగాదా :

యూపెన్, మాల్మెడీ అను సరిహద్దు జిల్లాల విషయంలో జర్మనీ, బెల్జియంల మధ్య తగాదా ఏర్పడింది. సమితి జోక్యం చేసుకొని ఆ జిల్లాలు బెల్జియంకు చెందవలెనని తీర్మానించింది.

### 13.1.6.7 గ్రీస్, బల్గేరియాల మధ్య సరిహద్దు తగాదా :

గ్రీస్, బల్గేరియాల మధ్య 1925లో సరిహద్దు వివాదమేర్పడి గ్రీస్ సైన్యాధిపతిని చంపివేశారు. గ్రీస్ తన సైన్యాలను బల్గేరియా పైకి పంపింది. బల్గేరియా సమితి జోక్యం కోసం విజ్ఞప్తి చేసింది. సమితి ఒక దర్యాప్తు సంఘాన్ని నియమించింది. ఈ సంఘం గ్రీస్ చేసిన దురాక్రమణను ఖండించి బల్గేరియాకు గ్రీస్ 42 వేల పౌండ్లను పరిహారం ఇవ్వవలెనని సిఫారసు చేసింది. దీన్ని గ్రీస్ ఆమోదించడంతో గ్రీస్, బల్గేరియాల మధ్య తగాదా పరిష్కారమైంది.

### 13.6.1.8 మోసుల్ వివాదము :

టర్కీకి చెందిన మోసుల్ జిల్లాను సెవెర్స్ సంధి ప్రకారం ఇరాక్‌కు ఇవ్వడం జరిగింది. అయితే టర్కీ, ఇరాక్‌ల మధ్య సరిహద్దుల నిర్ణయం సంప్రదింపుల ద్వారా జరగవలెననే నిబంధనను లోజక్‌సంధిలో చేర్చడం జరిగింది. అయితే సంప్రదింపులు విఫలం కావడంవల్ల ఈ వివాదాన్ని ఇంగ్లండ్ సమితికి నివేదించింది. మోసుల్‌జిల్లా ఇరాక్‌కు చెందవలెనని సమితి సిఫారసు చేసింది. ఈ సిపారసును టర్కీ, ఇరాక్, ఇంగ్లండ్‌లు అంగీకరించాయి.

### 13.6.1.9 బొలీవియా - పరాగ్వేల మధ్య తగాదా :

చాకో భూభాగం విషయమై బొలీవియా - పరాగ్వేల మధ్య 1928లో తగాదా ఏర్పడింది. రెండు దేశాల మీద ఆయుధాలు నిషేధించే ఉత్తర్వులను సమితి విధించింది. అయితే అమెరికా మధ్యవర్తిత్వం వల్ల 1938లో ఈ తగాదా పరిష్కారమయింది.

1930 వరకు సమితి గణనీయమైన రాజకీయ విజయాలను సాధించింది. అయితే సమితి సాధించిన విజయాలు చాలావరకు చిన్నరాజ్యాలకు ఉపయోగపడలేదు. ఈ కాలంలో ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీల మధ్య సహకారం పెంపొందించడం జరిగింది. 1929లో యూరప్‌లో ఆర్థికమాంద్యం ఏర్పడడంవల్ల వివిధ దేశాల మధ్య ఆర్థికరంగంలో సహకారం లోపించింది. అంతేగాక ఇటలీలో ఫాసిస్ట్ నియంతృత్వ స్థాపన, జర్మనీలో నాజీ నియంతృత్వ స్థాపన జరగడంవల్ల ప్రపంచ శాంతికి భంగమేర్పడింది. అందువల్ల 1930 నుంచి సమితి పలుకుబడి తగ్గడం ప్రారంభమయింది.

### 13.6.2 ఆర్థిక, సాంఘిక,మానవతా రంగంలో సమితి కార్యకలాపాలు (రాజకీయేతర రంగంలో సమితి కృషి) :

నానాజాతి సమితి రాజకీయరంగంలోనేకాక ఇతర రంగాలలో కూడా గొప్ప ప్రగతిని సాధించింది.

1. రాజ్యాల మధ్య ఆరోగ్యప్రదమైన ఆర్థిక సంబంధాలు స్థాపించడానికి సమితి గణనీయమైన కృషిచేసింది. వివిధ ఋణాలను విడుదల చేయడానికి, పర్యవేక్షణ చేయడానికి సమితి నియమించిన ఆర్థిక సంఘం బాధ్యత వహించింది. రాజ్యాల మధ్య ఎగుమతి దిగుమతుల మీద ఉన్న సుంకాలను తగ్గించడానికి సమితి అనేక ప్రయత్నాలు చేసింది. రాజ్యాల మధ్య వ్యాపారం సుకరం చేయడానికి సమితి 1923లో అంతర్జాతీయ సుంకాల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. యుద్ధం తరువాత ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంటున్న దేశాలను ఆర్థిక వినాశం నుంచి కాపాడటానికి సమితి ప్రయత్నాలు చేసింది. ఆర్థిక దుస్థితికి లోనైన ఆస్ట్రియా, హంగరీ దేశాలు సమితి సహాయంతో పెద్దమొత్తంలో రుణాలనుపొంది తమ ఆర్థిక సమస్యలను కొంతవరకు పరిష్కరించుకోగలిగాయి. ప్రపంచ ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి 1920లో బ్రసెల్స్ సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఆర్థిక రంగంలో అగ్రరాజ్యాల మధ్య విరోధంతో కూడిన పోటీని సమితి నిరాకరించలేకపోయినప్పటికిని చిన్నరాజ్యాల ఆర్థిక సమస్యల పరిష్కారానికి అనేకవిధాలుగా సహాయం చేసింది.
2. మొదటి ప్రపంచయుద్ధం శరణార్థుల సమస్యను సృష్టించింది. శరణార్థులు పునరావాస సమస్యను పరిష్కరించడానికి సమితి 1921లో డాక్టర్ సేన్‌ను హైకమీషనర్‌గా నియమించింది. ఇతడు లక్షలాది శరణార్థులకు పునరావాసం కల్పించడం కోసం గొప్ప కృషి చేశారు.
3. సమితి రోగనిరోధక ఔషధాలను సమకూర్చి మలేరియా, కలరా, మశూచి, ప్లేగ్ మొదలైన అంటువ్యాధులను అరికట్టడానికి గణనీయమైన కృషిచేసింది.
4. స్త్రీల, శిశువుల అక్రమ రవాణాను అరికట్టడంలో సమితి ఘనవిజయం సాధించింది. 1927, 1929 సంవత్సరాలలో స్త్రీల అక్రమణ రవాణా సమస్యను సమితి సలహా సంఘం దర్యాప్తు చేసింది. శిశువుల హక్కులను కాపాడటానికి సమితి అనేక ఏర్పాట్లు చేసింది.

5. సమితి బానిసత్వ నిర్మూలన కోసం గొప్పగా కృషిచేసింది. 1932లో ఒక శాశ్వత బానిసత్వం సంఘాన్ని నియమించడం జరిగింది.

6. మత్తుపదార్థాల రవాణాను అరికట్టడానికి సమితి ఒక సంఘాన్ని నియమించింది. పదార్థాల వాడకాన్ని నిషేధించడానికి అనేక అంతర్జాతీయ సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగింది.

7. అంతర్జాతీయ వైజ్ఞానిక సహకారం పెంపొందించడానికి సమితి చేసిన కృషి ప్రశంసనీయం. 1926లో పారిస్‌లోఅంతర్జాతీయ మేధావుల సహకార సంఘం నెలకొల్పడం జరిగింది. మేధావుల ద్వారా, శాస్త్రవేత్తల ద్వారా వైజ్ఞానిక రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం జరిగింది. ఉపాధ్యాయుల, విద్యార్థుల పరస్పర వినిమయం ద్వారా వివిధ విశ్వవిద్యాలయాల మధ్య సహకారాన్ని పెంపొందించడం జరిగింది.

### 13.6.3 సార్ పరిపాలన :

1920 మొదలు 1935 వరకు సార్ ప్రాంతపు పరిపాలనను సమితి ఐదుగురు సభ్యులతో కూడిన పాలక సంఘం ద్వారా కొనసాగించింది. పాలకసంఘం తొలి అధ్యక్షుడు ఫ్రాన్స్‌కు చెందిన విక్టర్ రౌలట్ స్థానిక ప్రజలపట్ల కఠినంగా వ్యవహరించి పరిపాలనను సాగించారు. 1927లో అధ్యక్షుడైన విల్సన్ అను ఆంగ్లేయుడు సార్ ప్రాంతం నుంచి సైన్యాన్ని ఉపసంహరించి బ్రిటిష్, బెల్జియం, ఫ్రెంచి జాతీయులతో కూడిన సైన్యం ప్రవేశపెట్టినాడు. 1935 జూన్‌లో జరిగిన జనవాక్య సేకరణ ఫలితంగా సార్ ప్రాంతాన్ని జర్మనీలో విలీనం చేయడం జరిగింది.

### 13.6.4 డాన్‌జిగ్ పరిపాలన :

జర్మనీలో భాగమైన డాన్‌జిగ్ పట్టణం పోలెండ్‌ను సంతృప్తిపరచడానికి జర్మనీ నుంచి విడదీసి అంతర్జాతీయ పట్టణంగా ప్రకటించి సమితి పరిపాలనాధికారంలో ఉంచడం జరిగింది. కాని సమితి డాన్‌జిగ్ పట్టణానికి విజయవంతమైన పరిపాలనను ఏర్పాటు చేయలేకపోయింది.

### 13.6.5 ఆదిష్టపద్ధతి (Mandats System) :

మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన దేశాలకు చెందిన వలస ప్రాంతాలు మిత్రరాజ్యాల ఆధీనంలోకి వచ్చినాయి. వలస ప్రజల ప్రయోజనాలను కాపాడడంతోబాటు మిత్రరాజ్యాల సామ్రాజ్య కాంక్షను సంతృప్తిపరచడానికి ఒక నూతన అంతర్జాతీయ పద్ధతిని రూపొందించి సమితి ఒడంబడిక పత్రంలో 22వ ప్రకరణంగా చేర్చడం జరిగింది. ఈ ప్రకరణ ప్రకారం లోగడ జర్మనీ ఆస్ట్రియా - హంగేరీలకు చెందిన వలసలను, టర్కీ సామ్రాజ్యం విచ్ఛిన్నమైన ఫలితంగా వచ్చిన కొన్ని ప్రాంతాలను అగ్రరాజ్యాల ఆధీనంలో ఉంచి వాటిని ఆదిష్ట ప్రాంతాలుగా గుర్తించడమయింది. ఈ ఆదిష్ఠ ప్రాంతాలను చాలావరకు ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లకు ఇవ్వడం జరిగింది. ఈ ప్రాంతాల మీద సమితికి పర్యవేక్షణాధికారం మాత్రం వుంటుంది.

ప్రజల అభివృద్ధిదశ, భౌగోళిక, ఆర్థిక పరిస్థితులు మొదలైన వాటిని పరిగణలోనికి తీసుకొని సమితి ఒడంబడిక ఆదిష్ఠ ప్రాంతాలను ఎ,బి,సి అనే మూడు తరగతులుగా వర్గీకరించింది.

#### 13.6.5.1 'ఎ' తరగతి ఆదిష్ఠ ప్రాంతాలు :

లోగడ టర్కీ సామ్రాజ్యానికి చెందిన కొన్నిప్రాంతాలు 'ఎ' తరగతికి చెందిన అదిష్ఠ ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది. కొంతవరకు అబివృద్ధిచెందిన ఈ ప్రాంతాల పరిపాలన ప్రజల అభీష్ఠం ప్రకారం జరుగవలెను. తాము ఏ అగ్రరాజ్యం ఆధీనంలో

వుండవలెనో ఈ ప్రాంత ప్రజలే నిర్ణయించుకుంటారు. కాని నిజానికి అదిష్ఠ ప్రాంత ప్రజల అభీష్ఠంతో ప్రమేయం లేకుండానే అగ్రరాజ్యాలు వివిధ ప్రాంతాలను తమ వశం చేసుకున్నాయి. 1920లో జరిగిన సాన్‌రెమో సమావేశం ఫలితంగా 'ఎ' తరగతికి చెందిన అధిష్మప్రాంతాలైన ఇరాక్, పాలస్తీనా, ట్రాన్స్ జోర్డాన్‌లు, ఇంగ్లండుకు, సిరియా లెబనాన్‌లు ఫ్రాన్స్‌కు ఆదిష్ఠప్రాంతాలయినాయి.

### 13.6.5.2 'బి' తరగతి ఆదిష్ఠ ప్రాంతాలు :

మధ్య ఆఫ్రికాకు చెందిన ప్రాంతాలు 'బి' తరగతి ఆదిష్ఠ ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది. ఈ ప్రాంత ప్రజలకు మతస్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. కాని పరిపాలనా బాధ్యత పూర్తిగా ఆదిష్ఠరాజ్యాలకు ఇవ్వడం జరిగింది. 'బి' తరగతికి చెందిన టాంగన్వీకా, కామెరూన్స్‌లో 6వ భాగం, టోగోలాండ్‌లో 3వభాగం ఇంగ్లండుకు, మిగిలిన కామెరూన్స్, టోగోలాండ్ ఫ్రాన్స్‌కు, రుఅండా - ఉరుండి బెల్జియంకు ఆదిష్ఠ ప్రాంతాలయినాయి.

### 13.6.5.3 'సి' తరగతి ఆదిష్ఠ ప్రాంతాలు :

నైరుతి ఆఫ్రికాకు చెందిన భూభాగాలను, దక్షిణ ఫసిఫిక్ దీవులను 'సి' తరగతి ఆదిష్ట ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది. విస్తీర్ణంలోను, జనాభాలోను చిన్నవైన ఈ ప్రాంతాలు నాగరిక ప్రపంచానికి దూరంగా వున్నాయి. ఆదిష్ఠరాజ్యాలు ఈ ప్రాంతాల పరిపాలనను చాలావరకు హర్షించదగిన విధంగా కొనసాగించాయి. దాదాపు ఈ ప్రాంతాలు ఆదిష్ఠ రాజ్యాలలో భాగంగా పరిగణించడం జరిగింది. నైరుతి ఆఫ్రికాను దక్షిణాఫ్రికాకు, జర్మన్ సమోవాను న్యూజిలాండ్‌కు, నౌరుదీవిని ఇంగ్లండ్‌కు ఇచ్చినారు. భూమధ్యరేఖకు దక్షిణంగా ఉన్న జర్మన్ వలసలను ఆస్ట్రేలియాకు, ఉత్తరంగా ఉన్న జర్మన్‌వలసలు జపాన్‌కు ఇచ్చినారు.

### 13.6.5.4 ఆదిష్ఠ ప్రాంతాల పరిపాలన :

అగ్రరాజ్యాలు ప్రతిసంవత్సరం తమ ఆధీనంలోవున్న ఆదిష్ఠప్రాంతాల పరిస్థితులను గురించి సమితి మండలికి నివేదికలు పంపవలెను. ఈ నివేదికలను పరిశీలించి సమితి ఎటువంటి చర్యలు తీసుకోవలసి ఉంటుందో తెలియజేయడానికి 1920లో ఒక శాశ్వత ఆదిష్టరాజ్యాల సంఘం నెలకొల్పడం జరిగింది. ఈ సంఘం ఆదిష్ఠ ప్రాంతాల పరిపాలనాభివృద్ధికి సిఫారసులను చేస్తుంది. కాని ఈ సంఘం సలహాలను లక్ష్యపెట్టకుండా అగ్రరాజ్యాలు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించాయి.

### 13.6.5.5 ఆరిష్ఠ పద్ధతిలో లోపాలు :

సిద్ధాంతరీత్యా అగ్రరాజ్యాలు తమ ఆధీనంలో ఉన్న ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. కాని అమలులో మాత్రం అగ్రరాజ్యాలు సమితి పర్యవేక్షణను ఏమాత్రమూ లక్ష్యపెట్టక తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించాయి. ఈ పద్ధతివల్ల అగ్రరాజ్యాల కాంక్ష నెరవేరింది. యుద్ధంలో ఓడిపోయినా రాజ్యాలకు చెందిన వలసలన్నీ అగ్రరాజ్యాలకు ఆదేశించడంవల్ల వెనుకబడిన ప్రాంతాలలో చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదు. ఈ పద్ధతివల్ల సూయజ్ ప్రాంతంలో ఇంగ్లండ్ ప్రాబల్యం, ఫసిఫిక్ ప్రాంతంలో జపాన్ ప్రాబల్యం నెలకొల్పడం జరిగింది.

### 13.6.5.6 మెచ్చుకోదగ్గ అంశాలు :

ఆదిష్ఠ పద్ధతిలో అనేక లోపాలున్నప్పటికీ కొన్ని మెచ్చుకోదగిన అంశాలు కూడా ఉన్నాయి. అగ్రరాజ్యాలు వలస ప్రాంతాలలో తమ అధికారాన్ని స్వప్రయోజనాల కోసం కాకుండా వెనుకబడిన ప్రజల అభివృద్ధికి ఉపయోగించవలెననే విషయం ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఈ పద్ధతివల్ల కొంతవరకు అగ్రరాజ్యాల దృక్పథంలో మార్పువచ్చింది. వెనుకబడిన ప్రజల అభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకొని అగ్రరాజ్యాలు వలసలను పాలించడం కొంతవరకు ప్రారంభించాయి.

### 13.6.6. అల్పసంఖ్యాక వర్గాలు :

అల్పసంఖ్యాకవర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఒక అల్పసంఖ్యాక సంఘం నెలకొల్పడం జరిగింది. ఈ సంఘం అల్పసంఖ్యాకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడమేగాక ప్రజల ఫిర్యాదులకు గురి అయిన ప్రభుత్వాలనుంచి వివరణలను కూడా స్వీకరించింది. సుమారు మూడు కోట్ల అల్పసంఖ్యాకవర్గ ప్రజల హక్కుల రక్షణకు సమితి బాధ్యత వహించింది. అయితే సమితికి అర్థబలంగాని, అధికారంగాని లేకపోవడంవల్ల అల్పసంఖ్యాక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సమితి విఫలమయింది.

### 13.6.7 నిరాయుధీకరణ :

సమితి ఒడంబడిక పత్రంలోని ఎనిమిదో ప్రకరణం ప్రకారం ప్రపంచశాంతి కోసం సభ్యరాజ్యాలు తమ ఆయుధబలాలను తగ్గించుకోవలెను. యుద్ధంలో ఓడిపోయిన దేశాలైన జర్మనీ, ఆస్ట్రియా, హంగేరీ, బల్గేరియాల విషయంలో మాత్రమే నిరాయుధీకరణ సిద్ధాంతము అమలుచేయడం జరిగింది. మిత్రరాజ్యాలు నిరాయుధీకరణను అనుసరించలేదు. అనేక అంతర్జాతీయ సమావేశాలు జరిగినప్పటికినీ ఆయుధాల తగ్గింపు విషయంలో ప్రపంచదేశాల మధ్య అంగీకారం కుదరలేదు. 1939 నాటికి అన్నిదేశాల ఆయుధబలం 1914లో కంటే అనేకరెట్లు పెరిగింది. నిరాయుధీకరణ విషయంలో సమితి విఫలమయింది.

## 13.7 సమితి క్షీణదశ :

నానాజాతి సమితి చాలావరకు చిన్నచిన్నరాజ్యాల మధ్య తగాదాలను తీర్చగలిగింది. కాని అగ్రరాజ్యాలకూ చిన్నరాజ్యాలకూ మధ్య తగాదాలు వచ్చినప్పుడు సమితి తీర్పు సాధారణంగా అగ్రరాజ్యాలకే అనుకూలంగా ఉండేది. అంతేగాక అగ్రరాజ్యాలు దురాక్రమణ జరిపినపుడు సమితి నిస్సహాయస్థితిలో పడేది. దీనికొక ఉదాహరణ మంచూరియా మీద జపాన్ జరిపిన దాడి.

### 13.7.1 మంచూరియా మీద జపాన్ దురాక్రమణ :

1905లో రష్యా, జపాన్‌ల మధ్యజరిగిన సంధి ఫలితంగా జపాన్ దక్షిణ మంచూరియాలోని తన రైల్వేల రక్షణ కోసం ముక్డెన్ సైనిక కేంద్రంగా 15వేల సైనికులను సమీకరించింది. 1931లో విధ్వంసక చర్యలు నుంచి తన రైల్వేలను కాపాడుకొనే సాకుతో జపాన్ మంచూరియాను ఆక్రమించుకొన్నది. జపాన్ దురాక్రమణను సమితి అరికట్టలేకపోయింది. మంచూరియా సంక్షోభము సమితి బలహీనతను పూర్తిగా బహిర్గతం చేసింది.

### 13.7.2 ఇథియోపియా మీద ఇటలీ దురాక్రమణ :

1934లో ఇటలీ, ఇథియోపియాల మధ్య వాల్‌వాల్ సరిహద్దు సంఘర్షణ జరిగనప్పుడే ఇథియోపియా సమితికి విజ్ఞప్తిచేసి, సమితి జోక్యాన్ని కోరింది. హిట్లర్ దురాక్రమణలను అరికట్టడానికి ముస్సోలినీ సహాయం మీద ఆధారపడిన ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు సమితి ఇటలీ మీద సత్వరచర్యలు తీసుకోకుండా అడ్డుపడినాయి. చివరకు సమితి వాల్‌వాల్ సరిహద్దు సంఘర్షణకు రెండు దేశాలు కారణమని నిర్ణయించింది. అయితే 1935 అక్టోబరు 3న ముస్సోలినీ సైన్యాలు అబిసీనియాను ఆక్రమించుకున్నాయి. ఇథియోపియా మీద ఇటలీ దురాక్రమణను అరికట్టడంలో సమితి విఫలమయింది.

### 13.7.3 స్పెయిన్‌లో అంతర్యుద్ధము :

1933లో స్పెయిన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వమేర్పడింది. 1936లో హిట్లర్, ముస్సోలినీల అండదండలతో ఫాసిస్ట్ నాయకుడైన జనరల్ ఫ్రాంకో చట్టసమ్మతమైన ప్రజాప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించాడు. స్పెయిన్‌లో అంతర్యుద్ధాన్ని

ఆపడానికి సమితి ఏవిధమైన చర్యలు తీసుకోలేకపోయింది. 1939 నాటికి ఫ్రాంకో స్పెయిన్‌లో ప్రజాప్రభుత్వాన్ని కూలదోసి నియంతృత్వం స్థాపించాడు. స్పెయిన్‌లోని అంతర్యుద్ధం ఫలితంగా సమితి ప్రతిష్ఠ బాగా దెబ్బతిన్నది.

జపాన్ 1937లో చైనా మీద దాడి జరిపినపుడు సమితి బలహీనత పూర్తిగా బయటపడింది. హిట్లర్ దురాక్రమణ ఫలితంగా రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది. అయినప్పటికి సమితి నామమాత్రంగా రెండో ప్రపంచయుద్ధం ముగిసేవరకు కొనసాగింది.

## 13.8 సమితి విఫలం కావడానికి కారణాలు :

నానాజాతి సమితి కొనసాగిన 20 సంవత్సరాల కాలంలో కొన్ని సమస్యలను పరిష్కరించింది. కాని రెండో ప్రపంచయుద్ధం సంభవించకుండా చేయలేకపోయింది. ప్రపంచ శాంతి స్థాపనలో సమితి విఫలమైంది. ఈ వైఫల్యానికి ఎన్నో కారణాలున్నాయి.

### 13.8.1 సమితి ఒడంబడికలోని లోపాలు :

నానాజాతి సమితిని రూపొందించిన ఒడంబడికలోని కొన్నిలోపాలు సమితి విఫలం కావడానికి కారణమైనాయి. సమితి ఒడంబడిక యుద్ధాన్ని నిషేదించింది కాని దేశాలు బలప్రయోగం చేయడాన్ని నిషేధించలేదు. జపాన్‌యుద్ధ ప్రకటన చేయకుండా తద్వారా సమితి ఒడంబడికను ఉల్లంఘించకుండా చైనా మీద బలప్రయోగం చేసి మంచూరియాను ఆక్రమించుకొన్నది. అలాగే అబిసీనియాను ఇటలీ ఆక్రమించుకొన్నది. అయిన్నప్పటికీ సమితి ఏమీ చేయలేకపోయింది. రాను రాను సమితి అంతర్జాతీయ శాంతిని పరిరక్షించే బలమైన సంస్థగాకాక అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించే సంస్థగా మాత్రమే మిగిలింది.

### 13.8.2 అగ్రరాజ్యాల వైఖరి :

ఇంగ్లండ్ సమితిని సమతుల్య పరిరక్షణ సంస్థగా పరిగణించగా, ఫ్రాన్స్ దానిని జర్మనీని చుట్టుముట్టడానికి సాధనమని తలపోసినది. అందుకే, సమితి ప్రపంచానికి ప్రాతినిధ్యం వహిస్తుందని భావించినా, తీరా దాని పనితీరులో అదెప్పుడూ అంతమేరకు ఎదగలేదు. సంకుచిత జాతీయత, రాజ్యాలను ఉదారంగా ప్రవర్తించనీయక, త్యాగాలు చేయనీయకపోవడంతో సమితి పనితీరు మెరుగుపడలేదు.

### 13.8.3 మితిమీరిన జాతీయవాదము :

సమితి సభ్యరాజ్యాలలో జాతీయ భావము మితిమీరిన అంతర్జాతీయ సహకారదృష్టి లోపించింది. ఏ ఒక్క సభ్యరాజ్యం కూడా అంతర్జాతీయ ప్రయోజనాల కోసం తన జాతీయ ప్రయోజనాలను త్యాగం చేయడానికి సిద్ధపడలేదు. అంతేగాక సమితిపట్ల సభ్యరాజ్యాలలో విధేయత లోపించింది. అందువల్ల జాతీయభావ ప్రభావమెక్కువై సమితి విఫలంకావడానికి దారితీసింది.

### 13.8.4 అగ్రరాజ్యాలు - సమితిలో చేరకపోవడం :

అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యా సమితిలో సభ్యరాజ్యాలు కాకపోవడం వల్ల సమితి ప్రాముఖ్యం తగ్గింది. రష్యా 1934 వరకు సమితిలో సభ్యరాజ్యం కాదు. అమెరికా సమితిలో సభ్యరాజ్యంగా చేరడానికి నిరాకరించి, ప్రపంచసమస్యలపట్ల ఏకాంత విధానాన్ని అనుసరించసాగింది. ఈ రెండు అగ్రరాజ్యాల పూర్తి సహకారం సమితికి లభించలేదు.

### 13.8.5 తృప్తిపరిచే విధానము :

అగ్రరాజ్యాలు సక్రమంగా సహకరించక పోవడంవల్ల నానాజాతిసమితి విఫలమైంది. అగ్రరాజ్యాలలో సమితి కర్తవ్యం గురించి అభిప్రాయబేధాలు వచ్చినాయి. శాంతిస్థాపనే సమితి ముఖ్యకర్తవ్యమని ఇంగ్లండ్ మొదలైన దేశాలు భావించినాయి.

శాంతిస్థాపన విషయంలో, మధ్యవర్తిత్వం విషయంలో సమితి బలాన్ని ఉపయోగించవలెనని ఫ్రాన్స్ భావించింది. అంతేగాక ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు జర్మనీపట్ల తృప్తిపరచేవిధానం అవలంభించడంవల్ల జర్మనీ దురాక్రమణ చేయడం ప్రారంభించింది.

### 13.8.6 సమితికి సాయుధబలం లేకపోవడం :

దురాక్రమణలను అరికట్టడానికి సమితికి కావలసిన అధికారాలుగాని, ఆయుధాలుగాని, యంత్రాంగం గానిలేవు. అందువల్ల జపాన్, ఇటలీ, జర్మనీ వంటి దేశాలు దురాక్రమణ జరిపినపుడు వాటిని అరికట్టలేకపోయింది. చివరికి దురాక్రమణ జరిపిన జపాన్, ఇటలీ, జర్మనీలు సభ్యత్వం నుంచి విరమించుకొన్నాయి.

### 13.8.7 నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకోవాలనే సూత్రం :

సమితి తీర్మానాలు ఏకగ్రీవంగా జరుగవలెను. కాని సభ్యరాజ్యాల మధ్య ఏకాభిప్రాయం సాధించడం కష్టమైనది. సమితి ఉనికి, నిర్వహణ, సభ్యదేశాల సహాయ, సహకారాలపైనే గాక ద్రవ్యసహాయంపై కూడా ఎంతో ఆధారపడివుంది. ఇవి అనుకున్నమేరకు ఎప్పుడూ అంది రాలేదు. అంతేగాక అసలు సమితి విధులపైన, బాధ్యతలపైన సభ్యదేశాల మధ్య బొత్తిగా పొగసని విరుద్ధ భావాలున్నాయి.

### 13.8.8 నియంతృత్వ ప్రభుత్వాల విధానం :

జర్మనీ, ఇటలీ, జపాన్‌లోని నియంతృత్వ ప్రభుత్వాలు సమితి విజయావకాశాలను వమ్ముచేశాయి. జపాన్ నూతన భూభాగాల ఆక్రమణకు ఒడిగట్టగా, సమితి విమర్శించగా, జపాన్ సంధి నుండి వైదొలగింది. అంటే సమితి సభ్యదేశాల స్వార్థ ప్రయోజనాలకు ఆటంకమని అవి తలపోసినపుడు జంకూ, బొంకూ లేకుండా సమితి నుండి వైదొలగడమో, నిర్లక్ష్యం చేయడమో చేసేవి.

### 13.8.9 నిరాయుధీకరణ, ప్రయత్నాలు విఫలం కావడం :

నిరాయుధీకరణ సాధించడంలో సమితి పూర్తిగా విఫలమైంది. ఫలితంగా జర్మనీ బహిరంగంగా, ధైర్యంగా ఆయుధబలాన్ని సమకూర్చుకోవడం ప్రారంభించింది. ఇతర దేశాలు కూడా తమ ఆయుధ బలాన్ని వృద్ధిచేసుకోసాగాయి. ఫలితంగా 1939 నాటికి అన్ని దేశాల ఆయుధబలం 1914లో కంటే అనేకరెట్లు పెరిగింది.

### 13.8.10 ఆర్థిక వనరుల లోపం :

సమితి నిర్వహణ సభ్యరాజ్యాల స్వచ్ఛంద ధన సహాయం మీద ఆధారపడి ఉంది. 1930లో ప్రపంచ ఆర్థిక మాంధ్యము ఏర్పడడంతో సమితి కార్యక్రమాలు, నిర్ణయాలు అమలుజరపటానికి అవసరమైన ధనం లభ్యం కాలేదు.

### 13.8.11 వర్సే సంధిలోని లోపాలు :

వర్సే సంధి అన్నివిధాల జర్మనీకి, దాని పక్షం వహించిన రాజ్యాలకు నష్టదాయకం. వర్సే సంధి సూత్రాలు తమపై బలవంతంగా రుద్దబడినవన్న భావంతో జర్మనీ సంధి సూత్రాలను తీవ్రంగా ప్రతిఘటించింది.

### 13.8.12 జర్మనీ ప్రతీకార వాంఛ :

యుద్ధంలో ఓడిపోయిన దేశాలపట్ల అగ్రరాజ్యాల అనుమానవైఖరి, జర్మనీ ప్రతీకార ధోరణి సమితి విఫలం కావడానికి కారణాలైనాయి. అగ్రరాజ్యాలు జర్మనీ వంటి గొప్పదేశాన్ని శాశ్వతంగా అన్నివిధాల బలహీనపరచడానికి ప్రయత్నం చేసినాయి.

ఫలితంగా జర్మనీలో హిట్లర్ నాజీ నియంతృత్వాన్ని స్థాపించి, సమితి షరతులను ఉల్లంఘించడం ప్రారంభించాడు. దాని ఫలితమే రెండో ప్రపంచ యుద్ధం.

## 13.9 ముగింపు :

అనేక కారణాల వల్ల సమితి విఫలమైనప్పటికినీ అది కొన్ని విజయాలను కూడా సాదించింది. అంతర్జాతీయంగా ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాలలో సమితి చెప్పుకోదగిన ప్రగతిని సాధించింది. అంతర్జాతీయ సహకారాన్ని, సౌహార్థాన్ని పెంపొందించి తద్వారా సమితి అంతర్జాతీయతా భావాన్ని ప్రపంచ దేశాలలో పెంపొందించింది. అనేక అంతర్జాతీయ సమస్యలను చర్చించి సమితి ప్రపంచ అభిప్రాయాన్ని తొలిసారిగా సేకరించింది. నానాజాతి సమితి సంపాదించిన అనుభవాన్ని పురస్కరించుకొని రెండో ప్రపంచ యుద్ధానంతరం ఈ సమితి స్వరూప స్వభావాలకు మెరుగులుదిద్ది ఐక్యరాజ్యసమితి రూపొందించడం జరిగింది.

## 13.10 మాదిరి ప్రశ్నలు :

1. నానాజాతి సమితి ఆశయములు, దానిలోని అంగాలు, సాధించిన ఘనకార్యములు వివరింపుము.
2. నానాజాతి సమితి విఫలమగుటకు కారణములు ఏమిటి ?
3. ఉడ్రోవిల్సన్ 14 సూత్రాలు
4. ఆదిష్ట పద్ధతి.

## 13.11 చదువదగిన గ్రంథాలు :


1. C.J.A. Hayes - Modern Europe Since 1870
2. D. Thamson - Europe since Napoleon
3. C.D. Hazan - Modern Europe upto 1945
4. H.L. Peacock - Modern European History


డా॥ వి.కె. మోహన్

పాఠం - 14

# రష్యా విప్లవము, లెనిన్, స్టాలిన్

## 14.1 రష్యా విప్లవము - 1917

### 14.1.0 లక్ష్యం :

రష్యాలో జారు చక్రవర్తుల నిరంకుశత్వ సామ్రాజ్యాన్ని కూలద్రోసి కమ్యూనిస్ట్ దేశంగా ప్రభావింపచేసి బోల్షివిక్ విప్లవం కావడానికి గల వివిధ కారణాలను గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### విషయసూచిక :


- **14.1.1** పరిచయం
- **14.1.2** విప్లవ కారణాలు
  - **14.1.2.1** జారు చక్రవర్తుల నిరంకుశత్వం
  - **14.1.2.2** ఆర్థిక పరిస్థితులు
  - **14.1.2.3** మేధావుల ప్రభావం
  - **14.1.2.4** వివిధ పార్టీల వైఖరి
  - **14.1.2.5** 1905 విప్లవం
  - **14.1.2.6** రష్యా - జపాన్ యుద్ధం
  - **14.1.2.7** మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా పాత్ర
- **14.1.3** విప్లవ ప్రారంభం
  - **14.1.3.1** మార్చి విప్లవం (1917)
  - **14.1.3.2** తాత్కాలిక ప్రభుత్వం
  - **14.1.3.3** నవంబర్ విప్లవం (1917)
  - **14.1.3.4** నూతన ప్రభుత్వస్థాపన
- **14.1.4** విప్లవ విజయానికి కారణాలు
- **14.1.5** విప్లవ ప్రాముఖ్యం
- **14.1.6** ముగింపు
- **14.1.7** నమూనా ప్రశ్నలు
- **14.1.8** చదువదగిన గ్రంథాలు


### 14.1 పరిచయం :

యూరప్‌ఖండ ఈశాన్య భాగంలో సువిశాలమైన రష్యాదేశం వుంది. ఇచ్చటి ప్రజలు స్లావ్ జాతీయులు. కాథలిక్ క్రైస్తవ మతానికి చెందినవారు. ఆధునిక యుగారంభంలో, ఐవనోవ్ వంశ పరిపాలనలో రష్యా జాతీయదేశంగా ఆవిర్భవించింది. ఐవాన్

దిగ్రేట్ (1462 - 1505) రష్యాకు మంగోలియా ఆధీనత నుండి స్వాతంత్ర్యాన్ని సంపాదించడమేగాక అంతఃకలహాలకు స్వస్తి పలికించి, జాతీయ రాజరిక వ్యవస్థకు పునాది వేశాడు. రోమన్ వంశ చక్రవర్తుల కాలంలో (1613 - 1917) రష్యా ఐరోపీకరణను సాధించి, బ్రిటిష్ సామ్రాజ్యం తరువాత తానే గొప్ప సామ్రాజ్యంగా వెలిసింది. దాని సరిహద్దులు ఉత్తరాన బాల్టిక్, ఆర్కిటిక్ సముద్రాలు, దక్షిణంలో నల్లసముద్రం, కాస్పియన్ సముద్రం; తూర్పున పసిఫిక్ మహాసముద్రం, పడమర ప్రష్యా, ఆస్ట్రియా సరిహద్దుల వరకు విస్తరించింది. ఇంత విశాలమైన సామ్రాజ్యం జార్ చక్రవర్తి సార్వభౌమ, నియంతృత్వ పరిపాలనలో వుంది. రష్యా సామ్రాజ్య, రష్యన్ చర్చిలపై జార్ నిర్వివాదమైన అధికారం గలవాడు. జార్ రెండో అలెగ్జాండర్ మొదట్లో ఉదారమైన సంస్కరణలను ప్రవేశపెట్టినప్పటికీ చివరికి యథాస్థితివాదిగా, తిరోగమనశీలిగా మారిపోయాడు. ఆయన వారసులు మూడో అలెగ్జాండర్, రెండో నికోలస్‌లు సంపూర్ణ యథాస్థితివాదులు, తిరోగమనశీలురు. సమాజంలో రాజన్యులు, కులీనులు ప్రత్యేక హక్కులు కల్గివున్న వర్గంవారు. మధ్యతరగతివారు, రైతులు, బానిసలు ఎలాంటి హక్కులులేని వర్గానికి చెందినవారు. 19వ శతాబ్ది చివరి నాటికి రైతుల ఆర్థిక పరిస్థితి చాలా హీనమైంది. రెండో అలెగ్జాండర్ 1861లో బానిసలకు స్వేచ్ఛను ప్రసాదించినా వారి స్థితిగతులలో మార్పులేదు. రష్యాలో ప్రతి చోటా ముఖ్యంగా రైతుల్లో అసంతృప్తి, నిరాశా నిస్పృహలుగా ప్రబలిపోయాయి. జార్‌కు వ్యతిరేకంగా అక్కడక్కడా, అప్పుడప్పుడూ తిరుగుబాట్లు, అలజడులు తలెత్తాయి. మూడో అలెగ్జాండర్ పరిపాలన కాలంలో రష్యాలో పారిశ్రామికీకరణ మొదలైంది. ఆయన కౌంట్ సెర్జ్‌విట్‌ను ఆర్థిక, రవాణా శాఖల మంత్రిగా నియమించాడు. రష్యాలో పరిశ్రమలు, భారీవ్యాపారం అభివృద్ధిగావించిందంటే ఈ ఘనతంతా కౌంట్ సెర్జ్‌విట్‌దే. రెండో నికోలస్ కాలంలో (1894 - 1917) రష్యాలో చాలా వేగంగా పారిశ్రామిక విప్లవం వ్యాపించింది. ఈ అధిక పారిశ్రామికాభివృద్ధికి ఫ్రెంచి పెట్టుబడి, రష్యాలోని మాజీ బానిసలు చాలా తక్కువ కూలికి పనిచేయడం కారణాలయ్యాయి. పారిశ్రామికీకరణ ఫలితంగా సమాజంలో కార్మికవర్గం అనే కొత్తవర్గం ఏర్పడింది. అసంతృప్తి చెందిన రైతులు చాలా మంది పారిశ్రామికవాడలకొచ్చి అధిక సంఖ్యలో కర్మాగారాల్లో పనివారుగా చేరిపోయారు. పెట్టుబడిదారులు వారిచేత ఎక్కువ గంటలు పనిచేయించి స్వల్పమైన వేతనాలు ఇచ్చారు. కార్మికుల పరిస్థితి చాలా హీనంగా వుంది. పెట్టుబడిదారులు తమను దోచుకొంటున్నారని కార్మికులు భావించారు. కార్మికుల, కర్షకుల దైన్యనిస్సహాయ స్థితిని రష్యామేధావి వర్గానికి చెందిన లియోటాల్‌స్టాయ్, మాక్సిమ్ గోర్కీ, టుర్గెనోవ్ లాంటి రచయితలు తమ రచనల ద్వారా తెలియజేసారు. అయితే రష్యా విప్లవం రావటానికి కావలసిన భావాలను, చాలాకాలం క్రితమే కార్ల్‌మార్క్స్ ప్రవచించాడు. మార్క్సియన్ సామ్యవాదం రష్యా కార్మిక వర్గాన్ని ఆకర్షించింది. కార్మిక సంఘాలు అవతరించాయి. పారిశ్రామిక సమ్మెలను నిర్వహించటం మొదలైంది. 1898లో సామ్యవాద ప్రజాస్వామ్య పక్షం వెలసింది. అది తరువాత మెన్షివిక్స్ (మితవాదులు), బోల్షివిక్స్ (తీవ్రవాదులు) గా చీలిపోయింది. కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్ట్ భావాలతో బాగా ప్రభావింతుడైన లెనిన్ బోల్షివిక్‌లను నాయకులైనాడు. ఈ విధంగా 19వ శతాబ్దానంతానికి మార్క్స్‌వాదుల వర్గం రష్యాలో పటిష్టమైన శక్తిగా రూపొందింది.

### 14.1.2 విప్లవ కారణాలు :

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జార్ చక్రవర్తుల నిరంకుశ పాలనను అంతం చేయడానికి 1917లో రష్యాలో ఒక చారిత్రాత్మకమైన విప్లవం జరిగి సామ్యవాద ప్రభావంవల్ల బోల్షెవిక్‌లు అనే రాజకీయపార్టీ ఆధ్వర్యంలో రిపబ్లిక్ ప్రభుత్వమేర్పడింది. రష్యాలో జరిగిన ఈ విప్లవాన్ని బోల్షెవిక్ విప్లవమని, కమ్యూనిస్ట్ విప్లవం అని అంటారు. ఈ విప్లవం 1789లో జరిగిన ఫ్రెంచి విప్లవంవలె ఆధునిక ప్రపంచ చరిత్రలో అనేక గొప్ప మార్పులకు కారణమయింది. రష్యన్ కమ్యూనిస్ట్ విప్లవ ప్రభావము నేటికీ మానవ జీవితం మీద కనిపిస్తుంది. ఈ విప్లవానికి గల కారణాలు.

### 14.1.2.1 జార్ చక్రవర్తుల నిరంకుశత్వము :

"రష్యా విప్లవకారణాలు రష్యా చరిత్రలోనే లోతుగా పాతుకొనివున్నాయి" అని లిప్సన్ పేర్కొన్నాడు. 1613 నుండి రష్యాను పరిపాలించిన చక్రవర్తులందరు రోమనావ్ వంశస్థులు. పీటర్ ది గ్రేట్ (1689 - 1725), కాథరిన్ ది గ్రేట్ (1762 - 1796) ల కాలంలో రష్యా ఒక గొప్పరాజ్యంగా పేరుప్రతిష్ఠలు సంపాదించింది. అయితే వారి తరువాత రష్యాను పరిపాలించిన చక్రవర్తులందరూ ప్రజాభిప్రాయాన్ని పాటించకుండా పరిపాలన సాగించారు. ఒక్క రెండో అలెగ్జాండర్ చక్రవర్తి మాత్రం ప్రజాక్షేమాన్ని కోరి కొన్ని ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టినాడు. 1861లో అలెగ్జాండరు కర్షకులకు బానిసత్వం నుంచి విముక్తి కలిగించినాడు. కాని పోలెండ్‌లో తిరుగుబాటు ఫలితంగా రెండో అలెగ్జాండర్ రహస్య పోలీసు సహాయంతో ఉదార విధానానికి స్వస్తిచెప్పి కఠిన వైఖరి అవలంబించినాడు. దేశంలో శూన్యవాదులు, అరాజకవాదులు చక్రవర్తి కఠిన వైఖరికి వ్యతిరేకంగా ఆందోళనలు సాగించినారు. రెండో అలెగ్జాండర్ చక్రవర్తిని ఒక శూన్యవాది 1881లో హత్యచేసినాడు. రెండో అలెగ్జాండర్ తరువాత రష్యాను పరిపాలించిన మూడో అలెగ్జాండర్ కూడా ఉదార ఉద్యమాలను అణచివేసి నిరంకుశంగా పరిపాలించినాడు. ఓక్‌రానా (పోలీస్ వ్యవస్థ) సహాయంతో మూడో అలెగ్జాండర్ విప్లవవాదులలో కొంతమందిని జైళ్ళలో నిర్బంధించినాడు. మరికొంతమందిని విప్లవవాదులను దేశంనుంచి బహిష్కరించి సైబీరియాకు పంపినారు. ఇంకా కొంతమందిని చంపివేసినారు. 1894లో రాజ్యానికి వచ్చిన రెండో నికోలస్ చక్రవర్తి తన పూర్వుల వలె తెలివితేటలు, శక్తిసామర్థ్యాలున్న చక్రవర్తికాడు. ఇతడు తన సలహాదారులను, మంత్రులను కూడా ద్వేషించి ఈర్ష్యాభావంతో చూసేవాడు. ఇతని కాలంలో వ్యవసాయం నిర్లక్ష్యం చేయడంవల్ల కర్షకుల బాధలు ఎక్కువైనాయి. దేశంలో విద్యావ్యాప్తి దాదాపుగా నిరోధించడం జరిగింది. రహస్యపోలీస్ దళము విప్లవ వీరులను వెంటాడుతూ వుండేది.

దీనికితోడు రష్యాలో పరిస్థితులు విషమించడానికి మరో కారణం దేశపరిపాలన చక్రవర్తి భార్య చేతులలో వుండటమేనని చెప్పవచ్చు. రస్ పుటిన్ అనే సైబీరియా రాజకీయవేత్త ప్రభావానికిలోనైన మహారాణి అలెగ్జాండ్రా కొనసాగించిన నిరంకుశ ఆంతరంగిక పరిపాలన ఫలితంగా ప్రజలలో అసంతృప్తి ఎక్కువైంది. ఫ్రెంచివిప్లవ కాలం నాటి మేరియాంటనెట్ వలె అలెగ్జాండ్రా కూడా ప్రవర్తిస్తూ అమితంగా నగలకు ఖర్చుపెట్టేది. అసంతృప్తి చెందిన ప్రజలను సంతృప్తిపరచడానికి రెండో నికోలస్ పరిమితమైన అధికారులతో కూడిన డ్యూమాను (శాసనసభ) సమావేశపరచడానికి ఏర్పాట్లు చేసినాడు. కాని దీనివల్ల ప్రజలలో అసంతృప్తి ఏమాత్రం తగ్గలేదు. దీనికితోడు జార్ విదేశాంగ విధానం కూడా విఫలం కావడంవల్ల రష్యన్ ప్రజలలో అసంతృప్తి తీవ్రరూపం దాల్చింది. 1904 - 1905లలో జరిగిన యుద్ధంలో జపాన్ చేతిలో రష్యా ఓడిపోయింది. ఈ ఓటమిని రష్యన్ ప్రజలు దేశం ఓటమిగాకాక చక్రవర్తి ఓటమిగా భావించినారు. అంతేగాక మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా నిర్వహించిన పాత్ర కూడా దేశానికి అపఖ్యాతి తెచ్చిపెట్టింది. దీనికితోడు దేశంలో ఆర్థికపరిస్థితి కూడా విషమించింది. అందువల్ల రష్యాలో పరిస్థితులు విప్లవానికి అనుకూలంగా ఉన్నాయి. జార్ చక్రవర్తుల నియంతృత్వానికి వచ్చినంత ప్రజావ్యతిరేకం మరే రాజవంశానికి రాలేదని రోడ్‌స్టీన్ అను పండితుడంటాడు.

### 14.1.2.2. ఆర్థిక పరిస్థితులు :

1917కు పూర్వం రష్యాలో భూస్వాములు, సేద్యబానిసలు అనే రెండు వర్గాలుండేవి. సేద్యబానిసలు భూస్వాముల పొలాలలో పనిచేసేవారు. సేద్యబానిసలకు ఏవిధమైన హక్కులుండేవి కావు. రెండో అలెగ్జాండర్ చక్రవర్తి సేద్యబానిసలకు విముక్తి కలుగజేసినప్పటికీ రైతులుగా వారి స్థితిగతులు ఏవిధంగా బాగుపడలేదు. రైతులకు తినటానికి చాలినంత తిండి కూడా ఉండేదికాదు. దేశప్రజలలో ఐదింట నాలుగోవంతు భాగం వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నప్పటికీ వ్యవసాయం మాత్రం

వెనుకబడి ఉండేది. రైతుల మీద పన్నుభారం ఎక్కువగా ఉండేది. ధనిక వర్గానికి చెందిన భూస్వాములు, ప్రభువులు మొదలైన వారిమీద పన్నుల భారమేమీ ఉండేది కాదు. భూస్వామ్య వర్గానికి, కర్షక వర్గానికి మధ్యగల అసమానత్వం రష్యన్ ప్రజలలో చాలా అసంతృప్తికి దారితీసింది. కర్షకులు వ్యవసాయానికి కావలసిన పెట్టుబడి సొమ్ములేక గ్రామాలలో ఉండే కులక్ అనే వడ్డీవ్యాపారస్థుల వద్ద హెచ్చు రేటుకు అప్పు తీసుకోవలసి వచ్చేది. కర్షకులకు ఋణాలను తిరిగి చెల్లించే మార్గం కనిపించేదికాదు. అందువల్ల సేద్యబానిసలు భూస్వాముల, కులక్‌ల దౌర్జన్యాలను ఎదుర్కొనడానికి సిద్ధపడసాగినారు.

కర్షకవర్గం పరిస్థితివలె కార్మికవర్గం పరిస్థితికూడా మెరుగుగాలేదు. పశ్చిమయూరప్ రాజ్యాల కంటే రష్యాలో పారిశ్రామికాభివృద్ధి ఆలస్యంగా జరిగినప్పటికీ 20వ శతాబ్దం ప్రారంభం నాటికి ఫాక్టరీలు స్థాపించడం, యంత్రాలు ప్రవేశపెట్టటం, రైలుమార్గాలు నిర్మించడం మొదలైన పనులు జరిగాయి. అంతేగాక విదేశాల పెట్టుబడి ఫలితంగా రష్యాలో పారిశ్రామికీకరణ వేగంగా జరిగింది. కార్మికుల సంఖ్య పెరిగింది. 1917 నాటికి దేశప్రజలలో ఐదింట ఒక భాగం కార్మిక వర్గానికి చెందినవారు. పెట్టుబడిదారులు ఉత్పత్తిని ఎక్కువచేసి అధికలాభాలు గడించినప్పటికీ కార్మికుల వేతనాలు మాత్రం చాలా తక్కువగా ఉండేవి. పనిగంటలు ఎక్కువగా ఉండేవి. బాలబాలికలను కూడా పనిలో నియోగించేవారు. పట్టణాలలోని కార్మికులు మురికిపేటలలో అనారోగ్యకరమైన పరిస్థితులలో నివసించేవారు. ప్రభుత్వానికి ఒక నిర్దిష్టమైన కార్మిక విధానంలేదు. ఈ కారణాలవల్ల పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా కార్మిక వర్గంవారు ఆ రోజులలో ప్రచారంలోకి వస్తున్న సామ్యవాద సిద్ధాంతాల ప్రభావాలకులోనై కార్మిక సంఘాలు స్థాపించి తద్వారా తమ పరిస్థితులను మెరుగుపరచడానికి విప్లవోన్ముఖులైనారు. పెట్టుబడిదారీ వర్గానికి, కార్మిక వర్గానికి మధ్య ఉధృతమైన ఘర్షణ ఏర్పడింది.

### 14.1.2.3 మేధావుల ప్రభావం :

మధ్యతరగతికి చెందిన మేధావులు, విద్యావేత్తలు తమ రచనల ద్వారా జార్ చక్రవర్తుల నిరంకుశత్వాన్ని, ప్రభుత్వంలోని లంచగొండితనాన్ని భూస్వాములు, పెట్టుబడిదారుల స్వార్థాన్ని ప్రజలుదృష్టికి తీసుకొనివచ్చి వారిని చైతన్యవంతులను చేసినారు. వారు మొదట శూన్యవాద ఉద్యమాన్ని ప్రచారం చేసినారు. శూన్యవాద ఉద్యమం విఫలమైన తరువాత రష్యాలో మేధావివర్గం వారు సామ్యవాద సిద్ధాంతాల వైపు మొగ్గినారు. రష్యా మేధావి వర్గంలో టాల్‌స్టాయ్, గోర్కీ, టర్గినోవ్, చెకోవ్ మొదలైనవారు ముఖ్యులు. జర్మనీకి చెందిన కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంజిల్స్ అనే వారు సామ్యవాదాన్ని ఒక పద్ధతిగాను, ఉద్యమంగాను రూపొందించారు. సంఘంలో పెట్టుబడిదారీ వర్గానికి, శ్రామిక వర్గానికి ఆధికారం కోసం వర్గ సంఘర్షణ తప్పక జరిగితీరుతుందని చివరికి పోరాటంలో శ్రామికవర్గానికి విజయం లభించి సమానత్వం ప్రాతిపదికగాగల వర్గరహితమైన కమ్యూనిస్ట్‌వ్యవస్థ ఏర్పడుతుందని చెప్పినారు. మార్క్స్ సిద్ధాంతాల ప్రభావంవల్ల 1864లో మొదటి కమ్యూనిస్ట్ ఇంటర్ నేషనల్ అనే సమావేశం జరిగింది. కాని ఈ సమావేశం విఫలమైంది. రెండో కమ్యూనిస్ట్ సమావేశం కూడా చెప్పుకోదగిన విజయాలను సాధించలేదు. కాని వివిధదేశాల ప్రతినిధులు పరస్పరం ఒకరి అభిప్రాయాలను మరొకరు తెలుసుకోగలిగినారు. మార్క్స్‌సిద్ధాంతాలను అమలుపరచడానికి రాజకీయ పక్షాలుకూడా ఏర్పడినాయి. ప్రజలలో అసంతృప్తి ఉన్నప్పుడు దానికి జీవం పోయడానికి మేధావుల రచనలు సహాయపడతాయి. రష్యా విషయంలో ఇదే జరిగింది.

### 14.1.2.4 వివిధ పార్టీల వైఖరి :

మేధావుల, విద్యావేత్తల రచనల ప్రభావం వల్ల రష్యాలో అనేక పార్టీలేర్పడి చక్రవర్తుల నిరంకుశ పరిపాలనను ఖండిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక కార్యకలాపాలు సాగించాయి. రష్యాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటైన మొదటపార్టీ శూన్యవాదుల పార్టీ. తరువాత ఏర్పడిన పార్టీ అరాజకవాదులపార్టీ. శూన్యవాదులు, అరాచకవాదులు కూడా సంఘంలో

అమలులో ఉన్న సంస్థలు పనికిరావని, వాటిని నిర్మూలించవలెనని ఆందోళన సాగించినారు. క్రైస్తవ సామ్యవాదులు అనేపార్టీ వారు టాల్‌స్టాయ్ వంటి రచయితల ప్రభావం వల్ల సంఘ సంస్కరణలు జరుగవలెనని ఆందోళన సాగించినారు. వీరికితోడు ఉదారవాదులు, తీవ్రవాదులు అనేవారు డ్యూమాను సమావేశపరచి రాజ్యాంగ పద్ధతుల ప్రకారం పరిపాలన జరుగవలెనని ఆందోళన ప్రారంభించినారు. రెండో నికోలస్ కాలంలో మార్క్స్ సిద్ధాంతాల ననుసరించి సాంఘిక విప్లవపార్టీ ఏర్పడింది. 1904 - 1905లో జపాన్ - రష్యాల మధ్య జరిగిన యుద్ధంలో రష్యా ఓటమివల్ల చక్రవర్తి పరిపాలనలోని అసమర్థత ప్రజలకు బాగా అర్థమైంది. దీనికితోడు సైన్యంలో తిరుగుబాట్లు, పెట్రోగ్రాడ్ వంటి నగరాలలో విప్లవభావ ప్రభావంవల్ల శ్రామికవర్గం తిరుగుబాట్లు చెలరేగినాయి. లెనిన్ నాయకత్వంలో ఉన్న సాంఘిక విప్లవపార్టీ 1903లో రెండు చీలికలై మెన్షివిక్‌లు, బోల్షివిక్‌లుగా ఏర్పడినారు. అత్యధిక సంఖ్యలో ఉన్న బోల్షివిక్‌లు లెనిన్ నాయకత్వంలో నిరసన ప్రదర్శనలు, సమ్మెలు ప్రారంభించినారు. 1905లో సమావేశమైన డ్యూమా సభ్యులను రెండో నికోలస్ తొలగించినాడు. దీనివల్ల రష్యాలో పరిస్థితి మరీ గందరగోళంగా తయారైంది.

## 14.1.2.5 1905 విప్లవం :

జార్ రెండో నికోలస్ కాలంలో రష్యా రెండు విప్లవాలకు లోనయింది. మొదటిది 1905లో రెండోది 1917లో వచ్చాయి. 1917 విప్లవానికి 1905లో వచ్చిన విప్లవం నాంది, పూర్వపీఠిక లాంటిది. దమననీతితో కూడిన రెండో నికోలస్ పరిపాలనపట్ల రైతులు, కార్మికులు భూసంస్కరణలను కోరారు. కార్మికులు తమ పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి సమ్మెలు చేయసాగారు. మధ్యతరగతివారు రాజకీయ సంస్కరణ కోరారు. ఇటువంటి పరిస్థితుల్లో సెయింట్ పీటర్స్ బర్గ్‌లో జరిగిన ఒక సంఘటన 1905 విప్లవాన్ని తీసుకొనివచ్చింది. 1905 జనవరి 22 ఆదివారంనాడు కార్మికులు, రైతులు, స్త్రీలు, పురుషులతో కూడిన పెద్దఊరేగింపు చక్రవర్తి శీతాకాల రాజప్రాసాదం వైపుగా సాగిపోయింది. వారికి గావన్ మతాధికారి నాయకుడు. తమ బాధలు, కష్టాలు గూర్చి లిఖింపబడిన ఒక పత్రాన్ని గావన్ చక్రవర్తికి సమర్పించాలనుకొన్నాడు. విషయం తెలిసిన చక్రవర్తి పారిపోయాడు. ఊరేగింపు గమ్యం చేరకుండానే రాజభవన రక్షక సిబ్బంది, సైన్యం గుంపుపై తుపాకులను కాల్చటం మొదలుపెట్టారు. ఆ కాల్పుల్లో అనేకమంది మరణించారు. 'రక్తపాతయుత భానువారపు' వధగా దీన్ని వర్ణించారు. ఈ సంఘటన 1905 విప్లవ ప్రారంభానికి సూచన అయింది. ఆ తరువాత రష్యా అంతటా రాజకీయ అలజడులు మొదలయ్యాయి. చక్రవర్తి తాత్కాలికంగా లొంగిపోయి సమస్యలు తీర్చమని డ్యూమాకు పిలుపునిచ్చాడు. రాస్పూటిన్ చెడు ప్రభావం నుండి బయటపడలేని రెండో నికోలస్ నిరంకుశ, దమన నీతిని సాగించాడు. 1914 కల్లా చాలాచోట్ల సమ్మెలు జరిగాయి. ప్రభుత్వం భయపడ్డది. రాజధానిలో సాయుధ సంఘర్షణలు మొదలైనాయి. విప్లవం ఎప్పుడయినా రావచ్చునిపించింది. ఆ సమయంలో 1914 ఆగస్టు ప్రారంభంలో మొదటి ప్రపంచయుద్ధం మొదలైంది.

## 14.1.2.6 రష్యా - జపాన్ యుద్ధం (1904 - 1905) :

1894 - 1985లో జరిగిన చైనా - జపాన్ యుద్ధంలో జపాన్ విజయం సాధించింది. 1895లో జరిగిన షిమోనోసెకి సంధి ఫలితంగా జపాన్ ఫార్మోజా, లియాతుంగ్ ద్వీపకల్పం, ఆర్థర్ రేవు పట్టణాన్ని సంపాదించింది. ఆర్థర్ రేవు పట్టణాన్ని ఆక్రమించుకోవాలనుకొన్న రష్యా, ఫ్రాన్స్, జర్మనీలతో కలిసి జపాన్ తాను సంపాదించిన భూభాగాలను వదిలేదాకా, ఆ దేశాన్ని బలవంత పెట్టాయి. ఈ మూడు దేశాలను ఎదుర్కొనే బలంలేక, తనతో కలిసే మిత్రదేశాలు లేక జపాన్ ఆర్థర్ రేవును, లియాతుంగ్ ద్వీపకల్పాన్ని వదిలివేసింది. చైనాను బలవంతపెట్టి రష్యా 1897లో ఆర్థర్ రేవును కౌలుకు తీసుకుంది. ఆ తరువాత ట్రాన్స్ - సైబీరియాన్ రైలుమార్గం ఆర్థర్‌రేవు వరకు వచ్చేందుకు రష్యా అనుమతిని సంపాదించింది. రష్యా జరిపిన ఈ ఆకృత్యంపట్ల, జపాన్‌లో నిరసన ప్రదర్శించటం జరిగింది. ప్రాచ్యంలో జపాన్‌కు రష్యా ప్రబల శత్రువైంది. రష్యాను ఎదుర్కోవడానికి

జపాన్ ఐరపా ఖండంలో తనతో చేయికలిపే మిత్రదేశం కోసం అన్వేషణ చేయసాగింది. అదే సమయంలో ఇంగ్లాండ్‌కు కూడా ప్రాచ్యంలో ఒక మిత్రదేశం కావల్సివచ్చింది. పశ్చిమాన రష్యా భయం, ఇండో-చైనాలో తిష్టవేసిన ఫ్రెంచివారి భయం బ్రిటన్‌ను బాధపెట్టింది. తన వలస స్థావరమైన భారతదేశానికి ముప్పుగా బ్రిటన్ భావించింది. ఫలితంగా 1902లో ఇంగ్లాండ్, జపాన్ దేశాలు మిత్రులై, ఒక ఒప్పందాన్ని చేసుకొన్నాయి. ఏ దేశంలో యుద్ధం సంభవించినా పరస్పర సహాయసహకారాల నందించుకోవాలని నిర్ణయించుకొన్నాయి. 1905లో ఈ ఒప్పందాన్ని తిరిగి వ్రాసుకున్నాయి. ఈ ఒప్పందం వల్ల ప్రాచ్యంలో రష్యా ముందుకు సాగకుండా వ్యతిరేకించడానికి జపాన్ తగిన ధైర్యాన్ని సంతరించుకొంది. ఇంతలో రష్యా మంచూరియాను ఆక్రమించి తన సైన్యాన్ని కొరియా సరిహద్దు వైపు నడిపింది. ఇంక ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1904లో జపాన్ రష్యాపై యుద్ధాన్ని ప్రకటించింది. ఇదే రష్యా-జపాన్ యుద్ధం.

జపాన్ కొరియాపై దండయాత్ర చేసి రష్యన్లను ద్వీపకల్పాన్నుండి తరిమివేసింది. తరువాత జపాన్ ఆర్థర్ రేవును ముట్టడించి ఆక్రమించింది. లియాతుంగ్ ద్వీపకల్పాన్నుండి రష్యన్లనందరినీ జపాన్ తరిమివేసింది. మంచూరియాలోని ముక్డెన్ వద్ద 1905లో జపాన్ చేతిలో రష్యా సైన్యం ఘోర పరాజయాన్ని పొందింది. ఈలోగా జార్ చక్రవర్తి చైనా సముద్రంలో తాను పోగొట్టుకొన్న ప్రదేశాలను తిరిగి సంపాదించటానికి తన బాల్టిక్ నావికా సైన్యాన్ని పంపాడు. జపాన్ నౌకాదళం ఆ సైన్యంపై దాడిచేసి పూర్తిగా ఓడించింది. పూర్తిగా పరాజయం చెందిన రెండో నికోలస్ చక్రవర్తి జపాన్‌లో సంధికి సిద్ధపడ్డాడు. ఫలితంగా 1905లో పోర్ట్స్‌మౌత్‌లో జపాన్, రష్యాల మధ్య ఒడంబడిక జరిగింది. ఈ సంధి ప్రకారం రష్యా ఆర్థర్ రేవుతో సహా లియాతుంగ్ ద్వీపకల్పాన్ని జపాన్‌కు సమర్పించింది. కొరియాను జపాన్ పలుకుబడిలోని ప్రాంతంగా గుర్తించింది. మంచూరియాను తిరిగి చైనాకు అప్పగించింది. ఈ రష్యా-జపాన్ యుద్ధంలో రష్యా పరాజయం జార్ ప్రభుత్వ బలహీనతను, అసమర్థతను బయల్పరచింది.

### 14.1.2.7 మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా పాత్ర :

మొదటి ప్రపంచ యుద్ధ నిర్వహణలో జార్ అశక్తత 1917 విప్లవానికి తక్షణ కారణమైంది. ఈ యుద్ధంలో రష్యా ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లతో చేరి జర్మనీ మీద యుద్ధం చేసింది. యుద్ధ నిర్వహణ విషయంలో జార్‌కూ, డ్యూమాకు మధ్య సంబంధాలు 1915 నాటికి బాగా చెడిపోయాయి. జార్ యుద్ధ నిర్వహణ లోపభూయిష్టమై వుంది. రష్యన్ సైనికులకు ఆయుధాలు, మందుగుండు సామాను తగినంత ఇవ్వబడలేదు. జార్ తనంతట తానే యుద్ధ సైన్యాధిపత్యాన్ని నిర్వహించాడు. జార్ రాజధాని నుండి దూరమయినపుడు ఆయన స్థానే ప్రజలకూ, సైన్యానికి అసలు పడని రాస్పుటిన్ ప్రభుత్వ వ్యవహారాలను పరోక్షంగా నిర్వహించాడు. యుద్ధంలో రష్యన్‌లు పరాజయం తరవాత పరాజయాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. యుద్ధంలో చాలా మంది రష్యన్‌లు చనిపోయినారు. చాలా మంది గాయపడ్డారు. ఆహార పదార్థాల కొరత తీవ్రమైంది. జార్ ప్రభుత్వం అప్రతిష్ట పాలైంది. ప్రభుత్వం పట్ల ప్రజల కోపం ఇనుమడించింది. 1916లో రాస్పుటిన్ చంపబడ్డాడు. అయితే ఇతని హత్య పరిస్థితి మెరుగుపర్చడంలో విఫలమైంది. ప్రభుత్వంలో అసమర్థత, అవినీతి, లంచగొండితనం అలాగే వుండిపోయాయి. పరిస్థితి ఉద్రిక్తమయింది. కొంతమంది ప్రజలు బాహాటంగా విప్లవాన్ని ప్రకటించారు.

### 14.1.3 విప్లవ ప్రారంభం :

1917 రష్యా విప్లవం రెండు దశల్లో సంభవించింది. మొదటిది మార్చి విప్లవం. ఈ విప్లవం జార్ ప్రభుత్వాన్ని పడగొట్టి, కెరెన్స్కీ ఆధ్వర్యంలో తాత్కాలిక ఉదార ప్రభుత్వాన్ని నెలకొల్పింది. రెండోది అక్టోబర్ విప్లవం. ఈ విప్లవం కెరెన్స్కీ ప్రభుత్వాన్ని పడగొట్టి లెనిన్ ఆధ్వర్యంలో కార్మిక ప్రభుత్వాన్ని నెలకొల్పింది. రెండు విప్లవాలు ప్రశాంతంగా ఎక్కువ రక్తపాతం లేకుండా సాధించబడ్డాయి.

### 14.1.3.1 మార్చి విప్లవం (1917) :

1917 మార్చి 8న మార్చి విప్లవం మొదలైంది. ఆ రోజున ఆహార పదార్థాలను కోరుతూ సెంట్ పీటర్స్ బర్గ్‌లోని మిల్లు స్త్రీ కార్మికులు సమ్మెచేశారు. అది రష్యా విప్లవానికి నాంది. దీని వెనువెంటనే పారిశ్రామిక కార్మికులు సామ్యవాదుల మద్దతుతో పెద్ద ప్రదర్శననిచ్చారు. నిరంకుశపాలన అంతమొందాలి, యుద్ధం ఆగిపోవాలి అను నినాదాలిచ్చారు. కార్మికుల సమ్మెను అణచివేయడానికి ప్రభుత్వం సైన్యానికి ఆదేశాలు ఇచ్చింది. కాని సైన్యం సమ్మె చేస్తున్న కార్మికులతో కలసిపోయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది. పరిస్థితి విషమించింది. జార్‌ను సమర్థించేవారు ఒక్కరూ లేకపోయారు. డ్యూమాను రద్దుపర్చటానికై మాస్కో నుండి పెట్రోగ్రాడ్‌కు (సెంట్ పీటర్స్ బర్గ్) జార్ బయలుదేరినాడు. పెట్రో గ్రాడ్ బయట ఆయన బండిని నిలిపివేయడం జరిగింది. మార్చి 11న జార్ డ్యూమాను రద్దుచేశాడు. కాని డ్యూమా రద్దవటానికి వ్యతిరేకించింది. ఆ తరవాత డ్యూమా కుట్ర జరిపి 1917 మార్చి 12న జార్జిల్వవ్ రాకుమారుడు నాయకుడుగా ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పరచింది. తన పరిస్థితి క్లిష్టమవడంతో రెండో నికోలస్ జార్ 1917 మార్చి 15న సింహాసనాన్ని త్యజించివేశాడు. ఆయనను, ఆయన కుటుంబాన్ని చెరసాలలో బంధించారు. తరవాత వారు 1918 జూలై 8న కాల్చి చంపబడ్డారు. జార్ సింహాసనాన్ని త్యజించటంతో రోమనోవ్ వంశస్థుల పాలన రష్యాలో అంతమైంది. ఈ విధంగా మార్చి విప్లవం రష్యాలో జార్ నియంతృత్వ పాలనకు స్వస్తి చెప్పింది.

### 14.1.3.2 తాత్కాలిక ప్రభుత్వం :

మార్చి విప్లవం తరవాత రష్యాలో ఏర్పడిన ప్రభుత్వం మితవాద సామ్యవాదులైన మెన్షివిక్‌లలోను, బూర్జువాల (మధ్యతరగతివారు) తోను ప్రబలమైంది. ఈ తాత్కాలిక ప్రభుత్వం అనేక ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టింది. పత్రికలకు స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. ప్రజలకు మత స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యము ఇచ్చినారు. రష్యాలోని మండలాలన్నీ సోవియట్‌లుగా విభజితమైంది. సోవియట్‌లలో సైనికులకు, కార్మికులకు, కర్షకులకు ప్రాతినిధ్యమివ్వడం జరిగింది. రష్యాను గణరాజ్యంగా ప్రకటించడం జరిగింది. రష్యా భవిష్యత్ ప్రభుత్వ శాశ్వత రూపాన్ని నిర్ణయించేందుకై వయోజన ఓటు హక్కు ప్రాతిపదికగా జాతీయ రాజ్యాంగ సభకు ఎన్నికలు జరుగుతాయని కొత్త ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రజలలో ఆశ జనించింది. అయితే ప్రభుత్వం మిత్రవర్గంతో కలసి జర్మనీకి వ్యతిరేకంగా యుద్ధం సాగించాలని నిశ్చయించటంతో ప్రజల ఉత్సాహం మాయమయింది. దీనివల్ల, తాత్కాలిక ప్రభుత్వానికి, సోవియట్లకు మధ్య అభిప్రాయ బేధాలొచ్చాయి. ఈ అవకాశాన్ని జర్మనీ తనకు అనుకూలంగా మార్చుకొనేందుకు ప్రయత్నించింది. సోవియట్‌లకు బలం చేకూర్చేందుకై లెనిన్ తదితర బోల్షివిక్ నాయకులు రష్యాలో ప్రవేశించడానికి కావలసిన ఏర్పాట్లను జర్మనీ చేసింది. వారి రాక పోరాటాన్ని తీవ్రతరం చేసి తాత్కాలిక ప్రభుత్వాన్ని పూర్తిగా బలహీనపర్చింది. దీంతో 1917 జూలై 20న ల్వవ్ రాకుమారుడు రాజీనామా చేసినాడు. 1917 జూలై 25న అలెగ్జాండర్ కెరెన్స్కీ అనే విప్లవ నాయకుడు తాత్కాలిక ప్రభుత్వానికి అధినేత అయినాడు.

### 14.1.3.3 నవంబర్ విప్లవం (1917) :

తాత్కాలిక ప్రభుత్వాధినేత అయిన కెరెన్స్కీ సామ్యవాది. యుద్ధంలో జయించాలని అతని లక్ష్యం. అయితే ఆయుధాలు, మందుగుండు సామాను పూర్తిగా అయిపోవటం వలన అది అసాధ్యం. రష్యన్‌లు యుద్ధమంటే పూర్తిగా విసిగిపోయి వున్నారు. రష్యాలో కెరెన్స్కీ ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడలేకపోయింది. దేశం మొత్తం మీద ఒకరకమైన అప్రశాంతత వ్యాపించింది. కార్మికులు పనిచేయ నిరాకరించారు. రైతులు పన్నులు చెల్లించటానికి, సైనికులు యుద్ధం చేయటానికి నిరాకరించారు.

బలమైన కేంద్రనాయకత్వం లేకపోవటం వల్ల బోల్షివిక్కులకు రష్యాలో అధికారం సంపాదించడానికి అవకాశం దొరికింది. లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్కులు దేశమంతటా సోవియట్లను స్థాపించారు. లెనిన్‌కు కొంతమంది సమర్థులైన నాయకులున్నారు. వారిలో లియాన్ ట్రాట్స్కీ, జోసెఫ్ స్టాలిన్‌లు ముఖ్యులు. లెనిన్ ఒక పక్షం రోజుల్లో, ఆయుధాలతో సన్నద్ధులైన వందలకొలది యువకార్మికులను 'రెడ్‌గార్డ్' లనే పేరుతో సమకూర్చాడు. 1917 నవంబర్ 6న బోల్షివిక్ సైన్యం పెట్రోగ్రాడ్‌లోని తంతి, తపాల, టెలిఫోన్ కార్యాలయాలను, రైల్వే స్టేషన్లను, రాష్ట్రబ్యాంక్‌ను, కోటను, సైన్యాధికారుల క్వార్టర్లను, తాత్కాలిక ప్రభుత్వ స్థానిక కార్యాలయమైన వింటర్ పాలెస్ తప్ప అన్ని ప్రముఖ భవనాలను స్వాధీనం చేసుకొన్నది. బోల్షివిక్‌లు లెనిన్, ట్రాట్స్కీల నాయకత్వంలో కెరెన్స్కీ తాత్కాలిక ప్రభుత్వాన్ని హింసాయుత పద్ధతిలో 1917 నవంబర్ 7న తొలగించివేశారు. కెరెన్స్కీ రష్యానుండి పారిపోయాడు. ఈవిధంగా రష్యాలో బోల్షివిక్‌లు అధికారానికి వచ్చారు. ఈ దశవరకు సాగిన విప్లవాన్ని బోల్షివిక్ విప్లవం లేక అక్టోబర్ విప్లవం లేక కమ్యూనిస్ట్ విప్లవమంటారు.

### 14.1.3.4 నూతన ప్రభుత్వ స్థాపన :

రష్యాలో తాత్కాలిక ప్రభుత్వాన్ని కూలద్రోసిన తరవాత లెనిన్ సోవియట్ రిపబ్లిక్ లేక కార్మికవర్గ నియంతృత్వంగా ప్రకటించాడు. కొత్త బోల్షివిక్ ప్రభుత్వం తనను ప్రజాకమిస్సార్ల సభగా వర్ణించుకొన్నది. ఈ సభకు అధిపతి లెనిన్, విదేశాంగ వ్యవహారాల కమిసార్ టాట్స్కీ, ఆంతరంగిక వ్యవహారాల కమిసార్ స్టాలిన్. ఈవిధంగా ప్రపంచంలో రష్యా మొదటి కమ్యూనిస్ట్ దేశంగా అవతరించింది.

### 14.1.4 విప్లవ విజయానికి కారణాలు :

రష్యాలో కమ్యూనిస్ట్ విప్లవం విజయానికి అనేక కారణాలు గలవు. అవి :

1) జార్ చక్రవర్తుల నిరంకుశ పాలనకు విసిగిన ప్రజలు విప్లవవాదులను సమర్థించారు.
2) జార్ సైనికులు విప్లవాదులతో చేతులు కలిపారు.
3) మొదటి ప్రపంచ యుద్ధకాలంలో రష్యాలో ఆర్థిక పరిస్థితి క్లిష్టమైంది.
4) లెనిన్ వ్యక్తిత్వం కర్షకులను, కార్మికులను ఆకర్షించింది.
5) ట్రాట్స్కీ, స్టాలిన్ లాంటి సమర్థులు లెనిన్‌కు అండగా నిలిచారు.
6) విదేశీ సహాయం జార్ చక్రవర్తులకు అందలేదు.

### 14.1.5 విప్లవ ప్రాముఖ్యం :

1917 నవంబర్ విప్లవం ఫలితంగా రష్యాలో ఏర్పడిన కమ్యూనిస్ట్ ప్రభుత్వము ఆధునిక ప్రపంచ చరిత్రలో ఒక చారిత్రాత్మకమైన ఘట్టము. దీనితో ప్రపంచ చరిత్రలో నూతన శకమారంభమయింది. నవంబర్ విప్లవం ఫలితంగా శ్రామికవర్గ నియంతృత్వం స్థాపితమై నిరంకుశ జార్ చక్రవర్తుల పాలన అంతమొందింది. రష్యాలో నూతనంగా స్థాపితమైన శ్రామికవర్గ నియంతృత్వము నిజానికి కమ్యూనిస్ట్ పార్టీ నియంతృత్వము. పార్టీ నియంతృత్వము ప్రజాస్వామ్య సిద్ధాంతానికి విరుద్ధము. ఏకపక్ష నియంతృత్వమున్న చోట ప్రతిపక్షాలను గుర్తించడం ఉండదు. అందువల్ల పార్టీ నియంతృత్వమున్న రాజ్యాన్ని సంపూర్ణాధికార రాజ్యమంటారు. వ్యక్తికీ, రాజ్యానికీ మధ్య తేడాను నియంతృత్వ ప్రభుత్వం అంగీకరించదు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేయవలె. ప్రజాజీవితానికి సంబంధించిన ప్రతి విషయం మీద ప్రభుత్వ అజమాయిషీ నెలకొల్పడం జరిగింది.

1789లో జరిగిన ఫ్రెంచి విప్లవం నాటి రాచరికాలను హడలు కొట్టించగా, 1917 నవంబర్‌లో జరిగిన రష్యా విప్లవం పెట్టుబడిదారీ రాజ్యాలలోని పరిపాలనకు భయోత్పాతాన్ని కలుగజేసింది. రష్యాలో శ్రామికవర్గ నియంతృత్వం నెలకొన్నందువల్ల ప్రపంచంలోని శ్రామికవర్గానికి చెందిన ప్రజలేగాక, కమ్యూనిస్ట్ పార్టీలు కూడా ఉత్సాహాన్ని, స్పూర్తిని పొందాయి. మూడో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ స్థాపితమైనందువల్ల విప్లవం ఒక్క రష్యా దేశానికే పరిమితమైనది కాదని ప్రపంచంలోని ఇతరదేశాలకు కూడా వ్యాప్తి చెందుతుందనే అనుమానం ధృవపడింది. రష్యా విప్లవము ప్రపంచ శ్రామికులలోను, కమ్యూనిస్ట్‌లలోను ఉత్తేజాన్ని కలుగజేసినప్పటికీ వివిధదేశాల పాలక వర్గాలలో మాత్రం అనుమానాన్నీ, అనిష్టాన్నీ కలగజేసింది. రష్యాలో జరిగిన ఈ విప్లవం వలసరాజ్యాలలో జాతీయ విమోచనోద్యమాలకు కూడా దోహదం చేసింది. ఆసియా, ఆఫ్రికాలలోని కోటానుకోట్ల ప్రజలలో విప్లవ భావాలు రేకెత్తినాయి. రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వమేర్పడిన ఫలితంగా ప్రపంచంలోని దేశాలన్నింటిలో సామ్రాజ్యవాదం బలహీనమైంది. పశ్చిమరాజ్యాలలో కూడా వర్గపోరాటం తీవ్రరూపం దాల్చే పరిస్థితి వచ్చింది. రష్యాలో ఏర్పడిన కమ్యూనిస్ట్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి పెట్టుబడిదారీ వ్యవస్థగల అగ్రరాజ్యాలు ప్రయత్నించసాగాయి. ఫలితంగా కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఆంతరంగికంగా విప్లవ వ్యతిరేక శక్తులను ఎదుర్కోవటానికి తోడుగా తన ఆంతరంగిక వ్యవహారాలలో విదేశాల జోక్యాన్ని కూడా ఎదుర్కొనవలసి వచ్చింది.

### 14.1.6 ముగింపు :

1917లో రష్యాలో సంభవించిన విప్లవం ఐరోపాఖండ చరిత్రనేగాక, మానవజాతి చరిత్రలో చిరస్మరణీయముగా నిలచిపోయే సంఘటన. ఫ్రెంచి విప్లవం తరువాత పెద్దఎత్తున సామాజిక, రాజకీయ పరివర్తనల తీసుకువచ్చింది, కార్మిక వర్గ ప్రభుత్వ స్థాపనగా రష్యావిప్లవం పరాకాష్టనందుకొన్నది. "ఫ్రెంచి విప్లవకారులు బూర్బన్‌లను పదవీభ్రష్టులను చేసిన తరువాత రష్యా విప్లవమొక్కటే పూర్తిగా సనాతన సిద్ధాంతాలను సవాలు చేసింది" అని జె.యి. స్వెయిన్ పండితుడు అభిప్రాయపడినాడు. రష్యా విప్లవం ఆర్థికవ్యవస్థను విప్లవాత్మకంగా మార్చివేసింది. ఫ్రెంచి విప్లవం స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తే, రష్యా విప్లవం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పాదుకొల్పింది. ఈ విప్లవం మార్క్సియన్ సామ్యవాదమనే కొత్త శక్తినీ ప్రసాదించింది. కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్టు సిద్ధాంతాల ప్రాతిపదికపై రష్యా ప్రపంచంలో తొలిసామ్యవాద దేశంగా ఆవిర్భవించింది.

### 14.1.7 మాదిరి ప్రశ్నలు :

1. 1917 రష్యా విప్లవానికి (బొల్షివిక్ విప్లవానికి) దారితీసిన పరిస్థితులు తెలుపుము.
2. రష్యా విప్లవంలో లెనిన్ పాత్రను వివరింపుము.
3. రష్యా - జపాన్ యుద్ధము (1904 - 1905)నకు గల కారణాలు, ఫలితాలు వర్ణింపుము.
4. కార్ల్‌మార్క్స్
5. 1905 విప్లవం

### 14.1.8 చదువదగిన గ్రంథాలు :


1. H.L. Peacock - Modern European History, 1789 - 1973
2. Raghubir Dayal - Modern European History
3. D.Thamson - Europe since Napolean
4. C.D. Hazan - Modern Europe Upto 1945
5. C.J.A.H. Hayes - Modern Europe since 1870
6. G.P. Gooch - History of Modern Europe, 1878 - 1919
7. C.D.M. Ketelby - A History of Modern Europe


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 14.2

# లెనిన్ - స్టాలిన్

## 14.2.0 లక్ష్యం :

రష్యా విప్లవంలో లెనిన్ పాత్ర, విప్లవం తరువాత లెనిన్, స్టాలిన్‌లు అనుసరించిన ఆంతరంగిక, విదేశాంగ విధానాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశములు**

**14.2.1** లెనిన్

- **14.2.1.1** తొలిజీవితం
- **14.2.1.2** విప్లవంలో లెనిన్ పాత్ర
- **14.2.1.3** బ్రెస్ట్ - లిటోవస్క్ సంధి
- **14.2.1.4** విదేశీ జోక్యం
- **14.2.1.5** అంతర్యుద్ధం
- **14.2.1.6** ఆర్థిక సంస్కరణలు (యుద్ధ కమ్యూనిజం)
- **14.2.1.7** సాంఘిక సంస్కరణలు
- **14.2.1.8** సైనిక సంస్కరణలు
- **14.2.1.9** పాలనా యంత్రాంగ సంస్కరణలు
- **14.2.1.10** నూతన ఆర్థిక విధానము
- **14.2.1.11** విదేశీ వ్యవహారాలు
- **14.2.1.12** ఘనత

**14.2.2** స్టాలిన్

- **14.2.2.1** పరిచయం
- **14.2.2.2** పార్టీలో అంతర్గత స్పర్థలు, స్టాలిన్-ట్రాట్స్కీ
- **14.2.2.3** స్టాలిన్ అధికారానికి రావడం
- **14.2.2.4** స్టాలిన్ జాతీయ సామ్యవాదం
- **14.2.2.5** పంచవర్ష ప్రణాళికలు
- **14.2.2.6** ప్రచారసరళి
- **14.2.2.7** క్షాళనలు
- **14.2.2.8** మతవిరుద్ధ ప్రచారం
- **14.2.2.9** విదేశాంగ విధానము
- **14.2.2.10** ఘనత

**14.2.3** నమూనా ప్రశ్నలు

**14.2.4** చదువదగిన గ్రంథాలు

## 14.2.1 లెనిన్ :

1917 నవంబర్‌లో లెనిన్ బోల్షివిక్ విప్లవం నడిపి రష్యాలో శ్రామిక వర్గ నియంతృత్వాన్ని స్థాపించాడు. ఆ తరువాత ఏడు సంవత్సరాల పాటు బోల్షెవిక్ ప్రభుత్వాన్ని నిర్వహించి, విప్లవాన్ని తొలిగడ్డ దశలో కాపాడాడు. ఆధునిక కమ్యూనిస్ట్ రష్యా నిర్మాతగానే కాక మార్క్సిస్టు భాష్యకారుడుగా, సామ్యవాదవేత్తగా ప్రపంచ ప్రసిద్ధుడైనాడు.

### 14.2.1.1 తొలిజీవితం :

లెనిన్ అసలు పేరు వ్లాడిమిర్ ఇలిచ్ ఉల్యనోవ్. ఇతడు 1870 ఏప్రియల్ 22న వోల్గా తీరంలోని సింబర్క్స్ అనే గ్రామంలో జన్మించాడు. ఆయన తండ్రి స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్. ఆయన మధ్యతరగతికి చెందినవాడు. మూడో అలెగ్జాండర్ చక్రవర్తిని హత్యచేయడానికి ప్రయత్నించినాడనే నేరం మీద లెనిన్ అన్నను 1887లో ప్రభుత్వం ఉరితీసింది. అందువల్ల విప్లవ సమయంలో పోలీసుల బారి నుండి తప్పించుకోడానికి వ్లాడిమిర్ ఇలిచ్ ఉల్యనోవ్, లెనిన్ అనే మారు పేరు పెట్టుకొని విప్లవోద్యమంలో చేరినాడు. కజన్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం చదువుతున్నప్పుడు ఆయన మార్క్స్ యొక్క శిష్యుడై పోయాడు. న్యాయశాస్త్ర విద్యార్థిగా విప్లవోద్యమంలో పాల్గొనడం వల్ల ఇతనిని విశ్వవిద్యాలయం నుంచి వెళ్ళగొట్టినారు. ఆ తరవాత ప్రైవేటుగా చదివి సెంట్‌పీటర్స్ బర్గ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకొన్నాడు. సామ్యవాదాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఆయన యూరప్‌లో అనేక దేశాలలో పర్యటించినాడు. విదేశాల నుంచి తిరిగివచ్చిన తరవాత ఆయన కార్మికుల విముక్తి కోసం కార్మికోద్యమాలు నడపడం ప్రారంభించాడు. ప్రభుత్వం అతనిని నిర్బంధించి 14 మాసాలు కారాగారంలో ఉంచి తరవాత సైబీరియాకు ప్రవాసం పంపింది. సైబీరియాలో క్రుప్స్‌కయా అను వనితను వివాహమాడినాడు. ఇచటనే ఆయన రష్యా పెట్టుబడిదారీ విధానంపై ఒక గ్రంథం వ్రాశాడు. అది రష్యాలోని సామ్యవాదులపై గొప్ప ప్రభావాన్ని చూపెట్టింది. 1903 నుండి 1917 వరకు 14 సంవత్సరాలపాటు తానే స్వయం బహిష్కరణను విధించుకొని స్విట్జర్లాండ్‌లో గడిపాడు. అక్కడనుండి ఆయన ప్రచురించిన మార్క్సియన్ సామ్యవాద పత్రిక 'ఇస్క్రా' (నిప్పురవ్వ) ప్రతులను రహస్యంగా రష్యా ప్రజలకు అందేటట్లు చేసినాడు.

1898లో రష్యాలో సోషలిస్ట్ కార్మిక పక్షం స్థాపించబడింది. ఇందులో తలెత్తిన అభిప్రాయబేధాలను నివారించడానికి 1903లో విప్లవవాదులు బ్రస్సెల్స్‌లో, లండన్‌లో సమావేశాలు జరిపారు. ఈ సమావేశాలకు లెనిన్ హాజరయ్యాడు. ఈ సమావేశాలలో ఏకాభిప్రాయం కుదరక విప్లవవాదులు బోల్షెవిక్‌లు, మెన్షవిక్‌లు అని రెండు వర్గాలుగా చీలిపోవడానికి లెనిన్ కారకుడయ్యాడు. ఈ సమావేశంలో లెనిన్ పార్టీకి ధృఢమైన కేంద్రకార్యవర్గం ఉండాలని, దానికే అన్ని అధికారాలుండవలెనని అందులో మేధావులు మాత్రమే సభ్యులుగా ఉండాలని, మార్క్స్ చెప్పిన ఏ అంశంలోను విభేదించరాదని, కార్మికుల వల్లనే సామ్యవాదం వస్తుందని, వర్గ సంఘర్షణ తప్పనిసరి అని ఉద్ఘాటించాడు. కాని కొందరు లెనిన్ అభిప్రాయాలతో ఏకీభవించలేదు. దానివల్లనే కమ్యూనిస్ట్‌లు రెండు వర్గాలుగా చీలిపోయారు. అయినా రెండు వర్గాలవారు 1912 వరకు కలిసి పనిచేశారు.

### 14.2.1.2 విప్లవంలో లెనిన్ పాత్ర :

ప్రథమంలో మెన్షవిక్‌లు రష్యాలో కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను ఉధృతంగా ప్రచారం చేశారు. వారిలో ప్రముఖులు ప్లెఖనోవ్, మార్తావ్, ప్రిన్స్ ల్వవ్, కరెన్స్కీలు. బోల్షెవిక్ నాయకుడైన లెనిన్ స్విట్జర్లాండ్ నుండే తన భావాలను రష్యాలో ప్రచారం చేశాడు. 1917 మార్చిలో మెన్షవిక్‌ల నాయకత్వంలో విప్లవం జరిగి జార్ ప్రభుత్వాన్ని అంతంచేశారు. ప్రిన్స్ ల్వవ్ నూతన ప్రభుత్వానికి నాయకత్వం వహించాడు. నూతన ప్రభుత్వం సామ్యవాద సిద్ధాంతాన్ని అనుసరించి అనేక ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టింది. అయితే కొద్ది నెలలోనే నూతన ప్రభుత్వం ప్రజాదరణను కోల్పోగా ప్రిన్స్ ల్వవ్ రాజీనామా చేసినాడు. 1917 జూలైలో కెరెన్స్కీ

ప్రభుత్వాధినేత అయినాడు. రష్యాలో 1917 మార్చిలో విప్లవం జరిగినపుడు లెనిన్ స్విట్జర్లాండ్‌లో ఉన్నాడు. జర్మన్‌ల సహాయంతో లెనిన్ 1917 ఏప్రియల్‌లో రష్యాకు తిరిగివచ్చి టారైడ్ అను భవనంలో బోల్షెవిక్‌ల సమావేశం ఏర్పాటు చేసి విప్లవాన్ని నడపవలసిన పంథాను ప్రకటించాడు. ఈ ప్రకటనలో లెనిన్ వెలువరించిన భావాలే లెనిన్ ఏప్రియల్ థీసిస్‌గా ప్రసిద్ధి చెందింది. ఇందులోని అంశాలు 1) మొదటి ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాదుల యుద్ధం. అందువల్ల అందులో రష్యా పాల్గొనరాదు. 2) యుద్ధం నుండి విరమించుకొని రష్యాలో శాంతిని నెలకొల్పాలి. రష్యా ప్రజలు కోరుకొనేది రొట్టె గాని యుద్ధం కాదు. 3) కెరెన్స్కీ ప్రభుత్వం బూర్జువాలకు ప్రాతినిధ్యం వహించేది గనుక ఆ ప్రభుత్వాన్ని కూలదోసి కార్మిక రాజ్యం స్థాపించవలెను. 4) రష్యాలో సోషలిస్ట్ వ్యవస్థను స్థాపించవలెను. 5) భూమిని, పరిశ్రమలను జాతీయం చేయవలెను. పరిశ్రమల యాజమాన్యం కార్మికులకు అప్పగించవలెను. 6) దేశంలోని వస్తు ఉత్పత్తి సాధనాల పంపిణీ ప్రభుత్వం స్వాధీనపరచుకొనవలెను. 7) ఒకే బ్యాంకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయవలెను. 8) జార్ చక్రవర్తులు చేసిన విదేశీ రుణాలు చెల్లించరాదు. 9) జార్ చక్రవర్తులు చేసుకొన్న విదేశీ ఒప్పందాలన్నింటినీ రద్దు చేసి నూతన సంబంధాలను ఏర్పాటు చేసుకొనవలెను.

లెనిన్ రష్యా అంతటా తిరిగి కార్మిక, కర్షకుల మద్దతును సంపాదించాడు. ఇదే కాలంలో కెరెన్స్కీ ప్రభుత్వం దేశవిదేశాలలో విఫలమయింది. లెనిన్ ముఖ్య అనుచరుడైన ట్రాట్స్కీ 1917 అక్టోబర్‌లో పెట్రోగ్రాడ్ సోవియట్‌లో కెరెన్స్కీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి పెట్రోగ్రాడ్‌ను హస్తగతం చేసుకొన్నాడు. ఆ తరవాత త్వరిత గతిన సోవియట్ అంతటా బోల్షెవిక్‌ల బలం పెరిగింది. బోల్షెవిక్‌ల బలం పెరగడంతో లెనిన్ విప్లవానికి పూనుకొన్నాడు. 1917 నవంబర్ 6న బోల్షెవిక్‌లు పెట్రోగ్రాడ్‌లోని అన్ని ప్రముఖ భవనాలను స్వాధీనం చేసుకొన్నారు. 1917 నవంబర్ 7న కెరెన్స్కీ ప్రభుత్వం ఉన్న వింటర్ పాలస్‌పై కాల్పులు జరపడానికి సమీపంలోని నేవా నదిపై యుద్ధ నౌకను తయారుగా ఉంచారు. దానితో కెరెన్స్కీ లండన్ పారిపోయాడు. లెనిన్ అదేరోజు రష్యాను సోవియట్ రిపబ్లిక్‌గా ప్రకటించాడు. ఈ విప్లవానికి కమ్యూనిస్ట్ విప్లవం అని, బోల్షెవిక్ లేక నవంబర్ విప్లవం అను పేరు వచ్చింది. రష్యాలో కార్మిక నియంతృత్వ ప్రభుత్వం ఏర్పడింది. లెనిన్ రష్యాకు అధిపతి అయ్యాడు.

### 14.2.1.3 బ్రెస్ట్ - లిటోవస్క్ సంధి :

లెనిన్ రష్యాలో అధికారాన్ని హస్తగతం చేసుకొన్న తరవాత తన కొత్త ప్రభుత్వ కార్యక్రమాలను ప్రకటించాడు. అవి- కేంద్రీయ శక్తులతో వెంటనే సంధి చేసుకోవడం, భూమిని జాతీయకరణ చేసి రైతులకు పంచడం, పరిశ్రమలను జాతీయాకరణ చేసి వాటిని కార్మికవర్గ కమిటీల ఆధీనంలో ఉంచడం.

బోల్షెవిక్ ప్రభుత్వం ఎదుర్కొన్న తక్షణ సమస్య జర్మనీతో యుద్ధం. యుద్ధాన్ని వేగంగా ముగించడం తమ లక్ష్యంగా బోల్షివిక్కులు ప్రకటించారు. సంధి కోసం యుద్ధం చేస్తున్న రాజ్యాలన్నింటినీ బోల్షెవిక్ ప్రభుత్వం అభ్యర్థించింది. ఈ అభ్యర్థనను మిత్రవర్గం తిరస్కరించింది. కానీ, జర్మనీ రష్యాతో శాంతి సంధికై సుముఖత చూపింది. సుదీర్ఘమైన చర్చల తర్వాత 1918 మార్చి 3న రష్యా జర్మనీతో చాలా అవమానకరమైన బ్రెస్ట్ - లిటోవస్క్ సంధి పత్రంపై సంతకం చేసింది. ఈ సంధి ప్రకారం రష్యా యుక్రైన్, పోలండ్, బాల్టిక్ రాష్ట్రాలు, ఫిన్‌లాండ్, కాకసస్‌లను పోగొట్టుకొని, యుద్ధ నష్టపరిహారంగా ఆరు బిలియన్ల మార్కులు చెల్లించడానికి ఒప్పుకొంది. ఆవిధంగా రష్యా మొదటి ప్రపంచ యుద్ధం నుండి విరమించుకొంది. ఈ సంధిని మిత్రవర్గం, బోల్షెవిక్‌ల శత్రువులు తీవ్రంగా వ్యతిరేకించారు. కాని విప్లవ రక్షణ కోసం జర్మనీతో సంధి చేసుకోవడం తప్పనిసరి అని లెనిన్ గ్రహించాడు.

### 14.2.1.4 విదేశీ జోక్యం :

జర్మనీతో సంధి చేసుకొన్న తరవాత రష్యా మిత్రరాజ్యాల సైనిక జోక్యాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. 1918 ఏప్రియల్ 4న జపాన్ సైన్యాలు వ్లాడివోస్టక్‌ను ముట్టడించడంతో రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో విదేశ సైన్యాల జోక్యం ప్రారంభమయింది. ఉత్తర రష్యాలోని ఒడెస్సాను ఫ్రెంచి సైన్యాలు ముట్టడించినాయి. సోవియట్ రక్షణ మంత్రి ట్రాట్స్కీ ఎర్రసైన్యాన్ని తయారుచేసి విదేశ సైన్యాల బారి నుండి దేశాన్ని కాపాడినాడు. ఫ్రెంచి, బ్రిటిష్ సైన్యాలు రష్యా నుంచి ఉపసంహరించుకొన్నాయి. జపాన్ రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడంలో ఆసక్తి చూపలేదు.

### 14.2.1.5 అంతర్యుద్ధం :

బోల్షెవిక్ ప్రభుత్వాన్ని పాతరాజన్యులు, జార్‌ను అభిమానించే ప్రభుత్వ అధికారులతో కూడిన విప్లవ వ్యతిరేకవర్గం వ్యతిరేకించింది. దీంట్లో వీరికి బ్రిటన్, ఫ్రాన్స్‌లు మద్దతునిచ్చాయి. వారు తెల్ల సైన్యాన్ని పోగుచేసి ట్రాట్స్కీ నాయకత్వంలోని ఎర్రసైన్యంతో 1918 నుండి 1921 వరకు అంతర్యుద్ధాన్ని సాగించారు. ఈ యుద్ధ ఫలితంగా విప్లవాన్ని వ్యతిరేకించే వారందరూ నశించారు. ఎర్ర సైన్య సహాయంతో లెనిన్ నిర్దాక్షిణ్యంగా తన ప్రత్యర్థుల నందరినీ మట్టుబెట్టాడు.

### 14.2.1.6 ఆర్థిక సంస్కరణలు (యుద్ధ కమ్యూనిజం) :

లెనిన్ తన ప్రత్యర్థుల నణచిన తరువాత కార్లమార్క్స్ సిద్ధాంతాల ఆధారంగా చాలా సృజనాత్మక కార్యక్రమాలను, సంస్కరణలను ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ భూమిని వశం చేసుకొని, కర్మాగారాలను, వర్క్ షాప్‌లను స్వాధీనం చేసుకొన్నది. 1918-1921 మధ్య 'యుద్ధ కమ్యూనిజం', లేదా 'శుద్ధ కమ్యూనిజమ్' యుగం రష్యాలో ఆరంభమైంది. ప్రైవేట్ ఆస్థిని ప్రభుత్వం బలవంతంగా తన ఆధీనం చేసుకొన్నది. దేశీయ, విదేశీయ అప్పులు, రెంటిని రద్దు చేసింది. ప్రభుత్వ వస్తుమార్పిడి విధానం ప్రవేశపెట్టబడింది. దీని ప్రకారం ప్రభుత్వ పరిశ్రమలకు వస్తురూపంలో ఆర్థిక సహాయం చేసింది. ఈ పరిశ్రమలు తిరిగి తమ ఉత్పత్తులను ఇతర పరిశ్రమలకు పంపిణీ చేయటానికి ప్రభుత్వానికి, ప్రజలకు, సైన్యానికి అందించాయి. అయితే ఈ ఆర్థిక విధానాలు మంచి ఫలితాలను సాధించలేదు. అందువల్ల లెనిన్ 1921లో కొత్త ఆర్థిక విధానాన్ని రష్యాలో ప్రవేశపెట్టాడు.

### 14.2.1.7 సాంఘిక సంస్కరణలు :

బోల్షివిక్‌లు రష్యాను సామ్యవాదదేశంగా తీర్చిదిద్దడానికై కొన్ని మౌలిక సాంఘిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఆస్తిహక్కు రద్దయింది. కర్మాగారాలు, భూమి సమాజపరమైనాయి. విద్యాబోధన ప్రభుత్వాధీనమైంది. బోల్షివిక్‌లకు మతంలో నమ్మకం లేదు. 1918లో రష్యాలోని సాంప్రదాయిక చర్చి ఎత్తివేయబడింది. చర్చి ఆస్తులన్నీ ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకున్నది. చర్చిలను మూయటం, మత విద్యకు స్వస్తి చెప్పటం జరిగింది. వివాహాలను పూజారులు నిర్వహించటం ఎప్పుడో ఆగిపోయింది. సాంఘిక వివాహాలు మాత్రమే అంగీకరించబడ్డాయి.

### 14.2.1.8 సైన్య సంస్కరణలు :

విప్లవాన్ని బాహ్య, ఆంగరంగిక శత్రువుల నుండి రక్షించడానికి లెనిన్ ఎన్నో మౌలికమైన మార్పులను తీసుకువచ్చాడు. యుద్ధ కమిస్సారైన్ ట్రాట్స్కీ 'ఎర్రసేన' అనే పేరుతో ప్రతిభావంతంగా యుద్ధం చేసే సేనను తయారుచేశాడు. ఈ 'ఎర్రసేన' అంతఃకలహాలను అణచివేసింది, విదేశీ శక్తులను ఓడించి దేశం నుండి వెళ్ళగొట్టింది, రష్యాలో విప్లవాన్ని రక్షించింది. విప్లవం పట్ల

విముఖత కల్గిన వ్యతిరేక శక్తులనన్నిటినీ తుడిచిపెట్టేందుకై 'ఛెకా' అనే రహస్య పోలీస్‌శాఖను కూడా లెనిన్ తయారుచేశాడు. రష్యాలో 'ఛెకా' ఎర్ర సైన్యాన్ని ప్రవేశపెట్టింది. జార్ ఆయన కుటుంబ సభ్యులు కాల్చి చంపబడ్డారు. విప్లవ వ్యతిరేకులను కఠినంగా అణచివేయడం జరిగింది.

### 14.2.1.9 పాలనా యంత్రాంగ సంస్కరణలు :

రష్యాలో అనేక జాతులున్నాయి. అన్ని జాతులను ఫెడరల్ వ్యవస్థలోకి తీసుకురావటానికి ప్రతి జాతి ఒక రిపబ్లిక్‌గా రూపొందింది. ఆవిధంగా రష్యా ఒక సమాఖ్య అయింది. సోవియట్ సామ్యవాద ప్రజాప్రభుత్వాల సంఘంగా రూపొందింది. కమ్యూనిస్ట్ నియంతృత్వ స్థాపన జరిగింది. రష్యాలో ప్రత్యర్థిపక్షాల కనుమతి లేదు. వార్తాపత్రికలు, విద్యాసంస్థలు, సినిమాలు, రేడియోలు కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను ప్రచారం చేయాలి. కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థలో పరిపూర్ణ పాలనాధికారాలున్న మహోన్నత సభ, పొలిట్ బ్యూరో. దానిలో 9 మంది సభ్యులుంటారు.

### 14.2.1.10 నూతన ఆర్థిక విధానము (1921-24) (New Economic Policy) :

లెనిన్ పరిశోధన 'యుద్ధ కమ్యూనిజం' విజయవంతం కాలేదు. ఈ విధానం ఫలితంగా రష్యాలో అలజడీ, అశాంతి ఏర్పడినాయి. సోవియట్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన విధానాలను కర్షకులు వ్యతిరేకించినారు. దీనికి తోడు వర్షాభావం వల్ల దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులేర్పడినాయి. ప్రభుత్వ ఆర్థిక విధానం విఫలమైనందువల్లనే అనేక లక్షలమంది ఆకలిచావులకు గురికావలసి వచ్చిందనే విమర్శ కూడా బయలుదేరింది. కరువు నివారణ కోసం విదేశాల నుంచి ముఖ్యంగా అమెరికా నుంచి సోవియట్ ప్రభుత్వం ఆహార ధాన్యాలను అర్థించవలసి వచ్చింది. అమెరికా సహాయం కోసం మాక్సిమ్ గోర్కీ చేసిన అభ్యర్థనను సోవియట్ ప్రభుత్వం సమర్థించవలసి వచ్చింది. దేశ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దడానికి సోవియట్ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాన్ని అనుసరించవలసి వచ్చింది. వాస్తవికవాది అయిన లెనిన్ కమ్యూనిస్ట్ సిద్ధాంతాల అమలు కొంతకాలం పాటు వాయిదా వేసి 1921లో పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిజం రెండూ కలసిన నూతన ఆర్థిక విధానాన్ని ప్రారంభించాడు.

నూతన ఆర్థిక విధానంలో చాలావరకు కంట్రోళ్ళను సడలించారు. ఉత్పత్తిని పెంచడం ద్వారా సామ్యవాద మార్గాన్ని సుకరం చేయడం నూతన ఆర్థిక విధానం ముఖ్య లక్ష్యం. భారీ పరిశ్రమలను, ప్రజోపయోగకరమైన సంస్థలను ప్రభుత్వాధీనంలో ఉంచి, కొంతవరకు ప్రైవేట్ రంగంలో పరిశ్రమలను, వ్యాపారాన్ని, లెనిన్ ప్రోత్సహించినాడు. ఈ విధానం ఫలితంగా దేశప్రజలలో వ్యక్తిగత శ్రద్ధకు ప్రోత్సాహం వచ్చి దేశంలో ఖాళీగా వున్న మార్కెట్లన్నీ తిరిగి వస్తువులతో నిండినాయి. రైతుల వద్ద నుంచి నిర్బంధంగా ధాన్యం సేకరించడాన్ని ప్రభుత్వం విరమించుకొన్నది. రైతులు తమవద్దనున్న మిగులు ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లలో అమ్ముకోవచ్చుననే ఆజ్ఞను ప్రభుత్వం జారీచేసింది. తాము చెల్లించవలసిన పన్నులను మాత్రం రైతులు కొంతవరకు ధాన్యరూపంలో ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉండేది. ఈ విధానం వల్ల రష్యాలో ఆహారధాన్యాలను పెద్దమొత్తంలో పండించటానికి రైతులకు ప్రోత్సాహం లభించేది. చిన్నపరిశ్రమలు లాభార్జన కోసం వస్తువులను ఉత్పత్తి చేయడాన్ని, మార్కెట్‌లో పాతపద్ధతుల ప్రకారం విక్రయించుకోవడాన్ని కూడా ప్రభుత్వం అనుమతించింది. రష్యాలో పరిశ్రమల స్థాపనకు విదేశీపెట్టుబడిదారులతో సోవియట్ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాలను చేసుకొంది. కరెన్సీ ద్రవ్యాన్ని పటిష్టం చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొన్నది. నోట్ల ముమ్మరాన్ని తగ్గించడానికి 1921 నాటికి ప్రభుత్వం 10 వేల పాత రూబుల్‌లకు సమానమైన ఒక కొత్త రూబుల్‌ను ప్రవేశపెట్టింది. వివిధ తరగతులకు చెందిన ఉద్యోగులకు వివిధరకాలైన జీతభత్యాలు నిర్ణయించడం జరిగింది. రేషనింగ్ పద్ధతిలో కొన్ని మార్పులు

చేయడం జరిగింది. నిత్యావసర వస్తువులను ప్రజలు బహిరంగ మార్కెట్లలో కొనుగోలు చేయవచ్చు. సహకార సంస్థలు స్థాపితమైనాయి. కంట్రోళ్ళు సడలించిన ఫలితంగా కర్షకులు తమ భూములను కౌలుకిచ్చుకోవడానికి, ధాన్యాన్ని ప్రైవేట్ వర్తకులకు అమ్ముకోవడానికి అవకాశమేర్పడి వారి స్థితి గతులు మెరుగైనాయి. గ్రామీణ ప్రాంతాలలోని భాగ్యవంతులైన రైతులు ఒక విధమైన నూతనోత్తేజాన్ని పొందడమేగాక దేశ వ్యవసాయోత్పత్తిలో ప్రముఖపాత్ర వహించడం ప్రారంభించారు.

1924లో లెనిన్ మరణించేవరకు రష్యాలో నూతన ఆర్థిక విధానం అనుసరించడం జరిగింది. రష్యాలో పెట్టుబడిదారీవిధానం పునరుద్ధరించడం జరిగిందని పెట్టుబడిదారీ రాజ్యాలు హర్షాన్ని వెలిబుచ్చినాయి. కాని నిజానికి నూతన ఆర్థిక విధానం అమలుచేయడమనేది రష్యా కమ్యూనిస్ట్ చరిత్రలో తాత్కాలికమైన వెనుకంజ మాత్రమే. విదేశ సైన్యాల జోక్యం, అంతర్యుద్ధము వల్ల దెబ్బతిన్న రష్యా నూతన ఆర్థిక విధానం వల్ల చాలావరకు కోలుకొన్నది. ఆర్థికంగా దేశం పటిష్టం చేయడం జరిగింది.

## 14.2.1.11 విదేశీ వ్యవహారాలు :

1917-1921 ల మధ్య రష్యా అనుసరించిన విదేశాంగ విధానంలో గమనించదగిన ముఖ్య విషయాలు రెండు ఉన్నాయి. అవి 1) పశ్చిమరాజ్యాల మద్దతుతో రష్యాలో విప్లవ వ్యతిరేకోద్యమం జరగడం, రష్యా మీద దురాక్రమణ జరపడానికి పశ్చిమ రాజ్యాలు చేసిన ప్రయత్నం. సోవియట్ రష్యా తన శక్తినంతా ఉపయోగించి పశ్చిమరాజ్యాల సైనిక జోక్యాన్ని విజయవంతంగా ఎదుర్కోవడమే గాక దేశంలోని ఆంతరంగిక విప్లవ వ్యతిరేక శక్తులను కూడా అంతమొందించింది. 2) ప్రపంచ కమ్యూనిస్ట్ విప్లవాన్ని ప్రచారం చేయడానికి రష్యా చేసిన ప్రయత్నము. ప్రపంచ విప్లవం ద్వారా కమ్యూనిజాన్ని సాధించడానికి థర్డ్ ఇంటర్నేషనల్ 1919లో ఏర్పాటు చేయడం జరిగింది. సమిష్టి విప్లవం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను నాశనం చేసి వర్గరహిత సమాజాన్ని నెలకొల్పవలసిందిగా ప్రపంచ శ్రామికవర్గ ప్రజలందరిని థర్డ్ ఇంటర్నేషనల్ పిలుపునిచ్చింది. మొదట్లో కమ్యూనిస్ట్ ప్రచారానికనువైన వాతావరణం ఏర్పడింది. హంగరీ కమ్యూనిస్ట్ రాజ్యంగా మారింది. ఇటలీ, జర్మనీలలో కూడా విప్లవానికి అవసరమైన పరిస్థితులేర్పడినాయి. పర్షియా, ఆఫ్ఘనిస్థాన్, మంగోలియా, మంచూరియా, ఇండియా, చైనా, జపాన్ మొదలైన దేశాలలో రష్యన్ ఏజెంట్లు విప్లవ ప్రచారాన్ని ప్రారంభించినారు. థర్డ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు జినొవ్విన్ ఒక్క సంవత్సర కాలంలో యూరప్ దేశాలన్నీ కమ్యూనిస్ట్ దేశాలుగా మారుతాయని 1919లో ప్రకటించాడు. అయితే 1919 తరవాత రష్యాలో ఏర్పడిన అరాజక పరిస్థితుల వల్ల, రష్యాలో వలె ఇతర దేశాలలో విప్లవానికి అనువైన ఆంతరంగిక పరిస్థితులు లోపించడంవల్ల ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్ట్ వ్యవస్థ స్థాపనకు చేసిన ప్రయత్నాలన్నీ చివరకు విఫలమైనాయి.

1921 తరవాత రష్యా తాత్కాలికంగా కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను త్యజించి నూతన ఆర్థిక విధానాన్ని ప్రారంభించి పశ్చిమ రాజ్యాలతో వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోసాగింది. ఘుమన్ చెప్పినట్లుగా సోవియట్ రష్యా ఆంతరంగిక విధానమేగాక విదేశాంగ విధానం కూడా 1921లో ఒక నూతన పరిణామాన్ని పొందినదని చెప్పవచ్చు. 1921లో సోవియట్ రష్యా బ్రిటన్‌లో ఒక వాణిజ్య ఒప్పందం చేసుకొన్నది. జర్మనీని పశ్చిమరాజ్యాల పలుకుబడి ప్రభావాలకు లోనుకాకుండా నివారించడానికి రష్యా 1922 లో జర్మనీతో రపెల్లో సంధి చేసుకొన్నది. ఇటలీ సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించడమే గాక 1924లో రష్యాతో ఒక వాణిజ్య ఒప్పందాన్ని కూడా కుదుర్చుకొన్నది. ఆ తరవాత ఫ్రాన్స్‌తో సహా 16 యూరప్ దేశాలు సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించాయి. 1924లో సోవియట్ ప్రభుత్వాన్ని ఇంగ్లండ్ గుర్తించింది. ఇంగ్లాండ్ సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించిన తరవాత చైనా, డెన్మార్క్, స్వీడన్, మెక్సికో, గ్రీస్ మొదలైన దేశాలు కూడా సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించినాయి.

### 14.2.1.12 ఘనత :

కమ్యూనిస్ట్ లేక బోల్షివిక్ విప్లవ సారథిగా, ఆధునిక రష్యా నిర్మాతగా రష్యా చరిత్రలోనేగాక ప్రపంచ చరిత్రలో లెనిన్ సుస్థిరస్థానం సంపాదించుకొన్నాడు. మార్క్స్ కన్న కలలను లెనిన్ నిజం చేశాడు. లెనిన్ కృషివల్లనే ప్రపంచంలో శ్రామిక రాజ్యవ్యవస్థ ఆవిర్భవించింది. ఆరు సంవత్సరాలపాటు రష్యాకు లెనిన్ ఏకైక నియంత. ఆరోగ్యం చెడిపోయినా, చనిపోయేంతవరకు నిర్విరామంగా కృషిచేశాడు లెనిన్. లెనిన్ 1924 జనవరి 22 న మాస్కో దగ్గర వున్న గోర్కీలో మరణించాడు.

### 14.2.2 స్టాలిన్ :

### 14.2.2.1 పరిచయం :

1917 నాటికి రష్యాలోని పరిస్థితులను సక్రమంగా అంచనావేసి జార్ చక్రవర్తుల నిరంకుశ పాలనను అంతం చేయడానికి, విప్లవాన్ని సాధించడానికి వీలైన పథకాన్నీ, వ్యూహాన్ని రచించినవాడు లెనిన్. మార్క్స్ సిద్ధాంతాలను ఉపయోగించి సామ్రాజ్యవాదం బలంగా ఉన్న కాలంలో జార్ చక్రవర్తుల పరిపాలనను లెనిన్ అంతం చేసినాడు. అంతేగాక లెనిన్ రష్యాకు ఆర్థిక రాజకీయ పునరుజ్జీవనం కల్పించాడు. అనేక విషమ పరిస్థితులను ఎదుర్కొంటూనే లెనిన్ కమ్యూనిస్ట్ పార్టీని, దేశాన్ని కూడా అంతర్యుద్ధము, విదేశ సైన్యాల జోక్యం మొదలైన ఆపదల నుండి కాపాడినాడు. నూతన ఆర్థిక విధానాన్ని అనుసరించి దేశాన్ని ఆర్థికంగా పునర్నిర్మాణం చేసి తగిన సమయంలో సముచితమైన స్థిరనిర్ణయాలు చేయగల మహానాయకుడిగా లెనిన్ ప్రసిద్ధి చెందినాడు. 1924 జనవరిలో లెనిన్ మరణించడం రష్యన్ విప్లవానికి గొడ్డలిపెట్టు వంటిదయింది. లెనిన్ మరణం వల్ల ఏర్పడిన ఖాళీని పూరించడానికి నూతన నాయకుని ఎన్నికచేయడం చాలా కష్టమైంది.

### 14.2.2.2 పార్టీలో అంతర్గత స్పర్థలు; స్టాలిన్ - ట్రాట్స్కీ :

లెనిన్ మరణించిన తరవాత అతని అనుచరుల మధ్య అధికారం కోసం దాదాపు వారసత్వయుద్ధం ప్రారంభమైంది. కమ్యూనిస్ట్ పార్టీలోని నాయకులంతా రెండు ముఠాలుగా చీలిపోయారు. దేశ బహిష్కృతులై విదేశాలలో పది సంవత్సరాలు గడిపినటువంటి ట్రాట్స్కీ, కమనేవ్, జినోవీవ్ మొదలైన నాయకులు ఒక కోవకు చెందినవారు. స్టాలిన్, మోలటోవ్, వొరోషిలోవ్ మొదలైన రెండో కోవకు చెందిన నాయకులు రష్యాలో పది సంవత్సరాల కాలం అజ్ఞాతవాసంలో ఉండి అరెస్ట్‌లను, జైలు శిక్షలను భరించినవారు. ప్రపంచ విప్లవం అనే లక్ష్యంలో కమ్యూనిస్ట్‌లందరికీ నమ్మకమున్నప్పటికీ లక్ష్యసాధన, అనుసరించవలసిన మార్గం విషయంలో ట్రాట్స్కీ, స్టాలిన్‌ల మధ్య అభిప్రాయ బేధాలేర్పడినాయి. ప్రపంచ దేశాలన్నింటిలో వెంటనే కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను వ్యాప్తి చేయవలెనని ట్రాట్స్కీ వాదించగా, రష్యాలో కమ్యూనిజం విజయవంతమయితే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్ట్ సిద్ధాంతాల వ్యాప్తికి ప్రచారసాధనంగా ఉపయోగపడుతుందని స్టాలిన్ వాదించాడు.

స్టాలిన్ జార్జియా రాష్ట్రంలోని కర్షక కుటుంబాన్నుంచి వచ్చాడు గనుక, రష్యన్ ప్రజా బాహుళ్యం గురించి అతనికి సన్నిహితమైన అవగాహన ఉండింది. సిద్ధాంత నిపుణుడు గాకపోయినా ఆచరణశీలి. 'దేశ పరిమితిలో సామ్యవాదం' అనే లక్ష్యాన్ని నొక్కి చెప్పిన అతడు 'ఏక కాలంలో ప్రపంచ వ్యాప్త విప్లవం' అనే దృక్పథాన్ని అంగీకరించలేదు. కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా పనిచేశాడు గనుక ఆ కీలకమైన పదవిని తన ప్రయోజనాల కనుగుణంగా వాడుకొన్నాడు. పార్టీలో సీనియర్ నాయకుడు, కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు అయిన జినోవీవ్, పార్టీ కేంద్ర కమిటిలోని ముగ్గురు సభ్యులలో ఒకడైన కామనేవ్, స్టాలిన్‌కు మద్దతునిచ్చారు. స్టాలిన్ రష్యాను ఐరోపా ఉపగ్రహంగా కాకుండా ఒక ప్రత్యేక నాగరికత గల దేశంగా భావించేవాడు.

ట్రాట్స్కీ కులీన కుటుంబం నుండి వచ్చాడు. కొంతకాలం సైబీరియాలో ప్రవాసాన్ని అనుభవించాడు. సిద్ధాంతరీత్యా ట్రాట్స్కీ ప్రపంచ విప్లవాన్ని సమర్థించాడు. ఇతని దృష్టిలో రష్యన్ విప్లవం ప్రపంచ విప్లవానికి ఉపక్రమణిక మాత్రమే. ఐరోపాలోని సంఘటనలు అత్యంత ప్రభావశీలమైనవి గనుక ఐరోపాలో విప్లవాన్ని సాధించడానికి అన్ని అవకాశాలనూ వినియోగించుకోవాలి, అన్ని ప్రయత్నాలూ చేయాలని వాదించేవాడు. పదవి రీత్యా, ట్రాట్స్కీ పెట్రోగ్రాడ్ సోవియట్‌కు అధ్యక్షుడుగా, యుద్ధ వ్యవహారాల కమిసర్‌గా పనిచేశాడు. అంతేగాక ఎర్రసేన నిర్వహణలో ముఖ్యపాత్ర నిర్వహించాడు.

### 14.2.2.3 స్టాలిన్ అధికారానికి రావడం :

కమ్యూనిస్ట్ ప్రపంచంలో లెనిన్ తరువాత ఉన్నతస్థాయిలో ఉండి గౌరవాన్ని పొందిన వ్యక్తి ట్రాట్స్కీ. అందువల్ల లెనిన్ తరవాత ట్రాట్స్కీ కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వాన్ని స్వీకరిస్తాడనే అభిప్రాయం ఏర్పడింది. కాని ఊహించడానికి వీలులేని కొన్ని కారణాల వల్ల ట్రాట్స్కీ లెనిన్ అంత్యక్రియలకు హాజరు కాకపోవడమేగాక తరవాత 1924 మేలో జరిగిన 13వ కమ్యూనిస్ట్ పార్టీ సమావేశానికి కూడా హాజరు కాలేదు. కమ్యూనిస్ట్ పార్టీ సెక్రటరీ జనరల్‌గా ఉన్న స్టాలిన్ పార్టీలో తన స్థానాన్ని బలపరచుకొన్నాడు. మరణించిన లెనిన్ స్థానంలో స్టాలిన్ పొలిట్ బ్యూరో అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. 1925లో ట్రాట్స్కీని యుద్ధ కమిసర్ పదవి నుంచి తొలగించడమేగాక, పార్టీ కాంగ్రెస్‌లో కూడా స్టాలిన్ తన ప్రత్యర్థుల ప్రాముఖ్యతను తగ్గించివేయగలిగాడు. స్టాలిన్, ట్రాట్స్కీల మధ్య స్పర్థ జాతీయవాదికీ, అంతర్జాతీయ విప్లవవాదికీ మధ్య సంఘర్షణ అయింది. యుద్ధంతో విసుగుచెందిన ప్రజలను స్టాలిన్ జాతీయవాదం, శాంతి అనే సూత్రాల ద్వారా మెప్పించడమే గాక జాతీయ గౌరవం అనే అంశాన్ని ప్రవేశపెట్టి, వారిలోని స్వాభిమాన ధోరణిని సంతృప్తిపరిచాడు. ఇదే కాలంలో బ్రిటన్‌లో జరిగిన సార్వత్రిక సమ్మెలో విప్లవస్ఫూర్తిని ప్రవేశపెట్టడానికి టాట్స్కీ అనుయాయులు విఫలం కావడంతో వారి సిద్ధాంతాలు విశ్వసనీయతను కోల్పోయాయి. ఈ పరిణామాలను ఆధారంగా తీసుకొని ట్రాట్స్కీ, జినోవీవ్‌లను పొలిట్ బ్యూరో నుండి బహిష్కరించబడేటట్లు చేసినాడు స్టాలిన్. 1927లో ఆ ఇద్దరిని పార్టీ నుండి కూడా బహిష్కరించడం జరిగింది. ట్రాట్స్కీ దేశ బహిష్కారానికి గురైనా టర్కీ, స్వీడన్, మెక్సికోల నుండి తన పోరాటాన్ని కొనసాగించాడు. ఆఖరుకు 1940లో మెక్సికోలో ఒక హంతకుని చేతిలో ట్రాట్స్కీ హతుడైనాడు. 1941 వరకు స్టాలిన్ ప్రభుత్వ పదవులను చేపట్టక పోయినా, పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా, ఎదురులేని విధంగా సంపూర్ణాధికారం అతని చేతిలో వుండేది.

### 14.2.2.4 స్టాలిన్ జాతీయ సామ్యవాదం :

స్టాలిన్ చదువుకొన్నది కొద్దిగానే అయినా, తన ప్రత్యర్థుల వలె సిద్ధాంత నిపుణుడు కాకపోయినా, దేశానికి పరిమితమైన సామ్యవాదం అనే సిద్ధాంతాన్ని రూపొందించడంలో వారి కంటే ఎక్కువ వాస్తవిక దృక్పథాన్ని, వారి కంటే నిశితమైన ముందు చూపునూ ప్రదర్శించాడు. 1923లో జర్మన్ కమ్యూనిస్ట్‌ల వైఫల్యం, పశ్చిమ ఐరోపా-రష్యాల మధ్య అనుబంధం అంటూ లేకపోవడం అనే రెండు అంశాలు స్టాలిన్‌లో జాతీయ సామ్యవాదం పట్ల నమ్మకాన్ని ఏర్పరచాయి. రష్యా తనకు గల అపారమైన సహజ వనరులు, మానవ శక్తులతో, స్వయం సమర్థమైన సామ్యవాద సమాజాన్ని నిర్మించగలదని అతని దృఢ విశ్వాసం. ఒక వైపు దేశంలో సామ్యవాద విధానాలను అమలు జరుపుతూనే, మరోవైపు అంతర్జాతీయ విప్లవంలో దేశం కల్పించుకోవాలన్న ట్రాట్స్కీ అనుచరుల వాదాన్ని స్టాలిన్ తిరస్కరించాడు. తన సిద్ధాంతానికి దేశభక్తి అనే సూత్రాన్ని జోడించి, యువతరం కార్యకర్తల్ని ఆకర్షించాడాయన. ఈ యువతరాన్ని స్టాలిన్ స్వయంగా పెంపొందించాడు.

### 14.2.2.5 పంచవర్ష ప్రణాళికలు :

మొదటి పంచవర్ష ప్రణాళికను నిపుణులతో కూడిన గోస్‌ప్లాన్ అనే ప్రణాళిక సంఘము తయారుచేసింది. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో (1928-1933) భారీ పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ట్రాక్టర్ల ఉత్పత్తి ఫ్యాక్టరీలు, మోటారు వాహనాల ఫ్యాక్టరీలు, ఉక్కు ఫ్యాక్టరీలు, ఎరువుల ఫ్యాక్టరీలు నెలకొల్పడం జరిగింది. అనేక పెద్ద ఆనకట్టలను కట్టడం జరిగింది. సమిష్టి వ్యవసాయ పద్ధతి ద్వారా వ్యవసాయ పరిశ్రమను సమాజపరం చేయడం మొదటి పంచవర్ష ప్రణాళికలోని మరో ముఖ్య అంశం. కొంతమంది కర్షకుల క్షేత్రాలను కలిపి ఒక సమిష్టి వ్యవసాయక్షేత్రంగా రూపొందించడం జరిగింది. ప్రభుత్వ కృషి ఫలితంగా 1939 నాటికి దేశంలోని కర్షకులలో 90 శాతాన్ని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో సభ్యులుగా చేర్పించింది. 1933 నాటికి రష్యా ప్రసిద్ధి చెందిన పారిశ్రామిక దేశంగా రూపొందింది.

మొదటి పంచవర్ష ప్రణాళికలోని లోపాలను అధిగమించి వేతనాల పెంపు, నిత్యజీవితావసర వస్తువుల ఉత్పత్తి పెంపు అనే లక్ష్యాలతో రెండో పంచవర్ష ప్రణాళిక 1933లో ప్రారంభించారు. ఈ కాలంలో (1933-1938) సంతృప్తికరమైన అభివృద్ధి జరిగింది. ఈ కాలంలో ప్రజల జీవన ప్రమాణం పెరిగింది. పారిశ్రామికాభివృద్ధి కూడా ఏవిధమైన అడ్డంకులు లేకుండా వేగంగా జరిగింది. ప్రజలకు కావలసిన నిత్యజీవితావసర వస్తువుల ఉత్పత్తి భారీ ఎత్తున జరిగింది.

సాంకేతికాభివృద్ధిని సాధించే లక్ష్యంతో 1939లో మూడో పంచవర్ష ప్రణాళిక ప్రారంభమయింది. కాని రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైనందువల్ల సోవియట్ ప్రభుత్వం శాంతికాలపు ప్రణాళికను యుద్ధకాలపు ప్రణాళికగా మార్చవలసి వచ్చింది. అయితే అప్పటికే పారిశ్రామిక రంగంలో విశేషమైన అభివృద్ధి జరిగిన ఫలితంగా రష్యా దేశపు శక్తి స్వరూపాలు పూర్తిగా మారిపోయాయి.

### 14.2.2.6 ప్రచార సరళి :

1936లో స్టాలిన్ ప్రభుత్వం ఒక నూతన రాజ్యాంగాన్ని ప్రకటించింది. ఈ రాజ్యాంగం రష్యాలో నియంతృత్వ దశను అంతమొందించి, ఉదారవాద ధోరణులను ప్రవేశపెట్టింది. అయితే, అది నామమాత్రంగానే. సార్వత్రిక ఓటు హక్కును ప్రవేశపెట్టడం జరిగింది. అఖిల సోవియట్ కాంగ్రెస్ స్థానే ఒక సుప్రీం సోవియట్ ప్రవేశపెట్టబడింది. పౌరహక్కుల్ని పునరుద్ధరించడం జరిగింది. అయితే వాస్తవంలో మాత్రం అది అంతగా జరగలేదు. ఈ మార్పులన్నీ సోవియట్ వ్యవస్థను విమర్శించేవారిని తృప్తిపరచడానికే చేయబడ్డాయి. 1934లో సోవియట్ రష్యా నానాజాతి సమితిలో చేరింది.

### 14.2.2.7 క్షాళనలు :

రాజ్యాంగ సంబంధమైన మార్పుల్ని ప్రదర్శక ధోరణిలో ప్రవేశపెడ్తున్న కాలంలోనే రష్యాలో 'అవిశ్వాస పాత్రులు', 'సంఘ ద్రోహులు' అనే పేరుతో ప్రజలను కొందరిని విచారణకు గురిచేయడం జరిగింది. గతంలో (1928, 1933) విచారణలకు గురైనవారు సాంకేతికజ్ఞులూ, పెట్టుబడిదారీ వాదులూ, ట్రాట్స్కీ అనుయాయులూ కాగా ఇప్పుడు జరిగిన విచారణల్లో, బోనుపైకెక్కిన వారిలో కమ్యూనిస్ట్ పార్టీలోని సీనియర్ నాయకులూ, లెనిన్, స్టాలిన్‌లతో కలసి పనిచేసిన కామ్రేడ్‌లూ, ఎర్రసైన్యంలోని అగ్రశ్రేణి అధికారులూ ఉన్నారు. 1936లో జినోవీవ్, కామెనీవ్‌లను విచారణ చేసి మరణశిక్ష విధించడం జరిగింది. 1937లో రాడెక్, సోకొల్నికోవ్, పియాటకోవ్, మార్షల్ తుకాచెవ్‌స్కీతో సహా కొందరు ఎర్రసైన్యంలోని అధికారులూ దేశద్రోహ అభియోగంపై విచారణ నెదుర్కొన్నారు. 1937లోనే భిన్న రంగాల్లోని వేలాదిమందిని నిర్బంధంలోనికి తీసుకొన్నారు. 1938లో రైకోవ్, బుకారిన్, యగోడా మొదలగువారు నిర్బంధానికి గురైనారు. మొత్తం ఎనిమిది మిలియన్ల మంది నిర్బంధితులైనారని అంచనా. వారిలో మరణశిక్షకు గురైన వారి సంఖ్య రెండు మిలియన్ల నుండి ఆరు మిలియన్ల వరకు వుండవచ్చు.

ప్రచార సాధనాలైన వార్తాపత్రికలు, రేడియో, సినిమా, విద్యాకేంద్రాలను కమ్యూనిస్ట్ పార్టీ సంపూర్ణ నియంత్రణలోనికి తెచ్చుకొంది. కమ్యూనిస్ట్ పార్టీ తప్ప ఇతర రాజకీయ సంస్థలు నిషేధింపబడ్డాయి. కమ్యూనిజం నుండి విభేదించే రాజకీయ సిద్ధాంతాల ప్రచారం నిషిద్ధమైంది. విద్యకు లెనినిజం, స్టాలినిజంల స్వాభావిక పునాది నిర్దేశితమైంది. కమ్యూనిస్ట్ నీతి, దేశభక్తి, సోవియట్ నాయకులపట్ల, జన్మభూమిపట్ల ప్రేమను పెంపొందించడం విద్య యొక్క లక్ష్యమైంది. కళాకారుల, తదితర ప్రజాప్రముఖులపై గట్టి నిఘా వుండేది.

### 14.2.2.8 మత విరుద్ధ ప్రచారం :

స్టాలిన్ కాలంలో కమ్యూనిస్ట్ పార్టీ 'ది గాడ్‌లెస్' అను ప్రచురణ సంస్థ ద్వారా మతవ్యతిరేక ప్రచారాన్ని నిర్వహించింది. అనేక మంది మతోద్యోగులు నిర్బంధితులై, ప్రవాస శిబిరాలకు పంపబడ్డారు. 1943 నుండి సోవియట్ ప్రభుత్వం సహనధోరణిని అవలంబించసాగింది. అయితే చర్చి, రాజ్యం నుండి వేరైంది. విద్యాలయాల్లో మత సంబంధమైన బోధనపై నిషేధం కొనసాగింది. కమ్యూనిస్ట్ పార్టీలోకి సభ్యులను చేర్చుకొనేటప్పుడు వారు నాస్తికులా, కాదా అన్న విషయానికి ప్రాధాన్యత ఉండేది.

### 14.2.2.9 విదేశాంగ విధానము :

సోవియట్ రష్యా ప్రథమంలో జర్మనీ మిత్రదేశంగా వుంటూ ఫ్రాన్స్ భద్రతా సూత్రానికి వ్యతిరేకంగా జర్మనీ ఆయుధీకరణ విధానాన్ని సమర్థించింది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల పట్ల సోవియట్ వైఖరిలో శతృభావన, విశ్వాస రాహిత్యం వుండేవి. బ్రిటన్‌లో సార్వత్రిక సమ్మెను ఉధృతం చేయడానికి సోవియట్ రష్యా చేసిన ప్రయత్నాలు, చైనాలో కొమిన్ టాంగ్ జాతీయవాదులతో సోవియట్ రష్యా సహకారం బ్రిటన్-రష్యాల మధ్య వైరుధ్యం పెరగడానికి కారణమైనాయి.

ఆ తదుపరి దుడుకైన కమ్యూనిస్ట్ వ్యతిరేక నాజీజం జర్మనీలో అవతరించడంతో, రష్యా సమిష్టి భద్రతా సూత్రానికి, ఫాసిస్ట్ వ్యతిరేకతకూ ప్రయోక్త అయింది. సోవియట్ రష్యా 1934లో నానాజాతి సమితిలో ప్రవేశించడమూ, జర్మనీ నిష్క్రమించడం జరిగింది. ఈ దశలో సోవియట్ రష్యా తాత్కాలికంగా విప్లవ కార్యక్రమాల్ని తగ్గించి ఫ్రాన్స్, స్పెయిన్‌లలో ప్రతిపక్షాల స్థాపనను సమర్థించింది. స్పెయిన్ అంతర్యుద్ధంలో సోవియట్ రష్యా స్పానిష్ రిపబ్లిక్‌ను గట్టిగా సమర్థించింది.

సోవియట్ రష్యా 1939లో సమిష్టి భద్రతా వాదాన్ని వదలి జర్మనీతో దురాక్రమణ నిరోధక ఒప్పందాన్ని చేసుకోవడమేగాక బాల్టిక్ రాజ్యాలను, పోలండ్‌లోని ప్రాంతాలను కోరింది. సోవియట్ రష్యా దుడుకైన విధానాన్ని అవలంబించి, పోలండ్‌లోని కొంత భాగాన్ని, కరేలియా భూసంధినీ ఆక్రమించింది. ఆక్రమిత బాల్టిక్ ప్రాంతాలలోని లాట్వియా, లిథూనియా, ఎస్తోనియాలలో సోవియట్ రిపబ్లిక్‌లను స్థాపించింది. దూర ప్రాచ్యంలో జపాన్‌తో రష్యా దురాక్రమణ నిరోధక ఒప్పందాన్ని చేసుకొంది.

1941లో సోవియట్ రష్యాపై జర్మనీ దాడి చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. యుద్ధకాలంలో దేశరక్షణే అత్యంత ప్రధాన అంశమైంది. ఈ కాలంలో సోవియట్ రష్యా మిత్రదేశాలతో అనేక సంధులు చేసుకుంది. రెండో ప్రపంచ యుద్ధానంతరం సోవియట్ రష్యాకు, పశ్చిమ దేశాలకు మధ్య విభేదాలు తిరిగి తలెత్తినాయి. ఐరోపా పునర్నిర్మాణ విషయంలో కూడా విభేదాలు కొనసాగినాయి. అమెరికా నుండి పశ్చిమ ఐరోపా సాయం పొందగా, రష్యా సహాయాన్ని తూర్పు యూరప్ పొందింది.

### 14.2.2.10 ఘనత :

లెనిన్ మరణానంతరం రష్యా ఆధిపత్యం కోసం ట్రాట్స్కీ, స్టాలిన్‌ల నడుమ జరిగిన పోరులో స్టాలిన్ నెగ్గి సోవియట్ రష్యా నియంతగా రూపొందాడు. పంచవర్ష ప్రణాళికల ద్వారా ఇతడు సోవియట్ రష్యాను స్వయం సమృద్ధం చేశాడు. స్టాలిన్ యొక్క సమర్థవంతమైన నాయకత్వంలో సోవియట్ రష్యా అమెరికాతో పోటీ చేయగల అగ్రరాజ్యంగా మారింది.

### 14.2.3 నమూనా ప్రశ్నలు :

1. రష్యా విప్లవంలో లెనిన్ పాత్రను వివరింపుము.
2. లెనిన్ నూతన ఆర్థిక విధానం గురించి చర్చింపుము.
3. స్టాలిన్ యొక్క కృషి, సాధించిన ఘన కార్యములను వ్రాయుము.
4. ట్రాట్స్కీ
5. కారల్‌మార్క్స్

### 14.2.4 చదువదగిన గ్రంథాలు :


| | | |
|---|---|---|
| 1. C.J.A.H. Hayes | - | Modern Europe Since 1870 |
| 2. C.D. Hazan | - | Modern Europe upto 1945 |
| 3. D. Thamson | - | Europe since Napolean |
| 4. H.L. Peacock | - | Modern European History 1789-1973 |
| 5. Raghubir Dayal | - | Modern European History |
| 6. Palmer and Perkins | - | International Relations |


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 15

# ఆర్థిక మాంద్యము - 1929 (Great Depression) ఆర్థిక సంక్షోభము

## 15.0 లక్ష్యం :

1929లో ప్రపంచంలో సంభవించిన ఆర్థిక మాంద్యము గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశములు :**

**15.1 పరిచయం**

**15.2 ఆర్థిక మాంద్యము ఏర్పడుటకు కారణాలు**

- **15.2.1 వ్యవసాయ వస్తువుల అధికోత్పత్తి**
- **15.2.2 పారిశ్రామిక వస్తువుల అధికోత్పత్తి**
- **15.2.3 నిరుద్యోగ సమస్య**
- **15.2.4 మొదటి ప్రపంచయుద్ధ ప్రభావం**
- **15.2.5 బంగారు నిల్వల కొరత**
- **15.2.6 ఆర్థిక జాతీయభావం**
- **15.2.7 ఋణాలపై ఆధారపడుట**

**15.3 ఆర్థిక మాంద్యము 1929-1933**

**15.4 ఆర్థిక సంక్షోభము అధిగమించుటకు తీసుకొన్న చర్యలు**

- **15.4.1 హువర్ గైకొనిన చర్యలు**
- **15.4.2 లండన్ విధానము**
- **15.4.3 ఫ్రాన్స్ ప్రతిపాదన**
- **15.4.4 లూసెన్ సమావేశం**
- **15.4.5 ప్రపంచ ఆర్థిక మహాసభ**

**15.5 ఫలితాలు**

**15.6 సారాంశము**

**15.7 నమూనా ప్రశ్నలు**

**15.8 చదువదగిన గ్రంథాలు**

## 15.1 పరిచయం :

మొదటి ప్రపంచ యుద్ధం (1914-1918) ఐరోపా ఆర్థిక సౌష్టవాన్ని సర్వనాశనం చేసినది. మార్కెట్లు, పరిశ్రమలు, వ్యవసాయం, వ్యాపారం ఉత్పత్తి తగ్గిపోయింది. కాగితపు డబ్బు, భరించలేని జాతీయ అప్పులు, అధిక పన్నులు ఐరోపా దేశాల ఆర్థిక వ్యవస్థను నాశనం చేసినవి. నిరుద్యోగం, అధిక ధరలతో ప్రజలు అనేక బాధలు పడ్డారు. పరిశ్రమలు మూతపడినవి.

దాంతో ఐరోపాలో ఆందోళనలు, సమ్మెలు జరిగినవి. యుద్ధం తరువాత అనేక శాంతి సంధులు చేసుకొన్నా అనేక సమస్యలు అపరిష్కృతంగా నిలచిపోయినవి. యుద్ధ సంధుల వల్ల తమ ప్రాంతాలు కోల్పోయిన రాజ్యాలు బాధలో వుండగా, ప్రాంతాలు పొందిన రాజ్యాలు తాము ఆశించినన్ని ప్రాంతాలు పొందలేకపోయామని అసంతృప్తి పాలైనవి. మొదటి ప్రపంచ యుద్ధం తరవాత ఏర్పడిన ప్రజారిపబ్లిక్ ప్రభుత్వాలు సమస్యల పరిష్కారంలో విఫలమైంది. ఫలితంగా ప్రజాప్రభుత్వాల స్థానంలో నియంతృత్వ ప్రభుత్వాలు ఏర్పడినవి. టర్కీలో కెమల్ పాషా అధికారంలోకి వచ్చాడు. ఇటలీలో ముస్సోలినీ నాయకత్వంలో ఫాసిస్ట్ నియంతృత్వం, జర్మనీలో హిట్లర్ నాయకత్వంలో నాజీ నియంతృత్వం ఏర్పడినది. రష్యాలో స్టాలిన్ నాయకత్వంలో కమ్యూనిస్ట్ నియంతృత్వం బలిష్టమైంది. ఐరోపాలోని 28 రాజ్యాలలో 10 మినహా అన్ని రాజ్యాలలో నియంతృత్వ ప్రభుత్వాలు వెలసినవి. ఈ నియంతృత్వాలు ఆ దేశ ప్రజల హక్కులు హరించి దేశ ఆర్థిక ప్రగతికి తీవ్ర కృషి జరిపారు.

## 15.2 ఆర్థిక మాంద్యము ఏర్పడుటకు కారణాలు :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన రాజకీయ ఆర్థిక క్లిష్ట సమస్యల నుండి తేరుకొని ఐరోపా అభివృద్ధిని సాధించే సమయంలో ఐరోపా అకస్మాత్తుగా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ఈ ఆర్థిక మాంద్యము 1929-1933 సంవత్సరాల మధ్య ఐరోపాను కలవరపరిచింది.

### 15.2.1 వ్యవసాయ వస్తువుల అధికోత్పత్తి :

మొదటి ప్రపంచ యుద్ధం ముగియడంతో వేలాది సైనికులను శిబిరాల నుండి వ్యవసాయ క్షేత్రాలకు తరలించడం జరిగింది. ఫలితంగా ఐరోపా దేశాలలోనే గాక అమెరికాలో కూడా ప్రజావసరములకు మించిన వ్యవసాయ వస్తువుల ఉత్పత్తి జరిగింది. ఈ అధికోత్పత్తి వలన వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోయాయి. దీనివల్ల వ్యవసాయదారుల కొనుగోలు శక్తి తగ్గింది. అంతేగాక రైతులు తమ భూములను కుదువపెట్టి అప్పులు తీసుకొనుట వలన వారి పరిస్థితి మరింత దిగజారింది. రైతుల కొనుగోలు శక్తి పడిపోవుట వలన పారిశ్రామిక వస్తువుల మార్కెట్లు సైతం పడిపోయింది.

### 15.2.2 పారిశ్రామిక వస్తువుల అధికోత్పత్తి :

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో వ్యాపారం, పరిశ్రమలు దెబ్బతిన్నవి. యుద్ధం తరువాత పెక్కు మంది సైనికులను ఫ్యాక్టరీలకు మరలించడం జరిగింది. పర్యవసానంగా వస్తువులు అధికంగా ఉత్పత్తి అయ్యాయి. పారిశ్రామిక సంస్థల మధ్య పోటీ పెరగడం వల్ల కొన్ని పరిశ్రమలు మూతపడ్డాయి. ఎందరో కార్మికులు ఉపాధి కోల్పోయారు. నిరుద్యోగం పెరిగింది. ఎవరైతే వస్తువులను ఉత్పత్తి చేశారో వారు వాటిని కొనుగోలు చేసే పరిస్థితులలో లేరు. వస్తువుల ధరలు తగ్గిపోయినాయి. అమ్మకాలు పడిపోవడంతో పరిశ్రమలు కొన్ని మూతపడ్డాయి. దీంతో యుద్ధకాలపు రుణాల చెల్లింపులు గందరగోళ పరిస్థితిని కల్పించాయి.

### 15.2.3 నిరుద్యోగ సమస్య :

యుద్ధకాలంలో స్థాపించబడి ఎన్నో లాభాలు యజమానులకు, కార్మికులకు చేకూర్చింది. యుద్ధం ముగియడంతో యుద్ధ సంబంధిత పరిశ్రమలు మూతపడ్డాయి. ఫలితంగా నిరుద్యోగం పెరిగింది. పారిశ్రామిక సంస్థల మధ్య పోటీ పెరిగి కొన్ని పరిశ్రమలు మూతపడడంతో ఎందరో కార్మికులు ఉపాధి కోల్పోయారు. పరిశ్రమల యాంత్రీకరణ విశేషంగా పెరుగుట వల్ల కూడా నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చింది. అందువల్ల కార్మికుల కొనుగోలుశక్తి తగ్గిపోయింది.

### 15.2.4 మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావం :

మొదటి ప్రపంచ యుద్ధం వల్ల జరిగిన ధన నష్టం ఫలితంగా 1929 లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభము ఏర్పడింది. దీని ఫలితంగా పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణము, వ్యాపార స్థంభన ఎక్కువైనాయి.

### 15.2.5 బంగారు నిల్వల కొరత :

ప్రపంచంలోని అనేక దేశాలలో బంగారం నిల్వలు తరిగిపోయినందున ఐరోపాలో ఆర్థిక మాంద్యము ఏర్పడిందని ఆర్థికశాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మొదటి ప్రపంచ యుద్ధం తరవాత అమెరికా, ఫ్రాన్స్‌లు అనుసరించిన విధానం వల్ల బంగారు నిల్వలు తరిగిపోయి ఐరోపా దేశాల ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమయింది. అమెరికా ఐరోపా దేశాలకు కావలసిన వస్తువులను ఎగుమతిచేసి అందుకు ప్రతిఫలంగా బంగారాన్ని స్వీకరించింది. అంతేగాక అమెరికా తను ఇచ్చిన రుణాలను కూడా తిరిగి బంగారం రూపంలో పొందడంతో ఐరోపాలోని బంగారం అంతా అమెరికాకు చేరింది. ఫ్రాన్స్ కూడా యుద్ధ నష్టపరిహారాన్ని జర్మనీ నుండి బంగారం రూపంలో పొందింది. అమెరికా, ఫ్రాన్స్ విధానాల వల్ల ప్రపంచంలోని బంగారం 60% వారి వద్దకు చేరింది. ఫలితంగా బంగారం ధర విపరీతంగా పెరిగిపోయింది. వస్తువుల ధరలు పడిపోయింది. ఇటువంటి పరిస్థితులలో ప్రతిదేశం తన బంగారం నిల్వలు పడిపోకుండా ఉండుటకు ఎగుమతి, దిగుమతులపై ఆంక్షలు విధించింది. దీనివల్ల విదేశీ వ్యాపారం స్థంబించిపోయింది. దానితో ప్రతిదేశపు ఆర్థికస్థితి దిగజారి దివాలా తీసే పరిస్థితి ఏర్పడింది. ఈ ఆర్థిక సంక్షోభం ఐరోపాకే పరిమితం కాక ప్రపంచ వ్యాప్తమయింది. దీని ప్రభావం ఇండియాపై కూడా ప్రసరించింది.

### 15.2.6 ఆర్థిక జాతీయవాదము :

ప్రతిదేశం విదేశీ వస్తువులను ఉపయోగించరాదని, స్వదేశీ వస్తువులనే వాడవలెనని జాతీయ ఆర్థిక విధానాన్ని రూపొందించుకున్నవి. ఇంగ్లాండు, ఫ్రాన్స్, రష్యా, జర్మనీ, హంగరి, రుమేనియా, బల్గేరియా, కెనడా, జపాన్ మొదలైన దేశాలు తమకు కావలసిన వస్తువులను తామే తయారుచేసుకొన్నవి. ఆహార పదార్థాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించినవి. ఏ దేశ వస్తువులకూ విదేశీ మార్కెట్లు లేవు. స్వేచ్ఛా వ్యాపార విధానానికి ఆంక్షలు ఎక్కువై అంతర్జాతీయ సహకారం కొరవడింది.

### 15.2.7 ఋణాలపై ఆధారపడుట :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం దాదాపు ఐరోపా రాజ్యాలన్నీ అమెరికా ఋణాలపై ఆధారపడ్డాయి. మిత్రరాజ్యాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకొనుటకు అమెరికా సహాయం చేసింది. అలాగే పరాజయం పొందిన జర్మనీ కూడా మిత్రరాజ్యాలకు నష్టపరిహారం చెల్లించుటకు అమెరికా వద్ద అప్పుచేసింది. ఐరోపా ఆర్థిక మాంద్య ప్రభావం అమెరికాపై ప్రసరించి అమెరికా కూడా ఆర్థిక మాంద్యానికి గురి అయింది. అమెరికా విదేశీ వాణిజ్యం దెబ్బతిన్నది. అమెరికా అమ్మకాలు తగ్గడంతో అమెరికా కూడా తన దిగుమతులపై ఆంక్షలు విధించింది. అమెరికా చర్యతో అమెరికాపై ఆధారపడ్డ అన్ని రాజ్యాలు ఆర్థిక సంక్షోభానికి గురి అయినవి. అందువల్ల 1930లో ధరలు ఇంకా పడిపోయినాయి. రుణగ్రస్త దేశాల రుణాలు రెండు రెట్లు పెరిగింది. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభానికి గురైంది. అందువల్లనే ఆర్థిక సంక్షోభం అమెరికా నుండి ప్రారంభమయి ప్రపంచమంతటా ఆవరించిందని లిప్సన్ అను పండితుడు వ్యాఖ్యానించాడు. సాధారణంగా వ్యాపారరంగంలోని హెచ్చుతగ్గుల వల్ల, పెట్టుబడిలోని అవకతవకల వల్ల ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. కాని 1929-1933 ల మధ్య కాలంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఈవిధంగా ఐరోపా ఆర్థిక మాంద్యము వచ్చింది.

### 15.3 ఆర్థిక మాంద్యము 1929-1933 :

మొదటి ప్రపంచ యుద్ధం ఆర్థికంగా అన్ని దేశాలను సర్వనాశనం చేసింది. ఎన్నో దేశాలు అప్పులలో మునిగిపోయాయి. 1928 నాటికి ఐరోపా రాజ్యాలలో ఆర్థిక పరిస్థితి మెరుగయింది. పరిశ్రమల ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి. ఎగుమతులు, దిగుమతులు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందాయి. అవసరమైన దాని కంటే ఉత్పత్తులు ఎక్కువయ్యాయి. వాస్తవానికి కార్మికుల కృషి, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి, చక్కని పంటలు ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచాలి. కాని ఉత్పత్తులు విపరీతంగా పెరగడం ప్రమాదమైంది. ఇదే నాటి ఆర్థిక సంక్షోభానికి కారణమయింది. 1929లో ఉప్పెనలాగా వచ్చిన ఆర్థిక మాంద్యము ఐరోపా ఆర్థిక వ్యవస్థను తల్లక్రిందులు చేసింది. నాటివరకు కనీ, వినీ, ఊహించని ఆర్థిక సంక్లిష్ట స్థితి ఏర్పడింది. ఐరోపా దేశాలలో కొనుగోలు శక్తి తగ్గిపోయింది. అమెరికా మాత్రమే ఋణదాత రాజ్యంగా మిగిలింది. ప్రపంచ బంగారు నిలువలన్నీ అమెరికా బ్యాంకులలో చేరాయి. ఉత్పత్తి విపరీతంగా పెరగడం వల్ల డిమాండ్ దారుణంగా పడిపోయింది. 1929 చివరి నాటికి కొనుగోళ్ళు లేక పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు విపరీతంగా పడిపోయాయి. దీనితో ఎన్నో పరిశ్రమలు మూతపడి, వేలాది కార్మికులు నిరుద్యోగులయ్యారు. ఉత్పత్తుల పెరుగుదల, వెంటనే ఆర్థిక మాంద్యం ఏర్పడడంతో ఐరోపా ఆర్థిక స్థితి సమూలంగా నాశనమైంది. అప్పుల చెల్లింపు కష్టతరమైంది. బ్యాంకు వడ్డీ రేట్లు పెరిగాయి. టారిఫ్ పన్నులు అధికమయినాయి. ఋణాలు లభ్యం కాలేదు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి పూర్తిగా తగ్గిపోయి రైతుల పరిస్థితి దుర్భరమైంది. అందరికన్నా జర్మనీ విపరీతంగా నష్టపోయింది. జర్మనీ అప్పులు తీర్చలేకపోయింది.

### 15.4 ఆర్థిక సంక్షోభము అధిగమించుటకు తీసుకొన్న చర్యలు :

ఆర్థిక సంక్షోభము నివారణకు అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం, జపాన్‌లు అనేక ప్రతిపాదనలు చేసినవి.

#### 15.4.1 హువర్ గైకొన్న చర్యలు :

జర్మనీలో ఆర్థిక సంక్షోభము తీవ్రం కావడంతో జర్మన్ చాన్సలర్ హిండెన్ బర్గ్ అప్పు చెల్లింపు వాయిదా వేయమని అమెరికా అధ్యక్షుడు హువర్‌ను అభ్యర్థించాడు. హువర్ అప్పుల చెల్లింపులన్నింటిని ఒక ఏడాదికి వాయిదా వేశాడు. దీనికి ఫ్రాన్స్ అభ్యంతరం చెప్పింది. అప్పు మొత్తాన్ని బ్యాంకులలో డిపాజిట్ చేసి దానిని జర్మనీ రైల్వేల విస్తరణకు వాడాలని చెప్పబడింది. అయినా జర్మనీ ఆర్థిక కష్టాలు తీరలేదు. జర్మనీలోని ప్రైవేటు పెట్టుబడులు పెద్ద ఎత్తున ఉపసంహరించబడ్డాయి. 1931లో జర్మనీ జాతీయ బ్యాంకు మూతబడింది. ఈ క్లిష్ట పరిస్థితిని పరిశీలించడానికి లండన్, పారిస్‌లలో చర్చలు జరిగాయి. జర్మనీ స్వల్పకాలిక ఋణాలను దీర్ఘకాలిక ఋణాలుగా మార్చారు. తాత్కాలికంగా జర్మనీ ఆర్థిక వినాశనాన్ని తప్పించుకొన్నది. అయితే ఈ సంక్షోభం వీమార్ రిపబ్లిక్ పతనానికి, హిట్లర్ అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి దోహదం చేసింది.

#### 15.4.2 లండన్ విధానము :

హువర్ పథకం జర్మనీని కొంతవరకు కాపాడగలిగినా లండన్ వ్యాపార సంస్థలను దెబ్బతీసింది. జర్మనీ నుండి ఇంగ్లాండుకు రావలసిన చెల్లింపులు వాయిదా పడ్డాయి. ప్రపంచములో లండన్ ద్రవ్య మార్కెట్టుకు మంచి పేరు ప్రతిష్టలుండేవి. లండన్ బ్యాంకులు జర్మనీకి పెద్ద ఎత్తున ఋణాలు ఇచ్చాయి. ప్రజలదగ్గర స్వల్పకాల ఋణాలు తీసుకొని వాటిని జర్మనీకి దీర్ఘకాల ఋణాలు ఇచ్చారు. ఆర్థిక మాంద్యంతో విదేశీ ఋణాల వసూలు ఆగిపోయింది. విదేశీ పెట్టుబడులు బయటకు వెళ్ళిపోయాయి. ఇంగ్లాండ్ ఇప్పటివరకు 'గోల్డ్ స్టాండర్'ను అనుసరించింది. అనగా బ్రిటన్ బ్యాంకులలో దాచుకున్న డబ్బు బంగారంతో సమానం.

ఈ సంక్షోభంలో జీతాలు తగ్గిపోయాయి. లేబర్ పార్టీ ప్రధాని మాక్‌డోనాల్డ్ రాజీనామా చేశాడు. తిరిగి అతడే సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరిచాడు. నూతన ప్రభుత్వం బంగారం ఎగుమతిని నిషేధించింది. అంటే 'గోల్డ్ స్టాండర్' కు తిలోదకాలిచ్చింది. దీనితో ఇంగ్లండ్ ఆర్థిక పరిస్థితి కొంత మెరుగయింది. కాని లండన్ విధానము ఇతర రాజ్యాలపై తన ప్రభావాన్ని చూపింది. అనేకదేశాలు 'గోల్డ్ స్టాండర్' కు స్వస్తి పలికాయి.

### 15.4.3 ఫ్రాన్స్ ప్రతిపాదన :

ఐరోపా రాజ్యాలన్నీ కలిసి ఐరోపా ఆర్థిక సంఘం అను పేరుతో ఒక సంఘంగా ఏర్పడాలని ఫ్రాన్స్ విదేశాంగమంత్రి బ్రియాండ్ సూచించాడు. కాని ఈ ప్రతిపాదనను అన్ని రాజ్యాలు తిరస్కరించాయి. ఫ్రాన్స్ ఆధిక్యత పొందుతుందని భావించడమే అందుకు కారణమయింది. ఐరోపా ఆర్థిక సంఘానికి బదులుగా ప్రాంతీయ ఒప్పందాలు చేసుకోవలెనని ఆ దేశాలు సూచించాయి. కాని పరస్పర ఈర్ష్యాద్వేషాల వల్ల ప్రతిపాదనలు గూడా సఫలం కాలేదు.

### 15.4.4 లూసెన్ సమావేశం :

1932 జూన్‌లో ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లాండ్, బెల్జియం, ఇటలీ, జపాన్‌లు లూసెన్‌లో సమావేశమై జర్మనీ ఐరోపా రాజ్యాలకు చెల్లించవలసిన నష్టపరిహారాన్ని ఐరోపా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుటకు 3 వేల మిలియన్ల ఫ్రాంకులు అమెరికా ఇవ్వాలని కోరింది. అందువల్ల అమెరికా యంగ్ పథకాన్ని రూపొందించి జర్మనీ రుణ భారాన్ని తగ్గించింది. వెంటనే ఇంగ్లాండ్, ఫ్రాన్స్, బెల్జియం, ఇటలీలు కూడా తాము అమెరికాకు చెల్లించవలసిన రుణాలను కూడా రద్దు చేయమని కోరాయి. కాని వారి కోర్కెను అమెరికా తిరస్కరించింది.

### 15.4.5 ప్రపంచ ఆర్థిక మహాసభ :

1933లో లండన్‌లో ప్రపంచ ఆర్థిక మహాసభ జరిగింది. ఈ సభలకు అమెరికాను కూడా ఆహ్వానించడం జరిగింది. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న అమెరికా కూడా ఈ సభలకు హాజరయింది. నాటికి అమెరికా అధ్యక్షుడు ఫ్లాంక్లిన్ రూజ్‌వెల్ట్. ఇతడు తన 'నూతన విధానాన్ని' ప్రకటించాడు. రాజ్యాల కరెన్సీలను నిలకడగా ఉంచాలని, టారిఫ్ రేట్లను తగ్గించాలని బడుగు రాజ్యాలు కోరాయి. దీనికి అగ్రరాజ్యాలు అంగీకరించలేదు. అమెరికా కూడా తన ఆంతరంగిక సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చి, అంతర్జాతీయ ఆర్థిక సహకారాన్ని విస్మరించింది. ఫలితంగా లండన్ సమావేశం విఫలమైంది. ఆర్థిక రంగంలో అంతర్జాతీయ సహకారానికి విలువ పూర్తిగా పడిపోయి జాతీయ ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇనుమడించింది. నాటి నుండి ప్రతి దేశము తన ఆర్థిక పునర్నిర్మాణానికి స్వయం కృషి పైననే ఆధారపడింది.

### 15.5 ఫలితములు :

1929-1933 సంవత్సరాల మధ్య కాలంలో ఏర్పడిన ప్రపంచ ఆర్థిక మాంద్యము ఐరోపా చరిత్రపై గొప్ప ప్రభావాన్ని చూపింది.

1) అంతర్జాతీయ రాజకీయ రంగంలో నానాజాతి సమితి నెలకొల్పిన సమిష్టి భద్రతా సిద్ధాంతము భగ్నమైంది.

2) సోవియట్ యూనియన్ ఆర్థిక ప్రగతి పెట్టుబడి రాజ్యాలను భయభ్రాంతులను చేసింది. ప్రపంచంలో కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టడానికి ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు ఇటలీలోని ఫాసిస్ట్ పోకడల వల్ల నిరాశక్తత ప్రదర్శించాయి.

3) ఫ్రాన్స్‌లో ఆర్థిక సంక్షోభం వల్ల మంత్రివర్గాలు నిత్యమూ మారుతూ వచ్చాయి. ఫ్రాన్స్‌లో రాజకీయ స్థిరత్వము లోపించింది.

4) లాటిన్ అమెరికా రాజ్యాలలో తిరుగుబాట్లు సంభవించి తరచూ ప్రభుత్వాలు మారాయి.

5) మిత్రరాజ్యాలు జర్మనీపై విధించిన నష్టపరిహారాన్ని వసూలు చేయడానికి వీలుగాక రద్దుచేయబడింది.

6) ఇంగ్లాండ్ ఆర్థిక వ్యవస్థలో అప్పటివరకు ప్రమాణంగా వాడబడిన బంగారం ఆర్థిక మాంద్యం వల్ల వెండిని ప్రమాణంగా మార్చుకొన్నది.

7) ఆర్థిక మాంద్యం వల్ల ఇంగ్లాండ్‌లో అధికారంలో వున్న లేబర్‌పార్టీ అధికారాన్ని కోల్పోయింది. దాని స్థానే మిశ్రమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

8) ఆర్థిక మాంద్యం వల్ల ప్రతి దేశం ఆర్థిక జాతీయ విధానాన్ని చేపట్టినది. స్వదేశీ వస్తువుల వాడుకను ప్రోత్సహించి, విదేశీ వస్తువుల వాడకాన్ని నిషేధించినాయి.

9) ఐరోపా దేశాలలో ఆర్థిక సంక్షోభాన్ని అరికట్టలేక ప్రజాప్రభుత్వాలు విఫలమైనవి. అందువల్ల వాటి స్థానంలో నియంతృత్వ ప్రభుత్వాలు ఏర్పడినవి. ఇటలీలో ఫాసిస్టు నియంతృత్వం, జర్మనీలో నాజీ నియంతృత్వం ఏర్పడింది. రష్యాలో కమ్యూనిష్ట్ నియంతృత్వం బలపడింది. గ్రీస్, బల్గేరియా, పోలండ్, స్పెయిన్ దేశాలు కూడా నియంతృత్వానికి గురి అయినవి.

10) మొదటి ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని నాజీపార్టీ తన స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకొన్నది. వైమార్ రిపబ్లిక్‌ను పడగొట్టి నాజీపార్టీ నాయకుడు హిట్లర్ అధికారాన్ని హస్తగతం చేసుకొన్నాడు. అయితే జర్మనీ ఆర్థిక సంక్షోభం నుంచి విముక్తి చెందుతున్న తరుణంలో నాజీపార్టీ అధికారంలోకి వచ్చింది.

11) ఆర్థిక మాంద్య ప్రభావము అమెరికన్‌లపై కూడా ప్రసరించింది. అనేకమంది అమెరికన్‌లు తమ ఆస్తిపాస్తులను కోల్పోయారు. కొన్నిచోట్ల ఆహారపదార్థాల కొరకు అమెరికన్‌లు దుకాణాదారులపై దాడులు జరిపారు. అమెరికన్‌లకు ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ విధానాలపై విశ్వాసం సడలి నియంతృత్వం, సామ్యవాదములపై మొగ్గుచూపారు. అయితే 1932లో అధికారంలోకి వచ్చిన ఫ్లాంక్లిన్ రూజ్‌వెల్ట్ 'నవ విధానం' అనుసరించుట వలన ప్రమాదం తప్పింది.

12) ఆర్థిక సంక్షోభంలో జపాన్ వ్యాపారం సగానికి తగ్గిపోయింది. జపాన్ రాజకీయాలలో అస్థిరత నెలకొన్నది. ప్రజల దృష్టిని మళ్ళించడానికి జపాన్ మంచూరియాపై దురాక్రమణ జరిపి సమితి భద్రతా సిద్ధాంతానికి తీవ్ర విఘాతం కల్పించింది. దీర్ఘకాలంగా కొనసాగిన ఆర్థిక సంక్షోభం ఆర్థిక ప్రగతికి అవరోధంగా జపాన్ ప్రజలు ఆర్థిక వ్యాప్తి నుండి దృష్టి మరల్చి సామ్రాజ్యవ్యాప్తికై జపాన్ సైనికశక్తి నాయకత్వాన్ని వాంచించారని టాయిన్‌బీ వ్యాఖ్యానించాడు.

13) ఆర్థిక మాంద్యం వల్ల నిరాయుధీకరణ విధానం అంతమయింది. నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం చాలా దేశాలు ఆయుధాల ఉత్పత్తిని ఆరంభించాయి. దీని వల్ల ఒకవైపు ఆర్థిక సమస్య తీరడమే గాక వేరొకవైపు సైనికంగా దేశాలు అభివృద్ధి చెందినాయి. ఈ పరిణామం రెండో ప్రపంచ యుద్ధానికి దారితీసింది.

## 15.6 ముగింపు :

1929లో ఐరోపా ఖండం ఆర్థిక మాంద్యానికి గురి అయింది. ఆర్థిక సమస్యల పరిష్కారంలో మధ్య ఐరోపాలోని ప్రజాప్రభుత్వాలు విఫలం కావడంవల్ల నియంతృత్వాలు ఏర్పడినవి. ఈ నియంతృత్వ ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు

చివరకి రెండో ప్రపంచ యుద్ధానికి దారితీసినది. ఐరోపాలో ఏర్పడిన రాజకీయ, ఆర్థిక మాంద్యము ఐరోపా ఆర్థిక చరిత్రలో ఒక మహత్తర సంఘటన అని లిప్సన్ పండితుడు అభిప్రాయపడినాడు.

## 15.7 నమూనా ప్రశ్నలు :

1. 1929 - 30 సంవత్సరాలలో ఐరోపాలో ఏర్పడిన తీవ్ర ఆర్థిక మాంద్యాన్ని గూర్చి వ్రాయుము.

## 15.8 చదువదగిన గ్రంథాలు :


1. C.J.A.H. Hayes - Modern Europe Since 1870
2. C.H. Hazan - Modern Europe upto 1945
3. D. Thomson - Europe since Napoleon
4. Raghubir Dayal - Modern European History
5. H.L. Peacock - Modern European History 1789-1973
6. E. Lipson - Europe between the two world wars
7. L.E. Snelgrove - The Modern World Since 1870


- డా|| వి. కె. మోహన్

పాఠం - 16

# ముస్తఫా కెమాల్ పాషా

## 16.0 లక్ష్యం :

యంగ్ టర్క్ ఉద్యమము, టర్కీ అభ్యున్నతికి ముస్తఫా కెమాల్ పాషా చేసిన కృషిని గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశములు :**

**16.1 పరిచయం**
**16.2 యంగ్ టర్క్ ఉద్యమం**
**16.3 మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీ**
**16.4 సెవెర్స్ సంధి**
**16.5 ముస్తఫా కెమాల్ పాషా**
- **16.5.1 తొలిజీవితం**
- **16.5.2 టర్కీ రిపబ్లిక్ స్థాపన**
- **16.5.3 లోజేన్ సంధి - 1923**
- **16.5.4 నియంతగా ముస్తఫా**
- **16.5.5 ముస్తఫా సంస్కరణలు**
- **16.5.5.1 రాజకీయ సంస్కరణలు**
- **16.5.5.2 మత సంస్కరణలు**
- **16.5.5.3 విద్యా సంస్కరణలు**
- **16.5.5.4 సాంఘిక సంస్కరణలు**
- **16.5.5.5 న్యాయ సంస్కరణలు**
- **16.5.5.6 ఆర్థిక సంస్కరణలు**
- **16.5.5.7 ఇతర సంస్కరణలు**
- **16.5.6 విదేశాంగ విధానము**
- **16.5.7 ఘనత**

**16.6 నమూనా ప్రశ్నలు**
**16.7 చదువదగిన గ్రంథాలు**

## 16.1 పరిచయం :

16వ శతాబ్దం నాటికి ఆటోమన్ తురుష్క సామ్రాజ్యం ఐరోపా, ఆసియా, ఆఫ్రికా ఖండాలలో విస్తార భూభాగాలను తనలో ఇముడ్చుకొని అత్యున్నత స్థితినందుకుంది. కాన్‌స్టాంటినోపుల్ రాజధానిగా సామ్రాజ్యాన్ని పాలించిన సుల్తాన్ ముస్లింలందరినీ

ఖలీఫాగా గుర్తింపబడ్డాడు. కాని ఆధునిక యుగంలో టర్కీ సుల్తానులందరూ అసమర్థులూ, శక్తిహీనులూ, అజ్ఞానులూ కావడం వల్ల తురుష్క సామ్రాజ్యం మిక్కిలి త్వరితంగా క్షీణింపనారంభించింది. తక్కిన ఐరోపా రాజ్యాలతో పోలిస్తే అన్ని రంగాలలో తురుష్క సామ్రాజ్యం వెనుకబడిపోయింది. 17వ శతాబ్దంలో బలహీనపడిన తురుష్క సామ్రాజ్యాన్ని 18వ శతాబ్దంలో 'ఐరోపా రోగి' గా అభివర్ణించారు. ఇదే కాలంలో రష్యా ఒక ప్రముఖ రాజ్యంగా రూపొంది తురుష్క సామ్రాజ్య విచ్ఛిత్తి ద్వారా తన సామ్రాజ్య వ్యాప్తి చేసుకోవాలని ఆకాంక్షించింది. సుల్తానుకు విరుద్ధంగా రష్యా బాల్కన్ ప్రాంతంలో జాతీయతా భావాన్ని రెచ్చగొట్టింది. రష్యా విస్తరణను భయాందోళనలతో గమనించిన ఇంగ్లాండ్, ఫ్రాన్స్ మొదలైన ఐరోపా రాజ్యాలు ఈ సమస్యలో జోక్యం చేసుకోవడంతో తూర్పు ఐరోపా (బాల్కన్) సమస్య మరింత జటిలమైంది. 19వ శతాబ్దంలో వచ్చిన తిరుగుబాట్లు ఫలితంగా సెర్బియా, గ్రీసులు స్వతంత్రమయ్యాయి. 1878లో జరిగిన బెర్లిన్ సమావేశం తరవాత తూర్పు యూరప్‌లో సంభవించిన పరిణామాలు టర్కీని మరింత బలహీనపరిచింది.

## 16.2 యంగ్‌టర్క్ ఉద్యమము :

టర్కీలోని యువకులు తమ రాజ్య బలహీనతను, పరాభవాన్ని గమనించి టర్కీని పటిష్ఠ రాజ్యంగా రూపొందించి, ప్రపంచంలో తమ ఔన్నత్యాన్ని నెలకొల్పాలని అభిప్రాయపడ్డారు. టర్కీ యువనాయకులలో అగ్రగణ్యుడైన కమల్ పాషా సైనికునిగా శిక్షణ పొంది సుల్తాన్ ప్రభుత్వంలో 1861లో చేరాడు. ఇతడు కొద్దికాలంలోనే ముఖ్యమంత్రి అయి టర్కీ పునరుద్ధరణకు ఆర్థిక, సైనిక తదితర రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలని కాంక్షించి 1890లో సుల్తాన్‌కు సలహా ఇచ్చినందుకు పదవిని కోల్పోయాడు. ఇదే కాలంలో టర్కీలో మరో విప్లవవాద సంఘమేర్పడింది. యంగ్‌టర్క్ అనే పేరుతో వీరు అనేక రహస్య సంఘాలుగా ఏర్పడ్డారు. ఈ యువటర్క్‌లు సైన్యంలో విప్లవాత్మకమైన మార్పులు రావాలని, సామ్రాజ్యాన్ని జాతీయరాజ్యంగా రూపొందించాలని, దేశభక్తిని ప్రేరేపించాలని ప్రచారం చేశారు.

అజ్ఞాతంగా పనిచేస్తూ విప్లవాన్ని తీసుకురావాలనే ఈ యువ తురుష్క నాయకుడు ఎన్వర్ బే కొంతమంది సైన్యాధికారులతో 'ఐక్యతా అభివృద్ధి విప్లవ సంఘాన్ని' స్థాపించాడు. వీరు 1908లో సైనిక తిరుగుబాటు చేసి, నాటి రాజ్యాంగాన్ని రద్దుచేసి, సుల్తాన్‌ను పదవీభ్రష్టుని చేయగలమని బెదిరించారు. భయపడిన సుల్తాన్ అబ్దుల్ హమీద్ మార్పులకు అంగీకరించి నూతన రాజ్యాంగాన్ని ప్రకటించాడు. నూతన రాజ్యాంగ ప్రధానిగా ఉదారవాది కమల్ పాషాను ఆహ్వానించాడు. 1908 డిశంబర్‌లో ప్రజాస్వామ్య పార్లమెంట్ కాన్‌స్టాంట్‌నోపుల్‌లో సమావేశమయింది. కాని ఆ సమయానికి తురుష్క సామ్రాజ్యంలో విపరీతమైన తిరుగుబాట్లు వచ్చాయి. బోస్నియా, హెర్జిగోవినా, బల్గేరియాలు తిరుగుబాటు చేసి స్వతంత్రమైనవి.

1909లో సైన్యం మరో తిరుగుబాటు చేసి సుల్తాన్ అబ్దుల్ హమీద్‌ను పదవీచ్యుతిని చేసి, కమల్ పాషా స్థానంలో మరో విప్లవ ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. 1909-1918 సంవత్సరాల మధ్య కాలంలో ఆటోమన్ తురుష్క సామ్రాజ్యాన్ని 'యంగ్‌టర్క్' సైనిక నియంతృత్వాధికారంలో పాలించబడింది. ఎన్వర్ బే నాయకత్వంలో వారు తురుష్క భాషను, తురుష్క విధానాలను రాజ్యమంతటా నిర్బంధంగా ప్రవేశపెట్టారు. సామ్రాజ్యాన్ని 'తురుష్కమయం' చేయడాన్ని తరుష్కేతర ముస్లిం, క్రైస్తవులు వ్యతిరేకించారు. ప్రభుత్వ దమనీతి పెరిగినకొద్దీ తిరుగుబాట్లు ఉధృతమైనవి. టర్కీపై ఇటలీ యుద్ధం ప్రకటించింది. బాల్కన్ రాజ్యాలన్నీ సమాఖ్యగా ఏర్పడి టర్కీపై యుద్ధం ప్రకటించాయి. టర్కీ ప్రభుత్వం దేశాన్ని రక్షించుకోవడానికి వీరోచిత చర్యలను ప్రకటించింది. కమల్ పాషా తిరిగి ప్రధాని అయ్యాడు. టర్కీ సైన్యం సమాయత్తం చేయబడింది. బాల్కన్‌లపై శ్రద్ధ కేంద్రీకరించడానికిగాను టర్కీ 1912 డిశంబర్‌లో ఇటలీతో లూసేన్ సంధి చేసుకొన్నది. ఈ సంధి ననుసరించి ఇటలీకి ట్రిపోలి,

సెరనీకా ప్రాంతాలు లభించాయి. అంతేగాక ఏజియన్ ద్వీపాలను ఆక్రమించుకొని, పరిపాలించే అధికారం కూడా ఇటలీకి ఇవ్వబడింది.

బాల్కన్ కూటమి 1912 అక్టోబర్‌లో టర్కీ మీద యుద్ధం ప్రకటించింది. ఇదే మొదటి బాల్కన్ యుద్ధం. ఈ యుద్ధంలో టర్కీ పరాజయం చెందింది. టర్కీ సామ్రాజ్యానికి కాన్‌స్టాంటినోపిల్ తప్ప ఐరోపాలో ఏమీ మిగలలేదు. ఈ సమయంలో పెద్ద రాజ్యాలు జోక్యం చేసుకొని లండన్‌లో శాంతి సంభాషణలకు టర్కీని పిలిచాయి. 1913 మేలో లండన్ సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం టర్కీ ఐరోపాలోని తన భూభాగాన్నంతా వదులుకొన్నది. కాన్‌స్టాంటినోపుల్, దాని చుట్టు ప్రక్కల కొంత ప్రాంతం మాత్రమే టర్కీకి మిగిలింది. ఆల్బేనియా అనే కొత్త రాజ్యం ఏర్పడింది. లండన్ సంధి జరిగిన వెంటనే భూభాగాల పంపిణీ విషయంలో బాల్కన్ రాజ్యాల మధ్య కలత లేర్పడ్డాయి. బల్గేరియాకు వ్యతిరేకంగా మిగతా బాల్కన్ రాజ్యాలు ఒక కూటమిగా ఏర్పడి 1913 జూన్‌లో బల్గేరియాపై యుద్ధాన్ని ప్రకటించింది. దీనినే రెండో బాల్కన్ యుద్ధం అంటారు. ఈ యుద్ధంలో బల్గేరియా ఓడి బుఖారెస్ట్ సంధి కంగీకరించింది. ఈ రెండు బాల్కన్ యుద్ధాలు తూర్పు సమస్యను పరిష్కరించలేకపోయాయి. అందువల్ల ఈ ప్రాంతంలోనే మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది.

## 16.3 మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీ :

మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీ జర్మనీ, ఆస్ట్రియాల పక్షం వహించింది. టర్కీ సైన్యానికి జర్మన్ సేనానులు తర్ఫీదు ఇచ్చారు. టర్కీ ప్రభుత్వ అనుమతితో రెండు జర్మన్ యుద్ధనౌకలు బాస్ఫరస్‌లో ప్రవేశించి రష్యన్ రేవులను ధ్వంసం చేశాయి. ఈ సంఘటనతో టర్కీపై రష్యా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు యుద్ధం ప్రకటించాయి. ఈజిప్టును ఇంగ్లండ్ తన రక్షిత ప్రాంతంగా ప్రకటించింది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు సిరియా, మెసపొటోమియా, పాలస్తీనా, అరేబియాలను జయించాయి. కాని డార్డెనెల్స్, గల్లిపోలి ద్వీపకల్పాలను ఆక్రమించడానికి మిత్రరాజ్యాలు చేసిన ప్రయత్నం విఫలమైంది.

## 16.4 సెవెర్స్ సంధి :

మొదటి ప్రపంచ యుద్ధంలో విజేతలైన మిత్రరాజ్యాలు 1920 ఆగస్టు 20న టర్కీపై సెవెర్స్ సంధిని బలవంతంగా రుద్దాయి. ఈ సంధి వల్ల టర్కీ సామ్రాజ్యం చిన్నాభిన్నమైపోయింది. ఈ సంధి ప్రకారం :

1) కాన్‌స్టాంటినోపుల్ నగరాన్ని తాత్కాలికంగా అంతర్జాతీయ పర్యవేక్షణ కింద ఉంచినారు.
2) ఎడ్రియనోపుల్, థ్రేస్, గాలిపోలి, ఆసియా మైనర్‌లు గ్రీస్ దేశానికి చెందాయి.
3) స్మిర్నాలో గ్రీస్ సైన్యాలను ఉంచడానికి అనుమతించడం జరిగింది.
4) టర్కీకి చెందిన ఆర్మీనియాను ప్రత్యేక రాజ్యంగా ఏర్పరచడం జరిగింది.
5) నల్ల సముద్రం, డార్డినెల్స్ జలసంధులను తటస్థ ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది.
6) మెసపొటేమియా, పాలస్తీనాలను బ్రిటన్‌కు ఆదిష్ట ప్రాంతాలుగా ఇవ్వడం జరిగింది.
7) సిరియా, లెబనాన్‌లను ఫ్రాన్స్‌కు ఆదిష్ట ప్రాంతాలుగా ఇవ్వడం జరిగింది.
8) టర్కీ సైనికబలాన్ని 50 వేలకు తగ్గించడమైంది.
9) టర్కీ వైమానిక దళాన్నంతటినీ మిత్రమండలి దేశాలు వశపరచుకొన్నాయి.
10) టర్కీ మిత్రమండలి దేశాలకు అపారమైన నష్టపరిహారాన్ని చెల్లించవలసి వచ్చింది.

కఠిన షరతులతో కూడిన సెవెర్స్ సంధిని టర్కీ సుల్తాన్ ఆరో మహమ్మద్ అంగీకరించడం యువటర్క్‌లకు కోపకారణమైనది. ఇట్టి దశలో టర్కీ జాతీయ గౌరవాన్ని నిలిపి అభ్యున్నతి సాధింపగల నాయకుడు రాజకీయ రంగంలో ప్రత్యక్షమైనాడు. అతడే ముస్తఫాకెమాల్‌పాషా.

## 16.5 ముస్తఫా కెమాల్ పాషా (1880 - 1938) :

ముస్తఫా కెమాల్ పాషా తురుష్కుల జాతి గౌరవం కాపాడి, విదేశీయులను పారద్రోలి, ప్రజాజీవితాన్ని మార్చివేశాడు. సాంఘిక, ఆర్థిక రంగాలలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టినాడు. అందువల్ల టర్కీ ప్రజలు ఇతనిని 'అటాటర్క్' (టర్కీ జాతిపిత) అని పిలుస్తారు.

### 16.5.1 తొలి జీవితం :

ముస్తఫా 1880లో సలోనికా పట్టణంలో ఒక రైతు కుటుంబంలో జన్మించాడు. చిన్ననాటినుండి గణితశాస్త్రంలో అసాధారణ ప్రావీణ్యాము గడించి ఉపాధ్యాయులచే కెమాల్ (పరిపూర్ణుడు) అనే బిరుదు పొందాడు. కాన్‌స్టాంటినోపిల్ సైనిక ఉపాధ్యాయులచే విధ్యాభ్యాసం చేశాడు. ఉత్తమ సైనికునిగా రూపొందాడు. ఫ్రెంచి విప్లవ సాహిత్యాన్ని అధ్యయనం చేసి ప్రభావితుడై టర్కీలోని నిరంకుశ ప్రభుత్వానికి బద్ధవిరోధిగా మారినాడు. 1908లోని యంగ్ టర్క్ ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించాడు. 1910లో ముస్తఫా ఫ్రాన్స్ దేశాన్ని సందర్శించి అక్కడి సైనిక శిక్షణ పద్ధతులను ఆకళింపు చేసుకొన్నాడు. అక్కడ ప్రజల స్వేచ్ఛాజీవితాన్ని, వారి నాగరికతను, పద్ధతులను చూసి ఆశ్చర్యచకితుడై అటువంటి పాశ్చాత్య, సామాజిక వ్యవస్థను తన దేశంలో స్థాపించాలని కలలు గన్నాడు. తిరిగి టర్కీ చేరిన ముస్తఫా 1911-12లో జరిగిన యుద్ధాలలో పోరాడి సమర్థుడైన సైనికాధికారిగా పేరు పొందినాడు. మొదటి ప్రపంచయుద్ధంలో ప్రఖ్యాతమైన గాలిపోలి యుద్ధంలో మిత్రమండలి సేనలు పరాజయం పొందడానికి ముస్తఫా సామర్థ్యమే ప్రధాన కారణము. యుద్ధానంతరం సెవెల్స్ సంధికి వ్యతిరేకంగా ఉద్యమం నడిపినాడు.

### 16.5.2 టర్కీ రిపబ్లిక్ స్థాపన :

సెవెర్స్ సంధిని తిరస్కరించిన ముస్తఫా 'టర్కీ టర్కులకే' అనే నినాదంతో జాతీయ ప్రజాపక్షాన్ని ఏర్పాటు చేసినాడు. దేశభక్తులైన తురుష్కులందరినీ సమీకరించి సుల్తానుకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినాడు. 1920లో అంగోరా (అంకారా)లో పోటీ ప్రభుత్వాన్ని స్థాపించాడు. జాతీయ మహాసభ ముస్తఫాను అధ్యక్షునిగా ఎన్నుకొన్నది. అతడు జాతీయ సైన్యానికి సర్వ సైన్యాధ్యక్షుడైనాడు. ఇటలీ, సోవియట్ రష్యాలతో గల విభేదాలను సామరస్యంగా పరిష్కరించిన తరువాత ముస్తఫా గ్రీస్‌తో తీవ్రపోరాటం జరిపి ఆసియ మైనర్ నుండి గ్రీకులందరిని పారద్రోలాడు. కాన్‌స్టాంటినోపుల్‌ను, డార్డినెల్స్‌నూ టర్కీ సార్వభౌమత్వం క్రిందకు తెచ్చాడు. జాతీయ శాసనసభ సుల్తాన్ పదవిని రద్దు పరిచింది. సుల్తాన్ మహమ్మద్ దేశభ్రష్ఠుడైనాడు. 1923 అక్టోబరు 29న టర్కీ రిపబ్లిక్‌గా ప్రకటించబడింది. రిపబ్లిక్ తొలి అధ్యక్షునిగా ముస్తఫా కెమాల్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడినాడు.

### 16.5.3 లోజేన్ సంధి - 1923 :

గ్రీకులపై టర్కీ సాధించిన ఉజ్జ్వల విజయంతో మిత్రరాజ్యాలు తమ మనస్సు మార్చుకొని, సెవెర్స్ సంధిని మార్చడానికి స్విట్జర్లాండ్‌లోని లోజెన్ నగరంలో 1922 నవంబరులో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసినారు. ఈ సమావేశానికి బ్రిటన్, ఇటలీ, జపాన్, ఫ్రాన్స్, రష్యా, అమెరికా, గ్రీస్, రుమేనియా, యుగోస్లోవియా, టర్కీ దేశాల ప్రతినిధులు హాజరైనారు. ఈ రాజ్యాల చర్చల ఫలితంగా 1923 ఏప్రిల్ 24న లోజెన్ సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం

1. టర్కీకి థ్రేస్, ఎడ్రియానోవిల్‌లు తిరిగి సంక్రమించినాయి.
2. మెసపుటోమియా, సిరియా, పాలస్తీనా, అర్డియాల మీద టర్కీ ఆధిపత్యం పోయింది.
3. లిబియా, సూడాన్, ఈజిప్ట్‌ల మీద టర్కీ తన హక్కులన్నింటిని వదులుకొన్నది.
4. బ్రిటిష్‌వారి సైప్రస్ ఆక్రమణను టర్కీ గుర్తించింది.
5. టర్కీ భూభాగం నుంచి విదేశీ సేనలన్నీ వైదొలగవలె.
6. సెవెర్స్ సంధి టర్కీ సైన్యంమీద, నౌకా వైమానిక దళాల మీద విధించిన ఆంక్షలను తొలగించడం జరిగింది.
7. తన దేశంలోని అల్పసంఖ్యాక వర్గాల హక్కులను రక్షించడానికి టర్కీ హామీ ఇచ్చింది.
8. ఈ సంధి ఫలితంగా 764 లక్షల హెక్టార్‌ల వైశాల్యం ఉండి ఒక కోటి ముప్పై లక్షల మంది జనాభా ఉన్న నవటర్కీ ఆవిర్భవించింది.

### 16.5.4 నియంతగా ముస్తఫా :

నవటర్కీ సిద్ధాంతరీత్యా ప్రజాస్వామిక దేశం. దానికి లిఖిత రాజ్యాంగం ఉంది. ఉన్నతాధికారాలన్నీ జాతీయ శాసనసభవే. కాని ఆచరణలో ప్రభుత్వం ముస్తఫా యొక్క జాతీయ నియంతృత్వంలో వుండేది. ముస్తఫా నాయకత్వంలోని 'పీపుల్స్ పార్టీ' తప్ప మరొక రాజకీయ పక్షానికి అవకాశం లేదు. అసెంబ్లీ అతని ఆధీనంలో ఉండేది. సర్వసైన్యాధ్యక్షుడు అతడే. కాని అతని నియంతృత్వము హిట్లర్, ముసోలినీల నియంతృత్వం వంటిదికాదు. టర్కీ అభ్యున్నతి ఒక్కటే అతని లక్ష్యం. సైన్య సంపత్తిని పెంచి విదేశాలను ఆక్రమించడం అతని అభిమతం కాదు.

### 16.5.5 ముస్తఫా సంస్కరణలు :

టర్కీని అధునాతన దేశంగా నిర్మించవలెనని ముస్తఫా సంకల్పించాడు. ముస్తఫా కార్యక్రమము 'కెమాలిజమ్' అనే ఆరు సూత్రాలలో ఉన్నది. టర్కీ ప్రజాపక్షంవారి అరుణ పతాకం మీద విలసిల్లిన ఆరు తెల్లని బాణాలు ఈ ఆరు సూత్రాలకు చిహ్నాలు. అవి 1) రిపబ్లిక్ వాదము - రాచరికాన్ని నిర్మూలించి టర్కీని రిపబ్లిక్‌గా ప్రకటించారు. 2) జాతీయవాదము - ప్రతి టర్క్ తురుష్క భాషనే అభ్యసించి టర్కీ జాతీయతను పెంపొందించే విద్యలను అభ్యసించాలి. 3) ప్రజాధికారవాదం - రాజ్యంలో ప్రజలదే సార్వభౌమాధికారం. 4) ఇటేటిజమ్ - దేశంలో ఆర్థిక ప్రగతిని సాధించడానికి రవాణా, గనులు, ప్రజోపయోగకరమైన సంస్థలు, పరిశ్రమల మీద ప్రభుత్వానికి యాజమాన్యము ఉండవలె. 5) లౌకికవాదము - టర్కీని మత ప్రమేయం లేని లౌకికరాజ్యంగా రూపొందించవలె. 6) విప్లవవాదము - టర్కీ త్వరితగతిని ప్రగతిని సాధించడానికి జాతీయ పక్షము విప్లవాత్మకమైన చర్యలను చేపట్టవలె.

#### 16.5.5.1 రాజకీయ సంస్కరణలు :

ముస్తఫా జాతీయవాదానికి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చినాడు. దేశంలోని ప్రతిపక్షులను నిర్దాక్షిణ్యంగా అణచివేసినాడు. సుల్తాన్ ఆరో మహమ్మద్‌ను పదవీచ్యుతిని చేసి, రాచరికాన్ని నిర్మూలించాడు. టర్కీ రిపబ్లిక్‌గా మారింది. జాతీయ ప్రజాపక్షమొక్కటే ఏకైక రాజకీయపక్షము. ప్రతి నాలుగేండ్లకు ఎన్నికలు జరిగేవి. రిపబ్లిక్ అధ్యక్షునిగా ముస్తఫా వరసగా నాలుగు పర్యాయాలు ఎన్నికైనాడు. తన సంస్కరణలు విజయవంతం కావడానికి ముస్తఫా సర్వాధికారాలను హస్తగతం చేసుకొన్నాడు. టర్కీ ప్రగతి కోసమే ముస్తఫా తన అధికారాలను వినియోగించాడు.

### 16.5.5.2 మత సంస్కరణలు :

టర్కీలో ముస్తఫా లౌకిక రాజ్యాంగ వ్యవస్థను స్థాపించదలచి సుల్తానును పదవీచ్యుతుని చేయడమేగాక, ఖలీఫా పదవిని రద్దుచేసినాడు. ఖలీఫా రెండో అబ్దుల్ మజీద్‌ను దేశం నుంచి బహిష్కరించాడు. అంతేగాక ఖలీఫా కుటుంబానికి చెందిన వారందరినీ దేశం నుంచి బహిష్కరించాడు. ప్రభుత్వం మత సంస్థలకిచ్చే ధన సహాయాన్ని నిలుపుచేసినాడు. మత విద్యా సంస్థలన్నీ ప్రభుత్వపరమైనాయి. 1928లో రాజ్యాంగ సవరణ ఫలితంగా టర్కీ లౌకిక రాజ్యంగా రూపొందింది. మసీదులలో ప్రవేశించే ముందు పాదరక్షలు విడువనవసరం లేదని, మసీదులలో సంగీతానికి నిషేధం లేదని ముస్తఫా ఆదేశించాడు. ఈ మత సంస్కరణల వల్ల సనాతనులు తిరుగుబాటు చేయగా వారిని నిర్దాక్షిణ్యంగా అణిచివేసినాడు.

### 16.5.5.3 విద్యా సంస్కరణలు :

ముస్తఫా టర్కీ ప్రజలలో దేశభక్తిని రేకెత్తించడానికి విస్తృత విద్యా కార్యక్రమాన్ని చేపట్టినాడు. ప్రతి నగరంలో ఒక ప్రభుత్వ విద్యాలయాన్ని నెలకొల్పినాడు. వయోజనుల కోసం గ్రంథాలయాలను, రేడియో కేంద్రాలను స్థాపించాడు. పాఠశాలల్లో మత సంబంధమైన బోధనలను నిషేధించినాడు. 7-16 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న బాలబాలికలకు నిర్బంధ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టినాడు. పౌర హక్కులను అక్షరాస్యులకే పరిమితం చేసినారు. పరిశ్రమలను, వర్తక వాణిజ్యాలను అభివృద్ధి పరచడానికి సాంకేతిక విద్యాలయాలను ఏర్పాటు చేసినారు. వ్యాయామ క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం లభించింది. ఈ విద్యాలయాలన్నిటిలో ముస్తఫా ఒకేవిధమైన జాతీయ పాఠ్య గ్రంథాలను ప్రవేశపెట్టినాడు. అరబిక్ అక్షరాలను విడిచిపెట్టవలెనని, లాటిన్ అక్షరాలను మాత్రమే ఉపయోగించాలని ముస్తఫా శాసించినాడు. అరబిక్, పారశీక్ పదాలు లేకుండా 24 వేల టర్కీ మాటలు మాత్రమే ఉన్న నిఘంటువును రూపొందించినారు. యూరప్‌లో అమలులో ఉన్న గ్రెగేరియన్ కాలెండర్‌ను, 24 గంటల గడియారాన్ని ఉపయోగించవలెనని ముస్తఫా టర్కీ ప్రజలను ఆదేశించినాడు. యూరప్‌లోని సంఖ్యా పద్ధతిని, దశాంశ పద్ధతిని టర్కీలో అమలుపరచినాడు. ఈ విద్యా సంస్కరణల వల్ల టర్కీ ప్రజలు తమకు ఉజ్వల భవిష్యత్తు ఉందని గాఢంగా నమ్మినారు.

### 16.5.5.4 సాంఘిక సంస్కరణలు :

పాశ్చాత్య సంస్కృతి, నాగరికత వల్ల అమితంగా ప్రభావితుడైన ముస్తఫా టర్కుల మత చిహ్నాలైన ఫెజ్ టోపీలను, తలపాగాలను ధరించడం నిషేధించినాడు. శుక్రవారానికి బదులు ఆదివారము సెలవు దినమయింది. టర్కీలోని కుటుంబాలన్నీ ఇంటిపేర్లను ధరించాలని, వాటిని ప్రభుత్వ రికార్డులలో నమోదు చేయాలని ముస్తఫా శాసించాడు. శాసనసభ తనకు గౌరవపూర్వకంగా ఇచ్చిన 'అటాటర్క్' (టర్కుల తండ్రి) బిరుదాన్ని తన ఇంటి పేరుగా స్వీకరించాడు. ముస్తఫా 1925లో బహు భార్యాత్వాన్ని నిషేధించినాడు. వివాహాలన్నీ ప్రభుత్వ కార్యాలయాలలో నమోదు కావలె. భార్యాభర్తలకు విడాకులిచ్చే అధికారం అధ్యక్షునికే ఉండేది. ముస్తఫా తన సతీమణి లతీఫె-హనూమ్‌కు విడాకులిచ్చాడు. 1926లో పౌరవివాహాలు మాత్రమే జరగాలని ముస్తఫా శాసించాడు. వివాహానికి వయఃపరిమితి పురుషులకు 18 సంవత్సరాలు, స్త్రీలకు 17 సంవత్సరాలుగా నిర్ణయించినాడు. టర్కీ వనితల ఘోషా పద్ధతిని నిరుత్సాహపరచినాడు. వారు పాశ్చాత్య స్త్రీల వలె వస్త్రధారణ చేయవచ్చు. ముస్తఫా మహిళా విశ్వవిద్యాలయాలను స్థాపించాడు. మహిళా సమాజాలు, క్లబ్బులు ఏర్పడినాయి. మహిళా విద్య వల్ల కొందరు టర్కీ స్త్రీలు విశ్వవిద్యాలయం ఆచార్యులుగా, సహాయ న్యాయమూర్తులుగా నియమితులయినారు. 1934లో స్త్రీలకు రాజకీయ హక్కులను ప్రసాదించినారు. అందువల్ల వారికి ఓటువేసే హక్కే కాక ఎన్నికలలో పోటీచేసే హక్కు లభించింది. 1935లో ఏర్పడిన జాతీయ సభలో 17మంది స్త్రీలకు ప్రాతినిధ్యం లభించింది.

### 16.5.5.5 న్యాయ సంస్కరణలు :

ముస్తఫా న్యాయచట్టాలను ఆధునికం చేశాడు. కొరాన్ ప్రాతిపదికగా గల చట్టాలను రద్దుపరిచాడు. స్విస్ పౌరస్మృతి, ఇటాలియన్ శిక్షా స్మృతి, జర్మన్ వాణిజ్య స్మృతి నమూనాలుగా గ్రహించబడ్డాయి. 1926లో సివిల్, క్రిమినల్, కమర్షియల్, న్యాయ స్మృతులను ఆమోదించినారు. 32 న్యాయమూర్తులతో సుప్రీం కోర్టును, 700 ఇతర కోర్టులను దేశంలో స్థాపించడం జరిగింది. న్యాయ వ్యవస్థలో మార్పులు జరపడం వల్ల ప్రతి పౌరునికి న్యాయస్థానంలో సమాన హక్కులు లభించాయి.

### 16.5.5.6 ఆర్థిక సంస్కరణలు :

తన దేశంలోని పెట్టుబడి, ఉత్పత్తి, యాజమాన్యము, కార్మికులు అంతా టర్క్‌ల ఆధీనంలోనే ఉండాలని భావించిన ముస్తఫా ఉద్యోగాలన్నీ టర్కీ పౌరులకు మాత్రమే కేటాయించాడు. విదేశీయులను వృత్తుల నుంచి, వర్తక వ్యాపారాల నుంచి తొలగించడం జరిగింది.

ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి అన్ని విధాలుగా సహాయం అందజేసింది. వ్యవసాయదారులకు ఉచితంగా పశువులను, వ్యవసాయ పనిముట్లను అందజేసింది. అర్హత ఉన్న రైతు కుటుంబాలకు గృహాలను ప్రభుత్వం నిర్మించి ఇచ్చింది. ముస్తఫా తన ట్రాక్టర్‌ను తానే నడుపుకొని, ఆదర్శవంతుడైన కర్షకునిగా ఇతర రైతులకు మార్గదర్శకుడైనాడు. దేశంలో ముస్తఫా నిర్బంధ సైనిక శాసనాన్ని అమలుపరిచినాడు. కాని రైతులకు మాత్రం 18 నెలలు నిర్బంధ సైనిక సేవను పరిమితం చేశాడు. దీనివల్ల ముస్తఫా రైతుల ఆదరాభిమానాలకు పాత్రుడైనాడు.

ముస్తఫా టర్కీ దేశ ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాడు. వ్యవసాయాభివృద్ధికి చతుర్వర్ష ప్రణాళికను, పారిశ్రామికాభివృద్ధికి పంచవర్ష ప్రణాళికను, ఖనిజాభివృద్ధికి త్రివర్ష ప్రణాళికను, రహదారుల నిర్మాణానికి దశవర్ష ప్రణాళికను ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రణాళికా నిర్వహణలో తోడ్పడటానికి ముస్తఫా స్వీడన్ నుంచి ఇంజనీర్లను రప్పించినాడు. ఈ ప్రణాళికలకయ్యే ఖర్చుకు ముస్తఫా విదేశీ సహాయం మీద ఎక్కువగా ఆధారపడలేదు. అందువల్ల విదేశీయులకు ఎవ్వరికీ టర్కీ ఆర్థిక వ్యవస్థ మీద అజమాయిషీ లేకుండా పోయింది.

ఈ ప్రణాళికలు విజయవంతంగా పూర్తయ్యే నాటికి టర్కీలో రైలు మార్గాల విస్తరణ జరిగింది. నౌకాశ్రయాలను అభివృద్ధిపరచడం జరిగింది. నీటిపారుదల, జలవిద్యుత్ పథకాలు అమలు జరిపినారు. బొగ్గు, రాగి, చమురు గనుల నుంచి ఉత్పత్తి పెరిగింది.

### 16.5.5.7 ఇతర సంస్కరణలు :

ముస్తఫా టర్కీలోని కొన్ని నగరాల పేర్లను మార్పించినాడు. రాజధాని అయిన అంగోరా అంకారాగాను, కాన్‌స్టాంటినోపుల్‌ను ఇస్తాంబుల్‌గాను, స్మర్నాను ఇజ్మీర్‌గాను మార్పించినాడు. ఈ నగరాలు సినిమా హాలులు, వినోద విలాస భవనాలు, పార్కులు మొదలైన అత్యంతాధునిక సౌకర్యాలతో కూడి పాశ్చాత్య నగరాలవలె విలసిల్లినాయి. విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ ఉత్పత్తులను ముస్తఫా ప్రోత్సహించినాడు. ప్రజారోగ్య, సాంఘిక సంక్షేమ కార్యక్రమాల పట్ల టర్కీ ప్రజల జీవన ప్రమాణం పెరిగింది.

టర్కీ దేశము అన్ని రంగాలలోను అభివృద్ధి పొందడానికి గొప్ప కృషి చేసిన టర్కీ జాతిపిత ముస్తఫా కెమల్ పాషా 1938లో మరణించాడు. ముస్తఫా మరణానంతరం 1925 నుండి ప్రధానిగా వ్యవహరిస్తున్న ఇస్మత్‌ఇనోను టర్కీ రిపబ్లిక్‌కు అధ్యక్షుడైనాడు.

### 16.5.6 విదేశాంగ విధానము :

మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన రాజ్యాలలో టర్కీ ఒక్కటే ఆ యుద్ధం తరవాత జరిగిన సెవెర్స్ సంధిని తిరగతోడి మిత్రరాజ్యాలతో కొత్తగా లోజేన్ సంధి చేసుకొన్నది. ఈ లోజేన్ సంధి ముస్తఫా విదేశాంగ విధానానికి తొలి గొప్ప విజయము. కాని లోజేన్ సంధి టర్కీకి సంబంధించిన కొన్ని ప్రధాన సమస్యలను పరిష్కరించలేదు. అవి. 1) టర్కీ, ఇరాక్ దేశాలకు మధ్య గల సరిహద్దు తగాదా 2) డార్డినెల్స్ జలసంధి సమస్య 3) అలెగ్జాండ్రిట్టా సమస్య 4) గ్రీస్‌తో జనాభా మార్పిడి విషయంలో వివాదం.

జాతీయ ప్రయోజనాల దృష్టితో పై సమస్యలన్నింటినీ పరిష్కరించడమే టర్కీ విదేశాంగ విధాన ప్రధాన లక్ష్యం. తన దేశం ఆంతరంగికంగా అభివృద్ధి చెందడానికి శాంతినే వాంఛించిన ముస్తఫా టర్కీకి సరిహద్దు సమస్యలు లేకుండా చేయాలనుకొన్నాడు. టర్కీ విదేశాంగ విధానంలోని ముఖ్యాంశాలు : 1) టర్కీ దేశ రాజకీయ భద్రతను కాపాడటం 2) పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా రష్యాతో మైత్రి చేసుకోవడం 3) మధ్య ప్రాచ్య దేశాలతో స్నేహబంధాలు పెంపొందించడం 4) బాల్కన్ ప్రాంతంలో ఇటలీ దురాక్రమణకు అరికట్టడం.

#### 16.5.6.1 టర్కీ-రష్యాల మధ్య సంబంధాలు :

టర్కీ, రష్యాలకు పాశ్చాత్యదేశాల పట్ల గల అపనమ్మకం, విరోధ భావం ఆ రెంటిని దగ్గరకు చేర్చాయి. లోజేన్ సమావేశంలో టర్కీని రష్యా సమర్థించింది. 1922-23 నుంచి రెండు దేశాలు దౌత్యసంబంధాలు ఏర్పరచుకొన్నాయి. మోసుల్ విషయంలో టర్కీకి, బ్రిటన్‌కు తగాదా ఏర్పడినప్పుడు టర్కీ, రష్యాల మధ్య మైత్రిసంధి ఏర్పడింది. ఈ సంధి వల్ల రెండు రాజ్యాలు ఒక దానితో ఒకటి యుద్ధాలు చేసుకోకుండాను, తమమీద దురాక్రమణ జరిపినప్పుడు పరస్పరం సహాయం చేసుకోవడానికి అంగీకరించినాయి. మాంట్రే ఒడంబడికలో రష్యా టర్కీని సమర్థించింది. 1939లో రష్యా, జర్మనీల మధ్య కుదిరిన దురాక్రమణ వ్యతిరేక ఒడంబడిక వల్ల టర్కీ ఆందోళన చెందింది. బాల్కన్ ప్రాంతంలో తుల్య ప్రాబల్య విధానాన్ని కొనసాగించడానికి, టర్కీ రష్యాతో కొత్తసంధి నొకదానిని ప్రతిపాదించగా రష్యా దానిని తోసిపుచ్చింది. దీనితో రష్యా మీద అపోహలు ఏర్పడి టర్కీ పాశ్చాత్య దేశాల వైపు మొగ్గింది. 1941లో రష్యా మీద జర్మనీ దండెత్తినపుడు టర్కీ తటస్థంగా ఉండిపోయింది. చివరకు రష్యా, టర్కీల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిని, రష్యా తనంతటతానే టర్కీ, రష్యాల మధ్య మైత్రి సంధిని రద్దు చేసుకొన్నది. రెండో ప్రపంచ యుద్ధపు చివరిదశలో టర్కీ మిత్రరాజ్యాల వైపు చేరింది.

#### 16.5.6.2 టర్కీ- బ్రిటన్‌ల మధ్య సంబంధాలు, మోసుల్ వివాదం :

మోసుల్ విషయంలో ఏర్పడిన తగాదా మూలంగా టర్కీ, బ్రిటన్‌ల మధ్య సంబంధాలు క్షీణించినాయి. 1926లో తగాదా పరిష్కారమైంది. మోసుల్‌లోని చమురు గనుల నుంచి వచ్చే రాబడిలో 10% టర్కీకి ఇవ్వడానికి బ్రిటన్ అంగీకరించడంతో, టర్కీ మోసుల్ మీద తనకుగల హక్కులను వదులుకొన్నది.

#### 16.5.6.3 టర్కీ-ఫ్రాన్స్‌ల మధ్య సంబంధాలు - అలెగ్జాండ్రెట్టా సమస్య :

ఫ్రాన్స్ 1936లో సిరియా, అలెగ్జాండ్రెట్టాల స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. 1932లో నానాజాతి సమితిలో చేరిన టర్కీ దీనికి సమితిలో తీవ్రంగా అభ్యంతరం తెలిపింది. 1937లో అలెగ్జాండ్రెట్టాలోని టర్కుల పరిరక్షణకు సమితి వాగ్దానం చేసింది. 1938లో ఫ్రాన్స్, టర్కీల మధ్య ఒడంబడిక కుదిరింది. దీని ప్రకారం సాధారణ ఎన్నికలు జరిగేటంతవరకు టర్కీ, ఫ్రాన్స్‌లు

అలెగ్జాండ్రెట్టాను సంయుక్తంగా పరిపాలించడానికి అంగీకరించాయి. తరువాత జరిగిన సాధారణ ఎన్నికలలో అలెగ్జాండ్రెట్టాలోని టర్కీ అనుకూలురు విజయం సాధించారు. అలెగ్జాండ్రెట్టా శాసనసభ టర్కీలో విలీనం కావడానికి తీర్మానించింది. దీని ప్రకారం హటే రిపబ్లిక్ ఏర్పడింది.

### 16.5.6.4 మాంట్రే ఒడంబడిక :

లోజేన్ సంధి ప్రకారం డార్డినెల్స్ జలసంధి కిరువైపుల టర్కీ రక్షణ స్థావరాలను నిర్మించడానికి వీలు లేదు. ఇథియోపియా మీద ఇటలీ దురాక్రమణ చేయడంతో డార్డినెల్స్ జలసంధి విషయంలో లాజేన్ సంధిని మార్పుచేయడానికి టర్కీ ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా 1836లో ఇంగ్లాండ్, రష్యా, ఫ్రాన్స్, గ్రీస్, జపాన్, బల్గేరియా, రుమేనియా, యుగోస్లావియాలు మాంట్రే వద్ద సమావేశమై ఒక ఒడంబడిక కుదుర్చుకొన్నాయి. దీని ప్రకారం టర్కీ డార్డినెల్స్ మీద రక్షణ స్థావరాలను నిర్మించుకోవడానికి అనుమతి పొందింది. అంతేగాక నల్లసముద్రతీర దేశాలు తప్ప మిగిలిన దేశాల యుద్ధ నౌకల మీద ఆంక్షలను విధించడానికి టర్కీకి హక్కు లభించింది. ఈ మాంట్రే ఒడంబడిక టర్కీ విదేశాంగ విధానానికి మరో విజయం.

### 16.5.6.5 టర్కీ - ఇటలీల మధ్య సంబంధాలు :

టర్కీ - ఇటలీల మధ్య సహజ సంబంధాలు లేవు. అనటోలియా మీద ఇటలీ హక్కు విషయమై టర్కీ ఎల్లప్పుడూ జాగరూకతతో ఉండేది. ముస్సోలినీ అధికారంలోకి వచ్చేవరకు టర్కీ, ఇటలీల మధ్య మైత్రి సంబంధాలు కొనసాగినాయి. 1928లో రెండు దేశాలు తటస్థ సంధిని చేసుకొన్నాయి. కాని మధ్యధరా సముద్ర ప్రాంతంలోను, ఇథియోపియాలోను ఇటలీ అవలంబించిన దురాక్రమణ విధానం టర్కీకి అనిష్టమై, టర్కీ నానాజాతిసమితిలో దీనికి నిరసన తెలిపింది. రోమ్-బెర్లిన్ అక్షము టర్కీకి భయసందేహాలను కలుగజేసింది.

### 16.5.6.6 టర్కీ-జర్మనీల మధ్య సంబంధాలు :

1919 నుంచి 1944 వరకు టర్కీ, జర్మనీల మధ్య సహజ సంబంధాలు నెలకొని ఉన్నాయి. కాని జర్మనీ దురాక్రమణ నుండి రక్షణకు 1939 లో టర్కీ బ్రిటన్, ఫ్రాన్స్‌లతో మైత్రి సంధిని చేసుకొన్నది. 1941లో ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లకు వ్యతిరేకంగా టర్కీ సహాయం పొందడానికి హిట్లర్ ప్రయత్నించినాడు. 1941 జూన్‌లో టర్కీ, జర్మనీల మధ్య పదేండ్ల దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం జరిగింది. 1943లో హిట్లర్ పరాజయం పొందుతున్నప్పుడు టర్కీ జర్మనీతో దౌత్య సంబంధాలను తెంచుకొని, దానిమీద యుద్ధాన్ని ప్రకటించింది.

### 16.5.6.7 టర్కీ - మధ్య ప్రాచ్యదేశాలు :

మధ్యప్రాచ్య దేశాలైన ఇరాక్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్‌లతో టర్కీ మైత్రి సంబంధాలను పెంపొందించుకొన్నది. 1926లో టర్కీ, ఇరాన్‌లు మైత్రి సంధిని చేసుకొన్నాయి. 1933లో ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఇరాన్‌లు టర్కీతో సాదాబాద్ ఒడంబడికను చేసుకొన్నాయి. ఈవిధంగానే హంగరీ, ఆస్ట్రియా, యుగొస్లావియా, రుమేనియాలతో కూడా టర్కీ మైత్రి సంధులను పెంపొందించుకొన్నది.

### 16.5.7 ఘనత :

ముస్తఫా కెమాల్ పాషా ఆధునిక టర్కీ నిర్మాతగా చరిత్ర ప్రసిద్ధుడైనాడు. ఇతడు పదిహేను సంవత్సరాల పాటు నియంతగా టర్కీని పాలించారు. కాని తన అధికారాలను టర్కీ దేశాభివృద్ధినే వినియోగించాడు. హిట్లర్ నియంతృత్వం స్వేచ్ఛా

ప్రజలను బానిసలుగా మార్చగా కెమాల్ నియంతృత్వం బానిస ప్రజలను స్వేచ్ఛా ప్రజలుగా మార్చినదని ఎరుస్టు జాక్ శ్లాఘించాడు. వ్యవసాయ, పరిశ్రమల అభివృద్ధికి ముస్తఫా గొప్ప కృషి చేశాడు. సాంఘిక, మత రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాడు. అన్ని రాజ్యాలతో సత్సంబంధాలు ఏర్పరచుకొన్నాడు. టర్కీని ఒక పటిష్ట రాజ్యంగా రూపొందించాడు.

## 16.6 నమూనా ప్రశ్నలు :

1) యంగ్ టర్క్ ఉద్యమాన్ని గురించి వివరించుము.
2) ముస్తఫా కెమాల్ పాషాను ఆధునిక టర్కీ పితగా ఎందుకు పిలుస్తారు ?
3) ఎన్వర్ బే

## 16.7 చదువదగిన గ్రంథాలు :


1. C.J.A.H. Hayes - Modern Europe since 1870
2. C.D. Hazan - Modern Europe upto 1945
3. D. Thamson - Europe since Napoleon
4. H.L. Peacock - Modern European History 1789-1973
5. G.P. Gooch - History of Modern Europe 1878-1945
6. J.A.R. Marriott - A History of Europe 1815-1939


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 17

# ఫాసిజమ్ - నాజీయిజమ్

# 17.1 ఇటలీలో ఫాసిజమ్ - ముస్సోలిని

## 17.1.0 లక్ష్యం :

ఇటలీలో ఫాసిజమ్ అవతరించుటకు దారితీసిన పరిస్థితులు, ఫాసిస్ట్ సిద్ధాంతాలు, ముస్సోలినీ ఆంతరంగిక, విదేశాంగ విధానాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశాలు :**


**17.1.1** పరిచయం

**17.1.2** ఇటలీలో ఫాసిజమ్ అవతరించుటకు కారణాలు

- **17.1.2.1** ఆర్థిక సంక్షోభం
- **17.1.2.1** రాజకీయ సంక్షోభం
- **17.1.2.3** మొదటి ప్రపంచయుద్ధ ప్రభావం
- **17.1.2.4** పారిస్ శాంతిసంధులు
- **17.1.2.5** సోషలిస్ట్ ఉద్యమాలు
- **17.1.2.6** రాజకీయ పార్టీల విభేదాలు
- **17.1.2.7** రచయితల రచనలు
- **17.1.2.8** జాతీయవాదుల కృషి

**17.1.3** ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలు

- **17.1.3.1** వ్యక్తిశ్రేయోవాదానికి వ్యతిరేకము
- **17.1.3.2** ప్రజాసామ్యానికి వ్యతిరేకము
- **17.1.3.3** సామ్యవాదానికి వ్యతిరేకము
- **17.1.3.4** శాంతివాదానికి వ్యతిరేకము
- **17.1.3.5** కార్పోరేట్ రాజ్యము

**17.1.4** ముస్సోలినీ - ఫాసిస్ట్ ప్రభుత్వపాలన

- **17.1.4.1** ముస్సోలినీ తొలిజీవితం
- **17.1.4.2** ఫాసిస్ట్ పార్టీ స్థాపన
- **17.1.4.3** ఫాసిస్ట్ విప్లవ వ్యాప్తి
- **17.1.4.4** రోమ్ మీద ఫాసిస్ట్‌ల దాడి
- **17.1.4.5** నియంతృత్వ స్థాపన

**17.1.5** ముస్సోలినీ ఆంతరంగిక విధానము
**17.1.5.1** ఆర్థిక సంస్కరణలు
**17.1.5.2** విద్యా సంస్కరణలు
**17.1.5.3** సైనిక సంస్కరణలు
**17.1.5.4** పోప్‌తో ఒప్పందము
**17.1.6** ముస్సోలినీ విదేశాంగ విధానము
**17.1.6.1** ఇథియోపియో మీద దురాక్రమణ
**17.1.6.2** ఆల్బేనియా మీద దాడి
**17.1.6.3** స్పెయిన్ అంతర్యుద్ధంలో జోక్యము
**17.1.6.4** ఇటలీ, జర్మనీల మధ్య ఒడంబడిక
**17.1.6.5** రెండో ప్రపంచయుద్ధంలో పాల్గొనుట
**17.1.6.6** ముస్సోలినీ పతనం
**17.1.6.7** ఘనత
**17.1.7** నమూనా ప్రశ్నలు
**17.1.8** చదువదగిన గ్రంథాలు

## 17.1.1. పరిచయం :

మొదటి ప్రపంచయుద్ధానంతరం ఆనతికాలంలోనే యూరప్‌లో 'ఫాసిజమ్' అనే దుష్టశక్తి తలెత్తింది. ప్రజల అసంతృప్తిని ఆసరా చేసుకొని ఇది 'సునామి'లా త్వరగా వ్యాపించింది. అమానుష స్వభావంగల నియంతలు భిన్నాభిప్రాయాల ద్వారా కొన్ని దేశాలలో అధికారము హస్తగతం చేసుకొని మారణ హోమానికి తలపడ్డారు. ప్రథమంగా ముస్సోలినీ ఇటలీలో ఫాసిస్ట్ సిద్ధాంతాలతో ప్రభుత్వ స్థాపన చేశాడు. ఫాసిస్ట్ సిద్ధాంతమే వివిధ దేశాలలో వివిధ పేర్లతో పిలువబడింది. జర్మనీలో 'నాజీయిజమ్', స్పెయిన్‌లో 'ఫెలాంగ్' రుమేనియాలో 'ఐరన్‌గార్డ్' హంగేరీలో 'యూరోక్రాస్' మొదలగునవన్నీ ఫాసిజం ప్రతిరూపాలే. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాసమస్యలను పరిష్కరించడంలో దారుణ పరాజయం పాలుకాగా, ఈ నియంతలు అతి తక్కువకాలంలో దేశాభ్యున్నతిని సాధించగలిగారు. దుందుడుకు జాతీయవాదం, జాతి విచక్షణ, సైనికవాదము, సామ్రాజ్యవాదం, ఏకపార్టీ నియంతృత్వము ఫాసిజమ్ యొక్క ముఖ్యలక్షణాలు. ఫాసిజమ్ అపరిమిత ప్రభుత్వాధికారాన్ని ప్రబోధిస్తుంది.

## 17.1.2 ఇటలీలో ఫాసిజమ్ అవతరించడానికి కారణాలు :

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో వచ్చిన మార్పులలో అతి ముఖ్యమైనది ఇటలీలో ఫాసిజం అవతరించుట. దీని వ్యవస్థాపకుడు ముస్సోలినీ. కమ్యూనిస్ట్ ప్రభావంనుండి ఇటలీని రక్షించుటకు ఇతడు ఫాసిస్ట్ పార్టీని స్థాపించాడు.

### 17.1.2.1 ఆర్థిక సంక్షోభము :

మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం ఇటలీ ఆర్థికపరిస్థితి సంతృప్తికరంగా లేకపోయినా 1915లో మిత్రదేశాలతో కలసి రహస్య సంధి చేసుకొని యుద్ధంలో పాల్గొన్నది. యుద్ధానంతరం ఇటలీలోని పరిస్థితులు క్లిష్టంగా తయారైనాయి. ఇటాలియన్

కరెన్సీ విలువ 70%కి పడిపోయింది. నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోయింది. జీవనవ్యయం బాగా పెరిగినందువల్ల ప్రజలు దాదాపుగా కరువు పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. ఫలితంగా బోల్షివిక్ సిద్ధాంతాలచే ప్రభావితమైన విప్లవోద్యమం వచ్చే సూచనలేర్పడినాయి. యుద్ధానంతరం సైన్యం నుంచి చాలామంది సైనికులను తొలగించినందువల్ల నిరుద్యోగ సమస్య తీవ్రమైంది. విదేశాలతో ఇటలీ వర్తకం దెబ్బతిన్నది. దేశంలో ఏర్పడిన అరాచక పరిస్థితి కారణంగా విదేశీ పర్యాటకుల సంఖ్య తగ్గిపోయింది. ఫ్యాక్టరీలోను, తదితర పారిశ్రామిక సంస్థలలోను సమ్మెలు, లాకౌట్లు సర్వసామాన్యమైనాయి. ఫలితంగా దేశం పారిశ్రామికంగా చాలా దెబ్బతిన్నది. దక్షిణ ఇటలీలోని కర్షకులు విప్లవభావాలు ప్రభావానికి లోనై అలజడలు ప్రారంభించారు. నిత్యజీవితావసర వస్తువుల కొరత కారణంగా ధరలు విపరీతంగా పెరిగినాయి. కాని పెరిగిన ధరల కనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగలేదు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లోని ఇటాలియన్లు తమ ఇండ్లకు పంపే ధనం కూడా ఆయా ప్రభుత్వాలు చేసిన శాసనాల ఫలితంగా ఆగిపోయింది. అంతేగాక ఆ దేశాలు తమ దేశాలకు ఇటలీనుండి వలస రావడాన్ని నిరోధించే శాసనాలు చేయసాగాయి. ఈవిధంగా మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఇటలీ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థంగా తయారైంది.

## 17.1.2.2. రాజకీయ సంక్షోభం :

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఆర్థిక దుస్థితికి తోడు ఇటలీలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. అప్పటి ప్రభుత్వము దేశాన్ని యుద్ధానంతర క్లిష్టపరిస్థితుల నుంచి కాపాడలేకపోయింది. అధికారం కోసం వివిధ పార్టీలు పెనుగులాడుకోవటం, ఎన్నికలలో మితిమీరిన లంచగొండితనం, బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలు లేకపోవడం మొదలైన కారణాలవల్ల ఇటలీ రాజకీయాలలో సుస్థిరత లోపించి అశాంతి ఏర్పడింది. పార్లమెంటులోని వివిధ పార్టీల మధ్య సంఘర్షణల కారణంగా పరిపాలనా యంత్రాంగం సరిగా పనిచేయలేదు. తరచుగా మంత్రివర్గాలు మారుతున్నందువల్ల సంస్కరణలను ప్రవేశపెట్టడం దుర్లభమైంది. దేశంలో రాజకీయ అశాంతి, పరిపాలనా యంత్రాంగంలో అసమర్థత, లంచగొండితనం ఎక్కువైనందువల్ల పార్లమెంటరీ ప్రభుత్వంలో ప్రజలకు నమ్మకం లేకుండాపోయింది. యుద్ధానంతరం ఇటలీలో ఏర్పడిన అస్థిరపరిస్థితులవల్ల పెట్టుబడిదారీ వర్గము, సంపన్న మధ్యతరగతి వర్గము రష్యాలో వలెనే తమ దేశంలో కూడా శ్రామికవర్గం విజయం పొందుతుందని ఆందోళన చెందినారు.

## 17.1.2.3 మొదటి ప్రపంచ యుద్ధప్రభావం :

త్రిపక్షమైత్రి సంధిలో సభ్యరాజ్యాలైన ఇటలీ 1915లో జరిగిన రహస్య లండన్ సంధి ప్రకారం ఆస్ట్రియా, జర్మనీలను విడనాడి మిత్రరాజ్యాలలో చేరింది. ఈ సంధి ప్రకారం మిత్రరాజ్యాలు ట్రెంటినో, టైరోల్, ట్రెయస్టీ, ఇరిట్రియా, డాల్మేషియాలను ఇటలీకి ఇవ్వడానికి అంగీకరించబడినాయి. అంతేగాక ఆఫ్రికాలో జర్మనీ, టర్కీల ఆధిపత్యంలో వున్న భూభాగాలను, టర్కీలోని అడాలియాను కూడా ఇటలీకివ్వడానికి మిత్రరాజ్యాలు వాగ్దానం చేసినాయి. ఈ సంధి జరిగిన కొద్దినెలల తరువాత జర్మనీ, ఆస్ట్రియాల మీద ఇటలీ యుద్ధం ప్రకటించింది. అయితే యుద్ధం ఇటలీకి మోయలేని భారమయింది. యుద్ధంవల్ల ఇటలీకి అధిక జన ధన నష్టం కలిగింది. యుద్ధంలో ఇటలీ 7 లక్షల సైన్యాన్ని కోల్పోయింది. 12 మిలియన్‌ల డాలర్లను యుద్ధం కోసం ఇటలీ ఖర్చుపెట్టింది. యుద్ధంకోసం తాను చేసిన యత్నాలకు, త్యాగాలకు సరిపడిన ప్రతిఫలం శాంతి సంధులవల్ల పొందవచ్చునని ఇటలీ సహజంగా భావించింది.

## 17.1.2.4 పారిస్ శాంతి సంధులు :

మొదటి ప్రపంచ యుద్ధంలో విజయాన్ని సాధించిన మిత్రరాజ్య కూటమిలో సభ్యరాజ్యమైనప్పటికీ ఇటలీ యుద్ధానంతరం పూర్తిగా అసంతృప్తి చెందింది. పారిస్ శాంతి సంప్రదింపులలో ఇటాలియన్‌ల కోరికలను మిత్రరాజ్యాలు తోసిపుచ్చినాయి. ముఖ్యంగా

పెరుగుతున్న జనాభాకు ఎక్కువ భూభాగాలను సంపాదించడానికి ఇటలీ చేసిన ప్రయత్నాలను మిత్రరాజ్యాలు వమ్ముచేసినాయి. ఫ్యూమ్ రేవును పొందవచ్చుననే ఇటాలియన్‌ల ఆశలు అడియాసలయ్యాయి. పారిస్ సంధి ప్రకారం ఇటలీ సరిహద్దు ట్రెంటినో నుంచి బ్రెన్నర్ వరకు విస్తరించింది. డాల్మేషియా రేవు పట్టణమైన సారాలాగోస్టో ద్వీపము ఇటలీకి ఇచ్చినాయి. కాని డాల్మేషియా తీరంలో ఎక్కువభాగాన్ని ఇటలీ పొందలేకపోయింది. ఆల్బేనియా మీద, వలోనా రేవు మీద తన రక్షణాధికారాన్ని ఇటలీ పొందలేకపోయింది. ఆఫ్రికాలోని జర్మన్ వలసలు కూడా ఇటలీకి లభించలేదు. సమీప ప్రాంతంలో వాణిజ్యరాయితీలను మాత్రమే ఇటలీ పొందగలిగింది. ఇటలీ కివ్వడానికి వాగ్దానంచేసిన భూభాగాలు చాలావరకు గ్రీస్, టర్కీలకు ఇవ్వడం జరిగింది. పారిస్ శాంతి సంధివల్ల అసంతృప్తిచెందిన ఇటాలియన్‌లు మిత్రరాజ్యాలపట్ల ఆగ్రహం పెంచుకున్నారు. ఎంత కష్టనష్టాలను భరించినా, ఇటలీ "మధ్యధరా సముద్రఖైదీ"గానే వుండిపోయింది.

## 17.1.2.5 సోషలిస్ట్ ఉద్యమాలు :

ఇటలీలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా కమ్యూనిస్ట్ సిద్ధాంతాలు బాగా వ్యాప్తిలోకి వచ్చాయి. అతివాదపార్టీల సిద్ధాంతాలు ప్రజలను బాగా ఆకర్షించసాగాయి. అంతేగాక ప్రజాస్వామ్య సంప్రదాయాల అభివృద్ధికి అనువైన పరిస్థితులు ఇటలీలో లోపించినాయి. కమ్యూనిస్టులు దేశవ్యాప్తంగా ఉద్యమాలకు పూనుకున్నారు. వారు కార్మికులను, వ్యవసాయ కూలీలను సమీకరించి సమ్మెలు ప్రారంభించారు. వ్యవసాయకూలీలు భూములు, కార్మికులు పరిశ్రమలను ఆక్రమించసాగారు. దేశమంతా అరాచక పరిస్థితులు నెలకొన్నవి. దేశంలో శాంతిభద్రతలు కరువైనాయి. అట్టి అరాచక పరిస్థితులను అదుపులోనికి తెచ్చుట ప్రభుత్వానికి చేతకాలేదు. 'ఇటలీ త్వరలో కమ్యూనిస్ట్ దేశంగా మారుతుందేమో అనిపించింది' అని రోబిన్‌సన్ అభిప్రాయపడ్డాడు.

## 17.1.26 రాజకీయ పార్టీల విభేదాలు :

సోషలిస్టులు, కాథలిక్కులు, ఉదారవాదులు అను మూడు రాజకీయ పక్షాలు ఉండేవి. వీరిలో ఉదారవాదులు, కాథలిక్కులు, ప్రజాస్వామ్యవాదులు కాగా సోషలిస్టులు విప్లవవాదులు. పార్లమెంట్‌లో ఏ ఒక్కపార్టీకి తగిన మెజారిటీ లేనందువల్ల ప్రభుత్వ సుస్థిరతకు తరచు భంగం వాటిల్లేది. 1919 - 1922 మధ్యకాలంలో ఇటలీలో ఆరు ప్రభుత్వాలు మారినాయి. అంతర్జాతీయ కమ్యూనిస్ట్ ఉద్యమ సహకారంతో కమ్యూనిస్ట్‌లు ఇటలీలో అధికారాన్ని హస్తగతం చేసుకోవలెనను తలంపుతో ఉన్నారు. నాటి ఇటలీ ప్రభుత్వం జియోలిట్టి అను ఉదారవాది నాయకత్వంలో ఉండేది. అతని ప్రభుత్వం సోషలిస్టుల అరాచకాన్ని అణచలేకపోయింది. ఈ పరిస్థితుల్లో ఇటలీలో ఏర్పాటైన అనేక విప్లవ పార్టీలలో అతి ప్రధానమైనది మాజీ సోషలిస్ట్ అయిన బెనిటో ముస్సోలినీ స్థాపించిన ఫాసిస్ట్ పార్టీ. ప్రాచీన రోమ్ వైభవాన్ని, రోమన్ సామ్రాజ్యం ప్రాశస్త్యాన్నీ ప్రజల ముందుంచి తద్వారా ఇటాలియన్‌లలో జాతీయ భావాన్ని పెంపొందించడం ఫాసిస్ట్ పార్టీ ప్రధాన లక్ష్యం.

## 17.1.2.7 రచయితల రచనలు :

ఇటువంటి పరిస్థితుల్లో జాతీయభావాన్ని ప్రచారం చేస్తూ కొందరు రచయితలు రచనలు సాగించారు. కొందరు హెగెల్ భావాలున ప్రచారంచేసి రాజ్యం దేవుని ప్రతిబంధం అని ఇటాలియన్లకు బలమైన రాజ్యం ఉండాలని ఉద్బోధించారు. వారి రచనలు, ప్రచారాలు బలమైన రాజ్యం కోరేటట్లు ప్రోత్సహించాయి.

## 17.1.2.8 జాతీయవాదుల కృషి :

ఇటలీలో అధికారంలోఉన్న రాజకీయపార్టీ శాంతియుత సిద్ధాంతాలలో నమ్మకమున్న పార్టీ. పార్టీ నాయకులు నిరాశావాదులైన వృద్ధులు. అందువల్ల ఇటాలియన్‌లు తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దౌర్జన్యానికి పూనుకున్నారు. 1919 నుంచి ఇటాలియన్‌లు

మిత్రరాజ్యాలను విమర్శించడం మాని తమ దేశ రాజకీయ నాయకులను తీవ్రంగా విమర్శించడం ప్రారంభించినారు. జాతీయవాదులు, దేశభక్తులు అయిన ఇటాలియన్‌లు తమ వృద్ధరాజకీయ నాయకులను సంఘాన్ని పీడించే చీడపురుగులని విమర్శించసాగినారు. దేశంలో ఏర్పడిన క్లిష్టసమస్యలను పరిష్కరించే శక్తిసామర్థ్యాలు ప్రభుత్వానికి లేవు. ఇట్టి స్థితిలో 1919లో ముస్సోలినీ ఫాసిస్ట్ పార్టీని స్థాపించాడు.

## 17.1.3 ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలు :

ఫాసిజమ్ అనునది 'ఫాసిస్' అను ఇటలీ పదం నుండి పుట్టినది. 'ఫాసిస్' అనగా ఇటలీ భాషలో పుల్లలమోపు అని అర్థము. పూర్వ రోమన్ న్యాయాధికారులు తమ అధికార లాంఛనాలుగా పుల్లలమోపును, గొడ్డలిని తీసుకొని పోయేవారు. పుల్లలమోపు ఐక్యానికి, గొడ్డలి అధికారానికి చిహ్నాలుగా వారు వాడారు. ప్రాచీన రోమ్ ఔన్నత్యాన్ని ఇటాలియన్ ప్రజల స్ఫురణకు తెచ్చి ప్రజలలో జాతీయభావాన్ని ఉత్తేజింపచేయటానికి ఈ రెండు చిహ్నాలను ముస్సోలినీ తన పార్టీ చిహ్నాలుగా చేసుకొన్నాడు.

ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలను ముస్సోలినీ చాలావరకు గేబ్రియల్ డి అనున్‌జియో అనే కవి నుంచి సంగ్రహించినాడు. పాసిస్ట్ పార్టీని కాథలిక్ ధోరణిగలదిగానూ, జాతీయ స్వభావం గలదిగానూ, అధికార పంధా ననుసరించేదిగానూ, స్త్రీ వ్యతిరేక, ఉదారవాద వ్యతిరేకమైనదిగానూ హెచ్.ఎ. ఎల్.ఫిషర్ అను చరిత్రకారుడు చిత్రించాడు. ఫాసిస్ట్‌పార్టీ ఒక రాజకీయ సంస్థకాదనీ, ఇటలీలో ప్రగతి విముఖ మితవాదుల బారినుండి, వామపక్ష అతివాదుల బారినుండీ, ఇటలీని రక్షించాలని మాత్రమే తాను దానిని రూపొందించాననీ ముస్సోలినీ చెప్పాడు. ఇటాలియన్‌ల భౌతిక, ఆధ్యాత్మిక ఉన్నతి ఒక్కటే ఫాసిస్ట్‌ల ప్రధాన లక్ష్యం.

### 17.1.3.1 వ్యక్తి శ్రేయోవాదానికి వ్యతిరేకము :

ఫాసిస్ట్ సిద్ధాంతాల ప్రకారము రాజ్యం సర్వాధికారానికి మూలము. రాజ్యంలో వ్యక్తి అధికారానికి చోటులేదు. కమ్యూనిస్టు రష్యాలోవలె ఫాసిస్ట్ ఇటలీలో కూడా ఏకపక్ష నియంతృత్వము అనే సిద్ధాంతము అమలుజరిగింది. జాతీయ శ్రేయస్సుకు భంగకరమైన వ్యక్తి స్వేచ్ఛను ఫాసిస్ట్‌లు అనుమతించరు. వ్యక్తి స్వేచ్ఛ ప్రాముఖ్యం స్థానే జాతీయ ప్రాముఖ్యం నెలకొల్పడం జరిగింది. సమిష్టి శ్రేయస్సు కోసం వ్యక్తి స్వేచ్ఛను త్యాగం చేయవలెను.

### 17.1.3.2 ప్రజాస్వామ్యానికి వ్యతిరేకము :

ఫాసిస్ట్‌లకు ప్రజాభిప్రాయము, ప్రజాసార్వభౌమాధికారము, సమానత్వము, వయోజన ఓటింగ్ మొదలైన సిద్ధాంతాలలో నమ్మకం లేదు. ఇటలీ రాజకీయ, ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో ఆనాటి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఘోరంగా విఫలమయింది. అందువల్ల జాతీయ శ్రేయస్సు దృష్ట్యా దేశపరిపాలనను కొద్దిమంది సమర్థులైన వ్యక్తుల చేతులలో ఉంచవలెనని ఫాసిస్ట్‌లు అభిప్రాయపడినారు.

### 17.1.3.3 సామ్యవాదానికి వ్యతిరేకము :

ఫాసిజమ్ సంపూర్ణ సామ్యవాదాన్నీ, సంపూర్ణ పెట్టుబడిదారీ విధానాన్ని కూడా వ్యతిరేకించింది. ఫాసిస్ట్‌పార్టీ సామ్యవాదానికీ పెట్టుబడిదారీ విధానానికి మధ్య ఒక విధమైన మధ్యే మార్గాన్ని అనుసరించింది. శ్రామికవర్గ ప్రజలను సంతృప్తి పరచడానికి కొన్ని సామ్యవాద సిద్ధాంతాలను, ఆస్తిపాస్తులున్న ప్రజలను సంతృప్తి పరచడానికి కొన్ని పెట్టుబడిదారీ సిద్ధాంతాలను ఫాసిస్ట్‌లు అమలుపరిచినారు. భూమిని, ఉత్పత్తి సాధనాలను జాతీయం చేయకుండా ప్రైవేట్ ఆస్థులకు రక్షణ కలిగించారు. అయితే

ప్రభుత్వం కొంతవరకు కంట్రోళ్ళ పద్ధతిని కూడా ప్రవేశపెట్టింది. వ్యక్తులకు సొంత ఆస్తులు ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించినప్పటికీ విదేశీవ్యాపారం మాత్రం ప్రభుత్వాధీనంలోకి తీసుకొనిరావడం జరిగింది. పెట్టుబడిదారీ వర్గంవలెనే శ్రామికవర్గాన్ని కూడా ప్రభుత్వాధీనంలో ఉంచడం జరిగింది. కార్మిక సంఘాలను ప్రభుత్వం క్రమబద్ధం చేసింది. కార్మికుల వేతనాలను ప్రభుత్వమే నిర్ణయించింది. అన్నిరకాల సమ్మెలు, లాకౌట్లు నిషేధించడం జరిగింది. దేశాన్ని పారిశ్రామికంగా, వ్యవసాయికంగా స్వయం పోషకం చేయడానికి అవసరమైన చర్యలను ఫాసిస్ట్‌లు తీసుకోవడం జరిగింది. అందువల్ల ఫాసిస్ట్‌ల ఆర్థిక విధానాన్ని అతిపెద్దపెట్టుబడిదారీ విధానమని చెప్పవచ్చు.

### 17.1.3.4 శాంతివాదానికి వ్యతిరేకము :

గతచరిత్ర అనుభవం దృష్ట్యా శాంతివాదము ఆధునిక అభ్యున్నతికి అవరోధమని ఫాసిస్ట్‌లు భావించారు. యుద్ధము జాతీయ జీవనంలో భాగమే కాక ప్రజల సహజమైన విధి అని, జాతిని ఉత్తేజపరచడానికి యుద్ధమొక్కటే ఏకైక మార్గమని ఫాసిస్ట్‌ల అభిప్రాయము. యుద్ధాల ద్వారా ప్రాచీన రోమన్ వైభవాన్ని తిరిగి నెలకొల్పవలెనని ముస్సోలినీ ఇటాలియన్‌లను ఉద్రేకపరచినాడు. స్త్రీకి ప్రసూతి ఎటువంటిదో పురుషునికి యుద్ధము అటువంటిదని ముస్సోలినీ ప్రచారం చేసినాడు. అంతేగాక ఫాసిజమ్ జాతి ఔన్నత్యాన్ని ప్రబోధించి అనాగరికమైన ఆసియా, ఆఫ్రికా రాజ్యాలను నాగరిక రాజ్యాలుగా మార్చవలసిన బాధ్యత ఇటాలియన్‌ల మీద ఉందని ప్రచారం చేసింది. ఈ విధంగా ఫాసిజమ్ సామ్రాజ్యవాదాన్ని పూర్తిగా సమర్థించింది.

### 17.1.3.5 కార్పోరేట్ రాజ్యము :

తాము స్థాపించినది పెట్టుబడిదారీ రాజ్యం కాదనీ, కార్పోరేట్ రాజ్యమనే నూతన రాజ్యమనీ ఫాసిస్ట్‌లు భావించినారు. అయితే నిజానికి ఫాసిస్ట్‌లు స్థాపించిన కార్పోరేట్ రాజ్యంలో పెట్టుబడిదారీ లక్షణాలేగాక భయంకరమైన నియంతృత్వ లక్షణాలు కూడా స్ఫుటంగా కనిపిస్తాయి.

## 17.1.4 ముస్సోలినీ - ఫాసిస్ట్ ప్రభుత్వ స్థాపన :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం స్థాపితమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిష్కరించుటలో విఫలమయినవి. ఇది ఆసరా చేసుకొని నియంతలు కొన్నిదేశాలలో విజృంభించి అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. వారిలో మొదటివాడు బెనిటో ముస్సోలిని. ఇతడు ఇటలీలో ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాడు.

### 17.1.4.1 ముస్సోలినీ తొలి జీవితం :

ముస్సోలినీ 1883లో రొమాగ్నాలోని ఫోర్లిలో జన్మించినాడు. ఇతని తల్లిదండ్రులు చాలా బీదవారు. తల్లి ఉపాధ్యాయిని. తండ్రి కమ్మరి. పేదరికాన్ని ఎదుర్కొనవలసి వచ్చిన ముస్సోలినీ యువకుడుగా ఉన్నప్పుడు సోషలిస్ట్ పార్టీలో చేరినాడు. 'అవంతి' అనే సోషలిస్ట్ పత్రికకు సంపాదకుడుగా పనిచేసినాడు. అయితే మొదట ప్రపంచయుద్ధం ప్రారంభమైనపుడు ఆస్ట్రియా మీద ఇటలీ యుద్ధం ప్రకటించడాన్ని సమర్థించిన ముస్సోలినీ సోషలిస్ట్ పార్టీ నుంచి బయటికి వచ్చినాడు. ఈ తరువాత మొదటి ప్రపంచ యుద్ధంలో చేరి గాయపడినాడు. సైన్యం నుంచి బయటకు వచ్చిన తరువాత ముస్సోలినీ మిలాన్ నగరానికి వచ్చి 'ఇల్ పాపోలాయిడ్ ఇటలీ" అనే పత్రికను ప్రచురించసాగాడు.

### 17.1.4.2 ఫాసిస్ట్ పార్టీ స్థాపన :

దేశంలోని అరాచక పరిస్థితుల వల్ల అసంతృప్తి చెంది ఇటాలియన్ సమస్యలను పరిష్కరించవలెననే కోరికలున్న నాయకులందరినీ ముస్సోలినీ 1919లో ఒకచోట సమావేశపరిచినాడు. ఈ సమావేశంలో వివిధ ముఠాలు కలిసి పాసిస్ట్ పార్టీగా ఏర్పడి ముస్సోలినీని నాయకునిగా ఎన్నుకొన్నాయి. అభివృద్ధి నిరోధక శక్తులైన మితవాదుల బారినుండి విధ్వంసక చర్యలలో పాల్గొనే వామపక్షాల వారి నుంచి దేశాన్ని కాపాడటానికి ఫాసిస్ట్‌పార్టీని స్థాపించినట్లుగా ముస్సోలినీ ప్రచారం చేసినాడు. ఫాసిస్ వాప్లవానికి పార్టీ ప్రమేయం లేని ఉద్యమమము అని ముస్సోలినీ పేరుపెట్టినాడు. 'బోల్షివిక్‌ల వినాశకర ప్రభావము నుండి ఇటలీలో నాడు నెలకొనివున్న వ్యవస్థలను రక్షించడానికి, శాంతి భద్రతల కొరకు ఒక ప్రేరణగా ఫాసిజమ్ జనించింది' అని హేజన్ అంటాడు. 'జాతయవాదం యొక్క సారాంశమే ఫాసిజమ్. ఇది ఇటలీలో మరోమారు ప్రాచీనరోమ్ ఔన్నత్యానికి నిదర్శనంగా నిలచింది' అని ఫిషర్ అంటాడు.

ఇటాలియన్‌ల భౌతిక నైతిక పరిస్థితులను అభివృద్ధి చేయడం ఫాసిస్ట్ పార్టీ లక్ష్యమని ముస్సోలినీ పేర్కొన్నాడు. ఆయుధోత్పత్తి కర్మాగారాలను జాతీయం చేయడం, శాసనాధికారాలతో కూడిన ఆర్థిక మండలాలను ఏర్పాటు చేయడం, కొన్ని పరిశ్రమల యాజమాన్య బాధ్యతలను కార్మికులకు అప్పగించడం, ఫాసిస్ట్ పార్టీలోని ప్రధాన అంశాలు. విదేశీ వ్యవహారాలకు సంబంధించి ఫ్యూమ్, డాల్మేషియాను వెంటనే ఆక్రమించడం ఫాసిస్ట్ పార్టీ ప్రణాళికలలోని ప్రధానం అంశం. అయితే లక్ష్యసాధన కోసం ఫాసిస్ట్‌లు దౌర్జన్యకాండతో కూడిన విధానాలననుసరించారు.

### 17.1.4.3 ఫాసిస్ట్ విప్లవ వ్యాప్తి :

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఇటలీలో అసమర్థతతోను, అవినీతితోను కూడిన పరిపాలన వల్ల ప్రజల అసంతృప్తి తారాస్థాయి నందుకొన్నది. ఈ పరిస్థితులలో భూస్వాములు, పెట్టుబడిదారులు దేశంలో పటిష్టమైన ప్రభుత్వాన్ని నెలకొల్పవలెననే సంకల్పంతో వున్నారు. జాతీయవాదులు దేశభక్తి పూరితమైన ప్రభుత్వాన్ని నెలకొల్పవలెననే కుతూహలంతోనే ఉన్నారు. ఈ పరిస్థితులలో క్రమక్రమంగా ఫాసిస్ట్ విప్లవము ప్రజాదరణ పొందసాగింది.

మంచివక్త అయిన ముస్సోలినీ తన ఉపన్యాసాల ద్వారా ప్రజలను ముగ్ధులను చేశారు. సమర్థవంతమైన ప్రభుత్వాన్నిస్తాననీ, ఆర్థిక వ్యవస్థను చక్కబరుస్తానని, శాంతిభద్రతల్ని పునరుద్ధరిస్తాననీ, అవినీతిని అంతమొందిస్తానని ముస్సోలినీ వాగ్దానాలు చేశాడు. నిరుద్యోగులైన యువకులు, మాజీసైనికులు, భూస్వాములు, పెట్టుబడిదారులు పెద్దసంఖ్యలో ఫాసిస్ట్ పార్టీలో చేరసాగారు. ఫాసిస్ట్ విప్లవం పట్టణాలకు, పల్లెలకు వ్యాపించసాగింది. సైనికతత్వంతో కూడిన ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలు యువకులను ఎక్కువగా ఆకర్షించినాయి. పార్టీలో చేరిన యవకులందరూ నల్లచొక్కాలను ధరించేవారు. సైనిక శిక్షణకు, క్రమశిక్షణకు ప్రాధాన్యము ఇవ్వడం జరిగింది. కొద్దికాలంలోనే సుశిక్షితులైన సాయుధసైన్యాన్ని ఫాసిస్ట్‌పార్టీ తయారుచేసింది. మొదట ఈ పార్టీలో నూటయాభైమంది మాజీ సైనికులు మాత్రమే వుండేవారు. 1919లో ఫాసిస్ట్‌ల సంఖ్య 22 వేలకు, 1921 నాటికి ఆ సంఖ్య ఐదు లక్షలకు పెరిగింది.

1921 తరువాత ఫాసిస్ట్‌లకు, సోషలిస్ట్‌లకు మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చినాయి. రెండు పార్టీల పట్ల తటస్థ విధానాన్ని అనుసరిస్తూనే ప్రభుత్వము ఫాసిస్ట్‌లను బలపరచసాగింది. జిల్లాలలో పరిపాలకులు, పోలీసులు కూడా కొన్ని సందర్భాలలో ఫాసిస్ట్‌లకు బహిరంగంగా తోడ్పడసాగినారు. విప్లవవాదుల నాయకత్వంలో శ్రామికవర్గ ప్రజలు బలవంతంగా ఫ్యాక్టరీలను తమ వశం చేసుకున్నారు. రష్యాలో వలె ఇటాలియన్ శ్రామికులు సోవియట్‌లను ఏర్పాటు చేసినారు. అయితే ఫ్యాక్టరీలను నియంత్రణ

చేయడంలో విఫలమైన విప్లవవాదులు ప్రభుత్వంతో సంప్రదింపులు ప్రారంభించారు. సంప్రదింపుల ఫలితంగా శ్రామికవర్గ నియంతృత్వాన్ని స్థాపించడంలో విప్లవవాదులు విఫలులైనారు. క్రమక్రమంగా విప్లవోద్యమం బలహీనపడింది.

### 17.1.4.4. రోమ్ మీద ఫాసిస్ట్‌ల దాడి :

విప్లవవాదులు అనేక ప్రదేశాలలో బలవంతంగా భూములను ఆక్రమించుకొన్నప్పటికీ ప్రభుత్వము వారిమీద కఠినచర్యలు తీసుకోలేకపోయింది. ఈ పరిస్థితులలో పార్లమెంటరీ ప్రభుత్వం మీద ప్రజలకు నమ్మకం నశించిపోయింది. ఈ అవకాశాన్ని ముస్సోలినీ బాగా వినియోగించుకొన్నాడు. ప్రభుత్వం బలహీనమైనదిగా అసమర్థమైనదిగా విమర్శించి, సోషలిస్ట్ వ్యతిరేక పార్టీలన్నిటినీ ఫాసిస్ట్ విప్లవంలో చేరవలసిందిగా ముస్సోలినీ ఆహ్వానించాడు. విప్లవవాదులు విధ్వంసకచర్యల బారినుండి దేశాన్ని ఫాసిస్టులు మాత్రమే రక్షించగలరని ముస్సోలినీ ప్రచారం చేసినాడు. ఆనతికాలంలోనే పారిశ్రామికవేత్తలు, భూస్వాములు పెద్దమొత్తంలో ఫాసిస్ట్ పార్టీకి విరాళాలు ఇవ్వసాగినారు.

1921లో పార్లమెంట్ రద్దయి, ఎన్నికలు జరిగాయి. ఎన్నికలలో ఫాసిస్ట్‌లు పార్లమెంట్‌లోని 535 స్థానాలలోను 35 స్థానాలలోను, కమ్యూనిస్ట్‌లు 16 స్థానాలను గెలుచుకున్నారు. ఎన్నికలలో ఉదారవాదులు ఎక్కువ సంఖ్యలో విజయాన్ని సాధించినప్పటికీ వారిలో ఐక్యత లేకపోయింది. ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం బలహీనమయింది. 1922లో ఇటలీలో ఒక సమ్మె జరిగింది. ఈ సమ్మె కాలంలో ఫాసిస్ట్‌లు మిలాన్, జినోవా, లెఘ్నార్స్ నగరాలలో ప్రాబల్యాన్ని సంపాదించారు. మిలాన్‌లో సోషలిస్టులను నగరం నుండి తరిమివేసి, పెట్టుబడిదారులు, భూస్వాముల సానుభూతిని పొందారు.

1922లో అధికారాన్ని తనకు అప్పగించకపోతే రోమ్‌పై దాడి చేస్తానని ముస్సోలినీ బెదిరించాడు. దాదాపు ముప్పైవేల మంది ఫాసిస్ట్‌లు 1922 అక్టోబరు 27న రోమ్ నగరంలోనికి ప్రవేశించి కీలక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. ముస్సోలినీకి భూస్వాములు, పెట్టుబడిదారీలతోబాటు, ఉద్యోగి బృందం మద్దతు కూడా ఉంది. 1922 అక్టోబరులో రాజుపట్ల విధేయతను, చర్చి పట్ల గౌరవాన్ని చూపడానికి వాగ్దానం చేసి ముస్సోలినీ రాజు, చర్చి సహకారాన్ని పొందగలిగాడు. సైన్యము తటస్థంగా ఉంది. ఇదే సమయంలో ప్రధానమంత్రి లూయిగోఫాక్టాతో సైనిక పాలనకు సంబంధించిన ప్రకటనను జారీచేసే విషయంలో రాజు మూడో విక్టర్ ఇమ్మానుయేల్‌కు తీవ్ర అభిప్రాయ భేదాలేర్పడినాయి. 1922 అక్టోబరు 30న రాజు ప్రధానమంత్రి ఫాక్టాను బర్తరఫ్ చేసి ముస్సోలినీని ఇటలీ నూతన ప్రధానమంత్రి ఫాక్టాను బర్తరఫ్ చేసి ముస్సోలినీని ఇటలీ నూతన ప్రధానమంత్రిగా నియమించాడు. "ఛాంబర్ ఆఫ్ డెప్యూటీస్" అనే సభలోని ఫాసిస్టేతర సభ్యులు కూడా, ముస్సోలినీకి ఒక సంవత్సరంపాటు నిరంకుశాధికారాన్ని ఇచ్చివేశారు.

### 17.1.4.5 నియంతృత్వ స్థాపన :

అధికారంలోకి వచ్చిన తరువాత కొద్దికాలంలోనే ముస్సోలినీ ప్రతిపక్షాలన్నింటినీ దయాదాక్షిణ్యరహితంగా అణిచివేసినాడు. పత్రికా స్వాతంత్ర్యాన్ని తొలగించివేశాడు. స్వయం పాలనాధికారాలతో కూడిన స్థానిక సంస్థలు అనేక ఇతర ప్రజాస్వామ్యసంస్థలు రద్దు చేయబడ్డాయి. ఫాసిస్ట్‌పార్టీ కనుగుణంగా ఉండే విధంగా ఎన్నికలకు సంబంధించిన నూతన చట్టాలు చేయబడింది. 1924లో జరిగిన ఎన్నికల్లో దౌర్జన్యాన్ని ఉపయోగించి, ఫాసిస్ట్‌లు మెజారిటీని సంపాదించారు. 1924లోనే సోషలిస్ట్ నాయకుడైన మాట్టియోట్టీ "ఫాసిస్ట్‌ల బండారం" అనే గ్రంథాన్ని ప్రచురిస్తే, అతనిని హత్యచేయడం జరిగింది. సోషలిస్ట్ పార్టీ సభ్యులందరినీ దేశం నుంచి బహిష్కరించడం జరిగింది. సోషలిస్ట్, రిపబ్లికన్, కమ్యూనిస్ట్ పార్టీలను "జాతి వ్యతిరేక పక్షాలుగా' ప్రకటించి అణచివేయడం జరిగింది. 1926 నాటికి ఇటలీలో చట్టసమ్మతమైన పార్టీ ముస్సోలినీ నాయకత్వంలోని ఒక్క ఫాసిస్ట్ పార్టీ మాత్రమే. 1928

నుండి "ఛాంబర్ ఆఫ్ డెప్యూటిస్" నామమాత్ర సంస్థగా పరిణమించింది. ఎంపిక చేసిన కొద్దిమంది ఫాసిస్ట్‌లను ఎవర్నో ఒకర్ని ఎన్నుకునే వరకే ఎన్నికలు పరిమితమైనాయి. ప్రధానిగా, పార్టీ అధినేత (డ్యూస్)గా ముస్సోలినీ అధికారాలన్నింటినీ తన చేతిలో కేంద్రీకరించుకొన్నాడు. పార్లమెంట్‌ను, రాజ్యాంగబద్ధ రాజరిక వ్యవస్థను ప్రదర్శనకై వుంచినా, ఫాసిస్ట్ పార్టీయే నిజమైన అధికారాన్ని చెలాయించింది. ప్రాంతీయ, రాష్ట్రస్థాయిలలో రష్యన్ కమ్యూనిస్ట్ పద్ధతిలో వ్యవస్థీకృతం అయిన పార్టీలో అధికారాలన్నీ గ్రాండ్ కౌన్సిల్ అనే ఉన్నత సంస్థకు ఇవ్వబడ్డాయి. ఈ సంస్థకు అధ్యక్షుడైన ముస్సోలినీ, ప్రభుత్వంలోని అన్ని శాఖలపైనా, పార్టీకి చెందిన దళాలపైనా సంపూర్ణ అధికారాన్ని చెలాయించేవాడు. ఈవిధంగా ముస్సోలినీ నాయకత్వంలో ఇటలీలో ఫాసిస్ట్ నియంతృత్వమేర్పడింది.

## 17.1.5 ముస్సోలినీ ఆంతరంగిక విధానం :

ముస్సోలినీ తన అధికారాన్ని సుస్థిరపరచుకొన్న తరువాత దేశసమస్యలపై తన దృష్టిని సారించి దేశాభివృద్ధికి కృషిచేశాడు.

### 17.1.5.1 ఆర్థిక సమస్యలు :

ఇటలీలో ముస్సోలినీ కార్పోరేట్ రాజ్యాన్ని స్థాపించాడు. కార్మికులు, పెట్టుబడిదారులు తమ విభేధాలను విస్మరించి దేశాభ్యుదయానికి సమిష్టిగా కృషి చేయాలి. అన్నిరంగాలలో యజమానులు, కార్మికులు కలిసి సిండికేట్లుగా ఏర్పడతారు. ఈ సిండికేట్లు పార్టీ అగ్రనాయకుల మండల సభ్యులను ఎన్నుకుంటారు. ఈ సిండికేటు ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి లేనట్లయితే మధ్యవర్తుల ద్వారాగానీ, న్యాయస్థానాల ద్వారాగానీ పరిష్కరించుకోవాలి అంతేగాని సమ్మెలు చేయరాదని శాసించాడు. కమ్యూనిస్ట్ సిద్ధాంతాలవైపు ఆకర్షింపబడకుండా చూసేందుకు కార్మికుల స్థితిగతులను మెరుగుపరచేందుకు అనేక చర్యలు చేపట్టాడు. కార్మికులకు వారంలో ఒకరోజు సెలవుదినంగా ప్రకటించాడు. రోజుకు 8 గంటలు మాత్రమే కార్మికులు పనిచేయాలి. కార్మికులకు భీమా పథకాన్ని, ఉద్యోగ భద్రతను ప్రవేశపెట్టాడు.

దేశంలో వ్యవసాయాభివృద్ధికి ముస్సోలినీ పాటుపడ్డాడు. నీటిపారుదల సౌకర్యాలు ఏర్పాటుచేసి చిత్తడి నేలలను, బంజరు భూములను సాగులోకి తెచ్చాడు. ఫలితంగా గోధుమ ఉత్పత్తి దేశావసరాలకు సరిపడేంత జరిగింది. జలవిద్యుచ్ఛక్తి పద్ధతిని దేశంలోని అన్ని భాగాలకు విస్తరింపజేశాడు. రైల్వేలను విద్యుద్దీకరణ చేశాడు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయమందించినాడు. మోటారు వాహనాల పరిశ్రమ గొప్పగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వ సహాయంతో వాణిజ్యనౌకలు నిర్మితమైనాయి. ఇటలీ విదేశాలతో వాణిజ్య సంధులు చేసుకొన్నది. ఇటాలియన్‌లు విదేశాలలో డబ్బు ఖర్చుపెట్టడం చాలావరకు నిషేధించబడింది. ఇటాలియన్ వైర్ విలువను తగ్గించి, విదేశవాణిజ్యము,బ్యాంకింగ్ వ్యవస్థ ప్రభుత్వ యాజమాన్యం క్రిందకి తెచ్చింది. 1929లో ఏర్పడిన ఆర్థికమాంద్యం వల్ల ఇటలీ బాగా దెబ్బతిన్నది. ఆహారవస్తువుల ధరలు అదుపు చేయడానికి, పెద్దఎత్తున ఉత్పత్తిని సాధించడానికి ప్రభుత్వం ప్రయత్నించింది.

### 17.1.5.2 విద్యా సంస్కరణలు :

దేశంలోని విద్యారంగంమీద పూర్తి ప్రభుత్వాధిపత్యాన్ని నెలకొల్పడం జరిగింది. ఫాసిస్ట్ పద్దతుల ద్వారా విద్యావిధానాన్ని ప్రవేశపెట్టటం జరిగింది. ఉపాధ్యాయులందరూ ఫాసిస్ట్ ప్రభుత్వం పట్ల విధేయులై ఉండటానికి ప్రమాణం చేయవలెననే నిబంధన జరిగింది. నిర్బంద సైనిక విద్యను ప్రవేశపెట్టి, విద్య ద్వారా జాతీయ భావాన్ని, దేశాధినేతయెడ విశ్వాసాన్ని ప్రజలలో రేకెత్తించడం జరిగింది. రేడియో, వార్తాపత్రికలు, సినిమాలు, ఫాసిస్ట్ భావాల ప్రచార సాధనాలైనాయి.

### 17.1.5.3 సైనిక సంస్కరణలు :

ఇటాలియన్‌లలో జాతీయభావాన్ని రెచ్చగొట్టి వారిని యుద్ధానికి ఎల్లప్పుడు సన్నద్ధులుగా వుండేటట్లు ముస్సోలినీ చేశాడు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలను అరికట్టడానికి రహస్య పోలీస్‌దళం ఏర్పాటుచేశాడు. 8 నుంచి 14 సంవత్సరాల వరకు వయసున్న మగపిల్లలను యంగ్‌ఫాసిస్ట్ సంస్థలలో చేర్చుకొన్నారు. 18 నుంచి 33 సంవత్సరాల వయసున్న పురుషులందరికి నిర్బంధ సైనిక శిక్షణ ఇవ్వడం జరిగింది. స్త్రీలు వంట చేయడానికి మాత్రమే పరిమితమైనారు. దేశసైనిక సంఖ్యను పెంచవలసిన అవసరం ఉంది కాబట్టి జననాల నియంత్రణ రద్దయింది.

### 17.1.5.4 పోప్‌తో ఒప్పందము :

ఇటాలియన్‌లలో అధిక సంఖ్యాకులు కాథలిక్‌లు. అందువల్ల కాథలిక్ చర్చి సహకారాన్ని పొందవలసిన అవసరాన్ని ముస్సోలినీ గుర్తించినాడు. 1870 నుంచి చర్చికి ప్రభుత్వానికీ మధ్య సత్సంబంధాలు లేవు. చర్చికి ప్రభుత్వానికి మధ్య సామరస్యాన్ని సాధించడానికి అనేక సంప్రదింపులు, జరిగిన ఫలితంగా 1929లో పోప్‌కు ఫాసిస్ట్ ప్రభుత్వానికి మధ్య 'లాటెరన్ ఎకార్డ్' అనే ఒక ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడిక ప్రకారం వంద ఎకరాల విస్తీర్ణమున్న వాటికన్ మీద పోప్ సార్వభౌమాధికారాన్ని, కాథలిక్ మతాన్ని ఫాసిస్ట్ ప్రభుత్వం గుర్తించింది. దీనికి బదులుగా సెవాయ్ రాజవంశాన్ని పోప్ 11వ పయస్ గుర్తించాడు. ఈ ఒప్పందం ద్వారా ముస్సోలినీ కాథలిక్ ప్రజల మద్దతును, అభిమానాన్ని చూరగొన్నాడు. అయితే ఈ ఒడంబడిక జరిగిన తరువాత కూడా చర్చికి ప్రభుత్వానికి మధ్య పూర్తి సదవగాహన ఏర్పడలేదు. ఫాసిస్ట్ ప్రభుత్వ విధానాలను పోప్ తీవ్రంగా విమర్శించేవాడు.

### 17.1.6 ముస్సోలినీ విదేశాంగ విధానము :

పారిస్ శాంతిసంధుల ప్రకారం ఇటలీకి లభించిన వాటా చాలా తక్కువ. ఈ కారణంగా ఇటలీ అసంతృప్తి చెందింది. అందువల్ల ఇటలీ శాంతి సంధులను ఉల్లంఘించి రాజ్యవిస్తరణ విధానాన్ని అవలంబించవలెననే నిర్ణయానికి వచ్చింది. కాబట్టి రాజ్యవిస్తరణ ముస్సోలినీ విదేశాంగ విధానం ముఖ్యలక్ష్యమయింది. ఇటలీ రాజ్యవిస్తరణను, వలస సామ్రాజ్యస్థాపనను సమర్థించడానికి ముస్సోలినీ జనాభా ఒత్తిడిని ఒక కారణంగా పేర్కొన్నాడు. అంతేగాక పారిశ్రామికాభివృద్ధికి ముడిపదార్థాలను సంపాదించవలసిన అవసరం కూడా ఇటలీకి ఉంది. అందువల్ల ఇటలీ వలసల అవసరాన్ని గుర్తించింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు ఇటలీ రాజ్యవిస్తరణ విధానానికి ముఖ్యమైన విరోధాలు అంతేగాక జర్మనీ, సోవియట్ రష్యాలను కూడా విరోధులుగా భావించి ఇటలీ భీతి చెందింది. అందువల్ల రాజ్యవిస్తరణ విధానాన్ని అనుసరిస్తున్న ఇటలీ అంతర్జాతీయ రాజకీయాలలో ఇంగ్లండ్‌ను ఫ్రాన్స్ మీద, ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లను జర్మనీమీద, అన్ని రాజ్యాలను సోవియట్ రష్యామీద ప్రయోగించే విధానాన్ని అనుసరించింది.

1923 లో జరిగిన లాజెన్ సంధి ప్రకారం డోడ్‌కనీస్ దీవుల మీద ఇటలీ ఆధిపత్యాన్ని గ్రీస్ గుర్తించింది. దీనితో ఇటలీ పలుకుబడి తూర్పు మధ్యధరా ప్రాంతంలో విస్తరించింది. గ్రీస్, ఆల్బేనియాల మధ్య సరిహద్దు విషయమై తగాదా ఏర్పడినపుడు ఇటలీ సైన్యము గ్రీస్‌కు చెందిన కోర్ఫుదీవిని ఆక్రమించింది. గ్రీస్ సమితికి ఫిర్యాదు చేసింది. మొత్తంమీద గ్రీస్ నష్టపరిహారం చెల్లించిన తరువాత ఇటలీ సైన్యం కోర్ఫుదీవి నుంచి వైదొలగింది. ఈ విజయం కారణంగా ముస్సోలినీ ప్రతిష్ఠ పెరిగింది. 1924లో ఇటలీ యుగోస్లావియాతో సంధి చేసుకొని ఫ్రూమ్ పట్టణాన్ని ఆక్రమించాడు. రష్యా, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లతో దౌత్యసంబంధాలు అభివృద్ధి చేసుకున్నాడు. 1926లో అల్బేనియాతో మైత్రి ఒప్పందాన్ని చేసుకున్నాడు.

### 17.1.6.1 ఇథియోపియా (అబిసీనియా) మీద దురాక్రమణ :

1929లో ఏర్పడిన ఆర్థిక మాంద్యము ఇటలీలో తీవ్రమైన పరిస్థితులను సృష్టించింది. అందువల్ల దేశప్రజల దృష్టిని ఆంతరంగిక సమస్యల నుంచి విదేశ వ్యవహారాల వైపుకు మళ్ళించడానికి ఫాసిస్ట్ ప్రభుత్వం సాహసోపేతమైన, చురుకైన విదేశాంగ విధానాన్ని అనుసరించసాగింది. మంచూరియా మీద జపాన్ ఆక్రమణ పశ్చిమరాజ్యాల నిర్లిప్తవైఖరి ఇటలీ రాజ్యవిస్తరణ విధానానికి ప్రోత్సాహాన్ని కలుగజేసినాయి. పెరుగుతున్న తన జనాభా ఆహారము నివాస అవసరాలను తీర్చడానికి, పారిశ్రామికాభివృద్ధికి కావలసిన ముడి పదార్థాలను పొందడానికి ఫాసిస్ట్ ప్రభుత్వం ఇథియోపియాను ఆక్రమించుకోదలచింది.

హిట్లర్ దురాక్రమణ విధానము ఫ్రాన్స్ - ఇటలీల మధ్య 1935లో లావల్ - ముస్సోలినీ ఒడంబడికకు దారితీసింది. ఈ ఒడంబడిక ప్రకారం ఇథియోపియా మీద ముస్సోలినీ దురాక్రమణకు ఫ్రాన్స్ తన రహస్య మద్దతునిచ్చింది. హిట్లర్ దురాక్రమణల వల్ల ఆందోళన చెందిన బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలు 1935లో జరిగిన స్ట్రెస్సా సమావేశంలో హిట్లర్ చర్యలను గర్హించినాయి. హిట్లర్‌కు వ్యతిరేకంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లకు సహాయం చేయడానికి ముస్సోలినీ అంగీకరించినందుకు ప్రతిఫలంగా ఇథియోపియాను ఆక్రమించుకోవడానికి ఇటలీకి మద్దతు లభించింది.

1934లో రెండు దేశాల మధ్య జరిగిన వాల్‌వాల్ సంఘర్షణను సాకుగా తీసుకొని ఇటలీ అబిసీనియాను ఆక్రమించుకోదలిచింది. వాల్‌వాల్ సంఘటనకు అబిసీనియా సమితికి నివేదించి మధ్యవర్తిత్వాన్ని కోరింది. అబిసీనియా సమస్యను పరిష్కరించడానికి సమితి సలహానుసరించి బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలు పారిస్‌లో సమావేశమైనాయి. ఇటలీకి అబిసినియాలో కొన్ని ఆర్థిక సదుపాయాలు కలుగచేయటానికి ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు అంగీకరించాయి. అయితే ఈ ప్రతిపాదనను అంగీకరించక ముస్సోలినీ తూర్పు ఇథియోపియాను ఆక్రమించడానికి నిర్ణయించుకొన్నాడు. ముస్సోలినీ వైఖరి తెలుసుకున్న సమితి ఒక దర్యాప్తు సంఘాన్ని నియమించింది. ఈ సంఘము అబిసీనియా అభివృద్ధికి ఒక పథకాన్ని తయారుచేయడమే గాక అబిసీనియాలో ఇటలీ ప్రత్యేక హక్కులను కూడా గుర్తించింది. ఈ పథకాన్ని అబిసినియా రాజు హెయిలీసెల్లాసీ ఆమోదించాడు. కాని ముస్సోలినీ తిరస్కరించాడు. సమితి 15 రాజ్యాలతో కూడిన మరొక సంఘాన్ని నియమించింది. ఈ సంఘం సమావేశంలో ఉండగానే 1935లో ఇటలీ అబిసీనియా మీద దాడిచేసింది. ఇటలీని దురాక్రమణ జరిపిన దేశంగా సమితి పేర్కొన్నది. అంతేగాక సమితి ఇటలీ మీద కొన్ని సైనిక, ఆర్థిక ఆంక్షలను విధించింది. సమితి చేసిన సిఫారసులను ఇటలీ తీవ్రంగా గర్హించింది.

1935లో ఇటలీ తన సైన్యాలను అబిసీనియా మీదికి పంపింది. ఇటలీ సైన్యాలు అబిసీనియా రాజధాని ఆడిస్ - అబాబాలోకి 1936 మేలో ప్రవేశపెట్టింది. హెయిలీ సెల్లాసీ యూరప్‌కు పారిపోయాడు. అబిసీనియా ఇటలీ సామ్రాజ్యంలో భాగమయింది. కొంతకాలం తరువాత ఇటలీ అబిసీనియా ఆక్రమణను యూరప్ రాజ్యాలు గుర్తించినాయి. ఈ యుద్ధఫలితంగా సమితి బలహీనపడటమేగాక యూరప్‌లో ఫాసిజమ్ బలపడింది. ఆస్ట్రియా మీద దురాక్రమణ జరపడానికి హిట్లర్‌కు స్వేచ్ఛ లభించింది. యుద్ధం జరుగుతున్న కాలంలో ఇటలీలో ధరలు పెరుగుదల వల్ల ఆర్థిక సమస్య ఏర్పడింది.

### 17.1.6.2 ఆల్బేనియా మీద దాడి :

1926లో ఆల్బేనియాలో తిరుగుబాటు జరిగినపుడు దాని పాలకుడు జోగు ఇటలీ సహాయాన్ని అర్థించాడు. ఫలితంగా రెండు దేశాల మధ్య టిరానా సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం ఆల్బేనియా సమ్మతితో ఇటలీ ఆల్బేనియాలో ఆంతరంగిక విదేశీ వ్యవహారాలలో జోక్యం కలిగించుకొంటుంది. 1927 రెండు దేశాలు ఒక సైనిక ఒప్పందాన్ని చేసుకున్నాయి. కాన 1931 నుంచి ఆల్బేనియాలో ఇటలీ వ్యతిరేక వైఖరి అభివృద్ధి చెందింది. 1932లో ఇటలీ, ఆస్ట్రేలియాల మధ్య సుంకాల సంఘం స్థాపనకు ఇటలీ చేసిన ప్రతిపాదనలను జోగు తిరస్కరించాడు. 1934లో ఆల్బేనియా సైన్యంలో ఇటాలియన్ ఉద్యోగుల

అధికారాన్ని తగ్గించి ఆల్బేనియా లోకి ఇటాలియన్‌లు వలస రావడాన్ని అరికట్టడానికి జోగు ప్రయత్నించి విఫలుడైనాడు. 1939లో ఇటలీ సైన్యాలు ఆల్బేనియా మీద దాడి చేసి టిరానాలోకి ప్రవేశించినాయి. ఇటలీ సైన్యాన్ని ఆల్బేనియా ఎదుర్కోలేకపోయింది. జోగు కుటుంబ సమేతంగా దేశం వదలిపారిపోయినాడు. ఆల్బేనియాను ఇటలీలో విలీనం చేయడం జరిగింది. ఈ విలీనాన్ని యూరప్ రాజ్యాలు గుర్తించాయి.

## 17.1.6.3 స్పెయిన్ అంతర్యుద్ధంలో జోక్యము :

1936లో స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకో నాయకత్వాన ఒక సైనిక తిరుగుబాటు జరిగింది. రిపబ్లికన్ ప్రభుత్వము అతివాద వైఖరిని అనుసరిస్తున్నదని తిరుగుబాటుదారులు ఆరోపించారు. జాతీయవాదులు కూడా అలజడిని ప్రారంభించినారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించినవారంతా ఫాసిస్ట్ పరోక్ష ధోరణి ఉన్నవారు, ప్రభుత్వపక్షము, తిరుగుబాటు పక్షము కూడా విదేశాల నుంచి ఆర్థిక సైనిక సహాయం పొందినాయి. తిరుగుబాటుదారులకు ఫాసిస్ట్ ఇటలీ, నాజీ, జర్మనీలు మద్దతు ఇచ్చినాయి. ప్రభుత్వ పక్షానికి సోవియట్ రష్యా మద్దతు ఇచ్చింది. బ్రిటన్, ఫ్రాన్స్‌లు రిపబ్లిక్ సానుభూతి చూపినాయి. స్పెయిన్‌లో జరిగే అంతర్యుద్ధంలో విదేశాలు జోక్యం చేసుకోకూడదని బ్రిటన్ ప్రకటించింది. బ్రిటన్‌తోపాటు ఇతర యూరప్ రాజ్యాలు కూడా అనేక ప్రయత్నాలు చేసినప్పటికినీ స్పెయిన్ అంతర్యుద్ధంలో విదేశాల జోక్యం కొనసాగింది. ముఖ్యంగా, ఇటలీ, జర్మనీలు భారీఎత్తున తిరుగుబాటుదారులకు సహాయపడినాయి. 1936 జూలైలో ప్రారంభమైన స్పెయిన్ అంతర్యుద్ధము 1939 వరకు కొనసాగింది. చివరకు జనరల్ ఫ్రాంకో పక్షం గెలిచినందువల్ల రిపబ్లిక్‌ను పడగొట్టి స్పెయిన్‌కు ఫ్రాంకో నియంత అయినాడు. మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఇటలీ ఆధిపత్యాన్ని స్థాపించడం కోసం ముస్సోలినీ స్పెయిన్ అంతర్యుద్దంలో జోక్యం చేసుకున్నాడు.

## 17.1.6.4 ఇటలీ, జర్మనీల మధ్య ఒడంబడిక :

స్పెయిన్ అంతర్యుద్ధంలో జోక్యం కల్పించుకున్నప్పటి నుంచి ఇటలీకి పశ్చిమ రాజ్యాలతో పోరాటం ప్రారంభమైంది. అందువల్ల తన రక్షణ కోసం ఇటలీ ఆస్ట్రియా పట్ల దురాక్రమణ విధానాన్ని అనుసరిస్తున్న జర్మనీకి మద్దతు ఇవ్వడానికి నిశ్చయించుకొన్నది. 1937 సెప్టెంబరులో ముస్సోలినీ బెర్లిన్ దర్శించి హిట్లర్ చేస్తున్న సైనిక సన్నాహాలు చూసి భవిష్యత్తులో జరగబోయే యుద్ధంలో జర్మనీ తప్పక విజయాన్ని సాధిస్తుందని అభిప్రాయపడినాడు. 1937 నవంబరులో ముస్సోలినీ కామిన్ టర్న్ వ్యతిరేక టోక్యో - బెర్లిన్ ఒప్పందంలో చేరి నానాజాతి సమితి నుంచి తన సభ్యత్వాన్ని ఉపసంహరించుకొని, జర్మనీతో తన సంబంధాలను పటిష్టం చేసుకోసాగినాడు. 1938లో బలప్రయోగం చేసి హిట్లర్ ఆస్ట్రియాను కలుపుకోవడాన్ని ముస్సోలినీ సమర్థించాడు. ముస్సోలినీ ఆహ్వానం మీద ఇటలీ సందర్శించడానికి వచ్చిన హిట్లర్ కామిన్‌టర్న్ ఒడంబడికను సైనిక ఒడంబడికగా మార్చవలెననే ప్రతిపాదనను చేసినాడు. జర్మనీ సైనిక బలము చాలా గొప్పదని నమ్మిన ముస్సోలినీ హిట్లర్‌తో 1939 మే 22న ఒక సైనిక ఒప్పందం చేసుకున్నాడు. ఈ ఒప్పందం ప్రకారం ఇరుపక్షాలు రాజకీయ, ఆర్థిక, దౌత్య రంగాలలో పరస్పరం సహకరించుకోవడానికి, అవసరం వచ్చినపుడు ఒకరికొకరు సైనిక సహాయం చేసుకోవడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి.

## 17.1.6.5 రెండో ప్రపంచయుద్ధంలో పాల్గొనుట :

1939 సెప్టెంబర్ 1న జర్మనీ పోలెండ్‌పై దాడిచేయడంతో రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైనది. జర్మనీ వరుసగా విజయాలను సాధించడం, ఫ్రాన్స్ పతనం కావడం, తన కుమార్తె ఎడ్డా ప్రోద్బలము మొదలైన కారణాలవల్ల ముస్సోలినీ జర్మనీపక్షం చేరి యుద్ధంలో పాల్గొన్నాడు. 1940 జూన్ 19న హిట్లర్, ముస్సోలినీలు యూనిక్ సమావేశంలో పాల్గొన్నారు. ఫ్రాన్స్, జర్మనీల మధ్య ఫ్రాన్స్, ఇటలీల మధ్య యుద్ధవిరమణ ఒడంబడికలు జరిగాయి. గ్రీస్‌లో అపజయాలను ఎదుర్కొంటున్న ఇటలీకి సైనిక

సామాగ్రిని అందజేయడానికి హిట్లర్ అంగీకరించడంతో ఇటలీ జర్మనీకి లొంగిపోయి ఉండవలసి వచ్చింది. 1941లో జర్మనీతోపాటు ఇటలీ కూడా రష్యా మీద యుద్ధం ప్రకటించింది. తరువాత అమెరికా మీద కూడా ఇటలీ యుద్ధం ప్రకటించింది.

### 17.1.6.6. ముస్సోలినీ పతనం :

1942 నుంచి యుద్ధక్రమంలో మార్పు వచ్చింది. వరుసగా యుద్ధంలో ఇటాలియన్ సైన్యాల ఓటమి, యుద్ధంపట్ల ప్రజల వ్యతిరేకవైఖరి, నాజీ జర్మనీ పట్ల ఇటాలియన్‌ల ద్వేషము, ఆంతరంగిక ఆర్థిక సంక్షోభము మొదలైన కారణాలవల్ల ముస్సోలినీ పతనమయ్యే పరిస్థితి ఏర్పడింది. 1943 జూలైలో మిత్రరాజ్యాలు దక్షిణ ఇటలీని ఆక్రమించాయి. దీంతో ఇటలీరాజు విక్టర్ ఇమ్మాన్యుయేల్ ముస్సోలినీని పదవి నుండి తొలగించి అతని స్థానంలో మార్షల్ పెడ్రో బడ్గ్గియోను నియమించాడు. పదవి పోయినా జర్మనీ సాయంతో ముస్సోలినీ కొన్నాళ్ళు యుద్ధం సాగించాడు. కాని పరాజం పాలైనాడు. అందువలన 1945 ఏప్రియల్ 2న ఉత్తర ఇటలీలో తన ప్రజలే ముస్సోలినీని కాల్చిచంపారు. ముస్సోలినీ మరణంతో ఇటలీలో ఫాసిజమ్ అంతమయింది.

### 17.1.6.7 ఘనత :

రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో ముస్సోలినీ ప్రయత్నాల ఫలితంగా ఇటలీ యూరప్ రాజకీయాలలో సముచిత స్థానాన్ని సంపాదించగలిగింది. అంతర్జాతీయ రాజకీయాలలో కూడా ఇటలీ ప్రతిష్ఠ పెరిగింది. దేశం స్వయం సమృద్ధిని సాధించింది. కమ్యూనిజమ్ వ్యాప్తి అరికట్టబడింది. కాని రెండో ప్రపంచయుద్ధంలో హిట్లర్‌తో కలిసి వినాశనం కొని తెచ్చుకొన్నాడు.

### 17.1.7 నమూనా ప్రశ్నలు :

1. ఇటలీలో ఫాసిజమ్ అవతరించడానికి కారణాలు తెలుపుము.
2. ముస్సోలినీ అధికారంలోకి వచ్చిన విధము, అతని ఆంతరంగిక, విదేశాంగ విధానము గురించి వివరింపుము.
3. స్పెయిన్‌లో అంతర్యుద్ధము.

### 16.7 చదువదగిన గ్రంథాలు :


1. C.J.A.H. Hayes - Modern Europe since 1870
2. C.D. Hazan - Modern Europe upto 1945
3. H.L. Peacock - Modern European History


- శ్రీ కె. సూర్య ప్రకాష్‌రెడ్డి

పాఠం - 17.2

# జర్మనీలో నాజీయిజమ్ - హిట్లర్

## 17.2.0 లక్ష్యం :

మొదటి ప్రపంచయుద్ధానంతరం జర్మనీలో ఏర్పడిన వైమార్ రిపబ్లిక్ గురించి, హిట్లర్ విజృంభణకు దోహదం చేసిన అంశాలగురించి, హిట్లర్ ఆంతరంగిక, విదేశాంగ విధానం గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## ముఖ్యాంశాలు :

- 17.2.1 పరిచయం
- 17.2.2 వైమార్ రిపబ్లిక్
- 17.2.3 జర్మనీలో నాజీనియంతృత్వం ఏర్పడడానికి దోహదపడిన అంశాలు
  - 17.2.3.1 వర్సేసంధి
  - 17.2.3.2 ఆర్థిక సంక్షోభము
  - 17.2.3.3 కమ్యూనిజమ్ వ్యాప్తి చెందడం
  - 17.2.3.4 యూదు వ్యతిరేక ప్రచారము
  - 17.2.3.5 వైమార్ రిపబ్లిక్ వైఫల్యము
  - 17.2.3.6 మిత్రరాజ్యాలను తృప్తిపరిచే విధానము
  - 17.2.3.7 జర్మన్ జాతీయవాదము
  - 17.2.3.8 హిట్లర్ వ్యక్తిత్వం
- 17.2.4 నాజీయిజమ్ సిద్ధాంతాలు
- 17.2.5 హిట్లర్ వృద్ధిక్షయాలు
  - 17.2.5.1 తొలి జీవితం
  - 17.2.5.2 అధికారాన్ని హస్తగతం చేసుకొనుట
  - 17.2.5.3 నియంతృత్వ స్థాపన
  - 17.2.5.4 ఆంతరంగిక విధానము
    - 17.2.5.4.1 ఆర్థిక సంస్కరణలు
    - 17.2.5.4.2 సైనిక సంస్కరణలు
    - 17.2.5.5 విదేశాంగ విధానము
    - 17.2.5.5.1 జర్మనీ రక్షణకు హిట్లర్ చేపట్టిన చర్యలు
    - 17.2.5.5.2 సైనిక కూటముల ఏర్పాటు, రోమ్ - బెర్లిన్, టోక్యో పక్షం
    - 17.2.5.5.3 ఆస్ట్రియా ఆక్రమణ

17.2.5.5.4 మ్యూనిక్ ఒప్పందము - చెకొస్లొవాకియా ఆక్రమణ
17.2.5.5.5 పోలెండ్ మీద జర్మనీ దాడి
17.2.5.5.6 రెండో ప్రపంచయుద్ధం
17.2.5.5.7 హిట్లర్ పతనం
17.2.5.6 హిట్లర్ ఘనత
17.2.7 నమూనా ప్రశ్నలు
17.2.9. చదువదగిన గ్రంథాలు

## 17.2.1 పరిచయం :

1870 - 71 లలో ఏకీకరణ చెందిన జర్మనీ 1914 నాటికి పారిశ్రామిక, వాణిజ్య, సైనిక రంగాలలో అసాధారణమైన విజయాలను సాధించింది. మొదట ప్రపంచయుద్ధంలో (1914 - 18) జర్మనీ వీరోచితంగా పోరాడినప్పటికిని విపరీతమయిన నష్టానికి గురయింది. ఆర్థికంగా, సైనికంగా పూర్తిగా దెబ్బతిన్నది. యుద్ధంలో తొలిదశలో అనేక సైనిక విజయాలను సాధించిన జర్మనీ చివరకు పూర్తిగా ఓడిపోయి మిత్రరాజ్యాలకు లొంగిపోవలసి వచ్చింది. అంతేగాక జర్మనీ ఆంతరంగిక సంక్షోభాన్ని కూడా ఎదుర్కోవలసి వచ్చింది. అయినప్పటికినీ యుద్ధానంతరం ఒక క్రమశిక్షణ ఉన్నజాతిగా అనేక క్లిష్టపరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవటమేగాక ఆంతరంగిక అరాజక పరిస్థితులను అధిగమించి సుస్థిర రాజకీయ వ్యవస్థను కూడా జర్మనీ ఏర్పాటు చేసుకోగలిగింది.

## 17.2.2 వైమార్ రిపబ్లిక్ :

మొదటి ప్రపంచయుద్ధంలో జర్మనీ పరాజయం చెందడానికి, యుద్ధానంతరం దేశము అన్నిరకాలైన దుస్థితిని ఎదుర్కొనటానికి జర్మన్ చక్రవర్తి రెండో విలియమ్ కారణమని అతనిపట్ల ఆగ్రహాన్ని పెంచుకోవడంతో దేశంలో రాచరిక వ్యతిరేక ఉద్యమం చెలరేగింది. దీనిలో 1918 నవంబర్ 8న విలియమ్ చక్రవర్తి సింహాసనాన్ని త్యజించి కుటుంబ సమేతంగా దేశం విడిచిపోయి హాలెండ్‌లో ఆశ్రయం పొందినాడు. అంతవరకు ఛాన్సలర్‌గా పనిచేసిన ప్రిన్స్‌మాక్స్ తన పదవీ బాధ్యతలను మెజారిటీ సోషలిస్టుల నాయకుడైన హెర్‌ఎబర్ట్‌కు అప్పగించినాడు. వీరినే సోషల్ డెమోక్రాట్లు అని అంటారు. జర్మనీని రిపబ్లిక్‌గా ప్రకటించడం జరిగింది. కమ్యూనిస్ట్‌లు అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నించగా రిపబ్లిక్ ప్రభుత్వము సైనిక సహాయంతో అణిచివేసింది.

నూతన రాజ్యాంగాన్ని తయారుచేయడానికి జాతీయ ప్రతినిధుల సభ వైమార్ అనే పట్టణంలో సమావేశమైంది. శాసనసభలో మెజారిటీ స్థానాలను గెలుచుకోలేకపోయినా సోషల్ డెమోక్రాటిక్ పార్టీ, డెమాక్రాట్స్, సెంటర్‌పార్టీ మొదలైన ఇతర పార్టీల సహకారంతో ఫిలిఫ్ షీడ్‌మాన్ నాయకత్వంలో మిశ్రమ ప్రభుత్వాన్ని స్థాపించింది. ఈ ప్రభుత్వం వర్సై సంధి మీద సంతకం చేసింది. 1920 జులైలో ప్రాథమిక హక్కులు, జనవాక్య సేకరణ, ఇనీషియేటివ్ మొదలైన ప్రజాస్వామ్య లక్షణాలతో కూడిన నూతన రాజ్యాంగాన్ని శాసనసభ ఆమోదించింది. దీనినే వైమార్ రాజ్యాంగం అంటారు. ఈ రాజ్యాంగం ప్రకారం జర్మనీలో రాచరికం రద్దయి ప్రజాస్వామ్యం ఏర్పడింది. సోషల్ డెమోక్రాట్ల నాయకుడైన హెర్ ఎబర్ట్ వైమార్ రిపబ్లిక్ ప్రథమ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు.

1920 నుంచి 1933 వరకు వైమార్ రిపబ్లిక్ కొనసాగింది. ఈ ప్రభుత్వం మొదట్లో అనేక క్లిష్ట సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. అవమానకరమైన వర్సైసంధిని ఆమోదించిన ప్రభుత్వమనే ఆరోపణను ఈ రిపబ్లిక్ మీద వేసినారు. అంతేగాక

మిత్రరాజ్యాలు జర్మనీని దోషిగా పరిగణించినాయి. దేశంలోని అనేక ప్రాంతాలను, వలసలను కోల్పోవడమేగాక నష్టపరిహారం చెల్లించవలసి వచ్చింది. పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొనవలసి వచ్చింది.

వైమార్ రిపబ్లిక్ విదేశ వ్యవహారాలలో కొంత విజయాన్ని సాధించింది. జనవాక్య సేకరణ ప్రకారం ఎగువ సైలీషియాను జర్మనీలో పూర్తిగా విలీనం చేయవలసి వుండగా, పోలెండ్ కోరిక మేర సమితి జోక్యం చేసుకొని మూడింట రెండువంతుల భాగాన్ని మాత్రమే జర్మనీకిచ్చింది. ఈ ఏర్పాటును జర్మన్‌లు హర్షించలేదు. జర్మనీ 1922లో సోవియట్ రష్యాతో రపెల్లో సంధి చేసుకొన్నది. దీనివల్ల రెండు దేశాలమధ్య సాధారణ దౌత్యసంబంధాలు నెలకొన్నాయి. ఈ సంధి జరిగిన తరువాత ఫ్రాన్స్ విపరీతంగా భయపడి, జర్మనీకి చెందిన రూల్‌ను 1923లో ఆక్రమించుకొన్నది. అయితే తరువాత బ్రిటన్ ప్రయత్నాల ఫలితంగా ఫ్రాన్స్ తన సైన్యాలను రూల్ నుంచి ఉపసంహరించుకొంది. 1925లో జర్మనీ లొకర్నో ఒడంబడికను చేసుకున్న కారణంగా ఫ్రాన్స్, జర్మనీల మధ్య సంబంధాలు అభివృద్ధిచెందడమేగాక 1926లో జర్మనీ సమితిలో సభ్యరాజ్యంగా చేరింది. తన భద్రతకు హామీ చేకూరినట్లు ఫ్రాన్స్ భావించి సంతృప్తి చెందింది. ఈ విధంగా 1926 నాటికి ప్రపంచంలో సుస్థిర శాంతి స్థాపనకు అనువైన వాతావరణము ఏర్పడింది. 1927 నాటికి వివిధ జర్మన్ భూభాగాల నుంచి విదేశీ సైన్యాలను ఉపసంహరించడం జరిగింది. మిత్రరాజ్యాల సైనిక కమీషన్ కూడా రద్దు చేయడం జరిగింది. వైమార్ రిపబ్లిక్ తొలి అధ్యక్షుడైన ఫ్రెడరిక్ ఎబర్ట్ మరణానంతరం రెండో అధ్యక్షుడుగా ఎన్నికైన మాజీయుద్ధ వీరుడైన 78 ఏళ్ళ ఫీల్డ్‌మార్షల్ హిండెన్‌బర్గ్ జర్మన్ రాజకీయాలలోకి సుస్థిరతను ప్రవేశపెట్టినాడు. 1927లో నోబెల్ శాంతి బహుమతి జర్మన్ విదేశాంగమంత్రి స్ట్రెస్‌మన్‌కు లభించింది. 1928లో ఇతర యూరప్ రాజ్యాలలో సమానస్థాయిలో జర్మన్ పారిస్ ఒడంబడిక మీద సంతకం చేసింది. యంగ్ కమీషన్ సిఫారసులను అనుసరించి జర్మనీ మిత్రరాజ్యాలకు చెల్లించవలసిన నష్టపరిహారం మొత్తాన్ని చాలావరకు తగ్గించి 58 సంవత్సరాలలో కట్టేటట్లు నిర్ణయించడం జరిగింది. ఆర్థికంగా జర్మనీ మీద విధించిన అన్నిరకాల అంతర్జాతీయ ఆంక్షలను రద్దుచేయడం జరిగింది. ఈవిధంగా జర్మనీ కోల్పోయిన ప్రతిష్ఠను తిరిగి సంపాదించుకొంది.

## 17.2.3 జర్మనీలో నాజీ నియంతృత్వం ఏర్పడడానికి దోహదపడిన అంశాలు :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఐరోపాలో వచ్చిన మార్పులలో అతి ముఖ్యమైన సంఘటన జర్మనీలో నాజీ నియంతృత్వం అవతరించుట. నాజీ వ్యవస్థాపకుడు హిట్లర్. జర్మనీలో నాజీ నియంతృత్వం ఏర్పడుటకు అనేక కారణాలు గలవు. అవి :

### 17.2.3.1 వర్సే సంధి :

వర్సేసంధిలోని అవమానకరమైన షరతులు జాతీయ భావమున్న జర్మన్‌లను గాయపరచడమేగాక, మిత్రరాజ్యాలపట్ల జర్మన్‌లకు పగ సాధింపు ధోరణి ఏర్పడడానికి కూడా కారణమైనాయి. ఈ పరిస్థితులలో జర్మన్ కోల్పోయిన ప్రతిష్ఠను తిరిగి సంపాదించడానికి ప్రయత్నించి హిట్లర్ జర్మన్‌ల అభిమానాన్ని చూరగొన్నాడు. వర్సే సంధిపై సంతకం చేసిన వైమార్ రిపబ్లిక్‌ను రద్దుచేసి, దాని స్థానే పటిష్ఠమైన ప్రభుత్వాన్ని స్థాపించినపుడు మాత్రమే జర్మనీ అవమానం నుంచి విముక్తి పొందగలదని ప్రజలలో ప్రచారం చేసినాడు. వర్సేసంధిని సాకుగా తీసుకొని నాజీలు తాము దేశభక్తులుగాను, వైమార్ ప్రభుత్వాన్ని దేశానికి వ్యతిరేకమైనదిగాను చిత్రించారు.

### 17.2.3.2 ఆర్థిక సంక్షోభము :

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జర్మనీలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని నాజీలు స్వప్రయోజాలకు వాడుకొన్నారు. వ్యవసాయం దెబ్బతిన్నందువల్ల వ్యవసాయదారుల పరిస్థితి గోచనీయంగా ఉంది. రైతుల పరిస్థితిని మెరుగుపరుస్తామని వాగ్దానం

చేసి నాజీలు రైతువర్గంలో తమ పలుకుబడిని పెంచుకున్నారు. పెద్ద వ్యాపారస్తులు పోటీ నుంచి చిన్నవ్యాపారస్తులను రక్షించి ప్రభుత్వ సహాయాన్ని అందజేసి వారి పరిస్థితిని మెరుగుపరుస్తామని నాజీలు ప్రచారం చేశారు. నిరుద్యోగులైన జర్మన్ యువకులను నాజీ సిద్ధాంతాలు బాగా ఆకర్షించాయి. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి వెంటనే విముక్తి చేస్తామని, ప్రజలందరికీ కావలసిన అన్ని సౌకర్యాలను కలుగజేస్తామని నిరుద్యోగులైన ఐదు మిలియన్‌ల జర్మన్‌లకు ఉద్యోగాలిప్పిస్తామని నాజీలు హామీ ఇచ్చినారు. జర్మన్ ప్రజలలో అధిక సంఖ్యాకులు నాజీ ప్రచారానికి తమ మద్దతునిచ్చినారు. అదృష్టవశాత్తు జర్మనీ ఆర్థిక సంక్షోభం నుంచి విముక్తి చెందుతున్న తరుణంలో నాజీపార్టీ అధికారంలోకి వచ్చింది.

## 17.2.3.3 కమ్యూనిజమ్ వ్యాప్తి చెందడం :

జర్మనీలో నాజీ విప్లవం విజయం కావడానికి మరొక కారణము దేశంలో కమ్యూనిజమ్ వ్యాప్తిచెందడం. ఆర్థికమాంద్య తరుణములో లక్షలాది నిరుద్యోగులు కమ్యూనిస్ట్ పార్టీలో చేరినారు. 1930లో జర్మన్ శాసనసభలో కమ్యూనిస్ట్ సభ్యుల సంఖ్య 77 కాగా 1932 నాటికి వారి సంఖ్య 100కు పెరిగింది. అదేకాలంలో శాసనసభలో నాజీసభ్యుల సంఖ్య కమ్యూనిస్ట్‌ల కంటే తక్కువ. ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షమైన కారణంగా చాలామంది జర్మన్‌లు కమ్యూనిస్ట్‌లను సమర్థించినారు. కాని నిజానికి జర్మన్ ప్రజలకు కమ్యూనిస్ట్‌ల పట్ల ద్వేషమెక్కువ. జర్మన్ ప్రజల మనోభావాలను అవగాహన చేసుకున్న నాజీలు జాతీయ సామ్యవాద (నాజీ) పార్టీ పతనం కమ్యూనిస్ట్‌ల వ్యాప్తికి తోడ్పడుతుందనే నినాదాన్ని ప్రచారం చేశారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతాల వ్యాప్తివల్ల భీతిచెందిన పారిశ్రామికవేత్తలు, ఇతర సంపన్నవర్గ ప్రజలు నాజీపార్టీకి ఇతోధిక సహాయం చేసినారు. మొత్తం మీద జర్మన్ ప్రజలలో అధిక సంఖ్యాకులకు జర్మనీని కమ్యూనిస్ట్‌ల బారినుంచి నాజీలుమాత్రమే కాపాడగలరనే నమ్మకం కలిగింది. కాబట్టి నాజీ పార్టీ విజయానికి జర్మన్ ప్రజలకు గల కమ్యూనిస్ట్ భీతి ఒక ముఖ్యకారణమని చెప్పవచ్చు.

## 17.2.3.4 యూదు వ్యతిరేక ప్రచారం :

జర్మన్‌లు యూదులను విదేశస్థులుగా భావించి ద్వేషించేవారు. జర్మనీలో యూదులు సంపన్న వర్గానికి చెందినవారు. జర్మనీ ఎదుర్కొంటున్న క్లిష్టపరిస్థితులను ముఖ్యంగా ఆర్థికదుస్థితికి యూదులు కారణమనే ప్రచారాన్ని కొనసాగించి నాజీలు జర్మన్ ప్రజలకు యూదులపట్ల ద్వేషాన్ని పెంపొందించినారు. ఈ విధంగా యూదులను వ్యతిరేకంగా విరామంలేని ప్రచారంచేసి ప్రజలలో పలుకుబడి సంపాదించుకొని నాజీలు వైమార్ రిపబ్లిక్‌ను అంతంచేసి అధికారానికొచ్చారు.

## 17.2.3.5 వైమార్ రిపబ్లిక్ వైఫల్యము :

ఆనాడు జర్మనీ ఎదుర్కొను సమస్యలను పరిష్కరించుటలో వైమార్ రిపబ్లిక్ విఫలమయినది. అలాగే ఆనాటి రాజకీయ పక్షాలు అధికార దాహంతో కుమ్ములాడుకోసాగాయి. ప్రభుత్వం ఆంతరంగిక సంస్కరణల పట్ల స్థిరమయిన, సమర్థవంతమైన విధానాన్ని అవలంబించలేకపోయింది. దాని విదేశాంగ విధానం ప్రజాదరణ పొందలేకపోయింది. అందువల్ల ప్రజలకు ప్రభుత్వంపట్ల నమ్మకం పోయింది.

## 17.2.3.6 మిత్రరాజ్యాల తృప్తిపరచే విధానం :

మిత్రరాజ్యాలు వర్సే సంధి సూత్రాలను పూర్తిగా అమలుపరచక జర్మనీపట్ల తృప్తిపరచే విధానం అనుసరించారు. ఈ వైఖరి వలన జర్మనీ ధైర్యం పుంజుకొని విజృంభించింది.

### 17.2.3.7 జర్మనీ జాతీయవాదము :

మొదటి ప్రపంచయుద్ధానంతరం, జాత్యహంకారంతోను, జాతికి కలిగిన అవమానానికి ప్రతీకారేచ్ఛతో ఉడికిపోతూ, జర్మనీ తీవ్ర జాతీయవాదానికి తావిచ్చింది. జర్మన్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కంటే గౌరవప్రతిష్ఠలను వైభవాన్ని అధికంగా భావింపసాగారు.

### 17.2.3.8 హిట్లర్ వ్యక్తిత్వం :

హిట్లర్ యొక్క ఆకర్షణీయమైన వ్యక్తిత్వం నాజీయిజమ్ వ్యాప్తికి ప్రధానంగా కారణభూతమైంది. హిట్లర్ ప్రజల మనస్తత్వం బాగా తెలిసినవాడు. లక్షలాది ప్రజలను ఉగ్రూతలూగింపగల మహావక్త. సమర్థుడైన ఆందోళనకారుడు. విసుగు విరామమెరుగక పార్టీ నిర్మాణానికి కృషిచేయగల విశిష్టవ్యక్తి. ఇటువంటి నాయకుని నేతృత్వంలో నాజీపార్టీ పురోగతి సాధించడంలో ఆశ్చర్యంలేదు. హిట్లర్ వాలంటీర్ల దళాన్ని ఏర్పాటుచేసి తన సమావేశాలలో శాంతిభద్రతలను నెలకొల్పు బాధ్యతను, ప్రతిపక్షాల సమావేశాలను భగ్నంచేయు బాధ్యతను అప్పగించాడు. వీరు తమ విధులను సక్రమంగా నిర్వహించుట వలన ప్రతిపక్షాలు బలహీనమయ్యాయి. నాజీపార్టీ కార్యకర్తలు నాజీ సిద్ధాంతాలను దేశమంతా ప్రచారం చేసినారు. "హిట్లర్ వాగ్ధానాలు ప్రధానంగా ఆకర్షణీయమైన ఆర్థిక కార్యక్రమం. నిరుద్యోగ నిర్మూలన, అందరికి పని అనునవి ప్రజలపై అద్భుతంగా పనిచేసినవి" అని గ్రాంట్ మరియు టెంపర్లీ పండితులు వ్యాఖ్యానించారు.

### 17.2.4 నాజీయిజమ్ సిద్ధాంతాలు :

నాజీయిజమ్ అనగా జాతీయ సామ్యవాద సిద్ధాంతము. 1918లో డ్రెక్స్లర్ స్థాపించిన పార్టీలోని హిట్లర్ చేరి దాని మూల సిద్ధాంతాలను రూపొందించి నాజీపార్టీ అని పేరు పెట్టాడు. ఇందులో జాతీయత, సామ్యవాదం అను రెండు పదాలుకలవు. నాజీయిజమ్ ప్రకారం రాజ్యానికి సర్వాధికారులుండవలెను. జాతీయ ప్రయోజనాలకు హాని కలగనంతవరకు వ్యక్తులకు ఆస్తిహక్కు ఉండవచ్చు. ప్రచార సాధనాలన్నీ ప్రభుత్వ నియంత్రణలో ఉండవలెను. ఏకపక్ష నాజీ నియంతృత్వ ప్రభుత్వము నెలకొల్పవలె. లక్ష్యసాధనకు యుద్ధం ప్రధాన మార్గం. జర్మన్ జాతి ఇతర జాతుల కంటే ఉత్కృష్టమయింది. కాని ప్రపంచాన్ని పాలించే అర్హత జర్మన్ జాతికుంది. దేశరక్షణకు కావలసిన సంతానమును కనుట స్త్రీల ముఖ్యవిధి. వారు రాజకీయాలలో పాల్గొనరాదు.

వర్సే సంధిని ఉల్లంఘించి తాము కోల్పోయిన ప్రాంతాలు తిరిగి పొందుట, అవమానకరమైన సంధి చేసుకున్న వైమార్ రిపబ్లిక్‌ను పడగొట్టుట, జర్మన్ ఆర్థిక దుస్థితికి కారణభూతమైన యూదులను తరిమివేయుట, కమ్యూనిజమ్‌ను అరికట్టి జర్మన్ జాతీయతను కాపాడుట నాజీయిజమ్ ఆశయాలు.

### 17.2.5 హిట్లర్ వృద్ధి క్షయాలు :

1929లో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక మాంధ్యమువల్ల జర్మనీ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. నాటి జర్మన్ ప్రభుత్వం ఈ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడంలో విఫలమైంది. ఈ క్లిష్టపరిస్థితిని అవకాశంగా తీసుకొని రాజకీయ రంగంలో అడాల్ఫ్ హిట్లర్ నాయకత్వంలో వున్న జాతీయసామ్యవాదులు (నాజీలు) విజృంభించి అధికారాన్ని హస్తగతం చేసుకొని దుందుడుకు విధానం అనుసరించి జర్మనీ వినాశనానికి కారకులయ్యారు.

### 17.2.5.1 తొలి జీవితం :

నాజీ ఉద్యమ నాయకుడైన అడాల్ఫ్ హిట్లర్ జర్మనీ దేశస్థుడు కాడు. హిట్లర్ 1889లో ఆస్ట్రియాలోని బౌనౌ - ఆమ్ - ఇన్ అనే పట్టణంలో జన్మించాడు. లంబాక్‌లో వున్న బేనెడిక్టైన్ ఆశ్రమంలో వుంటూ, చర్చి ప్రార్థనలలో పాల్గొంటూ, ఏనాటికైనా మతాచార్యుడు కావాలని ఆశిస్తుండేవాడు. తరువాత లింజ్‌లో ఉన్నతపాఠశాలలో చదువు సాగించాడు. చదువులో అతనిది మధ్యమస్థాయి. కళాకారునిగా జీవితాన్ని సాగించాలని, వియన్నాలోని లలిత కళా అకాడమీలో ప్రవేశానికి ప్రయత్నించి విఫలుడైనాడు. తరువాత కొన్నాళ్ళు కార్మికుడిగా, పోస్టుకార్డులు అమ్మే కుర్రవానిగా, ఇటుకలు తయారుచేసే పనివాడుగా పనులు చేసాడు. కొంతకాలం గాయకుడిగా జీవితాన్ని గడిపాడు. తరువాత నిషి అను తత్వవేత్త ప్రభావంవల్ల జాతీయవాదిగా మారాడు. జర్మనీ చరిత్ర చదివి జర్మనీపై అభిమానం పెంచుకున్నాడు. 1913లో వియన్నా వదిలిపెట్టి మ్యూనిచ్ నగరం చేరాడు.

శాంతియుతమైన జీవతం కంటే సాహసోపేతమైన సైనిక జీవితంపట్ల హిట్లర్‌కు మొదటినుంచీ మక్కువ ఎక్కువ. ఆస్ట్రియా దేశస్థుడైనప్పటికీ జర్మన్ సైన్యంలో చేరి మొదటి ప్రపంచయుద్ధంలో పోరాడినాడు. యుద్ధంలో రెండుసార్లు గాయపడ్డాడు. ఒకసారి ద్వితీయశ్రేణి క్రాస్‌నూ, రెండోసారి కార్పొరల్‌గా ప్రథమశ్రేణి ఐరన్‌క్రాస్‌నూ సత్కారంగా పొందాడు. యుద్ధవిరమణ సంధి జరిగినపుడు లక్షలాదిమంది జర్మన్‌లవలె హిట్లర్ కూడా జర్మనీని సోషల్ డెమోక్రాట్లు వెన్నుపోటు పొడిచారని భావించాడు. ఇదే సమయంలో రాజకీయాలలో ప్రవేశించాలని అతడు నిర్ణయం తీసుకున్నాడు.

1918లో డ్రెక్స్లర్ అను మితవాద నాయకుడు స్థాపించిన జర్మన్ కార్మికుల పక్షంలో హిట్లర్ 1920లో చేరినాడు. ఆ సంవత్సరమే కార్మికుల పక్షం పూర్తిగా పునర్ వ్యవస్థీకృతమై నేషనల్ సోషలిస్ట్ జర్మన్ వర్కర్స్ పార్టీ అనే పేరుతో ప్రజాదరణ పొందసాగింది. పార్టీని పూర్తిగా తన నాయకత్వం క్రిందకి తెచ్చుకున్న తరువాత హిట్లర్ ఒక సమావేశంలో 25 అంశాల కార్యక్రమాన్ని ప్రకటించాడు. అందులోని ముఖ్యాంశాలు : బృహత్ జర్మనీ స్థాపన, యూదు వ్యతిరేకత, శ్రమించి సంపాదించిన ఆదాయాల రద్దు, ట్రస్ట్‌ల జాతీయాకరణ, ఒక జెండాను కూడా తయారుచేయడం జరిగింది. ఎర్రరంగులో వుండే ఆజెండాకు మధ్యలో తెల్లటి ఒక వలయం, ఆ వలయంలో నలుపురంగులో స్వస్తిక్ చిహ్నముంటుంది. హిట్లర్ ఉద్దేశ్యంలో ఎరుపురంగు ఉద్యమ సామాజిక భావనకు సంకేతం, తెలుపు రంగు జాతీయభావాన్ని, స్వస్తిక్ చిహ్నం ఆర్యజాతి శక్తిని సూచిస్తుంది. హెస్, గోరింగ్, రోసెన్‌బెర్గ్ మొదలైన ప్రముఖులు చేరడంతో పార్టీకి బలం చేకూరింది. హిట్లర్ దేశంలోని ఇతర పార్టీలను ఘాటుగా విమర్శించటం ప్రారంభించాడు.

1923లో హిట్లర్ తన అనుయాయులతో కలిసి మూనిక్‌లో బలప్రయోగం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నించాడు. దీనిని 'బీర్‌హాల్‌ఫట్స్' అంటారు. ఈ ప్రయత్నం విఫలం కావడంతో హిట్లర్ బంధీ అయినాడు. లాండ్స్‌బర్గ్ జైలులో ఉన్నకాలంలో హిట్లర్ తన జీవిత చరిత్రను 'మైన్ కాంఫ్' (నాపోరాటం) అనే గ్రంథంగా వ్రాసినాడు. ఈ గ్రంథంలో హిట్లర్ నాజీపార్టీ ప్రణాళికను, సిద్ధాంతాలను వివరించాడు. వైమార్ రిపబ్లిక్‌ను పడగొట్టటం, వర్సై సంధిని ఉల్లంఘించడం, వలసలను తిరిగి పొందడం, యూదులను దేశం నుంచి వెళ్ళగొట్టడం, కమ్యూనిజమ్‌ను అరికట్టడం మొదలైనవి నాజీపార్టీ కార్యక్రమంలోని ముఖ్యభాగాలుగా హిట్లర్ ఈ గ్రంథంలో పేర్కొన్నాడు. 'మైన్ కాంఫ్' నాజీలకు బైబిల్ వంటిది. జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి రాజ్యాంగ పద్ధతుల ద్వారా వైమార్ రిపబ్లిక్‌ను విచ్ఛిన్నం చేయడానికి హిట్లర్ పథకం వేసుకున్నాడు.

### 17.2.5.2 అధికారాన్ని హస్తగతం చేసుకొనుట :

హిట్టర్ కారాగారంలో ఉన్న కాలంలో నాజీపార్టీ సరి అయిన నాయకత్వం లేనందువల్ల బలహీనపడింది. 1924లో జరిగిన ఎన్నికలలో నాజీపార్టీని సమర్థించే వారిసంఖ్య మరింత తగ్గింది. 1925లో నాజీపార్టీ వ్యవస్థలో అనేక మార్పులు జరిగిన

కారణంగా ప్రజలలో పలుకుబడిని సంపాదించగల్గింది. 1928లో జరిగిన ఎన్నికలలో నాజీనాయకులయిన గోరింగ్, గోబెల్స్‌లు నాజీపార్టీ సభ్యులుగా ఎన్నికై శాసనసభలో ప్రవేశించినారు. 1929లో ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థికమాంద్యం వల్ల జర్మనీ ఆర్థికవ్యవస్థ బాగా దెబ్బతిన్నది. ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడంలో జర్మన్ ప్రభుత్వం విఫలమైంది. దీనిని అవకాశంగా తీసుకొని హిట్లర్ గంభీర ఉపన్యాసాలుచేసి ప్రజలలో తన పలుకుబడిని పెంచుకున్నాడు. 1932లో జరిగిన ఎన్నికలలో శాసనసభలోని 608 స్థానాలలో 230 స్థానాలను నాజీ పార్టీ గెలుచుకోగలిగింది. 1933 జనవరిలో అధ్యక్షుడు హిండెన్‌బర్గ్ శాసనసభలోని మెజారిటీపార్టీ నాయకుడైన హిట్లర్‌ను ఛాన్సలర్‌గా నియమించినాడు. శాసనసభలో నాజీ పార్టీకి మెజారిటీ లేనందువల్ల హిట్లర్ నాయకత్వంలో మిశ్రమ ప్రభుత్వం ఏర్పడింది. కాని హిట్లర్ అధికారాన్ని పూర్తిగా తన వశం చేసుకోవడానికి శాసనసభా భవనానికి తన వారిచే నిప్పంటించాడు. తరువాత అధ్యక్షుని ప్రకటన ద్వారా వ్యక్తి స్వేచ్ఛ, వాక్స్వాతంత్ర్యము, పత్రికా స్వాతంత్ర్యము మొదలైన ప్రాథమిక హక్కులను రద్దుచేయించాడు. శాసనసభా భవనాన్ని తగలపెట్టింది కమ్యూనిస్టులని ప్రచారం చేసి కమ్యూనిస్ట్‌పార్టీని నిషేధించాడు. దేశంలోని రాజకీయ అనిశ్చిత పరిస్థితిని అవకాశంగా తీసుకొని హిట్లర్ 1933లో మిశ్రమ ప్రభుత్వాన్ని రద్దుచేసి, నాజీపార్టీ నియంతృత్వాన్ని స్థాపించినాడు. దేశంలోని నాజీపార్టీని వ్యతిరేకించే పార్టీలన్నీ అణచివేసినాడు. నాజీపార్టీ అభ్యర్థులు మాత్రమే ఎన్నికలలో పాల్గొనటానికి అర్హులని ప్రకటించినాడు. కొత్తగా జరిగిన ఎన్నికల ఫలితంగా జర్మనీలో నాజీపార్టీ నియంతృత్వం ఏర్పడింది. 1933 మార్చి 22న జర్మన్ శాసనసభ చేసిన "ఎనేబ్లింగ్ చట్టం" ప్రకారం హిట్లర్‌కు నాలుగు సంవత్సరాల కాలానికి విశేష శాసనాధికారాన్ని దత్తత చేయడం జరిగింది. 1934 లో హిండెన్‌బర్గ్ మరణించిన తరువాత హిట్లర్ తనను జర్మనీకి అధ్యక్షునిగా ఛాన్సలర్‌గాను ప్రకటించుకొన్నాడు. హిట్లర్ జర్మనీకి నియంత (ఫ్యూరర్) అయినాడు.

### 17.2.5.3 నియంతృత్వ స్థాపన :

అధికారాన్ని హస్తగతం చేసుకున్న తరువాత హిట్లర్ ప్రతిపక్షాలను క్రూరంగా అణచివేసాడు. 'తుఫాను దళాలు' అనే గోధుమరంగు చొక్కాదళాన్నీ, 'ఇలైట్ గార్డ్స్' అను నల్లరంగు చొక్కాల దళాన్ని తయారుచేసి తనకు వ్యతిరేకించే వారందరినీ అణిచివేసినాడు. 'గెస్టపో' అనే రహస్య పోలీసుశాఖ దేశంలో ఆంతరంగిక శాంతిభద్రతలను కాపాడింది. వ్యక్తి స్వాతంత్ర్యం రద్దయింది. పత్రికలు, రేడియో, సినిమా ప్రదర్శనశాలలు మొదలైన ప్రచార సాధనాలన్నీ ప్రభుత్వ నియంత్రణలోకి వచ్చినాయి. నాజీ సిద్ధాంతాల కనుగుణంగా విద్యావిధానం రూపొందింది. కమ్యూనిస్టులను, యూదులను అణచివేయడం జరిగింది. క్రైస్తవ చర్చిలు, వాటి ఆస్తులు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొనిరావడం జరిగింది. ప్రజలు జర్మన్ భాషలోని మతగ్రంథాలను మాత్రమే చదవవలెననే నియమం ప్రవేశపెట్టబడింది. స్త్రీలు పురుషునివలె అన్నిరంగాలలో నాయకత్వం వహించరాదు. స్త్రీలకు పిల్లలు, చర్చి, వంటలతో మాత్రమే ప్రమేయం వుండవలె. నాజీ పార్టీల నుంచి తన ప్రత్యర్థులను చాలామందిని వెళ్ళగొట్టి హిట్లర్ పార్టీని ప్రక్షాళనం చేసినాడు. నాజీ సిద్ధాంతాల ప్రచారానికి జోసెఫ్ గోబెల్స్ నియమితుడైనాడు.

### 17.2.5.4 ఆంతరంగిక విధానము :

హిట్లర్ అధికారాన్ని హస్తగతం చేసుకున్న తరువాత తనను వ్యతిరేకించే వారందరినీ అణచి, దేశప్రగతిని సాధించుటకు అనేక చర్యలు తీసుకొన్నాడు.

#### 17.2.5.4.1 ఆర్థిక సంస్కరణలు :

హిట్లర్ దేశంలోని సంపన్నులైన యూదులను అంతంచేసి వారి ఆస్తులను స్వాధీనం చేసుకున్నాడు. ద్రవ్యనియంత్రణచేసి ద్రవ్యోల్బణాన్ని అరికట్టాడు. నూలు పరిశ్రమల నిర్మాణం ద్వారా, యుద్ధపరిశ్రమల స్థాపన ద్వారా నిరుద్యోగ సమస్యలను అంతం చేశాడు. కార్మికులను, యజమానులను ప్రభుత్వం యొక్క అజమాయిషీలో ఉంచాడు. సమ్మెలు నిషేధించి, ఫ్యాక్టరీలను

సవ్యంగా నడిపి పారిశ్రామిక ఉత్పత్తిని పెంచాడు. షాట్‌ను ఆర్థికమంత్రిగా నియమించి ఆర్థిక కార్యకలాపాలను అదుపులో వుంచాడు. విదేశీ వ్యాపారాన్ని, బ్యాంకింగ్ వ్యవస్థను ప్రభుత్వ ఆధిపత్యం క్రిందకి తెచ్చాడు. పన్నుల భారం తగ్గించి ఉత్పత్తుల నధికం చేయించుటకు అనువగు విధానాన్ని రూపొందించాడు. దేశంలో పాఠశాలలు నిర్మించి నిరక్షరాస్యత నిర్మూలనకు కృషిచేసాడు. ప్రజల మీద అధికంగా పన్నుభారం పడకుండానే హిట్లర్ దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దినాడు.

### 17.2.5.4.2 సైనిక సంస్కరణలు :

హిట్లర్ ఆహార ఉత్పత్తి కంటే ఆయుధాల ఉత్పత్తికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. పెరుగుతున్న జర్మన్‌ల నివాసానికి అదనపు వలసలు అవసరం కాబట్టి యుద్ధవిధానం ద్వారా భూభాగాలను సంపాదించాలని భావించాడు. వర్సే సంధిని ఉల్లంఘించి జర్మనీ ఆయుధ బలాన్ని పెంపొందించినాడు. గోరింగ్ అనే సమర్థుడైన అనుచరుని సహాయంతో హిట్లర్ జర్మన్ సైన్యాన్ని పటిష్టం చేసినాడు. నిర్బంధ సైనిక శిక్షణను అమలుచేశాడు. యుద్ధ టాంకులు, ఫిరంగులు, యుద్ధనౌకలు, విమానాలు మొదలగు ఆయుధాలు విపరీతంగా తయారుచేయించాడు. ఆయుధ ఫ్యాక్టరీలు నిర్మించాడు.

### 17.2.5.5. విదేశాంగ విధానము :

హిట్లర్ విదేశాంగ విధానం ముఖ్య లక్ష్యాలు మూడు. అవి 1) స్వయం నిర్ణయ సిద్ధాంతం ప్రాతిపదికగా జర్మన్‌లందరినీ ఏకంచేసి ఒకే జర్మన్ రాజ్యంగా రూపొందించడం, 2) వర్సే, సెయింట్ జర్మెయిన్ మొదలైన సంధులను రద్దుచేయడం, 3) పెరుగుతున్న జర్మనీ జనాభాకు కొత్త భూభాగాలను సంపాదించడం. అందువల్ల హిట్లర్ పూర్తిగా సైనిక బలంమీద ఆధారపడి మాత్రమే విదేశాంగ విధానాన్ని కొనసాగించాడు. హిట్లర్ సైనికవాదంలో తిరుగుబాటు, యుద్ధము, బలవంతంగా భూభాగాలను ఆక్రమించుకోవడం ముఖ్యమైన అంశాలు. జర్మనీకి ప్రధానశత్రువు ఫ్రాన్స్ కాబట్టి ఫ్రాన్స్‌ను ఏకాకిని చేయడానికి జర్మనీ బ్రిటన్, ఇటలీలలో స్నేహసంబంధాలు నెలకొల్పడానికి ప్రయత్నించింది. జర్మనీ రాజ్యవిస్తరణ కార్యక్రమానికి తూర్పు యూరప్ వీలైన ప్రదేశము. కాన తూర్పుకు విస్తరించడం జర్మన్ విదేశాంగ విధానం ముఖ్యలక్ష్యమైంది.

### 17.2.5.5.1 జర్మనీ రక్షణకు హిట్లర్ చేపట్టిన చర్యలు :

హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత యుద్ధప్రయత్నాలను ప్రారంభించాడు. హిట్లర్‌కు సమితి ఆదర్శాలలో నమ్మకంలేదు. అలాగే నిరాయుధీకరణలో హిట్లర్‌కు ఆసక్తిలేదు. అందువల్ల 1933లో జెనీవా నిరాయుధీకరణ సమావేశం నుంచి విరమించుకొని తరువాత సమితి నుండి కూడా ఉపసంహరించుకొన్నాడు. పోలెండ్, ఫ్రాన్స్‌ల మధ్య మైత్రి సంబంధాలను నివారించి ఫ్రెంచి రక్షణ చర్యలను బలహీనపరచడానికి 1934లో హిట్లర్ పోలెండ్‌తో దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం చేసుకున్నాడు. 1934లో జూలైలో ఆస్ట్రియా ఛాన్సలర్ డోల్‌ఫూస్‌ను చంపివేసి బలప్రయోగం ద్వారా ఆస్ట్రియాను ఆక్రమించుకోవడానికి హిట్లర్ ప్రయత్నించి విఫలుడయినాడు. 1935లో జనవాక్య సేకరణ ద్వారా సార్ లోయను తిరిగి జర్మన్ పొందింది.

### 17.2.5.5.2 సైనిక కూటముల ఏర్పాటు, రోమ్ - బెర్లిన్ - టోక్యో పక్షం :

సార్ ప్రాంతాన్ని తిరిగి పొందిన హిట్లర్ వర్సే సంధిలోని సైనిక నిబంధనలను ఉల్లంఘించి జర్మనీలో నిర్బంద సైనిక విధానాన్ని ప్రవేశపెట్టినాడు. దీనిలో 1935 మేలో ఫ్రాన్స్, చెకోస్లావాకియాలు రష్యాతో ఒక పరస్పర సహాయక సంధి చేసుకొన్నాయి. పశ్చిమ రాజ్యాలలో ఏర్పడిన అనుమానాన్ని తొలగించడానికి హిట్లర్ లోకర్నో ఒడంబడికలను గౌరవిస్తానని వాగ్దానం చేసినాడు. 1935 జూన్‌లో హిట్లర్ ఇంగ్లండ్‌తో ఒక నౌకాసంధిని చేసుకున్నాడు.

ఇటలీ ఇథియోపియాను ఆక్రమించుకోవడం, ఫ్రాన్స్ - సోవియట్ రష్యాల మధ్య 1936లో ఒక ఒప్పందం జరగడం అవకాశంగా తీసుకొని హిట్లర్ ధైర్యంగా లొకర్నో ఒడంబడికలను ఉల్లంఘించినాడు. 1935లోనే ముస్సోలినీ, హిట్లర్‌లు కలిసి రోమ్ - బెర్లిన్ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 1936లో జర్మనీ, జపాన్‌లు కామికటర్న్ వ్యతిరేక ఒడంబడిక చేసుకున్నాయి. ఈ సంధి ప్రకారం కమ్యూనిస్టుల చర్యలకు సంబంధించిన వివరాలను పరస్పరం తెలుసుకోవడానికి, కమ్యూనిస్ట్‌ల మీద కొన్ని చర్యలు తీసుకోవడానికి పరస్పరం సహరించుకోవడానికి అంగీకరించినాయి. 1937లో ఇటలీ కూడా ఈ ఒడంబడికలో చేరింది. ఈవిధంగా రోమ్ - బెర్లిన్ - టోక్యో అక్షము అమలులోకి వచ్చింది. ఈ కమ్యూనిస్ట్ వ్యతిరేక ఒడంబడిక వల్ల పశ్చిమ రాజ్యాలు సంతృప్తి ప్రకటించాయి. ఈ విధంగా హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు సంవత్సరాల కాలంలో గణనీయమైన విజయాలను సాధించి జర్మన్ మూడో సామ్రాజ్యాన్ని పటిష్టం చేసినాడు. 1937 నాటికి జర్మనీ బలమైన సైనిక, నౌకా, విమాన దళాలను ఏర్పరచుకొన్నది.

## 17.2.5.5.3 ఆస్ట్రియా ఆక్రమణ :

1936 జూలైలో ఆస్ట్రియా, జర్మనీల మధ్య జరిగిన ఒక ఒడంబడిక ప్రకారం ఆస్ట్రియా సార్వభౌమాధికారాన్ని జర్మనీ గుర్తించింది. ఇరుపక్షాలు పరస్పరం ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటానికి అంగీకరించినాయి. ఆస్ట్రియా ఒక జర్మన్ రాజ్యంగా నిర్ణయమైంది. హిట్లర్ తోడ్పాటుతో ఆస్ట్రియన్ నాజీలు అలజడులు ప్రారంభించగా, ఆస్ట్రియా ప్రభుత్వం ఆ ఉద్యమాన్ని కఠినంగా అణచివేసి నాజీపార్టీని నిషేదించింది. దీనిని పురస్కరించుకొని హిట్లర్ ఆస్ట్రియా ఛాన్సలర్‌తో ఒక సమావేశం జరిపి ఈ క్రింది షరతులను అంగీకరించవలసిందిగా ఒత్తిడి చేసినాడు.

1. ఆస్ట్రియా ప్రభుత్వం నాజీపార్టీని జాతీయపార్టీగా గుర్తించవలెను.
2. సెయిస్ - ఇన్‌క్వార్ట్‌ను ఆస్ట్రియా దేశవ్యవహారాల మంత్రిగా నియమించవలెను.
3. నాజీలందరినీ విడుదల చేసి లోగడ బర్తరఫ్ చేసిన నాజీ ఉద్యోగులందరినీ తిరిగి ఉద్యోగాలలో చేర్చుకోవలె. ఈ షరతులన్నింటినీ ఆస్ట్రియాప్రభుత్వం ఆమోదించింది.

ఆ తరువాత హిట్లర్ మరికొన్ని షరతులను అంగీకరించవలసినదిగా ఆస్ట్రియా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసినాడు.

1) సెయిస్ - ఇన్‌క్వార్ట్‌ను ఆస్ట్రియా ఛాన్సలర్‌గా నియమించవలసినదిగా
2) ఆస్ట్రియా మంత్రివర్గంలో మూడింట రెండువంతుల స్థానాలను నాజీపార్టీకి కేటాయించవలసిందిగా హిట్లర్ కోరినాడు. ఈ షరతులను కూడా ఆస్ట్రియా ఆమోదించింది. సెయిస్ - ఇన్‌క్వార్ట్‌ను ఆస్ట్రియా ఛాన్సలర్‌గా నియమించిన వెంటనే 1938 మార్చి 11న ఆస్ట్రియాను ఆక్రమించుకోవలసిందిగా హిట్లర్ జర్మన్ సైన్యాలకు ఆదేశమిచ్చినాడు. హిట్లర్ మార్చి 14న విజయవంతంగా వియన్నా నగరంలోకి ప్రవేశించి, ఆస్ట్రియా పార్లమెంటును రద్దుచేసి కొత్త ఎన్నికలను ఏర్పాటు చేశాడు. ఆస్ట్రియాలో అధిక సంఖ్యాకులు హిట్లర్‌ను బలపరచినారు. ఈ విధంగా జర్మనీ - ఆస్ట్రియా కలయిక పూర్తి అయింది. ఈ కలయిక ఫలితంగా

1. ఇటలీ, హంగేరీ, యుగోస్లావియాలతో జర్మనీ ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకోవడానికి వీలైంది.
2. ఆగ్నేయ యూరప్‌లో జర్మనీ ఆర్థిక సైనిక అధికారాన్ని పొందగలిగింది.
3. జర్మనీ సైనికబలం పెంపొందింది.
4. ఆస్ట్రియాలోని సహజవనరులను ఉపయోగించుకొని జర్మనీ తన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోగలిగింది.

### 17.2.5.5.4 మూనిక్ ఒప్పందము (1938), చెకొస్లావాకియా ఆక్రమణ :

ఆస్ట్రియాను ఆక్రమించుకొన్న తరువాత హిట్లర్ దృష్టి చెకొస్లావాకియా వైపు మళ్ళింది. చెకొస్లావాకియాలో సుమారు నాలుగు మిలియన్‌ల సుడెటన్ జర్మన్‌లు అనే జర్మన్ జాతి ప్రజలున్నారు. వీరికి అన్నివిధాలైన సహాయాన్ని అందచేయడమేగాక హిట్లర్ తిరుగుబాటుకు ప్రేరేపించినాడు. ఈ పరిస్థితుల్లో బ్రిటన్, ఫ్రాన్స్‌లు సుడెటెన్ భూభాగాన్ని జర్మనీ కివ్వవలసిందిగా చెకొస్లావాకియాకు సలహా ఇచ్చినాడు. దీనికి చెక్ ప్రభుత్వము అంగీకరించింది. ఇదేసమయంలో హిట్లర్ బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేన్, ఫ్రెంచి ప్రధాని డలరేర్‌ను మూనిక్‌కు ఆహ్వానించాడు.

బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీలు 1938లో మూనిక్‌లో సమావేశమై ఒక ఒడంబడిక మీద సంతకాలు చేశాయి. దీని ప్రకారం

1) అక్టోబర్ ఒకటో తేదీ నుంచి పదో తేదీలోపల సుడెటన్ భూభాగం నుంచి చెక్ సైన్యాలను ఉపసంహరించవలె.
2) సుడెటన్ భూభాగం నుంచి చెక్ సైన్యాల ఉపసంహరణకు సంబంధించిన కార్యక్రమాన్ని నిర్ణయించడానికి జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, చెకొస్లావాకియాలతో కూడిన ఒక సంఘాన్ని నియమించవలె.
3) అక్టోబర్ ఒకటో తేదీ లోపల సుడెటన్ భూభాగాన్ని జర్మన్ సైన్యం ఆక్రమించుకొనే కార్యక్రమం పూర్తికావలె. జనవాక్య సేకరణ జరుగవలసిన ప్రాంతం ఐదు రాజ్యాల సంఘం నిర్ణయించవలె. అట్లాంటి ప్రదేశాలను జనవాక్య సేకరణ జరిగే వరకు అంతర్జాతీయ సైన్యాలు ఆక్రమించుకొని ఉండవలె.
4) నాలుగు వారాల కాలంలో చెక్ ప్రభుత్వము సుడెటన్ జర్మన్‌లను నిర్బంధం నుంచి విడుదల చేయవలెను.

తన భద్రత విషయమై అంతర్జాతీయ హామీకి బ్రిటన్, ఫ్రాన్స్‌లు భాధ్యత వహించినందువల్ల చెకొస్లావాకియా మూనిక్ ఒప్పందానికి అంగీకరించింది. ఈ ఒడంబడికను పురస్కరించుకొని జర్మన్ సైన్యాలు అక్టోబరు ఒకటో తేదీన సుడెటన్ భూభాగంలోకి ప్రవేశించినాయి. ఈ ఒడంబడిక ప్రకారం జరుగవలసిన జనవాక్య సేకరణను పాటించడం జరుగలేదు. ఈ ఒప్పందం ఫలితంగా చెకొస్లావాకియా 11 వేల చదరపు మైళ్ళ భూభాగాన్ని, కీలకమైన సైనిక స్థావరాలను, పారిశ్రామిక ప్రాంతాలను పోగొట్టుకుంది. ఈ ఒప్పందం తరువాత హిట్లర్ బలప్రయోగం ద్వారా చెకొస్లావాకియాను ఆక్రమించుకోవలెననే దృఢనిశ్చయానికి వచ్చినాడు. 1938 నాటికి దాదాపుగా సమితి రద్దయిపోయింది. ఈ ఒడంబడిక ఫలితంగా హిట్లర్, ముస్సోలినీల రాజ్యవిస్తరణ కాంక్ష అధికం కావడమేగాక దురాక్రమణ వైఖరి కూడా మరింత బలపడింది. ఈ ఒడంబడిక జరిగిన తరువాత ఆనతి కాలంలోనే హిట్లర్ తన సైన్యాలను పంపి చెకొస్లావాకియాను ఆక్రమించాడు. చెకాస్లావికియా మీద జర్మనీ దాడి జరిపినపుడు పశ్చిమరాజ్యాలు తటస్థంగా ఉండిపోయాయి.

### 17.2.5.5.5 పోలెండ్ మీద జర్మనీదాడి :

చెకొస్లావికియాను ఆక్రమించుకున్న తరువాత హిట్లర్ అధువేనియా రేవు పట్టణమైన మెమెల్‌ను ఆక్రమించాడు. 1938 నుంచి హిట్లర్ పోలెండ్ మీద దురాక్రమణ చర్యలు ప్రారంభించాడు. ఈ పరిస్థితులలో 1938 మార్చిలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు పోలెండ్ భద్రతకు హామీ ఇచ్చినాయి. దీనితో హిట్లర్ రష్యాతో 1939 ఆగస్టు 24న ఒక ఒప్పందం చేసుకొని, ఆగస్టు 26వ తేదీన పోలెండ్ మీద దండయాత్ర జరిపే రోజుగా నిర్ణయించినాడు. బ్రిటన్, అమెరికాలు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. అధికార పూర్వకంగా యుద్ధప్రకటన చేయకుండా హిట్లర్ తన సైన్యాలను పోలెండ్‌పైకి దండయాత్ర పంపినాడు. దీనిలో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది.

### 17.2.5.5.6 రెండో ప్రపంచయుద్ధం :

పశ్చిమ ఐరోపా రాజ్యాలు అనుసరించిన తృప్తిపరచే విధానంవల్ల, హిట్లర్ దురాక్రమణ చర్యల వల్ల రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమయింది. జర్మన్ సైన్యాలు పోలెండ్ మీద 1939 సెప్టెంబరు 1వ తేదీన దాడి చేయడంతో సెప్టెంబరు 3వ తేదీన బ్రిటన్,ఫ్రాన్స్‌లు అధికార పూర్వకంగా జర్మనీ మీద యుద్ధం ప్రకటించాయి.

### 17.2.5.5.7 హిట్లర్ పతనం :

రెండో ప్రపంచయుద్ధం తొలిఘట్టంలో హిట్లర్ మిత్రరాజ్యాలపై అపూర్వ విజయాలు సాధించినప్పటికీ రెండో ఘట్టంలో అపజయాన్ని పొంది, 1945 ఏప్రియల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనితో నాజీయిజమ్ అంతమైంది. జర్మనీ మిత్రరాజ్యాలకు లొంగిపోయింది.

### 17.2.5.6 హిట్లర్ ఘనత :

మొదటి ప్రపంచయుద్ధానంతరం రాజకీయ, ఆర్థిక దుస్థితికి లోనైన జర్మనీకి నాయకత్వం వహించి, దేశాన్ని పటిష్టపరిచి, శక్తివంతమైన రాజ్యంగా హిట్లర్ జర్మనీని రూపొందించాడు. కాని జాత్యాహంకారం, దుడుకు సామ్రాజ్యతత్వం వలన జర్మనీ పతనానికి కూడి హిట్లర్ కారకుడైనాడు. అయినా ఐరోపా చరిత్రలోనేగాక ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేకస్థానాన్ని హిట్లర్ సంపాదించుకున్నాడు.

### 17.2.6 నమూనా ప్రశ్నలు :

1. జర్మనీలో నాజీ నియంతృత్వం ఏర్పడడానికి దోహదపడిన అంశాలను విశ్లేషించుము.
2. హిట్లర్ వృద్ధి, క్షయాలను వివరింపుము.
3. వైమార్ రిపబ్లిక్
4. మూనిక్ ఒప్పందం
5. రోమ్ - బెర్లిన్ - టోక్యో మైత్రి,

### 17.2.7 చదువదగిన గ్రంథాలు :


1. C.J.A.H. Hayes - Modern Europe since 1870
2. C.D. Hazan - Modern Europe upto 1945
3. H.L. Peacock - Modern European History


- శ్రీ కె. సూర్య ప్రకాష్‌రెడ్డి

పాఠం - 17.3

# రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో జరిగిన సంధులు - అంతర్జాతీయ భద్రత కోసం ఫ్రాన్స్ అన్వేషణ

**17.3.0 లక్ష్యం :**

మొదటి ప్రపంచయుద్ధానంతరం తన భద్రత గురించి ఫ్రాన్స్ నానాజాతి సమితి ద్వారా, సమితి ప్రమేయం లేకుండా చేసిన ప్రయత్నాలు, నిరాయుధీకరణపై సమితి, అగ్రదేశాలు చేసిన ప్రయత్నాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశాలు :**

- **17.3.1** పరిచయం
- **17.3.2** ఫ్రాన్స్ ఆందోళనకు కారణాలు
- **17.3.3** సమితి ద్వారా భద్రతకై ఫ్రాన్స్ ప్రయత్నం చేయడం
  - **17.3.3.1** పరస్పర సంధి ముసాయిదా - 1923
  - **17.3.3.2** జనీవా సంధి ముసాయిదా - 1924
  - **17.3.3.3** లొకర్నో ఒడంబడికలు - 1925
  - **17.3.3.4** కెల్లాగ్ - బ్రీయాండ్ ఒడంబడిక (పారిస్ ఒడంబడిక) - 1928
  - **17.3.3.5** సాధారణ చట్టము - 1935
- **17.3..4** సమితి ప్రమేయం లేకుండా భద్రతా స్థాపనకు జరిగిన ప్రయత్నాలు
  - **17.3.4.1** ఫ్రాన్స్ - బెల్జియం మైత్రి సంధి
  - **17.3.4.2** ఫ్రాన్స్ - పోలెండ్‌ల మైత్రిసంధి
  - **17.3.4.3** ఫ్రాన్స్ - చెకొస్లావాకియాల మధ్య సంధి
  - **17.3.4.4** ఫ్రాన్స్ - రుమేనియాల మధ్య సంధి
  - **17.3.4.5** ఫ్రాన్స్ - యుగొస్లావియాల మధ్య సంధి
- **17.3.5** చిన్నరాజ్యాల సౌహార్ద్ర కూటమి
- **17.3.6** ఇటలీ మైత్రి సంబంధాలు
- **17.3.7** బాల్కన్ ఒప్పందము
- **17.3.8** ఇతర ఒడంబడికలు
- **17.3.9** హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పడిన మైత్రిసంధులు
  - **17.3.9.1** సోవియట్ రష్యా - ఫ్రాన్స్‌ల మధ్య ఒడంబడిక
  - **17.3.9.2** రోమ్ - బెర్లిన్ - టోక్యో అక్షము
- **17.3.10** నిరాయుధీకరణ సమస్య

**17.3.10.1** సమితి ద్వారా నిరాయుధీకరణకు జరిగిన ప్రయత్నాలు
**17.3.10.2** సమితి ప్రమేయం లేకుండా జరిగిన ప్రయత్నాలు
**17.3.10.2.1** వాషింగ్టన్ సమావేశము (1921 - 22)
**17.3.11** సమిష్టి భద్రతా స్థాపనకు జరిగిన ప్రయత్నాలు విఫలం కావడానికి కారణాలు
**17.3.12** నమూనా ప్రశ్నలు
**17.3.13** చదువదగిన గ్రంథాలు

## 17.3.1 పరిచయం :

మొదట ప్రపంచ యుద్ధానంతరం సుస్థిర శాంతిస్థాపనకు, యుద్ధాలను నివారించడానికి, అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడానికి నానాజాతి సమితి అనే అంతర్జాతీయ సంస్థను నెలకొల్పడం జరిగింది. అంతేగాక అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రాబల్య సమతౌల్యం అనే సిద్ధాంతానికి ప్రాముఖ్యంతగ్గి, సమిష్ఠి అంతర్జాతీయ సహకారము అనే సిద్ధాంతానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది. అంతర్జాతీయ శాంతిభద్రతల కోసం అన్వేషణ మొదలైంది.

## 17.3.2 ఫ్రాన్స్ ఆందోళనకు కారణాలు :

మొదట ప్రపంచయుద్ధానంతరం యూరప్ దేశాలన్నింటిలో ఫ్రాన్స్ భద్రతా సమస్యకు ఎక్కువ ప్రాధాన్యము ఇచ్చింది. కార్ చెప్పినట్లు మొదట ప్రపంచ యుద్ధానంతరం యూరప్ రాజకీయాలలో ఫ్రాన్స్ తన భద్రతకు అన్వేషించడం ఒక ముఖ్యమైన విషయమని చెప్పవచ్చు. భవిష్యత్తులో జర్మన్ దురాక్రమణ బారినుంచి తమదేశ భద్రతకై హామీకోసం ఫ్రాన్స్ నాయకులు అన్వేషించడం ప్రారంభించారు. అందుకు గల కారణాలు :

1) మొదటి ప్రపంచయుద్ధంలో పూర్తిగా ఓడిపోయినప్పటికినీ, భవిష్యత్తులో జర్మనీ తిరిగి తమ దేశం మీద దురాక్రమణ చేస్తుందన్న భయము ఫ్రెంచి నాయకులకు, ప్రజలకు కూడా ఎక్కువగా ఉంది.

2) యుద్ధంలో ఓడిపోయినా, ప్రజాబలము, సహజ సంపద, పారిశ్రామికాభివృద్ధి, సైనికబలము మొదలైన విషయాలలో ఫ్రాన్స్ కంటే జర్మనీ పైచేయిగా ఉంది.

3) రైన్ నది పశ్చిమతీరాన్ని జర్మనీ నుండి విడదీయాలన్న ఫ్రాన్స్ ప్రతిపాదనకు మిత్రదేశాలు తిరస్కరించడంతో, తన భద్రత గురించి మిత్రమండలి వారు స్పష్టమైన హామీనైనా ఇవ్వాలని ఫ్రాన్స్ కోరింది. అయితే, ఎంత వాదించినా లాభంలేక పోయింది.

4) అమెరికా ఆంతరంగిక వ్యవహారాల్లో రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీల కుమ్ములాట కారణంగా నానాజాతిసమితి ఒప్పందంగానీ, సంధినిగానీ, ధృవపరిచే ప్రకటనలు చేయలేక పోయింది.

5) వర్సే సంధి ఏర్పరచిన సరిహద్దులను కాపాడే హామీనివ్వడానికి ఇంగ్లాండ్ నిరాకరించింది.

6) జర్మనీపట్ల బ్రిటన్ చూపిన ఉదారధోరణి ఫ్రాన్స్ ప్రయోజనాలను దెబ్బతీసే లాగుంది.

7) నష్టపరిహారం చెల్లింపులో మిత్రమండలిని నిస్సహాయ స్థితిలో పెట్టేవిధంగా, తన ద్రవ్యవిధానాన్ని జర్మనీ తల్లక్రిందులు చేయసాగింది.

8) 1923లో తనకు రావలసిన నష్టపరిహార ధనాన్ని జర్మనీ చెల్లించకపోవడంతో ఫ్రాన్స్ రూర్‌ను ఆక్రమించింది. ఫలితంగా వచ్చిన పరిణామాల వల్ల ఫ్రాన్స్ - జర్మనీల మధ్య సంబంధాలు దిగజారిపోయాయి.

### 17.3.3 సమితి ద్వారా భద్రతకై ఫ్రాన్స్ ప్రయత్నం చేయడం :

పైన పేర్కొన్న కారణాలవల్ల ఫ్రాన్స్ సమితి ద్వారా అంతర్జాతీయ సమిష్టి భద్రతా పరిరక్షణకు, సమితి ప్రమేయం లేకుండా ప్రాంతీయ ఒడంబడికల ద్వారా ఏకకాలంలో అనేక ప్రయత్నాలు చేసింది.

### 17.3.3.1 పరస్పర సంధి ముసాయిదా - 1923 :

సమితి రాజ్యాంగంలోని 10, 16 ప్రకరణలను సవరించడం వలన సమిష్టి భద్రతాసూత్రం బలహీనమైపోయింది. సమితిలోని ఈ బలహీనతను తొలగించడానికి ఫ్రాన్స్ యత్నించింది. పర్యవసానంగా 1923లో పరస్పర సంధి ముసాయిదా రూపొందింది. ఈసంధి సైనికదాడి అంతర్జాతీయమైన నేరమని ప్రకటిస్తూ, అట్టి దాడి జరిగినపుడు సమితి ఆంక్షలు విధించాలని, దాడికి గురైన దేశాలకు సాయపడటం సభ్యదేశాల విద్యుక్త ధర్మమని పేర్కొన్నది. అయితే ఈ సంధికి మెజారిటీసభ్యుల ఆమోదం లభించలేదు. ఇంగ్లండ్ ఈ సంధిని వ్యతిరేకించింది. రష్యా, అమెరికాలు కూడా ఈ సంధిని ఆమోదించలేదు. అందువల్ల సమితిని పటిష్టం చేయడానికి చేసిన తొలిప్రయత్నము విఫలమైంది.

### 17.3.3.2 జనీవా సంధి ముసాయిదా - 1924 :

1924 నాటికి అంతర్జాతీయ భద్రతా వ్యవస్థ సాధనకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫ్రాన్స్ రూర్ ఆక్రమణ విషయం పరిష్కారమైంది. డాస్ ప్రణాళికతో పరిహార చెల్లింపు సమస్య తీరింది. జర్మనీ వ్యతిరేకి అయిన పాయిన్ కేర్ స్థానంలో ఉదారవాది హెరియట్ అధికారంలోకి వచ్చాడు. ఇట్టి పరిస్థితుల్లో గ్రీస్, చెకొస్లొవాకియాల ప్రతినిధులు జెనీవాలో సమావేశమై జెనీవా ఒప్పంద ముసాయిదాను రూపొందించాయి. ఇందులోని నిబంధనలు :

1) ప్రాంతీయ భద్రతా పరిరక్షణకు బదులుగా ప్రపంచ భద్రతా పరిరక్షణకు అన్ని విధాలైన ప్రయత్నాలు జరుగవలె.

2) సమితి మండలిలోని మెజారిటీ సభ్యులు ధృవపరిచినట్లయితే రాజ్యాల మధ్య ఆయుధాల పోటీని నివారించడానికి ఒక అంతర్జాతీయ సమావేశం 1925లో జరగాలి.

3) అంతర్జాతీయ వివాదాలన్నింటినీ తప్పనిసరిగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించవలె.

4) న్యాయసంబంధమైన వివాదాలు అంతర్జాతీయ న్యాయస్థానానికి నివేదించవలె.

5) రాజకీయ వివాదాలను సమితి మండలికి నివేదించవలె.

6) వివిధ రాజ్యాల ఆంతరంగిక వివాదాలను సమితి మండలి పరిశీలించవలె.

7) వివాదాల పరిష్కారానికి మధ్యవర్తులు చేసిన నిర్ణయాలను అంగీకరించని రాజ్యాన్ని దురాక్రమణ జరిపిన రాజ్యంగా ప్రకటించవలె. దురాక్రమణ జరిపిన రాజ్యంమీద ఆర్థిక, సైనిక ఆంక్షలను సమితి మండలి మాత్రమే విధించాలి.

8) దురాక్రమణ విధానాన్ని అనుసరించి యుద్ధాన్ని సృష్టించిన దేశం మీద నష్టపరిహారం విధించవలె.

జనీవా సంధి ముసాయిదాను అగ్రరాజ్యాలు తిరస్కరించాయి. ఇంగ్లాండ్, ఇంగ్లాండ్‌కు చెందిన వలసలు ఈ ముసాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ తీర్మానంలోని అంశాలు దేశాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యాన్ని సమర్థించే విధంగా ఉన్నాయని

అభిప్రాయపడ్డాయి. మధ్యవర్తిత్వాన్ని తప్పకుండా అంగీకరించాలనడం అనేక సభ్యదేశాలు అంగీకరించలేకపోయాయి. దాడికి గురైన దేశాలకు సాయపడటం, సభ్యదేశాల విద్యుక్త ధర్మంగా పేర్కొనడాన్ని బ్రిటన్ వ్యతిరేకించింది. బ్రిటన్ వైఖరి ఫ్రాన్స్‌కు అసంతృప్తిని కలిగించింది.

జనీవా సంధి ముసాయిదాను తిరస్కరించనప్పటికే దానిలో కొన్ని హర్షించదగిన విషయాలున్నాయి. అంతర్జాతీయ భద్రతా వ్యవస్థ పరిణామంలో అది ఒక మైలురాయి. సమితిలోని అంతర్గత లోపాన్ని భర్తీ చేయాలని అది యత్నించింది. యుద్ధాన్ని అంతర్జాతీయమైన నేరంగా ప్రకటించటమేగాక, అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వమనే సూత్రాన్ని ప్రతిపాదించి దానికి అందరూ బద్ధులుగా ఉండాలనీ ఈ ముసాయిదా ప్రకటించింది.

### 17.3.3.3 లోకర్నో ఒడంబడికలు - 1925 :

అంతర్జాతీయ భద్రతా వ్యవస్థ ఏర్పాటు వీలుగాకపోయినా, దేశాల మనుగడ దృష్ట్యా అటువంటి వ్యవస్థ తప్పనిసరి అని యూరప్ దేశాలు గ్రహించాయి. చివరకు స్వయంగా జర్మనీయే ఫ్రాన్స్ భయాందోళనలను గ్రహించుకొని ప్రతిపాదనలు చేసింది. వాటి ప్రకారం ఫ్రాన్స్ - జర్మనీల మధ్య వర్సే సంధి ఏర్పరచిన సరిహద్దులను గౌరవించడానికి ప్రాంతీయ భద్రత కొరకు చేసుకునే సంధులకు తాను సిద్ధమనీ జర్మనీ తెలియజేసింది. సోవియట్ రష్యా - జర్మనీల మధ్య జరిగిన రపెల్లో సంధి (1922) వల్ల జర్మనీలో కమ్యూనిస్టుల ప్రభావం పెరిగిపోతుందేమోనన్న భయం బ్రిటిష్ రాజనీతివేత్తలకు కలిగింది. సంధి సంప్రదింపులలో బెల్జియం, చెకొస్లొవికియా, పోలెండ్, ఇటలీలను కూడా పాల్గొననిస్తే తాను సంప్రదింపులకు సిద్ధమని ఫ్రాన్స్ ప్రకటించింది.

వివిధరాజ్యాల ప్రతినిధులు స్విట్జర్లాండ్‌లోని లొకర్నోలో 1925 అక్టోబరు 5న చారిత్రాత్మక సమావేశం జరిపారు. పదిరోజుల సమావేశం ఫలితంగా ఏడు సంధులను చేసుకోవడం జరిగింది. ఈ సంధుల మీద ప్రతినిధుల సంతకాలు లండన్‌లో 1925 డిసెంబరులో జరిగినాయి. ఈ సంధులన్నింటినీ కలిపి లొకర్నో ఒడంబడికలంటారు. లొకర్నో ఒడంబడికలలో ముఖ్యమైన సంధులు :

1) జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, ఇటలీ, బెల్జియమ్‌ల మధ్య జరిగిన పరస్పర హామీ సంధి.
2) జర్మనీతో ఫ్రాన్స్, బెల్జియమ్, పోలండ్, చెకొస్లావాకియాలు చేసుకున్న నాలుగు మధ్యవర్తిత్వ సంధులు.
3) ఫ్రాన్స్, పోలెండ్, చెకొస్లావాకియాలతో చేసుకున్న రెండు హామీ సంధులు

### ఈ సంధుల ముఖ్యాంశాలు :

1) ఫ్రాన్స్ - జర్మనీల మధ్య, బెల్జియం - జర్మనీల మధ్య సరిహద్దుల రక్షణకు హామీ చేకూరింది.
2) రైన్ భూభాగము నిస్సైనిక మండలంగా ధృవపరచడం జరిగింది.
3) జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియమ్‌లు తమ సరిహద్దుల రక్షణకు ముప్పు ఏర్పడిన పరిస్థితులలో తప్ప యుద్ధాలను తలపెట్టమని హామీ నిచ్చినాయి.
4) జర్మనీ పశ్చిమ సరిహద్దు భద్రతకు ముప్పు ఏర్పడినపుడు జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియమ్ రాజ్యాలు సమిష్టిగా ఎదుర్కొంటాయి.
5) జర్మనీ, పోలెండ్, చెకొస్లావాకియాల మధ్య వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించడం జరిగింది.

6) పరస్పర భేదాభిప్రాయాలతో కూడిన సమస్యను శాంతియుత పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవడానికి జర్మనీ, బెల్జియం, ఫ్రాన్స్‌లు అంగీకరించాయి.

7) ఒడంబడిక మీద సంతకాలు చేసిన రాజ్యాలు సమితి ద్వారా నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టటానికి ఒప్పుకున్నాయి.

8) 1926లో జర్మనీ సమితిలో సభ్యరాజ్యంగా చేరింది.

9) ప్రపంచ నిరాయుధీకరణ సమావేశానికి ఏర్పాట్లు చేయడానికి ఒక సంఘాన్ని కూడా నియమించడం జరిగింది.

లొకర్నో ఒప్పందాల ఫలితంగా ఎంతోకాలం ఫ్రాన్స్ కోరుతూ వచ్చిన భద్రత లభించింది. జర్మనీ వాంఛించిన విధంగా వర్సే సంధి పునఃపరిశీలన జరుగుతుందని హామీ ఇవ్వడం జరిగింది. జర్మనీకి ఇతర ఐరోపా దేశాలతో సమానమైన హోదా ఈ సంధి మూలంగా లభించింది. ఈ ఒడంబడికవల్ల ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల మధ్య వివాదాల పరిష్కారానికి ఇంగ్లండ్ మధ్యవర్తిత్వం అంగీకరించబడడంతో ఇంగ్లండ్ సంతృప్తి చెందింది. ఈ ఒడంబడిక ఫలితంగా ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీల మధ్య సదవగాహన ఏర్పడింది. అందువల్లనే యుద్ధకాలం నుంచి శాంతికాలాన్ని లొకర్నో ఒడంబడికలు ప్రస్ఫుటంగా వేరుచేసినాయని బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేన్ అన్నాడు. మొత్తంమీద లొకర్నో ఒడంబడికల ఫలితంగా అంతర్జాతీయ రంగంలో ఒక నూతన వాతావరణము - లొకర్నో ధోరణి ప్రవేశపెట్టటం జరిగింది.

లొకర్నో ఒడంబడికలో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. ఈ ఒడంబడిక వల్ల జర్మనీ తూర్పు సరిహద్దు సమస్య పరిష్కారం కాలేదు. లొకర్నో ఒడంబడికలు తన మీద పగ సాధించడానికి పశ్చిమ రాజ్యాలు చేసిన కుట్ర అని రష్యా అనుమానించింది. అన్నిరాజ్యాల సరిహద్దులను కాపాడవలెననే నిబంధన వర్సే సంధిలో ఒక ముఖ్యాంశం. అదే విషయాన్ని మళ్ళీ లొకర్నో ఒడంబడికలలో చేర్చడం జరిగింది. దీనివల్ల వర్సేసంధి బలహీనమయింది. లొకర్నో సంధి భవిష్యత్తులో వర్సేసంధి, సమితి ఒడంబడికలను నాశనం చేయడానికి దారి తీసిందని ఇ.హెచ్.కార్. వ్యాఖ్యానించారు.

## 17.3.3.4 కెల్లాగ్ - బ్రీయాండ్ ఒడంబడిక (పారిస్ ఒడంబడిక) - 1928 :

ఫ్రాన్స్ సౌజన్యంతో, అమెరికా చొరవతో పారిస్ ఒడంబడిక రూపొందించడం జరిగింది. దురాక్రమణతో కూడిన యుద్ధాలను పూర్తిగా నిషేధించవలెననే ఉద్యమము కొంతకాలముగా అమెరికాలో కొనసాగుతూ ఇతర దేశాలకు కూడా వ్యాపించింది. దురాక్రమణతో కూడుకున్న యుద్ధాలను పూర్తిగా నిషేధిస్తూ సమితి మహాసభ 1927లో ఒక తీర్మానాన్ని చేసింది. 1927 ఫిబ్రవరిలో జరిగిన అఖిల - అమెరికన్ సమావేశం కూడా యుద్ధాలను నిషేధిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఇదే సమయంలో ఫ్రాన్స్, అమెరికాల మధ్య భవిష్యత్తులో యుద్ధం రాకుండా నివారించడానికి యుద్ధమనే విధానాన్ని నిషేధించవలెననే ప్రతిపాదనను ఫ్రెంచి విదేశాంగ మంత్రి బ్రీయాండ్ చేసినాడు. బ్రీయాండ్ చేసిన ప్రతిపాదనను కేవలం ఫ్రాన్స్, అమెరికాలకు పరిమితం చేయకుండా అంతర్జాతీయ ఒడంబడికగా మార్చి యుద్ధాలను పూర్తిగా నిషేధించవలెననే కొత్త ప్రతిపాదనను అమెరికా విదేశాంగమంత్రి చేసినాడు. కాని సమితిలో సభ్యరాజ్యమైన ఫ్రాన్స్ కొన్ని పరిస్థితులలో తాను యుద్ధంలో పాల్గొనటం కాని లేదా యుద్ధాన్ని సమర్థించవలసిన అవసరంగాని ఏర్పడుతుందని భయపడింది. అందువల్ల కెల్లాగ్ ప్రతిపాదించినట్లు అగ్రరాజ్యాలన్నీ ఒక ఒడంబడికను చేసుకోవలెనని, అయితే ఆత్మరక్షణకై ఏ రాజ్యమైనా యుద్ధం చేయవచ్చని బ్రీయాండ్ ఒక సవరణను ప్రతిపాదించాడు. బ్రీయాండ్ ప్రతిపాదించిన సవరణతో కెల్లాగ్ కూడా ఏకీభవించినాడు.

కెల్లాగ్ సంధి ముసాయిదాను 1928 ఏప్రిల్‌లో ఇంగ్లండ్, జర్మనీ, ఇటలీ,జపాన్ దేశాలకు పంపినాడు. ఈ నాలుగు దేశాల ఆమోదాన్ని పొందిన తరువాత కెల్లాగ్ 1928 జూన్‌లో ఈ సంధి ముసాయిదాను 14 దేశాలకు పంపినాడు. 14 రాజ్యాల ఆమోదాన్ని పొందిన తరువాత 1928 ఆగస్ట్ 29న 15 రాజ్యాల ప్రతినిధులు (ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా, ఇటలీ, బెల్జియం, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, చెకొస్లొవాకియా, పోలండ్, ఐరిష్ ఫ్రీస్టేట్, ఇండియా, జపాన్, దక్షిణాఫ్రికా పారిస్‌లో సమావేశమై కెల్లాగ్ - బ్రియాండ్ ఒడంబడిక మీద సంతకాలు చేసినాయి. రష్యా కూడా ఈ ఒడంబడికను ఆమోదించింది. 1930 నాటికి 65 రాజ్యాలు ఈ ఒడంబడికను ఆమోదించినాయి.

### కెల్లాగ్ - బ్రీయాండ్ ఒడంబడికలోని నిబంధనలు :

1. ఒడంబడికలో భాగస్వాములైన రాజ్యాలు యుద్ధాలను విరమించుకొని జాతీయాభివృద్ధికోసం పాటుపడాలి.
2. రాజ్యాలు తమ మధ్య తలెత్తే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించవలె.
3. ప్రపంచంలోని అన్ని రాజ్యాలు ఈ ఒడంబడికలో భాగస్వాములుగా చేరవచ్చు.

పారిస్ ఒడంబడికను ప్రపంచమంతా ప్రశంసించింది. అంతర్జాతీయ శాంతిస్థాపన విషయలో ఈ ఒడంబడిక ముఖ్యమైన సోపానమని చెప్పవచ్చు. యుద్ధాలను నిషేధించిన ఈ సంధి మీద ప్రపంచంలోని అనేక రాజ్యాలు సంతకాలు చేయడం ఒక విశేషము. మొదటి ప్రపంచ యద్ధానంతరం మొదటిసారిగా అమెరికా రష్యాలు ఒక సంధి పత్రం మీద సంతకాలు చేసినాయి. ఈవిధంగా అమెరికా, రష్యాలు అంతర్జాతీయ రాజకీయాలలో పరస్పరం సంప్రదించుకోవడం ప్రారంభించినాయి. ఈ ఒడంబడిక జరిగిన తరువాత వివిధ రాజ్యాల మధ్య పరస్పర మైత్రి సంధులు, విరుద్ధ ఒడంబడికలు చేసుకోవడం జరిగింది.

అయితే ఈ పారిస్ ఒడంబడిక కేవలం నైతికమైన కట్టుబాటేగాని, శక్తివంతమైన ఏర్పాటు కాదు. ఒప్పందంలోని షరతులను నివారించడానికి, వాటిని అమలుపరచడానికి ఏవిధమైన యంత్రాంగాన్ని రూపొందించడం జరగలేదు. వలసరాజ్యాలు సంరక్షణ కోసం జరిపే యుద్ధాలను మాత్రం ఒప్పందం పరిధిలోకి తీసుకొని రావడం జరగలేదు. అందువల్ల ఈ ఒప్పందం పూర్తిగా యుద్ధవ్యతిరేక సిద్ధాంతాన్ని సమర్థించిందని చెప్పలేదు. పారిస్ ఒడంబడిక సమితిని పటిష్టం చేయడానికి బదులు బలహీనపరిచిందని ఇ.హెచ్.దొర అభిప్రాయపడినాడు.

అనేక లోపాలున్నప్పటికీ పారిస్ ఒడంబడిక అంతర్జాతీయ సంబంధాల చరిత్రలో ఒక ముఖ్యమైన సంఘటన అని చెప్పవచ్చు. సార్వత్రిక యుద్ధనిషేదము ఈ ఒడంబడికలోని గొప్ప విశేషము. ఈ ఒడంబడిక జరిగిన తరువాత వివిధ రాజ్యాల మధ్య వివిధ సంధులు జరిగాయి. దీనివల్ల సమితి ప్రమేయం లేకుండా సమిష్టి భద్రతను సాధించడానికి అవకాశము ఏర్పడినది. పారిస్ ఒడంబడిక తరువాత అమెరికా తాను ఇంతవరకూ అనుసరిస్తున్న ఏకాంత విధానాన్ని విడనాడి ప్రపంచ రాజకీయ వ్యవస్థలో తన నాయకత్వాన్ని నెలకొల్పే ప్రయత్నాలు ప్రారంభించింది. అమెరికా, రష్యాల మధ్య సహకారము, సుహృద్భావమూ సామర్యసమూ నెలకొన్నాయి.

### 17.3.3.4 సాధారణచట్టము - 1935 :

సమితి సాధారణ చట్టాన్ని ఆమోదించి అంతర్జాతీయ సమిష్టి భద్రతా స్థాపనకు 1935లో చివరిప్రయత్నం చేసింది. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం న్యాయసంబంధమైన వివాదాన్ని అంతర్జాతీయ న్యాయస్థానానికి, ఇతర వివాదాలను సమితి మధ్యవర్తిత్వం కమిటీకీ నివేదించవలె. అయితే ఈ చట్టాన్ని 35 రాజ్యాలు మాత్రమే ఆమోదించినాయి.

### 17.3.4 సమితి ప్రమేయం లేకుండా భద్రతా స్థాపనకు జరిగిన ప్రయత్నాలు :

మొదటి ప్రపంచయుద్ధానంతరం ఫ్రాన్స్ తన ప్రయోజనాల పరిరక్షణకు, అంతర్జాతీయ హామీ కొరకు సమితి ద్వారానే గాక తనకు తానుగా తీవ్రప్రయత్నం చేసింది. జర్మనీకి చుట్టుప్రక్కలనున్న చిన్న చిన్న రాజ్యాలతో పరస్పర రక్షణ ఒడంబడికలు చేసుకొని జర్మన్ దురాక్రమణ బారినుండి తనను రక్షించుకోవడానికి ఫ్రాన్స్ ప్రయత్నించింది. ఈ ఒడంబడికల ఫలితంగా జర్మనీని శత్రురాజ్యాలు చుట్టివేస్తాయని ఫ్రాన్స్ ఆదేశించింది.

#### 17.3.4.1 ఫ్రాన్స్ - బెల్జియమ్‌ల మైత్రిసంధి :

ఫ్రాన్స్ - బెల్జియమ్‌లు 1920లో పరస్పర సహాయక సంధిని చేసుకున్నాయి. ఈ సంధి ప్రకారం జర్మనీ తన మీద దురాక్రమణ జరిపినపుడు పరస్పరం సహాయం చేసుకోవడానికి ఫ్రాన్స్, బెల్జియంలు అంగీకరించాయి.

#### 17.3.4.2 ఫ్రాన్స్ - పోలండ్‌ల మైత్రిసంధి :

జర్మన్ వల్ల భీతిచెందిన ఫ్రాన్స్, రష్యా, జర్మనీల వల్ల భీతిచెందిన పోలండ్ 1921లో ఒక రక్షణ సంధిని చేసుకున్నాయి. ఈ సంధి ప్రకారం దురాక్రమణకు వ్యతిరేకంగా పరస్పరం సహాయం చేసుకోవడానికి, అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి ఒకరినొకరు సంప్రదించుకోవడానికి ఏర్పాట్లు చేయడం జరిగింది.

#### 17.3.4.3 ఫ్రాన్స్ - చెకొస్లావాకియాల మధ్య సంధి :

ఫ్రాన్స్ - చెకొసావాకియాలు 1924లో ఒక మైత్రిసంధిని చేసుకున్నాయి. ఈ సంధి ఫలితంగా చెకొస్లావాకియాలో ఏర్పడిన నూతన రాజకీయ వ్యవస్థ రక్షణకు, ప్రాదేశిక సమగ్రత రక్షణకు హామీ ఏర్పడింది. దురాక్రమణకు వ్యతిరేకంగా పరస్పరం సహాయం చేసుకోవడానికి కూడా ఏర్పాటు జరిగింది.

#### 17.3.4.4 ఫ్రాన్స్ - రుమేనియాల మధ్య సంధి :

1926లో ఫ్రాన్స్, రుమేనియాల మధ్య ఒక మైత్రి సంధి జరిగింది. దీని ప్రకారం దురాక్రమణలను ఎదుర్కోవడానికి పరస్పరం సహాయం చేసుకోవడానికి అంగీకారం కుదిరింది.

#### 17.3.4.5 ఫ్రాన్స్ - యుగొస్లావియాల మధ్య సంధి :

1927లో ఫ్రాన్స్, యుగొస్లావియాల మధ్య ఒక సంధి జరిగింది. తమ మధ్య వివాదాలను శాంతియుతంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడానికి, దురాక్రమణను కలిసి ఎదుర్కోవడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి.

పైన పేర్కొన్న ఒడంబడకలన్నీ జర్మన్ దురాక్రమణను ఎదుర్కోవడానికి ఫ్రాన్స్ చేసిన ప్రయత్నాలని చెప్పవచ్చు. ఈ ఒడంబడిక ఫలితంగా జర్మనీని విరోధి రాజ్యాలు చుట్టివేసినాయని భావించి ఫ్రాన్స్ సంతృప్తిచెందింది. కానీ సైనిక రక్షణ దృష్ట్యా చూస్తే ఈ ఒప్పందాలు ఫ్రాన్స్‌కు పెద్దగా ప్రయోజనకారులు కావనేచెప్పాలి. ఎందుకంటే ఈ ఒప్పందాల మూలంగా ఫ్రాన్స్ తూర్పు యూరప్ దేశాలకు ఆయుధ సహాయం, రుణాలను ఇవ్వవలసి వచ్చింది. అంతేగాక ఫ్రాన్స్ తూర్పు యూరప్ దేశాలతో సంధి చేసుకోవడం ఇటలీకి కోపకారణమైంది.

### 17.3.5 చిన్న రాజ్యాల సౌహార్ధ కూటమి (The Little Entente) :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం చెకొస్లావాకియా, యుగొస్లావియా, రుమేనియా రాజ్యాలు సమిష్టిగా చిన్నరాజ్యాల సౌహార్థకూటమిగా ఏర్పడినాయి. శాంతిభద్రతలను కాపాడటం, జర్మనీ ఆస్ట్రియాల దురాక్రమణ బారి నుంచి తమ సరిహద్దులను కాపాడుకోవడం, ఆస్ట్రియా హప్స్‌బర్గ్ వంశ పునరుద్ధరణను ఎదుర్కోవడం మొదలైనవి చిన్నరాజ్యాల సౌహార్థకూటమి ప్రధాన లక్ష్యాలు.

### 17.3.6 ఇటలీ మైత్రి సంధులు :

యుద్ధంలో గెలిచిన ఇటలీ, ఓడిపోయిన ఆస్ట్రియా, హంగేరీ, బల్గేరియాలతో కలిసి వర్సేసంధి సవరణకు ప్రయత్నాలు చేసింది. ఈ రాజ్యాలన్నింటినీ కలిపి పరికృత సమూహంగా (రివిజనిస్ట్ వర్గం) పేర్కొనవచ్చు. ఈ వర్గంలో కొత్తగా ఏర్పడిన రుమేనియా, యుగోస్లావియా, చెకొస్లావాకియాలు కూడా ఉన్నాయి. జర్మనీ అవలంబించిన దుడుకైన విధానం కారణంగా ఈ దేశాలు ఒక వర్గంగా ఏర్పడింది. 1934లో ఇటలీ, ఆస్ట్రియా, హంగేరీలు రోమ్‌సంధిని చేసుకున్నాయి. ఇది ఇటలీకి ఘనవిజయం.

### 17.3.7 బాల్కన్ ఒప్పందము :

1934లో రుమేనియా, యుగొస్లావియాలు గ్రీస్, టర్కీలతో కలిసి బాల్కన్ ఒడంబడిక మీద సంతకాలు చేసినాయి. ఈ సంధి ప్రకారం సంధి పత్రం మీద సంతకాలు చేసిన రాజ్యాలు ప్రాదేశిక సమగ్రతకు హామీ ఇవ్వడం జరిగింది.

### 17.3.8 ఇతర ఒడంబడికలు :

ప్రాంతీయ భద్రతా స్థాపన కోసం బాల్కన్ ఒడంబడికను ఏర్పాటు చేసినప్పటికీ సంతృప్తిచెందని టర్కీ 1937లో ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్, ఇరాన్‌లతో 'సాదబాద్' ఒడంబడిక చేసుకున్నది. జర్మనీ, ఇటలీల దురాక్రమణల నుండి తమను తాము రక్షించుకోవడానికి స్కాండినేవియా రాజ్యాలైన నార్వే, డెన్మార్క్, స్వీడన్, ఫిన్‌లాండ్‌లు 1938లో ఒక రక్షణ ఒడంబడికను చేసుకున్నాయి. అలాగే బాల్టన్ రాజ్యాలైన లాట్వియా, అథులేనియా, ఇస్టోనియాలు 1934లో బాల్టిక్ ఒడంబడికల మీద సంతకాలు చేసినాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ దేశాలు 1933లో రోమ్ ఒప్పందము చేసుకున్నాయి. రష్యా తన పొరుగురాజ్యాలతో 1933లో మూడు లండన్ ఒడంబడికలు చేసుకొన్నాయి.

అయితే ప్రాంతీయ భద్రత కోసం చేసుకున్న ఈ ఏర్పాట్లు, ఆశించిన ఫలితాన్నీయకపోగా, ఉద్రికత్తతలను పెంచి, మరో ప్రపంచ యుద్ధానికి దారితీశాయి.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం నిరాయుధీకరణ సమస్య ఐరోపా దేశాలన్నింటి దృష్టిని ఆకర్షించింది. అందుకు కారణం భద్రతా సమస్య నిరాయుధీకణతో ముడిపడి వుండటమే. నానాజాతి సమితి ఒప్పందంలోని ఎనిమిదో ప్రకరణం సభ్యదేశాలన్నీ తమ తమ భద్రతల కవసరమైనంతవరకే ఆయుధశక్తిని పరిమితం చేసుకోవాలని నిర్దేశించింది. తొమ్మిదో ప్రకరణం సైనిక, నౌకా, వైమానిక శక్తులపై పరిమితి నమలుపరచడానికి ఒక శాశ్వత సంఘమేర్పడాలని నిర్దేశించింది. ఈ నిర్దేశ సూత్రాల లక్ష్యసాధనలో భాగంగానే, నిరాయుధీకరణను అమలు జరపాలని సమితి ప్రయత్నాలు చేసింది. సమితి ప్రమేయం లేకుండా కూడా నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడానికి బ్రిటన్, అమెరికా లాంటి దేశాలు ప్రయత్నించాయి.

**17.3.10.1. సమితి ద్వారా నిరాయుధీకరణకు జరిగిన ప్రయత్నాలు :**

ప్రథమంలో నానాజాతి సమితి అంతర్జాతీయ భద్రత, నష్టపరిహార చెల్లింపులు మొదలగు వివాదాలలో నిమగ్నమై వుండటంవల్ల నిరాయుధీకరణ విషయాన్ని గురించి అంతగా పట్టించుకోలేకపోయింది. 1920లో నిరాయుధీకరణ విషయమై సమితికి తగు సలహా సంప్రదింపులు ఇవ్వడానికై ఒక శాశ్వత సలహా సంఘాన్ని నియమించడం జరిగింది. 1921లో సమితి ఒక తాత్కాలిక మిశ్రమ సంఘాన్ని నిరాయుధీకరణ సమస్య పరిష్కరించడానికి నియమించింది. ఈ సంఘము పరస్పర సహాయక సంధి ముసాయిదాను తయారుచేసింది. ఈ సంధి ప్రకారం నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని అమలుపరచవలె. అయితే పెక్కు దేశాలు తిరస్కరించడం వల్ల తొలి ప్రయత్నం విఫలమైంది. 1924లో సమితి నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడానికి చేసిన ప్రయత్నం కూడా ఫలించలేదు.

1925లో జరిగిన లొకర్నో ఒడంబడికల ఫలితంగా అంతర్జాతీయ పరిస్థితులు చాలావరకు నిరాయుధీకరణను అమలుపరచడానికి అనుకూలంగా మారినాయి. నిరాయుధీకరణను సాధించడానికి సమితి ఒక సన్నాహక సంఘాన్ని నియమించింది. ఈ సంఘం 1926లో జనీవాలో తొలిసమావేశం జరిపింది. ప్రతినిధుల మధ్య విభేదాల వల్ల ఈ సంఘం విజయాన్ని సాధించలేకపోయింది. అయితే వివిధ దేశాల ఆమోదాన్ని పొందిన కొన్ని సిద్ధాంతాల ప్రాతిపదికగా ఈ సంఘం 1927లో ఒక ముసాయిదా ఒడంబడికను తయారుచేసింది. కాని ఆ ప్రయత్నం విఫలమైంది.

నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడంలో సన్నాహక సంఘం విఫలమైన తర్వాత సమితి మండలి మొదటి ప్రపంచ నిరాయుధీకరణ సమావేశాన్ని జనీవాలో 1932లో ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో 61 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే ఫ్రాన్స్, అమెరికా, జర్మనీ, ఇంగ్లండ్‌ల ధోరణి మూలంగా ఈ సమావేశం చెప్పుకోదగిన ప్రగతిని సాధించలేకపోయింది. 1932లో రెండో నిరాయుధీకరణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్నిరాజ్యాల భద్రత కోసం అందరికీ సమాన హక్కులు ఇవ్వడాన్ని ఆమోదించినాయి. మూడో నిరాయుధీకరణ సమావేశాన్ని 1933లో ఏర్పాటు చేసినారు. ఈ సమావేశ ప్రారంభ కాలం నాటికి అంతర్జాతీయ పరిస్థితులు చాలావరకు మారిపోయాయి.

1933లో జపాన్ సమితి సభ్యత్వమునుంచి ఉపసంహరించుకొంది. జర్మనీలో హిట్లర్ నాయకత్వంలో నాజీ ప్రభుత్వమేర్పడింది. హిట్లర్ జర్మనీ సైనికబలాన్ని పెంపొందించుకోవాలని ప్రయత్నించడంతో ఫ్రాన్స్ భయపడి తన భద్రతకు అన్నిదేశాల నుంచి హామీ లభించేవరకు నిరాయుధీకరణ పథకాన్ని ఆమోదించజాలనని తెలియజేసింది. ఇటువంటి పరిస్థితులలో బ్రిటిష్ ప్రధాని మాక్డొనాల్డ్ ఒక పథకాన్ని రూపొందించి సమావేశం ముందు ఉంచినాడు. దీని ప్రకారం ప్రతిదేశము సైనిక బలాన్ని తగ్గించవలెను. ఒక శాశ్వత నిరాయుధీకరణ సంఘాన్ని అంతర్జాతీయ పరిస్థితులను పర్యవేక్షించడానికి నియమించవలె. దీనినే మాక్డొనాల్డ్ ప్రణాళిక అంటారు. కాని దీనిని నిరాయుధీకరణ సమావేశం తిరస్కరించింది. ఆ తరువాత ఫ్రాన్స్ తయారుచేసిన ఒకపథకాన్ని జర్మనీ తిరస్కరించింది. ఈ పరిస్థితుల్లో ఇటలీ ప్రధాని ముస్సోలినీ ఒక ప్రతిపాదన చేయగా, దానిని పెక్కుదేశాలు తిరస్కరించాయి.

1933లో అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ నిరాయుధీకరణ సమావేశానికి ఒక ప్రతిపాదనలను పంపాడు. ఇందులో అతడు సభ్యదేశాలన్నీ విరుద్ధ సంధులు చేసుకోవాలని, అమితంగా ఆయుధాలను ప్రోగుచేయడం మానాలని సూచించాడు. జర్మనీ నుండి తనపై దాడిరాదని హామీ కావాలని ఫ్రాన్స్ కోరింది. దాంతో జర్మనీ సమావేశం నుండి ఉపసంహరించుకోవడమేకగాక, సమితి నుండి వైదొలగింది. 1934లో తిరిగి నిరాయుధీకరణ సమావేశం జరిగింది. కాని అగ్రరాజ్యాల మధ్య విభేదాల కారణంగా

సమావేశంలో ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఆ తరువాత నిరాయుధీకరణ సమావేశాలు అసలు జరగనేలేదు. నిరాయుధీకరణ సమావేశాలు విఫలం కావడానికి ముఖ్యకారణము అగ్రరాజ్యాల మధ్య సహకారం లోపించడమే.

## 17.3.10.2 సమితి ప్రమేయం లేకుండా నిరాయుధీకరణ కోసం జరిగిన ప్రయత్నాలు :

నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడానికి సమితి ద్వారా ప్రయత్నాలు జరిగినట్లుగానే సమితి ప్రమేయం లేకుండా కూడా అనేక ప్రయత్నాలు జరిగాయి.

### 17.3.10.2.1 వాషింగ్టన్ సమావేశము - 1921 - 22 :

మొదటి ప్రపంచయుద్ధం తరువాత జపాన్ దూరప్రాచ్యంలో గొప్ప నౌకాబలమున్న రాజ్యంగా రూపొందింది. అంతేగాక పసిఫిక్ ప్రాంతంలో జపాన్ ఆధిపత్యం అమెరికాకు ఆందోళనను కలగజేసింది. సాధ్యమైనంతవరకు జపాన్‌కు తనకుమధ్య నౌకాదళ యుద్ధాన్ని నివారించవలెనని కోరికగల అమెరికా దూరప్రాచ్యంలో ఆసక్తిగల దేశాల నౌకాబలాన్ని పరిమితం చేయడానికి ప్రయత్నించింది. అమెరికా అధ్యక్షుడు హార్డింజ్ 1921లో వాషింగ్టన్ సమావేశాన్ని ఏర్పాటు చేసినారు. చైనా, జపాన్‌ల మధ్య గల తగాదాలను పరిష్కరించడం, ఇంగ్లండ్, అమెరికాల మధ్య నౌకాబలాల పోటీని అంతం చేయడం కూడా వాషింగ్టన్ సమావేశాల లక్ష్యాలు. 1921లో వాషింగ్టన్‌లో ప్రారంభమయిన మొదటి నౌకాదళాల సమావేశము 1922 ఫిబ్రవరి వరకు కొనసాగింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం, చైనా, జపాన్, పోర్చుగల్, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయినారు.

వాషింగ్టన్ సమావేశం ఫలితంగా ఏడు సంధులను చేసుకోవడం జరిగింది. వీటిలో రెండు సంధులు నౌకాదళాల నిరాయుధీకరణకు సంబంధించినవి.

ఐదు రాజ్యాల మధ్య జరిగిన సంధి ప్రకారం అమెరికా, ఇంగ్లాండ్, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ దేశాల నౌకాబల నిష్పత్తిని నిర్ణయించడం జరిగింది. అమెరికా బలం 525 వేల టన్నులు, ఇంగ్లండ్ నౌకాబలం 525 టన్నులు, జపాన్ నౌకాబలం 315 వేల టన్నులు, ఫ్రాన్స్ నౌకాబలం 175 వేల టన్నులు, ఇటలీ నౌకాబలం 175 వేల టన్నులు. ఈ సంధి మీద సంతకాలు చేసిన ఐదు రాజ్యాలు తమ తీరప్రాంతాలలో ఏవిధమైన రక్షణ ఏర్పాట్లు చేసుకోమని కూడా వాగ్దానాలు చేసినాయి.

ఇంగ్లాండ్, అమెరికా, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ దేశాల మధ్య జరిగిన మరొక ఐదురాజ్యాల సంధి ప్రకారం విషవాయువుల ఉపయోగం నిషేధించడమేగాక జలాంతర్గాముల ఉపయోగం కూడా పరిమితం చేయడం జరిగింది. అయితే ఈ సంధిని ధృవపరచడం లేదు. కాబట్టి అమలుజరపడం జరగలేదు.

వాషింగ్టన్ సమావేశంలో నౌకాబలం తగ్గింపుకు చేసిన తీర్మానాలు అంతర్జాతీయ నిరాయుధీకరణను సాధించడానికి తీసుకున్న ఒక ముఖ్యమైన చర్యగా కనిపించవచ్చు. కాని నిజానికి వాషింగ్టన్ సమావేశం చెప్పుకోదగిన విజయాన్ని సాధించలేకపోయింది. అంతేగాక వాషింగ్టన్ సమావేశం తరువాత ఇంగ్లండ్, అమెరికాల మధ్య అనుమానము, ద్వేషాలు తిరిగి తలెత్తినాయి. 1927లో జనీవా సమావేశం, 1920లో లండన్ ఒప్పందము జరిగాయి. కాని వ్యతిరేక ధోరణుల వల్ల అవి అంతగా విజయవంతం కాలేదు.

## 17.3.11 సమిష్టి భద్రతా స్థాపనకు జరిగిన ప్రయత్నాలు విఫలం కావడానికి కారణాలు :

సమిష్టి భద్రతా స్థాపనకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడానికి అనేక కారణాలు గలవు. అవి :

1) సభ్యరాజ్యాలు తమ సైన్యాలను సమితి ఆధీనంలో ఉంచడానికి ఇష్టపడలేదు.

2) దురాక్రమణకు గురిఅయిన రాజ్యాల రక్షణకు యుద్ధాలు చేయడానికి సభ్యరాజ్యాలు సుముఖంగా లేవు.

3) దురాక్రమణను ఎదుర్కోవడానికి సమితి ఒడంబడికలో పొందుపరచబడిన నిబంధనలు లొకర్నో సంధిలో, కెల్లాగ్ - బ్రియాండ్ సంధిలో చేర్చడం వల్ల సమితి ప్రాముఖ్యత తగ్గింది.

4) ఫ్రాన్స్ అనేక ప్రాంతీయ భద్రతా ఒడంబడికలు తయారుచేయడంవల్ల సమిష్ఠి భద్రత విఫలమైంది.

5) దురాక్రమణ విధానం అనుసరించే జర్మనీపట్ల ఇంగ్లాండ్, అమెరికాలు తృప్తిపరిచే విధానం అనుసరించడం కూడా సమిష్ఠి భద్రత విఫలం కావడానికి కారణమైంది.

## 17.3.12 నమూనా ప్రశ్నలు :

1. మొదటి ప్రపంచయుద్ధానంతరం ఫ్రాన్స్ తన భద్రత కొరకు ఎట్టి ప్రయత్నాలు చేసింది ?
2. లొకర్నో, కెల్లాగ్ - బ్రియాండ్ ఒడంబడికల గురించి చర్చించుము.
3. వాషింగ్టన్ సమావేశాల ప్రాముఖ్యత తెలుపుము.

## 16.7 చదువదగిన గ్రంథాలు :


1. H.L. Peacock - Modern European History
2. Raghubhir Dayal - Modern European History
3. C.J.A.H. Hayes - Modern Europe since 1870
4. D. Thamson - Europe since Napoleon
5. C.D. Hazan - Modren Europe upto 1945
6 E. Lipson - Europe between the two world wars


- శ్రీ కె. సూర్య ప్రకాష్‌రెడ్డి

పాఠం - 18

# రెండో ప్రపంచ యుద్ధము (1939-45)

## 18.0 లక్ష్యం :

రెండో ప్రపంచ యుద్ధానికి కారణాలు, యుద్ధ స్వభావం, యుద్ధగమనం, యుద్ధంలో అమెరికా పాత్ర, అక్షరాజ్యాల పతనానికి కారణాలు, శాంతి షరతులు, యుద్ధ ఫలితాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**


**18.1 పరిచయము**

**18.2 రెండో ప్రపంచ యుద్ధానికి కారణాలు**

**18.2.1 వర్సే సంధి యొక్క పరిణామాలు**

**18.2.2 సామ్రాజ్య తత్త్వము**

**18.2.3 నానాజాతి సమితి వైఫల్యము**

**18.2.4 నిరాయుధీకరణ ప్రయత్నాల వైఫల్యము**

**18.2.5 ప్రజాస్వామ్య - నియంతృత్వాల మధ్య సంఘర్షణ**

**18.2.6 అల్ప సంఖ్యాక జాతుల అసంతృప్తి**

**18.2.7 తృప్తిపరిచే విధానము**

**18.2.8 ఆర్థిక మాంద్యము**

**18.2.9 జర్మనీలో తీవ్ర జాతీయవాదము**

**18.2.10 తక్షణ కారణం**

**18.3 యుద్ధ స్వభావం**

**18.4 యుద్ధ గమనం**

**18.4.1 యుద్ధంలో అమెరికా పాత్ర**

**18.5 అక్షరాజ్యాల పతనానికి కారణాలు**

**18.6 శాంతి షరతులు**

**18.7 యుద్ధ ఫలితాలు**

**18.8 నమూనా ప్రశ్నలు**

**18.9 చదువదగిన గ్రంథాలు**


## 18.1 పరిచయము :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం నాటి రాజనీతిజ్ఞులు యుద్ధాలను నివారించాలనీ, విశ్వశాంతిని స్థాపించాలనీ, అందుకు ఒక అంతర్జాతీయ సంస్థ ఉండాలని భావించి నానాజాతి సమితిని స్థాపించారు. కాని ఈ సమితి తన కర్తవ్య నిర్వహణలో పూర్తిగా విఫలమైంది. అంతేగాక మొదటి ప్రపంచ యుద్ధానంతరం వివిధ దేశాలలో స్థాపించబడిన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజల

సమస్యలను పరిష్కరించుటలో విఫలమయ్యాయి. దీనిలో అనేక రాజ్యాలలో నియంతృత్వ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఈ ప్రభుత్వాల మితిమీరిన సామ్రాజ్య కాంక్ష, అగ్రరాజ్యాల తృప్తిపరిచే విధానం రెండో ప్రపంచ యుద్ధానికి దారితీశాయి.

## 18.2 రెండో ప్రపంచ యుద్ధానికి కారణాలు :

1939 నాటికి ఐరోపా అంతటా యుద్ధ వాతావరణం నెలకొని అనతి కాలంలోనే ప్రపంచమంతా వ్యాప్తి చెందింది. 1939లో హిట్లర్ పోలండ్ మీద దురాక్రమణ జరపడంతో రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమయింది. ఇందుకు అనేక కారణాలు కలవు.

### 18.2.1 వర్సే సంధి యొక్క పరిణామాలు :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం పరాజయం చెందిన జర్మనీతో మిత్రరాజ్యాలు బలవంతాన వర్సే సంధి మీద (1919) సంతకాలు చేయించాయి. ఈ సంధి విల్సన్ 14 సూత్రాల కనుగుణంగా కాక యుద్ధ నేరస్తురాలుగా జర్మనీని అవమానించి, దాని భూభాగాలను కబళించడం జరిగింది. జర్మనీ తనకు గల వలస ప్రాంతాలన్నింటినీ పోగొట్టుకొన్నది. జర్మనీ సైన్యాలను అతి చిన్న దేశమైన బెల్జియం దేశ సైన్యాల కంటే తక్కువగా తగ్గించడం జరిగింది. ఈ సంధి మూలంగా జర్మనీ దాదాపు 15 శాతం వ్యవసాయ యోగ్యమైన భూమిని, 12 శాతం పారిశ్రామిక భూభాగాన్ని కోల్పోయింది. అంతేగాక అపారమైన నష్టపరిహారాన్ని జర్మనీ మిత్రరాజ్యాలకు చెల్లించవలసివచ్చింది. అందువల్ల జర్మనీలో మామూలు పరిస్థితులు ఏర్పడటానికి చాలా కష్టమైంది. జర్మన్ ప్రజలు వర్సేసంధిని తమ మీద బలవంతాన రుద్దిన సంధిగా భావించారు. వర్సేసంధిలోని మొత్తం 440 అంశాల సారాంశము జర్మనీ తిరిగి శక్తివంతమైన దేశంగా మారకుండా చూడటానికి చేసిన ప్రయత్నమే. ఆధునిక కాలంలో జరిగిన సంధులన్నిటిలో విజేత రాజ్యాలు పరాజిత రాజ్యాల మీద కఠినతరమైన షరతులను బలవంతంగా రుద్దడం జరిగింది వర్సే సంధిలోనే. అందువల్ల వర్సే సంధిని ఉల్లంఘించడానికి జర్మన్‌లు ప్రయత్నించడంలో ఆశ్చర్యం లేదు.

### 18.2.2 సామ్రాజ్యతత్వము :

యూరప్ రాజ్యాల సామ్రాజ్యతత్వం కూడా రెండో ప్రపంచ యుద్ధానికి దారితీసింది. జర్మనీలో అధికారాలన్నీ చేపట్టిన నియంత హిట్లర్ మూడవ సామ్రాజ్యాన్ని స్థాపించదలిచాడు. వర్సే సంధి ద్వారా పోగొట్టుకొన్న వలసలన్నిటినీ, యూరప్‌లోని జర్మన్ భూభాగాలను తిరిగి సంపాదించవలెనని హిట్లర్ ఆశించినాడు. వీటిని సాధించడానికై గట్టి ప్రయత్నాలు చేయడం మొదలుపెట్టినాడు. పారిస్ శాంతి సమావేశంలో తనకు అన్యాయం జరిగిందని ఇటలీ కూడా తలపోసింది. జర్మనీలో వలెనే ఇటలీలో కూడా ముస్సోలినీ నాయకత్వంలో ఫాసిస్టుల నియంతృత్వము నెలకొన్నది. ఇటలీకి రోమన్ సామ్రాజ్య కాలం నాటి వైభవాన్ని తిరిగి సంపాదించవలెనని ఉద్దేశించినాడు. మధ్యధరా ప్రాంతంలో బ్రిటీష్ ప్రాబల్యాన్ని నిర్మూలించి, ఇటలీ అధికారాన్ని విస్తరింపజేయవలెనని అతడు తలచినాడు. ఈ ఉద్దేశ్యంతో ఇటలీ తూర్పు ఏడ్రియాటిక్ తీరాన్ని, ఫ్రెంచి ట్యునీషియాను ఆక్రమించదలిచినాడు. ఇదే ఉద్దేశ్యంతో ముస్సోలినీ ఇథియోపియాను కబళించినాడు. మొదటి ప్రపంచ యుద్ధం తరవాత దూరప్రాచ్యంలో జపాన్ శక్తిమంతమైన దేశంగా రూపొందింది. వలసరాజ్యాలను సంపాదించి సామ్రాజ్య స్థాపనకు ప్రయత్నించింది. ఆనాటికి బలహీనంగా ఉన్న చైనా, జపాన్ సామ్రాజ్యతత్వ ధోరణికి గురి అయింది. 1931 లో చైనా భాగమైన మంచూరియాను జపాన్ ఆక్రమించింది. జపాన్ దురాక్రమణను అగ్రరాజ్యాలు అరికట్టలేకపోయినాయి.

### 18.2.3 నానాజాతి సమితి వైఫల్యము :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచంలో సుస్థిర శాంతి స్థాపనకు నానాజాతిసమితిని ఏర్పరచడం జరిగింది. అయితే అగ్రరాజ్యమైన అమెరికా నానాజాతి సమితిలో చేరడానికి నిరాకరించడంతో సమితికి ప్రథమంలోనే ఒక విఘాతం కలిగింది.

సోవియట్ రష్యాకు, పరాజిత రాజ్యాలకు సమితిలో స్థానం కల్పించలేకపోవడంతో సమితి మరింత బలహీనపడింది. సమిష్టి భద్రతా విధానానికి సమితి సభ్యదేశాలు నిర్లక్ష్యం చూపసాగినాయి. సభ్యదేశాలే సమితి చట్టాన్ని గౌరవించడం మానివేసినాయి. అందువల్ల అంతర్జాతీయ శాంతిని రక్షించే బాధ్యతను సమితి సరిగా నిర్వహించలేకపోయింది. జపాన్ 1931లో మంచూరియాను ఆక్రమించినప్పుడు సమితి ఏమి చేయలేకపోయింది. జపాన్ 1937లో చైనామీద అప్రకటిత అనధికార యుద్ధాన్ని ఆరంభించినపుడు సమితి నివారించలేకపోయింది. 1935లో ఇథియోపియాను, 1936లో ఆల్బేనియాను ఇటలీ ఆక్రమించినపుడు సమితి ఏమిచేయలేకపోయింది. ఇటలీ మీద సమితి ఆర్థిక ఆంక్షలు విధించినా బ్రిటన్ సమితితో సహకరించలేదు. జపాన్‌లాగే ఇటలీ కూడా సమితి నుంచి వైదొలగింది. వర్సే సంధిని ఉల్లంఘించి జర్మనీ తన సైనిక బలాన్ని పెంచుకొన్నా సమితి ఎటువంటి చర్య తీసుకోలేకపోయింది. దీనిని అవకాశంగా తీసుకొని ఆస్ట్రియా, చెకొస్లొవాకియాలను జర్మనీ ఆక్రమించింది. శాంతి రక్షణలో సమితి విఫలం కావడంవల్ల యూరోపియన్ దేశాలు సమితి పట్ల విశ్వాసాన్ని కోల్పోయి, తమలో తాము సంధులు చేసుకోవడం ఆరంభించినాయి. ఈ ప్రాంతీయ సంధుల వల్ల యుద్ధ ప్రమాదం ఏర్పడింది.

### 18.2.4 నిరాయుధీకరణ ప్రయత్నాల వైఫల్యము :

జర్మనీ నిరాయుధీకరణను పాటించేటంత వరకు ప్రపంచశాంతికి భంగం కలగదని నాటి యూరప్ దేశాలు భావించాయి. అలాగే జర్మనీ 1934 వరకు ఆయుధీకరణకు పూనుకోకపోవడంతో శాంతి నెలకొన్నది. కాని 1935లో హిట్లర్ జర్మనీలో నిర్బంధ సైనిక విధానాన్ని ప్రవేశపెట్టడంతో పరిస్థితులు మారాయి. జర్మనీ ఆయుధీకరణకు పూనుకోవడంతో ప్రమాదాన్ని ఊహించిన యూరప్‌లోని ఇతర రాజ్యాలు కూడా తమ తమ ఆయుధ సంపదను, సైన్యాలను పెంపొందించుకోవడం మొదలుపెట్టినాయి. నిరాయుధీకరణను అమలుచేసే ఉద్దేశ్యంతో సమితి ఏర్పాటు చేసిన అనేక నిరాయుధీకరణ సమావేశాలు సఫలం కాలేదు. నియంతృత్వ దేశాలు అనతికాలంలోనే సైనికంగా అత్యంత శక్తివంతమైన దేశాలుగా మారాయి.

### 18.2.5 ప్రజాస్వామ్య - నియంతృత్వాల మధ్య సంఘర్షణ :

మొదటి ప్రపంచ యుద్ధం తరవాత కొన్ని ప్రపంచ దేశాలలో నియంతృత్వ స్థాపన జరిగింది. జర్మనీలో నాజీ నియంత హిట్లర్, ఇటలీలో ఫాసిస్ట్ నియంత ముస్సోలినీ, స్పెయిన్‌లో ఫ్రాంకో సేనాని, జపాన్‌లో సైనిక నియంతృత్వము ముఖ్యమైనవి. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా దేశాలు ప్రజాస్వామ్య దేశాలు. ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి ఆదర్శాలలో సంఘర్షణ ఏర్పడింది. నియంతృత్వ దేశాల దురాక్రమణ నుండి ప్రజాస్వామ్యదేశాలు చిన్నరాజ్యాలకు తగిన రక్షణను కల్పించలేకపోయినాయి. మొదటి ప్రపంచ యుద్ధ ఆరంభానికి ప్రపంచ రాజ్యాలు రెండు కూటములుగా ఏర్పడినట్లే రెండో ప్రపంచయుద్ధ కాలానికి కూడా ప్రపంచ రాజ్యాలు రెండు కూటములుగా విడివడినాయి. ఒకవైపు ఇటలీ, జర్మనీ, జపాన్‌లు రోమ్-బెర్లిన్-టోక్యో అక్షకూటమిగా ఏర్పడగా వేరొకవైపు బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలు మరో కూటమిగా ఏర్పడినాయి.

### 18.2.6 అల్ప సంఖ్యాక జాతుల అసంతృప్తి :

వర్సే సంధి, ఇతర సంధులు అనేక అల్పసంఖ్యాక జాతులను సృష్టించినాయి. స్వయం నిర్ణయహక్కు ప్రాతిపదికగా కొత్త రాజ్యాలను ఏర్పరచవలెనని విల్సన్ సూచించాడు. కాని ఆర్థిక, సాంఘిక, మత, సైనిక కారణాల వల్ల, వర్సే సంధి నిర్మాతలు స్వయం నిర్ణయ సూత్రాన్ని కచ్చితంగా అమలుచేయలేకపోయినారు. చాలా సందర్భాలలో విభిన్న జాతులను ఒకే దేశంలో ఉంచడం జరిగింది. దీని ఫలితంగా చాలా దేశాలలో అల్పసంఖ్యాక జాతులలో ద్వేషము, అసంతృప్తి ప్రబలినాయి. దీనిని అవకాశంగా తీసుకొని హిట్లర్ ఆస్ట్రియాను, సుడేటన్ భూభాగాన్ని, పోలండ్‌ను ఆక్రమించాడు.

### 18.2.7 తృప్తి పరిచే విధానము :

నానాజాతిసమితి చట్టానికి విరుద్ధంగా జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాలు దురాక్రమణలు చేసినా బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు ఉదాసీన వైఖరినవలంబించినాయి. దీనివల్ల దురాక్రమణదారులకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కూడా ప్రోత్సాహం కలిగింది. యూరప్‌లో, మధ్య ప్రాచ్యంలో, చైనాలో సోవియట్ రష్యా, బ్రిటన్ ప్రయోజనాలకు సంఘర్షణ కలగడం, కొమింటర్న్ చర్యలు, బ్రిటన్‌లో కమ్యూనిస్ట్ విప్లవం వస్తుందనే కారణాల వల్ల సోవియట్ రష్యా పట్ల బ్రిటన్ వ్యతిరేక వైఖరిని అవలంభించింది. బ్రిటన్‌కు రష్యా పట్ల గల భయ సందేహాలను జర్మనీ, ఇటలీ, జపాన్‌లు అవకాశంగా తీసుకొని తమ తమ దురాక్రమణ చర్యలను నిరాఘాటంగా కొనసాగించాయి. సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా బ్రిటన్ జర్మనీని ప్రోత్సహించింది. వర్సేసంధిని, లాకర్నో ఒడంబడికలను ఉల్లంఘించడానికి, ఆస్ట్రియా, చెకొస్లావాకియాలను ఆక్రమించడానికి జర్మనీకి పరోక్షంగా ప్రోత్సాహమిచ్చింది. ఇథియోపియాను ఇటలీ ఆక్రమించడాన్ని బ్రిటన్ అంగీకరించింది. అలాగే మంచూరియాను జపాన్ ఆక్రమించడానికి పరోక్ష సహకారమిచ్చింది. ఈ తృప్తిపరిచే విధానం వల్ల అక్షరాజ్యాలు బలపడినాయి. అంతేగాక వర్సే సంధి షరతులు జర్మనీకి ప్రతికూలంగా ఉన్నాయనే భావంతో బ్రిటన్ వాటి కాఠిన్యాన్ని సడలించడానికి కూడా ప్రయత్నించింది. బ్రిటిష్ ప్రధాని చాంబర్లేన్ జర్మనీతో మూనిక్ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం చెకొస్లావాకియాను హిట్లర్‌కు పరోక్షంగా అప్పగించడానికే. దూరప్రాచ్యంలో జపాన్ వ్యాప్తిని నిరోధించడానికి, చైనాలోని స్వప్రయోజనాలను పరిరక్షించుకోవడంలో జపాన్ సహాయాన్ని పొందడానికి బ్రిటన్ పట్ల కూడా ఈ విధానాన్నే అనుసరించింది. అదేవిధంగా ఇటలీ పట్ల కూడా బ్రిటన్ తృప్తిపరిచే విధానాన్ని అనుసరించింది. బ్రిటన్ లాగా ఫ్రాన్స్, అమెరికాలు కూడా అక్షరాజ్యాల పట్ల తృప్తిపరిచే విధానాన్ని అవలంబించినాయి. యూరప్‌లో అమెరికా తన ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కమ్యూనిజమ్ వ్యాప్తికి ఆందోళన చెంది అక్షరాజ్యాల పట్ల ఈ విధానాన్ని అవలంబించింది. ఇథియోపియాను ఇటలీ ఆక్రమించినపుడు దాని రాజు హెయిలీ సెలాసి అమెరికా సహాయం కోరగా అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ వివాదాన్ని శాంతియుత పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవలసిందిగా సలహా ఇచ్చినాడు. ఇటలీకి వ్యతిరేకంగా ఇథియోపియాకు అమెరికా ఎట్లాంటి సహాయం చేయలేదు. అలాగే చైనా మీద జపాన్ దురాక్రమణ జరుపుతున్నప్పుడు, అమెరికా జపాన్ మీద ఎట్లాంటి సమర్థమైన చర్యలను తీసుకోవడానికి నిరాకరించింది.

### 18.2.8 ఆర్థిక మాంద్యము :

1929 నాటి ప్రపంచ వ్యాప్తమైన ఆర్థిక మాంద్యము రెండో ప్రపంచ యుద్ధానికి గల కారణాలలో ఒకటి. ఆర్థిక మాంద్యము వల్ల నిరాయుధీకరణ విధానము అంతమయింది. నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం, అనేక దేశాలు ఆయుధాల ఉత్పత్తిని ఆరంభించినాయి. దీనివల్ల ఒకవైపు ఆర్థిక సమస్య తీరడమే కాక, వేరొకవైపు సైనికంగా దేశాలు అభివృద్ధి చెందినాయి.

### 18.2.9 జర్మనీలో తీవ్ర జాతీయవాదము :

జర్మన్‌లలో జనించిన తీవ్ర జాతీయ వాదము రెండో ప్రపంచ యుద్ధానికి ఒక ప్రధాన కారణమని చెప్పవచ్చు. వర్సే సంధిలోని అవమానకరమైన షరతులు జర్మన్‌ల జాతీయభావానికి, రాజకీయ ప్రతిష్ఠకు విఘాతం కలిగించినాయి. వర్సేసంధి ద్వారా తాము పోగొట్టుకొన్న ప్రతిష్ఠను తిరిగి పొందవలెనని, తమకు జరిగిన అవమానానికి ప్రతీకారం చేయవలెనని, తమ జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటవలెననే పట్టుదల జర్మన్‌లలో అధికమైంది. తాము ఆర్థికంగా దురవస్థలో ఉన్నా మిత్రరాజ్యాలు తమకు రావలసిన యుద్ధపరిహారాన్ని చెల్లించమని పట్టుబట్టడం జర్మన్‌లకు భరించరానిదయింది. జర్మనీలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం వల్ల జర్మన్‌లకు ప్రభుత్వం మీద విశ్వాసం తగ్గింది. ఇది నాజీ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర జాతీయవాదము, సైనిక తత్త్వము విజృంభించడానికి కారణమయింది. నాజీ నియంత హిట్లర్ జర్మన్ జాతి ప్రపంచ జాతులలో సర్వోత్కృష్ట జాతి అని పేర్కొన్నాడు.

అధికారాన్ని చేపట్టిన తరవాత హిట్లర్ వర్సే సంధులను ఒకటి తరువాత మరొకటి ఉల్లంఘిస్తూ పోగొట్టుకొన్న వలసలను, జర్మన్ భూభాగాలను తిరిగి సంపాదించడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. దేశంలో నిర్బంధ సైనిక విధానాన్ని ప్రవేశపెట్టి సైన్యాన్ని వృద్ధి చేసినాడు. అన్ని రకాల యుద్ధ సామగ్రిని జర్మనీకి సమకూర్చాడు. శత్రు దుర్భేద్యమైన రాజ్యంగా జర్మనీ రూపొందించాడు. దేశంలో నాజీ పార్టీ తప్ప మిగిలిన రాజకీయ పార్టీలన్నిటినీ నిషేధించడం జరిగింది. యూరప్‌లోని జర్మన్ భాషను మాట్లాడే ప్రాంతాలన్నిటినీ జర్మనీతో విలీనం చేయడానికి ప్రయత్నించాడు. దాని ఫలితమే రెండో ప్రపంచ యుద్ధం.

### 18.2.10 తక్షణ కారణం :

జర్మన్ జాతివారు నివసించే ఆస్ట్రియా, డాంజిగ్ మెమెల్, సుడెటన్ లాండ్ మొదలైన ప్రాంతాలన్నింటినీ జర్మనీలో కలిపివేయాలన్న లక్ష్యంతో హిట్లర్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఒక పథకం ప్రకారం పనిచేయసాగాడు. 1935 లో తటస్థ ప్రాంతమైన రైన్‌లాండ్‌ను ఆక్రమించడంలో హిట్లర్ దురాక్రమణ ఆరంభమయింది. 1938లో హిట్లర్ ఆస్ట్రియాను ఆక్రమించాడు. మూనిక్ ఒడంబడిక ద్వారా సుడెటన్ ప్రాంతాన్ని చెకొస్లావాకియా నుండి పొందాడు. తరవాత ఒడంబడికను ఉల్లంఘించి చెకొస్లావాకియా మొత్తాన్ని ఆక్రమించాడు. 1939 మార్చిలో మెమెల్, లిథువేనియాలను స్వాధీనం చేసుకొన్న తరువాత డాంజిగ్ తనకు రావాలనీ, పోలిష్ కారిడర్ గుండా రైలు మార్గాన్ని నిర్మించుకోనివ్వాలనీ జర్మనీ పోలండ్‌పై ఒత్తిడి చేయసాగింది. పోలండ్ జర్మనీ కోరికలను తిరస్కరించింది. హిట్లర్ దురాక్రమణలను పసిగట్టిన ఇంగ్లండ్ జర్మనీని హెచ్చరించింది. దాంతో హిట్లర్ 1939లో రష్యాతో నిర్యుద్ధ సంధిని చేసుకొన్నాడు. తరువాత ఆగస్ట్ 31న తన సైనికులచే సరిహద్దులోని ఒక జర్మన్ స్టేషన్‌పై దాడిచేసి, ఆ దాడిని పోలండ్ చేసినట్లు ఒక సాకును కల్పించాడు. ఆ సాకు ఆధారంగా 1939 సెప్టెంబర్ 1న హిట్లర్ తన సైన్యాలను పోలండ్‌పైకి పంపాడు. జర్మనీ తక్షణమే తన సైన్యాలను ఉపసంహరించాలని ఫ్రాన్స్, బ్రిటన్‌లు ప్రకటించాయి. కానీ జర్మనీ ఆ ప్రకటనను లక్ష్యపెట్టలేదు. దాంతో 1939 సెప్టెంబర్ 3న బ్రిటన్, ఫ్రాన్స్‌లు యుద్ధాన్ని ప్రకటించాయి. ఫలితంగా రెండో ప్రపంచ యుద్ధం ఆరంభమైనది.

### 18.3 యుద్ధ స్వభావం :

ఇంతకు ముందు జరిగిన యుద్ధాల కంటే రెండో ప్రపంచ యుద్ధం అనేక విధాల భిన్నమయింది. 1) ఇది సంపూర్ణ యుద్ధము. ఎందుకంటే యుద్ధ ప్రయోజనాలకే రాజ్యాల వనరులన్నీ సమీకరించబడ్డాయి. మానవ జీవన విధానంలోని అన్ని కార్యకలాపాలపై రాజ్యం నియంత్రణను కలిగియుండి, అవన్ని యుద్ధానికి పణంగా పెట్టబడినాయి. 2) ఈ యుద్ధం భూగోళంలోని అన్ని ప్రాంతాలలో జరిగాయి. ఉదాహరణకు ఆర్కిటిక్ ప్రాంతంలోని మంచు ప్రాంతాలలో, ఉత్తర ఆఫ్రికాలోని ఎడారులలో, బర్మా, న్యూగినియా అడవుల్లో, అట్లాంటిక్ సముద్రంలో, పసిఫిక్ దీవులలో ఈ యుద్ధం జరిగింది. 3) ఈ యుద్ధం కనీవినీ ఎరుగని వేగంతో నడిచింది. హిట్లర్ మెరుపు యుద్ధం (బ్లిట్జ్‌క్రిగ్) మూడు నెలల కాలంలోనే ఆరు దేశాలు ఓడిపోయేటట్లు చేసింది. 4) ఈ యుద్ధంలో విమానాలను ప్రధానమైన ఆయుధంగా ఉపయోగించడం జరిగింది. వాయుశక్తి సైనికులకు, పౌరులకు మధ్యగల భేదాన్ని తుడిచివేసింది. 5) ఈ యుద్ధం మిత్రరాజ్యాల ప్రజాస్వామ్యానికి, అక్షరాజ్యాల సంపూర్ణ నిరంకుశత్వ సిద్ధాంతానికి మధ్య జరిగిన యుద్ధం.

### 18.4 యుద్ధ గమనం :

1939 సెప్టెంబర్ 1న జర్మనీ పోలండ్‌పై దాడి చేయడంతో రెండో ప్రపంచ యుద్ధం మొదలైంది. జర్మన్ సైన్యాలకు ప్రసిద్ధుడైన మార్షల్ వాల్థర్ వాన్ బ్రాకిట్ష్ నాయకత్వం వహించాడు. జర్మన్‌లు బ్లిట్జ్ క్రీగ్ వ్యూహం ద్వారా పోలండ్ రాజధాని

వార్సాను పదిహేను రోజులలో ఆక్రమించారు. అలాగే హిట్లర్‌తో కుదుర్చుకొన్న ఒప్పందం ప్రకారం రష్యా దాడి జరిపి తూర్పు పోలండ్‌ను ఆక్రమించింది. సెప్టెంబర్ 29న దురాక్రమణదారులైన రష్యా, జర్మనీ దేశాల విదేశాంగ మంత్రులు మోలటోవ్, రిబ్బన్ ట్రాప్‌లు పోలండ్ దేశాన్ని పంచుకొన్నారు.

పోలండ్ సమస్య తీరడంతో హిట్లర్ తన శక్తియుక్తులను పాశ్చాత్య మిత్రరాజ్యాలవైపు కేంద్రీకరించగా రష్యా తన బలాన్ని బాల్టిక్ రాజ్యాల ఆక్రమణకు సన్నద్ధం చేసింది. కొద్దికాలంలోనే ఎస్తోనియా, లాట్వియా, లిథువేనియాలు రష్యా స్వాధీనమయింది. తరవాత రష్యా ఫిన్‌లాండ్‌ను ఆక్రమించింది. హిట్లర్ డెన్మార్క్, నార్వే, లక్సంబర్గ్, హాలండ్, బెల్జియంలను ఆక్రమించాడు. తరవాత జర్మన్ సైన్యం **1940** జూన్‌లో పారిస్‌ను ఆక్రమించాయి. ఫ్రెంచి సైన్యాలు చెల్లాచెదరయినాయి. ఫ్రెంచి ప్రధాని రేనాడ్ రాజీనామా చేయగా హెన్రీ పెటెయిన్ నూతన ప్రధానిగా నియమితుడయినాడు. ఇతడు బ్రిటన్ అభీష్టానికి వ్యతిరేకంగా జర్మనీతో యుద్ధవిరమణ ఒప్పందాన్ని కుదుర్చుకొన్నాడు. హిట్లర్ మెరుపు యుద్ధం, విజయాన్ని చూచి, ప్రపంచం మొత్తం ఆశ్చర్యంలో మునిగిపోయింది.

ఫ్రాన్స్‌పై దెబ్బతీసిన తరవాత హిట్లర్ ఆంగ్ల పారిశ్రామిక ప్రాంతాలు, నౌకాశ్రయాలు, రాజధానీ నగరం లండన్‌పై బాంబుల వర్షం కురిపించాడు. దీంతో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అయినా ఇంగ్లీష్‌వారు పట్టుదలతో పోరాడారు. బ్రిటన్‌ను లొంగదీసుకోవడంలో జర్మనీ విఫలమయింది. ఫ్రాన్స్ పతనం చెందిన తరవాత ముస్సోలినీ నాయకత్వంలోని ఇటలీ జర్మనీ తరఫున యుద్ధంలో చేరింది. బ్రిటన్‌లో నెలకొన్న విషమ పరిస్థితిని అవకాశంగా తీసుకొని ఉత్తర ఆఫ్రికాలోని బ్రిటీష్ వలసలను వశపరచుకోవడానికి ఇటాలియన్లు ప్రయత్నించి కొంత విజయాన్ని సాధించారు. కానీ వెంటనే బ్రిటీష్ సేనాని వేవెల్ వారిని తరిమివేసి ఆఫ్రికాలోని వలసలను చాలావరకు హస్తగతం చేసుకొన్నాడు. ఇటలీని రక్షించుకోవడానికి రోమెల్ నాయకత్వంలో జర్మనీ సైన్యం ఉత్తర ఆఫ్రికా చేరుకున్నది. అయితే జనరల్ మాంట్ గోమరీ **1942** అక్టోబర్‌లో రోమెల్ సైన్యాన్ని ఎల్ అలామీన్ వద్ద ఓడించాడు. ఈ యుద్ధంలో బ్రిటీష్ వారి విజయం ఒక గొప్ప మలుపు. ఆఫ్రికా విషయంలో ముస్సోలినీ పన్నాగం విఫలమైంది.

సోవియట్ రష్యా, జర్మనీల మధ్య భూభాగాల ఆధిపత్యం విషయంలో విభేదాలు రావడంతో **1941** జూన్‌లో హిట్లర్ తన సైన్యాలను రష్యాపైకి పంపాడు. ప్రారంభంలో హిట్లర్ సైన్యాలు బ్రహ్మాండమైన విజయాలను సాధించింది. ఉత్తర దిశగా లెనిన్ గ్రాడ్ పైకి, మధ్య మాస్కో నగరం పైకి, దక్షిణంగా స్టాలిన్ గ్రాడ్ పైకి దాడులు నిర్వహించి లెనిన్‌గ్రాడ్, మాస్కోలకు అతిచేరువలోకి జర్మన్ సైన్యాలు వచ్చాయి. రష్యన్ సైనికులు తెలివిగా వంతెనలు, ఫ్యాక్టరీలు, రైల్వేలు, పంటలను నాశనం చేసుకొంటూ తిరోగమించారు. స్టాలిన్ గ్రాడ్ వద్ద రష్యన్‌లు ధైర్యాన్ని కూడ తెచ్చుకొని జర్మన్‌లతో ఢీకొన్నారు. చారిత్రాత్మక యుద్ధం దాదాపు ఆరు మాసాల నడిచిన తరవాత రష్యన్‌లు జర్మన్‌లను త్రిప్పికొట్టారు. **3,30,000** సంఖ్య నుండి **12000** లకు క్షీణించిన జర్మన్ సైన్యం లొంగిపోయింది.

జర్మనీ, ఇటలీలతో కమ్యూనిస్ట్ వ్యతిరేక ఒప్పందంపై చేసిన జపాన్ పెరల్ హార్బర్‌లోని అమెరికా నౌకాదళంపై బాంబులను వేసింది. వరుసగా విజయాలను సాధిస్తూ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచేసింది. సయామ్ సింధుశాఖలో రెండు బ్రిటీష్ యుద్ధ నౌకలను జపాన్ ముంచివేసింది. తరువాత జపనీయులు వరుసగా హాంగ్‌కాంగ్, వేక్, మలయా, సింగపూర్, బర్మాలను తమ వశం చేసికొన్నారు. తరవాత ఫిలిప్పైన్స్ దీవులను ఆక్రమించినారు. **1942** అక్టోబర్ నాటికి జపనీయులు ఇండియా తూర్పు ద్వారాల వరకు, ఆస్ట్రేలియా ఉత్తర ద్వారాల వరకు పురోగమించారు.

అమెరికన్ జనరల్ ఐసెన్‌హోవర్ నాయకత్వం క్రింద బ్రిటిష్-అమెరికన్ సైన్యం ఉత్తర ఆఫ్రికా నుండి శత్రు సైన్యాలను పూర్తిగా తొలగించడం జరిగింది. తరవాత మిత్రరాజ్యాలు దాడిచేసి సిసిలీ నాక్రమించాయి. అక్కడనుండి ఇటలీ మధ్య భాగానికి

వెళ్ళి రోమ్‌పై దాడికి పూనుకొన్నారు. ముస్సోలినీ పదవిని కోల్పోయాడు. ఏ షరతులు లేకుండా ఇటలీ లొంగిపోయింది. కాని ఇటలీలో ఉన్న జర్మన్ సైన్యం గట్టి ప్రతిఘటన ఇచ్చింది. ఫాసిస్ట్ వ్యతిరేకులు ముస్సోలినీని కాల్చి చంపారు. 1944 జూన్‌లో మిత్రరాజ్యాలు రోమ్‌ను ఆక్రమించాయి.

మిత్రరాజ్యాలు జర్మనీపై భీకరమైన బాంబు దాడిని ప్రారంభించాయి. ఐసెన్ హోవర్ నాయకత్వంలో మిత్ర రాజ్య సైన్యాలు 1944 ఆగస్ట్‌లో పారిస్‌ను విముక్తం చేశాయి. తరవాత బెల్జియం, హాలండ్‌ల నుండి జర్మన్‌లు పారద్రోలబడ్డారు. తరువాత మిత్ర సైన్యాలు జర్మన్‌లోకి ప్రవేశించాయి. ఈ లోపుగా రష్యన్‌లు పోలండ్ ద్వారా పెద్ద దాడి ప్రారంభించింది. హిట్లర్ ఆత్మహత్య చేసుకొన్నాడు. 1945 మే 7న ఏ షరతులు లేకుండా జర్మనీ లొంగిపోయింది. జర్మనీ, ఇటలీలు లొంగిపోయినప్పటికీ యుద్ధం ముగియలేదు. జపాన్ పోరును సాగించింది. చివరకు అమెరికన్లు హిరోషిమా, నాగసాకిల మీద ఆటంబాంబులు వేసి ఆ నగరాలను నాశనం చేశారు. నిరాశా పరిస్థితిని గమనించి జపాన్ 1945 ఆగస్ట్ 14న లొంగిపోయింది. దీంతో యుద్ధం ముగిసింది.

## 18.4.1 యుద్ధంలో అమెరికా పాత్ర :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం యూరప్‌లో సంభవిస్తున్న రాజకీయ పరిణామాలు మరొక యుద్ధానికి దోహదం చేయునని గ్రహించిన అమెరికా అందుకు దూరంగా ఉండుటకు 1935, 1936, 1937 సంవత్సరాలలో తటస్థ శాసనాలను జారీచేసింది. ఈ శాసనాల ప్రకారం యుద్ధమునందు నిమగ్నమైన దేశాలకు ఎట్టి సామగ్రిని అమ్మరాదని, ఎట్టి రుణాలు ఇవ్వరాదని, ఆ దేశ నౌకలలో ఏ అమెరికన్ పౌరుడు ప్రయాణం చేయరాదు అని శాసించడం జరిగింది. 1939లో యుద్ధం ఆరంభం కాగానే దీనిలో చేరవలెనా చేరకూడదా అనే సమస్య మీద అమెరికాలో రెండు వర్గాలు ఏర్పడినాయి. అమెరికా ఏకాంత విధానాన్నే అవలంబించవలెనని, ఎట్లాంటి పరిస్థితులలోను యుద్ధ వ్యవహారాలలో తలదూర్చరాదని ఒక వర్గం భావించగా, రెండో వర్గము అమెరికా మిత్రరాజ్యాలకు తగిన సహాయాన్ని అందించవలెనని, దీని మూలంగా ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవలెనని విశ్వసించింది. అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ కూడా దురాక్రమణ దేశాలైన ఇటలీ, జర్మనీలకు వ్యతిరేకంగా మిత్రరాజ్యాలకు సహాయం చేయడమే ధర్మమని భావించినాడు. ఏకాంత విధానాన్ని విడనాడి మిత్రరాజ్యాలకు సహాయం చేయవలెనని అమెరికా ప్రజలలో అత్యధికులు భావించారు. అమెరికా రాజ్యాంగరీత్యా, కాంగ్రెస్ అనుమతి లేనిదే యుద్ధంలో పాల్గొన్న దేశాలకు అమెరికా ఎట్టి ఆయుధాలను సరఫరా చేయరాదు. కాని రూజ్‌వెల్ట్ దేశంలో స్వచ్ఛంద సంస్థల ద్వారా బ్రిటన్‌కు ఆయుధాలను సరఫరా చేయడం మొదలుపెట్టినాడు.

### 18.4.1.1 రొఖ్ఖమిచ్చి సరుకును తీసికొనిపోవు సూత్రము :

హిట్లర్ పోలండ్‌పై దురాక్రమణ చేయడంతో ప్రజాస్వామ్యానికి ప్రమాదమేర్పడిందని అమెరికన్‌లు ఆందోళన చెందారు. దాంతో అమెరికా కాంగ్రెస్ 1939 నవంబర్‌లో ఏకాంత విధానానికి స్వస్తి చెప్పి అభిక్రమ విధానమనుసరించెను. ఈ విధానములోని ముఖ్యాంశము రొఖ్ఖమిచ్చి సరుకు తీసికొనుపోవుట. దీని ప్రకారం యూరప్‌లోని ప్రజాస్వామ్య దేశాలు తమకు కావలసిన యుద్ధ సామగ్రిని, ఆహారోత్పత్తులను రొఖ్ఖమిచ్చి అమెరికాలో కొనుగోలు చేసి వానిని తమ నౌకలలో తమ స్వంత బాధ్యతపై తమ దేశాలకు తీసికొని వెళ్ళవలెను. ఈ విధానము ద్వారా అమెరికా యుద్ధానికి దూరముగా ఉండదలచెను. అట్లాంటిక్ సముద్రాధిపత్యమున్న బ్రిటన్‌కు ఈ విధానము లాభించినది.

### 18.4.1.2 బ్రిటన్‌కు శతఘ్ను నౌకలను పంపుట :

హిట్లర్ తన మెరుపు దాడులతో డెన్మార్క్, నార్వే, హాలెండ్, బెల్జియం, ఫ్రాన్స్‌లను ఆక్రమించి ఇంగ్లండ్‌పై జలాంతర్గాముల దాడిని ప్రారంభించాడు. దీంతో అమెరికన్‌లు కలవరపడసాగిరి. అందువల్ల రూజ్‌వెల్ట్ రొఖ్ఖమిచ్చి కొనుగోలు చేయు సూత్రాన్ని

విడనాడి, జర్మన్‌ల దాడిని ఎదుర్కొనుటకు సుమారు 50 పాత శతఘ్ని నౌకలను బ్రిటన్‌కు సాయంగా పంపాడు. 1940 నాటికి అమెరికా యుద్ధ సన్నాహాలను ఆరంభించింది. సైనిక, నౌకా, వైమానిక దళాలను అభివృద్ధి పరచడానికి 1940లో కాంగ్రెస్ 13 మిలియన్‌ల డాలర్‌ల ధనాన్ని మంజూరు చేసింది. దేశంలో నిర్బంధ సైనిక శిక్షణను అమలుపరిచింది.

### 18.4.1.3 అరువు, కౌలు చట్టము :

1940 ఎన్నికలలో రూజ్‌వెల్ట్ మూడో పర్యాయం ఎన్నిక కావడంతో, పతనావస్థలో వున్న మిత్రరాజ్యాలకు సాయము చేయుటకు అరువు, కౌలు పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ పద్ధతి ప్రకారం మిత్ర రాజ్యాలకు కావలసిన యుద్ధటాంకులను, తుపాకులను, ఇతర యుద్ధసామగ్రిని అమెరికానుండి అరువు తీసుకొని యుద్ధం తరవాత వానిని తిరిగి అమెరికాకు యిచ్చివేయాలి. ఈ పద్ధతి వలన యుద్ధాన్ని ఐరోపాకే పరిమితం చేయవచ్చునని రూజ్‌వెల్ట్ ప్రకటించాడు. అమెరికా తమపై అనధికార యుద్ధం ప్రకటించుటయే ఈ విధాన లక్ష్యమని జర్మన్‌లు భావించారు.

### 18.4.1.4 అట్లాంటిక్ ప్రకటన పత్రము :

యుద్ధాన్ని నివారించి, శాంతిని నెలకొల్పవలెనను ఉద్దేశ్యంతో 1941 ఆగస్ట్‌లో అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్, బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అట్లాంటిక్ మహాసముద్రం మీద ఒక యుద్ధనౌకలో సమావేశమై 8 అంశాలతో కూడిన ఒక ప్రకటనను వెలువరించారు. దీనినే అట్లాంటిక్ ప్రకటన పత్రమని అంటారు. ఈ ప్రకటనలోని అంశాలు :

1) అమెరికా, బ్రిటన్‌లు ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించడానికి ప్రయత్నించరాదు.
2) స్థానిక ప్రజల అభీష్టంతోనే దేశాల సరిహద్దులలో మార్పులు చేయాలి.
3) తమకిష్టమైన ప్రభుత్వాన్ని ఏర్పరచుకొనే హక్కు ప్రజలకుండాలి.
4) కార్మికుల స్థితిగతులను మెరుగుపరచడానికి, ఆర్థిక ప్రగతిని, సాంఘిక భద్రతను పెంపొందించడానికి అన్ని దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని సాధించాలి.
5) నాజీ జర్మన్ పతనం తరువాత సుస్థిరశాంతిని స్థాపించి, ప్రపంచంలో అన్ని దేశాలు యుద్ధ భయం లేకుండా నిరసించడానికి అనుకూల పరిస్థితులు కల్పించాలి.
6) ప్రపంచంలో అన్ని దేశాల ప్రజలకు లేమి, భయం అనేవి లేకుండా చేయాలి.
7) అన్ని దేశాలకు సముద్రయానం మీద సమాన హక్కులుండవలెను.
8) శాశ్వత శాంతి సాధనకు, దురాక్రమణ దేశాలను నిరాయుధీకరణం చేయాలి.

ఈ ఆదర్శవంతమైన అట్లాంటిక్ ప్రకటన పత్రము జర్మనీతో పోరాడేదేశాల ప్రజలలో ధైర్య స్థైర్యాలను ప్రోత్సహించింది. 1942 జనవరి 1న 26 మిత్రరాజ్యాలు అట్లాంటిక్ ప్రకటన అంశాలను అంగీకరిస్తూ ఒక సమిష్టి ప్రకటన చేసినాయి. ఆ తరువాత మరికొన్ని దేశాలు ఈ ప్రకటనను అంగీకరించాయి.

### 18.4.1.5 జర్మన్ జలాంగర్గాములపై దాడులు :

అరువు, కౌలు పద్ధతి ద్వారా అమెరికా నుండి బ్రిటన్ తీసుకొన్న యుద్ధ సామగ్రి మార్గమధ్యమంలో జర్మన్ జలాంతర్గాముల దాడులకు గురికాసాగింది. దానితో రూజ్‌వెల్ట్ బ్రిటీష్ నౌకలకు రక్షణగా అమెరికన్ నౌకాదళాన్ని ఐస్‌లాండ్ వరకు పంపాడు. ఫలితంగా అమెరికా నౌకలు జర్మన్ జలాంతర్గాముల దాడులకు గురి అయింది. అందువల్ల రూజ్‌వెల్ట్ ఆగ్రహించి జర్మన్

జలాంతర్గాములను కనపడగానే కాల్చుమని ఉత్తర్వులు జారీచేసాడు. దీనితో అమెరికాకు, జర్మనీకి మధ్య అనధికార యుద్ధం ప్రారంభమయింది.

### 18.1.4.6 పెరల్ హార్బర్‌పై జపాన్ దాడి :

జపాన్ అక్షరాజ్యాకూటమిలో చేరి ఇండో-చైనాను ఆక్రమించడంతో అమెరికా తన ఎగుమతులను జపాన్‌కు నిలుపుదల చేసింది. దీనితో జపాన్ అమెరికాతో యధాస్థితి కొనసాగింపుకు చర్చలు జరిపింది. కాని అవి ఫలించలేదు. 1941 అక్టోబర్‌లో యుద్ధప్రియుడైన టోజో జపాన్ ప్రధాని అయినాడు. ఒకవైపు అమెరికాతో చర్చలు జరుపుతూనే వేరొకవైపు ఎట్లాంటి యుద్ధప్రకటన చేయకుండా 1941 డిసెంబర్‌లో జపాన్ విమాన, నౌకా జలాంతర్గాములు ఫసిఫిక్ మహాసముద్రంలోని అమెరికా ముఖ్య నౌకా స్థావరమైన హవాయ్ దీవులలోని పెరల్ హార్బర్ మీద ఆకస్మికంగా దాడి జరిపినాయి. ఈ దాడిలో సుమారు మూడు వేల మంది అమెరికన్‌లు మరణించడమే గాక అనేక అమెరికన్ విమానాలు ధ్వంసమైనాయి. ఎనిమిది యుద్ధ నౌకలు, ఇంకా ఎన్నో చిన్న చిన్న నౌకలు కూడా ధ్వంసమైనాయి. దీనితో అమెరికా కాంగ్రెస్ జపాన్ మీద యుద్ధాన్ని ప్రకటించింది. అమెరికా మీద ఇటలీ, జర్మనీలు యుద్ధాన్ని ప్రకటించాయి. దీనితో యుద్ధం యదార్థంగా ప్రపంచ యుద్ధంగా పరిణమించింది.

### 18.4.1.7 యుద్ధంలో అమెరికా పాత్ర :

అమెరికా జపాన్‌పై యుద్ధాన్ని ప్రకటించగానే 40 లక్షల సైన్యాన్ని యుద్ధరంగంలోకి దింపింది. జపాన్‌ను ఓడించుటకు అమెరికా పసిఫిక్ రంగంలో సమర్థుడైన సేనాధిపతి జనరల్ మెకార్థర్‌ను నియమించింది. ఇదే సమయంలో ఆగ్నేయాసియాలో జపాన్ దురాక్రమణను అరికట్టుటకు ఇంగ్లండ్ నౌకాధిపతి మౌంట్‌బాటన్‌ను నియమించింది. మెకార్థర్, మౌంట్‌బాటన్‌లు జపాన్‌ను ఓడించినాయి. బాటన్ బర్మాను తిరిగి ఆక్రమించాడు. మెకార్థర్ ఫిలిప్పైన్స్‌ను జయించాడు. అమెరికా నౌకాదళం బ్రిటీష్ నౌకాదళంతో సహకరించి అట్లాంటిక్ మహాసముద్రంలో జర్మన్ జలాంతర్గాములను, 'యు' బోటులను నాశనం చేసింది. ఆఫ్రికా ఖండాన్ని విముక్తి చేయుటకు నియమితుడైన అమెరికా సేనాధిపతి ఐసెన్ హోవర్ వాయువ్య ఆఫ్రికాలోని అల్జీరియాను ఆక్రమించి జర్మనీ, ఇటలీ సేనలను తరిమివేసినాడు. తరవాత ఇటలీపై దండెత్తి జర్మనీ, ఇటలీ సేనలను ఓడించి ఇటలీని ఆక్రమించాడు. ఫ్రాన్స్‌పై దండెత్తి జర్మన్‌లను ఓడించి ఫ్రాన్స్‌ను విముక్తి చేశాడు. మిత్రరాజ్య సర్వసేనాధిపతిగా హోవర్ నియమితుడవడంతో యుద్ధంలో అమెరికా పాత్ర తారస్థాయికి చేరింది. యుద్ధ భారమంతా అమెరికాయే భరించింది. హోవర్ జర్మనీపై దండెత్తి జర్మన్‌లను పూర్తిగా ఓడించి 1945 నాటికి పశ్చిమ జర్మనీనంతటిని ఆక్రమించి బెర్లిన్‌లో అడుగుపెట్టాడు. దీనితో హిట్లర్ ఆత్మహత్య చేసుకొన్నాడు. జర్మనీ బేషరతుగా లొంగిపోయింది. ఐరోపాలో యుద్ధం ముగిసింది. జపాన్ యింకా యుద్ధాన్ని కొనసాగించింది. యుద్ధ విరమణ చేయమని అమెరికా కోరినప్పటికీ జపాన్ యుద్ధవిరమణ చేయలేదు. దీనితో అమెరికా 1945 ఆగస్ట్ 6న హిరోషిమాపై, 9న నాగసాకిపై ఆటంబాంబులు ప్రయోగించింది. ఆ మరుసటిరోజున జపాన్ మిత్రరాజ్యాలకు లొంగిపోయింది. 1945 సెప్టెంబర్ 2న జపాన్‌కు మిత్రరాజ్యాలకు మధ్య మిస్సోరీ అనే అమెరికన్ యుద్ధ నౌకమీద యుద్ధవిరమణ సంధి జరిగింది. దీనితో అధికారికంగా రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది.

మొదటి ప్రపంచ యుద్ధంలో వలె అమెరికా రెండో ప్రపంచయుద్ధంలోను మిత్రరాజ్యాల పక్షం వహించి వారి విజయానికి దోహదపడింది. ఈ యుద్ధంలో సుమారు 10 లక్షల అమెరికన్‌లు మరణించడమో, క్షతగాత్రులు కావడమో జరిగింది. ఈ యుద్ధానికి అమెరికా 350 బిలియన్‌ల డాలర్‌లు వెచ్చించింది. యుద్ధానంతరం ఐరోపారాజ్యాల పునర్నిర్మాణంలో చురుకుగా పాల్గొని వాటికి ఆర్థిక సహాయం చేసింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం తన తటస్థ విధానాన్ని విసర్జించి ప్రపంచ రాజకీయాలలో చురుకుగా పాల్గొని అగ్రరాజ్యంగా మారింది.

## 18.5 అక్షరాజ్యాల పతనానికి కారణాలు :

1) ఫ్రాన్స్ పతనానంతరం తక్షణమే ఇంగ్లండ్ పైకి జర్మనీ దాడి చేయకపోవడం వల్ల, ఇంగ్లండ్‌కు యుద్ధానికి సిద్ధం కావడానికి అవకాశమిచ్చినట్లయింది.

2) హిట్లర్ చేసిన వ్యూహాపరమైన తప్పిదము రష్యా మీద దాడిచేయడం. రష్యా మైత్రితో యుద్ధం సాగించనట్లయితే హిట్లర్ తప్పక విజయం సాధించి ఉండేవాడు.

3) జయించిన ప్రాంతాలలో జర్మన్ సైనికులు అమానుషంగా వ్యవహరించి ప్రజలను భయభ్రాంతులను చేయడం వల్ల ప్రజలు తిరగబడినారు.

4) జపాన్ పెరల్ హార్బర్ పై దాడిచేసి అమెరికాను మిత్రరాజ్యాలవైపు యుద్ధంలో ప్రవేశించేటట్లు చేసింది. అమెరికా ప్రవేశంలో యుద్ధ గతి మారిపోయింది.

5) జర్మన్ సైన్యాన్ని ఆవరించిన నిరాశా నిస్పృహలు జర్మనీ పతనానికి దారితీసింది. హిట్లర్ నిరంకుశత్వం మీద చాలా తీవ్రమైన అసంతృప్తి కలిగి అతనిని హత్యచేయడానికి అనేక కుట్రలు జరిగాయి. జర్మన్ ప్రజలలో కూడా తీవ్ర అసంతృప్తి ప్రబలింది.

6) ప్రపంచ రాజ్యాలలో దీర్ఘకాలం యుద్ధం కొనసాగించడానికి తగిన స్తోమతను జర్మనీ సంపాదించలేదు.

7) జర్మనీకి తగినంత నౌకాబలం లేకపోవడం కూడా జర్మనీ పరాజయానికి కారణమైంది.

8) జర్మనీ వలె జపాన్‌కు కూడా యుద్ధాన్ని చాలాకాలం కొనసాగించే శక్తి స్తోమతులు లేకపోయినాయి.

9) అక్షరాజ్యాల మధ్య సహకారం లోపించడం, సిద్ధాంత రీత్యా భేదాలు కలగడం కూడా జర్మనీ పరాజయానికి ఒక కారణమయింది.

10) ఇటలీ సైనిక బలహీనత అక్షరాజ్యాల పతనానికి మరో కారణమయింది. 1945లో ముస్సోలినీని హత్యచేయడం హిట్లర్ ధైర్య స్థైర్యాలను క్రుంగదీసింది.

11) జర్మనీకి మిత్రదేశమైన స్పెయిన్ జర్మనీని హృదయపూర్వకంగా సమర్థించలేదు.

12) మిత్రరాజ్యాలన్నీ సమైక్యంగా అమెరికా సేనాధిపతి ఐసెన్‌హోవర్ ఆధిపత్యంలో పోరాడినాయి.

13) చర్చిల్, రూజ్‌వెల్ట్, స్టాలిన్‌లు ఎప్పటికప్పుడు సమావేశమై యుద్ధ వ్యూహాలు రచించి తమ సైన్యాలను నడిపించారు.

14) ప్రపంచ ప్రజల అండదండలు మిత్రరాజ్యాలకు సంపూర్ణంగా లభించాయి.

## 18.6 శాంతి షరతులు :

రెండో ప్రపంచ యుద్ధానంతరం అక్షరాజ్యాలతో, దాని భాగస్వామ్యదేశాలతో శాంతిసంధులు ఏర్పరచుకోవడం జరిగింది.

### 18.6.1 ఇటలీతో శాంతి షరతులు :

ఇటలీ ఆఫ్రికాలోని తన వలసలైన లిబియా, ఇరిట్రియా, ఇటాలియన్ సోమాలిలాండ్‌లను కోల్పోయింది. ఇథియోపియా, ఆల్బేనియాల స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని గౌరవించడానికి ఇటలీ అంగీకరించింది. గ్రీస్‌కు డొడెకనీస్ దీవులను ఇవ్వడం జరిగింది. ఏడ్రియాటిక్ దీవులను యుగోస్లావియా పొందింది. ట్రియస్త్ అనే ఏడ్రియాటిక్ నగరం ఐక్యరాజ్యసమితి ఆధీనంలో ఉంచబడింది. ఇటలీ సైన్యం రెండున్నర లక్షలకు కుదించబడింది. ఇటలీ 369 మిలియన్ డాలర్ల యుద్ధ నష్టం చెల్లించేటట్లు నిర్ణయించబడింది.

### 18.6.2 జర్మనీతో శాంతి షరతులు :

రెండో ప్రపంచ యుద్ధానంతరం జర్మనీని మూడు ప్రధాన జోన్లుగా విభజించి, ఒక్కొక్క దాన్ని బ్రిటన్, రష్యా, అమెరికాలకు అప్పగించాలని, ఇవి గాక మరో చిన్న జోన్‌ను ఏర్పరచి ఫ్రాన్స్‌కు ఇవ్వాలని, జర్మనీలోని సైనికీకరణను ప్రవేశపెట్టాలనీ, నాజీలను నామరూపాలు లేకుండా చేయాలని యాల్టా వద్ద మిత్రరాజ్యాలు నిర్ణయించాయి. ఆ ప్రకారం మిత్రరాజ్యాలు మొత్తం జర్మనీని ఆక్రమించాయి. జర్మనీని నిరాయుధీకరణ చేసి నాజీయిజాన్ని తుదముట్టించడానికి మిత్రరాజ్యాల సైనికాధికారులు కృషిచేశారు. అంతేగాక ఒక సైనిక న్యాయస్థానాన్ని ఏర్పాటుచేసి నాజీ యుద్ధ నేరస్తులను విచారణ జరిపి శిక్షించడం జరిగింది. జర్మనీపై విధించే సంధి షరతుల విషయంలో అమెరికా, బ్రిటన్‌ల మధ్య ఏకాభిప్రాయం కుదరనందున రెండు జర్మనీలు ఏర్పడ్డాయి.

### 18.6.3 జపాన్‌తో సంధి :

పసిఫిక్ ప్రాంతంలో జపాన్ 1914 నుండి సంపాదించిన రాజ్యభాగాలన్నిటినీ కోల్పోయింది. పాత సామ్రాజ్యవాద రాజ్యాంగాన్ని రద్దుచేసి, దాని స్థానే ఉదారవాద, ప్రజాస్వామికపరమైన రాజ్యాంగాన్ని జపాన్‌లో ప్రవేశపెట్టబడింది. ఇంతవరకూ చక్రవర్తి చుట్టూ ఉన్న దైవత్వం తొలగించబడింది. షింటో మతానికి రాజ్యమద్దతు తీసివేయబడింది. పాఠశాలల్లో దాని జాతీయవాద సూత్రాల బోధన నిషేధించబడింది. ఆయుధాలు, నౌకలు, వాయుసామాగ్రులు రద్దుచేయబడింది. నిర్బంధ సైనిక పద్ధతి రద్దు చేయబడింది. చాలామందిని యుద్ధ నేరస్థులుగా శిక్షించడం జరిగింది.

### 18.6.4 రుమేనియా, బల్గేరియా, హంగరీలతో సంధులు :

రుమేనియాకు చెందిన బెసరేబియా, రష్యా ఆధీనం కిందికి వచ్చింది, దక్షిణ డొబ్రుజా బల్గేరియాకు అప్పగించబడింది. రుమేనియాకు హంగరీ ట్రాన్సిల్వేనియాను, చెకొస్లొవాకియాకు హంగరీ కొన్ని స్లోవాకియన్ భూభాగాలను ఇవ్వవలసి వచ్చింది. ఫిన్‌లాండ్ కరేలియన్ ఇస్తమస్, పెట్సామో జిల్లాను రష్యాకు వదులుకోవాల్సి వచ్చింది.

### 18.7 యుద్ధ ఫలితాలు :

రెండో ప్రపంచ యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా అనేక మార్పులు తెచ్చినది. ముఖ్యంగా ఈ యుద్ధం ప్రపంచ తుల్య ప్రాబల్యతలో గొప్ప మార్పు తెచ్చింది.

1) మొదటి ప్రపంచ యుద్ధం కంటే రెండో ప్రపంచ యుద్ధం అతి భయంకరమైనది. ఈ యుద్ధంలో అపార ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగింది. ఈ యుద్ధంలో సుమారు కోటి మంది సైనికులు, మూడు కోట్ల మంది సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. యుద్ధంలో నష్టం 4 లక్షల కోట్లు డాలర్లుగా అంచనా వేయబడింది.

2) ఈ యుద్ధ ఫలితంగా అతిబలీయమైన జర్మన్ రాజ్యం పతనమై రెండు ముక్కలయింది. తూర్పుజర్మనీ రష్యాపరంకాగా, పశ్చిమ జర్మనీ మిత్రరాజ్యాల వశమైంది.

3) ఈ యుద్ధం వల్ల నియంతృత్వాలు నశించి ప్రజాస్వామ్యం విజయం సాధించినది. క్రమంగా ప్రపంచమంతా ప్రజాస్వామ్యమే బలపడింది.

4) ప్రపంచ చరిత్రలో తొలిసారిగా జపాన్‌పై అణుబాంబులు ప్రయోగించడం జరిగింది. దీనివల్ల అపారనష్టం జరిగింది.

5) ఈ యుద్ధం వల్ల బ్రిటన్, ఫ్రాన్స్‌లు సైనికంగా, ఆర్థికంగా నష్టపోయి ప్రపంచంలో అగ్రరాజ్యాల స్థాయిని కోల్పోయాయి.

6) ఈ యుద్ధ ఫలితంగా సోవియట్ రష్యా, అమెరికా అగ్రరాజ్యాలుగా అవతరించాయి.

7) మానవాళి ఉనికికే ప్రమాదంగా పరిణమించిన నాజీ, ఫాసిస్ట్ శక్తులు ఈ యుద్ధం ద్వారా నాశనం చేయబడ్డా, ఈ యుద్ధ పర్యవసానంగా సోవియట్ రష్యా, అమెరికాల మధ్య వున్న స్పర్థ వల్ల ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నెలకొన్నది.

8) ప్రచ్ఛన్న యుద్ధ పర్యవసానంగా అలీనోద్యమం ఆవిర్భవించింది. ఈ అలీన రాజ్యాలు సోవియట్ రష్యా, అమెరికాలకు దూరంగా ఉండాలని నిశ్చయించుకొన్నాయి.

9) అమెరికా ప్రజాస్వామ్య సిద్ధాంతానికి, సోవియట్ రష్యా కమ్యూనిస్ట్ సిద్ధాంతానికి నాయకత్వం వహించి ప్రపంచ రాజకీయాలలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించాయి.

10) హిట్లర్ అనుసరించిన యూదు వ్యతిరేకవిధానం వల్ల యూదులకు ప్రపంచవ్యాప్తంగా సానుభూతి లభించింది. ఫలితంగా పాలస్తీనా ప్రాంతంలో ఇజ్రాయిల్ అను పేరుతో యూదురాజ్యమేర్పడింది.

11) కమ్యూనిజాన్ని అరికట్టుటకు అమెరికా నాటో కూటమి ఏర్పాటు చేయగా, అమెరికాను ఎదుర్కొనుటకు సోవియట్ రష్యా వార్సా కూటమిని ఏర్పాటు చేసింది.

12) ఈ యుద్ధ ఫలితంగా శతాబ్దాల తరబడి వున్న వలస పరిపాలన నుండి ఆసియా, ఆఫ్రికా మొదలగు ప్రాంతాలలోని అనేక దేశాలు విముక్తి పొందాయి.

13) రూజ్‌వెల్ట్, చర్చిల్‌ల నిరంతర ప్రయత్నాల ఫలితంగా ప్రపంచ శాంతిని రక్షించడానికి ఐక్యరాజ్యసమితిని స్థాపించడం జరిగింది.

## 18.8 నమూనా ప్రశ్నలు :

1) రెండో ప్రపంచ యుద్ధానికి గల కారణాలను వివరింపుము.
2) రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా నిర్వహించిన పాత్రను సమీక్షింపుము.
3) రెండో ప్రపంచ యుద్ధ స్వభావం, గమనం, ఫలితాలను వివరింపుము.
4) రెండో ప్రపంచ యుద్ధాన్ని ముగించిన శాంతి సంధుల ముఖ్యాంశాలను తెలుపుము.

## 18.9 చదువదగిన గ్రంథాలు :


1. C.J.A.H. Hayes - Modern Europe Since 1870
2. C.D. Hazan - Modern Europe upto 1945
3. D. Thomson - Europe Since Napolean
4. Raghubir Dayal - Modern European History
5. H.L. Peacock - Modern European History, 1789-1973
6. Grant and Temperley - Europe in the 19th and 20th Centuies


- శ్రీ కె. సూర్య ప్రకాష్‌రెడ్డి

పాఠం - 19

# ఐక్యరాజ్యసమితి (ఐ.రా.స.) (యు.ఎన్.ఒ.)

## 19.0 లక్ష్యం :

ఐక్యరాజ్యసమితి స్థాపనకు దారితీసిన అంతర్జాతీయ పరిణామాలు, సమితి అంగాలు, దాని ఆశయాలు, లక్ష్యాలు, అది చేసిన కృషి, నానాజాతి సమితి ఐక్యరాజ్యసమితి పోలికలు గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశములు :**

- **19.1 పరిచయం**
- **19.2 యుద్ధకాలంలో జరిగిన సమావేశాలు**
  - **19.2.1 అట్లాంటిక్ ప్రకటన పత్రము**
  - **19.2.2 కాసాబ్లాంకా సమావేశము**
  - **19.2.3 మాస్కో సమావేశము**
  - **19.2.4 టెహరాన్ సమావేశము**
  - **19.2.5 బ్రిటన్ వుడ్స్ సమావేశము**
  - **19.2.6 డంబార్టన్ ఓక్స్ సమావేశము**
  - **19.2.7 యాల్టా సమావేశము**
  - **19.2.8 శాన్ ఫ్రాన్సిస్కో సమావేశము**
  - **19.2.9 పాట్స్‌డామ్ సమావేశము**
- **19.3 ఐక్యరాజ్యసమితి అవతరణ - దాని లక్ష్యాలు, నియమావళి**
- **19.4 ఐక్యరాజ్య సమితి అంగాలు**
  - **19.4.1 సాధారణ సభ**
  - **19.4.2 భద్రతా సమితి**
  - **19.4.3 ఆర్థిక సాంఘిక మండలి**
  - **19.4.4 ధర్మ కర్తృత్వ సంఘము**
  - **19.4.5 అంతర్జాతీయ న్యాయస్థానము**
  - **19.4.6 సచివాలయం**
- **19.5 ఐక్యరాజ్యసమితి సాధించిన విజయాలు**
  - **19.5.1 రాజకీయ విజయాలు**
  - **19.5.2 రాజకీయేతర విజయాలు (ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక రంగాలు)**
- **19.6 ఐక్యరాజ్యసమితి వైఫల్యము**
- **19.7 నానాజాతి సమితి కంటే ఐక్యరాజ్యసమితి ఎట్లు అభివృద్ధి సాధించింది ?**
- **19.8 నమూనా ప్రశ్నలు**
- **19.9 చదువవదగిన గ్రంథాలు**

## 19.1 పరిచయం :

సుస్థిర శాంతి స్థాపనకు మొదటి ప్రపంచ యుద్ధానంతరం స్థాపితమైన నానాజాతి సమితి తన కర్తవ్య నిర్వహణలో పూర్తిగా విఫలమైంది. ఫలితంగా రెండో ప్రపంచ యుద్ధం సంభవించింది. నానాజాతి సమితి వ్యవస్థలోని లోపాలను చక్కదద్ది కొత్త సంస్థను నిర్మించాలనే మిత్రరాజ్యాల ప్రయత్న ఫలితమే ఐక్యరాజ్యసమితి.

## 19.2 యుద్ధకాలంలో జరిగిన సమావేశాలు :

రెండో ప్రపంచ యుద్ధకాలంలోనే ప్రపంచ సుస్థిర శాంతి సంరక్షణకు కృషిచేయడానికి మిత్రరాజ్యాలు ప్రారంభించాయి. సుస్థిర శాంతి స్థాపన, ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించడం, ఫాసిజమ్, బానిసత్వాలను నిర్మూలించడమనే లక్ష్యాలతో యుద్ధకాలంలో మిత్రరాజ్యాల మధ్య అనేక సమావేశాలు జరిగాయి. అవి :

### 19.2.1 అట్లాంటిక్ ప్రకటన పత్రం :

అమెరికా అధ్యక్షుడు ఎఫ్.డి. రూజ్‌వెల్ట్, బ్రిటీష్ ప్రధాని చర్చిల్‌లు 1941 ఆగస్ట్‌లో అట్లాంటిక్ మహాసముద్రం మీద ఒక యుద్ధనౌకలో సమావేశమై దీర్ఘ సంప్రదింపుల తరువాత 8 అంశాలతో ఒక ప్రకటనను వెలువరించారు. దీనినే అట్లాంటిక్ ప్రకటన పత్రమని అంటారు. ఆ అంశాలు :

1) అమెరికా, బ్రిటన్‌లు ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించరాదు.
2) స్థానిక ప్రజల అభీష్టంతోనే దేశాల సరిహద్దులలో మార్పులు చేయాలి.
3) తమకిష్టమైన ప్రభుత్వాన్ని ఏర్పరచుకొనే హక్కు ప్రజలకుండాలి.
4) కార్మికుల స్థితిగతులను మెరుగుపరచడానికి, ఆర్థిక ప్రగతిని, సాంఘిక భద్రతను పెంపొందించడానికి అన్ని దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని సాధించాలి.
5) నాజీ జర్మనీ నాశనం తరవాత సుస్థిర శాంతిని స్థాపించి, ప్రపంచంలో అన్ని దేశాలు యుద్ధ భయం లేకుండా నివసించడానికి అనుకూల పరిస్థితులు కల్పించాలి.
6) ప్రపంచంలో అన్ని దేశాల ప్రజలకు లేమి, భయం అనేవి లేకుండా చేయాలి.,
7) అన్ని దేశాలకు సముద్రయానం మీద సమాన హక్కులుండవలె.
8) శాశ్వత శాంతి సాధనకు దురాక్రమణ దేశాలను నిరాయుధీకరణం చేయాలి.

ఈ అట్లాంటిక్ ప్రకటన పత్రం జర్మనీతో పోరాడే దేశాల ప్రజల్లో ధైర్యస్థైర్యాలను ప్రోత్సహించింది. 26 మిత్రరాజ్యాలు అట్లాంటిక్ ప్రకటన అంశాలను అంగీకరిస్తూ 1942 జనవరి 1న ఒక సమిష్టి ప్రకటన చేశాయి. ఇవిగాక మరికొన్ని దేశాలు కూడా ఈ ప్రకటనపై సంతకాలు చేశాయి. 1942 నుండి ఈ ప్రకటనకు 'ఐక్యరాజ్యాల ప్రకటన' అని పేరు వచ్చింది.

### 19.2.2 కాసాబ్లాంకా సమావేశం :

1943లో రూజ్‌వెల్ట్, చర్చిల్, ఛార్లెస్ డీగోల్‌లు (ఫ్రెంచి ప్రవాస ప్రభుత్వాధినేత) మొరాకోలోని కాసాబ్లాంకా వద్ద సమావేశమై ఉత్తరాఫ్రికా యుద్ధరంగాన్ని గురించి, సిసిలీ మీద దాడి గురించి చర్చించారు. ఎటువంటి షరతులు లేకుండా శత్రురాజ్యాలు లొంగిపోవలెనే ప్రకటన చేసినారు.

### 19.2.3 మాస్కో సమావేశము :

అమెరికా విదేశాంగ కార్యదర్శి హల్, బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఈడెన్, రష్యన్ విదేశాంగ మంత్రి మోలటాన్‌లు 1943 అక్టోబర్‌లో మాస్కోలో సమావేశమై జర్మనీ మీద తీసుకోవలసిన సైనిక చర్యలు, ఇటలీ, ఆస్ట్రియాల సమస్యలు, యుద్ధానంతరం ప్రపంచ భద్రతల మీద సంప్రదింపులు జరిపినారు.

1943 నవంబర్‌లో కైరోలో రూజ్‌వెల్ట్, చర్చిల్, చైనా జాతీయ ప్రభుత్వాధినేత చియాంగ్ కెషేక్‌లు సమావేశమై జపాన్‌ను ఓడించడానికి పథకాన్ని రూపొందించినారు. స్వతంత్ర కొరియాను స్థాపించవలెనని కూడా వీరు నిశ్చయించినారు.

### 19.2.4 టెహరాన్ సమావేశము :

1943 నవంబర్‌లో రూజ్‌వెల్ట్, చర్చిల్, స్టాలిన్‌లు టెహరాన్‌లో సమావేశమై ఒక రహస్య సైనిక సంధిని చేసుకొన్నారు. భవిష్యత్తులో అక్షరాజ్యాల మీద జరిపే యుద్ధ వ్యూహాలను గురించి మిత్రరాజ్యాలు పరస్పరం సంప్రదించుకోవడానికి నిశ్చయించినాయి. ప్రపంచంలోని అన్నిదేశాలను ప్రజాస్వామ్య దేశాల కుటుంబంలో చేరవలసిందిగా ఆహ్వానించింది.

### 19.2.5 బ్రిటన్ వుడ్స్ సమావేశము :

1944 జూలైలో బ్రిటన్ వుడ్స్ సమావేశం జరిగింది. దీనిలో 44 మిత్రదేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ద్రవ్యనిధిని ఏర్పాటు చేయడం జరిగింది. యుద్ధానంతరం ప్రపంచ దేశాల పునర్నిర్మాణాన్ని, అభివృద్ధిని ఉద్దేశించి ఈ ఏర్పాటు జరిగింది.

### 19.2.6 డంబార్టన్ ఓక్స్ సమావేశము :

1944 ఆగస్ట్ 21 నుంచి డిసెంబర్ 7 వరకు వాషింగ్టన్ సమీపంలో జరిగిన డంబార్టన్ ఓక్స్ సమావేశము ఐక్యరాజ్యసమితి చరిత్రలో ముఖ్యమైనది. ఈ సమావేశంలోనే ఐక్యరాజ్యసమితి ఉద్భవించింది. ఈ సమావేశంలో ఐక్యరాజ్యసమితి నిర్మాణానికి సంబంధించిన విషయం మీద చర్చ జరిగింది.

### 19.2.7 యాల్టా సమావేశము :

ఐక్యరాజ్యసమితి స్థాపన విషయంలో తుది పరిష్కారం కోసం స్టాలిన్, చర్చిల్, రూజ్‌వెల్ట్‌లు క్రిమియాలోని యాల్టాలో 1945 ఫిబ్రవరిలో సమావేశమైనారు. ప్రపంచశాంతి పరిరక్షణ కోసం ఒక అంతర్జాతీయ సంస్థను ఏర్పాటుచేయడం, జర్మనీ, పోలండ్‌ల భవిష్యత్తులను నిర్ణయించడం గురించి చర్చించారు.

### 19.2.8 శాన్ ఫ్రాన్‌సిస్కో సమావేశము :

అమెరికాలోని శాన్ ఫ్రాన్‌సిస్కో నగరంలో 1945 ఏప్రియల్ 25 నుండి జూన్ 26 వరకు ప్రపంచదేశాల ప్రతినిధులు సమావేశమయినారు. ఈ సమావేశంలో ఐక్యరాజ్యసమితి ఒడంబడిక పత్రాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది.

### 19.2.9 పాట్స్‌డామ్ సమావేశము :

రెండో ప్రపంచ యుద్ధకాలంలో జరిగిన మిత్రరాజ్యాల సమావేశంలో పాట్స్‌డామ్ సమావేశము చివరిది. 1945 ఆగస్ట్‌లో ట్రూమన్, బ్రిటిష్ ప్రధాని అట్లీ, స్టాలిన్‌ల మధ్య ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అయిదు అగ్రరాజ్యాలయిన రష్యా,

అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనాల విదేశాంగ మంత్రులతో ఒక సంఘాన్ని ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సంఘము శాంతి పరిష్కారానికి ఏర్పాట్లను చేయడానికి ఉద్దిష్టమయింది.

## 19.3 ఐక్యరాజ్యసమితి అవతరణ - దాని లక్ష్యాలు, నియమావళి :

శాన్‌ఫ్రాన్‌సిస్కో నగరంలో సమావేశమైన 51 రాజ్యాలు ఒడంబడిక పత్రంమీద సంతకం చేసిన వెంటనే ఐక్యరాజ్యసమితి అవతరించలేదు. చాలా దేశాలలో ఈ పత్రాన్ని ఆయాదేశాల పార్లమెంట్‌లు ధృవీకరించవలసి వచ్చింది. అందువల్ల ఐదు అగ్రరాజ్యాలు, అధిక సంఖ్యలో ఇతర దేశాలు దీనిని ధృవీకరించడంతో 1945 అక్టోబర్ 24న ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించింది. దీని కార్యాలయాన్ని న్యూయార్క్ నగరంలో ఏర్పాటు చేసినారు. ప్రపంచంలో యుద్ధాన్ని నివారించి సుస్థిరశాంతిని నెలకొల్పడానికి, మానవాళి ప్రగతిని సాధించడానికి ఈ అంతర్జాతీయ సంస్థ అవతరించింది.

ఐక్యరాజ్యసమితి ఉద్దేశాలు, దాని నియమావళి, దాని అంగాల గురించి ఐక్యరాజ్యసమితి పత్రంలోని 111 అంశాలతో పేర్కొనడం జరిగింది. ఐక్యరాజ్యసమితి పత్రంలో గల ప్రవేశికలో సమితి ప్రధాన లక్ష్యం, దాని సాధనోద్దేశాలు పేర్కొనడం జరిగింది. ప్రవేశికలో ప్రస్తావించబడిన ఐక్యరాజ్యసమితి ముఖ్య ఉద్దేశాలు :

1) ముందు తరాల వారికి యుద్ధ భీతి లేకుండా చేయడం
2) ప్రాథమిక మానవ హక్కులలో పూర్తి విశ్వాసాన్ని పునరుద్ఘాటించడం
3) అంతర్జాతీయ ఒప్పందాలలో న్యాయ గౌరవాలను పరిరక్షించడం
4) సాంఘిక ప్రగతిని సాధించి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం.

ఈ లక్ష్యాలను సాధించడానికి ఐక్యరాజ్యసమితి ప్రవేశిక ప్రపంచదేశాల ప్రజలకు చేసిన విజ్ఞాపనలో

1) సహనాన్ని అలవరచుకోవలసిందని
2) మంచి ఇరుగుపొరుగు వారివలె శాంతిగా జీవించవలసిందని
3) శాంతిభద్రతల పరిరక్షణకు ఐక్యాన్ని పాటించవలసిందని
4) పరస్పర ప్రయోజనాల దృష్టితో తప్ప, ఇతర పరిస్థితులలో సైన్యాలను వినియోగించరాదని
5) ప్రజలందరి సాంఘిక, ఆర్థిక ప్రగతిని సాధించడానికి అంతర్జాతీయ వ్యవస్థను ఉపయోగించుకోవలసిందని కోరింది.

ఐక్యరాజ్యసమితి పత్రంలోని మొదటి అంశములో దాని ఉద్దేశాలను గురించి పేర్కొవడం జరిగింది. అవి :

1) అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడటం, దురాక్రమణను అరికట్టి శాంతిని పరిరక్షించడానికి ఐక్యరాజ్యసమితి అన్ని శాంతియుత మార్గాలను ఉపయోగించవలె.
2) అంతర్జాతీయ సౌభ్రాతృత్వాన్ని దృఢం చేయడానికి అన్ని దేశాల ప్రజల మధ్య మైత్రి సంబంధాలను పెంపొందించవలె. దేశాల మధ్య పెంపొందించే ఈ మైత్రి సమాన హక్కులు, స్వయంనిర్ణయాధికారాల ప్రాతిపదిక మీద నెలకొనవలె.
3) ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, మానవతా సంబంధమైన అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించడానికి అంతర్జాతీయ సహకారాన్ని సాధించడం, జాతి, మత, కుల, వర్గ, భాషా విచక్షణ లేకుండా మానవుల హక్కుల పట్ల, ప్రాథమిక స్వాతంత్ర్యాల పట్ల గౌరవాన్ని పెంపొందించడం, ప్రోత్సహించడం

4) ఈ పై లక్ష్యాలను సాధించడానికి, ఐక్యరాజ్యసమితి అన్ని దేశాల కార్యకలాపాలను సమన్వయపరిచే కేంద్రంగా పనిచేయవలె. ఈ పై నాలుగు ఆశయాలను సభ్యదేశాలన్నీ సామూహికంగాను, వ్యక్తిగతంగాను కూడా పాటించాలి.

ఐక్యరాజ్యసమితి పత్రంలోని రెండో అంశంలో సమితి నియమావళిని ఉటంకించడం జరిగింది. అవి :

1) ఐక్యరాజ్యసమితి వ్యవస్థ, దాని సభ్యదేశాల సర్వసత్తాక సమానత్వం మీద ఆధారపడి ఉన్నది.

2) ప్రతి సభ్యదేశము సమితి నియమావళిలో పూర్ణ విశ్వాసముంచవలెను.

3) సభ్యదేశాలన్నీ తమ మధ్య గల వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవలె. ఇట్లాంటి పరిష్కారంలో న్యాయము, శాంతి భద్రతలకు ఎటువంటి భంగము కలగరాదు.

4) సమితి లక్ష్యాలకు విరుద్ధంగా ఏ దేశమూ మరొక దేశం మీద బెదిరింపు గాని, బలాన్ని గాని ప్రయోగించి ఆ దేశపు ప్రాదేశిక సమగ్రతకు గాని, స్వాతంత్ర్యానికి గాని భంగం కలిగించరాదు.

5) ఏ దేశం మీద గాని సమితి చర్య తీసుకొన్నప్పుడు, ఆ దేశానికి సభ్యదేశాలు ఎట్లాంటి సహాయాన్ని చేయరాదు. అంతేగాక ఆ దేశాలన్నీ సమితికి కావలసిన సహాయాన్ని అందించవలె.

6) సమితిలో సభ్యత్వం లేని దేశాలు కూడా, అంతర్జాతీయ శాంతి భద్రతలను పరిరక్షించడంలో సమితి లక్ష్యాలకు అనుగుణంగా వ్యవహరించేటట్లు సమితి కృషిచేయవలె.

7) సభ్యదేశాల ఆంతరంగిక విషయాలలో సమితి సాధారణంగా కలగజేసుకోరాదు.

ఐక్యరాజ్యసమితి పత్రంలోని 50వ అంశంలో దాని సాంఘిక, ఆర్థిక లక్ష్యాలను పేర్కొనడం జరిగింది. అవి :

1) ఉన్నత జీవన ప్రమాణాలను సాధించడం, అందరికీ పూర్తి ఉద్యోగ వసతులను కలగజేయడం, ఆర్థిక, సాంఘిక ప్రగతిని సాధించడానికి పరిస్థితులను కల్పించడం.

2) అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాన్ని సాధించడం, అంతర్జాతీయ విద్యా, సాంస్కృతిక రంగాలలో సహకారాన్ని పెంపొందించడం.

3) జాతి, కుల, మత, భాషా భేదం లేకుండా, మానవ హక్కులకు, ప్రాథమిక స్వాతంత్ర్యాలకు సార్వత్రిక గౌరవాన్ని కలిగించడమేగాక వాటిని అమలుపరచడం.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న 51 దేశాలను ఐక్యరాజ్యసమితి యొక్క మూలదేశాలుగా పరిగణించడం జరిగింది. ఐక్యరాజ్యసమితి పత్రంలోని 4వ అంశం ప్రకారం శాంతిని కాంక్షిస్తూ ఐక్యరాజ్యసమితి నియమావళిని ఆమోదించే రాజ్యాలన్నింటికీ ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వానికి అర్హత ఉంటుంది. భద్రతా సమితి సిఫారసు మీద, సాధారణ సభ 2/3వ వంతు మెజారిటీతో కొత్త దేశాలు ఐక్యరాజ్యసమితి సభ్యత్వాన్ని పొందుతాయి. ఆరవ అంశం ప్రకారం ఐక్యరాజ్యసమితి నియమావళిని ఉల్లంఘించే ఏ సభ్యదేశాన్నయినా, భద్రతా సమితి సిఫారసు మీద సాధారణసభ ఐక్యరాజ్యసమితి నుంచి తొలగించవచ్చు. ఐక్యరాజ్యసమితి పోషణ ఖర్చులను సభ్యదేశాలు భరిస్తాయి. ఐక్యరాజ్యసమితికి ప్రత్యేకంగా జెండా ఉన్నది. లేత నీలిరంగు వస్త్రం మీద ఐక్యరాజ్యసమితి ప్రతీక అయిన రెండు ఆలివ్ కొమ్మల మధ్య నున్న ప్రపంచపటమే ఈ జెండా.

## 19.4 ఐక్యరాజ్యసమితి అంగాలు :

ఐక్యరాజ్యసమితి వ్యవస్థలో ఆరు ప్రధాన అంగాలున్నాయి. అవి సాధారణ సభ, భద్రతా సమితి, ఆర్థిక సాంఘిక మండలి, ధర్మకర్తృత్వ సంఘము, అంతర్జాతీయ న్యాయస్థానము, సచివాలయం. వీటి వివరణ 7వ అంశంలో పేర్కొనబడింది.

### 19.4.1 సాధారణ సభ :

ఐక్యరాజ్య సమితి అంగాలన్నింటిలో సాధారణ సభ విస్తృతమైనది. దీనిలో ఐక్యరాజ్యసమితిలోని దేశాలన్నింటికి సభ్యత్వముంటుంది. ప్రతిదేశము ఐదు గురు ప్రతినిధులను సాధారణసభకు పంపవచ్చు కాని ఒక ఓటు మాత్రమే ఉంటుంది. ప్రతి యేటా సాధారణ సభ సెప్టెంబర్ నెలలో సమావేశమవుతుంది. భద్రతా సమితి అభ్యర్థన మీద ప్రత్యేక సమావేశాలు కూడా జరుగుతాయి. ప్రతి సమావేశానికి సాధారణ సభ ఒక అధ్యక్షుని ఎన్నుకొంటుంది. అంతేగాక 13 మంది ఉపాధ్యక్షులను, 6 గురు స్థాయి సంఘాల అధ్యక్షులను కూడా ఎన్నుకొంటుంది.

శాంతిభద్రతల పరిరక్షణ, సభ్యదేశాలకు ప్రవేశమివ్వడం, వాటిని తొలగించడం, ధర్మకర్తృత్వ వ్యవహారాలు, ఐక్యరాజ్య సమితి బడ్జెట్ సమస్యలు మొదలైన విషయాలను 2/3వ వంతు మెజారిటీతో సాధారణసభ ఆమోదించవలె. సాధారణ సభ ఇంకొక ప్రధాన విధి ఐక్యరాజ్యసభలోని ఇతర అంగాలకు చెందిన సభ్యులను ఎన్నుకోవడం. భద్రతా సమితిలోని 10 మంది తాత్కాలిక సభ్యులను సాధారణ సభ 2/3వ వంతు మెజారిటీతో ఎన్నుకొంటుంది. అంతేగాక ఆర్థిక సాంఘిక మండలిలోని 27 గురు సభ్యులను ధర్మ కర్తృత్వ సంఘ సభ్యులను కూడా సాధారణ సభ ఎన్నుకొంటుంది. భద్రతా సమితితో కలిసి సాధారణ సభ అంతర్జాతీయ న్యాయస్థానంలోని 15 గురు న్యాయాధిపతులను ఎన్నుకొంటుంది. భద్రతా సమితి సిఫారసు మీద సాధారణ సభ సెక్రటరీ జనరల్‌ను నియమిస్తుంది.

సాధారణ సభ 6 ముఖ్యమైన కమిటీల ద్వారా ఇతర విషయాలను నిర్వహిస్తుంది. మొదటి కమిటీ రాజకీయస్థితినీ, భద్రతను, రెండో కమిటీ ఆర్థిక విషయాలను, మూడో కమిటీ సాంఘిక, సాంస్కృతిక, మానవతా సంబంధమైన విషయాలను, నాలుగో కమిటీ ధర్మకర్తృత్వ వ్యవహారాలను, అయిదో కమిటీ పరిపాలనా, బడ్జెట్ విషయాలను, ఆరో కమిటీ న్యాయ వ్యవహారాలను చూస్తాయి. ఇవికాక కొన్ని అడ్‌హాక్ కమిటీలను కొన్ని ప్రత్యేక వ్యవహారాలను చూడటానికి నియమించడం జరిగింది. అందులో ముఖ్యమైనవి అణుశక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగించడానికి సలహా సంఘము, అంతర్జాతీయ అత్యవసర దళానికి సంబంధించిన సలహా సంఘము, కొరియా ఐక్యము పునరావాసాలకు సంబంధించిన సంఘము, అంతర్జాతీయ న్యాయ సంఘము మొదలైనవి.

ఐక్యరాజ్యసమితి ఏర్పడిన నాటి నుంచి సాధారణసభ అనేక సమస్యలను పరిష్కరించింది. ఇది విశ్వశాసనసభ వలె వ్యవహరించింది. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అన్నిదేశాలకూ ఇందులో మాట్లాడటానికి సమానావకాశమున్నది. ఈ సభకు ప్రాధాన్యం రావడానికి గల కారణాలు ప్రజాస్వామ్య ధోరణిలో చర్చలు జరగడం, అగ్రరాజ్యాలకు చెందిన ప్రతినిధి సభాధ్యక్షతకు అనర్హులు కావడం. పాలస్తీనా, మధ్యప్రాచ్యము, హంగరీ విషయాల మీద అత్యవసర సమావేశాలు జరిగాయి. మొత్తం మీద క్రమక్రమంగా సాధారణసభ ప్రతిష్ఠ పెరుగుతూనే వచ్చింది. ప్రపంచ శాంతి రక్షణ విషయంలో దీని పాత్ర ప్రధానమైనదనడంలో సందేహం లేదు.

## 19.4.2 భద్రతా మండలి :

ఐక్యరాజ్యసమితి అంగాలలో అతి ప్రధానమైనది భద్రతా సమితి. ప్రపంచంలో అతి ముఖ్యమైన శాంతిభద్రతల రక్షణను సభ్యదేశాలు భద్రతాసమితికి అప్పగించినాయి. భద్రతా సమితి తీసుకొన్న నిర్ణయాలను సంపూర్ణంగా అమలుపరచడానికి సభ్యదేశాలన్నీ వాగ్దానం చేసినాయి. మొదట భద్రతాసమితి సభ్యుల సంఖ్య 11 ఉండేది. ఇందులో సభ్యులు శాశ్వత సభ్యులు, తాత్కాలిక సభ్యులు అని రెండు తరగతులు కలరు. శాశ్వత సభ్యత్వమున్న దేశాలు అయిదు. అవి అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, చైనాలు. తాత్కాలిక సభ్యులు ఆరుగురు. తాత్కాలిక సభ్యులను సాధారణసభ 2/3వ వంతు మెజారిటీతో రెండు సంవత్సరాల కాలపరిమితికి ఎన్నుకొంటుంది. పదవీ కాలం పూర్తి అయిన సభ్యదేశానికి సభ్యుడు తిరిగి వెంటనే ఎన్నిక కావడానికి అర్హత లేదు. భద్రతాసమితి శాశ్వతంగా పనిచేసే విభాగము. పక్షం రోజులకు ఒక్కసారైనా భద్రతాసమితి సమావేశం కావలెను. ఐక్యరాజ్యసమితి కేంద్ర స్థానంలోనే గాక, ఎక్కడైనా కూడా భద్రతాసమితి సమావేశాలు జరగవచ్చు. భద్రతాసమితి అధ్యక్షుడు ప్రతి నెలా మారుతూ ఉంటాడు. ఆంగ్ల భాషాక్షర క్రమంలో అధ్యక్ష పదవి సభ్యదేశాల వారికి ఒకరి తరవాత ఒకరికి సంక్రమిస్తుంది.

భద్రతాసమితి తన విధులను సమర్థతతో నిర్వహించడానికి కొన్ని స్థాయీ సంఘాలను ఏర్పరచవచ్చు. అందులో ముఖ్యమైనవిః ప్రవీణుల కోసం స్థాయీ సంఘము, కొత్త సభ్యులను చేర్చుకొనే స్థాయీ సంఘాలు. ఇవి కాక అడ్‌హాక్ సంఘాలు కూడా కొన్ని ఉంటాయి. అవి లావోస్ సంఘము, పాలస్తీనా యుద్ధ విరమణ పర్యవేక్షక సంఘము మొదలైనవి. ఇవి కాక సైనిక సిబ్బంది సమితి కూడా ఉంది. భద్రతాసమితి ఆధ్వర్యంలో నిరాయుధీకరణ సంఘాన్ని కూడా నియమించడం జరిగింది. భద్రతాసమితిలోని సభ్యదేశాలకు మాత్రమే సమితి చర్యలలో పాల్గొని వోటు వేసే అధికారముంటుంది. భద్రతాసమితి చేసే ఏ తీర్మానమైనా అందులోని అయిదుగురు శాశ్వత సభ్యుల అంగీకారాన్ని పొందవలె. ఈ అయిదు రాజ్యాలలో ఏ రాజ్యమైనా అంగీకరించకపోతే ఆ తీర్మానము వీగిపోయినట్లే. దీనినే వీటో అధికారమంటారు.

అంతర్జాతీయ శాంతిభద్రతలను పరిరక్షించే ప్రధాన బాధ్యతను ఐక్యరాజ్యసమితి పత్రము భద్రతా సమితిలో ఉంచింది. సభ్యదేశాల మధ్య వివాదాలు ఉండి ప్రపంచ శాంతికి భంగం కలిగే ప్రమాదం సంభవించినప్పుడు అవి సంప్రదింపులు, రాయబారాలు, మధ్యవర్తిత్వము, న్యాయస్థాన పరిష్కారాలు మొదలైన శాంతియుత పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవలె. ఈ పద్ధతులు విఫలమైనప్పుడు వారి విభేదాలను పరిష్కరించుకోవలసిందని ఆ దేశాలను కోరడం భద్రతాసమితి విధి. అంతేగాక భద్రతాసమితికి అట్లాంటి వివాదాలను పరిశీలించి, పరిశోధించడానికి కూడా అధికారాలున్నాయి. భద్రతాసమితి ఆదేశాలను నిర్లక్ష్యం చేసిన దేశాలమీద అది కొన్ని ఆంక్షలను విధించవచ్చు. అవసరమయితే సైనిక చర్యకు ఉపక్రమించవచ్చు. ఇంతేగాక సాధారణ సభలోని కొత్తసభ్యుల ప్రవేశాన్ని సిఫారసు చేయడానికి, ఏ దేశాన్నయినా సాధారణ సభ నుంచి తొలగించడానికి భద్రతాసమితికి అధికారముంది. సాధారణ సభ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయవలసిందని భద్రతాసమితి సెక్రటరీ జనరల్‌ను కోరవచ్చు. తన విధులను సక్రమంగా నెరవేర్చడానికి ఉపాంగాలను ఏర్పాటు చేసుకోవడానికి దానికి అధికారముంది. ధర్మ కర్తృత్వ ప్రదేశాలలో కీలకప్రాంతాల వ్యవహారాలన్నీ దాని పర్యవేక్షణలో ఉంటాయి. అంతర్జాతీయ న్యాయస్థానానికి చెందిన న్యాయాధిపతులను సాధారణ సభతోబాటు ఇది ఎన్నుకొంటుంది. అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పులను పటిష్టంగా అమలుచేయడానికి కూడా భద్రతాసమితి చర్యలు తీసుకొంటుంది. సెక్రటరీ జనరల్‌ను భద్రతా సమితి సిఫారసు మీద మాత్రమే సాధారణసభ నియమిస్తుంది.

శాంతి భద్రతలకు సంబంధించిన అనేక ప్రపంచ సమస్యలను, దర్యాప్తు సంభాషణలు, సంధానము, సిఫారసు, విజ్ఞప్తి మొదలైన శాంతియుత పద్ధతుల ద్వారా భద్రతా సమితి పరిష్కరించింది. కొన్ని సందర్భాలలో మాత్రం సైనిక జోక్యం చేసుకొన్నది.

కొరియా, సూయజ్ సంక్షోభము, కాంగో సమస్యల విషయంలో సమితి తన సైన్యాలను ఆ ప్రాంతాలకు పంపింది. హంగరీ నుంచి తన సేనలను ఉపసంహరించుకోమని రష్యాకు విజ్ఞప్తి చేసింది. కాశ్మీరు విషయంలో సమితి అత్యవసర సమావేశం జరిపి యుద్ధవిరమణ జరిగేటట్లు చేసింది.

సాధారణ సభతో పోలిస్తే భద్రతాసమితి సభ్యుల సంఖ్య చాలా తక్కువ కావడంవల్ల అది తరచుగా సమావేశం కావడానికి వీలేర్పడింది. కాని, భద్రతా సమితి శాశ్వత సభ్యదేశాలు తమకున్న వీటో హక్కును తరుచు ప్రయోగించడం వల్ల ఐక్యరాజ్యసమితి ప్రతిష్ఠ దెబ్బతింటున్నది. సోవియట్ రష్యా, అమెరికా కూటముల మధ్య గల విరోధాల వల్ల ప్రచ్ఛన్నయుద్ధం ఉత్పన్నమై ఐక్యరాజ్యసమితి దృఢంగా వ్యవహరించలేకపోతున్నది. అంతేగాక భద్రతాసమితి అధ్యక్షపదవి ప్రతి నెలా మారుతూండటం వల్ల కూడా దాని పనికి అంతరాయం కలుగుతుంది. ఈ లోపాల వల్ల సాధారణ సభ ప్రాముఖ్యం హెచ్చుతున్నది.

## 19.4.3 ఆర్థిక సాంఘిక మండలి :

ఆర్థిక సాంఘిక మండలి సాధారణ సభ అధికారానికి లోబడి పనిచేస్తుంది. మొదట దీనిలో 18 మంది సభ్యులుండేవారు. వీరి పదవీ కాలం మూడు సంవత్సరాలు. ప్రతి సంవత్సరం ఆర్థిక సాంఘిక మండలికి 6 గురు సభ్యులు మూడు ఏండ్ల పదవీకాలం పరిమితితో సాధారణ సభచే ఎన్నికవుతారు. విరమించే సభ్యులకు తిరిగి ఎన్నిక కావడానికి అర్హత ఉంది. ఈ మండలిలోని సభ్యదేశాలు సమావేశాలకు ఒక్కొక్క ప్రతినిధిని పంపవచ్చు. ఈ మండలిలోని ప్రతి సభ్యునికి ఒక్కొక్క వోటు ఉంటుంది. మండలి మెజారిటీని బట్టి నిర్ణయాలను చేస్తుంది. ఇది ప్రతి ఏటా క్రమబద్ధంగా రెండు సార్లు సమావేశమవుతుంది. సాధారణంగా ఏప్రియల్‌లో న్యూయార్క్‌లో, జూలైలో జనీవాలో మండలి సమావేశాలు జరుగుతాయి. అగ్రరాజ్యాలకు చెందిన ప్రతినిధి మాత్రమే దీనికి అధ్యక్షుడుగా ఎన్నికవుతాడు.

ప్రపంచంలోని మానవుల జీవన ప్రమాణాలను పెంపొందించడం, పూర్తి ఉద్యోగ వసతులను కల్పించడం, ఆర్థిక, సాంఘిక ప్రగతికి కావలసిన పరిస్థితులను కల్పించడం ఆర్థిక సాంఘిక మండలి ముఖ్య విధులు. అంతేగాక ఇది అంతర్జాతీయ సాంఘిక, ఆర్థిక, ఆరోగ్య తదితర విషయాల అభివృద్ధికి కృషిచేస్తుంది. అంతర్జాతీయ విద్యా, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించడం, జాతి, భాషా, మత వివక్షత లేకుండా అందరికీ మానవ హక్కులు ప్రాథమిక స్వాతంత్ర్యాలు లభించేటట్లు చూడటం కూడా దీని బాధ్యతలు.

ఆర్థిక, సాంఘిక మండలి కృషిలో చాలా భాగం సమితులు, కమిషన్‌లు, ఉపకమిషన్‌ల ద్వారా జరుగుతుంది. ముఖ్యంగా నాలుగు ప్రాంతీయ ఆర్థిక కమీషన్‌లున్నాయి. అవి యూరప్, ఆసియా దూర ప్రాచ్యము, లాటిన్ అమెరికా, ఆఫ్రికా ప్రాంతం వ్యవహారాలను చూస్తాయి. ఇవికాక విధి నిర్వహణకు 9 ప్రత్యేక కమీషన్‌లు ఉన్నాయి. అవి రాకపోకలు, జనాభా, గణాంక సంబంధాలు, మానవ హక్కులు, మత్తు పదార్థాలు, స్త్రీలు, అల్పసంఖ్యాక వర్గాలు, సాంఘిక విషయాలు, అంతర్జాతీయ వర్తకము మొదలైన వ్యవహారాలను చూస్తాయి. ఇంతేకాక సాంకేతిక సహాయ సంఘము, వివిధ ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం ఏర్పడిన సంప్రదింపుల సంఘము అనే స్థాయీ సంఘాలు కూడా ఉన్నాయి.

ఆర్థిక, సాంఘిక మండలి అనేక ప్రత్యేక సంస్థల ద్వారా ప్రధానంగా కృషిచేస్తుంది. అందువి ముఖ్యమైన

**1) ప్రపంచ ఆరోగ్య సంస్థ (W.H.O)**

**2) అంతర్జాతీయ కార్మిక సంస్థ (I.L.O)**

**3) అంతర్జాతీయ ఆహార వ్యవసాయ వ్యవస్థ (F.A.O)**

**4) అంతర్జాతీయ బాలల అత్యవసర సంస్థ (UNICEF)**

**5) విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (UNESCO)**

**6) అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF)**

**7) అంతర్జాతీయ పౌర విమానయాన వ్యవస్థ (ICAO)**

**8) విశ్వతపాలా యూనియన్ (UPU)**

**9) ప్రపంచ వాతావరణ వ్యవస్థ (WMO)**

**10) ఐక్యరాజ్యసమితి పునర్నిర్మాణ, పునరావాస పరిపాలన (UNRRA)**

**11) ఐక్యరాజ్యసమితి సహాయ కార్యక్రమాల ఏజన్సీ (UNRWA)**

**12) అంతర్జాతీయ అణుశక్తి ఏజన్సీ (INEA)**

**13) అంతర్జాతీయ ద్రవ్యసంబంధ కార్పొరేషన్ (IFC)**

**14) వర్తక సుంకాల సాధారణ ఒప్పందము (GATT)**

**15) ఐక్యరాజ్యసమితి వాణిజ్య,** వర్తక అభివృద్ధి సమావేశము (UNCTAD).

ఈ సంస్థలన్నీ ప్రపంచ ఆర్థిక, సాంఘిక స్థితిగతులను మెరుగుపరచడానికి కృషిచేస్తున్నాయి. ఆర్థిక, సాంఘిక మండలి ఈ ప్రత్యేక సంస్థల కృషిని పర్యవేక్షిస్తుంది. ఐక్యరాజ్యసమితి అంగాలలో రాజకీయాలతో సంబంధం లేనిది ఇది ఒక్కటే.

## 19.4.4 ధర్మకర్తృత్వ మండలి :

ఐక్యరాజ్యసమితిలోని ధర్మకర్తృత్వ పద్ధతి నానాజాతి సమితిలోని ఆదిష్టపద్ధతి కంటే మెరుగైనది. ఆదిష్ట పద్ధతి మాదిరిగా కాక, ధర్మకర్తృత్వ పద్ధతిలో యుద్ధ కాలపు శత్రురాజ్యాలకు చెందిన ప్రాంతాలతో బాటు స్వచ్ఛందంగా చేరే ప్రాంతాలు కూడా ఉన్నాయి. ప్రజలను స్వయం పాలనకు గాని లేదా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవడానికి గాని సిద్ధంగా చేయడమే దీని మూల లక్ష్యము. భద్రతాసమితిలోని శాశ్వత సభ్యులు, సాధారణ సభచే ఎన్నుకోబడిన మరియొక 14 మంది సభ్యులు కలసి ఈ మండలిని నిర్వహిస్తారు. ఈ మండలిపై సాధారణ సభకు పూర్తి పర్యవేక్షణాధికారం వుంది. ఈ మండలి సాధారణంగా ఏటా రెండుసార్లు సమావేశమవుతుంది.

ధర్మకర్తృత్వ మండలి అనేక విధులను ఆచరిస్తున్నది. అవి : సంరక్షణ కింద ఉన్న రాజ్యాల పరిపాలనను పర్యవేక్షించుట, ఆ రాజ్యాలలోని ప్రజల మంచి చెడ్డలను విచారించుట, వారి హక్కులను కాపాడుట, వెనుకబడిన దేశాల రక్షణ భారం, పరిపాలన నిర్వహణను చేపట్టుట, వెనుకబడిన దేశ ప్రజలకు స్వయం పరిపాలన సాగించుకొనుటకు కావలసిన శిక్షణ ఇచ్చుట, వారి ఆర్థిక, విద్య, వైద్య, ఆరోగ్య పరిస్థితులు మెరుగుపుచుట. ధర్మకర్తృత్వ మండలి ఏర్పడిన నాటి నుంచి క్రమంగా అది తన పర్యవేక్షణ హక్కును వృద్ధి చేసుకొన్నది. రాను రాను ధర్మకర్తృత్వ ప్రాంతాలనేకాలు స్వాతంత్ర్యాన్ని పొందినాయి. అవి బ్రిటిష్ టోగోలాండ్, ఫ్రెంచి కామరూన్స్, ఫ్రెంచి టోగోలాండ్, ఇటాలియన్ సోమాలీలాండ్, పశ్చిమ సమోవా, టాంగనీకా, రువాండా - ఉరండీలు.

### 19.4.5 అంతర్జాతీయ న్యాయస్థానము :

హాలండ్‌లోని హేగ్ నగరము ఈ న్యాయస్థానం కేంద్ర స్థానము. ఈ న్యాయస్థానంలో 15 మంది న్యాయాధిపతులుంటారు. వీరి పదవీకాలం 9 సంవత్సరాలు. వీరిని సాధారణ సభ, భద్రతాసమితి విడివిడిగా ఓటు చేస్తూ ఎన్నుకొంటాయి. ఈ న్యాయాధిపతులను వివిధ దేశాలలోని ప్రసిద్ధులైన న్యాయశాస్త్ర కోవిదుల నుంచి నియమించడం జరుగుతుంది.

సభ్యదేశాల మధ్య తగాదాలను ఈ న్యాయస్థానం పరిష్కరిస్తుంది. భద్రతాసమితి నిర్ణయాలకు లోబడి ఇతర రాజ్యాల తగాదాలు కూడా ఇవి పరిష్కరించవచ్చు. ఈ న్యాయస్థానం తీర్పుకు అపీలు లేదు. అంతర్జాతీయ సంధులకు, ఒడంబడికలకు సంబంధించిన కేసులను విచారించి, తీర్పునిచ్చే అధికారము దీనికి ఉంది. కొన్ని అంతర్జాతీయ కేసులను విచారించి ఈ న్యాయస్థానం తీర్పులను ఇచ్చి ఉన్నది.

### 19.4.6 సచివాలయం :

ఐక్యరాజ్యసమితి కార్యనిర్వహణకై ఒక సచివాలయం, దాని అధినేతగా సెక్రటరీ జనరల్ ఉన్నారు. సచివాలయ సిబ్బంది ప్రపంచ దేశాలన్నింటి నుంచి నియమించడం జరుగుతుంది. సచివాలయంలో 8 ప్రధాన శాఖలున్నాయి. భద్రతాసమితి వ్యవహారాలు, ఆర్థిక వ్యవహారాలు, సాంఘిక వ్యవహారాలు, స్వయంపాలన లేని దేశాల సమాచారము, ధర్మకర్తృత్వము, న్యాయ విషయాలు, సమావేశాలు, పరిపాలనా వ్యవహారాలు, ప్రజా సమాచారము అను విషయాలను పై 8 శాఖలు నిర్వర్తిస్తాయి.

ఐక్యరాజ్యసమితి వ్యవస్థ ప్రధాన పాలనాధికారి సెక్రటరీ జనరల్. భద్రతా సమితి సిఫారసు మీద సాధారణ సభ ఇతనిని నియమిస్తుంది. సెక్రటరీ జనరల్ పదవీకాలం 5 సంవత్సరాలు. ఇతని పదవీ నిర్వహణలో సహాయపడటానికి కొందరు సెక్రటరీలున్నారు. సాధారణసభ, భద్రతా సమితి, ఆర్థిక సాంఘిక మండలి, ధర్మ కర్తృత్వ మండలి సమావేశాలకన్నిటికీ సెక్రటరీ జనరల్ కార్యదర్శిగా వ్యవహరిస్తాడు. మొదటి సెక్రటరీ జనరల్ ట్రిగ్విలీ ఐక్యరాజ్యసమితిలో ఉన్నత ప్రమాణాలను సృష్టించాడు.

## 19.5 ఐక్యరాజ్యసమితి సాధించిన విజయాలు :

ఐక్యరాజ్యసమితి సాధించిన విజయాలను రెండు తరగతులుగా విభజించవచ్చును. అవి : రాజకీయపరమైనవి, రాజకీయేతరమైనవి.

### 19.5.1 రాజకీయ విజయాలు :

ఐక్యరాజ్యసమితి ప్రధాన లక్ష్యము అంతర్జాతీయ శాంతిభద్రతలను పరిరక్షించడము. దీని స్థాపన నాటి నుంచి ఎన్నో అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించడానికి ఈ సంస్థ కృషిచేసింది. ఎన్నో రాజకీయ సమస్యలను భద్రతాసమితి సాధారణసభల ముందుంచడం జరిగింది. వీటిలో చాలా సమస్యలు పరిష్కృతమైనాయి. వాటిలో ప్రధానమైనవి :

#### 19.5.1.1 ఇరాన్ సమస్య :

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటిష్, అమెరికన్, రష్యన్ సేనలు ఇరాన్‌లో ప్రవేశించాయి. యుద్ధం తరవాత బ్రిటిష్, అమెరికన్ సేనలు ఇరాన్ నుండి వైదొలగగా, రష్యా సేనలు ఇరాన్‌కు చెందిన అజర్ బైజాన్ రాష్ట్రం నుంచి మాత్రం వైదొలగలేదు. అందువల్ల ఇరాన్ 1946 జనవరిలో రష్యా తన ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకొంటుందని భద్రతా సమితికి ఫిర్యాదు చేసింది. చివరకు రష్యా సేనలను ఇరాన్ నుంచి ఉపసంహరించడం జరిగింది.

### 19.5.1.2 సిరియా - లెబనాన్‌ల ఫిర్యాదు :

యుద్ధానంతరం తమ దేశాలలో నిలిచిపోయిన బ్రిటిష్, ఫ్రెంచి సైన్యాల ఉనికిని గురించి సిరియా - లెబనాన్‌లు భద్రతాసమితికి 1946లో ఫిర్యాదు చేసినాయి. చివరకు బ్రిటిష్, ఫ్రెంచి సైన్యాలు లెబనాన్, సిరియాల నుంచి వైదొలగాయి.

### 19.5.1.3 గ్రీస్ సమస్య :

గ్రీస్ తన దేశంలో కమ్యూనిస్ట్ గెరిల్లా కార్యకలాపాల గురించి 1946లో భద్రతాసమితికి ఫిర్యాదు చేసింది. ఈ సమస్య విషయంలో రష్యా తన వీటో హక్కును చాలాసార్లు ప్రయోగించింది. ఫలితంగా ఈ సమస్యకు ఎట్లాంటి పరిష్కారం లభించలేదు.

### 19.5.1.4 ఇండోనేషియా వివాదము :

హాలండ్, ఇండోనేషియాల మధ్య 1947 లో వివాదమారంభమయింది. డచ్చివారు ఇండోనేషియాలో సైనిక చర్యకు దిగడంతో భారతదేశము, ఆస్ట్రేలియాలు ఈ విషయాన్ని భద్రతాసమితిని దృష్టికి తెచ్చినాయి. కాని డచ్చి ప్రభుత్వము అది తన ఆంతరంగిక వ్యవహారమని వాదించినా, భద్రతాసమితి రెండు దేశాలనూ వెంటనే పోరు విరమించవలసిందిగా ఆదేశించింది. ఈ యుద్ధ విరమణను అమలుపరచడానికి భద్రతాసమితి ఒక సంఘాన్ని నియమించింది. ఇండోనేషియాను సర్వస్వతంత్ర దేశంగా పరిగణించడానికి ఈ కమిటీ గొప్ప కృషి చేసింది.

### 19.5.1.5 పాలస్తీనా వివాదము :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం పాలస్తీనా బ్రిటీష్‌వారి ఆదిష్ట ప్రాంతమయింది. ఆ దేశంలోని యూదుల, అరబ్బుల మధ్య గల వివాదాన్ని పరిష్కరించలేక బ్రిటన్ 1947లో పాలస్తీనా భవిష్యత్తును నిర్ణయించవలసిందని సాధారణసభను కోరింది. సాధారణ సభ పాలస్తీనా మీద ప్రత్యేక సంఘాన్ని నియమించింది. ఈ సంఘము పాలస్తీనాను మూడు రాజ్యాలుగా విభజించవలసిందని సిఫారసు చేసింది. అవి యూదుల రాజ్యం, అరబ్బుల రాజ్యము, అంతర్జాతీయ పర్యవేక్షణలో జెరూసలేమ్ నగరము. సాధారణ సభ ఈ పథకాన్ని ఆమోదించినా, పాలస్తీనాలో చెలరేగిన దౌర్జన్య కాండ వల్ల అది అమలు కాలేదు.

### 19.5.1.6 కాశ్మీరు వివాదము :

1948 జనవరి 1న తన భూభాగం మీద పాకిస్తాన్ దురాక్రమణ జరిపిందని భారతదేశము భద్రతా సమితికి ఫిర్యాదు చేసింది. దీనిని పాకిస్థాన్ తిరస్కరించడమే గాక, కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం కాదని వాదించింది. భద్రతాసమితి ఇరుపక్షాలను యుద్ధవిరమణ చేయవలసిందని కోరింది. అంతేగాక భారత్ పాకిస్తాన్‌లకు ఐక్యరాజ్యసమితి కమీషన్‌ను కూడా నియమించింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కాశ్మీరులో ఎన్నికలు, జనవాక్య సేకరణ నిష్పక్షపాతంగా జరగవలెనని ఈ కమీషన్ ఇరుపక్షాలకు సూచించింది. ఉభయపక్షాలు ఈ సూచనకు అంగీకరించాయి. కాని ఈ సమస్య నేటికీ అపరిష్కృతంగానే ఉంది.

### 19.5.1.7 హైదరాబాద్ సమస్య :

భారతదేశము స్వాతంత్ర్యం పొందిన తరవాత, హైదరాబాద్ సంస్థానము స్వతంత్రంగా ఉండడానికి ప్రయత్నించింది. భారతదేశం నుంచి తనకు ముప్పు కలుగుతుందని హైదరాబాద్ సంస్థానము 1948లో భద్రతా సమితికి ఫిర్యాదు చేసింది. ఈ

ఫిర్యాదును పాకిస్తాన్ సమర్థించింది. భారత దేశము పోలీస్ చర్య ద్వారా హైదరాబాద్‌ను ఆక్రమించింది. చివరకు నిజాం నవాబు తన కేసును ఉపసంహరించుకొన్నాడు.

### 19.5.1.8 బెర్లిన్ దిగ్బంధనము :

పోట్స్‌డామ్ ఒప్పందం ప్రకారం బెర్లిన్ నగరం విభాగాలై అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాల ఆధీనమయింది. బెర్లిన్ నగరం చుట్టూ ఉన్న భూభాగము రష్యా ఆధీనంలో ఉండటం వల్ల అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు తమ బెర్లిన్ భూభాగాలకు రష్యా భూభాగం గుండా వెళ్ళవలసి వచ్చింది. 1948తో ఏర్పడిన వివాదం మూలంగా రష్యా బెర్లిన్ నగరానికి పాశ్చాత్య రాజ్యాల రాకపోకల మీద ఆంక్షలు విధించింది. దీనితో అవి భద్రతాసమితికి ఫిర్యాదు చేసినాయి. రష్యా చర్చలలో పాల్గొనడానికి నిరాకరించింది. భద్రతాసమితి ఉభయపక్షాలకు తృప్తికరంగా వివాదాన్ని పరిష్కరించలేకపోయింది. చివరకు పై నాలుగు రాజ్యాలే ఒక ఒప్పందాన్ని కుదుర్చుకొన్నాయి.

### 19.5.1.9 కొరియా సమస్య :

రెండో ప్రపంచ యుద్ధానంతరం కొరియా ఉత్తర కొరియా, దక్షిణ కొరియా అని రెండు రాజ్యాలయింది. ఉత్తర కొరియా రష్యా ప్రాబల్యం క్రింద, దక్షిణ కొరియా అమెరికా ప్రాబల్యం కింద ఏర్పడ్డాయి. రెండు కొరియాలను విలీనం చేయవలెనని ప్రయత్నాలు సాగినా, అవి ఫలించలేదు. ఐక్యరాజ్యసమితి ఉభయ కొరియాల విలీనీకరణను సాధించలేకపోయింది.

### 19.5.1.10 హంగరీ సమస్య :

1956లో హంగరీలోని ప్రజలు అక్కడి ప్రభుత్వం మీద తిరుగుబాటు లేవదీసినారు. హంగరీ ప్రజావిప్లవాన్ని అణచడానికి రష్యా సేనలు హంగరీలో ప్రవేశించినాయి. ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికాలు హంగరీలో రష్యా సాయుధ జోక్యాన్ని భద్రతాసమితి దృష్టిచి తెచ్చినాయి. హంగరీ సమస్య ఆ దేశపు ఆంతరంగిక వ్యవహారమని రష్యా భద్రతా సమితిలో వాదించి ఆంగ్లో - అమెరికన్ తీర్మానాన్ని వీటో చేసింది. ఈ విషయంలో సమితి విఫలమైంది.

### 19.5.1.11 సూయజ్ కాలువ సమస్య :

ఈజిప్ట్ అధ్యక్షుడు నాజర్ సూయజ్ కాలువను 1956లో జాతీయం చేసినాడు. నాజర్‌తో సంప్రదింపులు విఫలం కావడంతో సూయజ్ సమస్యను ఫ్రాన్స్, బ్రిటన్‌లు భద్రతాసమితి దృష్టికి తెచ్చినాయి. ఈలోగా ఈజిప్ట్ మీద ఇజ్రాయిల్ దాడిచేసింది. దీనిని అవకాశంగా తీసుకొని బ్రిటన్, ఫ్రాన్స్‌లు కూడా ఈజిప్ట్ మీద దండెత్తినాయి. సాధారణ సభ అత్యవసర సమావేశం జరిపి వెంటనే కాల్పులను విరమించవలసిందని ఆదేశించింది. ఐక్యరాజ్యసమితి అత్యవసర సైన్యము ఏర్పాటయింది. ఈ సైన్యం యుద్ధ ప్రజ్వలనను అరికట్టింది.

### 19.5.1.12 కాంగో వివాదము :

బెల్జియం వలసరాజ్యంగా ఉండే కాంగో 1960లో స్వతంత్రమయింది. స్వతంత్ర కాంగో స్థాపనా కాలంలో దేశమంతటా అల్లర్లు చెలరేగినాయి. కటంగా రాష్ట్రము కాంగో నుండి విడిపోయి స్వతంత్రించింది. కాంగో జాతీయ ప్రభుత్వానికి, కటంగా రాష్ట్రానికి పోరు ఆరంభమయింది. దీనిని నివారించడానికి ఐక్యరాజ్యసమితి కాంగోకు సైన్యాన్ని పంపింది. ఈ సైన్యం కాంగో అంతర్యుద్ధాన్ని నిలుపుచేయగలిగింది.

పైన పేర్కొన్న సమస్యలే గాక ట్రిప్టీ సమస్య, క్యూబా సంక్షోభము, మలేషియా, ఇండోనేషియాల వివాదము మొదలైన వివాదాలెన్నిటినో ఐక్యరాజ్యసమితి పరిష్కరించింది. రెండో ప్రపంచ యుద్ధం అంతమైన నాటి నుంచి ఇంచుమించు ప్రతిరోజు ప్రపంచంలో ఎక్కడో ఒకచోట చెదురు మదురుగా యుద్ధం జరుగుతూనే ఉంది. కాని యుద్ధాలేవి మూడో ప్రపంచ యుద్ధానికి దారితీయలేదు. ఇది ఐక్యరాజ్యసమితి ఘన విజయానికి తార్కాణము.

### 19.5.2 రాజకీయేతర విజయాలు (ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక రంగాలు) :

రాజకీయపరమైన కృషేకాక ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, విద్యా రంగాలకూ ఎనలేని సేవ చేస్తున్నది. ఐక్యరాజ్యసమితి సాధించిన ఘన విజయాలలో చెప్పుకోదగింది మానవ హక్కుల ప్రకటన. సమితిచే నియమించబడిన మానవ హక్కుల సంఘం ఈ హక్కులను రూపొందించింది.

#### 19.5.2.1 ఆర్థిక రంగము :

అంతర్జాతీయ వ్యాపారాభివృద్ధికి, వివిధ దేశాలలో ఉద్యోగావకాశాలకు, ఉత్పత్తి వనరులను పెంపొందించడానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి కృషిచేస్తుంది. ఈ సంస్థ విదేశ మారక వ్యవహారాలను క్రమబద్ధం చేస్తుంది. ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య వ్యాపారం స్వేచ్ఛగా జరగడానికి ప్రతిబంధకాలైన ఆంక్షలు తొలగించడానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. యుద్ధం వల్ల దెబ్బతిన్న దేశాలలో అంతర్జాతీయ పునర్నిర్మాణ అభివృద్ధి బాంక్ పెట్టుబడిని పెట్టి ఆ దేశాల ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుంది. ఈ బాంక్ తగిన హామీలిచ్చి, పై దేశాలలో విదేశీ ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఈ బాంక్ అంతర్జాతీయ వ్యాపారాభివృద్ధికి దోహదం చేస్తుంది. ఉత్పత్తిని పెంపొందించడానికి, జీవన ప్రమాణాన్ని అభివృద్ధి చేయడానికి వారి వారి దేశాలలో శ్రామికుల స్థితిగతులను మెరుగుపరచడానికి కూడా ఈ బాంక్ కృషిచేస్తుంది. ఈ బాంక్ వివిధ దేశాలలో పునర్నిర్మాణ కార్యక్రమాలకు ఎంతో పెట్టుబడిని పెట్టింది. విద్యుదుత్పత్తి, రైలు, రోడ్లు, నౌకా, విమానయానాలు, చమురుగొట్టాలు, టెలిఫోన్, టెలిగ్రాఫ్, రేడియో మొదలైన అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేయడానికి వివిధ దేశాలకు రుణాలిచ్చింది. అంతేగాక సాంకేతిక సహాయాన్ని అందజేసింది.

వివిధ దేశాలలో ఆహార, వ్యవసాయ రంగాలలో అభివృద్ధిని సాధించడానికి ఆహార వ్యవసాయ సంఘం కృషిచేస్తుంది. ఈ సంఘం వైజ్ఞానిక, సాంకేతిక, సాంఘిక, ఆర్థిక పరిశోధనలను జరుపుతుంది. శరీర పోషక పదార్థాలు, ఆహారం, వ్యవసాయరంగాలలో ప్రజలకు విజ్ఞానాన్ని కలగజేస్తుంది. సహజ వనరులను పరిరక్షించుకొంటూ ఆహార వ్యవసాయోత్పత్తులను మెరుగుపరుస్తుంది. ఆహార పదార్థాలను క్రమబద్ధంగా వివిధ దేశాల మధ్య ఈ సంఘం పంపిణీ చేస్తుంది. అధికాహారోత్పత్తులను సాధించడానికి, క్రిమికీటకాల నుంచి పరిరక్షించడానికి, మత్స్యాలు, అడవుల నుంచి ఎక్కువ రాబడిని సంపాదించడానికి ఈ సంఘము వివిధ దేశాలకు సాంకేతిక సహాయాన్ని అందజేస్తుంది. ఈ సంఘం చేసిన కృషి ఫలితంగా ఎన్నో కొత్తరకపు వ్యవసాయ వంగడాలను ప్రవేశపెట్టడం జరిగింది. వీటి వల్ల అధికాహారోత్పత్తి జరుగుతున్నది.

#### 19.5.2.2 సాంఘిక రంగము :

ప్రపంచ ఆరోగ్య సంఘము అంతర్జాతీయ ఆరోగ్య కృషిని నిర్దేశించి చర్యలను సమన్వయం చేస్తుంది. వివిధ దేశాలలో ఆరోగ్య సర్వీసులను మెరుగుపరుస్తుంది. వివిధ దేశాలకు ఆరోగ్యానికి సంబంధించిన సాంకేతిక సహాయాన్ని అందజేస్తుంది. అంటువ్యాధుల నిర్మూలనకు కృషిచేస్తుంది. పరిశుభ్రత, శరీర పోషణకు కావలసిన ఆహారాన్ని సమకూర్చడం, ఆరోగ్య, వైద్య,

బోధన ప్రమాణాలను వృద్ధిచేయడం కూడా చేస్తుంది. మందుల తయారీలో అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పుతుంది. శిశు, ఆరోగ్య సంక్షేమాలు, మాతాశిశు సంరక్షణ, మానసిక ఆరోగ్యము మొదలైన ఇతర విషయాలలో కూడా ఈ సంఘము అభివృద్ధికి కృషి చేస్తుంది. 1947లో ఈజిప్టులో కలరా వ్యాధి ప్రబలినపుడు ఈ సంఘము దానిని ఎదుర్కొని నివారించింది. 1959లో మొరాకోలో కల్తీ నూనె వాడిన కారణంగా వేలాది ప్రజలు పక్షవాతానికి గురి అయినపుడు ఈ సంఘము అపారసేవ సేవచేసింది. 1960లో మొరాకోలోని అగధీర్ వద్ద భూకంపం సంభవించినపుడు బాధితులందరికీ సహాయ కార్యక్రమాలను అందజేసింది.

అంతర్జాతీయ కార్మిక సంఘము ప్రపంచదేశాలలోని శ్రామికవర్గపు జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి అంకితమయింది. ఉద్యోగ వనరులు కల్పించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, కార్మికుల అభిరుచులను, నైపుణ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి కావలసిన వృత్తులను కల్పించడం, కార్మిక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడం, వేతనాలు, పనివేళలు మొదలైన విషయాల మీద విధానాలను రూపొందించడం, కార్మికులకు కనీస వేతనాలను సమకూర్చడం ఈ సంఘ ముఖ్యవిధులు. అంతర్జాతీయ కార్మిక సంఘము వివిధ దేశాలలో వృత్తిసంబంధ సాంకేతిక శిక్షణ కార్యాలయాల ఏర్పాటు చేసింది. సాంఘిక సంక్షేమ పథకాలను అనేకం చేపట్టింది. కార్మిక సంఘాల హక్కుల పరిరక్షణకు, సంఘ నిర్మాణ స్వాతంత్ర్యానికి కూడా ఎన్నో పథకాలను రూపొందించింది. కార్మిక చట్టాలను తయారుచేసింది.

యుద్ధంలో ప్రమాదానికి గురి అయిన బాలబాలికల సహాయార్థం అంతర్జాతీయ శిశుసంక్షేమనిధి సంస్థ ఏర్పాటయింది. ప్రపంచంలోని సుమారు రెండు కోట్ల శిశువుల సహాయార్థం ఇది ఆహారం, పాలు, మందులు అందజేస్తుంది. మాతా శిశు సంరక్షణాలయంలో పనిచేయడానికి నర్సులకు, మంత్రసానులకు ఇది తగిన శిక్షణను కూడా ఇస్తుంది.

### 19.5.2.3 విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాలు :

విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాలలో అభివృద్ధిని సాధించడం ద్వారా వివిధ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించి, ప్రపంచ శాంతి భద్రతలను చేకూరుస్తుంది. జాతి, మత, భాషా, విచక్షణ లేకుండా మానవాళి శాంతి, న్యాయపాలన, మానవ హక్కులు, ప్రాథమిక స్వాతంత్ర్యాల పట్ల సార్వత్రిక గౌరవాన్ని కూడా పెంపొందిస్తుంది. ప్రజలను అక్షరాస్యులు గావించి, వారిలో సంస్కృతిని పెంపొందించడానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. శాస్త్రీయ పరిశోధనలకు ప్రోత్సాహం కల్పించడానికి శాస్త్రవిజ్ఞానాన్ని సేకరించి దానిని వివిధ దేశాలకు అందజేస్తుంది. జాతివిచక్షణా విధానాన్ని రూపుమాపడానికి కూడా ప్రయత్నిస్తుంది. కళాకారులు, గానకోవిదులు, తత్త్వవేత్తలు మొదలైన వారిమధ్య సంబంధాలను నెలకొల్పడానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు కావలసిన సాంకేతిక సహాయాన్ని కూడా ఈ సంస్థ అందిస్తుంది. పురావస్తు సంబంధమైన ప్రదేశాలను, జాతీయ శిల్పసంపదను, పురాతన వ్రాతప్రతులను మొదలైన వాటిని భద్రపరచడానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. నిరక్షరాస్యత నిర్మూలనకు కూడా ప్రయత్నిస్తుంది. లాటిన్ అమెరికా అంతటా ప్రాథమిక విద్యావ్యాప్తి, ఎడారి భూములను వ్యవసాయ యోగ్యంగా తీసుకొని రావడానికి ఈ సంస్థ ఎంతో శక్తిని, ధనాన్ని వెచ్చించింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో సముద్ర విజ్ఞానానికి సంబంధించిన శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. అంధుల విద్యావ్యాప్తి కోసం బ్రెయిలీ లిపిని వివిధ దేశాలలో అభివృద్ధి చేసింది. ఈజిప్టులోని ఆస్వాన్ ఆనకట్ట నిర్మాణ సమయంలో ఆ దేశానికి చెందిన ప్రాచీన శిల్పకళా ఖండాలను ఎన్నిటినో ఈ సంస్థ పరిరక్షించింది. ఈ సంస్థ ఔదార్యంతోనే శ్రీరంగ దేవాలయం పునర్నిర్మితమైంది.

## 19.6 ఐక్యరాజ్య సమితి వైఫల్యము :

నానాజాతి సమితి వలె ఐక్యరాజ్యసమితి కూడా అగ్రరాజ్యాలతో కూడిన వ్యవహారాల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేయలేకపోయింది. పాలస్తీనా సమస్య, బెర్లిన్ దిగ్బంధనం, కొరియా సమస్యల విషయంలో ఐ.రా.స. అసమర్థత స్పష్టంగా కనిపిస్తుంది. అర్జంటీనా వంటి చిన్నదేశం కూడా ఐక్యరాజ్య సమితి ఆదేశాన్ని ధిక్కరించి, ఫాక్‌లాండ్ దీవుల నుండి ఉపసంహరించుకోవడానికి తిరస్కరించింది.

ఐక్యరాజ్య సమితి వైఫల్యానికి అనేక కారణాలు కలవు. అవి

1. భద్రతా మండలిలోని శాశ్వత సభ్యులకు గల వీటో హక్కు ఐ.రా.స. చక్కగా పనిచేయడానికి అవరోధంగా పరిణమించింది. అగ్రరాజ్యాలు వీటో హక్కును తమ తమ ప్రయోజనాల్ని సాధించడంలో పనికివచ్చే పరికరంగా ఉపయోగించుకొంటున్నాయి.
2. అంతర్జాతీయ వ్యవహారాల్లో అత్యంత ప్రధాన విషయాలపై ఏకాభిప్రాయాన్ని సాధించడానికి అగ్రరాజ్యాల మధ్య గల సిద్ధాంత సంబంధమైన వివాదాలు, ఆటంకమౌతున్నాయి. ఆ సిద్ధాంత విభేదాలే వారి అనుచరులకు కూడా విస్తరిస్తున్నాయి.
3. ఒకవైపు నిరాయుధీకరణ గురించి ఉద్ఘాటించటం జరుగుతున్నా, రెండోవైపు మారణాయుధ నిర్మాణంలో, సమీకరణలో దేశాలు పోటీపడటం కూడా జరుగుతున్నది. ప్రస్తుతం యుద్ధ పరిధి అంతరిక్షం దాకా విస్తరించింది.
4. ఐక్యరాజ్యసమితి వైఫల్యానికి మరొక దృష్టాంతం వర్ణవివక్షత యింకా కొనసాగడం. అంతర్జాతీయ సంస్థగా ఐక్యరాజ్యసమితి ఎంత బలమైనదైనా, జాత్యంహకార ధోరణి గల దక్షిణాఫ్రికాను, అది లొంగదీయలేక పోయిందని చెప్పాలి.
5) రెండో ప్రపంచ యుద్ధానంతరం అగ్రరాజ్యాలు స్పర్థల మూలంగా అనేక సైనిక ఒప్పందాలను చేసుకొన్నాయి. దీని ఫలితంగా ప్రపంచంలో సైనికంగా ఘర్షణలు అధికమై ప్రపంచశాంతికి భంగమేర్పడుతుంది. ఈ సైనిక ఒప్పందాలకు ఐక్యరాజ్యసమితి వ్యతిరేకి. కాని ఐక్యరాజ్యసమితి ఈ కూటములు ఏర్పడకుండా ఏమీ చేయలేకపోయింది.

అయితే, ఈ వైఫల్యాలు సంస్థలోని ఏ లోపాల్ని ఎత్తిచూపుతున్నాయో, ఆ లోపాన్ని సరిదిద్దడం జరగాలి. కొందరి అభిప్రాయంలో చాలా కాలం క్రితం నాటి ఒక సందర్భంలో తయారైన నియమావళిని, ప్రస్తుత కాలపరిస్థితులు, సమస్యల కనుగుణంగా మార్చడం అవసరం. వీటో హక్కును తొలగించాలన్న సూచన కూడా వుంది. ప్రపంచ శాంతి భద్రతల కోసం ఐక్యరాజ్యసమితికి ఇతోధిక అధికారాల్ని ఇచ్చి, అంతర్జాతీయ సంస్థగా అనుశాసించగలిగేటంత బలాన్ని ఆ సంస్థకు ఇవ్వడం వాంఛనీయం.

## 19.7 నానాజాతి సమితి కంటే ఐక్యరాజ్యసమితి ఎట్లు అభివృద్ధి సాధించింది ?

మొదటి ప్రపంచ యుద్ధ ఫలితంగా నానాజాతిసమితి ఆవిర్భవించగా, ఐక్యరాజ్యసమితి రెండో ప్రపంచ యుద్ధం ఫలితంగా జనించింది. రెండు సంస్థలు కూడా శాశ్వత ప్రాతిపదిక మీద శాంతి నెలకొనవలెననే కోరిక వల్ల స్థాపితమయినాయి. అందువల్ల రెండింటి మధ్య సహజంగా ఎన్నో పోలికలు కనిపిస్తాయి. కాని వీటితో బాటుగా కొన్ని తేడాలు కూడా కనిపిస్తాయి.

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జరిగిన సంధులను అమలుచేయడానికి నవ ప్రపంచ పునర్నిర్మాణానికి ఆనాటి ముఖ్య రాజ్యాలు నానాజాతిసమితిని స్థాపించినాయి. అందువల్లనే నానాజాతిసమితి వర్సేసంధి షరతులలో ఒక భాగమయింది. కాని ఐక్యరాజ్యసమితి స్థాపనోద్దేశాలు దీనికి పూర్తిగా భిన్నమైనవి. యుద్ధాన్ని తిరిగి రాకుండా చేయవలెననే దృఢవిశ్వాసంతోను, పరాజిత

రాజ్యాల మీద ఎట్లాంటి కఠినమైన షరతులు విధించరాదనే భావంతో అనేక చిన్న, పెద్ద రాజ్యాలు ఐక్యరాజ్యసమితిలో సభ్యదేశాలయినాయి. ఐక్యరాజ్యసమితిలో ప్రపంచంలోని సుమారు అన్ని దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. నానాజాతిసమితి స్థాపనలో ప్రధానపాత్ర వహించిన అమెరికా నానాజాతి సభ్యత్వాన్ని తిరస్కరించింది. ఇంకో అగ్రరాజ్యమైన రష్యా 5 ఏండ్లపాటు మాత్రమే సభ్యత్వాన్ని పొందింది. చాలాదేశాలు నానాజాతి సమితి నుంచి వైదొలగినాయి.

నానాజాతి సమితి దానిని నిర్మాణం దృష్ట్యా ప్రధానంగా రాజకీయ వ్యవస్థకాగా, ఐక్యరాజ్యసమితి రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక సంస్థగా వ్యవహరిస్తుంది. ఐక్యరాజ్యసమితిలోని సాధారణసభ 2/3 వంతు సభ్యుల మెజారిటీతో నిర్ణయాలను తీసుకోగా, నానాజాతి సమితి సభా నిర్ణయాలను ఏకగ్రీవంగా ఆమోదించవలె. నానాజాతిసమితి యొక్క సమితి ధృడమైనదికాదు. దీనిలోని తాత్కాలిక సభ్యుల సంఖ్య క్రమంగా పెరుగుతూ రావడంవల్ల అగ్రరాజ్యాల ప్రాముఖ్యం తగ్గిపోయింది. కాని ఐక్యరాజ్యసమితిలోని భద్రతాసమితి సభ్యులసంఖ్య దాని ఒడంబడిక పత్రంలో నిర్ణీతమైంది. ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి నానాజాతిసమితి సభ, సమితులకు ఒకే విధమైన అధికారాలను ఇవ్వడం జరిగింది. కాని ప్రపంచంలో శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత పూర్తిగా ఐక్యరాజ్యసమితిలో సాధారణసభ, భద్రతాసమితుల అధికారాలను స్పష్టంగా విభజించడం జరిగింది. నానాజాతి సమితి సభవలెనే సమితి నిర్ణయాలను కూడా ఏకగ్రీవంగా జరుగవలె. కాని భద్రతా సమితి నిర్ణయాలు 7గురు సభ్యుల ఆమోదంతో జరుగుతాయి. ఈ ఏడుగురిలో శాశ్వత సభ్యులు 5గురు ఉండవలె. నానాజాతి యొక్క సమితి సభ్యులకు వీటో హక్కులేదు. కాని భద్రతా సమితిలోని 5గురు శాశ్వత సభ్యులకు వీటో హక్కు ఉన్నది. నానాజాతి సమితి చట్టంలో అంతర్జాతీయ పోలీస్ దళపు ఏర్పాటుకు తావులేదు. కాని ఐక్యరాజ్యసమితిలోని భద్రతా సమితిలో సైనిక సిబ్బంది ఉండటమేకాక, అంతర్జాతీయ పోలీస్ దళపు ఏర్పాటుకు కూడా అవకాశమున్నది. ప్రపంచ ప్రజల ఆర్థిక సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధికి ఐక్యరాజ్యసమితిలో ఆర్థిక సాంఘిక మండలి అనే ప్రత్యేకాంగము ఎన్నో ప్రత్యేక, అనుబంధ సంస్థల ద్వారా కృషిచేస్తున్నది. కాని నానాజాతి సమితి పై విషయాలలో చెప్పుకోదగిన కృషిని చేయలేకపోయింది. దురాక్రమణ, యుద్ధవిషయంలోగాని, అంతర్జాతీయ శాంతికి భంగం వాటిల్లే పరిస్థితులలో ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవచ్చు. కాని నానాజాతి సమితి దురాక్రమణ సమయంలో మాత్రమే జోక్యం చేసుకోవచ్చు. అత్యాయిక పరిస్థితులలో దురాక్రమణ రాజ్యం మీద సైనిక చర్యను తీసుకోవడానికి కూడి ఐక్యరాజ్యసమితికి అధికారమున్నది. అది సభ్యరాజ్యాలకు అందుకు కావలసిన సైన్యాలను సమకూర్చవలసినదిగా కోరుచున్నాము కూడా. కాని నానాజాతి సమితికి అట్లాంటి సైన్యాలు లేవు. అంతేగాక నానాజాతిసమితి నిర్ణయాలను అమలుచేయవలసిన నైతికబాధ్యత కూడా దాని సభ్యదేశాలకు ఉండేదికాదు. కాని నానాజాతి సమితి సభ్యదేశాలు దురాక్రమణ రాజ్యవిషయంలో స్వతంత్రంగా వ్యవహరించి చర్యలు తీసుకోవచ్చు. ఐక్యరాజ్యసమితిలో ఈ బాధ్యత భద్రతాసమితి మాత్రమే నిర్వహిస్తుంది. మానవ హక్కులను, ప్రాథమిక స్వాతంత్ర్యాలను పరిరక్షించడం ఐక్యరాజ్యసమితి ముఖ్యలక్షణం కాగా నానాజాతి సమితి చట్టంలో వీటి విషయమై ఎలాంటి ప్రస్తావన లేదు. నానాజాతి సమితి ఆంగ్లో - ఫ్రెంచి ప్రాబల్యంలో ఉండగా, ఐక్యరాజ్యసమితి అగ్రరాజ్యాల అదుపాజ్ఞలలో ఉంటున్నదని విమర్శ ఉంది.

నానాజాతి సమితి, ఐక్యరాజ్యసమితి రెండు కూడా ప్రపంచశాంతి సహకారాలను పెంపొందించడానికి ప్రయత్నించాయి. కాని నానాజాతి సమితి విఫలమయింది. ఐక్యరాజ్యసమితి ప్రపంచ సుస్థిర శాంతిని స్థాపిస్తుందనే మానవాళి ఆశలు అడియాసలు కారాదని ఆశిద్దాము.

## 19.8 నమూనా ప్రశ్నలు :

1. రెండో ప్రపంచ యుద్ధకాలంలో శాంతిస్థాపనకై జరిగిన సమావేశాలను గురించి వివరింపుము.
2. ఐక్యరాజ్యసమితి అవతరణ, దాని ఆశయాలను వివరింపుము.
3. ఐక్యరాజ్యసమితి వివిధ అంగములను గురించి వివరింపుము
4. ఐక్యరాజ్యసమితి సాధించిన విజయాలను అంచనా వేయుము.
5. ఐక్యరాజ్యసమితి నానాజాతి సమితి కంటే ఎట్లు అభివృద్ధి సాధించినది.
6. భద్రతా సమితి
7. అట్లాంటిక్ ఛార్టర్.

## 19.9 చదువదగిన గ్రంథాలు :


| | | |
|---|---|---|
| 1. C.J.A.H. Hayes | - | Modern Europe since 1870 |
| 2. D. Thamson | - | Europe since Napoleon |
| 3. Raghubir Dayal | - | Modern European History |
| 4. H.L. Peacock | - | Modern European History, 1789 - 1973 |
| 5. C.D. Hazan | - | Modren Europe upto 1945 |
| 6 J. Robert wegs | - | Europe Since 1945. |


- శ్రీ కె. సూర్య ప్రకాష్‌రెడ్డి

పాఠం - 20

# ప్రచ్ఛన్న యుద్ధము - సైనిక కూటములు ఐరోపా ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం

## 20.0 లక్ష్యం :

రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపాలో ప్రారంభమైన ప్రచ్ఛన్న యుద్ధ స్వరూప, స్వభావాలు, ప్రచ్ఛన్న యుద్ధంలో భాగంగా ఏర్పడిన సైనిక కూటములు, ఐరోపా ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం గురించి వివరించడం ఈ పాఠం లక్ష్యం.

## ముఖ్యాంశములు :


**20.1** ప్రచ్ఛన్న యుద్ధము

- **20.1.1** పరిచయం
- **20.1.2** ప్రచ్ఛన్న యుద్ధ ఆవిర్భావము
- **20.1.3** ప్రచ్ఛన్న యుద్ధమనగా
- **20.1.4** ప్రచ్ఛన్న యుద్ధ దశలు
- **20.1.5** ప్రచ్ఛన్న యుద్ధ ఫలితాలు

**20.2** సైనిక కూటములు

- **20.2.1** ట్రూమన్ సిద్ధాంతము
- **20.2.2** మార్షల్ పథకం
- **20.2.3** ఉత్తర అట్లాంటిక్ సంధి వ్యవస్థ (NATO)
- **20.2.4** కేంద్రసంధి వ్యవస్థ (CENTO) (బాగ్దాద్ ఒడంబడిక)
- **20.2.5** ఆగ్నేయాసియా సంధి వ్యవస్థ (SEATO)
- **20.2.6** రష్యా చేపట్టిన చర్యలు
  - **20.2.6.1** మాలటోవ్ ప్రణాళిక
  - **20.2.6.2** కోమిన్ ఫామ్
  - **20.6.2.3** బెర్లిన్ దిగ్బంధం
  - **20.6.2.4** వార్సా ఒప్పందము
  - **20.6.2.5** హంగరీ తిరుగుబాటు - 1956
  - **20.6.2.6** U2 సంఘటన - 1960

**20.3** ఐరోపా ఆర్థిక పునర్నిర్మాణం

- **20.3.1** ఐరోపా ఆర్థిక సహకార సంస్థ (OEEC)
- **20.3.2** బెనెలక్స్

**20.3.3 బ్రస్సెల్స్ సంధి**
**20.3.4 ఐరోపా మండలి**
**20.3.5 ఐరోపా బొగ్గు, ఉక్కు సంఘం**
**20.3.6 ఐరోపా ఆర్థిక సంఘము**
**20.4 నమూనా ప్రశ్నలు**
**20.5 చదువదగిన గ్రంథాలు**

## 20.1 ప్రచ్ఛన్న యుద్ధము :

### 20.1.1 పరిచయం :

రెండో ప్రపంచ యుద్ధానంతరం ఐరోపా తుల్య ప్రాబల్యంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. యుద్ధంలో ఓడిపోయిన జర్మనీ, ఇటలీ, జపాన్‌లు బలహీనమయ్యాయి. ఇంగ్లాండు, ఫ్రాన్స్‌లు యుద్ధంలో గెలిచినా యుద్ధ నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. అప్పటి వరకు అగ్రరాజ్యాలుగా పరిగణింపబడ్డ ఐరోపారాజ్యాలు రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఆ ప్రతిపత్తిని కోల్పోయాయి. అయితే పశ్చిమాన అమెరికా, తూర్పున రష్యా అనే రెండు అగ్రరాజ్యాలు రెండో ప్రపంచ యుద్ధ ఫలితంగా ఏర్పడ్డాయి. ఈ మార్పు అంతర్జాతీయ సంబంధాలలోను, రాజకీయాలలోను ఒక నూతన ఆందోళనాత్మక పరిస్థితికి దారితీసింది. అప్పటివరకు ఏకాంత విధానాన్ని అవలంభించే అమెరికా ఆర్థిక, సైనిక కారణాల వల్ల ప్రపంచ రాజకీయాలలో తలదూర్చింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగింపు దాని లక్ష్యాలయ్యాయి. మరోవైపు సోవియట్ రష్యా ఆర్థికంగా, సైనికంగా గొప్పగా అభివృద్ధి సాధించి తూర్పు యూరప్ రాజ్యాలను కైవసం చేసుకొంది. ప్రతి ముఖ్య విషయంలోను అమెరికాకు పోటీగా నిలచింది. సామ్యవాద పరిరక్షణ, వ్యాప్తి దీని లక్ష్యాలయ్యాయి. ఈ రీతిగా ఐరోపా ఆధిపత్యం అంతరించగా, వాటి స్థానే అధిరాజ్యాలుగా రూపొందిన అమెరికా, సోవియట్ రష్యాల పోటీ రెండో ప్రపంచ యుద్ధానంతరం నాటి నుంచి ప్రారంభమైంది. ఈ పోటీలోని అంతర్భాగమే 'ప్రచ్ఛన్న యుద్ధం'.

ఈ ప్రచ్ఛన్న యుద్ధం పశ్చిమ ఐరోపా స్థాయిలో క్షీణతను బహిర్గతం చేసింది. అదే సమయంలో ఈ ప్రచ్ఛన్న యుద్ధం అమెరికా, పశ్చిమ ఐరోపా వ్యవహారాలలో జోక్యం చేసుకొని దానిని శక్తివంతం చేసేట్లు చేసింది. పశ్చిమ ఐరోపా ఐకమత్యం వైపు నడవడానికి కూడా ఇది తోడ్పడింది. అగ్రరాజ్యాలు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ప్రపంచంలోని అన్ని భాగాలలోను జోక్యం కల్పించుకోవడం ప్రచ్ఛన్న యుద్ధంలో విశేషం. అది ఐరోపాలోని యుద్ధ రేఖను దాటి విస్తరించింది.

### 20.1.2 ప్రచ్ఛన్న యుద్ధ ఆవిర్భావము :

ప్రచ్ఛన్న యుద్ధం ప్రధానంగా మాటల యుద్ధం. తూర్పు యూరప్‌లో రష్యా ప్రభావాన్ని అమెరికా వ్యతిరేకించింది. కాని పోరాటానికి సిద్ధంగా లేదు. అలాగే రష్యా పశ్చిమ బెర్లిన్‌ను వశం చేసుకోవడాన్ని అమెరికా వ్యతిరేకించింది. కాని పోరాటానికి సిద్ధంగా లేదు. అణు, రాకెట్ విజ్ఞానంలో సాధించిన ప్రగతి, ఈ ప్రచ్ఛన్నయుద్ధం మరింత భయంకరమైన ప్రత్యక్ష యుద్ధానికి దారితీసే ప్రమాదాన్ని కలిగించింది. 'మిత్రరాజ్యాల విజయంతో వచ్చిన వెలుగురేఖలపై క్రీనీడలు పడుతున్నాయి. సమీప భవిష్యత్తులో సోవియట్ రష్యా దాని అంతర్జాతీయ కమ్యూనిస్ట్ వ్యవస్థ ఏం చేయగలదో తెలియడం లేదు. బాల్టిక్‌లోని స్టెట్టిన్ నుండి ఆడ్రియాటిక్ లోని ట్రియస్టీ వరకు ఐరోపా ఖండంలో ఇనుపతెర పడింది' అని చర్చిల్ వ్యాఖ్యానించాడు. ఈ ప్రచ్ఛన్న యుద్ధ సూచనలను చర్చిల్ 1946 మార్చిలో తన ఫుల్టన్ ఉపన్యాసంలో వ్యక్తీకరించాడు.

1946 వేసవి చివరిలో పారిస్‌లోని అంత శత్రుత్వం లేని ఇటలీ, రుమేనియా, బల్గేరియా, హంగరీ, ఫిన్‌లాండ్‌ల మధ్య జరిగిన శాంతి సమావేశంలోనే ప్రచ్ఛన్నయుద్ధ చిహ్నాలు మొదటిసారిగా బయటపడ్డాయి. ఇక్కడ సమావేశమైన 21 దేశాల ప్రతినిధులు రష్యా, పశ్చిమ రాజ్యాల మధ్య రాజీ కుదరని శతృత్వ స్పష్టమైన చిహ్నాలను ఎదుర్కోవలసి వచ్చింది. '1919 శాంతి ఒడంబడిక కంటే అధికంగా తూర్పు, పశ్చిమాల మధ్య ఉద్రిక్తత 1946 శాంతి ఒడంబడికలలో చోటుచేసుకొన్నది', అని డేవిడ్ థామ్సన్ సరిగ్గా వ్యాఖ్యానించాడు. 1919లో లాగానే ఒడంబడిక చర్చల ద్వారా కాక, అమెరికా, రష్యా, ఇంగ్లండ్‌ల ఇష్టాయిష్టాల ప్రకారం జరిగింది. అనేక సమస్యలపై పోలండ్, యూక్రేయిన్, వైట్ రష్యా, యుగోస్లావియా అను నాలుగు సోవియట్ అనుకూల రాజ్యాలు తక్కిన దేశాలకు వ్యతిరేకంగా ఒక్కటయ్యాయి. రెండో వైపున అమెరికా, ఇంగ్లాండ్‌లు తమకు అనుకూలంగా ఉన్న దేశాలకు ఉదారంగా రుణాలిచ్చి, అవిధేయంగా ఉన్న దేశాలకు రుణాలను ఆపివేశాయి. ఈ విధంగా సమావేశమంతా విరోధి కూటముల మధ్య వైరాన్ని ప్రస్ఫుటం చేసింది.

## 20.1.3 ప్రచ్ఛన్న యుద్ధమనగా :

అమెరికా రాజనీతిజ్ఞుడైన బెర్నార్డు బరూచ్ మొదటిసారిగా 'ప్రచ్ఛన్న యుద్ధం' అనే పదాన్ని ప్రయోగించాడు. పశ్చిమరాజ్యాలు, రష్యా మధ్య ఏర్పడిన భిన్న వైఖరులను 'ప్రచ్ఛన్న యుద్ధం' గా నిర్వచించిన లిప్‌మాన్ దానికి విస్తృత ప్రచారం కల్పించాడు. ప్రత్యక్షంగా యుద్ధానికి దిగకుండా, ఒకరు మరొకరిని బలహీనపరచడానికి, తాము బలపడడానికి అనుసరించే విధానాల వల్ల ఉత్పన్నమయ్యే భయాందోళనల స్థితియే ప్రచ్ఛన్న యుద్ధమని ఫ్లొరెన్స్ ఇలియట్, మైకేల్ సమ్మర్ స్కిల్ పేర్కొన్నారు. రెండు అగ్రరాజ్యాల మధ్య నాయకత్వంలో ఏర్పడ్డ కూటాల మధ్య యుద్ధ వాతావరణంతో కూడిన ఉద్రిక్తత, ప్రపంచరాజ్యాల మీద దాని ప్రభావమే ప్రచ్ఛన్న యుద్ధమని లోయిన్ పేర్కొన్నాడు. ప్రచ్ఛన్న యుద్ధం స్వేచ్ఛా రాజ్యాలకు నిరంకుశ రాజ్యాల మధ్య భావ సంఘర్షణగా చిత్రీకరించబడింది. ప్రపంచశాంతికి సోవియట్ యూనియన్ సైనిక బలము ప్రమాదం కాగలదని పశ్చిమ రాజ్యాలు భావించాయి. రెండు వర్గాలు ఏదో ఒక రోజు సంఘర్షణ తప్పదని భావించి తమ బలాలను సమీకరించుకోసాగాయి.

## 20.1.4 ప్రచ్ఛన్న యుద్ధ దశలు :

ప్రచ్ఛన్న యుద్ధ పరిణామాలలో అనేక దశలు కలవు. మొదటి దశలో (1946-1949) సోవియట్ రష్యా కన్నా అమెరికాదే పైచేయిగా వున్నది. అమెరికాకు ఆటంబాంబు రహస్యాలు తెలుసు. ప్రపంచ రాజకీయాలను అమెరికా నిర్దేశించగలదని సోవియట్ రష్యా భయపడి తన బలాన్ని వృద్ధి చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. రష్యా బలాన్ని అరికట్టడానికి మరో యుద్ధానికి మిత్రరాజ్యాలు సిద్ధంగా లేవు. ఈ పరిస్థితులలో అమెరికా ట్రూమన్ సిద్ధాంతం పేరిట ప్రత్యక్ష సైనిక చర్యలకు, మార్షల్ పథకం పేర పశ్చిమ ఐరోపా రాజ్యాల ఆర్థిక పునర్నిర్మాణానికి కృషి చేయడం ద్వారా యథాస్థితి రక్షణకై ప్రయత్నించింది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా కమ్యూనిస్ట్ ప్రమాదాన్ని గూర్చి విస్తృత ప్రచారం చేయడంలో విజయవంతమైంది. 1949లో ఉత్తర అట్లాంటిక్ సైనిక వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది. ఇది తనకు వ్యతిరేకంగా జరిగిన సైనికచర్య అని రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది.

రెండో దశలో (1949-1953) సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా అమెరికా సైనిక ఆర్థిక సహాయాన్ని కొనసాగించింది. ఇదేకాలంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్‌లతో ఒడంబడికలు కుదుర్చుకున్నది. ఈ కాలంలోనే కొరియా యుద్ధం జరిగింది. రష్యా వ్యతిరేక ప్రచారాన్ని అమెరికా ముమ్మరం చేసింది. సామ్యవాద రాజ్యాలలో అలజడులు జరిగాయి. దీనికి అమెరికా పరోక్ష సహాయం అందించింది. సోవియట్ రష్యా కూడా ఆటంబాంబును పేల్చి అమెరికాకు తన ఆగ్రహ ప్రతిస్పందన స్పష్టపరిచింది.

మూడోదశలో (1953-1957) అమెరికా తన సైనిక, ఆర్థిక విధానాన్ని మరింత పట్టుదలతో కొనసాగించింది. ఆగ్నేయాసియా సంధి సంస్థను, మధ్య ప్రాచ్య రక్షణ సంస్థలను ఏర్పాటుచేసి రష్యా భూభాగం చుట్టూ పెక్కు సైనిక స్థావరాలను నిర్మించింది. 43 రాజ్యాలలో రక్షణ సంధులు చేసుకొన్నది. ఇదే కాలంలో అమెరికా వియత్నాంలో జోక్యం చేసుకొంది. ఇది ప్రచ్ఛన్న యుద్ధానికి పరాకాష్టగా చెప్పవచ్చు. అమెరికా చర్యలకు ప్రతికూలంగా రష్యా వార్సాసంధి చేసుకున్నది. హంగరీలో తిరుగుబాటును అణచివేసింది. ఈ కాలంలో రెండు అగ్రరాజ్యాలు జర్మనీని రెండు ముక్కలు చేసి తమ ఆధీనంలో వాటి పాలనను నిర్వహించాయి. రష్యా, అమెరికాలు హైడ్రోజన్ బాంబును ప్రయోగంగా పరీక్షించాయి. దీనితో ఇరుపక్షాల బలాలు సమానంగా కన్పించి, యుద్ధమనేది వస్తే ఇరువురూ సర్వనాశనం కాగలరనే భావమేర్పడింది.

నాలుగో దశలో (1957-1962) ప్రచ్ఛన్న యుద్ధంలో విభిన్న ధోరణులు కన్పించాయి. రెండు అగ్రరాజ్యాల మధ్య శాంతియుత సహజీవనం ప్రారంభమైంది. ఈ రెండు దేశాల సాంస్కృతిక, రాజకీయ ప్రతినిధులు ఒకరి దేశాన్ని మరొకరు పర్యటించారు. రాజ్యాధినేతలు కూడా ఒకరిదేశాన్ని మరొకరు దర్శించారు. పారిస్ శిఖరాగ్ర సమావేశానికి సన్నాహాలు జరిగాయి. ఈ సుహృద్భావ వాతావరణం ఒక్కసారిగా క్యూబా మిసిలీ సంఘర్షణ, U2 సంఘటన లతో అదృశ్యమై రెండు అధిరాజ్యాలు ప్రత్యక్ష యుద్ధానికి చేరువయ్యాయి. అదృష్టవశాత్తు నాటి అమెరికా, రష్యా రాజ్యాధినేతలు కెన్నడీ, కృశ్చేవ్‌ల చొరవ వల్ల వినాశనం నుండి ప్రపంచం రక్షించబడింది.

1962 తరవాత అమెరికా, రష్యాలు అణ్వస్త్ర యుద్ధ ప్రమాదాన్ని, వ్యర్థాన్ని ఇరువురూ గుర్తించారు. 1963లో అణ్వస్త్ర పరీక్షల నిలుపుదలపై పాక్షికంగా అంగీకారం కుదిరింది. ఏదైనా ప్రమాదం వస్తే ఇరువురూ ప్రత్యక్షంగా సంప్రదించుకోవాలని అంగీకరించారు. జర్మనీ, వియత్నాం మొదలైన చోట్ల అమెరికా, రష్యాలు కొంత ఘర్షణ పడినా యుద్ధ ప్రమాదమేదీ రాలేదు. 1976లో అమెరికా అధ్యక్షుడు నిక్సన్ రష్యా పర్యటన, 1973లో రష్యా అధినేత బ్రెజనోవ్ అమెరికా పర్యటనల సందర్భంగా జరిగిన అనేక శాంతి ఒడంబడికలు, నిరాయుధీకరణ ప్రయత్నాలు ఈ ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణాన్ని చల్లబరచాయి.

### 20.1.5 ప్రచ్ఛన్న యుద్ధ ఫలితాలు :

ప్రచ్ఛన్నయుద్ధం వివిధ రాజ్యాల మధ్య యుద్ధభీతిని నెలకొల్పింది. అమెరికా, రష్యాల మధ్య అణ్వాయుధాల పోటీ తీవ్రతరమైంది. ఈ రెండు రాజ్యాల నాయకత్వంలో అనేక సైనిక కూటాలు ఏర్పడ్డాయి. ప్రచ్ఛన్న యుద్ధ ఫలితంగా బడుగురాజ్యాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయి. అవి కూడా ఆయుధాల సేకరణ మొదలెట్టాయి. ఫలితంగా పరిమితమైన వారి వనరులు దేశ స్థితిగతులను మెరుగుపరచటానికి వీలు లేకపోయింది. వారి ఆర్థిక ప్రణాళికలు దెబ్బతిన్నాయి. అగ్రరాజ్యాల మధ్య సాగిన ప్రచ్ఛన్న యుద్ధం వల్ల వసుధైక కుటుంబాన్ని సాధించాలన్న అంతర్జాతీయ సమితి ధ్యేయం దెబ్బతిన్నది. వియత్నాం, కొరియా, జర్మనీలు రెండేసి భాగాలుగా చీలిపోయాయి. రెండు కూటాలకు దూరంగా ప్రశాంతంగా ఉండాలని కొన్ని దేశాలు అలీనోద్యమంగా ఏర్పడ్డాయి.

## 20.2 సైనిక కూటములు :

రెండో ప్రపంచ యుద్ధానంతరం అమెరికా, సోవియట్ రష్యాల మధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధంలో అంతర్భాగంగా సైనిక సంధులు అనేకం ఏర్పడ్డాయి. పై రెండు దేశాల మధ్య గల వైరుధ్యం, విభిన్న దృక్పథాలు ఈ సంధులకు దారితీశాయి. 1947లో ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిజాన్ని స్థాపించాలనే ధ్యేయం గల 'కొమిన్ ఫారం' పునరుద్ధరింపబడింది. దీనివల్ల పశ్చిమ ఐరోపా రాజ్యాలు, అమెరికా కలవరపడ్డాయి. దీనికి ప్రతికూలంగా అమెరికా నాయకత్వంలో పశ్చిమ ఐరోపా ప్రజాస్వామ్య రాజ్యాలలో ఆర్థిక సైనిక పునర్నిర్మాణానికై 'ఐరోపా సమితిని' స్థాపించతలపెట్టారు. ఇందులో భాగమే ట్రూమన్ సిద్ధాంతము, మార్షల్ పథకం.

### 20.2.1 ట్రూమన్ సిద్ధాంతము :

టర్కీతో చేసుకొన్న నిర్యుద్ధ ఒడంబడికను అతిక్రమించి నల్లసముద్రం నుండి మధ్యధరా సముద్రానికి దారితీసే టర్కిష్ జలాలలో భాగం కావాలని 1946 ఆగస్ట్‌లో సోవియట్ రష్యా డిమాండ్ చేసింది. అదే సమయంలో గ్రీస్‌లోని కమ్యూనిస్ట్‌ల తిరుగుబాటుకు సైనిక సహాయం చేయవలసిందిగా యుగోస్లావియా, ఆల్బేనియా, బల్గేరియాలను ప్రోత్సహించింది. ఇట్టి స్థితిలో గ్రీస్‌ను కాని, టర్కీని గాని కమ్యూనిస్ట్‌ల నుండి రక్షించడానికి కావలసిన సైనిక శక్తి గాని, ఆర్థిక శక్తి గాని బ్రిటన్‌కు లేదు. అందువల్ల బ్రిటన్ ఈ విషయంలో అమెరికా సహాయం కోరింది. అమెరికా అందుకు వెంటనే అంగీకరించింది. ఫలితంగా 1947 మార్చిలో అమెరికా ప్రెసిడెంట్ ట్రూమన్ ఒక సిద్ధాంత ప్రకటన చేశాడు. దీనినే 'ట్రూమన్ సిద్ధాంతము' అని పిలుస్తారు. ప్రజాస్వామిక, నిరంకుశ జీవిత విధానాల మధ్య భేదాన్ని స్పష్టీకరిస్తూ ఈ రెండింటి మధ్య ఎన్నిక అన్ని వేళలా స్వచ్ఛందంగా ఉండడం లేదన్నాడు. సాయుధ మైనారిటీల, వెలుపలి ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రజాస్వామ్య వాదులకు మద్దతు నిస్తామని ట్రూమన్ ప్రకటించాడు. ఈ ప్రకటన ననుసరించి అమెరికా గ్రీస్, టర్కీలకు సమయానికి సహాయాన్ని అందించింది. ఈ సహాయంతో గ్రీస్ తన ఆర్థిక పరిస్థితిని పునర్నిర్మించుకోగలిగింది. 1949 చివరికి గ్రీస్ కమ్యూనిస్ట్‌లను ఓడించింది. టర్కీ కూడా అమెరికా సహాయంతో రష్యా ఒత్తిడిని ఎదుర్కోగలిగింది.

### 20.2.2 మార్షల్ పథకం :

ఆర్థిక సహాయం ద్వారా ఐరోపాదేశాలు యుద్ధం వల్ల ఏర్పడిన ఆర్థిక సమస్యల నుండి త్వరితగతిని కోలుకోవడానికి తద్వారా వ్యక్తిగతంగా కాని, ఉమ్మడిగా కాని కమ్యూనిజాన్ని, రష్యా ప్రభావాన్ని ఎదుర్కోవడానికి 1947 జూన్‌లో అమెరికా విదేశాంగ మంత్రి మార్షల్ ఒక పథకాన్ని ప్రకటించాడు. ఈ పథకాన్ని సోవియట్ విదేశాంగ మంత్రి మాలటోవ్ పారిస్ సమావేశంలో ఖండించాడు. ఫ్రాన్స్, బ్రిటన్ విదేశాంగ మంత్రులు ఈ పథకాన్ని అంగీకరించినారు. అనతికాలానికే 14 యూరప్ దేశాలు ఈ పథకాన్ని అంగీకరించాయి. రష్యా ఒత్తిడితో ఆల్బేనియా, బల్గేరియా, జెకొస్లొవేకియా, ఫిన్‌లాండ్, హంగరీ, పోలండ్, రుమేనియా, యుగోస్లావియాలు ఈ పథకాన్ని తిరస్కరించాయి. రష్యా నాయకత్వంలోని తూర్పు ఐరోపా దేశాలకు, పశ్చిమ, దక్షిణ ఐరోపాలోని ప్రజాస్వామ్య దేశాలకు మధ్య విభాజ్యరేఖ చర్చిల్ అన్నట్లుగా ఇనుపతెర అయింది. మార్షల్ పథకాన్ని అనుసరించిన దేశాలు, అమెరికా సలహామేరకు 'ఐరోపీయ ఆర్థిక సహకార సంస్థ' ను ఏర్పరచుకొని, తమకున్న వనరులను పరస్పరం పంచుకోవడానికీ, తమకు లభిస్తున్న నిధులను కేటాయించుకోవడానికి ప్రయత్నించాయి. అమెరికా 1948 ఏప్రియల్ తొలివిడత గ్రాంట్‌గా 5 1/2 బిలియన్ డాలర్లనిచ్చింది. ఈ మార్షల్ పథకం ఉద్దేశించిన ప్రయోజనాలను చక్కగా సాధించింది. కమ్యూనిజం వ్యాప్తిని నిరోధించాలన్న అమెరికన్ విధానానికి చక్కగా తోడ్పడింది. ఇది అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు కూడా ఉపయోగపడింది. 1952 నాటికి అమెరికా అనేక బిలియన్ డాలర్ల విలువచేసే అమెరికన్ యంత్ర పరికరాలు, ఎరువులు, రవాణా సాధనాలు మొదలగు సామాగ్రిని సభ్యదేశాలకు సరఫరా చేయడం జరిగింది. ఈ పథకాన్ని అమెరికా దిగుమతులపై యూరప్ వ్యాపార అవరోధాలను తగ్గించే ప్రయత్నంగా విజయవంతంగా అనుసరించడమైంది. కాని ఇదే సమయంలో మార్షల్ పథకం పశ్చిమ ఐరోపా ఆర్థికంగా కోలుకోవడంలో తోడ్పడిందనడంలో సందేహం లేదు. తరవాత 20 సంవత్సరాలలో ఐరోపా సాధించిన అద్భుత ఆర్థిక ప్రగతికి ఇది ప్రారంభమని చెప్పాలి. కొరత పరిస్థితి అంతమయింది. ఉద్యోగాల పూర్తి వినియోగంతో త్వరలోనే యుద్ధపూర్వ ఉత్పత్తి స్థాయిని అందుకోవడమూ, అతిక్రమించడమూ జరిగింది.

### 20.2.3 ఉత్తర అట్లాంటిక్ సంధి వ్యవస్థ - నాటో (NATO) :

సోవియట్ రష్యా దురాక్రమణల నుండి తమనుతాము కాపాడుకొనుటకు, కమ్యూనిజం వ్యాప్తిని నిరోధించుటకు కమ్యూనిస్టేతర ప్రపంచదేశాలు ఏర్పరచుకొన్న ప్రాంతీయ రక్షణ ఒప్పందాలలో 'నాటో' ముఖ్యమైనది. 1949 ఏప్రియల్ 4న 12 రాజ్యాల ప్రతినిధులు వాషింగ్టన్‌లో సమావేశమై సంతకం చేయడంతో ఈ నాటో ఆవిర్భవించింది. ఇందులోని సభ్యదేశాలు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్, లక్జెంబర్గ్, డెన్మార్క్, నార్వే, ఇటలీ, పోర్చుగల్, ఐస్‌లాండ్, కెనడా. తరవాత ఇందులో పశ్చిమ జర్మనీ చేరింది. నాటోకు 14 ప్రకరణలు గల ఒక చార్టర్ కలదు. అందులోని ముఖ్యాంశములు 1) సభ్యరాజ్యాలు తమ అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకొనుట 2) ఆర్థిక విషయాలలో పరస్పర సహకారము 3) సాయుధ దాడిని ఎదుర్కొనుటకు సైనికశక్తిని సమకూర్చుకొనుట 4) తమలోని ఏ సభ్యదేశమైనా దురాక్రమణకు గురియైనపుడు సభ్యరాజ్యాలన్నీ సమిష్టిగా ఎదుర్కోవడం 5) ఈ వ్యవస్థకు ఒక యంత్రాంగం ఉండుట 6) ఏ ఐరోపా దేశమైనా ఇందుచేరమని ఆహ్వానించుట.

### 20.2.4 కేంద్ర సంధి వ్యవస్థ - సెంటో (CENTO) (బాగ్దాద్ ఒడంబడిక) :

మధ్యప్రాచ్య రక్షణ కొరకు ఏర్పడిన ప్రాంతీయ సంస్థ 'సెంటో'. మొదట ఇరాక్, టర్కీ దేశాలు 1955లో తమ ప్రాంత రక్షణార్థము పరస్పరం సహకరించుకొనుటకు ఒక ఒప్పందమును కుదుర్చుకొన్నాయి. ఆ తరవాత బ్రిటన్, పాకిస్తాన్, ఇరాక్ ఇందులో చేరుట వలన అది 'బాగ్దాద్ ఒడంబడిక' గా ప్రసిద్ధి గాంచింది. మధ్యప్రాచ్యంలో విలువ గల నూనెగనులుండుట వలన ఈ ప్రాంతాధిపత్యమునకై అమెరికా, రష్యా పోటీ పడసాగాయి. అందువల్లనే అమెరికా బాగ్దాద్ ఒడంబడిక నియమించిన అనేక కమిటీలందు సభ్యత్వాన్ని స్వీకరించింది. కాని 1959లో ఇరాక్‌లో విప్లవం సంభవించుటచే అది బాగ్దాద్ ఒడంబడిక నుండి ఉపసంహరించుకొన్నది. ఇదే సమయంలో అమెరికా ఇందులో చేరింది. నాటి నుండి ఈ ఒడంబడిక 'సెంటో' అని పిలువబడెను. దీని కేంద్ర కార్యాలయం అంకారా. ఈ సెంటోను అమెరికా మధ్యప్రాచ్యంలో రష్యా వ్యాప్తిని అరికట్టుటకు ఒక సాధనముగా ఉపయోగించింది. నాటోకు వలె సెంటోకు కూడా ఒక యంత్రాంగము కలదు. సెంటోలోని సభ్యదేశాలు సమిష్టి రక్షణకేగాక ఆర్థిక, రవాణా మొదలగు రంగాలలో సైతము సహకరించుకొనుచున్నవి.

### 20.2.5 ఆగ్నేయాసియా సంధి వ్యవస్థ - సీటో (SEATO) :

చైనాలో 1949లో కమ్యూనిస్ట్ ప్రభుత్వమేర్పడటంతో ఆగ్నేయాసియా రాజ్యాలకు కమ్యూనిజం ప్రమాదమేర్పడింది. దీనితో 1954 సెప్టెంబర్‌లో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్, పాకిస్థాన్ దేశాలు మనిలాలో సమావేశమై ఒక ప్రాంతీయ సమిష్టి రక్షణ సంస్థను ఏర్పాటు చేశాయి. దానినే 'సీటో' అంటారు. ఆగ్నేయాసియాలో సీటో శాంతి భద్రతల రక్షణ బాధ్యతను స్వీకరించి, దానికి ముప్పు తెచ్చు ఎట్టి కమ్యూనిస్ట్ దురాక్రమణనైనా సమిష్టిగా ఎదుర్కొనుటకు నిర్దేశించెను. ఆర్థిక, సామాజిక తదితర రంగాలలో పరస్పరము సహకరించుకొనుటకు సీటో నిర్ణయించింది. సీటోకు కూడా ఒక ప్రత్యేక యంత్రాంగం కలదు. ఈ చర్యలతో బాటు అమెరికా 1951లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో 'ఆన్‌జున్' ఒప్పందాన్ని కుదుర్చుకొని ఆ ప్రాంతంలో కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టింది.

### 20.2.6 రష్యా చేపట్టిన చర్యలు

#### 20.2.6.1 మాలటోవ్ ప్రణాళిక :

మార్షల్ పథకాన్ని తిరస్కరించిన సోవియట్ రష్యా 1947 లో తన అనుకూల రాజ్యాలైన పోలండ్, బల్గేరియా, రుమేనియా, తూర్పు జర్మనీ, మంగోలియా దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకొని 'మాలటోవ్ ప్రణాళిక' క్రింద వాటికి 1949 లో

సహాయాన్నందించింది. మార్షల్ సహాయాన్ని తిరస్కరించి, దానికి ప్రతిగా మాలటోవ్ పథకాన్ని అమలుపరచడం తూర్పు పశ్చిమ ఐరోపాలను స్పష్టంగా వేరు చేసింది. ఒక దేశంలోని కమ్యూనిస్ట్ భావం, ఒక కూటమిలోని దేశాలన్నింటికీ విస్తరించింది,

### 20.2.6.2 కోమిన్ ఫామ్ :

అమెరికా ఆర్థిక సహాయం ద్వారా యూరప్ ప్రజాస్వామ్యాలు బలపడటం, తన వాంఛలకూ, కమ్యూనిస్ట్ ఉద్యమ ప్రయోజనాలకూ ప్రమాదకరమని సోవియట్ రష్యా గుర్తించి దానికి ప్రతిగా చర్యలు తీసుకొన్నది. 1943లో సోవియట్ రష్యా రద్దుచేసిన కోమిన్ టర్న్‌ను మళ్లీ 1947లో కోమిన్ ఫామ్ అను కొత్తపేరుతో పునరుద్ధరించింది. ఇందులో రష్యా, పోలండ్, యుగోస్లావియా, రుమేనియా, హంగరీ, బల్గేరియా, జెకొస్లొవాకియా, ఇటలీ, ఫ్రాన్స్‌ల కమ్యూనిస్ట్ పార్టీల ప్రతినిధులుంటారు. దీని లక్ష్యం కమ్యూనిస్ట్ ప్రచార కార్యక్రమాన్ని ఉధృతం చేయడం. రష్యాను శాంతి, ప్రజాస్వామ్యాల కోసం పోరాడే సామ్రాజ్యవాద శత్రువుగా అభివర్ణిస్తూ, అమెరికాను సామ్రాజ్యవాదిగా, యుద్ధోన్మాదిగా చిత్రిస్తూ, యూరప్ ప్రజలమీద రష్యా ప్రచార వర్షాన్ని కురిపించింది.

### 20.2.6.3 బెర్లిన్ దిగ్బంధం :

రెండో ప్రపంచ యుద్ధం ముగిసే సమయంలో అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లండ్, రష్యాలు వేరువేరుగా జర్మనీని ఆక్రమించుకొన్నాయి. తరువాత అమెరికా, ఫ్రాన్స్ ఇంగ్లండ్‌లు తాము ఆక్రమించుకొన్న ప్రాంతాన్ని పశ్చిమ జర్మనీగా ఏర్పరచి, అక్కడ ఒకే ఆర్థిక విధానాన్ని అమలుచేసి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించసాగాయి. దీనిని నిరోధించి పశ్చిమ జర్మనీని తూర్పుజర్మనీలో విలీనం చేయాలని భావించిన రష్యా పశ్చిమ బెర్లిన్ నగరాన్ని దిగ్బంధం చేసింది. ఫలితంగా పశ్చిమ జర్మనీకి పశ్చిమ బెర్లిన్‌కు గల రాకపోకలు విచ్ఛిన్నమైనాయి. పశ్చిమజర్మనీలో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడింది. అయితే, అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు విమానాల ద్వారా ఆహారపదార్థాలను పశ్చిమబెర్లిన్‌కు చేరవేసి రష్యా వ్యూహాన్ని ఛేదించాయి. తన వ్యూహం విఫలమయిందని గ్రహించిన రష్యా దిగ్బంధాన్ని తొలగించింది.

### 20.2.6.4 వార్సా ఒప్పందము :

అమెరికా ప్రాబల్యాన్ని నిరోధించడానికి సోవియట్ రష్యా నాయకత్వంలోని కమ్యూనిస్టు రాజ్యాల కూటమి కూడా ప్రతిచర్యలకు తలపెట్టింది. ఈ ప్రయత్నాల ఫలితమే వార్సా ఒప్పందము. సోవియట్ రష్యా 1943లో చెకోస్లోవాకియాలో ద్వైపాక్షిక ఒడంబడికలు చేసుకున్నది. 1950లో రష్యా కమ్యూనిస్ట్ చైనాతో మైత్రిసంధి చేసుకొన్నది. నాటో వ్యవస్థ ఏర్పాటును రష్యా భయభ్రాంతులతో గమనించింది. అయితే అటువంటి వ్యవస్థ ఏర్పాటు రష్యాకు కొన్నేళ్ళపాటు సాధ్యపడలేదు. నాటాలో పశ్చిమ జర్మనీ చేర్చడాన్ని రష్యా తీవ్రంగా నిరసించింది. చివరకు 1955 మే 14న రష్యా కూడా వార్సా ఒప్పందము ద్వారా ఒక రక్షణ వ్యవస్థను ఏర్పరచింది. ఈ ఒప్పందంపై రష్యా, ఆల్బేనియా, బల్గేరియా, హంగేరీ, తూర్పుజర్మనీ, పోలెండ్, రుమేనియా, జెకొస్లేవియా దేశాలు సంతకాలు చేసినాయి. సభ్యరాజ్యాలు తమ సైనిక దళాలకు ఉమ్మడి సారథ్యం ఉండగలదని అంగీకరించారు. ఈ సంయుక్త సాయుధ బలాల కేంద్రస్థానం మాస్కో. దీని అధినేత సోవియట్ సైన్యాధిపతి. అంతర్జాతీయ శాంతి పరిరక్షణకై వార్సా ఒప్పంద సభ్యరాజ్యాలు ఏకగ్రీవంగా సమిష్టి భద్రతకు కృషిచేస్తాయి. పశ్చిమ ఐరోపా రాజ్యాలు నాటో వ్యవస్థను ఏర్పాటుచేయడం, అందులో పశ్చిమ జర్మనీ చేరడం వల్ల ఉత్పన్నమయిన పరిస్థితిని చక్కదిద్దడానికి వార్సా ఒప్పందం జరిగిందని, ఐ.రా.స. లక్ష్యాలైన రాజ్యాల మధ్య సహాయ సహకారాలు పెంపొందించడం, ఇతర దేశాల అంతర్గత విషయాలలో జోక్యం చేసుకొనక పోవడం, వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గౌరవించడం తమ ఒప్పందం లక్ష్యమని ప్రకటించారు. వార్సా ఒప్పందంలోని సభ్యరాజ్యాల మధ్య

వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకొనవలెనని, వారిలో ఎవరిపైన దాడి జరిగినా మిగతారాజ్యాలు ఆ దురాక్రమణను నిరోధించడానికి సాయపడాలని అంగీకరించబడింది. ఈ సభ్యరాజ్యాలు మరే ఇతర ఒప్పందంలోను చేరకూడదని నిర్ణయించబడింది. ఒప్పందం విషయాలను చర్చించడానికి, పరిశీలించడానికి సభ్యరాజ్యాల ప్రతినిధులతో రాజకీయ సంఘం ఏర్పాటు చేశారు. సభ్యరాజ్యాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు కూడా అభివృద్ధి చెందవలెను.

### 20.2.6.5 హంగరీ తిరుగుబాటు (1956) :

హంగరీలో 1956లో సంభవించిన కమ్యూనిస్ట్ వ్యతిరేక విప్లవాన్ని సోవియట్ రష్యా క్రూరంగా అణిచివేసింది. ఈ చర్య అన్యరాజ్యాల ఆంతరంగిక విధానములో జోక్యమని పశ్చిమరాజ్యాలు విమర్శించగా హంగరీ ప్రభుత్వం ఆహ్వానం మేరకే వార్సా ఒప్పందం ప్రకారం సైన్యాలు పంపామని సోవియట్ రష్యా బదులిచ్చింది. 1968లో చెకొస్లావాకియాలో కూడా తిరుగుబాటును రష్యా అణచివేసింది.

### 20.2.6.6. U2 సంఘటన (1960) :

జర్మనీ విషయమై పశ్చిమ ఐరోపా రాజ్యాలు, తూర్పు ఐరోపా రాజ్యాల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతను నివారించడానికి ఒక సమావేశం ఏర్పాటు చేయడానికి తటస్థ రాజ్యాలు తీవ్రంగా ప్రయత్నాలు చేశాయి. ఈ ప్రయత్నాల ఫలితంగా అగ్రనాయకుల మధ్య జర్మనీ పరిష్కారానికై శిఖరాగ్ర సమావేశం 1961 ఏప్రియల్‌లో జరగాలని నిర్ణయించబడింది. కాని దురదృష్టవశాత్తు అమెరికా యుద్ధ విమానం 'U2' పాకిస్తాన్, టర్కీల మధ్య గల సైనిక స్థావరాల నుండి ప్రయాణంలో రష్యా భూభాగంలోనికి సుమారు రెండు వేల కిలోమీటర్లు చొచ్చుకుపోయింది. దానిని సోవియట్ రష్యా 1960లో కూల్చివేసింది. తమదేశంపై గూఢచారి చర్యలకు పెద్ద ఎత్తున పూనుకున్నదని రష్యా ప్రకటించి, విమాన చోధకుని విచారణకు పంపింది. ఉద్రిక్తత పెరిగి శిఖరాగ్ర సమావేశం విఫలమయింది. జర్మనీ, బెర్లిన్ సమస్య తిరిగి తీవ్రరూపం దాల్చింది. అగ్రరాజ్యాల మధ్య విభేదాలు పెరిగాయి. పశ్చిమ, తూర్పు బెర్లిన్‌ల మధ్య అన్ని రాకపోకలను తూర్పు జర్మనీ నిషేధించింది. తటస్థ ప్రాంతాన్ని కూడా తూర్పు జర్మనీ ఆక్రమించుకుంది. దీనిని సోవియట్ రష్యా సమర్థించగా, అమెరికా, పశ్చిమ రాజ్యాలు తీవ్రంగా నిరసించాయి. ఈ సంక్షోభ స్థితిలో తటస్థ అధినేతలు కృశ్చేవ్, కెన్నడీల మధ్య మరో శిఖరాగ్ర సమావేశం జరగాలని ప్రతిపాదించారు. ఈ కారణంగా బెర్లిన్ విషయంలో ప్రత్యక్ష చర్యలు కొంతకాలం పాటు వాయిదాపడ్డాయి.

ఈ విధంగా అమెరికా, సోవియట్ రష్యాలు ఒకరినొకరు దెబ్బతీయాలని ప్రయత్నించాయి. కాని యుద్ధం వస్తే ఇరువురికి అణుపాటవం ఉండడం వలన సర్వనాశనమవుతుందని అర్థం చేసుకొని ప్రత్యక్ష యుద్ధానికి పాల్పడకుండా పరోక్ష యుద్ధానికి తయారయ్యాయి.

## 20.3 ఐరోపా ఆర్థిక పునరుద్ధరణ కార్యక్రమము :

యూరప్ దేశాల ఐక్యతా భావం ప్రాచీన కాలం నుండి ప్రచారంలో వున్నది. గ్రీస్, రోమన్ సామ్రాజ్య కాలంలో ఈ భావన అంకురించి క్రిసెండమలో రూపు సంతరించుకున్నాయి. 19వ శతాబ్దంలో కూడా సాగిన ఈ భావన మొదటి ప్రపంచ యుద్ధంలో ముక్కలయింది. యుద్ధానంతరం తిరిగి సమైక్యతా పవనాలు వీచాయి. ఐరోపా ప్రతినిధులతో ఐరోపా మండల జాతీయ పార్లమెంట్ ఎన్నుకోబడాలని, ఐరోపాకు ఒక ఉన్నత న్యాయస్థానం ఏర్పాటుచేయాలని ఫ్రెంచి రాజనీతివేత్త బ్రియాండ్ ప్రతిపాదించాడు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఇతని ప్రతిపాదనలు తీవ్రంగా పరిశీలింపబడ్డాయి. జీన్‌మానెట్, పాల్ హెన్రీస్పాక్ మొదలైన మేధావులు చేసిన ఐక్యప్రతిపాదనలకు చర్చిల్, డీగాల్ వంటి రాజకీయవేత్తలు తమ ఆమోదాన్ని సమర్థనను అందించారు.

రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, సైనిక పరంగా ఐరోపా సమైక్యతకై చేసే ప్రయత్నాలు మరింత ఉధృతమయ్యాయి. దీనికి దోహదం చేసిన పరిస్థితులను తెలుసుకోవడం చాలా ప్రయోజనకరం.

1) రెండో ప్రపంచ యుద్ధ ఫలితంగా ఐరోపారాజ్యాలు ఎంతో ధనాన్ని నష్టపోవడమే గాక జన నష్టాన్ని కూడా పొందాయి. సంకుచిత జాతీయతత్త్వం వల్ల ఐరోపాలో రెండు శతాబ్దాల్లో రెండుసార్లు మానవ మారణహోమ కాండకు కారణమైన రాజకీయ వ్యవస్థ పట్ల ఐరోపావారు విసిగిపోయారు. అన్ని దేశాలూ ఆర్థికంగా బలహీనమయ్యాయి. తిరిగి మరో యుద్ధం రాకుండా అరికట్టేందుకై ప్రయత్నించ కృతనిశ్చయమయ్యాయి. ఐరోపా సమైక్యతే తరుణోపాయంగా వారికి కన్పించింది.

2) ఐరోపా రాజ్యాల ఆర్థిక వ్యవస్థ ధ్వంసం కావడం, రాజకీయ అస్థిరతకు కారణమై, రష్యా, అమెరికాలు ఆ ఖాళీని పూరించేందుకు ముందుకు వచ్చేటట్లు చేసింది. బాహ్యాశక్తుల ప్రభావం నుడి తమ స్వేచ్ఛను కాపాడుకొనేందుకు తాము ఏకమవటం ఒక్కటే మార్గమని ఐరోపా రాజ్యాలు తలచాయి.

3) ఐరోపా రాజనీతిజ్ఞులు తమ ఆర్థిక కష్టాలకు మూలకారణం తాము విడిపోయి వుండటమేనని తలచారు. ఒకసారి తాము స్వేచ్ఛా వ్యాపార రంగాన్ని సృజించుకొని, పెట్టుబడి, పనివారలు, ముడిపదారాథలు, తయారయిన వస్తువుల స్వేచ్ఛాగమనానికి అనుమతించినట్లయితే, దాని వల్ల ఉత్పత్తి అధికమవటం, చక్కని వినిమయం జరిగి చివరికి తమ ప్రజల జీవన స్థాయిలో అభివృద్ధికి దోహదమవుతుందని వారు భావించారు.

4) అమెరికా, సోవియట్ రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సాగటం కూడా పరస్పర సహకారానికి, రక్షణకు పశ్చిమ ఐరోపాదేశాలు ఒక దగ్గరకు రావడానికి కారణమైంది.

5) అమెరికా, రష్యాలు ప్రపంచశక్తులుగా ఆవిర్భవించడంతో ఐరోపా పలుకుబడి సన్నగిల్లిపోయింది. అందువల్ల తిరిగి తమ ప్రాముఖ్యతను ప్రపంచ రాజకీయాల్లో పునః ప్రతిష్టాపించాలని నిశ్చయించాయి. ఐరోపా దేశాలన్నీ సహకరిస్తేనే ఇది సాధ్యమవుతుందని పశ్చిమ ఐరోపా దేశాలు భావించాయి.

6) అమెరికా, రష్యాలు యుద్ధానికి దిగితే, వాటి యుద్ధాల బరువును ఐరోపాదేశాలు భరించగలిగిన స్థితిలో లేవు. ఐరోపా ఐక్యత వీటి మధ్య యుద్ధాన్ని అరికట్టగలదని రాజతంత్రజ్ఞులు భావించారు.

ఐరోపా ఏకీకరణకు పశ్చిమ ఐరోపా రాజ్యాలు మాత్రమే కృషిచేశాయనే విషయం గుర్తించుకోవాలి. రెండో ప్రపంచ యుద్ధానంతర కాలంలో ఐరోపాలో ఆర్థిక, రాజకీయ, సైనిక సమైక్యతను సాధించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. అవి :

## 20.3.1 ఐరోపా ఆర్థిక సహకార సంస్థ :

ఐరోపా ఆర్థిక సహకార సంస్థ స్థాపన ఐరోపా ఆర్థిక సమైక్యతా రంగంలో ప్రముఖ ఘట్టం. యుద్ధం వల్ల నష్టపోయినా ఐరోపా రాజ్యాలకు మార్షల్ పథకం క్రింద ఋణ ప్రాతిపదికపై పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం చేయడానికి ఉత్సాహం చూపింది. అందువల్ల ఈ ప్రయోజనానికై ఒక సంస్థను ఏర్పాటుచేసుకోమని అమెరికా ఐరోపాదేశాలకు సలహా ఇచ్చింది. ఈ సలహాను బ్రిటన్, ఫ్రాన్స్‌లు అభినందించాయి. అంతేగాక ఒక సంస్థ ఏర్పాటు చేయడానికి నడుం కట్టాయి. 1947 తరవాత పారిస్‌లో ఒక సమావేశం ఏర్పాటయింది. ఈ సమావేశంలో స్పెయిన్ దేశం తప్ప 16 పశ్చిమ ఐరోపా దేశాలు పాల్గొన్నాయి. సోవియట్ రష్యా నాయతకత్వంలోని తూర్పు ఐరోపా దేశాలు ఈ సమావేశంలో పాల్గొన నిరాకరించాయి. చివరకు 1948 ఏప్రిల్ 16న 16 ఐరోపా రాజ్యాల విదేశాంగ మంత్రులు, ఐరోపా ఆర్థిక సహకార ఒప్పందంపై సంతకాలు చేశారు. తరవాత సభ్యరాజ్యాల సంఖ్య 18కి పెరిగింది. ఈ ఒప్పందం ప్రకారం -

1) దేశ వనరులను సక్రమంగా ఉపయోగించడం ద్వారా ఉత్పాదనాభివృద్ధిని, శక్త్యుత్సాహాలతో సాధించటం
2) పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడం
3) సుంక సంఘాల ఏర్పాటు
4) వ్యాపార విస్తరణకు టారిఫ్‌ల లాంటి అడ్డంకులను తగ్గించటం
5) దేశాల కరెన్సీలో, ఆర్థిక స్థితిలో స్థిరత్వాన్ని నిలుపుట, మార్పిడి రేట్లు బాగా వుండటం
6) దేశంలోని మానవశక్తిని పూర్తిగా, ప్రయోజనకరంగా ఉపయోగించడం.

ఐరోపా ఆర్థిక సహకార సంస్థలో ఒక మండలి, కార్యవర్గ సంఘం, సచివాలయం వున్నాయి. మండలిలో సభ్యదేశాల ప్రతినిధులు పాల్గొనేవారు. మండలి అన్ని నిర్ణయాలను ఏకగ్రీవంగా ఆమోదించేది. ఈ నిర్ణయాలకు అన్ని సభ్యదేశాలు కట్టుబడి వుండాలి. సభకు లోబడి పనిచేసేది కార్యవర్గ సంఘం. మండలి ఆదేశాలు, సందేహాల మేరకు ఇది పనిచేయాల్సి వుంటుంది. ఐరోపా ఆర్థిక సహకార సంస్థ నెలకొల్పిన అనేక బోర్డుల, కమిటీల, పరిశీలనా సంఘాల కార్యకలాపాలను అనుసంధించే బాధ్యత సచివాలయంది. సాధారణమైన, ప్రత్యేకమైన ఆర్థిక సమస్యలను పరిశీలించే సాంకేతిక సంఘాలు, ఈ సంస్థలో ముఖ్య అంగాలయ్యాయి.

### 20.3.2 బెనలక్స్ :

ఐరోపా ఏకీకరణలో 1948లో బెనలక్స్ ఏర్పాటవటం మరో ముఖ్య ప్రయత్నం. బెల్జియం, నెదర్లాండ్స్, లగ్జెంబర్గ్ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక రకమైన సుంక సంఘమిది. దీని ప్రకారం ఈ దేశాలు ఒకదానిపై మరొకటి వస్తువుల మీద ఎలాంటి సుంకాన్ని విధించరాదని నిర్ణయించుకొన్నాయి. ఆ తరవాత ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకొనే వస్తువులపై ఒకేవిధమైన సుంకాలను విధించాలని నిర్ణయించుకొన్నాయి.

### 20.3.3 బ్రస్సెల్స్ సంధి :

బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్, లక్జెంబర్గ్ దేశాలు బ్రస్సెల్స్ సంధిపై 1948లో సంతకాలు చేశాయి. ఇది రక్షణ రంగంలో ఐక్యకార్యాచరణకు జరిగిన ముఖ్య ప్రయత్నం. ఇది నాటోలో అంతర్భాగమయింది.

### 20.3.4 ఐరోపా మండలి :

1949 లో 10 దేశాలతో ఐరోపా మండలి ఏర్పడింది. బెల్జియం, ఫ్రాన్స్, లగ్జెంబర్గ్, నెదర్లాండ్స్, బ్రిటన్, డెన్మార్క్, ఐరోలాండ్, ఇటలీ, నార్వే, స్వీడన్‌లు కలిసి స్థాపించుకొన్న ఐరోపా మండలి ఆర్థిక, సాంస్కృతిక, వైజ్ఞానిక, చట్ట, పరిపాలనా విషయాలలో ఐక్యతా సాధనకు ఉద్దేశింపబడింది.

### 20.3.5 ఐరోపా బొగ్గు, ఉక్కు సంఘము :

1952లో ఐరోపా బొగ్గు, ఉక్కు సంఘం ఏర్పడింది. ఫ్రాన్స్, పశ్చిమ జర్మనీ, ఇటలీ, హాలండ్, బెల్జియం, లక్జెంబర్గ్ దేశాలు బొగ్గు, ఇనుము ఉత్పత్తులపై, అమ్మకాలమీద, ధరల నిర్ణయంలో, పరిశోధనలో, పెట్టుబడులలో, కార్మికుల స్థితిగతులపై ఒకే పద్ధతినవలంబించాలని, సహకరించుకోవాలని నిర్ణయించుకొన్నాయి. ప్రజల జీవన స్థాయిని పెంచడం, ఉద్యోగవకాశాల అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థల విస్తరణ ఈ సంఘ లక్ష్యాలు.

### 20.3.6 ఐరోపా ఆర్థిక సంఘము :

పశ్చిమ ఐరోపాదేశాలు సాధించిన ఐక్యతా సమగ్ర స్వరూపం ఐరోపా ఆర్థిక సంఘం (E.E.C.). దీనిని సామాన్యంగా ఉమ్మడి మార్కెట్ అని పిలుస్తారు. ఏకీకృత ఐరోపా ఆర్థిక వ్యవస్థ దీని ప్రధాన గమ్యం. పశ్చిమ జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం, నెదర్లాండ్స్, లగ్జెంబర్గ్ దేశాల విదేశాంగ మంత్రులు 1955 జూన్‌లో మెస్సీనాలో కలుసుకొని ఉమ్మడి మార్కెట్ స్థాపనకై అంగీకరించారు. 1957లో రోమ్‌లో ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. ఆ తరువాత ఆ దేశాల శాసనసభలు ఈ ఒప్పందాన్ని ఆమోదించాయి. 1958 జనవరి 1న ఉమ్మడి మార్కెట్ రూపం దాల్చింది. సభ్యదేశాల సరిహద్దుల గుండా జరిగే వ్యాపారం, ఆర్థిక విధానాలను, ఆచరణలను ఏకీకరణం చేయటమే దీని ఉద్దేశం. వస్తువులను స్వేచ్ఛగా మార్పిడి చేసుకోవడానికి, వ్యక్తులు, పెట్టుబడి స్వేచ్ఛగా ఒకచోటనుండి మరొకచోటికి మారేందుకు, స్వేచ్ఛగా ఉద్యోగావకాశాలను కల్పించేందుకు, ఒకేరకంగా పన్నులు విధించడానికి, ఒకే విధమైన సాంఘిక భద్రతా కల్పనకూ, ఒకే కరెన్సీ, క్రెడిట్ నియంత్రణ చేసేందుకు ఒకేవిధమైన బ్యాంక్ పద్ధతులకూ ఈ సంఘము అనుమతిస్తుంది. అమెరికాకు ఉన్నట్లుగా పెద్ద మార్కెట్‌ను సృజించటమే దీని లక్ష్యం. సభ్యదేశాల మధ్య పోటీని తగ్గించేందుకై పూర్తి సంఘ దేశాల కొరకు ప్రత్యేకించిన వస్తువులను, పదార్థాలను మాత్రమే ప్రతి సభ్యదేశం ఉత్పత్తి చేయవలె. ప్రతి సభ్యదేశం తనకు అనుకూలమైన వస్తువుల, పదార్థాల ఉత్పత్తిపై దృష్టిని కేంద్రీకరించడం వల్ల అది అధిక ఉత్పత్తి చేయగలుగుతుంది. ఫలితంగా దానంతటదే ఉత్పత్తి ఖర్చు పడిపోయి, మేలు రకమయిన వస్తువులు తయారవుతాయి. ఐరోపా ఆర్థిక స్థాపన వల్ల వచ్చిన తాత్కాలికమైన ఒడిదుడుకులను, సభ్యదేశాలు తట్టుకొని నిలబడేందుకై ఒక ఐరోపా పెట్టుబడి బ్యాంక్ ఏర్పడింది. రోమ్ ఒప్పందంపై సంతకాలు చేసిన దేశాలన్నీ ఈ బ్యాంకుకు కావలసిన పెట్టుబడిని సమకూర్చాయి. పారిశ్రామిక విస్తరణ, లేక అలాంటి కార్యక్రమాలను చేపట్టేందుకై సభ్యదేశాలకు ఈ బ్యాంక్ సహాయపడింది. ఐరోపా ఆర్థిక సంఘంలో ఐరోపా కమీషన్, మంత్రులసభ, ఐరోపా శాసనసభ, ఆర్థిక సాంఘిక వ్యవహారాల కమిటీ, న్యాయస్థానం అను అంగాలు కలవు.

ఐరోపా ఆర్థిక సంఘం అనేక విజయాలు సాధించింది. అన్ని టారిఫ్‌లను రద్దుపరచి ఒక సాధారణ బాహ్య టారిఫ్‌ను అమలుపరచడం జరిగింది. ఒక సామూహిక వ్యవసాయ విపణి ఏర్పడింది. దీనితో వ్యవసాయక వస్తువులను అన్ని సభ్యదేశాల్లోకి స్వేచ్ఛగా పంపవచ్చు. సంఘదేశాల్లో వేటిలోకయినా పోయే స్వేచ్ఛాగమనం కార్మికులకు కలిగింది. కనీసం మదుపుపెట్టడానికీ సెక్యూరిటీలను కొనటానికీ, అమ్మటానికీ సంఘం లోపల ఒక దేశం నుండి మరోదేశానికి పెట్టుబడులను స్వేచ్ఛగా తరలించడానికి హామీ ఇవ్వబడింది. ఉద్యోగావకాశాలు, కార్మిక చట్టాలు, పని పరిస్థితులు, వృత్తి శిక్షణ, సాంఘిక భద్రత, ప్రమాదాల నుండి రక్షణ, వైద్య సదుపాయం, మొదలగు విషయాల్లో సంఘ అంగాలు విజయాన్ని సాధించాయి. ఒక ఉద్యోగం నుండి మరో ఉద్యోగానికి మారే కార్మికులకు తిరిగి స్థిరపడడానికి, వృత్తి పునర్ శిక్షణకు సంఘం స్థాపించిన సాంఘిక నిధి సంస్థ సహాయం చేస్తుంది. ఐరోపా మదుపు బ్యాంక్ అధిక మొత్తంలో ధనాన్ని వివిధ సభ్యదేశాలకు అందించడం జరిగింది. ఆకాశాన్నంటే నూనెధరలు, విద్యుచ్ఛక్తి సమస్యల వల్ల ఏర్పడిన అనేక క్లిష్ట ఆర్థిక పరిస్థితుల నుండి కాచుకుని బయటపడగలిగింది. సంఘం అన్ని సభ్యదేశాల తరపున వ్యాపార ఒప్పందాలపై సంతకాలు చేసే అధికారాన్ని కమీషనర్‌కు ఇచ్చి, సంఘ వ్యాపార విధానాలను సక్రమ మార్గంలో పెట్టగలిగింది. అయితే ఈ సంఘం తన సభ్య దేశాల పౌరుల విశ్వాసాన్ని, అనురాగాన్ని పెంపొందించే ఒక రాజకీయసంస్థగా రూపం దాల్చలేకపోయింది.

రెండో ప్రపంచ యుద్ధానంతరం జరిగిన తీవ్ర ప్రయత్నాల వల్ల, ఐరోపాలో ఒక్క పశ్చిమ భాగం మాత్రమే ప్రయత్నాల్లో పాల్గొని ఒక దగ్గరకు రావటం జరిగింది. ఈ దేశాలు కూడా ఆర్థిక ఐక్యత, సహకారం కొరకు మాత్రమే కొంతవరకు ప్రయత్నించి సాధించగలిగాయి.

## 20.4 నమూనా ప్రశ్నలు :

1. ప్రచ్ఛన్న యుద్ధమనగానేమి ? దాని ఫలితాలను పేర్కొనుము.
2. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన సైనిక కూటాల గూర్చి వ్రాయుము.
3. ఐరోపా ఆర్థిక పునరుద్ధరణ కార్యక్రమము పరిశీలింపుము.
4. ట్రూమన్ సిద్ధాంతము
5. మార్షల్ పథకం
6. నాటో
7. బాగ్దాద్ ఒప్పందము
8. హంగరి తిరుగుబాటు - 1956
9. U2 సంఘటన
10. బెర్లిన్ సంక్షోభము

## 20.5 చదువదగిన గ్రంథాలు :


| | | |
|---|---|---|
| 1. C.J.A.H. Hayes | - | Modern Europe since 1870 |
| 2. D. Thamson | - | Europe since Napoleon |
| 3. H.L. Peacock | - | Modern European History |
| 4. John and Gwenneth Stokes | - | Europe and the World, 1870-1983 |
| 5. Rama S. Melkota (ed) | - | Regional Organisations |
| 6. W. Young | - | Cold War Europe |


**- శ్రీ కె. సూర్య ప్రకాష్‌రెడ్డి**